# వివేక చూడామణి



mohan
PUBLICATIONS
ఆధ్యాత్మిక గ్రంథ నిలయం
ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆరోగ్యాది అనేక విషయాలు తెలుసుకోండి... ఫేస్‌బుక్
FB@mohanpublications
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట,
రాజమహేంద్రవరం - 533101.

mohanpublications.com
granthanidhi.blogspot.in

# వివేక చూడామణి

వివేక చూడామణి' అన్నది ఒక సుప్రసిద్ధ వేదాంత గ్రంథము. దీన్ని శ్రీశంకరులే రచించారు అని సంప్రదాయం చెపుతుంది. ఇది శ్రీ శంకరులకృతే నని ఒప్పుకోవటానికి ఆధునిక మేధావులు సంకోచిస్తున్నారు. అయినా శాంకరబోధనా సంప్రదాయంలో దీన్ని ప్రకరణ గ్రంథంగా ఉపయోగిస్తారు. వివిధ శంకరమతాలకు చెందిన ఏ ఇతర శంకరాచార్యులో దీని కర్త అని అనుకున్నా మనకు కలిగే నష్టమేమీ లేదు అని నా కనిపిస్తుంది.

మోక్షమనే అంతిమ పురుషార్థాన్ని కోరుకునే ముముక్షువులను ఉద్దేశించి రచించబడింది ఈ వివేకచూడామణి. పురుషేణ అర్థ్యతే ఇతి పురుషార్థః - అంటే వ్యక్తిచే అర్థించబడేది. అనగా కోరబడేది పురుషార్థమనబడుతుంది. మనిషి పొందగోరే ఎన్నో లక్ష్యాలకు అభద్రత, అపూర్ణత అను భావాలనుండి విముక్తిని కోరటం మౌలికమైంది. ఈ విముక్తినే మోక్షమన్నారు.

అద్వైతవేదాంతదర్శనంలో మోక్షం ఆత్మస్వరూపమే కనుక - సిద్ధము లేదా ప్రాప్తము అయ్యే ఉన్నది. కాని అలాంటి ఆత్మను గురించిన అజ్ఞానము, తజ్జన్య భ్రమ వల్ల తాను పరిచ్ఛిన్నుడను, బద్ధుడను, అనుభావము - దాని వల్ల - తాను ముక్తుడనవాలి అన్న భావన కలుగుతున్నాయి. మోక్షమే నిజమైన పురుష్థము లేదా జీవితలక్ష్యము అని గుర్తించటానికి ఎంతో పరిపక్వత కావాలి. ఇది జీవితానుభవాలను చక్కగా జీర్ణించుకుంటేనే కలుగుతుంది.

ఒక గ్రంథము యొక్క ఇతివృత్తం ఏదున్నా, అది మంగళాచరణంతోనే ప్రారంభమవుతుంది. గ్రంథరచన నిర్విఘ్నంగా పరిసమాప్తం కావాలి అని - అలాగే ఇది ఎవరి కోసం వ్రాయబడిందో వారిని చేరాలి - అని మంగళాచరణం చేయబడుతుంది.

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

# మంగళాచరణము

సర్వవేదాంతసిద్ధాంతగోచరం తమగోచరమ్ ।

గోవిందం పరమానందం సద్గురుం ప్రణతోఽస్మ్యహమ్ ॥

సర్వవేదాంత సిద్ధాంత గోచరమ్ - సకల ఉపనిషత్తులలో ఉన్న మహావాక్యముల సిద్ధాంతముచేత తెలుసుకోబడేవాడు; అగోచరమ్ - ఇంద్రియ మనస్సులకు విషయంగా అందనివాడు; గోవిందమ్ - గోవిందునికి; పరమానందమ్ - అనంతుడు మరియు ఆనందస్వరూపునికి; తమ్ - ఆ ; సద్గురుమ్ వ సద్గురునికి; అహమ్ - నేను; ప్రణతః - నమస్కరిస్తు; అస్మి - ఉన్నాను.

"ఇంద్రియమనసులకు విషయంగా అందనివాడు, కాని అన్ని ఉపనిషత్తుల్లో ఉన్న మహాకాక్యాల సిద్ధాంతము చేత తెలుసుకోబడేవాడు, అనంతుడు మరియు ఆనందస్వరూపుడు, మరియు సద్గురువు అయినట్టి గోవిందునికి నమస్కరిస్తున్నాను."

ఈ గ్రంథాన్ని శంకరులే రచించి ఉంటే, ఈ ప్రార్థన వారి గురువైన గోవింద భగత్పాదుల పరంగా ఉంటుంది. అలాకాక గ్రంథకర్త పరంపరలోని మరొక శంకరాచార్యులైతే ఈ ప్రార్థన భగవానుడైన గోవిందుని పరంగా ఉంటుంది.

గోవిందం అహం ప్రణతః అస్మి : గోవిందునికి నమస్కరిస్తున్నాను. ఎవరా గోవిందుడు? అంటే పరమానందః - అతడు అనంతుడు మరియు ఆనంద స్వరూపుడు, అనుభవరూపం కాని ఆనందమే స్వరూపముగా కలిగినవాడు. లోకంలో అనుభవింపబడే ఆనందము, మనోవృత్తిమీద ఆధారపడేది మరియు బద్ధమైనది. కనుక మనోవృత్తి మారిపోయినప్పడు ఆనందం కూడ పోతుంది కాబట్టి అది సాంసారిక సుఖమని పిలువబడుతుంది. అంటే మానసికస్థితి సానుకూలంగా ఉన్నప్పడు కలిగే ఒకరకమైన సుఖం ఈ మానసికస్థితి ఒక వృత్తి

విశేషము. కనుక ఇది మనకు నచ్చిన ఒక బాహ్యపరిస్థితిఏర్పడటం వల్ల కలుగవచ్చు లేదా ఇటువంటిసుఖాన్ని ఒక హాస్యోక్తి విన్నప్పుడు పొందవచ్చు లేదా ఒక పొడుపుకథ విప్పినప్పుడు కూడ పొందవచ్చు. అంతేగాక ఈ ఆనందం ఏదైనా అర్థం చేసికొన్నప్పుడు కలుగవచ్చు. ఇలా అర్థంచేసుకోవటం లేదా విద్య అనేది కూడ ఒక వృత్తి విశేషమే. కాబట్టి ఈ ఆనందం కూడ సాంసారికసుఖమే. అదేవిధంగా ప్రాణాయామము మొదలైనవి అభ్యసించినప్పుడు కలిగే ఆనందంకూడ వృత్తివిశేషమే కనుక అనుభవగమ్యమైన సుఖమే.

ఎప్పుడెప్పుడైతే 'ఆనంద' మనే పదాన్ని ఆత్మను నిర్వచించేదిగా ఉపయోగిస్తామో అప్పుడది, అనుభవగమ్యమైన ఆనందం కాదు. అంటే అది ఆత్మస్వరూప ఆనందమే కాని సాంసారికసుఖం కాదు. ఐనప్పటికి ప్రతి సాంసారికసుఖమూ స్వరూపానందాన్ని - అంటే దేశ, కాల పరిస్థితులపై ఆధారపడనట్టి, పరమ - అంటే అనంతానందాన్ని సూచిస్తుంది. ఆ ఆనందము ఏ నిమిత్తములేనిది కాబట్టి అనుభవింపబడేదికాదు. ఒక అనుభవ రూప ఆనందము ఆత్మానందపు ఆధారంలేకుండా స్వతంత్రంగా ఉండదు, కానీ ఆత్మానందం మాత్రం అనుభవానందాన్ని వదలి స్వతంత్రంగా ఉంటుంది. అది ఆత్మస్వరూపమే కాబట్టి, పరమం-అంటే అనంతం అయినట్టిది. ఏ రకమైన కొరత లేనిదిగా ఆత్మస్వరూపాన్ని గుర్తించటం కూడా పరమానందమే అవుతుంది.

పరమేశ్వరుడు పరమానంద స్వరూపుడు, మరియు సద్గురువుకూడా, ఎందుకంటే సమస్తమైన జ్ఞానానికి అతడే మూలం. అటువంటి పరమేశ్వరునికి, 'ప్రణతోస్మ్యహం' - అంటే నమస్కరిస్తున్నాను.

గోవిందుని స్వరూపమేది ? అంటే అతడు అగోచరుడు. ఇంద్రియములకు విషయమైనవానిని గోచరుడంటారు. కావున ఏ రకంగా విషయమైనా అది గోచరమే. శబ్దం గోచరము. రుచి, వాసన కనిపించే ఏ రూపమైనా గోచరమే. అనుమానప్రమాణ విషయము

కూడా ఒక విషయమే కనుక అదీ గోచరమే. అంతేకాక, నీ మనస్సులో జరిగేదేదీ ఇంద్రి యాలద్వారా గానీ అనుమానంద్వారా గానీ తెలియటం లేదు. కాని సాక్షివైన నీకు సాక్షాత్తు గా తెలుస్తుంది. కాబట్టి సాక్షిద్వారా తెలియబడేది కూడ గోచరమే అవుతుంది. కాని ఈ గోవిందుడు అగోచరుడు, అంటె - ఇంద్రియ ప్రత్యక్షానికి గానీ, అనుమానానికి గాని, సాక్షి ప్రత్యక్షానికి గానీ లభ్యం కాడు. ఇలా విషయీకరించటానికి అందడు. కనుక అప్రమేయుడు అని పిలువబడతాడు.

భగవాను డప్రమేయుడైతే నేనెలా తెలుసుకోబోతున్నాను ! ఆధునిక వేదాంతులిక్కడ పొర బడుతుంటారు. వారంటూంటారు - భగవానుడు, లేదా తత్త్వం అనుభవించాల్సిందే గాని తెలుసుకునేది కాదు అని. వారన్నట్లు భగవానుడు అనుభవవిషయమే అయ్యేట్లయితే, ఆ అనుభవం కోసం తగిన సంసిద్ధతను ఏర్పరచుకోవాలి. కానీ ఎవరైనా శాస్త్రమెందుకు అధ్యయనంచేయాలి ? కానీ వారుమాత్రం అధ్యయనం చేస్తారు. శాస్త్రం గురించి మాట్లా డుతూనే ఉంటారు. ఇక్కడ చెప్పవల్సిందేమంటే, పరమానందమన్నది అనుభవించే విష యం కాదు, అది గుర్తించవలసినదే. అందుకై తగు ప్రమాణము అంటే జ్ఞాన సాధనము కావాలి. గోవిందుడు అన్నప్పడు దానర్థం - నీ వద్దనున్న జ్ఞాన సాధనముల కందడని మాత్ర మే. అదే సమయంలో వేదాంతముద్వారా తెలియబడతాడని బోధిస్తున్నారు - 'సర్వ వేదాం తసిద్ధాంత గోచరమ్'. వేదాంత మంటే - ఉపనిషత్తు. సర్వ వేదాంతమంటే - అన్ని ఉపనిష త్తులు. మరి వేదాంతములోని విషయవస్తువు ఆత్మజ్ఞానము.

"తత్త్వమసి" అది నీవై ఉన్నావు" అనేది ఒక మహావాక్యము. అది తెలిపేదే సర్వవేదాంత సిద్ధాంతము, వ్యక్తికి (జీవునికి) ఈశ్వరునికి ఐక్యత నీ వాక్యము తెలుపుతున్నది. ఈ వాక్యమే వేదాంతము, మరియు దానర్థమే వేదాంత సిద్ధాంతము, ఇక్కడ మహావాక్యము యొక్క అర్థ మంటే లక్ష్యార్థము. కొంతమందభిప్రాయపడుతున్నట్లుగా మహావాక్యములు నాలుగు మాత్ర

మే కాదు. ప్రతి ఉపనిషత్తులో మహావాక్యములున్నాయి. కనుక అటువంటి మహావాక్యము లెన్నో అవుతాయి. మహావాక్యాన్ని వివరించిచెప్పటానికే ఉపనిషత్తులలోని యితర వాక్యాలన్నీ వున్నాయి.

సత్యవస్తువైన గోవిందుడు మహావాక్యముయొక్క అర్థమయినట్లైతే, మహావాక్యం అన్నివా క్యాల్లాగే పదాలసముదాయం అవటంవల్ల ఒక సమస్య ఏర్పడుతుంది. అది, అగోచరాన్ని పద మెలా తెలుపగలుగుతుందా ? అని, ఎందుకంటే, ఒకపదాన్ని ఒకవస్తువును తెలియటానికి వాడుతున్నామంటే, ఇతరపదార్థాలనుండి వేరుగా దాన్ని గుర్తుపడుతున్నామని అర్థము. ఉదా హరణకు - పుస్తకమన్నపదాన్ని మిగిలిన వస్తువులన్నింటి నుండి పుస్తకాన్నివేరుగా గుర్తించ టానికై వాడతాము. ఒక వస్తువు ఇంద్రియగోచరమైనది గానీ లేక అనుమానముద్వారా తెలియబడేదైనా గానీ, అది పదముద్వారా సూచింప బడుతుంది. ఇంద్రియములద్వారా గానీ, అనుమానముద్వారాగానీ తెలియరాని వస్తువుని చెప్పటానికి మనదగ్గర పదమే లేదు. అంతేగాక అసలే లేనివస్తువుని సూచించటానికి మనదగ్గర పదమే లేదు. కాబట్టి పదము లు చెప్పేవల్లా విషయీకరించటాని కవకాశమున్న వస్తువులను గురించి మాత్రమే. ఉదా :- ప్రత్యక్షంగా చూడబడే “ఘటము” లేక అనుమానము ద్వారా తెలుసుకునే “బ్లాక్ హోల్” (ఖగోళంలో నున్న అనంత అగాధమైన చీకటి సొరంగం.)

మరి మనం చర్చిస్తున్న వస్తువు, అగోచరం కాబట్టి, విషయీకరణకు లభ్యం కానప్పడు, పదములయొక్క అర్థముగా ఎలా తెలియబడుతుంది ? శ్రుతి ఈ చిక్కుప్రశ్నను ఇలా పరి ష్కరిస్తుంది. “యద్వా చానభ్యుదితం యేన వాగభ్యుద్యతే, తదేవ బ్రహ్మత్వం విద్ధి” ఏదైతే పదముల ద్వారా తెలియదో కానీ దేనిద్వారా పదములు విషయీకరింపబడుచున్నాయో అదే బ్రహ్మము, వస్తువని తెలుసుకో” (కే. 1.5), అంటే వస్తువు (బ్రహ్మము) పదములద్వారా ప్రకాశింపబడవలసిన లేదా గుర్తింపబడవలసిన అవసరములేదు. నిజానికి పదములే ఈ ‘

వస్తువు' (బ్రహ్మము) వలన ఆ యా విషయములను ప్రకాశింపచేయటమనే తమ వ్యాపారం నిర్వర్తించ గలుగుతున్నాయి. వస్తువు (బ్రహ్మము) పదములద్వారా ప్రకాశింపబడాల్సిన లేక కన్నులద్వారాగాని మనసుద్వారాగాని చూడబడవలసిన అవసరము లేదుగావున దాని నగోచరమంటారు. ఈ చైతన్యవస్తువువలననే మనస్సు మనసుగా నున్నది. కన్నులు కన్నులవుతున్నాయి. ఇక్కడ స్పష్టంగా అర్థం చేసుకోవాల్సిన విషయము ఇది - "ఆత్మ ఇంద్రియ గ్రాహ్యం కాదు" అనటం వేరు. "ఆత్మనెరగటానికి ఇంద్రియాల అవసరం" లేదు అనటం వేరు.

ఈ రెండువాక్యాల మధ్యనున్న భేదము అజ్ఞానికి జ్ఞానికి మధ్య నుండే భేదమే.

వస్తువులు రెండువిధాల్లో తెలుస్తాయి - ఒకటి స్వయంగా ప్రకాశించటం, రెండు ఆత్మప్రకాశానికే తెలియటం. ఘటమును నీవు చూస్తావు కాబట్టి నీకు ప్రకాశిస్తున్నది (తెలుస్తోంది). ఆత్మ ప్రకాశిస్తుందంటే అది స్వయంగానే ప్రకాశిస్తున్నది. ఒక ప్రమాణముతో తెలిసిన వస్తువు అన్ని వేళలా మనస్సులో ఉండదు. తదాకారవృత్తి మనస్సులో ఉన్నంతసేపే అది తెలుస్తుంది. వృత్తి పోయినప్పడదికూడ పోతుంది. కానీ స్వయం ప్రకాశమైన ఆత్మను ఏ ప్రమాణంతోనో తెలుసుకోవటం లేదు. కాబట్టి అది సదా ఉంటున్నది. అది నిత్యమైనది. కావున స్వతః సిద్ధమే.

ప్రసిద్ధమైన దానియందే భ్రమ (అధ్యాస)కు అవకాశముంటుంది. తన ఉనికి ప్రకటంగా ఉన్నదాన్నే యథాతథంగా తెలిసికోవచ్చును. లేదా తప్పగా తెలుసుకోవచ్చును. సర్వజ్ఞుడు మాత్రమే పొరపాటునకతీతుడు. కాని ఏ మానవుడు సర్వజ్ఞుడు కాడు. కాబట్టి భ్రమపడటానికి అవకాశం చాలా ఉంది. ఒక వస్తువు నీ అనుభవానికి తారసపడనపుడు దాని గుర్తింపు ప్రమ- అంటే యథార్థ జ్ఞానం కావచ్చు, లేక భ్రమజ్ఞానం కావచ్చు. మరి ఆత్మ స్వతః ప్రకాశమే. ఐనప్పటికి నా గురించిన (ఆత్మ) అవకాశమున్నది. అందుకే-" నే నసహాయుడను",

“నేను నిష్ప్రయోజకుడిని”, “నేను మర్త్యుడను” మొదలైన ఆత్మగురించిన నిర్ణయాలు అనివార్యములు, దేహేంద్రియమనోబుద్ధుల గుణాలను ఆత్మగా భావిస్తున్నాను. ఇదే ఆత్మగురించిన భ్రాంతి.

తన గురించిన భ్రాంతిస్థితిలో నున్నప్పటికీ, ఆ భ్రాంతుడు దృశ్యప్రపంచాన్ని తెలిసికోవటానికి, మనుగడ సాగించటానికి,దానినింకా సుకరంగా చేసుకోవటానికి కూడా సమర్థుడవుతాడు. ఏ శాస్త్ర రంగంలోనైనా నిపుణత సంపాదించుకో గలుగుతాడు. ఐనా తాను మర్త్యుడననే భావన మారదు. కాబట్టి స్వతఃప్రకాశమైన ఆత్మ గురించి నీవేమనుకుంటున్నావో ఆ విధంగా పొరబడుతున్నావు. ఈ భ్రమను సరిదిద్దటానికి ఒక ప్రమాణం కావాలి. ఎందుకంటే - భ్రమను సరిజేయటమంటే జ్ఞానమే. జ్ఞానము ప్రమాణము ద్వారా కలుగుతుంది.

అహంకారము అంటే - భ్రాంతాత్మ తనకంటే వేరుగా ఉన్నవాటిని- అంటే తాను విషయీకరించే విషయాలను తెలుసుకోవటానికి ప్రత్యక్షానుమాన ప్రమాణాల నుపయోగిస్తుంది. కాని తన భ్రమను తొలగించుకోవటానికి తనకు ప్రమాణము లేదు. నేను విషయీకరించగలిగినదానినల్లా కాదని కొట్టివేయగలను. దృగ్దృశ్య వివేకముద్వారా, ఆత్మానాత్మలను వివేచనం జేసే ప్రక్రియద్వారా ‘నేను’ కాని అనాత్మను కొట్టివేయగలను. కానీ ఆత్మను తెలుసుకోవటానికి - అంటే - ఆత్మే పరమేశ్వరుడని తెలుసుకోవటానికి నాకు శ్రుతితప్ప అన్య ప్రమాణము లేదు.

“నేనల్పుడను”, ‘మర్త్యుడను’, ‘నేను సుఖిని,’ ‘దుఃఖిని’ ‘కర్తృత్వభోక్తృత్వాలున్నవాడిని’ మొదలైన అపోహలన్నీ - శ్రుతి, సద్గురువుల సహాయంతో చేసే విచారముద్వారా తొలగింపబడతాయి. అనాత్మను తొలగించినపుడు శేషించేదేదో అదే స్వతఃసిద్ధమైన స్వతఃప్రకాశమైన

‘అహం’.  అది అనంతమైన పరబ్రహ్మమని లక్షణావృత్తిద్వారా అంటే-శ్రుతివాక్యములయొక్క లక్ష్యార్థము ద్వారా తెలియబడుతుంది.

ఆత్మార్పణమన్నది ప్రమాణానికి, దానిని నిపుణతతో ప్రయోగించే సద్గురువుకి.  ఈ జ్ఞానం పొందటానికి గురువు చాలా ముఖ్యం.  గ్రంథకర్తకి జ్ఞానమున్నదని స్పష్టమవుతున్నది. అయినప్పటికి వారంటున్నారు.- “ ఆ గోవిందునికి, ఎవరైతే ఆ సద్గురువురూపంలో నున్నాడో - వారికి సమర్పితుడనై యున్నాను.  “ప్రణతోస్మి” అర్పించుకున్నవాడనై ఉన్నానని చెప్తున్నారు. కాబట్టి, వర్తమానంతో యిప్పుడర్పించుకుంటున్నానని గాదు.  సమర్పించుకోవటము ద్వారా తానీజ్ఞానాన్ని పొందాననే సత్యాన్ని చెప్తున్నట్లుగాను, మరియు జ్ఞానంకావాలంటే గురువుకు గురుబోధకు అర్పించుకోవటం అత్యంతావశ్యకమని తెలుపుతున్నట్లుగా అనిపిస్తుంది.

# మానవజన్మ ప్రాశస్త్యము

## 2వ శ్లోకము

దుర్లభం త్రమేవైతద్ దేవానుగ్రమ హేతుకమ్ ।

మనుష్యత్వం ముముక్షుత్వం మహా పురుషసంశ్రయః ॥ 3 ॥

మనుష్యత్వం - మానవజన్మపొందటం ; ముముక్షుత్వం తీవ్ర మోక్షేచ్ఛ కలిగిఉండటం; మహాపురుషసంశ్రయః - సరియైనబోధచేసే సద్గురు సాన్నిధ్యము లభించటము; ఏతత్ - ఈ; త్రయమ్వ త్రివిధ అనుగ్రహములు (పొందటం); దుర్లభం - అత్యంత దుర్లభం; దేవానుగ్రహేతుకమ్ - దైవానుగ్రహము వలన; ఏవ - మాత్రమే.

"మానవజన్మ పొందటం-అందునా తీవ్రమోక్షేచ్ఛ కలిగియుండటము - అది ఫలించేవిధంగా సరియైన బోధచేసే సద్గురుసాన్నిధ్యము లభించటము - ఈ త్రివిధమైన అనుగ్రహములు పొందటమత్యంతదుర్లబం. అవి లభించాలంటే, దానికి దైవానుగ్రహమే కారణం."

శాస్త్రము మానవజన్మకున్న అసాధారణ ప్రాముఖ్యాన్ని ఆరంభంలోనే స్తుతిస్తున్నది. "జంతూనాం నరజన్మ దుర్గభం" ఈ భూమిపై చరిస్తున్న వివిధ రకములైన జీవరాశిలో మానవజన్మ అత్యంతం అరుదైనది. శరీరంకంటె భిన్నంగా ఉన్నాడని విశ్వసింపబడే జీవుడు మరణం తురువాతకూడ, మరల జన్మించటానికై కొనసాగుతూనే ఉంటాడు. మనుష్యత్వాన్ని కలిగిఉన్న మానవజన్మే ఎత్తవలెనన్న నియమమేమీలేదు. ఊర్ధ్వలోకాల్లో నుండే దేవతగా జన్మించవచ్చు లేదా ఇక్కడే పశువుగా జన్మించవచ్చు. దేవతగానీ జంతువుగానీ కేవలం భోక్తమాత్రమే. కర్త కాదు. ఈ జన్మలలో భోక్తగా నున్న జీవుడు ప్రారబ్ధకర్మల ననుభవిస్తాడేతప్ప-క్రొత్త క్రొత్త కర్మఫలాలను ప్రోగుచేసుకోలేడు. మోక్షానికసలు ప్రయత్నమే చేయలేడు. అలా ఎందుకంటే సంకల్ప స్వేచ్ఛ Freewillఅన్నదాదేహములలో నిరాకరింపబడినది. పురుషకారమనుగ్రహింపబడిన మానవదేహముల్లాంటి దేహములలో

తప్ప-మోక్షమన్నది వేరే దేహములలో సాధ్యం కాదు. ఆ కారణంచేతనే మానవజన్మశాస్త్ర ములలో నంతగా పొగడబడ్డది. మనుష్యత్వం - మానవునిగా జన్మించటము-ముముక్షు త్వం - ముముక్షువుకుండవలసిన లక్షణములు కలిగిఉండటం- 'నేను' బ్రహ్మమన్నజ్ఞాన మున్న సద్గురుసంరక్షణలో నుండటం- ఈ మూడు విషయములు పొందటం చాలా కష్టమైనవి.

మానవునిగా జన్మించటమే దుర్లభమైనది. మానవుడైనప్పటికీ మోక్షం కావాలనే కోరి క ఉండకపోవచ్చు. అర్థ కామములయందే, అంటే రక్షణ - సుఖములయందే ఆసక్తి కలిగి ఉండవచ్చు. ఆస్తికులలో పుణ్యం కోసం ధర్మాన్నాచరించటం కూడ సాధారణమే. పుణ్యముయొక్క సహాయంతోనే తరువాత కాలాలలో నధికసుఖంగా భోగములనుభవిం చటానికి యోగ్యమైన శరీరం పొందవచ్చు. మానవశరీరానికి దానికుండే పరిమితులు దానికున్నాయి. భోగించాలనే కోరికలుండవచ్చు, అవకాశాలు కూడా ఉండవచ్చు. కానీ అనారోగ్యంవల్లనో, వృద్ధాప్యంవల్లనో, ఇతరులభావన ననుసరించిఉండే భావన మొదలైన వానివలననో భోగము వీలుపడక పోవచ్చు. మరియు మానవునికి అత్యంత బాధాపూరి తమైన అవ్యక్తమనస్సు (unconscious) - కషాయం బాల్యావస్థలోనే ఏర్పడుతుంది. అదే సుఖభోగాలవెంటపడే మనస్సుని, దాని భావోద్రేకాలని (emotions) నియమిస్తూం టుంది. శాస్త్రము స్వర్గం గురించి రకరకాలుగా వర్ణిస్తుంటుంది. యోగ్యమైన దేహేంద్రి య మనస్సుల నాదినుంచి కలిగియుండటంచేత ఎటువంటి అంతరాయములు లేక భోగాల్ననుభవించవచ్చును. బాల్యావస్థలేదు గాబట్టి - అప్పుడేర్పడే సమస్యలుండవు. అం దుచేత స్వర్గాన్నత్యంతవాంఛనీయమైన దానినిగ ఆస్తికులందరూ పరిగణిస్తూంటారు. స్వర్గము పుణ్యంద్వారానే లభిస్తుంది. ఆ విధంగా పుణ్యం కూడ రక్షణ, భోగములకై విని

యోగింపబడుతూంటుంది.  కాబట్టి ధర్మార్థకామములు మూడింటిని అర్థకామములుగా కుదింపవచ్చును.

మరి ధర్మాన్ని ప్రత్యేకంగా ఎందుకు చెప్పారంటే-అది కేవలం శాస్త్రం మీదే ఆధారపడిం ది-కాబట్టి మరణించిన తరువాత కూడ జీవుడు కొనసాగుతూనే ఉంటాడు అని నమ్మే వాడు మాత్రమే - ధర్మానికై ప్రయత్నిస్తాడు శాస్త్రం పట్ల శ్రద్ధాళువుకే అది చెప్పబడింది.

ఏ ఆనందమైనా పుణ్యంనుండే లభిస్తుంది.  అలాకాకపోతే అదృష్ట (chance) మనే దుండదు.  ప్రతివారూ తమ తమ ఇష్టానుసారం ఎప్పడైనా ఆనందంగా నుండవచ్చు. కానీ మనకు తెలుసు ఎవ్వరూ కూడ తాము కోరిన రీతిలో ఆనందంగా ఉండలేరు. ఆనందంగా ఉండాలని కోరుకున్నప్పటికీ, అందుకువలసిన సదుపాయాలేర్పరచినప్పటికీ ఆనందంగానే ఉండి ఉండాలన్న నియమమేమీ లేదు.  కాబట్టి ఆనందంగా ఉండటానికి మరేదో కారణముండి ఉండాలి.  ఆ కారణమే పుణ్యం.  అది యిష్టానుసారం శాసించబడే ది కాదు.  పరిస్థితులను శాసించవచ్చు.  ఐనా సంతోషంలేకుండా పోవచ్చు.  ఏ రోజు కారోజు ప్రారబ్ధరూపంగా పుణ్యం ప్రకటితమవుతూంటుంది.  అందుచేతనే మానవుడప్పడ ప్పడూ సుఖాన్ని చవిచూస్తూంటాడు.

పుణ్యం రెండువిధాలుగా ఉంటుంది.  ఒకరకం పుణ్యం - సాంసారిక సుఖాన్ని పొంద టానికి పరిస్థితులనేర్పరుస్తుంది.  అందులో నీవు సుఖానుభవాన్ని పొందుతావు.  మరోర కమైన పుణ్యం - మోక్షం కావాలనే కోరికను, శుభేచ్ఛను కలుగజేస్తుంది.  రెండురకాల పుణ్యాలు - ధర్మంమూలంగానే లభిస్తున్నాయి.  అందువలననే ధర్మం కూడ ఒక పురుషా ర్థమే.  సాధారణంగా మానవులంతా ఈ మూడురకాల పురుషార్థాలలోనే ఆసక్తికలిగి ఉం టారు.  మోక్షేచ్ఛ వారికుండదు.

ముముక్షత్వమంటే - ముముక్షువుగా - మోక్షంకావాలనే దృఢమైన కోరిక కలిగిన వానిగా- నుండటమే. మరి ముముక్షా - మోక్షంగావాలనే కోరిక కూడ - ఒక కోరికే గదా ? అలాంటప్పడు ముముక్షత్వమనకుండా ముముక్షా అనే మనమెందుకు చెప్పకూడదు ? అందుకో కారణముంది. ముముక్షువుకి ముక్తి పొందాలనే కోరికే జీవితంలో ప్రధానలక్ష్యం. ఏదో ఉత్సుకతతో మోక్షమునందు ప్రేమకలవాడు కాదు. జీవితంలో మిగిలిన అన్నిరంగాలలో నున్న పరిమితులను చక్కగా పరిశీలించి అర్థంచేసుకున్న ఇతడు - మోక్షము మాత్రమే కావాలంటాడు. ఈ ముముక్షత్వము పుణ్యఫలమే - ఈ రోజు వరకు ఈ జన్మలోనో లేక పూర్వజన్మలలోనో, లేదా రెంటియందార్జించిన పుణ్యఫలమే. ఈ జన్మలో ధార్మికజీవనం గడపటం చేతగానీ - లేదా వర్తమాన, పూర్వజన్మలలో చేసిన ప్రార్థనలచేతగానీ- అతడిలో కొన్ని సంస్కారాలేర్పడతాయి. అవి ప్రేరేపింపబడి ముముక్షువవుతాడు.

మోక్షమే కావాలని అంకితమైన వారు చాలా మందున్నారు. కానీ వారికి మోక్షమంటే ఏమిటో తెలియదు. వినికిడి ద్వారానో లేక ఏవో కొన్ని చదవటం ద్వారానో వారికి "ఆత్మ" "ఆత్మసాక్షాత్కారము" మొ॥ వాటి గురించి అస్పష్టమైన కొన్ని ఆలోచనలుంటాయి. గంభీరమైనబోధ విన్నప్పటికీ మనసులో ఏదీ ముద్రపడదు. అంతరంగంలో ప్రేరణ కలగదు. కాబట్టి మోక్షం కావాలనే కోరిక కలగదు. అందుకే ముముక్షుత్వానికి పూర్వపుణ్యమే - కారణము.

పుణ్య మంటే-ఈశ్వరానుగ్రహం. కర్మ ఫలానికి మరో పేరు, అనుగ్రహం. ఈశ్వరుడు కర్మఫలదాత. నీటిని వేడి చేసినపుడది మరుగుతుంది. నీరు మరగడం కర్మఫలం. ఆ ఫలాన్ని చూడవచ్చు. అదే విధంగా కర్మలకు కొన్ని చూడలేని ఫలాలుంటాయి. ఈ

రెండురకాలఫలాలు - చూడబడేవి, చూడలేనివి- ఎప్పటికీ గతి తప్పని ఈశ్వరనియతిన నుసరించి ఉంటాయి. కర్మఫలదాతగా అతడు కర్మలననుసరించి ఫలాలనిస్తుంటాడు. శాస్త్రీయ కర్మ ననుష్ఠించటము - లేక ప్రార్థన చేయటమన్న దొక కర్మ. కర్మ గాబట్టి, దానికి అనురూపమైన ఫలముంటుంది. ఈ కర్మలఫలాన్నే శాస్త్రము పుణ్యమంటుంది. అందుచేత ఏ కర్మఫలమైనా ఈశ్వరానుగ్రహం వల్లనే మోక్షం కావాలనే కోరికుండవచ్చు. కానీ దానికోసమే అంకితమైనప్పుడు మాత్రమే ఎవరైనా ముముక్షువవుతాడు. ఈ అంకితమవటమీశ్వరానుగ్రహఫలమే.

మోక్షాని కంకితమయిన వారు ప్రపంచంలో నలుదెసలా నున్నారు. దాన్ని తప్పనిసరిగా పొందుతామనే విధంగా వారు ప్రయత్నాలు కూడ చేస్తుంటారు. ఈ లక్ష్యాన్ని సాధించటానికై వారు నిష్ఠతో కూడిన జీవనవిధానం కలిగివుంటారు. ఒక క్రైస్తవసన్యాసిగానీ, క్రైస్తవసన్యాసినిగానీ చాలా నిష్ఠ కలిగి ఉంటారు. ఒక సాధువుతో సమానమైనవారు. వారంతా మోక్షాన్నన్వేషిస్తుంటారు. కానీ మోక్షం గురించి వారవగాహనే వేరు. క్రైస్తవ దైవశాస్త్రం ప్రకారం క్రొత్తగా జన్మించిన ప్రతిశిశువుకూడా, జీవాత్మతో కలిపి దేవునిద్వారా పంపబడినదే. మానవజన్మనెత్తటానికి పూర్వం చేసిన కర్మంటూ ఏదీ లేదు. ఆ జీవాత్మ మరణం తరువాత కూడ కొనసాగుతూనే ఉంటుంది. క్రైస్తవపద్ధతిలో శవానికి సమాధి లభించినట్లైతే చనిపోయిన వారి జీవాత్మ అనిశ్చితావస్థలో నుంచబడుతుంది. చివరి రోజున- తీర్పునిచ్చే రోజున అదృష్టవంతులు స్వర్గానికి వెళతారు. అక్కడవారు పరమానందావస్థను పొందుతారు. క్రైస్తవ దైవశాస్త్రం ప్రకారమిది మోక్షంతో సమానం.

బౌద్ధబిక్షువు కూడా మోక్షానికై గాఢమైన నిష్ఠకలిగి ఉంటాడు. ఎన్నో ఆంక్షలున్న నియమనిష్ఠలతో కూడిన జీవితాన్ని గడుపుతుంటాడు. అప్రమత్తతను పెంచుకోమని బోధింప

బడతాడు. అందుచేత నడుస్తుప్పడల్లా కడుజాగరూకతతో నుంటాడు. ఇదంతా కూడా 'శూన్య' మని నిర్వచింపబడిన చివరి లక్ష్యాన్ని - నిర్వాణాన్ని పొందటానికే.

మోక్షం గురించి అనేక ఊహలు, భావాలున్నప్పడు మోక్షం కావాలన్న కోరికున్నంత మాత్రాన సరిపోదు. తెలుసుకోవాలనే కోరికగా, జిజ్ఞాసగా పరిణతి చెందాలి. ఇది చాలా ముఖ్యం. ఈ పరిణతంటే - అత్యంతావశ్యకమైన ఈ సత్యాన్ని గుర్తించటమే. అంటే - మోక్షమన్నది ఇక్కడే యీ జన్మలోనే, జ్ఞానంతో పొందవలసిన రూపంలో ఉన్నద నే విషయాన్ని తెలుసుకోవటం. మోక్షం అంటే ఎప్పడో కాలాంతరంలో ఎక్కడో లోకాంత రంలో కాదు.

మోక్షేక్ష జిజ్ఞాసగా మారటమన్నది కొంత అవగాహనతో వచ్చే మార్పుని సూచిస్తుంది. ఆరంభదశలో ప్రతివారికి మోక్షమంటే ఏదో కొంత అవగాహనుంటుంది. అది కేవలం విశ్వాసాన్ని మించినది కాకపోవచ్చు. సమగ్రమైన బోధను చక్కగా పొందినప్పడు మోక్ష మన్నది జ్ఞానం పొందటం మాత్రంలోనే ఉన్నది గానీ మరే యితరవిధంగా లేదనేది స్పష్టం గా వివేచించి అవగతం చేసేకొనే అవకాశముంటుంది. ఈ విధంగా వివేచించగలగ టం అంత సులభం గాదు. సమగ్రమైన బోధ లభించినప్పటికీ కొంతమంది మోక్షం గు రించిన ఒక భావానికి మరో భావాని కున్న తేడాని తెలుసుకోలేరు. ఒక ఉపాసనాపద్ధతి మరియు ఉపాస్యదైవము ప్రార్థనాధిష్ఠానాన్ని ఆచరణీయంగా స్వీకరిస్తే వారి భావాల్ని కూ డా ప్రామాణికంగా ధృవీకరించినట్లు వ్యాఖ్యానిస్తూంటారు. (ఉదాహరణకు- కృష్ణుని, కృష్ణోపాసనము ప్రమాణమని అంగీకరిస్తే కృష్ణుడిపేరిట ఉన్న ఒకానొక సంప్రదాయం వారి మోక్షభావాన్నే ఒప్పకున్నట్లుగా కొందరు అర్థం చెప్తారు - అనువాదకుడు) ఇలా వ్యాఖ్యానించటం అవగాహనలో గందరగోళం వల్లనే. ఒక దాన్ని నమ్ముతూ సంవత్సరాలు గడిపినప్పడు దాని యందే కాలాన్ని శక్తియుక్తుల్ని వెచ్చించినప్పడు దానితోనే భావోద్రేక

సంబంధాల నేర్పరుచుకున్నప్పుడా నమ్మకాలను వదిలిపెట్టటానికెంతో ధైర్యస్థైర్యాలు కావాలి. వాటినంత సులభంగా విడిచి పెట్టలేడు. వాటినే అంటిపెట్టుకొనుంటాడు. కాబట్టి మనం మోక్షమంటున్న దానిపట్ల ఉండే ముముక్షుత్వం జిజ్ఞాసగా మారితే తప్ప కేవలం ముముక్షుత్వం వల్ల ప్రయోజనం లేదు.

మహాపురుషుడి దగ్గరికి మనం కేవలం కుతూహలంతో వెళ్ళినా, అతడు ఈ ముముక్షుత్వాన్ని తెలుకోవాలనే కోరికగా, జిజ్ఞాసగా సులభంగా మార్చగలడు. మహాపురుషుడు అంటే ఎవరి మహిమ అనంతమైన బ్రహ్మము యొక్క మహిమ వలెనే, అనంతమైనదో అతడు. అతడు తాను బ్రహ్మవస్తువన్న సత్యానికి మేల్కొన్నాడు. అతడి మనస్సు సత్యవస్తువుతో సమానమైంది "నేను బ్రహ్మమ"న్న జ్ఞానంతో నతడు ఆత్మయొక్క మహత్వాన్ని తెలుసుకున్నాడు. అతడు శ్రోత్రియుడు కూడా, అంటే శాస్త్రజ్ఞానాన్ని చక్కగా పొందినవాడు. అలాంటి ఆచార్యుని ప్రశిక్షణ, మార్గదర్శనంలో నుండటం, జిజ్ఞాస ఒకవేళ లేకపోతే దానిని కలిగించటానికే కాక, దాన్ని తీర్చటానికి కూడ సమర్థంగా ఉంటుంది. గురువు ఇతర అన్ని రంగాల ప్రయత్నాలలో నున్న లోపాలను ఎత్తి వివరంగా చూపుతుంటే క్రమంగా సాధకుడు తానసలు అన్నీకోరికలద్వారా కోరేది మోక్షమేనని, మరియు అది ఆత్మను తెలుసుకోవటంలోనే ఉన్నదని గ్రహిస్తాడు. అప్పడు మనసు విచారార్హమవుతుంది.

ఈ విచారము ఒక ప్రశాంతమైన సాధన. ఇక్కడ దుస్సాహసంతో సాధించి తీరాలనే ఆక్రమక స్వభావము పనికి రాదు. సాధ్యము తానే గనుక తన ఒడిలో తానున్నట్లుగా ప్రశాంతంగా నుండాలి-లేని పక్షంలో-ఎల్లప్పడూ ఉత్తేజాలిశయాలకు లోనై-తనకు ప్రయోజనంగాని పనులే-చేస్తుంటాడు. ఉత్తేజాలు, దుస్సాహసాలకు లోనవటమంటే-తనకు తాను దూరం కావటమే. కనుక ఒక వ్యక్తిగా తాను ప్రశాంతుడై సమస్తమైన వాదములు అపోహలు తొలగిపోయేటట్లుగా నుండాలి. "నేను సత్యాన్ని సాధించి తీరా" లన్న దు

స్వాహసతత్త్వం తొలగి తీరాలి. శ్రద్ధాభక్తుల మనస్తత్వంతో కూడిన జిజ్ఞాసా, తెలుసుకోవా లనే కోరిక యనే సౌమ్యతేజోజ్వాలయే ఇక్కడ కాలసినది.

ఏది ఏమిటో - స్పష్టంగా చూడగలిగేట్లు చేసే సద్గురువు సాన్నిధ్యమత్యంత దుర్లభం- అదుదైనది. నీలో కొంతవరకైనా వైరాగ్యాన్ని కలిగించటానికి, సరియైన దిశ జూపటాని కైనా గురువు కావాలి. నీకలా ఒకరుంటే నీవు సరియైన మార్గంలో నున్నట్లే. అటువం టి వారిని - మహాపురుషుని, కనుగొనటమంత సులభం కాదు - అంత కష్టమైనది కాదు. దైవానుగ్రహం మాత్రమవసరం. కేవలమదే కావాలి. నీవది సంపాదించాలి. నీకు మనుష్యత్వము ఉండనే ఉన్నది, దానికై ప్రయత్నించనక్కరలేదు. అరుదైనదే, గానీ ఏదోవిధంగా సంపాదించావు, అదే విధంగా మోక్షమే కావాలన్న తీవ్రకోరిక - అందుకై పూర్ణపరాయణత్వము - నీకున్నది. ఈ దశలో నీకు మార్గం నిర్దేశించే మహాపురుషుడు లభిస్తే నీకున్న అస్పష్టమైన భావాలను అపోహలను మార్చుకుని నిజమైన సాధనలో సరి యైన పంథాలో ముందుకు సాగుతావు.

కానీ ఎవరు మహాపురుషుడో ఎలా కనుగొనటం ? ఒక వ్యక్తి మహాపురుషుడో కాడో నని, నీ కవసరమైనవి సమకూర్చుగలడో లేదోనని తెలుసుకొనే మార్గం ఏదీలేదు. నీవు తెలుసుకోగలిగిందల్లా అతడు శ్రోత్రియుడో కాడో నని మాత్రమే. ఈ రోజుల్లో ఇది కూడా చాలా కష్టమైనదే. ఒక వ్యక్తికి శాస్త్రము తెలుసో లేదో తెలుసుకోవటానికి కొంత శాస్త్రజ్ఞానమవసరం. ఆధునిక చదువులు దాన్నందించలేవు.

అంతేగాక, నువ్వు సద్గురువును అన్వేషిస్తున్నప్పుడు ఆయనలో శ్రోత్రియత్వమునే ముఖ్యమని చూసుకోవటం లేదు. ఒక వేదపండితుడు అయిన శ్రోత్రియుడిని మోక్షం కోసమని ఎవరూ ఆశ్రయించటం జరగటం లేదు. ఒక మహాత్ముడు (అంటే ఒక సాధు

వుకు) అంతా తెలిసి ఉంటుంది అనుకొని ఆయన దగ్గరకే అందరూ పోతుంటారు. చాలామంది ఈ జ్ఞానాన్ని బోధించటానికి ఒక పండితుడిని అర్హుడని భావించటం లేదు.

నేనయితే, ఈ సాధువుల దగ్గరికి పొయ్యేకంటే ఒక పండితుడి దగ్గరికి పోవటమే మేలంటాను. ఎందుకంటే సాధువుల్లో ఈ జ్ఞానం ఉండవచ్చు - ఉండకపోనూవచ్చు. వారిలో ఉందని కూడ తెలియటం కష్టమే. కాని ఒకతను పండితుడౌనా కాదా అనేది మాత్రం సులువుగా గుర్తుపట్టవచ్చు, ఎందుకంటే మనకు ఇతర పండితులు గుర్తించి పెడతారు.

సమాజంలో సద్వస్తువు గురించి సాధారణ జ్ఞానం, ఆపాతజ్ఞానముంటే, అపుడు ప్రజలు ఈ జ్ఞానమున్న వ్యక్తిని గుర్తించగలరు. “నేర్చుకోవటానికి ఈ వ్యక్తి వద్దకు వెళ్లవచ్చు” నని ప్రజలు తెలుసుకుంటారు. గణితశాస్త్రం బోధించటానికి ఉపాధ్యాయుణ్ణి నియమించదల్చుకుంటే ఆ శాస్త్రంలో పట్టా పొందిన వ్యక్తిని నియమిస్తావు. అతడిని ఆపట్టా ఇంచుమించుగా బోధనార్హునిగా చేస్తుంది. అదే విధంగా గురువుని గుర్తించటాని కేమైనా గుర్తులున్నాయా ? ఓ పెద్దాశ్రమం గలిగియుండటం గురువుగా నుండటానికర్హత కాదు. తఱచుగా, గురువు కానప్పడే పెద్దాశ్రమాన్ని నిర్వహించవచ్చు. ఒక ప్రత్యేక భాషాజ్ఞానమెవరినీ గురువుగా చేయలేదు. సాధువు గురువు కావాలన్న నియమము లేదు. ఒక సన్యాసి వివిదిషాసంన్యాసి కావచ్చు; అతడు యింకా నేర్చుకుంటున్న వాడే కావచ్చు. ఒక వేళ అతడధ్యయనం చేస్తూండక పోయేట్లయితే నేర్చుకోవటమతడాపి ఉండవచ్చు, కానీ అధ్యయనం చేయటమాపినంత మాత్రాన, శాస్త్రము మరియు దానిలో తెలిపిన విషయాలు తెలిసినవాడనర్థం గాదు.

నిజానికి గురువుని గుర్తించటానికి కొలబద్దంటూ ఏమీ లేదు. ఒకటి మాత్రం సంభవమే. గురువు తాను గురువునని నిరూపించుకోగలడు. అందుకై అతడు నీవు చూడవ

లసిన దానిని చూచేట్లుగా చేయగలగాలి. అంతకు ఏ మాత్రం తక్కువైనా అతడు గురువు కాలేడు. కాబట్టి గురువును కనుక్కోవటమంటే కచ్చితంగా బోధ లభించటమే. ఎన్ని గంటలు తరగతిలో గడుపుతాడన్న దానిని బట్టి ఒక వ్యక్తి గురువో కాదో తెలుసుకోలేరు. నీవు ముక్తుడవే నన్న విషాయాన్ని నీవు చూడగలిగేట్లు చేశాడా లేదా అన్న దానితోనే ఈ విషయాన్ని తెలుసుకోవచ్చు. అప్పడు మాత్రమే అతడు గురువు. నీవతడిని గురువుగా చేసుకోవాలంటే నీవతడి దగ్గరకు వెళ్ళాలి. ఎంతో మందిలోనుంచి నీ వతడి నెంచుకోవాలి. కానీ ఒక వ్యక్తి గురువో కాదో తెలుసుకునే మార్గం నీకు లేదు. ఎవరైతే హృదయపూర్వకంగా జ్ఞానమే కావాలని కోరుకుంటారో, వారు ఈశ్వరానుగ్రహంతో సరియైన గురువుని పొందుతారు. కాబట్టి మహాపురుష సంశ్రయమన్నది - ఈశ్వరానుగ్రహం వల్లనే.

జీవునికి త్రివిధమైన సంప్రాప్తి - మనుష్యత్వం, ముముక్షుత్వం, మహాపురుషసంశ్రయః - ఈశ్వరానుగ్రహం వలననే. అనుగ్రహం అంటే - నీవు సంపాదించుకున్నదేదో - అదే. కానీ నీవానుగ్రహమెంత సాంపాదించావో, ఏ సాధననుపయోగించి సంపాదించావో నీకు తెలియదు. అనుగ్రహమన్నది మనస్సుకి ప్రసన్నతా స్ఫూర్తులనిచ్చే విధంగా కర్మఫలాన్నిచెప్పటానికి వాడబడిన మరో పదమే. ఈశ్వరుడు అనుగ్రహాన్ని కొంతమందికి కొన్ని వేళల్లో మాత్రమే పంచుతూ వెళ్ళడు. నీవు దాన్ని సంపాదించాలి. ఈశ్వరుడు తన ఇచ్ఛ వచ్చిన రీతిగా అనుగ్రహాన్ని పంచితే అతడీశ్వరుడే మాత్రం కాదు. పక్షపాతబుద్ధి వుందనే దోషగ్రస్తుడౌతాడు. అందుచేత అనుగ్రహానికి సంబంధించినంత వరకు ఆకస్మిక అదృష్ట మనేదేదీలేదు. వాస్తవానికి కర్మనియతి కూడ ఈశ్వరుడే. ఆ నియతి కర్మఫల నిర్ణయం చూసుకుంటుంది.

### 3వ శ్లోకము

లబ్ధ్వా కథఞ్చిన్న రజన్మ దుర్లభం

తత్రాపి పుంస్త్వం శ్రుతి పారదర్శనమ్ ।

య స్స్వాత్మముక్త్యై న యతేత మూఢ ధీః

స హ్యాత్మహా స్వం వినిహం త్యసద్గ్రహాత్ ॥4॥

కథఞ్చిత్ - ఏదో విధంగా; దుర్లభమ్ - దుర్లభమైన; నరజన్మ మానజన్మను; లబ్ధ్వా - పొంది; తత్ర - అందు; అపి - కూడా; పుంస్త్వం - పురుషలక్షణములు; శ్రుతిపార దర్శ నం - వేదపారంగత్వము (పొందికూడ) ; యః - ఏ; మూఢధీః - మూఢబుద్ధి కల మాన వుడు; స్వాత్మముక్త్యై తన మోక్షం కొరకై; న యతేత - పాటుపడడో; సః - అతడు; హి - కచ్చితంగా; ఆత్మహా - ఆత్మహత్యగావించుకున్నవాడగును; అసద్ గ్రహాత్ - అసత్యమైన దానిని అంటిపెట్టుకొనుండటం వలన; స్వం - తనను తాను; వినిహంతి - నాశనం చేసి కొంటాడు.

ఏదో విధంగా అరుదైన మానవజన్మను పొంది, అందునా పురుషలక్షణములు, వేదపారంగత్వం లభించికూడ, ఏ మూఢబుద్ధిగల మానవుడు మోక్షం కోసం పాటుపడడో అతడాత్మహత్య గావించంచుకున్న వాడగును. అసత్యమైన దాన్నంటి పెట్టుకొని తనను తాను నాశనం చేసికొంటాడు."

మానవజన్మ అరుదైనది. అరుదైనదెందుకంటే - అది లభించాలంటే - పూర్తిగా కాక పోయినా కొంతైనా పుణ్యం కావాలి. దేవశరీరం పొందాలంటే కేవలం పుణ్యసముదాయ మే కాలాలి. ఐనప్పటికీ అది అరుదైనదిగా భావింపరు. ఎందుకంటే మానవజన్మలో మాత్రమే ఈ జ్ఞానం సంపాదించే అవకాశం పొందిఉన్నాడు. దేవశరీరాలు ప్రధానంగా సుఖభోగములను అనుభవించటముద్వారా పుణ్యాన్ని ఖర్చుచేసుకోవటానికి నిర్దేశింపబ డినవి. కనుక ఈ జ్ఞానం పొదటానికి అవి తగినవి కావు. శాస్త్రములలో అక్కడక్కడా క నిపించే కొన్ని అపవాదములు ఉన్నప్పటికీ, అలాకాక మానవ జన్మ నిచ్చే పుణ్యపాపములస

రియైన కలయిక మోక్షాన్ని కోరటానికి మరియు పొందటానికి అవకాశాన్నిస్తుంది.

పుణ్యపాపముల ఒకవిధమైన కలయిక వలన జీవుడు మావజన్మ పొందుతాడనే విషయాన్ని ఈ క్రింది శ్లోకంలో చూపబడినది.

"శుభైరాప్నోతి దేవత్వం నిషిద్ధైః నారకీం తనుమ్ ।

ఉభాభ్యాం పుణ్యపాపాభ్యాం మనుష్యత్వం లభతే నరః " ॥

"పుణ్యం చేత జీవుడు దేవశరీరం పొందుతాడు. పాపముచేత నరకంలో దేహము మరియు పుణ్యపాపముల సరియైన మిశ్రమమువలన మనుష్యజన్మ పొందుతాడు".

ఆ విధంగా మనుష్యజన్మ అత్యంతం అరుదైనది,ఐనా ఏదోవిధంగా దాన్నతడు పొందాడు.

మానవజన్మలో పుంస్త్వం - ధైర్యస్థైర్యములు, త్యాగము, సంన్యాసము మొదలైన పురుష లక్షణములు - కలిగి ఉండటం కూడ అరుదైన విషయమే. పుంస్త్వం అంటే కేవలం పురుషులు మాత్రమే ఈ లక్షణములు కలిగిఉంటారనర్థం గాదు. ఈ లక్షణాలు లేని పురుషులు కొంతమందున్నారు. అలాగే ఈ లక్షణాలు గలిగిన కొందమంది స్త్రీలు కూడ ఉన్నారు. మానవజన్మ మరియు పుంస్త్వలక్షణము పొంది ఏ వ్యక్తి అయినా శ్రుతినధ్యయనం చేసే అవకాశం పొందితే అది మరో అరుదైన విషయమే. ఇక్కడ శ్రుతి అంటే వేదములో కర్మకాండ భాగమే, కానీ ఉపనిషత్తు కూడ దానిలో వస్తుంది. కాబట్టి అతడు ఉపనిషత్తు మంత్రములతో చక్కగా పరిచయమున్నవాడు. కానీ వాటినతడు నిత్యము అభిషేకానికి ఉపయోగిస్తాడు. అంతవరకది మంచిదే. కానీ ఉపనిషన్మంత్రములు మరో విషయాన్ని విశదీకరించటానికున్నాయి. కానీ అతడి కందులో మనసు లేదు. వేదాధ్యయనం చేసిన తరువాత కూడ, ఏ వ్యక్తికైనా ధర్మార్థకామములలోనే ఇచ్ఛకలిగి ఉంటే శోచనీయంగా అతడు తరణనౌకను జారవిడచుకుంటున్నాడు. అతడి బుద్ధి వివిధ సాధ్యసాధనములలోనే లగ్నమయి ఉన్నది. నిజమైన లక్ష్యమతడికి స్పష్టంగా తెలియదు.

అరువది సంవత్సరాలు గడిచినా, ఇంకా అతడు “స్వామీజీ జీవిత లక్ష్యమేమిటని” అడుగుతూ ఉంటాడు. అటువంటి వ్యక్తి తనముక్తికై ఎలాంటి ప్రయత్నము చేయడు - “న యతేత స్వాత్మముక్త్యై”.

ముక్తి అంటే - స్వాతంత్ర్యం - నీకు అవాంఛితమునుండి స్వాతంత్ర్యం. దేన్ని కోరుతున్నారో, దాన్నుండి ఎవరూ స్వాతంత్ర్యాన్ని కోరుకోరు. స్వాతంత్ర్యమన్నది ఎప్పడూ కూడ దేన్ని నీవు బంధంగా భావిస్తావో దాన్నుండి స్వాతంత్ర్యం. నిన్ను బాధించేదేదైనా బంధమే. మరణము బాధిస్తుంది, కనుక అది బంధము, నొప్పి బాధిస్తుంది, కాబట్టి అది బంధము. కాని మౌలికంగా బాధించేది - “నేనల్పుడను, వ్యర్థమయినవాడ” ననే భావన. ఈ భావన మిగిలిన అన్నిటినుండి మనిషిని వేరు చేస్తుంది. “భిన్నము” అన్న భావనే నిజానికి సమస్య. అందుకే ఇక్కడ “ఈ భిన్నమన్న భావనను వదిలించుకోవటానికెవరైతే నిజంగా ప్రయత్నంచేయడో అతడు మూఢబుద్ధికలవాడ” ని ఇక్కడ చెప్పబడింది.

ఒక వ్యక్తి ఆనందం కోసం ప్రయత్నిస్తున్నాడంటే అతడు స్వాతంత్ర్యం కోసం ప్రయత్నిస్తున్నాడు - ఇప్పడు తానెలా ఉన్నాడో దాన్నుండి స్వాతంత్ర్యం పొందటానికి, ఇప్పడేదైతే ఉన్నదో అది తగినంత కాదు - చాలదు - కాబట్టి దాన్నుండి ముక్తి పొందటానికెప్పడూ యత్నం జరుగుతుంటుంది. కాబట్టి ప్రయత్నించేది సంతోషం పొందటానికి కాదు, దుఃఖాన్ని పోగొట్టు కోవడానికి. కాబట్టి ఆనందమంటే- దుఃఖంనుండి స్వాతంత్ర్యమే కాని మరేదీ కాదు.

శాస్త్రము ద్వివిధ జీవన విధానాలను గురించి బోధిస్తుంది. ఒకటి ప్రవృత్తి మార్గము- కోరికలు తీరేవిధానాల్ని వెదుకుతూచేసే కర్మాచరణము. రెండవది, నివృత్తిమార్గము - అన్నీ వదిలివేసేది- కోరికలపట్టు నుండి విముక్తి నన్వేషిస్తూ జీవించటం మోక్షం కోసం ప్రయత్నించే సంన్యాసులు, కర్మ యోగులలాంటి వారు, నివృత్తి మార్గమవలంబిస్తు

న్నారు.  ఎవరైతే ధర్మాన్ని దృష్టిలో నుంచుకొని అర్థకామాలకై ప్రయత్నిస్తున్నారో వారు ప్రవృత్తి మార్గంలో నున్నారు.  కానీ మనం పరిశీలిస్తే - ప్రవృత్తి మార్గంలో ఉన్నవారు కూడ నిజానికి నివృత్తిలోనే ఇచ్ఛకలిగి ఉన్నారని కనుగొంటావు.  అదెలాగో అర్థం చేసుకుందాము.

ప్రతివారూ తానుకోరిందాని కోసం పనిని చేపడుతున్నారు.  అది లేకుండా సుఖంగా ఉండలేడు కాబట్టి - నాకు కావాలి - అన్నది మాత్రం సమస్యకాదు.  కానీ అది లేకుండా నేను సుఖంగా ఉండలేను అనేది సమస్య.  అంటే ఇప్పడు నేనున్నట్లుగా నన్ను నేను భరించలేను, స్వీకరించలేను.  ఈ విషయాన్ని మీరు స్పష్టంగా అర్థం చేసుకోవాలి. నాకున్న అవస్థను వదిలించుకోవాలని కోరతాను.  నన్ను నేను వదిలించుకోవాలని కోరుకోను.  కాని కొంతమంది ఆత్మహత్య చేసుకోవటం మనం చూస్తున్నాము.  కాబట్టి ఇలా సందేహం తలెత్తవచ్చు.  వారు తమని తాము వదిలించుకోవాలని కోరుకుంటున్నారు కదా అని.  ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకోదల్చుకున్నప్పడు అతడు తననే వదిలించుకోజూస్తున్నట్టనిపిస్తుంది.  కాని వాస్తవాని కతడు తననే పోగొట్టుకోవాలనుకోవటం లేదు. అతడు బాధతో ఉన్నాడు.  బయటపడే మార్గం కనపడనటువంటి నిస్సహాయస్థితిలో ఉన్నాడు.  ఈ బాధనంతం చేసుకోవటాని కతడాత్మహత్యకు పాల్పడుతున్నాడు.

ఒక వ్యక్తి ఎంతో ధనం నష్టపోయాడు.  ఎంత ధనమంటే, గుప్పెడు మాత్రలు మ్రింగి మరణించడానికి సిద్ధపడుతున్నాడు.

నేనడుగుతాను "ఎందుకు నీ దగ్గరన్ని మాత్రలున్నాయి ?"

అతడు చెప్తాడు, "మరణించాలనుకుంటున్నాను"

"ఎందుకు"

"ఎంతో ధనం నష్టపోయాను కాబట్టి"

"ఆ ధనం నేను నీకిస్తాను."

"నిజంగా ?"

అతడింక మననించాలని ఏమాత్రం కోరుకోడు. ఎవరూ తనని తాను లేకుండా చేసుకోవాలని కోరుకోరు. సమస్యల్లా తనమీదే కేంద్రీకృతమైన అవస్థ. కాబట్టి ప్రతివారూ తనకున్న దుఃఖావస్థను పోగొట్టుకోవాలని కోరుకుంటారు. కాబట్టి ప్రతి ఒక్కరూ నివృత్తిలోనే సదా నిమగ్నమై ఉన్నారు.

అందుచేత రెండు మార్గములన్నది అవివేకి కొరకు మాత్రమే. వివేకవంతుడికి నివృత్తి తప్ప మరో మార్గం లేదు. అతడు ఎంచుకోడు. ఎంచుకునే అవకాశమతనికి లేదు. నీకేం కావాలో స్పష్టంగా నీకు తెలిస్తే, ఇక ఎంచుకోవటం అంటూ లేదు. వివేకికి ఎంచుకోవటానికి ఒకే ఒకటి ఉన్నది - నివృత్తి. అది హిబ్‌సన్ ఎంపిక లాంటిది. హిబ్‌సన్‌కొక అశ్వశాల ఉండేది. అతడి అశ్వములుత్తమజాతివని ప్రసిద్ధి గాంచినవి. ఎవరైనా హిబ్‌సన్ అశ్వాన్ని కొనదలిస్తే, వరుసలో మొట్టమొదట నిలబెట్టబడిన గుఱ్ఱాన్ని కొనాల్సిందే. కొనేవానికి ఎంచుకునే వీలులేదు. ఇది స్పష్టమయితే, సంపూర్ణమైన నిష్ఠతో ఈ ముక్తికై ప్రయత్నించటముంటుంది. లేకపోతే ప్రవృత్తి మార్గంలోనే లగ్నమై ఉండిపోతారు.

"నాకు రక్షణ లేదు, నాకు భద్రత కావా" లన్న దే "అర్థం" కోసం ప్రయత్నించటానికి మూలం. భద్రతా భావన కోసం ధనం వెంట పరుగిడతారు. కానీ ధనముండి కూడ నేను నిశ్చింతగా లేను. మొదట్లో ధనం లేక నేను క్షేమంగా లేను. ఇప్పుడు ధనముండి నేను క్షేమంగాలేను. అక్కడేదో పొరపాటున్నది. నాకేది ఉన్నది - ఏదిలేదు అన్నది సమస్యకాదు. నాకు కావాలి అనేది సమస్యకాదు. కానీ "నేను కావాలి అన్నస్థితిలో ఉన్నాను" అన్నది సమస్య. దీన్ని చక్కగా అర్థంచేసుకోవాలి. కావాలి అన్నభావన నాకున్నదన్న భావ

నని వదిలించుకోవాలి.  అది పోతే నేను ముక్తుడనే.  అప్పుడు కొన్ని కోరికలు కలిగి ఉండటానికి కూడ నాకు స్వతంత్రమున్నది.  నేను 'కావాలి' అన్న స్థితిలో ఉన్నానని మౌలిక సమస్యను గుర్తించిన వాడు సరియైన మార్గంలో ఉన్నాడు.  లేకపోతే అతడు మూఢధీ : - పురుషార్థాలవిషయంలో విభ్రాంతి స్థితిలోనున్నవాడు.

ఈ విముక్తికై ఎవరు ప్రయత్నించడో అతడు ఆత్మహత్య చేసుకున్నవాడే తనని తానే నాశనం చేసికున్నవాడే.  ఆత్మహత్య చేసుకోవాలని కోరుకుంటున్న వాడు, ఇంకా చక్కగా ఉపయోగించుకోగలిగిన తన శరీరాన్ని అంతమొందించుకోవటానికి  తన పురుషకారాన్ని ఉపయోగించినవాడు.  ఉపయోగకరమైన దానిని దురుపయోగం చేయడం ఆత్మహత్య అవుతుంది. మరి జీవరాశిలో మానవుణ్ణి ప్రత్యేకంగా నిలిపేదేమిటంటే పురుషకారము కలిగి ఉన్నట్టి, ఆత్మస్పృహగల మనసు. దీని మూలంగానే కర్తృత్వమతని కుంది.  ఆవు చాల పనులు చేస్తుంది కానీ కర్తృత్వం లేదు.  ఈ కర్తృత్వం మానవుడికి ఎంపిక చేసికునే అవకాశమిస్తుంది, దీంతో మోక్షం గూడా పొందవచ్చు.

మానవునికి బుద్ధి ఇవ్వబడింది.  అది జీవితలక్ష్యమేమిటో తెలుసుకోవడానికివ్వబడ్డది. దీంతో నేనేమి సాధించాలి ?  దేన్ని సాధించాల్సిన అవసరం నాకున్నదనేది అర్థం చేసుకోవాలి.  బాలుడు దీన్ని తెలుసుకోలేక పోవచ్చు.  కానీ బుద్ధి వికాసమున్న పెద్దవారివిషయాలు తెలుసుకునే అవకాశమున్నది.  జీవితానుభవాల్ని చక్కగా పరిశీలించినమీదట ప్రతివారికి తమ జీవితాశయం పట్ల కొంత అవగాహననేర్పడుతుంది.  ఆపై, శాస్త్రములధ్యయనం చేసిన మీదట జీవిత చరమ లక్ష్యం గురించి ఆపాత జ్ఞానముండటం సంభవమే. అంతేగాక ఈ ఆత్మజ్ఞానం కోసమే సర్వము పరిత్యాగం చేసిన మహాత్ములు సమాజంలో ఉన్నారు.  ఇవన్నీ కూడా జీవితలక్ష్యాన్ని - మరియు ప్రతి వ్యక్తి తానేమి చేస్తున్నాడో ప్రశ్నిం

చుకోవాలి అని గుర్తుచేస్తుంటాయి. ఈ విధంగా ప్రశ్నించకపోతే, జీవితాశయం గురించి ఆలోచించపక పోతే, బుద్ధిని సరిగా ఉపయోగించటం లేదని దుర్వినియోగం చేస్తున్నాడని అర్థమౌతుంది. కాబట్టి అది ఆత్మహత్యతో సమానమైనది. మరో విషయమేమిటంటే - అతడు సత్యమైన ఆత్మను వదిలివేసి, మిథ్యయైన అనాత్మను పట్టుకుంటాడు. కాబట్టి ఈ అర్థంలో ఆతడాత్మ నంతమొందించినట్లు అవుతుంది. బుద్ధి దృక్కోణంనుండి దాన్ని జీవితాశయం సాధించటానికి ఉపయోగించటం లేదు గాబట్టి, ఆత్మహత్య చేసుకున్నట్లే - లేదా దేన్నైతే జీవితంలో అన్వేషిస్తున్నాడో ఆ ఆత్మను వదలివేయుటంద్వారా తనని తాను నాశనం చేసుకుంటున్నాడు. స హి ఆత్మహా : - అతడు ఆత్మఘాతే కదా !

ఏదైతే రక్షించదో అటువంటి మిథ్యను పట్టుకున్నప్పుడు వ్యక్తి తనని తాను నాశనం చేసుకుంటాడు. ఇతడు నీటిలో మునిగిపోతూ మరో మునిగిపోతున్న వ్యక్తిని పట్టుకున్నట్టివాడు. అదే విధంగా మానవుడు అర్థము మొ॥ వాటిని పొందటం ద్వారా తాను ముక్తుడవుతాననుకుంటాడు. కానీ అవే తాము మిథ్య అని నిరూపిస్తాయి. అతడిని రక్షించేది ఆత్మే. అది సత్యము, జ్ఞానము, అనంతము, దాన్నతడాశ్రయించడు. నష్టప్రాయుడవుతాడు.

మనము జీవితంలో దేన్ని గట్టిగా పట్టుకోవాలో మరియు దేన్ని అన్వేషించాలో అనేది సరియైందిగాను, స్పష్టంగాను ఉంటేనే పురుషార్థనిశ్చయం ఉందని అర్థము. శాస్త్రము దీన్ని మొట్టమొదటే దృష్టికి తెస్తుంది. ఎందుకంటే పురుషార్థనిశ్చయం లేకుండా అన్వేషిస్తే అది చీకటిలో తడమటమే అవుతుంది. ఊరికే కూతూహలం ఉంటే అది పనికిరాదు. నువ్వు ముముక్షువుగా నీకు పురుషార్థనిశ్చయం ఉండి మోక్షాన్నేకోరుతున్నావు. కాబట్టి మోక్షశాస్త్రాన్ని అధ్యయనం చేస్తావు. మోక్షం దొరకనీ - లేదా ఇంకా దొరకక

పోనీ - పురుషార్థనిశ్చయం ఉన్నట్లయితే అతడు వివేకవంతుడు అవుతాడు.  అది లేని పక్షంలో అతడు తనను నాశనం చేసుకుంటున్నాడు.

ఒకవ్యక్తి తన జీవితలక్ష్యం గురించి నిర్ణయానికొస్తాడనుకుందాం, అతడు మోక్షమే కోరతాడు.  మోక్షం కోసమతడేం చేయాలి ? ఎక్కడికి పోవాలి ? సాధారణంగా అటు వంటి వారంతా ఋషీ కేశ్‌లో ఋషులుంటారని తలపోస్తూ అక్కడికి వెళ్తుంటారు. సాధారణంగా జనులకి ఋషీకేశ్ గురించి, గంగా తీరాల గురించి హిమాలయాల గురించి అద్భుతమైన కాల్పనిక భావాలుంటాయి.  ఋషీకేష్ చేరింతరువాత మోక్షసాధ నాలన్వేషిస్తూ అటూఇటూ తిరుగుతారు.  ఎవరో “ఇది చేయ” మని - మరొకరు “అది చేయమని” చెప్తారు - ఇంకొకరు చెప్తారు “కలియుగంలో మోక్షంకొరకు నీవు చేయవ లసిందల్లా హరినామ సంకీర్తనమే” నని.  వారీ శ్లోకాన్ని గూడ ఉదహరిస్తారు.

“కలౌ కల్మషచిత్తానాం పాపద్రవ్యోపజీవినామ్ ।

విధిక్రియావిహీనానాం హరేర్నామైవ కేవలమ్ ॥

“కలియుగంలో, కల్మషచిత్తము ఉన్న వారికి, పాపసంపాదనలతో జీవిస్తున్నవారికి, వేద విహిత కర్మాచరణ లేనివారికి కేవలం హరినామమే మార్గము.”

అందరూ ఈ శ్లోకాన్నెప్పుడూ ఉదహరిస్తుంటారు.  కాని ఈ శ్లోకంలో చెప్పబడిందే మిటంటే హరినామము వేదవిహితకర్మలకు బదులుగా చేయవచ్చునని, పాపముల ప్రభా వాలన్నీ తొలగించ టానికది చాలుననీ, కానీ వారు హరినామమే మోక్షాన్నిస్తుందని వ్యా ఖ్యానిస్తారు.  ఆ విధంగా అనేక

వాదములున్నాయి.  మోక్షానికిక సాధనములుగా అనేకములు గొప్ప వారిచే చెప్ప బడ్డాయి.  ఆధునికంగా “సర్వసమన్వయ యోగము” అని మరోసాధనం చెప్పబడింది. అదెలాగంటే, అది కొంచెం, ఇది కొంచెంగ, కొంచెం కొంచెంగా అన్ని కలిపి” అని.  ఇవన్నీ మోక్షమార్గాలని ప్రపంచమంతటా చెప్తున్నప్పుడు ఏది మోక్షానికి సరియైన సాధనము ? మోక్షం కావాలన్న వారికి సాధనము సుస్పష్టంగా ఉండాలి.  వాస్తవానికి నీవేది సాధించ దల్చుకున్నావో స్పష్టమయ్యేకొద్దీ దానికి సాధనం కూడా స్పష్టం మరియు కచ్ఛితం అవుతు

ంది. నా మీదే కేంద్రీకృతమయిన సమస్యలన్నిటినుండి నాకు విముక్తి కావాలన్న విషయ ంస్పష్టయయితే, సరియైనమార్గంలో చాలా ముందుకు సాగినట్లే. ఐనా నీ ఈ సమస్యల నుండి విడిపించటానికి కచ్చితంగా నీకు సహాయం చేసేదేదో తరువాత శ్లోకంలో వివ రించబడ్డది.

# జ్ఞానము వలన మాత్రమే మోక్షము

4 వ శ్లోకము

పఠంతు శాస్త్రాణి యజన్తుదేవాన్

కుర్వన్తు కర్మాణి భజన్తు దేవతాః ।

ఆత్మైక్య భోధేన వినావిముక్తిః

న సిధ్యతి బ్రహ్మశతాన్తరేపి" ॥6॥

శాస్త్రాణి - శాస్త్రములను; పఠన్తు - అధ్యయనము చేయుదురుగాక; దేవాన్ - దేవతలను; యజన్తు - వైదిక కర్మలద్వారా తృప్తి పరచుదురుగాక; కర్మాణి - నిస్వార్థ కర్మలను;కుర్వన్తు - ఆచరింతురు గాక; దేవతాః - దేవతలను; భజన్తు - భజింతురు గాక; ఆత్మైక్యబోధేనవినా - ఆత్మైక్యజ్ఞానం లేక పోతే; విముక్తిః - మోక్షము; బ్రహ్మశతాంతరే పి - వందలకొలదిబ్రహ్మ కల్పములు గడచినా; న సిధ్యతి - సిద్ధించదు.

"శాస్త్రములనధ్యయనము చేయుదురు గాక ! వైదికకర్మలద్వారా దేవతలను తృప్తిపరచుదురు గాక. నిస్వార్థ కర్మల నాచరింతురు గాక ! దేవతలను భజింతురుగాక ! కాని ఆత్మైక్యజ్ఞానం కలుగకపోతే వందల కొలది బ్రహ్మ కల్పములు గడచినా ముక్తి సిద్ధించదు."

ముముక్షువులు అద్వైతవేదాంతము తప్ప న్యాయము, వ్యాకరణము మొ॥ వివిధశాస్త్రముల నధ్యయనం చేస్తే చేయుదురు గాక, ఎందుకంటే శాస్త్రాధ్యయనం మంచి విషయమే, కాని అది మోక్షాన్ని ప్రసాదించదు. వేదాధ్యయనం గూడ మోక్షాన్నివ్వదు. అది వేదమేమివ్వ గలదో అంతవరకు నిన్ను తీసుకువెళుతుంది. కానీ మోక్షానికది చాలదు. మోక్షం పొందటానికి వేదాధ్యయనం మాత్రం చాలదని ఆ వేదమే చెప్తుంది. వేదాంతాధ్య

యనం చేయాలి. వేదముల అంత్యబాగాన్ని - అందునా కేవలమధ్యయనం మాత్రం సరి పోదు; అక్కడేమి బోధింపబడుతున్నదో దానినర్థం చేసుకోవాలి.

ముండకోపనిషత్తు ఇలా బోధిస్తుంది - " రెండు విధములైన విద్యలను సంపాదింప వలెను - పరా మరియు అపరా". ఏ జ్ఞానముతో అక్షరబ్రహ్మను పొందుతారో అది పరా విద్య. ఈ జ్ఞానము వేదాంతశబ్దముల ద్వారా ఉత్పన్నమయ్యే అంతఃకరణవృత్తిద్వారా కలు గుతుంది. పదముల, వాక్యములరూపంలో నున్న ప్రమాణ మీజ్ఞానాన్ని ఉత్పన్నం చేయడం లో నిమిత్తమవుతుంది. ఐనప్పటికీ నిజానికి జ్ఞానాన్ని కలిగించేది మాత్రం అంతఃకరణ వృత్తి మాత్రమే. దానినే పరావిద్య అంటారు. ఉపనిషత్ శబ్దములు మాత్రం అపరా విద్య యే. వైదికకర్మలు మొ॥నవి సాధకుణ్ణి వేదాంతాధ్యయనం చేయటానికి సంసిద్ధుణ్ణి చేస్తాయి. మోక్షంకొరకు మాత్రం వేదాంతంలో చెప్పబడిన దానిని నీవర్థం చేసుకోవాలి. ఇతరములన్నీ కూడ వేదాంతాధ్యయనానికి అంతఃకరణను సంసిద్ధం చేస్తాయి. అదే ఈ శ్లోకంలోచెప్పబడింది.

"యజంతు దేవాన్" ఇంద్ర, వరుణ మొ॥ దేవతల అనుగ్రహం ప్రార్థిస్తూ వైదికకర్మలు చేయుదురు గాక. "యజంతు దేవాన్" అన్న మాటతో వైదిక కర్మలు సమస్తములు కలు పుకొని చెప్పబడినవి. ఈ కర్మలతో పాటుగా నూతులు త్రవ్వించటము, తటాకము లేర్పర చటము, దేవాలయములు నిర్మించటము లాంటి సమాజానికుపకరించే కార్యములు నీ హృదయకవాటములనుతెరిచేవిగా ఉంటాయి. ఈ కార్యములన్నీ ఉదారమైనవిగా పరిగణింపబడతాయి. సాధకులీకర్మలన్నీ చేయుదురుగాక - కుర్వంతు కర్మాణి - ఒక వ్యక్తి వైదికకర్మల ననుష్ఠించక పోవచ్చు కానీ శివ, విష్ణు మొ॥ దేవతలను పూజించుగాక - భజంతు దేవతాః.

ఇవన్నీ విహితకర్మలు, వీటిల్లో ఏవైనా చేయమని ముముక్షువులు ప్రోత్సహింపబడుతుం

టారు. కానీ బ్రహ్మాత్మైక్యజ్ఞానం కలుగకుండా ముక్తి లభించదు. - "ఆత్మైక్యబోధన వినా వి ముక్తిః న సిధ్యతి". చిరకాలం వరకు అంటే నూరు బ్రహ్మలకాలంవరకు ఇవన్నీ నీవు చేస్తూండవచ్చు, ఐనప్పటికీ ముక్తి ప్రాప్తించదు. సృష్ట్యాదినుండి ప్రళయంవరకు బ్రహ్మ జీవితకాలం అదే సుదీర్ఘమైనది. ప్రతికల్పారంభంలో బ్రహ్మ మారుతుంటాడు. శాస్త్రమిక్క డ చెప్తున్నది - అటువంటి నూరుమంది బ్రహ్మల కాలంవరకు కర్మలు చేస్తూన్నప్పటికీ, "ఆత్మే బ్రహ్మ" అన్న ఐక్యజ్ఞానం కలుగనంతవరకు మోక్షం పొందలేరు.

ఐక్యమన్న పదము రెండువస్తువుల్ని కలపటం అన్న అర్థంలో వాడబడుతుంది. కాని వాస్తవానికి ఐక్యమంటే ఒకటిగా ఉండటం, ఏకత్వమే. ఉన్నది ఒకే ఒక ఆత్మ. జీవుడికి జీవుడికి మధ్య భేదం లేదు. జీవజగత్తులకు భేదం లేదు; జీవేశ్వరులమధ్య భేదం లేదు. ఈ ఐక్యజ్ఞానమే - అభేదజ్ఞానమే "ఆత్మైక్యబోధ" అని పిలువబడుతుంది. కాని "ఆత్మైక్య బోధ" అన్నమాట సాధారణంగా జీవేశ్వరుల ఐక్యజ్ఞానానికి వాడబడుతుంది. జగత్తు ఈశ్వరుని కంటె భిన్నంగాదు కాబట్టి.

"బోధ" అంటే - జ్ఞానము - గుర్తింపు. అందుచేత అది మనసులోనే కలగాలి. వేరెక్క డా కాదు. ఆత్మ ఎప్పడూ ఉన్నదే; ఎల్లప్పడూ ఒకే లాగ; నీకు తెలిసినా తెలియకపోయినా అది ఒకటే, అద్వయం. ఎలా కలకండ తనకు తెలిసినా తెలియకున్నా మధురముగానే ఉండునో అట్లే ఇది. సర్వమూ ఆత్మేకానీ అది దేనివలన బద్ధముకాదు. సర్వానికి అతీత మైనది. ఈ సత్యం గురించిన అజ్ఞానము తొలగాలి. జ్ఞానముద్వారా మాత్రమే అజ్ఞానం తొలగింపబడుతుంది. జ్ఞానం కొరకు నీవు సరియైన ప్రమాణాన్ని ఉపయోగించాలి. ప్రమాణమిక్కడ పదముల, వాక్యములరూపంలో ఉన్నది. దానినుపయోగించటం నీ చేతుల్లో లేదు. ప్రత్యక్ష, అనుమాన ప్రమాణముల నుపయోగించినపుడు నీవు జ్ఞాతవు. కానీ వేదాంతవాక్యములు గురువునుండి వస్తాయి. నీవు శబ్దములు వింటున్నావు కాని

అది ప్రత్యక్షప్రమాణము కాదు. 'మామిడిపండు' అన్న శబ్దము విన్నప్పుడు నీవా పండుని నీ మనసులో చూస్తావు. అది అంతకుముందే చూడబడిన వస్తువు కాబట్టి, 'నిత్యము' అన్నప్పుడు - అది చూడబడిన వస్తువు కాదు కాబట్టి - ఏ అర్థము స్ఫురించదు. ఆత్మ నిత్యము అన్నది - అర్థం చేసుకోవలసిన విషయము. నిత్యమైన ఆత్మ నీకు తెలిసిన తరువాత దాని సాక్షాత్కారం కలుగుతుంది అని కాదు. నిత్యమంటే ఏమిటో విప్పి బోధించక పోతే నీవు నిత్యత్వాన్నర్థంచేసుకోలేవు. అందుకే ఎవరైనా "స్వామీజీ, ఆత్మ నిత్యమని నాకు స్పష్టంగా తెలుసు. కానీ ఎలా సాక్షాత్కరించుకోవాలి." అనంటే, నేను చెప్పేది ఇది "మొదట నీ పొరపాటు నర్థం చేసుకో. నీకు కావలసిందల్లా ఆ సాక్షాత్కారమే నీవు నిత్య మనే పదాన్ని విన్నావు, కానీ దాన్నర్థం చేసుకోలేదు. అర్థం చేసుకున్నాననుకుంటున్నావు. కాని అది నిజం కాదు." అదేవిధంగా చైతన్యము అనంతము, దివ్యము, పరం, ఆధ్యాత్మిక ము మొ॥ పదములు సరిగా విప్పి ప్రకాశింపబడక పోతే అర్థవంతములు గానేరవు. అది పెద్ద సమస్య; నిజం ! శబ్ద ప్రమాణప్రయోగంలో పదములు గురువుద్వారా వాడబడ తాయి. ఆ వాడబడిన పదములు నేను ముక్తుడననే విషయాన్ని నేను చూడగలిగేట్లు చేయటానికే ఉద్దేశింపబడ్డాయి.

ఆత్మ స్వతఃప్రకాశము, కానీ అదే బ్రహ్మమని తెలియదు. ఇది తెలుసుకోవటానికి ప్రత్యక్ష అనుమానములు నిష్ప్రయోజనములు. శబ్దప్రమాణాన్ని, పదములను బయటనుండి తీసుకురావాలి. నీవు బోధింపబడే శబ్దాలను వింటున్నప్పుడు పేరుకు మాత్రమే నీవు ప్రమాతవు. ఆ ప్రమాతయే "నీవే బ్రహ్మము"ని చెప్పబడినప్పడు అతడు "నేను జ్ఞాతను" - అన్న స్థితిని వదిలివేయాలి. దేహేంద్రియ మనోబుద్ధుల సంఘాతముతో తాదాత్మ్యం చెందిన జ్ఞాతయే (ఆత్మ) జ్ఞానము కలిగినప్పడు లయించిపోతాడు. ఇతర ప్రమాణములన్నింటియందు జ్ఞాత జ్ఞేయవస్తువుతో సంబద్ధమైన కర్తగా కొనసాగుతూనే ఉంటాడు. ఇదే

"నేను బ్రహ్మ" మని చెప్పే శబ్ధప్రమాణానికి మరియు ఇతర ప్రమాణాలకు భేదము. ఇతర ప్రమాణములన్నిటిలోనూ ప్రమాత ఉంటూ ప్రమాణఫలాన్ననుభవిస్తూంటాడు. కాని ఇక్క డ ప్రమాత విశ్రాంతిగా ఆసీనుడై గురుబోధను వింటూంటే, ఆ బోధ ప్రమాతనే బ్రహ్మగా కరిగించేస్తుంది. కాబట్టి ఈ ప్రమాణము పూర్తిగా భిన్నమైనది. దీనిని చక్కగా ఉపయో గించాలి. అందుచేతనే శ్రద్ధ యిక్కడ చాలా ముఖ్యమౌతుంది. "ప్రమాణాన్ని నా మీద పనిచేయనిస్తున్నాన"న్న భావన నీకుండాలి. ఏవిధంగా నీవు వైద్యుణ్ణి నీకు శస్త్రచికిత్స చేయనిస్తావో, ఆతడిపై శ్రద్ధ ఉన్నది కాబట్టి, అదేవిధంగా ఈ ప్రమాణాన్ని నీపై పనిచేయ నివ్వడానికి నీకు శ్రద్ధ ఉండాలి.

ఆత్మ స్వతః వేద్యము; అలుప్తదృక్ - లోపించని చూపుకలవాడు, రెప్పకూడ వేయడు. సదా సాక్షియే. చూడబడే దానిని బట్టి మాత్రమే ఆత్మ సాక్షి. తన స్వరూపంలో అది శుద్ధచైతన్యమే. ఈ స్వతఃవేద్యమైన ఆత్మ బ్రహ్మము. అదే ఉపదేశము. ఈ బోధఫలితం గాఅంతఃకరణలో ఒక వృత్తి ఏర్పడుతుంది. అది అజ్ఞానాన్ని తొలగించి తాను కూడ తప్ప కుంటుంది. "ఇక్కడ ఉన్నదంతా నేనే" నన్న వృత్తియే ఆత్మైక్యబోధ లేదా అపరోక్ష జ్ఞానమ నబడుతుంది. అప్పడప్పడూ "అనుభవము" అనే పదాలు కూడ వాబడడుతుంటాయి. అవికూడ బోధకు ఫలమైన సన్నిహిత గుర్తింపునే తెలుపుతాయి. ఈ జ్ఞానం లేకుండా మోక్షం పొందలేవు.

కానీ ఆత్మైక్యబోధ మాత్రమే మోక్షాన్నిస్తుందని ఎందుకు నొక్కి చెప్తావు. సాధకులనేక మంది ఉన్నారు. వారి రుచులు భిన్నభిన్నమైనవి. కాబట్టి మోక్షం పొందడానికనేక మార్గాలుండాలి. కొంత మందికి పూజ చాలు; మరొకరికి ఆసనము ప్రాణాయామము మొ॥ మరికొంతమందికి మరొక సాధనము - అనేక పద్ధతులున్నవి; వాటిల్లో ఒక దాన్నెం దుకు మన మనుసరించకూడదు ? దీనికి సమాధానం - నిజం, నీకెన్నుకునేందు కవ

కాశములున్నవి.  అనేక సాధనములు లభ్యమవుతున్నవి.  ఈ వివిధములైన సాధనలన్నీ అనుష్ఠించవలసినవి, అందుచేత వాటిల్లో నీకెన్నుకునే అవకాశాలున్నవి.  కానీ మోక్షవిష యంలో ఎన్నుకొనే అవకాశం లేదు.  ఎందుకంటే సమస్య అజ్ఞానానికి సంబంధించినది. జ్ఞానం తప్ప మరేదీ అజ్ఞానాన్ని పటాపంచలు చేయలేదు.  మరియు జ్ఞానము ప్రమా ణము ద్వారా ఉత్పన్నమవుతుంది.

తరువాత శ్లోకము విభ్రాంతి స్థితిని పరిష్కరించడానికి వలసిన జ్ఞానసాధనం గురిం చి చెప్తున్నది:-

5వ శ్లోకము

చిత్తస్య శుద్ధయే కర్మ న తు వస్తూపలబ్ధయే ।
వస్తుసిద్ధివిచారేణ న కిఞ్చిత్ కర్మ కోటిభిః ॥ 11 ॥

కర్మ - కర్మ (కర్మాచరణము); చిత్తస్య - అంతఃకరణయొక్క; శుద్ధయే - శుద్ధి కొరకు మాత్రమే; తు - కానీ; వస్తు ఉపలబ్ధయే - వస్తువు (జ్ఞానం) పొందటానికి; న -  కాదు; వస్తుసిద్ధి - వస్తు ప్రాప్తి; విచారేణ - విచారముద్వారా మాత్రమే; కర్మకోటిభిః -  కోట్లకొ లది కర్మల ద్వారా; న కిఞ్చిత్ - ఏ కొంచెం కూడ లభించదు.

"కర్మ  అంతఃకరణశుద్ధికి  మాత్రమే;  వస్తువు  (జ్ఞానం)  పొందటానికి కాదు.  వస్తుసిద్ధి (జ్ఞానము) విచారము ద్వారా మాత్రమే కలుగుతుంది. కోట్లకొలది కర్మల ద్వారా ఏ కొంచెం జ్ఞానం కూడ కలుగదు".

ఈ శ్లోకము జ్ఞానసాధనలో కర్మస్థానమేమిటో స్పష్టం చేస్తుంది.  ఏ కర్మ ఐనా చిత్తశుద్ధి కొరకే నిర్దేశింపబడ్డదిగానీ జ్ఞానప్రాప్తికి మాత్రం కాదు.  కర్మలంటే శాస్త్రవిహితకర్మలే గాని ఏ కర్మలైనా అనికాదు.  నిషిద్ధకర్మలను వేరు చేస్తుంది.  హోమములు, యజ్ఞములు, జప తపాదులవంటి ధార్మిక కర్మలు - మంచిని పెంచేవి.  ప్రార్థనా యుక్తమైన కర్మలు.

జ్ఞానప్రాప్తి విచారముద్వారా మాత్రమే - వస్తుసిద్ధి విచారేణ, విచారమంటే పదముల, వాక్యముల రూపంలో ఉన్న ప్రమాణాన్ని విశ్లేషించటం, వస్తువు, ఆత్మ నీవే కాబట్టి...పొంద బడే ఉన్నది. కనుక ఆత్మజ్ఞానం పొందడమంటే ఆత్మ అంటే ఏమిటో చూడటమే. ఎవరైతే ప్రమాణాన్ని పరిశీలిస్తున్నాడో అతడే ఆత్మ; ప్రమాణమీ విషయాన్నతడికి తెలపాలి.

విచారవిషయము ఆత్మేనని ప్రమాణము కాదని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. నీవు దర్పణంలోకి చూస్తున్నప్పుడు నిన్నే చూస్తావు గాని దర్పణాన్ని చూడవు. నీ ముఖం చూచుకోవడాని కదొక్కటే మార్గము. మరో విధంగా చూచుకోలేవు. అదేవిధంగా నీవు శాస్త్రాన్నిగాని, శాస్త్రబోధనిగాని చూచేటప్పుడు నిన్నేచూస్తున్నావుగాని, శాస్త్రాన్నిగాదు. శాస్త్రము దర్పణం లాగా ఉపకరిస్తుంది. సత్యజ్ఞానమేదైనా సమ్యక్ ప్రమాణముద్వారా లభిస్తుంది. గానీ మరే ఇతర సాధనముల ద్వారా కాదు. అందుచేతనే ఇక్కడ చెప్పబ డింది - "న కించిత్ కర్మకోటిభిః" శతకోటి కర్మలవల్లనైనా, కనీసం క్షణకాలం కూడ ఆత్మ దర్శనం కాదు.

ఇతరజ్ఞానముల వలెనే ఆత్మ జ్ఞానంకూడ జిజ్ఞాసువులో కొంత పూర్వసంసిద్ధత నాశి స్తుంది. ఆ సంసిద్ధత తెలుసుకోవలసిన విషయంపై ఆధారపడుతుంది. గణితశాస్త్రంలో పై చదువులు చదవాలంటే ప్రాథమిక గణితజ్ఞానం నీకుండాలి. కావలసిన సంసిద్ధత (పరిపక్వత) - ఆంతరంగిక ఎదుగుదల - తానన్వేషిస్తున్న దాన్ని గురించి కొంత అవగా హన - కొన్ని విషయాలు విన్నప్పుడు నిజమే నన్నట్లుగా గ్రహించటం - మొ॥ ఆ సంసిద్ధత లో అంతర్గతమవుతాయి.

కర్మోపాసనల - పూర్వమాచరించేవి గానీ లేక వేదాంతశ్రవణం చేస్తూ అనుష్ఠించేవి గానీ - అంతఃకరణ సిద్ధంచేయటంకోసం ఉద్దేశింపబడినవి. వేదము మోక్షమార్గంలో ఉపకరించే విధములైన కర్మలను, ప్రార్థనలను, ఉపాసనలను బోధిస్తుంది. అవిమాత్రం

పుణ్యాన్ని ఉత్పన్నం చేస్తాయి. సంకల్పం సరియైనదైతే అవి మనస్సుని శుద్ధం చేయటంలో ఉపకరిస్తాయి. ఈ మానసికసంసిద్ధతనే రాగద్వేషములపట్టునుండి విడిపడట మంటారు. రాగద్వేషములు తమని నడిపించేట్లుగా కాక - తాము రాగద్వేషాల్ని నడిపేట్లుగా - ఎవరైతే ఉంటారో - వారి కీస్వాతంత్ర్యముంటుంది. అది కాలాన్ని వినియోగించటం లాంటిది. కాలాన్ని నీవు వినియోగించాలి - లేని పక్షంలో అది నిన్ను నడుపుతుంది కాలాన్ని నీవు వినియోగించుకుంటే నీ వెదుగుతావు; అలాకాక కాలం నిన్ను వాడుకునేటట్లయితే - కేవలం నీ వయసు పెరుగుతుంది. అదేవిధంగా రాగద్వేషాల్ని నీవదుపు చేయాలి. అప్పడే మనసు శుద్ధమవుతుంది - లేకపోతే అశుద్ధంగానే ఉంటుంది.

ఒకసారి మనసు భావోద్రేకాలనుండి విడివడితే, జీవితలక్ష్యం గురించిన వివేచనాశక్తి ఉద్భూతమవుతుంది. దాని గురించిన కొంత స్పష్టతేర్పడుతుంది. ఈ రీతిలో - వేదపూర్వభాగంలో విధింపబడిన ధార్మిక జీవనం - వివేకవైరాగ్యాదులకు మార్గమేర్పరచి - తద్వారా మోక్షేచ్ఛను గూడ కలుగచేస్తుంది. ఇక్కడ చెప్పబడిందదే. కర్మ - చిత్తశుద్ధి కొరకే, గాని, నిత్యప్రాప్తమైన వస్తువు - ఆత్మజ్ఞానం కొరకు- తద్వారా మోక్షంకొరకు కాదు.

6వ శ్లోకము

అతో విచారః కర్తవ్యః జిజ్ఞాసోరాత్మ తస్తునః ।
సమాసాద్య దయాసింధుం గురుం బ్రహ్మవిదుత్తమమ్ ॥ 15 ॥

అతః - అందుచేత; దయాసింధుమ్ - కరుణాసాగరుడైన బ్రహ్మవిదుత్తమమ్ - బ్రహవేత్తలలో నుత్తముడైన; గురుమ్ - సద్గురువును; సమాసాద్య - విధివత్ సమీపించి; ఆత్మవస్తున - ఆత్మ వస్తువు గురించిన; విచారః - విచారం చేయటం; జిజ్ఞాసోః - జిజ్ఞాసువు యొక్క; కర్తవ్యః - కర్తవ్యము.

“అందుచేత జిజ్ఞాసువు బ్రహ్మవేత్తలలో నుత్తముడు; కరుణాసాగరుడైన సద్గురువుని విధివత్ సమీపించి ఆత్మతత్త్వవిచారణ చేయాలి”.

నాకు కావలసింది మోక్షం; కనుక సాధన - మోక్షం కొరకే గాని - ఆత్మజ్ఞానం కొరకు కాదు. కానీ మోక్షానికి, వేదాంతంలో ప్రతిపాదింపబడిన ఆత్మజ్ఞానానికి - మధ్యనున్న సంబంధం స్పష్టంగా తెలియాలి. జ్ఞానము సాధనము; మోక్షము సాధ్యము. ఆత్మనిత్యముక్తమే. కాబట్టి, సాధనమైన జ్ఞానానికి సాధ్యమైన మోక్షానికిగల సంబంధాన్ని చర్చించినప్పుడు నిజానికక్కడ దూరమంటూలేదు. జ్ఞానానికి మోక్షానికి దూరంలేదు. ఆత్మనలా తెలుసుకోవటమే మోక్షము. కాబట్టి ఇక్కడ ఉన్నది కేవలం తెలుసుకోవటమే. అందులకై విచారణచేయాలి - విచార: కర్తవ్యః - విచారమంటే ఆత్రుత, వ్యధపడటం కాదు-పరిశీలించడం.

విచార స్వరూపమేమిటి ? ఒకరు చెప్తారు - “నేనెవరినని ప్రశ్నించుకో, లోపలినుండి సమాధానమొస్తుంద”ని. అంతరంగంలో సమాధానముంటే ముందేవచ్చి ఉండాలి ! ఇన్ని సంవత్సరములురానిది, ఇప్పడెలా రాబోతున్నది ? ఒక వ్యక్తి తన గురించి అజ్ఞాని ఐతే, నేనెవరినని అడిగినంతమాత్రాన “నేను బ్రహ్మమన్న” జ్ఞానమతడు పొందబోవటం లేదు. ఎందుకంటే ఆత్మ బ్రహ్మమయే ఉన్నది. మరియు ఆత్మ మాట్లాడదు. అదేవిధంగా అంతరంగపు లోతులలోకి పోయినంతమాత్రాన ఆత్మని పొందలేరు. అలా అంతరంగపు లోతులలోకి వెళ్ళాలని ప్రయత్నించేవారే ఆత్మ. అనుభవించేదేదీ ఆత్మకంటె భిన్నంకాదు. ఇప్పడున్నదేదో అదే ఆత్మ - కాబట్టి తెలుసుకోవలసిన అవసరమున్నది. అందుకు కావలసిందల్లా ప్రమాణమే.

నా జీవితంలో సాధించతలచుకున్న ధ్యేయములను పరిశీలించినపుడు, నేనన్వేషిస్తున్నది వీటి ద్వారా సిద్ధించదని కనుగొంటాను. నేను క్షేమంగా లేను నేను సాధించతల

చినది కూడక్షేమకరం కాదు. క్షేమంగాలేని నేను క్షేమకరంగాని దేనితో కలసినా అదే స్థితి రెట్టింపవుతుంది. గాని అభయస్థితి లభించదు. "నేను క్షేమంగాలేన"న్నది మౌలికభావన. కానీ శాస్త్రం చెప్తుంది. - "నేను, ఆత్మ - అభయస్వరూపమ"ని. ఆత్మకంటె భయరహితమైనది మరొకటిలేదు. శాస్త్రసారాంశము - "ఆత్మ వికారము చెందదు; కాబట్టి అది సదా అభయస్వరూపమే. ప్రపంచంలో ఏ మార్పు జరిగినా అది అవికారి ఆత్మమూలంగానే. ఆత్మ ఆధారము - ఇతరమంతా దానిపై అధ్యారోపణ మాత్రమే. ఏ వస్తువైనా స్థిరత్వాన్ని కలిగిఉందంటే - అది ఆత్మప్రసాదించిందే. కాలబద్ధమై మారుతున్న వస్తువులు కూడ, తాత్కాలికంగా స్థిరంగా నున్నట్లు గోచరిస్తుంది - అదికూడ ఆత్మసత్తాద్వారా లభించిందే. ఆత్మ అచల స్వరూపము.

ఆత్మ గురించి కొంత ఆపాతజ్ఞానం కలుగవచ్చు, పెద్దలనుండి వినటం ద్వారా లేక సారభూతమైన వాక్యాలు చదవటంద్వారా గానీ, జీవితం బాధామయంగా ఉన్నప్పటికీ - అప్పడప్పడూ క్షణికానందపు అనుభవాలున్నవి. ఆ క్షణాలలో వ్యక్తి - తననితాను - అధికప్రకాశంలో చూచుకోగలుగుతాడు, బాగా ఆశించదగిన ప్రకాశంలో. అందుచేత అతడికి తనను గురించి మరో దృష్టి అవగాహన ఏర్పడుతుంది. తానాశించేదృష్టి - తానున్న స్థితినుండి ఉన్నతంగా ఉండగలిగే - లేదా పూర్తిగా ముక్తుడయ్యే -అవకాశాన్ని చూస్తాడు. అప్పడెవరైనా ప్రవచనంలో "నీవు ముక్తుడవే" నని చెప్తే అది నిలుస్తుంది. నీ కదిచాలు; నీవు లేచివెళ్ళిపోవు; ఉండి వినాలనిపిస్తుంది. సుఖానుభవక్షణాలలో ఏర్పడిన అంతర్ముఖత్వం మూలంగా ఆ బోధ నీకు సంగతమైన దనిపిస్తుంది. ఈ అనుభవాలే లేకపోతే, ఆరంభంలో బోధతో, సంబంధమేర్పడేదికాదు. ఆదిలోనే బోధతో సంబంధమేర్పడకపోతే తరువాత మరెప్పడూ నీకు కలుగబోదు. గురుబోధ నీ సుఖదుఃఖాను భవాలన్నిటినీ

విశ్లేషిస్తుంది. ఆ విధంగా బోధతో నీవు సంబంధం పెట్టుకుంటావు. ఈ సంపర్కం మూలంగానే ఎవరైనా జిజ్ఞాసువవుతారు. తనని తాను తెలుసుకోవాలని కోరుకుంటారు.

తనని తాను తెలుసుకోవాలనే కోరిక సామాన్యమైనది కాదు. వ్యవహార యోగ్యంగా నడిచే వ్యక్తులకది వెఱ్ఱితనంగా కూడ అనిపిస్తుంది. “నన్ను నేను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాన”ని - అటువంటి వారికి చెప్పటం కూడపరిణతిరాహిత్యంతో మాట్లడటం అనిపిస్తుంది - బుద్ధివికాసం లేదని సూచిస్తుంది. బుద్ధిపరిణతి తేనివా రీజ్ఞానం పొందలేరు. స్వస్వరూపం తెలుసుకోవటమన్నది ప్రశాంతమైన పని. ఇది నీ వెంతనిశ్చలంగా ఉన్నావో నన్నదానిమీద - మరియు నీ ప్రయత్నం ఎంత పరిణతితో కూడినదోనన్న దానిమీద ఆధారపడుతుంది. త్వరపడి బలవంతంగా ముందుకు సాగించలేవు. గులాబి మొగ్గని పుష్పంగా వికసించమని నీవు బలవంతం చేయలేవు. ఒక్కొక్కరేకుని చేతులతో విడదీయవచ్చు కానీ అదృష్టహస్తముల ద్వారా తెఱువబడిన దానికంటె ఈ పుష్పం తప్పకుండా భిన్నంగా ఉంటుంది. ఆ చేతులు మొగ్గను నిశ్శబ్దంగా వికసింపచేస్తాయి తమకు అవసరమైన సమయాన్ని తాము తీసుకుంటూ, అదేవిధంగా ఆత్మను తెలుసుకోవటం కూడ కృపాపూర్ణమైన శ్రుతిమాత హస్తములక్రింద జరిగే ప్రశాంతగంభీరమైన వికసనవిధానమే.

జిజ్ఞాసువు తనస్వరూపాన్ని - విచారించే వాని లోపల తత్త్వాన్ని - తెలుసుకోవాలంటే తనమీద తానొరిగి పోయినట్లుగా ప్రశాంతంగా శ్రుతిబోధకనుకూలుడై ఉండాలి. ప్రత్యక్ష - అనుమానాలవంటి ఇతర ప్రమాణములు శ్రుతిబోధకనుకూలుడై ఉండాలి. ప్రత్యక్ష - అనుమానాలవంటి ఇతర ప్రమాణములు ప్రమాతృస్వరూపాన్ని తెలుసుకోవటానికి ఉద్దేశించబడినవి కావు. అవి ప్రమాతవిషయాకరించగలిగిన వస్తువులను తెలుసుకోవటానికి ఉపకరిస్తాయి.

ఆత్మ ప్రత్యగాత్మ అంటే అంతరాత్మ అని పిలువబడుతుంది. నీవు విషయీకరించలిగిన ప్రతి వస్తువులోనూ ఉన్నది. అది కర్తయొక్క స్వరూపమే ఇక్కడ కూడ పొరబడుతుంటారు. 'లోపల' అన్నపదం తికమక పెట్టి విభ్రాంతినికలుగజేసి అంతరంగపు లోతులలో ఎక్కడో ఆత్మ ఉన్నదనే నిర్ణయానికొస్తారు. దాన్ని కనుగొనటానికి నదిలో దూకినట్లుగా ఆ లోతులలోకి పోవాలని భావిస్తారు. ఈ ప్రత్యగాత్మకు స్థానాన్ని గూడ ఇస్తారు. హృదయానికి కుడివైపునని, అదే వ్యక్తి ఆత్మ సర్వవ్యాపకమని కూడ చెప్తారు. సర్వవ్యాపకమైన ఆత్మ సర్వత్రా లభించవలదా ? అంతే గాక అది నిత్యమైతే ఇప్పడుండాలి! అది లేదన్నదెప్పడూ లేదు. అంతరంగపులోతుల్లో ఉంటే మాత్రం అది నిత్యము కాదు, సర్వవ్యాపకం కానేరదు. కాబట్టి ప్రమాతృ ప్రమాణములద్వారా విషయీకరించే విషయాలను దృష్టిలో నుంచుకొని 'ప్రత్యక్' అన్న పదం వాడబడ్డది. మరి ప్రమాతృత్వము ఆత్మచేత పొందబడిన ఒక అవస్థ. ప్రమాతలోని స్వరూపం కేవలం తెలుసుకోవలసిన విషయమే. అది బ్రహ్మమై ఉన్నది. దీన్ని నీవర్థం చేసుకోవాలి. అంతరంగపు లోతులలోకి, దూకటం ద్వారా "నేనే బ్రహ్మన" ని పరిచయం చేసుకోవటానికి ఆత్మ ఎదురుచూస్తున్నట్లుగా నీవేమి కనుగొనవు.

ఆత్మ స్వతఃప్రకాశ మైనదైనా ఆ విషయంలో ఎంతో తికమక ఉంది. ఈ విభ్రమను సరిచేయటానికి విచారణద్వారా ఆత్మజ్ఞానం పొందాలి. ఈ విచారానికి నీకు శ్రుతితప్ప అన్య ప్రమాణము లేదు. కనుక నీవు శాస్త్రమునధ్యయనం చేయాలి - కానీ స్వతంత్రంగా కాదు. ఎందుకని ? వేదభాషయైన సంస్కృతజ్ఞానం నీకున్నా - శ్రుతిని నీవు స్వతంత్రంగా చదివితే - నీకు తెలిసినంత పరిధిలోనే అర్థంచేసుకోగలవు. నీకు తెలిసిన దానిని మించి నీవు చూడలేవు. ఇప్పడు నీకు తెలిసినదానికంటె కొంచెం ఎక్కువగా తెలియవచ్చు కానీ "కొంచెం అధికమన్నది" చాలదు. నీకేం కావాలంటే - శాస్త్రం బోధించే

విషయం తెలిసినట్టి మనస్సు (జ్ఞానవృత్తి) నీకు కావాలి విషయం నీకు ముందే తెలిస్తే శాస్త్రమక్కరలేదు. నీకు తెలియక పోతే శాస్త్రము తెలిసిన వ్యక్తి నీకు కావాలి - దాన్ని నీకు విశదీకరించడానికి.

ఎవరైనా వాదించవచ్చు - "అతడు జ్ఞానం పొందగలిగితే నేను కూడ పొందగలను" అని. నిజమే. కానీ అతడాజ్ఞానాన్ని మరోవ్యక్తి (వ్యక్తుల) నుండి పొందాడు. ఈ గురువుల గొలుసు / వరుసకు ఆదిలో బాహ్యసహాయం లేకుండా ఈ జ్ఞానంపొందిన వ్యక్తంటూ ఒకరుండాలి. ఆ వ్యక్తి భగవానుడే. ఆదిలో భగవానుని చేతనే ఈ జ్ఞానము ప్రకటింపబడి ఉండాలి.

ఎవరైనా భగవద్గీత నర్థం చేసుకోవాలనుకున్నారనుకోండి, భగవానుని బోధలో ప్రతి శ్లోకాన్ని వారర్థం చేసుకోవాలి. సంపూర్ణంగా భగవదుపదేశాన్నర్థం చేసుకుంటే తప్ప ఏ శ్లోకమూ పూర్తిగా అర్థంకాదు. శ్లోకం తరువాత శ్లోకంగా ప్రతిశ్లోకాన్ని అర్థం చేసుకోకపోతే పూర్ణబోధకాదు. ఈ అన్యోన్యాశ్రయ దోషాన్ని తొలగించటానికి, తెలియవచ్చునని భావించిన వ్యక్తి సమీపించాలి. అందుకే చెప్పబడింది, "సరియైన భావంతో గురువుని సమీపించి తెలుసుకుందురుగాక" అని.

గురువుకుండవలసిన లక్షణములు ఏవి ? అతడు కరుణాసముద్రుడు; బ్రహ్మవేత్తలలో నుత్తముడు. అజ్ఞానాన్ని అదృశ్యం చేసేవాడు గురువు. ఆత్మే బ్రహ్మమని తెలిసినవాడు బ్రహ్మవిద్ అని పిలువబడుతాడు. ఇక్కడ ఉత్తమ అంటే - గొప్ప అనికాదు. అపరిచ్ఛిన్న బ్రహ్మను తెలిసినవారిలో - ఎవరూ - ఎవరినీ మించి గొప్పవారు కారు. వారిలో ప్రతి ఒక్కరూ - "నేనే బ్రహ్మమని" తెలిసినవారే. కాబట్టి ఉత్తముడంటే - బ్రహ్మవిత్తని గుర్తింపబడ్డవారు. (బ్రహ్మవిదుడవటంవల్ల ఉత్తముడని పిలుబడేవాడు - అనువాదకుడు)

బ్రహ్మవేత్త మొదట్లో ఎలా గుర్తింపబడతాడు ? శిష్యుల మాటలు నీవు ప్రమాణంగా స్వీకరించలేవు. ఎందుకంటే - ప్రతిశిష్యుడు “మా గురువుగారు అవతార పురుషుడ” నే చెప్తాడు. కనుక బ్రహ్మవేత్తను గుర్తించడం కష్టమే. ఒక వ్యక్తి శ్రోత్రియుడో కాడో నీవు గుర్తించగలవు. ఇక్కడ ‘గురు’ వన్న పదం శ్రోత్రియుడుగాను - బ్రహ్మవిత్’ పదము బ్రహ్మనిష్ఠుడుగాను - తీసుకోవచ్చు. “ఎవరి నిష్ఠ ఐతే (పరాయణత) బ్రహ్మజ్ఞాన సాధనలో తప్ప - మరిదేనియందునూ లేదో “అతడిని - బ్రహ్మనిష్ఠుడనిచెప్పచ్చు అంటే - అతడు జ్ఞానానికే పూర్ణంగా అంకితమైనాడు. మరేదీ పట్టనటువంటి సన్యాసి అతడు. ఒకడికి కేవలం జ్ఞానపరాయణత ఉందా లేదా అనేది సులువుగా కనుక్కోవచ్చు. బ్రహ్మనిష్ఠుడే ఇక్కడ “బహ్మవిదామ్ ఉత్తమః” అని చెప్పబడ్డాడు. నీ అజ్ఞానాన్ని తన బోధద్వారా తొలగించగలడో లేదో అనే దానిద్వారా అతడు గురువు అవునా కాదా అని పరీక్షించుకోవచ్చు.

జ్ఞానముండి కూడ బోధించని మహాత్ములు చాలా మంది ఉన్నారు. ఒక బ్రహ్మవిదుడు ఎందుకు ఉపదేశించాలి అంటే - కారణం ఏదీలేదు. తాను బ్రహ్మమని తెలుసు, నీవు కూడ బ్రహ్మమని అతడికి తెలుసు. కాబట్టి అతడి దృష్టిలో నీకు సమస్యే లేదు. కాని నీ దృష్టిలో నీకు సమస్య ఉన్నది. నీకు సమస్య ఉన్నదని గురువంగీకరించాలి. ఇదే గొప్ప విషయం, తరువాత సమస్యను పరిష్కరించాలి. పైగా అది నిజమైన సమస్య కూడ కాదు. అది, అజ్ఞానసర్పము - అంటే ఊహించుకున్న సర్పము - కాటువేయటం వలన ఏర్పడిన సమస్య. నిజమైన సర్పం కాటువేస్తే అతడికి వెంటనే సహాయం కావాలి. నీ కతిముఖ్యమైన పని ఉన్నా, దాన్ని వదిలివేసి ఆ వ్యక్తిని వైద్యానికై తీసుకువెళ్ళాలి. దీనికై నీకు దయ కావాలి. మరి నిన్ను సహాయమడిగే వ్యక్తి తాటిపై చూచిన కల్పిత సర్పకాటు తిన్నవాడైతే - అతడికి నిజంగా పాముకాటు సమస్యలేదు. ఐనప్పటికీ - తనకి గంభీరమైన సమస్య ఉందని భావిస్తాడు. అతడికి సహాయం కావాలి - నీ సహాయం కావాలి.

నిజంగా  సమస్య లేదని తెలిసికూడా, అతడికి ఉన్నదన్నట్లు అంగీకరించి ఆ సమస్యను అతడుపరిష్కరించుకొనటానికి నీవు సహాయం చేయాలి.  దీనికి నీవైపునుండి అధికంగా కరుణ అవసరము.  గురువు నిజంగా కరుణాసముద్రుడు కావాలి.  అతడి దృష్టిలో నీకసలు సమస్యే లేదు.  అతడు "నీకే సమస్య లేదయ్యా ! శోకించవలసిన అవసరం లేని దానికి నీవు శోకిస్తున్నావ"ని అంటే అది సరిపోవాలి.  కాని సంవత్సరాలపాటు, రోజుల తరబడి, పాతాలమీద పాతాలు, అంటే చెప్పిందే చెప్పాలి.  ఏదో ముందుకు సాగుతున్నట్లు చెప్పతూ ఉండాలి.  మరల మరల బోధించాల్సిన అవసరం ఏర్పడుతుంది.  పునః పునః బోధించాలంటే అతడికి సముద్రమంత కరుణ ఉండాలి ! అటువంటి సద్గురువుని చేరి జిజ్ఞాసువు వస్తువిచారణ చేయాలి.

# అధికారిత్వము

7 వ శ్లోకము

అధికారిణమాశాస్తే ఫలసిద్ధిర్విశేషతః ।

ఉపాయా దేశకాలాద్యాః సన్త్యస్మిన్ సహకారిణః ॥ 14 ॥

ఫల సిద్ధిః - ఆశించిన ఫలసిద్ధి; విశేష తః - విశిష్టమైన; అధికారిణమ్ అధికారిని; ఆ శాస్తే - ఆశిస్తుంది; దేశకాలాద్యాః - దేశకాలాదులు; అస్మిన్ - ఇందులో; సహకారిణః - సహకారి; ఉపాయాః - సాధనములు; సంతిః - అగును.

"ఆశించిన ఫలసిద్ధికై విశిష్ట అధికారి అవసరము. దేశకాలాదులందుకు సహకారి సాధనములగును."

ఈ శ్లోకము మోక్షమునకు సహకారి సాధనములను వర్ణిస్తుంది. మోక్షం పొంద టానికటువంటి వనేకములున్నవి. దేశము, కాలము మొ॥వి. బ్రహ్మముహూర్తంలో మేల్కొనుట మోక్షానికి ఉపయోగిస్తుంది. లేదా మోక్షానికై సంన్యసించే కాలాన్ని మ నం తీసుకోవచ్చు. అత్యంత యవ్వన దశలోనే సంన్యసించవచ్చును. శ్రుతి చెప్తుంది - "ఏ రోజైతే నీకు వలసిన విధంగా వైరాగ్యం కలుగుతుందో ఆ రోజే నీవు సన్యాసం స్వీకరించవచ్చు" లేదా సంప్రదాయపరంగా బ్రహ్మచర్యాశ్రమం పూర్తిచేసి గృహస్థాశ్ర మంలో ప్రవేశించి దాన్ని చక్కగా ఆచరించి, వానప్రస్థంలో ప్రవేశించి, తదనంతరం సంన్యాసాశ్రమం తీసుకొనవచ్చును. దేశకాలాదులని చెప్పటంతో గురూపసదనము, శుశ్రూషలుకూడా చెప్పినట్లే 'శ్రు' ధాతువుకి శ్రవణం చేయటమన్న అర్థంకూడ ఉన్నది. కాబట్టి శుశ్రూషాఅంటే శ్రవణం చేయడమని అర్థం. అది జిజ్ఞాసయేకానీ శుశ్రూషా అంటే రూఢంగా గురుసేవనము. తీర్థయాత్రలు ఆసనప్రాణాయామములవంటి యో గాభ్యాసములు, నిత్యదైవపూజలు మొ॥వన్నీ క్రమబద్ధమైన జీవితం గడపటానికి, ఆత్మో న్నతిని పొందటానికి మంచివి. అవి ప్రధానములే కాని, అవే లక్ష్యములు కావు. వేదాంతబోధ లేకుండా మోక్షం సిద్ధించదు. ఆ బోధ ఫలించటానికవన్నీ ఉపకరి

స్తాయి. దేన్నీ నీవు నిష్ప్రయోజనమని తీసివేయలేవు.

వేరే తావులలో చెప్పిన విషయాలలో నున్న పరిమితులను శాస్త్రం ఎత్తి చూపినప్పుడల్లా సాధారణంగావాటిపట్ల మనలో సవతితల్లి దృష్టి ఏర్పడుతుంది. పూజలు, జపాలు మొ॥ ధార్మికనియమనిష్ఠల పట్ల మనకి చిన్నచూపేర్పడుతుంది. ఇది చాలా ప్రమాదకరమైనది. ధార్మికవ్రత నియమనిష్ఠలు అత్యంతావశ్యకములు. అవే ఈ జ్ఞానం పొందటానికర్హమైన అధికారి లక్షణాల నిస్తాయి. "రోజూ మూడు పూటలా తినటంవలన సంస్కృతం రాదని" చెప్పాననుకోండి, అప్పుడు తినటం మానివేసి, 4,5, రోజుల తరువాత చిక్కిశల్యమై ఈ సంస్కృతం రావటం లేదంటే ఏమని చెప్పాలి ? భుజించటం మానివేస్తే సంస్కృతం ఎలా వస్తుంది?

కాలము, స్థలము, గురుసేవ మొ॥వన్నీ పరోక్షంగా ఉపకరిస్తాయి. కానీ జ్ఞానప్రాప్తి రూపంలోనున్న మోక్షము ప్రధానంగా అధికారి లక్షణాలను కోరుతుంది. వివేకము, సాధ్యసాధనముల గురించిన పరిశీలనా శక్తి, వైరాగ్యము మొ॥ కోరుతుంది. ఇతరములన్నీ బాహ్యములు కాని అధికారిత్వం ఆంతరంగికము, జ్ఞానము మనసులోనే కలగాలి. అందుకై మనసు సిద్ధంగా ఉండాలి. వస్తువుని (బ్రహ్మమును) గుర్తించటానికి కావలసిన శక్తి సామర్థ్యములు, గుణములతో కూడి ఉన్నప్పడే మనసు సిద్ధముగా ఉన్నట్లు.

ఈ జ్ఞానము పొందటానికి ప్రధాన సాధనము వేదాంతశ్రవణం. కాని సంశయాలన్నిటి నివృత్తి కోసం యుక్తినుపయోగిస్తూ మననం చేయాలి. బోధనాసంప్రదాయము అధికారిత్వాన్ని ముఖ్య మైనదిగా నొక్కి నొక్కి చెప్తుంది. అలా చేయకపోతే, ఎవరైనా కొంతకాలం వేదాంతశ్రవణం చేసి, "వేదాంతము పనిచేయటం లేదు, అందుకని అది ప్రమాణము కాదని" చెప్పవచ్చు. వేదాంతము ప్రమాణమైతే అది జ్ఞానము నందించాలి. అదెలాగంటే - కన్నులు చక్కగా చూడగలిగే శక్తి కలవై తగినంత ప్రకాశమున్నప్పుడు విషయము చూడబడాలి. అలాగే ఉపదేశరూపంలో నున్న ప్రమాణ

వ్యాపారానికభిముఖంగా ఉన్నప్పుడు ఎటువంటి అంతరాయము లేకుండా ఆత్మ గుర్తించబడగలగాలి. జ్ఞానం కలుగకపోతే వేదాంతాన్ని కొట్టి పారవేసి, మోక్షం కోసం మరేదో చేయడం సరైనది కాదు. వేదాంత శ్రవణం చేసింతరువాత, ఇంకా జ్ఞానం కలుగకపోతే మరల శ్రవణం చేయాలి. ఉదాహరణకి- కన్నులనుపయోగించి కూడ రంగుని చూడలేకపోతే కన్నులను బాగుచేసుకోవాలి. “నేను మరో ఇంద్రియము ద్వారా ప్రయత్నిస్తాన”ని ఎవరూ అనలేరు. మరో మార్గం లేదు. కన్నులను సరిచేసుకునే చూడాలి. అదేవిధంగా వేదాంతశ్రవణం ఫలించక పోతే, అది ఫలించేట్లుగా చేయాలి. గత్యంతరం లేదు. అధికారిత్వాన్ని పొందవలసి ఉంది.

8 వ శ్లోకము

సాధనాన్యత్ర చత్వారి కథితాని మనీషిభిః ।
యేషు సత్స్వేవ సన్నిష్ఠా యదభావే న సిధ్యతి ॥ 18 ॥

అత్ర - ఈ సందర్భంలో; చత్వారి - నాలుగు; సాధనాని - (జ్ఞానార్హతను కలిగించే) సాధనములు; మనీషిభిః - తత్త్వదర్శులచే; కథితాని - చెప్పబడినవి; ఏషు సత్సు ఏవ - అవి ఉన్నప్పుడు మాత్రమే; సన్నిష్ఠా - సద్వస్తువు యందు సంశయరహితమైన నిష్ఠ (సిద్ధిస్తుంది); యదభావే - అవి లేనప్పుడు; న సిధ్యతి - సిద్ధించదు.

“ఈ సందర్భంలో జ్ఞానార్హతను చేకూర్చే నాలుగు సాధనములు వేదాంత తత్త్వదర్శులచే చెప్పబడినవి. అవి ఉన్నప్పడే దృఢజ్ఞాననిష్ఠ కలుగుతుంది. లేకపోతే కలుగదు”

ఈ జ్ఞానానికి నిన్నర్హుణ్ణి చేసే సాధనములు నాలుగు అని మనీషాకలవారన్నారు. మనీషా అంటే శ్రుతి దృష్టి గూర్చిన స్పష్టమైన జ్ఞానము, మరి మనీషి అంటే ఆ జ్ఞానమున్నవారు. అధికారిత్వము, మొ॥ వాటి గురించి భిన్నదృక్పథములున్న వారనేకమంది ఉన్నారు. అందుచేతనే శ్రుతి “మనీషి” అన్నపదం వాడింది. పూర్వమీమాంసకుడు

చాలా మంచివైదికుడు, నిష్ఠకలవాడు, అతడికి మోక్షమంటే స్వర్గానికి వెళ్ళటమే, ఆ మోక్షము కర్మద్వారానే లభిస్తుందని భావిస్తాడు.

పూర్వమీమాంసకుల సిద్ధాంతప్రకారం సంపూర్ణవేదము నీకు లేని అనేకవిషయాలను సమకూర్చిపెట్టటానికి మాత్రమే ఉద్దేశింపబడింది. పూర్వమీమాంసంలో ఒక సూత్రం కూడ ఉంది -- "ఆమ్నాయస్య క్రియార్థత్వాత్ ఆనర్థక్యం ఆతదర్థానామ్" - వేద వాక్యములన్నీ కర్మను ప్రబోధించటానికే ఉన్నవి కావున, కర్మగురించి బోధించని వాక్యములు నిష్ప్రయోజనములే. కాని వేదంలో సత్యాన్ని బోధించే - "తత్త్వమసి" "అదేనీవు" లాంటి వాక్యములున్నవి. మీమాంసకుల దృష్టిలో అటువంటి వాక్యములు వేదతాత్పర్యవిషయాన్నేమీ బోధించవు. వారి సిద్ధాంత ప్రకారం వేదమంతా కూడ నిన్ను విహితకర్మలు నిర్వర్తించేట్లు చేయటం లేదా కొన్ని కర్మలు చేయకుండా నిషేధించటం. వేదములో కొన్ని వాక్యాలు నీవు చూస్తావు. "సోరోదీత్" "అతడు (అగ్ని) రోదించెను." అటువంటి వాక్యాలు చేయవలసిన ఏ కర్మను బోధించవు. గతంలో జరిగిన సంఘటనను తెలియజెప్పే వాక్యమే అది. కాబట్టి అటువంటి వాక్యాల్ని ప్రధానకర్మతో కలిపి సరిగా అర్థంచేసుకోవాలి. 'బర్హిషి రజతం న దేయమ్' యజ్ఞములో వెండిని దానం చేయరాదు అన్న వాక్యమొకటున్నది. ఎందులకు ? అగ్ని రోదించినపుడు ఆ కన్నీరు రజతమైంది. అందుచేత ఎవరైనా యజ్ఞంలో రజతమును దానమిచ్చినట్లైతే, అతడు సంవత్సరం లోపల ఎంతో కన్నీరు కార్చవలసి వస్తుంది. అందువలన "వెండినిదానమివ్వ వద్దని" చెప్పబడింది. దానర్థము "నీవు పురోహితులకు స్వర్ణము దానముగా నీయవలెన" ని ఆ వాక్యము నీవిధంగా చదవాలి, అర్థంచేసుకోవాలి.

ఏ కర్మలోనైనా ప్రధానవాక్యం నిన్ను కర్మ చేయమని చెప్తుంది. దాని ఫలంగురించి కానీ, ఫలాన్నందించే సాధనలగురించి కానీ కొన్ని వాస్తవాలను చెప్తూ కొన్నివాక్యాలుండవచ్చు. అలాంటి వాక్యాలను అర్థవాదములని లేక వాక్యశేషములని అంటారు. ఈ వాక్యాలకు భిన్నమైన - స్వతంత్రమైన విషయమంటూ ఉండదు. ప్రధానకర్మను

బోధించే వాక్యంతో కలిపి - ఆ వాక్యాలు చదవాలి. ప్రధాన కర్మనర్థం చేసుకోవటాని కీ సంబంధిత వాక్యాలుపకరిస్తాయి.

ఉపనిషత్తు బోధిస్తుంది “ఈ ఆత్మ బ్రహ్మము” అని. మీమాంసకులకిది కేవలమర్థ వాద వాక్యమే. వారీ విధంగా చెప్తారు - “కర్మననుష్ఠించే ముందు, కర్త - యజమాని, తాను బ్రహ్మమని భావించాలి. అందువలన ఫలము అధికశక్తివంతమౌతుంది.” కనుక అది సత్యబోధకవాక్యమైనా - దానిని కర్మాంగముగా అర్థం చేసుకోవాలి. లేదా ఈవాక్యాల్ని - “ఆత్మ బ్రహ్మమని మీరు ధ్యానింతురు గాక” యనే అర్థమిస్తున్నట్లుగా - ఉపాసనము విధించే స్వతంత్రవాక్యములు స్వీకరించవచ్చును. ఈ ఉపాసనచేయటంవలన నీకు స్వర్గంలాంటి లోకాన్నిచ్చే విశిష్టపుణ్యం లభిస్తుంది. ఉపాసన మానసిక వ్యాపారముకాబట్టి - ఉపనిషత్తులను కర్మకాండలో భాగంగానో - లేదా వివిధ రకములైన ధ్యానములను విధించే శాస్త్రముగానో- గ్రహించవచ్చు. సిద్ధవస్తు ప్రతిపాదన మాత్రమే విషయముగాగలదని వేదములో ఏ వాక్యమునూ పూర్వమీమాంసకు లంగీకరించరు. దీనివలన వారికి వేదాంతదృష్టి సరిగా అర్థముకాలేదని విశదమవుతుంది. వేదాంతము - నిన్ను ఏదైనా కర్మచేయమని కోరుతున్నదో- లేక ఏదైన విషయాన్ని తెలుసుకోమని కోరుతున్నదో - నీకేమీ మంచి నొలిగించదు. నీవేదైనా చేయాలి. కర్మచేయకపోతే నీవేదీ పొందలేవు. మీమాంసకుల సిద్ధాంత ప్రకారం మోక్షంగూడ కర్మఫలమే.

ఇంకనూ మీమాంసకులీవిధంగా అభిప్రాయపడుతుంటారు. వాక్యములు క్రియాప్రత్యయముల మీద కేంద్రీకృతమై ఉంటాయి. వాక్యములో ధాత్వర్థము ప్రధాన మైనప్పటికి - అది కేవలం ఏ రకమైన కర్మ చేయాలో చెప్తుంది. కాని వాక్యముమాత్రము - ప్రత్యయార్థము ద్వారా తెలుపబడే కర్మమీదే - ఆధారపడుతుంది. ఉదాహరణకు ‘నమతి’ నమస్కరిస్తాడు - అనుచోట - ‘తి’ ప్రత్యయము కర్మను బోధిస్తుంటే - ‘నమ్’ ధాతువు - సమస్తవేదము - ఈ క్రియాప్రత్యయములమీదే ఆధారపడియున్నది. ఇతర

ములన్నీ ఈ ప్రత్యయములకు సంబద్ధమై ఉన్నవి. సిద్ధవస్తువుని బోధించే స్వతంత్ర వాక్యమొక్కటిని లేదు. ఒకచో అటువంటి వాక్యములుంటే - వాటికి స్వతఃగా అర్థమేమీ లేదు. కానీ వాటిని కర్మతో సంబద్ధమైనవానినిగానో - లేక ఉపాసనలను ప్రతిపాదించే స్వతంత్రవాక్యములుగానో - గ్రహించవచ్చు.

ఇటువంటి వాదనలను ఖండించటానికే - విశిష్టఅధికారము కలవారికి మాత్రమే జ్ఞానమని - శాస్త్రం చెప్తుంది.

ప్రాప్తించే అవకాశములుండి బీజావస్థలో నుండి - ఇంకా పొందబడని ఫలాన్నుత్పన్నం చేయటానికై - కర్మ నిర్దేశింపబడుతుంది. కాని "నీవే బ్రహ్మము" అని చెప్పినప్పడు - అందులో ఉత్పన్నమయ్యేదేమీ లేదు. కాబట్టి మీమాంసకుల దృష్టిలో ఈ వాక్యము వ్యర్థము. కానీ ఏదోవిధంగా- ఈ వాక్యమును ఉపయోగించాలి కనుక - అర్థవాదముగా వాడబడుతుంది. వేదాంతి దీనిని కొట్టివేస్తాడు. ఎందుకంటే - వాక్యము కర్మపరంగానే ఉండాలన్న నియమమేమీలేదు. వేదము ఒక ప్రమాణము. ప్రమాణమన్నది అర్థవంతమై - ఫలాన్నిచ్చేదిగా ఉండాలి. అదే సమయంలో నీకది అనధిగతమై (తెలియనిదై) ఉండాలి. ఆత్మే బ్రహ్మమన్న సత్యము నీకు తెలియదు. ఆ జ్ఞానమునకు సాధన చతుష్టయమున్నవాడే అధికారి కాగలడు. అతడికి కర్మఫలమునందు ఇచ్ఛలేదు. గనుక కర్మకధికారికాడు.

సాధనచతుష్టయము - వివేకము, వైరాగ్యము, శమాదిషట్క సంపత్తి ముముక్షుత్వము - కర్మానుష్ఠానమున కవసరములేదు. సోమయాగము అనుష్ఠించునతనికి శమము, దమము మొ॥ ఉండవలెనని శ్రుతి చెప్పటలేదు. కాబట్టి ఈ సాధనచతుష్టయమున్నవానికి భిన్నవిషయమున్నదని వెల్లడగుచున్నది. ఆ విషయము - ఇతర ప్రమాణములద్వారా అదిగతమగునో కాదో - పరిశీలించ వలెను. ఆత్మ బ్రహ్మము కాబట్టి - అది సిద్ధవస్తువే. కాని ఇంకను అనధిగతమే. మరియు ప్రత్యక్ష, అనుమానము మొ॥ ఇతర ప్రమాణముల కనధిగతమే. అంతేకాక, ఈ జ్ఞానముచే - నీకు ధర్మార్థ

కామ పురుషార్థములచే లభ్యంకాని - ముక్తి లభిస్తుంది. ఆ విధంగా మోక్షము ఈ జ్ఞానంద్వారా లభ్యమయే భిన్నపురుషార్థము. మోక్షము పొందటంద్వారా ధర్మార్థకామ ములద్వారా పొందగలిగే దానికంటె అధికమైనది పొందినట్లే కాబట్టి - మోక్షమే నిజ మైన పురుషార్థము.

"ఆత్మయే బ్రహ్మము" - అన్న గ్రంథవిషయమునకు మోక్షమే ఫలము. శాస్త్రమునకు విషయమునకు మధ్యగల సంబంధము ప్రతిపాదక - ప్రతిపాద్య సంబంధము. శాస్త్ర ము ప్రతిపాదకము- తెలుపునది. విషయము ప్రతిపాద్యము - తెలుపబడేది. "ఆత్మే బ్రహ్మమ" న్న విషయమునకు ఫలమైన మోక్షమునకు మధ్యనున్నది సాధన - సాధ్య సంబంధము. కనుక వేదములో భాగమైనప్పటికి - వేదాంతము భిన్నవిషయకము; ఫలము మోక్షము, మోక్షవిషయంలో మనీషులు - తత్త్వజ్ఞానులు సాధనచతుష్టయ ము గురించి వక్కాణిస్తుంటారు.

ఈ సాధనములకు ప్రత్యామ్నాయములున్నవా ? లేవు. "యేషు సత్సు ఏవ సన్నిష్ఠా" ఈ అధికారలక్షణములున్నప్పడే సదాత్మజ్ఞాననిష్ఠ కలుగుతుంది. సన్నిష్ఠా అంటే అస్పష్ట త లేని సంశయరహితమైన సద్‌బ్రహ్మజ్ఞానము. ఈ అర్హతలు లేకపోతే సన్నిష్ఠప్రాప్తిం చదు - 'యదభావే న సిద్ధ్యతి' - కాబట్టి అధికారి ఐనప్పడే - సన్నిష్ఠ కలుగుతుంది.

కాని అధికారి కావటమే నీకు మోక్షాన్నివ్వదు. జ్ఞానమెప్పడూ తనంత తానుగా రాదు. అది శ్రుతిసహాయంతో చేసే విచారణవలన జనిస్తుంది. ఏ జ్ఞానమైనా జ్ఞాన సాధనము - ప్రమాణముద్వారా మాత్రమే జనిస్తుంది. భూమ్యాకర్షణశక్తి ఎల్లప్పడూ ఉన్నది. పక్వఫలమెప్పడూ నేలరాలుచునే యున్నది. కాని న్యూటన్ ముక్కుపై ఆపిల్ పడినప్పడే అతడాలోచించటమారంభించి భూమ్యాకర్షణశక్తిని కనుగొన్నాడు. ఈ సమస్యలో అతడు మునిగి ఉన్నాడు. ఈ సంఘటన అతడి ఆలోచనాశక్తిని ప్రేరేపిం చినది. విచారముద్వారా అతడు భూమ్యాకర్షణశక్తిని నిర్ణయించగలిగాడు. నీ మ నసు సిద్ధంగా ఉంటే ప్రమాణము నీకేది తెలుపుతున్నదో చూడగలవు. మనసు

సిద్ధంగా లేనప్పుడు - ప్రమాణము దేనినివ్వలేదో కూడ - నీవు చూడలేవు. ప్రమాణ ము పనిచేస్తున్నప్పటికీ చూడబోవటం లేదు. నీ మనసు దేనికి సిద్ధంగానున్నదో దా నిని మాత్రమే నీవు చూస్తావు.

యాదృచ్ఛిక - ఆకస్మిక జ్ఞానమనేది లేనేలేదు. పెన్సిలిన్ యాదృచ్ఛికంగా కనుగొనబ డినదని చెప్తుంటారు. అలెగ్జాండర్ఫ్లెమింగ్ తనకు తానుగా చెప్పాడు - "అది పూర్తి గా యాదృచ్ఛికమే. నేనేమి చేయలేదని", అతడొక శాస్త్రజ్ఞుడు - పరిశోధకుడు. ఒక జాతి సూక్ష్మక్రిముల సముదాయాన్ని పెంచుతూండగా, ఒకరోజు అవన్నీ మరణించి ఉండటం చూస్తాడు. అక్కడ బూజు పట్టి ఉండటం చూచి, సూక్ష్మక్రిములను నాశన ం చేయటంలో వాటికేదో సంబంధముండాలని ఆలోచిస్తాడు. మరో సూక్ష్మక్రిముల సముదాయాన్ని పెంచి బూజునక్కడ ఉంచుతాడు. సూక్ష్మక్రిములన్నీ చనిపోవటం చ ూస్తాడు. ఈ విధంగా పెన్సిలిన్ కనుగొనబడింది. దీనిని నేను యాదృచ్ఛికమని అన ను. పెన్సిలిన్ కనుగొనడానికి దారితీసిన పరిస్థితులు యాదృచ్ఛికములు కావచ్చు ను. ఆ అర్థంతో అతడదృష్టవంతుడు కావచ్చును. కానీ అతడికి విచారించే శక్తి ఉన్న ది. ఏం జరుగుతున్నదో గమనించాడు. వెంటనే వివిధవిషయాల నొకచోట చేర్చా డు. పెన్సిలిన్ జన్మించింది. జ్ఞానము గాని - ధనము గాని- ఆకస్మికము కాదు. ధన ము నీవే సంపాదించాలి. ధనం కోసం నీవు ఇప్పుడుకాని పూర్వంకాని పనిచేసి ఉం డాలి. జ్ఞానము కొరకు నీవు సన్నద్ధుడవు కావాలి. నీవు అధికారివి కావాలి.

9వ శ్లోకము

ఆదౌ నిత్యానిత్య వస్తు వివేకః పరిగణ్యతే ।
ఇహాముత్ర ఫల భోగ విరాగస్తదనంతరమ్
శమాదిషట్క సంపత్తిః ముముక్షుత్వమితి స్ఫుటమ్ ॥ 19 ॥

స్ఫుటమ్ - (ఒక వ్యక్తిని అధికారిగా చేసే సాధన చతుష్టయము) స్పష్టంగా; పరిగ ణ్యతే - చెప్పబడ్డది; ఆదౌ - ఆదిలో; నిత్యానిత్యవస్తువివేకః - నిత్యవస్తువుని; కాలబద్ధమై

న వస్తువుని అర్థంచేసుకోగల జ్ఞానము; తదనంతరం - తరువాత; ఇహ - ఈ లోకం లో; అముత్ర - పరలోకంలో; ఫలభోగ విరాగః - సుఖ భోగములపట్ల తీవ్రమైన కోరిక లు లేకపోవటము; శమాది షట్కసంపత్తిః- శమము మొదలైన షడ్గుణ సంపత్తి; ముముక్షుత్వం - ముముక్షుత్వము తీవ్రమోక్షేచ్ఛ; ఇతి - ఇవి.

"ఒకవ్యక్తిని అధికారినిగా చేసే నాలుగు సాధనములు స్పష్టంగా చెప్పబడ్డవి. మొదటిది - నిత్యవసుత్వవుని, కాలబద్ధమైన వస్తువుని-అర్థం చేసుకో గలవివేకజ్ఞానము, తరువాత ఇహలోకపు - మరియు పరలోకపు సుఖబోగముల పట్ల - తీవ్రమైన కోరికలు లేకపోవడము, శమాది షడ్గుణములు, తీవ్ర మోక్షేచ్ఛ.".

సాధనచతుష్టయములో నిత్యానిత్యవస్తువివేకము మొదటగా చెప్పబడింది. సత్యమై నదానికి, కాలబద్ధమైనదానికి మధ్యగల భేదాన్ని గుర్తించగలిగిన వివేకజ్ఞానమునే నిత్యానిత్యవస్తువివేక జ్ఞానమంటారు. ఏద్దైతే కాలబద్ధమో - అంటే ఏదినిత్యముకాదో - దాన్ని గురించిన దృఢజ్ఞానము, ఇక్కడర్థమిదే తీసుకోవాలి. ఎందుకంటే ఇక్కడ అర్హతలగురించి మాట్లాడుతున్నాము. నిత్యానిత్యవస్తుత్వ వివేకంలో నిత్యవస్తువును తెలుసుకోవటం అంతర్గతం కాదు. నిత్యవస్తువు అనిత్యవస్తువు రెండూ తెలిస్తే ఇక నీకు శాస్త్రమక్కరలేదు.

అనిత్యవస్తువుని సులభంగా తెలుసుకోవచ్చు. నీవేది సంపాదించినా అది కాలబద్ధ మైనది కాబట్టి - నశించిపోతుంది. అది అనిత్యము. ఈ దృఢనిశ్చయమే వివేకము, శృతి మరియు నీ అనుభవము మీద ఆధారపడి ఉపయోగించే నీ తర్కము నీవింత వరకు అన్వేషిస్తున్నదంతా అనిత్యమేనని ధృవపరుస్తున్నాయి. అందుచేతనే నీ అన్వే షణ అంతము కాలేదు. శాశ్వతంగా అన్వేషకుడిగానే అయిపోయావు. మరి నీవన్వే షిస్తున్నదల్లా అనిత్యమైనదైతే, మిగిలి ఉన్నదొక్కటే ఒకటి. అది స్వయంగా అన్వేషకుడే నిత్యమన్నదొకటంటూ ఉంటే అది శేషించిన సాధకుడే కావాలి. అందుచేతనే శ్రుతి

బోధిస్తుంది - “ఆత్మను తెలుసుకొనవలెన”ని ఈ వివేకము లేకపోతే ఇతరములన్నీ - వైరాగ్యము, శమము మొ॥ కలగవు. ఒకవేళ కలిగినా ఒకదిశ అంటూ లేక - పరిమితంగా ఉంటాయి. కనుకనే వివేకం మొదట్లో చెప్పబడింది. వివేకమంటే అర్థ, కామములు, స్వర్గానికెళ్ళటంకూడ - అన్నీ కాలములో నశించేవేనని, సాధకుడనైన నాకవేమి పెద్ద వ్యత్యాసం కలిగించలేవని అర్థంచేసుకొనుటే. ఇంకా సాధకునిగానే మిగిలిపోతాను. ఈ వివేకం పొందిన తరువాత సహజమైన వైరాగ్యం కలుగుతుంది. కాలబద్ధమైన సాధ్యముల పట్లనున్న రాగమునుండి విముక్తి కాలబద్ధమైన సాధ్యములన్నింటిని మూడు వర్గములుగా విభజించవచ్చును. ధర్మము అంటే పుణ్యము, పరలోకము, అర్థము - రక్షణ, క్షేమము, కామము - భోగసుఖములు కళాసాహిత్యాదుల వల్ల కలిగే రసానుభూతితో సహా. ఈ వైరాగ్యాన్ని పెంచుకోవాలి. ఇవన్నీ కాలబద్ధములేనని స్పష్టంగా నీవర్థం చేసుకోవాలి. వైరాగ్యము నిరుత్సాహము భంగపాటు, నిరాశా, దుఃఖము మొ॥ వాటివలనకూడ కలుగవచ్చు. దానిని జిహాస వైరాగ్యమంటారు. వదిలివేయాలనేకోరికనే జిహాసంటారు. ప్రపంచంలో జీవించటం భారమై పోయి వదిలిపెట్టాలని కోరుకుంటావు. జిహాస వైరాగ్యంమూలంగానే చాలామంది ఋషీకేశం చేరుకుంటారు. కాని జాగ్రత్తగా సరియైన మార్గదర్శకత్వంలో పెంచుకుంటే జిహాసవైరాగ్యం కూడ జిజ్ఞాసవైరాగ్యంగా మార్చుకోవచ్చును. సహజంగా ఎన్నటికీ రాదు.

వైరాగ్యము కలిగి ఉండటమంటే - గాలిలాగా దేనిలోనూ చిక్కుకోకుండా - అసంగభావన కలిగి ఉండటము. గాలి అంతటా కదుల్తూ సకల జీవరాశిని అను గ్రహిస్తూంటుంది. కాని ఎక్కడా చిక్కుకొనుండదు. అదేవిధంగా వైరాగ్యమంటే ఈ లోకంలోనివి గాని పరలోకంలోని వాటిలో గాని లగ్నము కాకుండా నుండటము. జ్ఞానసముపార్జనకే అంకితము కాబట్టి - గురువు శాస్త్రబోధలో నిమగ్నమై ఉంటాడు.

కర్మయోగి అయ్యేట్లయితే, కర్మను యోగంగా మార్చేభావనతో చేయవలసిన కర్మలనా చరిస్తుంటాడు.

వేదాంతము ప్రచారము చేయటానికి అధ్యయనం చేస్తూంటారు. కొంతమంది; ఆ విధంగా ప్రజల్ని ఉద్ధరిస్తామని. కానీ అటువంటి వారికి వేదాంతము సహకరిస్తుందా ? ప్రయోజనముంటుందని నేననుకోను. "నేను ప్రజల్ని రక్షించాలనుకుంటున్నాన" నే భావన వివేకవైరాగ్యాల లేమిని సూచిస్తుంది. "నీ కన్న నేను పవిత్రుడనన్న" భావన ఎవరినీ అనుగ్రహించదు. వేదాంతాన్నర్థం చేసుకోవడం ద్వారా నీవు ముక్తుడవైతే నీవే ఇతరుల కనుగ్రహమవుతావు. వేదాంతజ్ఞానాన్ని పంచుకుంటావు. అది ప్రచార మెన్నటికీ కాదు.

శమ, దమాదిషడ్గుణములు శాస్త్రములో చెప్పబడినవి. వైరాగ్యం మీద ఆధారపడి ఉంటాయి. ఉపనిషత్తు చెప్తుంది. "శాంతో దాంత ఉపరతస్తితుక్షుః సమాహితః శ్రద్ధా విత్తో భూత్వా ఆత్మన్యేవాత్మానం పశ్యేత్" (బృ. ఉ. 4-4-23.)

కొంతమంది చెప్పినట్లుగా శంకరులు తమ అనంత విజ్ఞానంతో వీటిని కనుగొనలేదు.

ముముక్షుత్వమంటే ముముక్షువుయొక్క మోక్షేచ్ఛకలిగిన మానసికస్థితి, ధర్మార్థ కామ రూప బాహ్యసాధ్యసాధనములను త్యజించివేశాడు.

వివేకముతో ఆరంభించి, ఈ గుణము లిప్పుడు వివరింపబడుతున్నవి.

10వ శ్లోకము

బ్రహ్మ సత్యం జగన్మిథ్యేత్యేవం రూపో వినిశ్చయః ।
సోయం నిత్యానిత్యవస్తువివేకః సముదాహృతః ॥ 20 ॥

బ్రహ్మ - బ్రహ్మము; సత్యం - నిత్యము; జగత్ - జగత్తు; మిథ్యా - కాలబద్ధమైనది; ఇతి ఏవం రూపః - ఈ విధమైన; వినిశ్చయః - నిశ్చయ జ్ఞానము; నః అయం - ఈ రక

మైన జ్ఞానము; నిత్యానిత్యవస్తువివేకః - నిత్యానిత్య వస్తువివేకమని; సముదాహృతః - చక్కగా ప్రతిపాదింపబడినది.

"బ్రహ్మము నిత్యము, జగత్తు కాలబద్ధమైనదనే నిశ్చయజ్ఞానము
నిత్యానిత్య వస్తువివేక జ్ఞానమని - ప్రతిపాదింపబడినది."

ఈ శ్లోకములో వివేకము నిర్వచింపబడినది. తమ తమ జీవితానుభవాలను శ్రుతి సహాయముతో పరిశీలించినపుడీ విషయాన్నర్థం చేసుకోవచ్చును. ప్రతికర్మ - ఒక ఫలము నుత్పన్నంచేస్తుందని - అది కాలబద్ధమైనదనీ, అర్థకామములు కాలబద్ధము లని- ప్రతివారికీ తెలుసు. ధర్మము - పుణ్యము కూడ కర్మఫలమే కాబట్టి పరిచ్ఛిన్న ముకాలబద్ధము, మరియు ఏకర్మఫలమునకైనా కాలక్రమంలో తరుగుదల ఉన్నది. కాబట్టి అది శాశ్వతంగా ఉండబోవటం లేదు. ఆ విధంగా జగత్తులో నీవేది సాధించి నా అది అనిత్యమే. అందుచేత కర్మకు అనంత ఫలము లేదని ఎవరైనా సులభంగా కనుగొనవచ్చును.

పురుషార్థముల పరిశీలనలో వివేకము ప్రముఖపాత్ర వహిస్తుంది. ధర్మ, అర్థ, కామములు మానవులకు ప్రకృతిసిద్ధములైన పురుషార్థములే. కానీ నానావిధములై న సాధ్యముల భుజస్కంధముల వెనుకగా అన్నిటిలోనూ సాధారణాంశగా మౌలికమై న సాధ్యమొకటున్నది. అదే అల్పుడను, నిరర్థకుడను, రక్షణలేనివాడను, దుఃఖిని - అన్న స్థితినుండి విముక్తి. అదే ప్రధానమైన సాధ్యము. ఈ సర్వ సాధారణలక్ష్యము మిగిలినపురుషార్థములతో కలుపబడి, "నాకు రక్షణ లేదు, ధనం సంపాదిస్తే - లేక సుఖభోగములనుభవిస్తే లేక పుణ్యం సంపాదిస్తే నాకు రక్షణ ఉంటుందని ఆలోచిస్తా రు. ఇందులో "నేను అర్థకామములనే కోరుతున్నానా లేక నేనల్పుడను, రక్షణలేనివా డను దుఃఖిననే భావనలనుండి విముక్తిని కోరుతున్నానా"? అనే వివేచన లేదు. ఆ విచక్షణే ఉంటే జీవితానుభవాన్ని పరిశీలించినమీదట తాను శాశ్వతంగా అన్వేషకు డిగానే ఉంటున్నానే గుర్తింపు వస్తుంది.

మన అన్వేషణ గురించిన తార్కికపరిశీలన ఈ సత్యాన్ని తేటతెల్లం చేస్తుంది. నేను వెదుకుతున్న అర్థకామములు నాకంటె భిన్నములైనవి. కాలబద్ధములైనవి కాబట్టి - ముందు వాటికే భద్రత లేదు. (వాటికవే క్షేమకరములు కావు.) నేను క్షేమములేని వాడనయితే - కాలబద్ధములైన అర్థకామముల నెన్నిటిని సమకూర్చినా - అవి నాకు రక్షణనివ్వలేవు. పరిచ్ఛిన్నమైనది మరో పరిచ్ఛిన్నమైన దానితో కూడి అపరిచ్ఛిన్నము కాలేదు. నేను రక్షణలేని వాడననేదెప్పుడూ ఉంటుంది. ఈ విచక్షణా జ్ఞానమే - అర్థము, కామము, పుణ్యము (ధర్మము) లు "నేను రక్షణ లేనివాడను, దుఃఖిన" నే మౌలిక భావనను తొగించలేవన్నదే - అనిత్యవస్తువంటే ఏమిటోనన్న అవగాహనుండాలన్న దాని కర్థము.

ప్రతిదీ కాలబద్ధమైనదేనని, నిత్యవస్తువన్నదే లేదనే నిర్ణయానికొస్తే జీవితం మీదే విరక్తి కలుగుతుంది. ఎందుకంటే నీవు ఉత్సాహంతో దేనినైతే చేపట్టాలో దానితో ముందుకు సాగలేవు. దాన్నుండి దూరంగా తప్పకోనూ లేవు. అందుకనే "బ్రహ్మ సత్యమ" ని చెప్పబడ్డది. నిత్యవస్తువు ఉన్నది. అదే ఆత్మ ఆత్మే బ్రహ్మము, అది నిత్యము, దానిని తెలుసుకోవలెను. కనుకనే జిజ్ఞాసకవకాశ మున్నది.

నిత్యానిత్యవస్తువివేకమంటే ఏమిటో సరిగా అర్థం చేసుకోవాలి. ఏదినిత్యము, ఏది కాలబద్ధమోనన్న వివేకం జ్ఞానమని అనేక వ్యాఖ్యానాలు వివరిస్తుంటాయి. అటువంటప్పడు అతడికి బ్రహ్మసత్యము జగత్తు మిథ్యయని తెలుసు. అతడు జ్ఞానియే, కానీ ఇక్కడ మనము సాధకుని గూర్చి చర్చిస్తున్నాము. అందుచేత అతడు జగత్తు కాలబద్ధమని మాత్రమే నిశ్చయించగలగాలి. తనకుశ్రద్ధ ఉన్న శాస్త్రము గురించి సాధారణ (ఆపాత) జ్ఞానముండటం మూలంగా ఆత్మ నిత్యమనీ, అది తెలుసుకోవలసినదనీ విశ్వసిస్తాడు. ఇచట నిత్యానిత్యవస్తువివేకమంటే అర్థమిదే.

సాధారణ శాస్త్రజ్ఞానమున్నవాడు చెప్పవచ్చును - "బ్రహ్మ సత్యమ్, జగత్తు మిథ్యయని నేను విన్నా" నని. కాని వేదాధ్యయనం చేసినప్పడే అలా శాస్త్రం గురించిన సామా

న్యజ్ఞానం ఉండగలదు, వేదాధ్యయన మీరోజుల్లో సాధారణం కాదు. అందువలన శా
స్త్రము గురించి ఆ పాతజ్ఞానం కూడ ఉండదు. ఈ విషయంలో వేదాంతం మీదను
న్న ఆధునిక సాహిత్యం ఉపకరిస్తుంది. అది ఆత్మ సత్యమనీ - జగత్తుకాలబద్ధమనీ -
చెప్తూంటుంది. కాబట్టి ఈ సాహిత్యము నిన్ను మార్గంలో పెడుతుంది. అదేమిటో తెలి
యకుండా - నిన్నే నీవు అన్వేషిస్తున్నావనే విషయాన్ని - గుర్తించటమారంభిస్తావు.
నీవు భావించే దానికంటె - ఆత్మ ఇంకా ఏదో అధికమేనని తెలియవస్తుంది. నీవు
ముందుకు సాగటానికి ఇది చాలు.

అర్థ, కామ, ధర్మ పురుషార్థములు కాలబద్ధమైనవి; కనుక సంసారంలో అంతర్గత
మైనవి. కాబట్టి ఈ పురుషార్థముల ద్వారా సంసారమునుండి విముక్తి కవకాశము
లేదు. ఎవరైతే దీనిని చూడగలడో అతడు వివేకం కలవాడు.

11వ శ్లోకము

తద్వైరాగ్యం జిహాసా యా దర్శనశ్రవణాదిభిః ।
దేహాది బ్రహ్మపర్యంతే హ్యనిత్యే భోగ్యవస్తుని ॥ 2 ॥

దర్శనశ్రవణాదిభిః - దర్శనశ్రవణాదుల ద్వారా; దేహాదిబ్రహ్మపర్యంతే - శరీరం మొద
లు బ్రహ్మదేవుడి స్థితి వరకు; అనిత్యే - అనిత్యమైన; భోగవస్తుని - భోగవస్తువుల యం
దు; యా జిహాసా - ఇచ్ఛా రహిత మానసిక స్థితి ఏదైతే ఉన్నదో; తద్ హి - కచ్చితంగా
అది; వైరాగ్యం - వైరాగ్యము.

"వైరాగ్యమంటే శరీరము మొదలు బ్రహ్మదేవుడి వరకు కాలబద్ధమైన
సమస్త భోగ్యవస్తువులపట్ల ఇచ్ఛారహిత మానసిక స్థితి. అది దర్శన,
శ్రవణాదుల ద్వారా లభిస్తుంది."

స్వశరీరము మొదలు బ్రహ్మదేవుడి పదవి వరకు సమస్త భోగ్యవిషయములను
దృష్టిలో నుంచుకొని - వదలి వేయాలనే కోరికే వైరాగ్యమంటే, ఇది సమస్త సుఖము

లు అనిత్యములే, కాలపరిచ్ఛిన్నములే నన్న నిశ్చయజ్ఞానంనుండి జనిస్తుంది. ఈ అవగాహన కెలా రాగలుగుతాడు ? ప్రత్యక్షప్రమాణములు, శ్రుతి మొ॥ వానిద్వారా, ఆది పదము అనుమాన ప్రమాణాన్ని సూచిస్తుంది.

ఈ భౌతికశరీరము కర్మఫలం కాబట్టి కాలవశంలో నున్నట్లుగా చూడగలం. అది వృద్ధిని పొందుతుంది. క్షీణిస్తుంది. చివరకు నశిస్తుంది. కర్మవలన ఉత్పన్నమైన ఏ ఫలమైనా ఘటమువలె- ఆ కర్మచేతనే పరిచ్ఛిన్నం కావటం గుర్తింపబడుతుంది. ఘటమునుత్పన్నం చేసిన కర్మ, చిన్నపాత్రనో, మూతనో, మరే ఇతరవస్తువునో ఉత్పన్నం చేయటంలేదు. మరియు ఉత్పన్నమైనవస్తువు నాశము కలిగే ఉన్నది. ఏ అనుభవమైనా, కర్మద్వారా కలుగుతుంది కాబట్టి, లభిస్తుంది నశిస్తుంది.

శ్రుతికూడా స్వర్గము లాంటి ఏ కర్మఫలమైనా అనిత్యమే కాలబద్ధమేనని ఉదహరిస్తుంది. “తద్యథా ఇహ కర్మచితో లోకః క్షీయతే, ఏవమేవ అముత్ర పుణ్యచితో లోకః క్షీయతే” ఏ విధముగానైతే ఈ లోకంలో కర్మద్వారా సంపాదించినది అంతమవుతుందో, అదేవిధంగా పుణ్యంద్వారా సంపాదించిన పరలోకంలోనిది కూడ అంతరిస్తుంది. (ఛాందోగ్యోపనిషత్ 8-1-6)

అనుమానంద్వారా కూడ అదే నిర్ధారణకు రావచ్చును. కర్మ జనితఫలమశాశ్వతము- కర్మజనితం కనుక, ఘటమువలె. పుణ్యము కర్మజనితమైతే అది నిత్యమైనదానినుత్పన్నం చేయలేదు. పుణ్యము పరిచ్ఛిన్న కర్మనుండి జనించింది. కాబట్టి ఏ కర్మైనా నియమితకాలంలో నియమితదేశంలో నియమితఫలంకోసం అనుష్ఠించబడుతుంది. కాబట్టి పరిచ్ఛిన్నమే - ఘటము నుత్పన్నం చేసే కర్మవలె.

ఈ శరీరం మొదలుకొని బ్రహ్మవరకు సమస్తవస్తువులు భోగ్య వస్తువులే. మానవశరీరము భోగాయతనము - భోగస్థానము. కానీ భోగాయతనమని ఖచ్చితంగా చెప్పలేము. ఎందుకంటే ఒక దోమకే శరీరము భోగ్యవస్తువవుతున్నది. ఇతరులకి కూ

డా ఇది భోగ్యవిషయము కావచ్చు. వారి వారి రాగద్వేషము లననుసరించి - నీ వి తరులకు భోగ్యవిషయము కావచ్చు. ఈ శరీరము తన వశములో నున్నదని కాల ము భావిస్తుంది. ఉన్నట్టుండి నీ గడ్డము తెల్లబడటం నీవు గమనించవచ్చు, చదువు టకు కళ్లజోడు అవసరం రావచ్చు. కూర్చునేటప్పడు, నిలుచునేటప్పడు మరో ఆధా రం అవసరపడవచ్చు. అందుచేత ఈ శరీరము అనిత్యము. కాలబద్ధమైనది. దీని లాగానే ఏ శరీరమైనను అనిత్యమే - బ్రహ్మ శరీరంతోసహా. ఈ గుర్తింపుతో ఈ వస్తు వులపట్ల నున్నవాంఛను వదిలివేయాలనే కోరిక ఉదయిస్తుంది. ఆ తలంపునే వైరా గ్యమంటారు. అది స్వర్గంతో సహా కాలబద్ధమైన విషయములపై రాగరాహిత్యమే. ఇక్కడొకవిషయం స్పష్టంగా తెలుసుకోవాలి. వేదాంతాధ్యయనమితర మతములవం టిది కాదు. ఎందుచేతనంటే స్వర్గమిక్కడ పురుషార్థం కాదు.

అనిత్యం కాబట్టి శరీరాన్ని అశ్రద్ధ చేయాలా ? కూడదు. శరీరం పట్ల సరైన దృష్టి ఉండాలి. శరీరం గురించి అతిగా శ్రద్ధ వహిస్తే అప్పడది మరో దానివైపు దృష్టి పోని వ్వదు. దానిని కూడా నీవు అశ్రద్ధ చేయలేవు. ఇప్పడు గనక శ్రద్ధ వహించకపోతే - తరువాత ఎక్కువగా శక్తియుక్తులను ఇవ్వాల్సి ఉంటుంది. ఒక పెన్నులాగానే శరీరం కూడా ఒక సాధనమే. పెన్నుని వాడుకుంటావు. దానిపట్ల - శ్రద్ధ వహిస్తావు. కానీ దాన్నే అంటి పెట్టుకుండవు. సాధనమునకే పూర్తిగా అంకితమవటముండదు. కాళి దాసు చెప్తారు. - "ఈ శరీరం ప్రధానంగా ధర్మసాధనము". దానిపట్ల నిష్పక్షపాతమై న విషయదృష్టి ఉండాలి. నీ వేది కోరినా దానిని పొందటానికి సాధనంగా ఉపయో గపడటానికే అది నిర్దేశింపబడినది. సాధనము కాబట్టి - దానిని యుక్తమైన రీతిలో ఉంచాలి. కానీ ఎల్లవేళల్లో దాని గురించే ఆలోచిస్తూ ఉండవు. పెన్ను, కారు మొ॥ సాధనములపట్ల నీకెటువంటి భావనుంటుందో - అదే భావన శరీరం పట్ల ఉండాలి. ఇంకనూ శరీరం కాలబద్ధము కాబట్టి - వృద్ధావస్థను పొందుతుంది వయసు పెరగ కుండా ఆపలేవు. దానితోపాటు వచ్చే వ్యాధులనూ ఆపలేవు. అది శరీరమని పిలవబ

డుతుంది - శిథిలమవుతుందని దానర్థం. అటువంటి కాలబద్ధవస్తువుపట్ల నీకు వైరాగ్యం కలుగుతుంది. విషయదృష్టి అలవడుతుంది.

వైరాగ్యము వివేకాన్నుండి జనిస్తుంది. కానీ అప్రయత్నంగా తనంత తానుగా వివేకాన్నను సరించదు. నీవు దాన్నలవరుచుకోవాలి. ఎందుకంటే భోగ్యవిషయములపట్ల సంవేదనాత్మకవిలువ ఉన్నది. విషయంపట్ల నున్న సంవేదనాత్మక విలువకంటే - జ్ఞానాత్మకవిలువ భిన్నమైనది. నీ జ్ఞానంలో ఒకటి విలువైనది కాకపోవచ్చు. కానీ భావసంవేదనకు విలువైందిగా వస్తువు నీకుండవచ్చు. సంవేదనాత్మకవిలువని నీవశ్రద్ధచేయలేవు. తప్పకొని పోలేవు. అదుపులో నుంచలేవు. వాస్తవానికి భావోద్రేకములే నిన్ను నియమిస్తుంటాయి. నీ సంకల్పబలంచేత - కొంత కాలంపాటు - భావోద్రేకాలను అదుపులో నుంచవచ్చు. కానీ చివరకు నీ సంకల్పంలో అధిక భాగాన్నాక్రమించి - ఏ మాత్రము తగని రీతిలో - వాటినవి వ్యక్తం చేసుకొంటాయి. భావావేశములు నీపై తమ తమ పట్టు కలిగి ఉంటవి. కాబట్టి వాటిని నీవుగా పూర్తిగా అశ్రద్ధ చేయలేవు. అయినా నీవు వాటికి భక్తుడవు కాలేవు. అది కూడా పనిచేయదు. అందుచేత భావావేశాలపట్ల నీవు - వస్తునిష్ఠ దృష్టిని - అలవరచుకోవాలి. అవి తగురీతిలో వ్యక్తమయేట్లు చూడాలి. అందుకై నీవే మనుకుంటున్నావో వివరంగా వ్రాయవచ్చు. లేదా అర్థం చేసుకునే వారితో విశ్వసనీయులతో హృదయము విప్పి మాట్లాడవచ్చు. ఈ రకమైన దేదైనా చేయాలి గాని - అణుచుకోకూడదు.

వైరాగ్యమంటే - ప్రపంచంనుండి పారిపోవటం కాదు. ప్రపంచంనుండి పారిపోనూ లేవు. నీవెక్కడికి వెళ్ళినా ప్రపంచాన్నక్కడే చూస్తావు. దక్షిణభారతం నుండి జనులు ఋషీకేశ్ వస్తారు. అది విలక్షణంగా ఉంటుందని భావిస్తూ, అంతదూరంనుండి వస్తారు. తరువాత క్రమంగా వారే అంటారు - ఋషీకేశ్ కూడా దక్షిణంలోనున్న ప్రదేశంలాంటిదేనని. అది నిజం కూడ. ఎందుకంటే నీ వెక్కడి పోయినా ప్రపంచంలోనే తిరుగాడుతున్నావు. అక్కడకూడా జనులుంటారు. వారేమీ విలక్షణంగా నుండబోరు.

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

అంతేగాక, వ్యక్తి ఉన్న విషయాల్ని చూచేవిధానంలో దోషముండవచ్చు. అందువలన అతడెక్కడికి వెళ్ళినా అక్కడే సమస్యల్ని చూస్తాడు. విషయాలను, వ్యక్తులను యథాతథంగా స్వీకరించి ఆయా పరిస్థితులలో సక్రమంగా వ్యవహరిస్తే - ఆ పురుషుడు ఏ ప్రదేశంలోనైనా బాగానే ఉంటాడు. పరిస్థితులనుండి పారిపోవటమంటే వాస్తవానికి - నీనుండి నీవు పారిపోవటమే. అది సాధ్యం కాదు. అందుకే ఈ విధంగా చెప్పబడింది - “నీతోనే ఉండగలగటం అలవరచుకోవటం మంచిది. ఎందుకంటే నీ జీవితకాలమంతా నీవు నీతోనే ఉండబోతున్నావు”. మనుష్యులు వస్తారు - పోతారు-. నీవు మాత్రమెల్లప్పడు అక్కడే ఉంటావు. అందుచేత నిన్ను నీవిష్టపడటం నేర్చుకో.

“ప్రపంచము నా కొక ఉచ్చు” అని భావించటం కూడా తప్పే. ప్రపంచము నీలో మనస్సనే పట్టకముద్వారా ప్రవేశించినపుడు అది వక్రతను పొందుతుంది. మనుష్యలలో మంచితనము లేదనే నిర్ధారణ కొస్తావు. అందుచేత అదొక వలలాగా నీకు తోస్తుంది. ప్రపంచంగానీ, ఇంద్రియ విషయములు గానీ నీ కన్నా బాహ్యంగా ఉన్నాయి. నీ ఇంద్రియములు వాటి సంపర్కంలోకి వస్తాయి. బాహ్యంలో నుండగా అవి నిన్నెలా బంధిస్తాయి? జడ ప్రపంచము చైతన్యవంతమైన నిన్ను బంధించలేదు. అది నన్ను ఉచ్చులో బిగిస్తుందనటం కుర్చీలో కూర్చుని “ఈ కుర్చీ నన్ను క్రిందికి లాగుతున్నది. ఇది నన్ను పైకి లేవనివ్వటంలేద”నటం లాంటిది. వాస్తవమేమిటంటే కుర్చీకి నిన్నిక్కడుంచటం ఇష్టంలేదు. ప్రపంచానికి నిన్ను బంధించాలన్న భావనేమాత్రము లేదు. నిజానికి ప్రపంచము తన్నితాను తెలుపుటకు నీ ప్రత్యక్షదృష్టి మీద ఆధారపడుతుంది. నీ దృష్టి వస్తుతంత్రం కావచ్చు. లేదా కర్తృబుద్ధితంత్రం కావచ్చు... “అది నన్ను బంధిస్తుంద”ని నీవన్నప్పడు అందులో కర్తృతంత్రత్వమే చాలా ఉంది.

ఈ ప్రపంచము దుఃఖాత్మకమని బౌద్ధులు చెప్తారు. అది మిథ్య యని కూడా చెప్తారు, సత్యమనేదే వారికి లేకపోయినప్పటికీ, మరి సత్యము లేకుండా మిథ్యకు అస్తిత్వం లేదు. సత్యాన్ని వారంగీకరించరు. కాబట్టి, మిథ్యాజగత్తే వారికి సత్యమవుతుంది.

అందుచేతనే అది దుఃఖాత్మకమవుతుంది. ప్రపంచము దుఃఖమయమన్నభావనతో వేదాంతాని కెటువంటి సంబంధము లేదు.

ప్రపంచము ఆనందాన్నివ్వటానికి కూడ సమర్థవంతం కాదు. నేనే ఆనందము. అదే సత్యము. దాని మీదే ప్రపంచము ఆధారపడుతున్నది. - ఘటమునకు మృత్తిక లాగా, అందుచేత నీవు ప్రపంచాన్ని వాస్తవదృష్టితో చూస్తే - నిజంగా అదెవ్వరినీ బాధించదు. అది నానారకాలవస్తువులు కలిగి ఉంది. నీకు కావలసింది వాడుకో. "ప్రపంచము నాకు దుఃఖాన్నిస్తుంద"న్న నిర్ణయం అధ్యాసనుండి జనిస్తుంది. కాబట్టి నాకు కొంత కర్తృపరదృష్టి లేకపోతే ప్రపంచము నాకు దుఃఖాన్నివ్వలేదు. "ప్రపం చము నాకు బాధనిస్తుంద" న్నది అశోభనాధ్యాస - "ప్రపంచము నాకు సుఖాన్నిస్తుం ద"న్నది శోభనాధ్యాస, ఈ అధ్యాసను, వాస్తవజ్ఞానంద్వారా కొట్టివేయవచ్చు. అందుకే నీవు మరల మరల విషయాలలో నున్న దోషాన్ని చూడగలగాలి. తద్వారా వాటిపట్ల నీకు వైరాగ్యం పెరుగుతుంది. చక్కగా పరిశీలించి - నిష్ప్రయోజనములని నిర్ధారిం చి - పాత వస్తువుల్ని పారవేస్తాము. వాటిపట్ల ఎటువంటి భావన ఉంటుందో అలాంటిదే వైరాగ్యం.

దోషమంటే పరిమితే కాని - లోపం కాదు. దోషమును లోపమని అనువదించి " ఈ ఇంద్రియ విషయాలన్నిటిలో నీవు దోషాన్ని చూడాల"ని చెప్తుంటారు. అలా దోషా లు చూడటం ప్రారంభిస్తే నీవు అచ్చు తప్పలు వెతికే వాని లాగా అవుతావు. అచ్చుత ప్పలు వెతికే వాని లాంటి మనసు కలవాడివవుతావు. అప్పుడెవరిని చూచినా వారి లో దోషాన్ని చూడటానికే ప్రయత్నిస్తావు ఈ రకపు ఆధ్యాత్మికజీవితం రెండు మూడు సంవత్సరాలు గడిపితే, ఎప్పటికీ అసంతృప్తితో తప్పలెన్నుతూ ద్వేషదృష్టి కలవాడివిగా మారిపోతావు. అప్పడే ప్రపంచాన్నుండి మనుష్యులనుండి దూరంగా వెళ్ళి పోవాలని కోరుకుంటావు. - ఎక్కడికో కొండ గుహల్లోకి.

ప్రపంచాన్నుండి పరుగెత్తి పారిపోవాలని చూస్తారు - అలా అయితే ఏకాంతంగా ఉండగలమని, కానీ నిజానికి కొంతవరకు వైరాగ్యాన్ని పొందగలిగినప్పడు, విషయాల లో చిక్కుకోవటం లేదు కాబట్టి - నీ వేకాంతంగానే ఉన్నావు - ఎక్కడికో వెళ్ళాల్సినవస రం నీకు లేదు. ఏకాంతంగా ఉండాలని ప్రపంచంనుండి పరుగెత్తి పోవటం - అద్భు తపగటి కలలలో విహరించటమే. ఆధ్యాత్మిక సాధనలలో అద్భుతంగా ఊహించుకొని విహరించట మెప్పడూ ఉంటుంది. నాకేదో విశిష్టమైనది, ప్రత్యేకమైనది కావాలి. నీవే ఈ అద్భుతకల్పనలను పక్కకుపెట్టి కాల్పనికతలల్లో చూడగలిగినప్పడు నీకు వాస్త వికత ఉంటుంది. అదే వైరాగ్యము.

వైరాగ్యమంటే నీకు వాస్తవదృష్టి, ఉద్వేగరాహిత్యము అసాంగత్యము ఉన్నట్లు. దీన్ని నీ వెంత అర్థం చేసుకుంటే అంత విముక్తి ఉంటుంది. అందుచేత కొంతవరకైనా వాస్తవికత, పూర్ణత లేకపోతే నిజమైన వైరాగ్యం లేనట్లే. అదే ఇక్కడ చెప్పబడింది. వైరాగ్యమున్నప్పడు శమదమములు అనుసరించి వస్తాయి.

12వ శ్లోకము

విరజ్యవిషయవ్రాతాద్ దోషదృష్ట్యా ముహు ర్ముహుః ।

స్వలక్ష్యే నియతా వస్థా మనసః శమ ఉచ్యతే ॥ 22 ॥

దోషదృష్ట్యా - పరిమితులను పరిశీలించి; విషయవ్రాతాద్ - విషయ సముదాయ మునుండి; ముహుర్ముహుః - మరల మరల; విరజ్య - విముఖుడై (విరక్తితో); స్వలక్ష్యే వ స్వలక్ష్యమునందు; మనసః - మనస్సు యొక్క నియతావస్థ - స్థిరత్వమును (పొం దుటను); శమః - శమము; ఉచ్యతే - అని అందురు.

"విషయ సముదాయముల పరిమితులను పునః పునః పరిశీలించి వాటిపట్ల విరక్తితో స్వలక్ష్యములో మనసు స్థిరంగా ఉండుటను శమమందురు."

శమమంటే స్థిరబడిన మానసికస్థితి. వైరాగ్యంలో పరిపక్వత లభించినకొలది నీలో వాస్తవికదృష్టి పెరుగుతుంది. ప్రతివారిలోనూ, కొంత కర్తృపరదృష్టి ఉంటుంది. దాన్ని నీవెంతవరకు తగ్గిస్తే అంతవరకు వాస్తవికత దృష్టి ఉంటుంది. వాస్తవికత ఉన్న వ్యక్తికి ప్రపంచాన్ని, మనుష్యులను, తనను కూడా యథాతతంగా అంగీకరించి సమానావకాశమివ్వటం సులభమవుతుంది. శమము వైరాగ్యంనుండి వస్తుంది. అదే ఇక్కడ చెప్పబడుతుంది. వ్రాత - అంటే సముదాయము. ఎవరైనా ప్రపంచంలోని నానారకాల విషయాలపట్ల లేక ప్రపంచంపట్ల - విరక్తి తనలో కనుగొనగలిగితే - అతడికి వాస్తవదృష్టి ఉన్నట్లే. అంటే శోభనాధ్యాస లేదు. ఏ వస్తువు పైన ఉన్నదాని కంటే ఎక్కువగా ఊహని ఆపాదించడు.

ఉదాహరణకు - ధనానికొక విలువ ఉన్నది. ధనానికి విలువ లేదనెవరు చెప్పలేదు. దానికి కొనుగోలు శక్తి ఉన్నది. కానీ అకాలమృత్యువునుండి ధనం నిన్ను రక్షించబోతుందనుకుంటే - అది నిజం కాదు. ధనం నిన్ను నాశనం కూడా చేయవచ్చు. చాలమంది ధనమున్నది కాబట్టే చంపబడుతున్నారు ధనం కొన్ని వస్తువుల్ని కొనగలదు. సరే మంచిదే. కాని ప్రతిదాన్ని ఇవ్వబోవటం లేదు. నిజానికి జీవితంలో ముఖ్యమైన వేవీ ధనంతో కొనబడలేదు. ధనం నీ కొరకు గ్రంథమును కొనగలదు. కానీ దాన్ని చదవటంలో నీకు సహాయపడలేదు. ఒకవేళ చదివేట్లు చేసినప్పటికి - దాన్నర్థం చేసుకొనేట్లుగా చేయలేదు. ధనం నిన్ను ఆహారం కొనేట్లు చేయగలదు. కానీ దాన్నాస్వాదించేట్లు చేయలేదు. ఆహారాన్నాస్వాదించాలంటే నీకాకలి ఆరోగ్యము కావాలి. అదేవిధంగా ధనం నీకొర కొకభవనం కొనగలదు. కానీ దాన్ని గృహంగా చేయలేదు. కుటుంబంలో సంస్కృతి ఆప్యాయతలు అనుబంధాలు పంచుకోవటం లాంటివి ఉంటే - అప్పడు దాన్ని గృహమంటాము. నీకు పరిపక్వమనసుంటే ధనం లేకపోయినా ఆస్వాదించవచ్చు. ధనానికున్న పరిమితుల నర్థంచేసు కున్నప్పడు, ధనంపట్ల వాస్తవికత ఉంటుంది. ఇదే వైరాగ్యము.

వైరాగ్యము చాలా చెడ్డగా చెప్పబడిన - పొరపాటుగా అర్థం చేసుకోబడిన పదము. వైరాగ్యమంటే కళ్ళుమూసుకుని ప్రపంచంనుండి తప్పకొని పోవటమనుకుంటారు. అలాచేయటం ద్వారా అంతా సాధించినట్లేనని, అధ్యాస తొలగినట్లేనని భావిస్తారు. కాని అది సరికాదు. దుర్గంధంతో కూడి మురికి ఉందనుకొందాం. ముక్కుమూసు కోవటంద్వారా తాత్కాలికంగా దాన్ని తప్పించగలవు. కానీ నీవు సమస్యని పరిష్కరిం చలేవు. అదే విధంగా దేన్నో ఆపటం వలన నీకున్న అధ్యాసనుండి తప్పించుకోవటం లేదు. దీనికి విచారం కావాలి. శోభనాధ్యాసను తొలగించటానికి విచారం కావాలి. అందుకనే శాస్త్రం చెప్తున్నది - "విరజ్య విషయవ్రాతాద్ దోషదృష్ట్వా ముహుర్ముహుః" - విషయాల యొక్క పరిమితులను పునః పునః విచారించడం ద్వారా మాత్రమే అధ్యా సను కొట్టివేయవచ్చు. అధ్యాసను తొలగించినపుడే మనసుకి స్థైర్యం ఉంటుంది. అదే శమము.

మనస్సుకి విషయాలపట్ల కొంత మొగ్గు (లేదా ప్రవణత) ఉంటుంది. అది నీవు సా ధించ దలుచుకున్న వాటినుండి - లేదా ఇతరులు సాధించే వాటిని పరిశీలించటం ద్వారా- ఏర్పడుతుంది. ఉదాహరణకు విజయము అను భావన ఒక మొగ్గే. అది నీ కు తల్లిదండ్రుల ద్వారా లేక సమాజముద్వారా కలిగింది. నిర్దిష్టాభిప్రాయాలవలన ఎవరైతే కొంత అధికారాన్ని - పేరు ప్రతిష్ఠలను-ధనాన్ని కోరిన విధంగా - నిర్దేశించగ లడో అతడు కార్యసిద్ధి పొందినవాడని - నమ్ముతావు. ఆ వ్యక్తి వాటిని విద్య ద్వారా నో - లేక రాజకీయపు పలుకుబడిని ఉపయోగించో - పొంది ఉండవచ్చు. ధనవం తుడందరిచేత గౌరవింపబడటం దూరపుదైనా చుట్టరికమున్నా లేక పోయినా, మరో వైపు పేదవాడు దగ్గరి బంధువైనా సరే అసలు పట్టించుకోబడక పోవటం బాల్యం నుండి నీవు చూస్తుంటావు. బాలునిగా ఇదంతా చూచి విజయం గురించి ఒక

భావన నేర్వరచుకొంటావు. కాలక్రమంలో విజయం పట్ల విలువ నీ అంతరంగంలో స్థిరంగా పాతుకుపోతుంది. సంన్యాసి అయిన తరువాతకూడా ధనానికి, అధికారాని కున్న విలువ పోతుంది.

ఒకసారి మద్రాసులో ఉద్యోగం చేస్తుండగా శలవు తీసుకుని ఉత్తరకాశి వెళ్ళాను. అక్కడొక సన్యాసితో పరిచయం చేసుకున్నాను. ప్రతిరోజూ ఆయన్ని కలిసేవాడిని. ఒకరోజు ఆయన నన్నడిగారు, "సంన్యాసం తీసుకుందామనుకుంటున్నావా" అని. నా కటువంటి ఆలోచన లేదు. అదే ఆయనతో చెప్పాను. "నన్నెందుకా ప్రశ్న అడిగా రని" ని ఉత్సుకతతో అడిగాను. "సంన్యాసం తీసుకోవద్ద" ని చెప్పాడాయన. ఆశించ ని సలహా అది అడగకుండానే సలహాఇచ్చాడు. అంతగా అతడిని ఒత్తిడి చేసిన దేమి టో తెలుసుకోవాలనిపించింది - ఆయన్నడిగాను. 'ఎందుక'ని ? అతడు చెప్పాడు - "నీవు సంన్యాసం తీసుకున్నా - నీకు ధనం కావాలి. నాకు నా ప్రావిడెంటు డబ్బులుం డేవి. దాన్నుండి నిత్యము ఖర్చు పెడుతుండేవాడిని. అదంతా ఖర్చు అయిపోయింది. ఒకటి, రెండు నెలల్లో ధనం లేకుండా మిగిలిపోతాను. డబ్బు లేకుండా జీవించడం చాలా కష్టం కాబట్టి - సంన్యాసం తీసుకోకు" అని. ఆతడున్న స్థితినుండి అది కరుణ తో ఇచ్చిన సూచనే అతడికి ధనం విలువైంది. అతడు సంన్యాసం తీసుకున్నాడు. కానీ నిజానికతడికి సంన్యాసం లేదు.

ప్రావిడెంట్ ఫండ్ రక్షణతో తీసుకున్న సంన్యాసం పని చేయదు. సంన్యాసమంటే ఆకాశం క్రిందికి రావటమే. నీకు నీ శరీరము మనసు తప్ప మరేదీ లేదు. అంతే సం న్యాసదీక్ష ఇచ్చినప్పడు శరీరంపైనున్న వస్త్రములు కూడ విసిరి వేయబడతాయి. ఆ వ్యక్తి ఉత్తరం వైపుగా నడుస్తాడు. అప్పడు గురువు మరల వెనక్కి పిలిచి వస్త్రములని చ్చి లోకకళ్యాణంకోసం సేవ చేయమని అడుగుతాడు. అది ఒక కర్మ. కానీ నిజంగా సంన్యాసమంటే నీ వద్ద నిధిగా ఉన్నదల్లా నీ శరీరము, మనస్సేతప్ప మరేదీ లేకపోవ టం, సంన్యాసము మానసికపరిపక్వత నుండి జనిస్తుంది. నీవు సంన్యాసిజీవిత విధా

నాన్నవలంబించినా ఆ పరిపక్వత అంత సులభంగా రాదు. అందుచేత నీవంతా వద లివేసి ఉత్సాహంతో సంన్యాసం స్వీకరించటంతోటే, ధనం పట్ల విజయంపట్ల నీకున్న పూర్వవిలువ పోయే తీరుతుందన్ననియమం లేదు. కాబట్టి సంన్యాసులలో కూడ పె ద్ద ఆశ్రమమున్న సంన్యాసిని విజయం సాధించిన సంన్యాసంటారు. సంన్యాసి దృష్టి లో పెద్ద ఆశ్రమాలకి సంస్థలకి విలువలేదు. సంన్యాసికి మొట్టమొదటి విజయం అత డికున్న వివేకము - వైరాగ్యము, ఎంతవరకతడు ముక్తుడు - ఎంతవరకతడు తనకు తానుగా సాపేక్షికంగా నైనా సంతోషంగా ఉన్నాడు - ఎంత వరకు కరుణాహృద యుడు - ఇవన్నీ అతడిని సంన్యాసిని చేస్తాయి. జ్ఞానాన్నిపొందితే అప్పడే అతడొక సంన్యాసి, ఏ బాహ్య లక్షణానికి సంన్యాసంతో పనిలేదు.

ప్రపంచంలో పెద్ద పెద్ద భవనాలు - సంస్థలు ఉన్నవారు చాలామంది ఉన్నారు. కొంతమంది లోకులదృష్టిలో - వారంతా విజయం సాధించినవారు. ఒక సంన్యాసి కూడా అదే దృష్టితో చూడబడితే- అలా చూచే వారిలో - సులువుగా మోసపోయే స్వభావముందని తెలుస్తుంది. ఒక సంన్యాసికి పెద్ద ఆశ్రమముండవచ్చును - అవస రాన్నిబట్టి. కానీ దానికి ప్రత్యేకార్థమేమీలేదు. సంన్యాసమన్నది తనలో ఉండేది. అది అంతరంగిక పరపక్వత. శోభనాధ్యాస తొలగినప్పడే అది సాధ్యపడుతుంది. వస్తువు లలోని పరిమితులను పునః పునః నిశితంగా సనిమిత్తంగా విచారిస్తే తత్ఫలితమే శో భనాధ్యాస నివృత్తి. ఆ నివృత్తి అంత సులభంకాదు. ఎందుకంటే - విజయానికుండే విలువ సంవేదనాత్మకమైనది - మరియు నిగూఢంగా మనస్సులో పాతుకొని ఉంది. ఇది సహజంగా ఉన్నదేగాని - ప్రయత్నించి కావాలని తెచ్చుకొన్నది కాదు. భావావేశ పువిలువ ఉండటమే కాకుండా - మరో ప్రక్క ఓటమి భయం కూడ ఉంది. అదే మానవుణ్ణి అక్కడక్కూడా విజయం సాధించే దిశలో పురికొల్పుతుంది. ఎప్పడైతే వైరాగ్యము- పరిపక్వత - వైయక్తిక భావారోపణ నతిక్రమించే వాస్తవికదృష్టి - ఉం టుందో అప్పడే శమముంటుంది. మానసిక స్థిరత్వం.

స్వలక్ష్యే తన లక్ష్యంలో మనను స్థిరంగా నుండటం శమమనబడుతుంది. నియతావస్థా - అంటే నిలకడగా ఉండేస్థితి. మనం మోక్షశాస్త్రంతో వ్యవహరిస్తున్నాం కాబట్టి లక్ష్యం ఆత్మ. ఇంకనూ ఇక్కడ అధికారిని గురించి చర్చిస్తున్నాం. అతడు ఏదో ఒక ఉపాసన - జపమో - ప్రార్థనో కలిగిఉండాలి. అందుచేత స్వలక్ష్యమంటే ఈశ్వరుణ్ణి సగుణబ్రహ్మను స్వీకరించవచ్చు. ఎప్పుడైతే సాధకుడు బ్రహ్మ విచారం చేస్తాడో - లక్ష్యము నిర్గుణబ్రహ్మమవుతుంది. ఆ జ్ఞానానికి ఫలితంగా ఏది ఏమిటో అర్థం చేసుకుంటాడు. అయినా బ్రహ్మవిచారం చేసేటప్పుడుకూడా - మనస్సు యొక్క నిశ్చలత కొరకు - ఈశ్వరునితో సంపర్కం పెట్టుకుంటాడు. ఈశ్వరునితో ఆ సంబంధమే - ఈశ్వర నియతిని అంగీకరించటమే - నియతికెదురు తిరుగాడే స్వభావాన్ని శమింపజేయటమే స్వలక్ష్యము.

ఈశ్వర నియతి నంగీకరించినప్పడు - "జరగవలసినవి జరిగి తీరుతవి. నేను చేయగలిగింది చేస్తాన" నే భావన అలవడుతుంది. ఈ భావన - ప్రతిఘటించే నీ స్వభావాన్ని - మార్చివేస్తుంది. నీవు పరిస్థితులను నియమించలేవు. కాబట్టి ప్రతిఘటిస్తావు. భద్రత (రక్షణ) పోతుందని అంతరంగంలో నున్న భయం చేత - పరిస్థితులను నియమించాలని చూస్తావు. ఎప్పటికీ ఉండే భయమది - నిరాకరణభయం. వెలివేయబడతాననే భయం - తీసివేయబడతానని భయం - అప్రయోజకుడనని ముద్రిస్తారనే భయం - ఈ భయలన్నీ 'నాకు భద్రత లేద'నే భావననుండే ఉత్పన్నమవుతాయి.

అది పరిస్థితులను ప్రతిఘటించేట్లు- నియమించేట్లు చేస్తుంది. ఈశ్వరుణ్ణి ఎంతగా అంగీకరిస్తావో - అంతంతగా నిన్ను నీవంగీకరిస్తావు. నిజంగా చెప్పాలంటే - ఇదే ఉత్తమోత్తమైన బేరం.

లోకంలో ఏ బేరంలో నైనా ఇవ్వటం, తీసుకోవటముంటుంది. ఏదో ఒకటి ఇస్తావు. తిరిగి ఏదో ఒకటి పొందుతావు. నీవు నీ కాలాన్నిస్తావు. నైపుణ్యాన్నిస్తావు. ధనం, సలహా, లేక పేరు ప్రతిష్ఠలు. కానీ ఇక్కడ ఈశ్వరుణ్ణి అంగీకరించటంలో నిన్నే

ఇస్తావు. ఇది అన్నిటినీ మించిన అర్పణ. లోకంలో ఇదే పెద్దబేరం. ఈ బేరం కష్టమైన దే. నిన్ను నీవు నష్టపోతావు. నిన్ను నీవీశ్వరుడికర్పిస్తే ఇక ఉన్నదేమిటి? ఈశ్వర నియతిమాత్రమే. అహంకారమెంతగా బోధింపబడ్డదంటే - ఎంతగా మేల్కొల్పబడిం దంటే - విజ్ఞానవంతమైనదంటే - అది ఈశ్వరనియతిని పనిచేయనిస్తుంది. ఇదే ఈశ్వరభక్తి.

భక్తి అంటే ఈశ్వరునిలో అహంకారాన్ని కలిపేయటమే. దీన్ని నీవు తప్పించుకోలేవు. నీవు లోకంలో ఉన్నావు. కాబట్టి లోకంతో లెక్కలు సరిచేసుకోవాలి. లోకంతో జమా ఖర్చులు సరిచూసుకోవటమంటే - చాలా పద్దులు సరిచేసుకోవాలి. తల్లితో, తండ్రితో పొరుగువారితో ఇలా - చాలా ఉంటాయి. అంతేగాక - లెక్కలు సరిచేసుకోవటానికి - ఆయా వ్యక్తులు లభించక పోవచ్చు. లేదా వారు సిద్ధంగా ఉండకపోవచ్చు. అందు చేత లోకంతో లెక్కలు సరిజేసుకోవటం అసంభవం. కాబట్టి వీరందరిని ఒకే బుట్టలో పెట్టు - ఈశ్వరుడనే బుట్ట - నేరుగా అతడితోనే లెక్కలు సరిజేసుకో.

ఈశ్వరునిలో లెక్కలు సరిచేసుకోవటమంటే - ఏమిటో చక్కగా అర్థం చేసుకోవా లి. ప్రతి ఒక్కరూ ఈశ్వర నీతితో నియమాలచే పాలింపబడుతున్నారు. నిన్నెప్పడూ విమర్శించే వ్యక్తికి ఒక మనసున్నది. నీ దృష్టిలో అది కంపుగొట్టేది కావచ్చు. కానీ అలా ఉండటానికి - పూర్వచరిత్ర - కారణమవుతుంది. ఆ గతం ఈశ్వరనియతి ననుసరించే ఉంటుంది. నియమాలు నీవి కావు. ఆ వ్యక్తివి కావు. ఆ వ్యక్తివే అయ్యే టట్లయితే - తాను బాధపడటం కోసం ఆ నియమాన్ని సృష్టించేవాడే కాదు. ఇప్పడు నీవు గనుక ఆ వ్యక్తితో - ఆ ప్రవర్తనకు కారణం - అతనికున్న వ్యధలతో కూడిన - అతడి గతం అని - అది కూడా ఈశ్వరనియమాల ననుసరించే ఏర్పడిందని - గుర్తించగలిగితే నీవు కరుణ గలిగినవాడివే. ఇక్కడ దయ అంటే - అర్థం చేసుకోవ టమే. అతడలా ప్రవర్తించడానికి కొన్ని కారణాలున్నాయని గుర్తించటమే. ఈ కారణా లు - అతడిలో ఆ ప్రవర్తనను కలిగిస్తాయి. ఎవరిచేత అయితే ఈ కార్యకారణసంబం

ధాలు సృష్టింపబడినాయో - అతడిని మనమీశ్వరుడంటాము. అతడు సృష్టికర్త, సృష్టి కూడాను. అతడు కేవలం లోకాన్ని సృష్టించిన వాడు మాత్రమే కాడు - అక్కడెక్కడో కూర్చొని, ఈ నియతి అంతా అతడి చేతి పనే - ఈశ్వరుని వ్యక్తరూపమే. కాబట్టి నీ వెంత అధికంగా ఈ నియయాన్ని గుర్తిస్తావో - అంత అధికంగా నీవు దయగల వాడి వవుతావు. ఇతరుల పట్లేకాక - నీ మనసు పట్లకూడ. నీపట్ల నీవు కరుణావంతుడ వుతావు. దాన్నే ఈశ్వరునితో లెక్కలు పరి చేసుకోవటమంటారు.

ఈశ్వరునితో లెక్కలు సరిచేసుకోవటమంటే - ఈశ్వరుణ్ణి నీ హృదయంలోకి రానివ్వటమే. క్రైస్తవమతప్రచారంలో ఒక చక్కని వాక్యమున్నది. "జీసెస్‌ని నీ హృదయం లోనికి రానివ్వు". వారికది ఏ విధంగా అర్థమైందో నాకు తెలియదు. వారికదొక విశ్వసించవలసిన విషయం కావచ్చు. నీవు జీసెస్‌ని అంగీకరించు - అతడు నీకు పాపాన్ని అంటకుండా చూసుకుంటాడని కావచ్చు. దానిలో కొంత సత్యం కనిపిస్తుంది. ఆ సత్యము "ఈశ్వరుని నీ జీవితంలో ప్రవేశించనీ - ఈశ్వరుడు ముందే నీ హృదయం లోపల, బయట ఉన్నాడు. అతడిని నీ జీవితంలో ప్రవేశించనియ్యి. అదెలా చేయటం? ఈశ్వరుని నీ జీవితంలో ప్రవేశించనీయటమంటే నీ హృదయము నతని కొరకు తెరచి నీ జీవితము నతడినే పాలించనీయటం. అదెంతో రమ్యమైన విషయము. ఈశ్వరునితో సంబంధం గుర్తిస్తున్న కొద్దీ - విషయములు, వాటి తీరుతెన్నులన్నీ నిర్దిష్టమైన నియమాల్ననుసరించే ఉన్నాయన్న సత్యాన్ని - అధికంగా చక్కగా అర్థం చేసుకుంటావు. ఇలా నీ వర్థం చేసుకుంటావు "కోరికలు నా కివ్వబడ్డాయి. వాటిలో మార్పు తీసుకురాగల శక్తి కూడా నాకివ్వబడింది. నేను చేయవలసింది చేస్తాను. చుట్టూ ఉన్న ప్రదేశాలు, కలిసి ఉన్న వారితో సంబంధాలు, ఆహ్లాదంగా ఉండేటట్లు చూస్తాను" అని - నీవు చేయగలిగింది చేయి ! ఈశ్వరుణ్ణి - ఆయన నియతి ప్రకారం - పనిచేయనియ్యి. అదే ఈశ్వరుణ్ణి నీ జీవితంలో ప్రవేశించ నీయటమంటే.

వ్యక్తిగత అహంకారము ఈశ్వరునితో లెక్కలు సరిచేసుకోకపోతే, కర్తృతంత్రభావం నుండి బయటపడటం చాలా కష్టం. దాన్నుండి బయట పడక పోతే వాస్తవిక దృష్టి ఉండలేదు. విరక్తమనసుకే శమముంటుంది. తాను సాధించదలచుకున్న దానిలో స్థిరంగా ఉండగలడు.

13వ శ్లోకము

విషయేభ్యః పరావర్త్య స్థాపనం స్వస్వగోలకే ।
ఉభయేషా మింద్రియాణాం స దమః పరికీర్తితః ॥ 23 ॥

ఉభయేషాం ఇంద్రియాణామ్ - జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు రెండింటిని; విషయేభ్యః - విషయములనుండి; వరావర్త్య - పరావర్తనము గావించి; స్వస్వగోల కే - వాటి వాటి స్వస్థానములలో; స్థాపనం - ఉంచటమును; దమః - దమము(అని); పరికీర్తితః - అనబడును.

"జ్ఞానేంద్రియములను, కర్మేంద్రియములను రెండింటిని వాటి వాటి విషయములనుండి మరల్చి వాటి స్వస్వస్థానములలో నుంచటం దమ మనబడుతుంది."

శాస్త్రము ఆచరణకు అవకాశం చూసి చెప్తుంది. శమము పొందటమంత సులభం కాదని చెప్తుంది. అందుచేత దమాన్నభ్యాసం చేయమని చెప్తుంది. శమము లేనప్పు డేదమము కావాలి. కాబట్టి ఆ రెండూ కలిసి ఉంటాయి. దమము సంకల్పశక్తిని స హాచిస్తుంది. శమము మానసిక పరిపక్వతను సూచిస్తుంది. పరిపక్వత విరక్తి కలిగి నతర్వాత వస్తుంది. శమము పొందటంలో నీ సంకల్పం లేదు.

మనస్సెప్పుడూ పనిచేస్తూనే ఉంటుంది. ఎల్లప్పుడూ లయించి ఉండలేదు. కాబట్టి శమము ఎల్లప్పుడూ సంభవం కాదు. తన లక్ష్యాలను సాధించడానికి అనుకూలంగా

మనసు నీ అధీనంలో ఉన్నంతవరకూ మనసు క్రియాశీలిగా ఉండటంలో తప్పలేదు. శమము లేనప్పడు దమము చాలా ముఖ్యము. అది తాడు దొరకనప్పడు, దూడ యొక్క తోకను పట్టుకోవటం లాంటిది. ఇది తమిళంలో పురాతనమైన గ్రామసామెత. దూడ మెడకి కట్టినతాడుని పోగొట్టుకుంటే - దూడ నీపట్టుని వదిలించుకుంటే - నీవు దాని తోకని పట్టుకుంటావు నీనుండి పారిపోకుండా, తోకను పట్టుకొని ఉన్నావు కాబట్టి ఉపాయంగా తాడుని సంపాదించవచ్చు.

ఆధునిక మనస్తత్వ శాస్త్రం కూడా దమమును బోధిస్తుంది. "ఎవరికైనా క్రోధముంటే అది తగనిరీతిలో వ్యక్తం కాకూద"ని చెప్తుంది. నీ వెవరిపైనైనా కోపంగా ఉన్నావను కో "నీవతడితో ఇపుడు నేను కోపంగా ఉన్నాను. నీతో తురువాత మాట్లాడతాన"ని చెప్పవచ్చు. కానీ కోపమింకా ఉన్నది కనుక దానితో ఏం చేయాలి ? వెళ్ళిపోయి తల గడ తీసుకుని నేలకేసి కోపం పోయే వరకూ కొట్టవచ్చు, లేదా నీ కోపాన్నంతా వెళ్ళగ్ర క్కుతూ ఒక ఉత్తరం వ్రాసి తరువాత చింపివేయవచ్చు. ఇది దమమంటే.

జ్ఞానేంద్రియాలకు, కర్మేంద్రియాలకు వాటి వాటి విషయములున్నవి. ఎప్పడెప్పడైతే ఆ ఇంద్రియములు తగని రీతిలో ప్రవర్తించటం గమనిస్తావో, అప్పడల్లా వాటిని మరల్చి వాటి వాటి స్వస్థానములలో నుంచాలి. విషయేభ్య: పరావర్త్య స్థాపనం స్వస్వగోలకే. స్థానములలో నుంచటమంటే- వాటిని - వాటి వాటి విషయాలవైపు వెళ్ళనివ్వటం కాదు. ఎప్పడైతే ఇంద్రియములు అనుచితరీతిలో ప్రవర్తించ బోతున్నవనిపిస్తుందో అప్పడల్లా దమమును ప్రయోగించాలి.

అంతేగాక, దమమునకు అప్రమత్తత కావాలి. అది పూర్తిగా సంకల్పంమీదే ఆధారపడ్డ ది. దమము కావాలంటే నీ సంకల్పాన్ని ఉపయోగించి తీరాలి. ప్రతిదానిలోనూ దమ ముండాలి - మాట్లాడటంలో, నడవటంలో, భుజించటంలో, తిరగటంలో వగైరాలలో ప్రతికదలిక యుక్తమైన రీతిలో ఉండాలి.

పాశ్చాత్యసంస్కృతిలో ఈ దమమును సామాజిక జీవనంలో చూడవచ్చు. అది ఎంత ప్రబలంగా ఉన్నదంటే - సమాజమంతా చాలా క్రమబద్ధంగా ఉంటుంది. ఆ నియమబద్ధత యావత్తూ ప్రతివ్యక్తి తనకు తమ క్రమశిక్షణతో నుండటంవలన సాధ్యమైంది. యుక్తంకాని కర్మలను నీవు చేయవు. క్యూ పద్ధతి ఉన్నచోట, ఎలాగోలా నీవు చొరబడితే అప్పుడది దమము లేక పోవటమవుతుంది. భారతదేశంలో సనాతన సంప్రదాయబద్ధమైన కుటుంబాలలో ఈ దమమును చాలా ఎక్కువగా వారి ప్రవర్తనలలో చూస్తాము. వారు స్నానం చేయకుండా పూజగదులలోకి వెళ్ళటం, వంటగిన్నెలు తాకటం వంటి పనులు చేయరు. అది దమము నభ్యసించటము. పరిస్థితులు, సరదాలచేతనే నీ జీవితాన్ని నడపనివ్వవు. వాటిని నియంత్రించటానికి నీ సంకల్పాన్ని ఉపయోగిస్తావు. మనోభావాలు వ్యక్తం కావడం కూడా యుక్తమైన రీతిలో ఉండేవిధంగా.

దమమంటే అప్రమత్తత, మనసుకు సంబంధించినది. తగనివిధంగా మాట్లాడమని మనసు ప్రోత్సహించినపుడు - ఆ పలుకులు నీవు పలకవు. ఆ భావో-ద్రేకాన్ని క్రమబద్ధం చేస్తావు. భావోద్రేకాన్ని క్రమబద్ధం చేయడమంటే - ఎవరితోనైనా మాట్లాడటం - లేదా దాన్ని కాగితంపై వ్రాయటం - లేదా అటువంటిదేదైనా చేయటం, నీవేమి చేయకపోతే - అది అయుక్తంగా బయటకు వస్తుంది.

దమమును క్రమబద్ధం చేయటాన్ని అర్థం చేసుకుందాం. భారతదేశంలో సాధారణంగా అందరూ చేస్తుంటారు. చిన్నపిల్లవాడు నేలమీద పడినాడనుకుందాం. దెబ్బతగిలింది. అప్పుడు తల్లి "ఓ ! నేల నిన్ను కొట్టింది; నేనుండగా నిన్ను దెబ్బకొట్టడానికి దానికెంత ధైర్యము !" తల్లి నేలను తంతుందికూడ, శిక్షించటం కోసం. అది సరైనదనిపిస్తుంది. ఎందుకంటే పని ఒకటి జరిగింది. బాధ్యత వహిస్తానని చూపబడ్డది. పిల్లవాని కొక భావన ఇవ్వబడ్డది. నేల కూడ నన్ను కొట్టలేదు. అమ్మ నా జాగ్రత్త వహి

స్తుంది అని. కానీ ఇలా క్రమబద్ధం చేయటంలో కూడా కొంత అనారోగ్యకరస్థితి ఉన్న ది. ఎందు చేతనంటే - అకారణంగా నేల నిందించబడ్డది. ఎప్పుడెప్పుడైతే తప్పు చేస్తాడో అప్పుడల్లా ఎవరో ఒకరిని ఎరచేసి, అతణ్ణి బాధ్యుణ్ణి చేయటం పిల్లవాడు నేర్చుకుంటాడు. ఇది ఒక సమస్యే కానీ - దానిని సులభంగా అతిక్రమించవచ్చు, మొదట్లోనే సరిగా క్రమబద్ధం చేస్తే మొట్టమొదట క్రమబద్ధం చేయటం లేక పోతే - తరువాత తరువాత అది పెద్దసమస్యగా మారుతుంది. ఇక్కడ దెబ్బ వెంటనే క్రమ బద్ధం చేయబడ్డది. జాగ్రత్త తీసుకోవటం ద్వారా ఈ క్రమబద్ధం చేయటమే దమము.

14వ శ్లోకము

బాహ్యానాలంబనం వృత్తేః ఏషోపరతి రుత్తమా !

సహనం సర్వదుఃఖానాం అప్రతీకారపూర్వకమ్ !

చింతా విలాపరహితం సా తితిక్షా నిగద్యతే ॥ 24, 25 ॥

వృత్తేః - అహంకారము; బాహ్య అనాలంబనము - బాహ్యే విషయముల ఆలంబ నము లేకుండా ఉండటము; ఉత్తమా ఉపరతి - ఉత్తమమైన ఉపరతి; సర్వ దుఃఖా నాం -సర్వ దుఃఖములను;అప్రతీకార పూర్వకమ్ - ప్రతీకార ప్రయత్నములు లేకుండా; చింతావిలాస రహితమ్- వ్యధ విలాపములు లేకుండా; సహనమ్ - వాస్తవ దృష్టితో స్వీకరించటము; సాతితిక్షా- అది తితిక్షా; నిగద్యతే - అనబడుతుంది.

"అహంకారము బాహ్య విషయముల ఆలంబనం లేకుండా ఉండటము ఉత్తమమైన ఉపరతి. దిగులు, విలాపములు, ప్రతీకార ప్రయత్నములు లేకుండా సర్వదుఃఖములను వాస్తవదృష్టితో స్వీకరించటము తితీక్షా అనబడుతుంది."

తమ దమముల తరువాత ఉపరతి వర్ణింపబడుతుంది. ఉపరతి అంటే - వృత్తేః బా హ్య విషయఅనాలంబనం - అహంకారము ఆలంబనమునకై బాహ్యవిషయములపై ఒరగకుండా ఉండటము. ఆలంబనమంటే ఆధారంగా అనుకోవటం. అనుకోకుండా

ఉండటం అనాలంబనము. అహం వృత్తి అహంకారము - ఆధారం కోసం విషయాల నాసరాగా తీసుకోకపోవటము ఉపరతి. కానీ దానర్థం లోకంనుండి తప్పించుకుపోవటం కాదు. జ్ఞానేంద్రియములు పని చేస్తున్నప్పడు విషయ సంయోగాలకనుగుణంగా మనోవృత్తులు, నాకుంటాయి. కండ్లు తెరచినపుడు కొండలను, నదుల్ని, మనుష్యులను, వస్తువులను, జంతువులను, పరిస్థితులను - ఇంకా ఇంకా - చూస్తావు. వాటిని తప్పించలేవు. నీవు గుహలో ఉన్నప్పటికే గుహను, గబ్బిలాలను చూస్తూనే ఉంటావు. గుహనుండి బయటకు వచ్చినపుడు ప్రపంచం ఉండనే ఉంది. నీ కోసం, ఎదురుచూస్తూ, నీ కళ్ళు, చెవులూ మూసుకున్నప్పటికీ - బాహ్యప్రపంచాన్ని తప్పించుకోలేవు. నీ స్మృతులు బాహ్యప్రపంచాన్ని నీ లోపలే ఏర్పరచుతాయి. అందుచేత ఎవరూ బాహ్యప్రపంచాన్ని తప్పించుకోలేరు. స్మృతులనుండి గానీ - ప్రత్యక్ష దర్శనం వలన గానీ - ఏర్పడే మనో వృత్తులరూపంలో - బాహ్యప్రపంచం - తనని తాను నీముందుంచుతుంది. ఆ విధంగా లోకం నీమనసులో ఉంటుంది. నీవా మనోవృత్తులతో కలిసి పోతూ ఉండవచ్చు - లేక - పోకుండానూ ఉండవచ్చు. మనోవృత్తులతో తాదాత్మ్యము చెందకుండా ఉండటాన్ని ఉపరతి అంటాము. అదే సంన్యాసమని కూడా భావింపబడుతుంది.

ఉపరతి “ఇది నాది” అన్న భావనయొక్క అభావాన్ని సూచిస్తుంది. అంటే “ఇది నా ఇల్లు” “ఇది నా వాహనము” “ఇది నాది” అనే మమకారవృత్తి ఉండదు. ఈ “మమత్వమే” అన్ని సమస్యల్ని సృష్టిస్తుంది. అసలీ “మమ” పదము “అహం” పదమునుండి జనించింది. ఇది నాది అని ప్రకటించినపుడు అహంకారము న్యూనత్వం పొందుతుంది. స్వంతదారుగా ఉండటం నిన్ను చిన్నవాడిని చేస్తుంది. నేను స్వంతదారుడననుకొనటమొక భావమే. (కలిగి ఉండటంలేదు.) సొంతదారుడననుకోవటం నిన్ను చిన్నవానిగా పరిమితం చేస్తుంది. ఎందుకంటే, నీకు సొంతమైంది పరిమితం - సొంతం కానిది అనంతం.

ఈ భూమి అంతా నీ సొంతమైనా, ఇంకా నీవు విశాలవిశ్వంలో ఒక చిన్ని చుక్కకు మాత్రమే సొంతదారువి. ఆవిధంగా స్వంత దారు ననుకోనటం నిన్ను నిరర్థకునిగా చేస్తుంది. ఎందుకంటే నాణానికి ఒకవైపు సొంతదారుదనము - రెండవ వైపు పరిమితి.

నన్ను నేను పూర్ణుడిగా చూడాలని కోరుకొంటాను. మమత్వమంటే నేను పూర్ణుడనని చెప్పలేవు. అది నిన్ను పరిమితుణ్ణి చేస్తుంది. కాబట్టి మమత్వము అహంకారానికి బలాన్నిస్తుంది. ఎముకలతో కూడిన ఒకరకమైన ఆకారాన్నిస్తుంది. అలా లేకపోతే అహంకారము ఒక బుకాయింపు గాలితిత్తే కానీ ఈ మమత్వమిచ్చే బలం అహంకారానికి హానిచేస్తుంది. అది తగని వ్యక్తి బలంపొందటం లాంటిది. అది అతడికి వినాశమే.

అందుకే నేనెప్పడూ చెప్తుంటాను - ఆలోచనా విధానం సరియైనదైతే శీర్షాసనం మంచిదే. శీర్షాసనంవలన మెదడు కణాలకి రక్తప్రసారము ఎక్కువవుతుంది. ఫలితంగా మెదడు పనిచేయడ మధికమవుతుంది. ఆలోచనా విధానం ఋజుమార్గంలో ఉంటే అది మంచిదే - కానీ తప్పు మార్గంలో ఆలోచిస్తూంటే మెదడుకి అధిక రక్తప్రసారణం ముప్పతెచ్చిపెడుతుంది. అటువంటప్పడు, కనీసావసర మైనమేరకే రక్తప్రసారం జరిపితే మెదడు ఎక్కువగా పనిచేయదు. అది శ్రేయస్కరం. అది గనక ఎక్కువగా పనిచేస్తే తనకు, ఇతరులకుకూడ సమస్యలు సృష్టించి పెడుతుంది. అదే విధంగా అహంకారానికి బలాన్నిచ్చే దేదైనా, అది దానికి మంచిది కానేకాదు. కాబట్టి ఈ అహంకారాన్ని ఆలంబనంగా వస్తువులపై ఒరగకుండా ఉండటమంటే "మమత్వ రాహిత్యమే". ఉపరతి అనబడేదదే.

తితీక్షా - సంయమనం సర్వదుఃఖానాం - బాధగలిగించే పరిస్థితుల పట్ల వాస్తవిక దృష్టి కలిగి ఉండటమే. దుఃఖము భౌతికమైన బాధ కావచ్చు లేక కొన్ని బాహ్యపరిస్థితుల వలన కలిగించబడిన భావోద్రేకమైనది కావచ్చు. తితీక్ష అంటే దుఃఖం కలుగ

నిచ్చింతరువాత దాన్ని సహించటం కాదు. ఒక్కసారి దుఃఖాన్ని కలుగనిచ్చిం తర్వాత దాన్ని సహించవలసిందే. మార్గాంతరం లేదు. సహనమంటే సాధారణంగా నీకు దుఃఖాన్ని కలిగించేటువంటి - నీవిప్పడు మార్చలేని పరిస్థితులలో - వాస్తవికతతో నుండటం. పరిస్థితులను సౌకర్యంగా ఉండేటట్లు మార్చగలిగితే వెంటనే మార్చు. కర్మ ఉన్నదందుకే. ఉదాహరణకు చలికాలంలో ఒక రాత్రిపూట కిటికీ తెరచి ఉందనుకుందాం, చాలా చలిగా ఉంది. మరప్పడు లేచి కిటికీ మూసి వేయాలి. "ఈ చలిని నేను సహించనా" అని నీవు ఆలోచిస్తే అది సహనమనుకోరు. అది తెలివి తక్కువదనము. లేచి కిటికీ మూసి వేయాలి. అదే నీవు చేయవలసిన పని కిటికీ మూసినప్పటికీ గదింకా చల్లగా ఉంటే ఆ సమయంలో దాని గురించి నీవు చేయగలిగిందేమీ లేకపోతే అప్పడు భరించు. అదీ సహనం.

ఇంకనూ సహనమంటే సంతోషకరము కానటువంటి అనివార్యమైన పరిస్థితులను చింతావిలాపములు లేకుండా భరించగలిగే శక్తి చింత అంటే ఆత్రుత. "చలిగా ఉంది, చాలా చలిగా ఉంద"ని అనటమొకసారి ఆరంభిస్తే మనసు అలాగే సాగిస్తుంది. "అవును చాలా చలిగా ఉంది ఇంత చలిలో ఎవరుండగలరు. ఉండటంచాలా కష్టం" ఈ విధంగా, ఇది చింత. తితీక్షా - చింతారాహిత్యం- ఈ పెంచుకోవటం లేకుండా ఉండటం. విలాపమంటే కష్టమైన దాని గురించే ఎక్కువగా మాట్లాడటం కష్టమైన పరిస్థితులను మొత్తుకోకుండా, మొరపెట్టుకోకుండా భరించగలిగే సామర్థ్యం తితీక్షా అవుతుంది.

తితీక్షా అంటే "నీ కష్టాలగురించెవ్వరితో మాట్టాడవద్ద" నే సలహా లాంటిది కాదు. అది కాదిక్కడ చెప్పన్నది. నీవు మాట్లాడవలసి వస్తే అది విషయాన్ని జటిలంచేయకుండా, నీకు సహాయపడేదైతే అప్పడు మాట్లాడటమే మంచిది. అది మంచిదే. అప్పడు నీ సమస్యని క్రమబద్ధం చేయటమవుతుంది. కానీ విలాపంవేరు. విలాపమంటే, ఎప్పడూ ఏదో ఒకదాని గురించి గొణుగుతూండటం, మొరపెట్టు కోవటం.

ఈ స్వభావం అశ్రద్ధ చేసి వదిలి వేసే విషయం కాదు. పట్టించుకుని పరిశీలించి క్రమబద్ధం చేయవలసిన విషయం. ఆత్మ నర్థం చేసుకోవటాని కెటువంటి మనసుం డాలో తితీక్షా వివరిస్తుంది. ఈ అధికారి లక్షణాలను సరిగా పరిశీలిస్తే ప్రతిదానికొక్క స్థానముంది. - అధికారి అంతఃకరణమును వర్ణించటంలో.

ప్రతివారి జీవితంలో "కన్నుకి కన్ను" అనే పరిస్థితులు ప్రతీకార చర్య చేయాలనే విధంగా ఏర్పడుతుంటాయి. వాటితో వాస్తవిక దృష్టితో దయతో ప్రతీకారం లేకుండా వ్యవహరించాలి. నీ పట్ల తప్పగా వ్యవహరించిన వారితో ప్రతీకారం తీర్చుకునేవిధం గా ఆలోచించకుండా యాంత్రికంగా ప్రతిస్పందించటం ప్రతీకారమంటారు. సరైన అవగాహననుండి, దయతో బుద్ధి పూర్వకంగా వచ్చే ప్రతి స్పందన అప్రతీకారము. ఇవన్నీ కలసి తితీక్ష అవుతుంది.

ప్రతీకారభావన ఎవరినీ సాధువుని చేయలేదు. అహింసకు కట్టుబడినవాడు సాధువు. ఇతరులలో మంచినే చూస్తాడు. ఇతరులలో ఎప్పడూ చెడునే చూచే వాడు సాధువు కాబోడు. ఏది మంచో దాన్నామోదించేవాడు సాధుపురుషుడు. అత డికి మాత్రమే వేదాంతము ఉన్నతినిస్తుంది. ఈ విధంగా సాధుత్వమున్నపుడు - సృష్టి నియతిరూపంలో నున్న ఈశ్వరుడి గురించిన సరైన గుర్తింపు ద్వారా - అహంకా రాన్ని సమాధానపరచవచ్చు. కాబట్టి సాధుత్వంలో తితీక్ష ఉన్నది.

15వ శ్లోకము

శాస్త్రస్య గురువాక్యస్య సత్యబుద్ధ్యావధారణా ।
సా శ్రద్ధా కథితా సద్భిః యయా వస్తూపలభ్యతే ॥ 26 ॥

శాస్త్రస్య- శాస్త్రము యొక్క గురువాక్యస్య - గురువాక్యముల యొక్క సత్య బుద్ధ్య వ ధారణా - సత్యత్వమును దృఢముగా విశ్వసించుటను; సా శ్రద్ధా - అది శ్రద్ధా (అని); సద్భిః - జ్ఞానులచే; కథితా - చెప్పబడినది; యయా - దేనిద్వారానైతే; వస్తు - సత్య వ స్తువును; ఉపలభ్యతే - తెలుసుకోవచ్చునో.

"శాస్త్రము - గురువాక్యములు సత్యములే నన్న ధృడవిశ్వాసమును శ్రద్ధా

-అని జ్ఞానులందురు. దాని ద్వారా సత్యవస్తువును కనుగొనవచ్చును."

శ్రద్ధా అంటే విశ్వాసము ఈ faith లేదా trust అను ఆంగ్గపదములు శ్రద్ధ యొక్క అర్థమును పూర్ణంగా వ్యక్తం చేయలేవు. శాస్త్రస్య గురువాక్యస్య సత్యబుద్ధ్యావధారణ మని నిర్వచింపబడినది. అవధారణా అంటే నిర్ధారించటం - ధృడవిశ్వాసం - లేదా నిష్ఠ సత్యబుద్ధి. అంటే- "ఇది సత్యమే" నని పలికే బుద్ధి. వేదశాస్త్రముయొక్క - మరి యు గురువుయొక్క - వాక్యములయందు "ఇది సత్యము" అన్న బుద్ధియే శ్రద్ధ - అని పలుకబడుతుంది.

నీవు బ్రహ్మము అని శాస్త్రము చెప్తుంది. నీవు తెలుసుకున్నప్పడే, "అవును ఈ వాక్య ము నిజమే" నని చెప్పగలవు. తెలుసుకోకముందు, అది నిజమేనని చెప్పలేవు. మరి నీ గురించిన నిర్ణయం నీకున్నది. అది శాస్త్రము చెప్పే దానికి పూర్తిగా విరు ద్ధంగా ఉన్నది. నీవు మర్త్యుడవని నిరర్థకుడవని నీకు తెలుసు. నిన్ను నీవు ఏ విధం గా చూచిన - జ్ఞానపరంగాగాని - శక్తిపరంగాగాని - ఆరోగ్యంలో గాని - వ్యాపకత్వ దృష్ట్యాగానీ - నీవు అత్యంత అల్పుడవని నీకు తెలుసు. ఇప్పడు నీవు శాస్త్రము ద్వా రా బోధింపబడుతున్నావు - "నీవు పూర్ణము" "నీవే ఈశ్వరుడవు" అని. ఇది చాలా పెద్ద విషయం ఊహకందనిది. నిజంగా ఇది దైవదూషణమే.

జీవుడికున్నది చాలా స్వల్ప జ్ఞానం. దాదాపు దేని గురించి తెలియనివాడే. ఒక పు ష్పం గురించి కూడా సమగ్రంగా తెలిసిన వాడుకాదు. ఈ పుష్పం గురించి నీవు చె ప్పగలిగినదల్లా ఇదొక గులాబి పుష్పమని మాత్రమే. అంతకు మించి దాని గురించే మీ నీకు తెలియదు. ఈ గులాబి పుష్పం ఆ రంగులోనే ఎందుకుంది ? మొక్క ఆ రంగునేవిధంగా కలిగిస్తుంది. కఠినమైన భూమి నుండి అంతటి ప్రత్యేకమైన మృదు త్వాన్నెలా ఇస్తుంది. వీటిల్లో దేని గురించి ఖచ్చితమైన అంతిమజ్ఞానం మనకు లేదు. కాబట్టి గులాబి గురించి మనకు తెల్సింది బహుస్వల్పం. ఆ విధంగా జీవుడు నిజంగా

నే అజ్ఞాని. ఈ అజ్ఞాని బోధింపబడుతున్నాడు. - “నీవు సర్వజ్ఞుడవు - నీవు సర్వేశ్వ రుడవు - నీవు సర్వశక్తిమంతుడవు - అని.” నేనెలా సర్వశక్తిమంతుడ నవుతాను ? ఒక పెద్ద రాయిని కూడా లేపలేను. సూక్ష్మక్రిములు నన్నెప్పుడూ పటుకుంటూనే ఉం టాయి - నేను తప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నప్పడు కూడా. నేనేమిటో దానికి పూర్తి విరుద్ధంగా ఉన్నది - శ్రుతి చెప్పేది. ఒక పరిచ్ఛిన్నుడు, అల్పుడు చెప్పబడుతున్నా డు. నీవు అపరిచ్ఛిన్నుడవు, అనంతుడవని “నేను సృష్టింపబడిన వాడనని భావించే వ్యక్తి “నీవే సర్వానికి కారణము” అని చెప్పబడుతున్నాడు. శాస్త్రదృష్టి నా గురించి నాకున్న దృష్టికి పూర్తి విరుద్ధంగా ఉంది.

“నేనే బ్రహ్మన”ని అప్పడప్పడు వినడానికి ఆహ్లాదంగానే ఉంటుంది. “నీవే దేశానికి రాజువి” అని ఒకరు చెప్పడం లాగా ఉంటుంది. అది వినడానికి బాగుంటుంది కానీ - అది అసత్య వాక్కు. అసత్య పలుకులు ఎంతటి పొగడ్తలైనా నేనంగీకరించను. కాబట్టి “నేను బ్రహ్మము” అన్న వాక్యము నేనొప్పకోలేను.

నాకు తెలిసిన దాని ప్రకారం ప్రవర్తించగలను. నా పరిమితుల గురించి నాకు బా గా తెలుసు. కానీ శాస్త్రదృష్టిలో నేనీశ్వరుణ్ణి ! ‘సాధకుడే సాధ్యము’. ఆ దృష్టి నేనంగీ కరంచలేను. ఒకవేళ శాస్త్రాన్ని సరిగా అర్థం చేసుకోలేనేమోననుకుని శాస్త్రము చక్క గా తెలిసిన గురువువద్దకు వెళితే శాస్త్రము చెప్పినదాన్నే ఆయన దృవపరిచారు. ఈ పరిస్థితులలో నీకు శ్రద్ధకావాలి. నా గురించి శాస్త్రానికున్న దృష్టినంగీకరించటానికి. నేను ఇది - అని నా గురించి నేనేమనుకుంటున్నానో - దానికి పూర్తివిరుద్ధమైనది. అలాంటప్పడు నాకు కావలసింది సామాన్యమైన శ్రద్ధకాదు. శాస్త్ర వాక్యములు సత్య ములేనని తెలుసుకోవటానికి అవసరమైన సరియైన ప్రయత్నం చేస్తాను. నా గురిం చి నాకున్న అభిప్రాయాలు కాకుండా - అదీశ్రద్ధ.

సద్గురువు శ్రద్ధనుత్పన్నం చేయగలడు. నీ స్వానుభవాలనే ఆధారం చేసుకొని తగి నన్ని వాదనలు ముందుంచి, నీ గురించి నీకున్న నిర్ణయాలు తప్పని నిరూపించగల

డు. ఏదైతే ఇక్కడ శాస్త్రములో చెప్పబడుతున్నదో 'నీవే పూర్ణము' అని, అందుకు నీ స్వానుభవంలో నున్న అనందానుభవాలే ఆధారమని ఎత్తి చూపగలడు. నీవు పరిచ్ఛిన్నుడివిగా ఉన్నప్పటికీ - నీ వెప్పడైతే ఆనందంగా ఉన్నావో - ఆ క్షణంలో- నిన్ను నీవు ముక్తుడవుగా గుర్తించగలవు. అంటే దానర్థం - నీ గురించి మరో అభిప్రాయముండాలి. నీ గురించి నీవేమనుకుంటున్నావో - అందుకు పూర్తిగా విరుద్ధమైనది - ఈ అభిప్రాయము ఆశించదగినది కూడ. నీ గురించిన ఒక అభిప్రాయం - "నేను ఆనందంగా ఉన్నాను - కాబట్టి కోరుతూ ఉన్న వాడిని కాదు -. కోరుతూ ఉన్న వాడిగా నేనందంగా ఉండలేను." ఈ రెండవ అభిప్రాయం శాస్త్రం చెప్తున్నదాన్ని విశ్వవించటానికి ఆధారంగా అంగీకరించవచ్చు.

ఈ జ్ఞానము సంపాదించటానికి శ్రద్ధ ఒక్కటే చాలా ముఖ్యమైనదిగా భావించబడుతుంది. శ్రద్ధ ఉంటే మిగిలిన ప్రతిగుణము ముముక్షుత్వంతో సహా పిండవచ్చు. బ్రహ్మజ్ఞాని నిరతిశయపదాన్ని పొందుతాడని శాస్త్రం చెప్తుంది. ఇదే నీలో ముముక్షుత్వాన్ని కలిగించగలదు - శ్రద్ధ ఉన్నట్లైతే. శ్రద్ధలేకపోతే నీవు శాస్త్రం దగ్గరకు గ్రంథపరంగా గానీ లేక పాండిత్యం కోసమో వెళతావు. నీకు శ్రద్ధ ఉంటే వ్యాకరణము, తర్కము లాంటివి చదవాల్సివచ్చినా - నీ అధ్యయనం పాండిత్యపరంగా ఉండదు. శ్రద్ధ ఉన్నట్లయితే విశ్వవిద్యాలయాలలో గానీ - మరే ఇతరచోట తత్వశాస్త్రం చదివినా - అది పాండిత్య పరమైనది గాదు. కానీ శ్రద్ధ లేకపోతే నీవు గురువు దగ్గర చదివినా అది విషయం తెలుసుకోవటానికి గ్రంథపఠనం క్రిందికే వస్తుంది. శ్రద్ధతో శాస్త్రాధ్యాయనమెవరు చేస్తారో - వారు ముముక్షువులు. ఎక్కడ అధ్యయనం చేసినా ఫరవా లేదు.

జ్ఞానసముపార్జన విషయంలో - శ్రద్ధ అంటే ఏమిటో - అర్థం చేసుకుందాం. నా చేతిలో గులాబి పుష్పముంది. అది ఎరుపు రంగుది. అది నీకు చూపించి - "ఈ తెల్లని మల్లెపూవుని చూడండని" చెప్తాను. నువ్వేమనుకుంటావు ? నీ శ్రద్ధ కేమవు

తుంది ? స్వామి మాటల్ని నమ్మాలనుకుంటావు. ఈ స్వామి చెప్పేది నిజమైతే బాగుం డునని కనీసం ఆశిస్తావు. "ఇది తెల్లని మల్లెపువ్వు" - అనే ఒక్క వాక్యంతో శ్రద్ధ అం తా పోతుంది. నీ భావావేశమంతా లగ్నం చేసి ఈ స్వామి కంకితం కావచ్చు. కానీ వాక్యాన్నంగీకరించలేవు; ఎందుకంటే నీవు నీకళ్ళనే నమ్ముతావు. కన్ను లోక ప్రమాణ ము. జ్ఞానం సమ్యక్ ప్రమాణము వలన కలుగుతుంది. కాబట్టి నీవు నా వాక్యాన్నంగీ కరించలేవు. నీవు చేయగలిగింది సందేహలాభాన్నివ్వటం. నీ ప్రక్కనే కూర్చున్న మిత్రుణ్ణి అడుతుతావు - "స్వామీజీ ఏం చెప్పార"ని. ఇంక నీకు వేరే సంప్రదింపులక్క ర లేదు. నీ శ్రద్ధ పోయింది. నీ జ్ఞానము చివరిది, నిర్ణాయకమైనది.

ఈశ్వరుడే దిగివచ్చి ఇది మల్లెపువ్వని చెప్పినా నీవంగీకరించవు. అది అబాధిత జ్ఞానము. కాదని కొట్టివేయబడలేని జ్ఞానము.

ఏ ప్రమాణమైనా ఉపయోగించే ముందు నీకు నమ్మకముండాలి. "నేను తెలుసు కోగలను" - 'నేను చూడగలను' - 'వినగలను', 'వాసన చూడగలను' - 'రుచిని తెలుసుకోగలను'. ఈ గులాబి పుష్పానికి వాసన లేదని - నేను చెప్పాననుకుందాం - శ్రద్ధతో నా మాటల నంగీకరించి, పుష్పానికి వాసన ఉందో లేదో నీవు పరీక్షించుకో వచ్చు. నీ ఘ్రాణశక్తి మీద నీకు నమ్మకముంది. కాబట్టి, అదేవిధంగా నా అనుమా నం మీద నీకు నమ్మకముంది. "మానవుడికి రెండు కాళ్ళున్నవి" అని నేనన్నానను కోండి. అది తప్పని వెంటనే నిర్ణయించవచ్చు, ఎందుకంటే కాకి క్కూడా రెండు కాళ్ళుండటం చూచావు. కాబట్టి ఈ అనుమానం కాకులకి కూడా వర్తిస్తుంది. అం దులో అతివ్యాప్తి దోషముంది. ఈ అనుమానంలో నున్న దోషాన్ని ఎత్తి చూపగలవు. ఒకసారి దానిలో ఉన్న దోషాన్ని చూసిన తరువాత దాన్ని నేనంగీకరించబోవటంలేదు. ఎందుకంటే అనుమానప్రమాణాన్ని ఉపయోగించగల నీ శక్తిమీద నీకు నమ్మక ముంది. ఆ నమ్మకం పూర్ణమైనది.

నీవు ప్రమాణాన్ని ఉపయోగించినపుడు ప్రత్యక్షంగానీ, అనుమానంగానీ - ఆ ప్రమాణం దేన్ని అయితే గుర్తించాలో, దాన్ని గుర్తించే - తెలుసుకోనే దాని యొక్క సామర్థ్యం మీద నీకు పూర్తి నమ్మకముంది. అది ఉన్నదనంగీకరించే ఆరంభిస్తావు. లేకపోతే ప్రమాణాన్నుపయోగించలేవు. ఎవరైనా “దయచేసి చూడండి” అన్నప్పుడు, వెంటనే అప్రయత్నంగానే కళ్ళు తెరుస్తావు. కళ్ళు తెరవటం ద్వారా నీవు చూడగలవని నమ్ముతున్నావు. కాబట్టి ఈ విధంగా ఉపయోగించే ముందు ప్రమాణాన్ని ప్రమాణంగా చూడటాన్నే శ్రద్ధ అంటారు.

శబ్దం అనే ప్రమాణం మీద కూడ అంతటి శ్రద్ధ నీకుండాలి. కానీ శాస్త్రము, గురువాక్యములు నీకన్నా బాహ్యంలో ఉన్నాయి. కాబట్టి నీలోనే ఉన్న ఇతర ప్రమాణములమీద ఉన్న - ఆ శ్రద్ధ శాస్త్ర గురువాక్యములయందు నీకుండదు. ఎందుకంటే వేరెవరో ఈ మాటలు చెప్తున్నారు. అందుకే నీ కంతగా శ్రద్ధ ఉండదు. నిజానికి నీ విధానం ఎలా ఎంటుందంటే వేరే ఎవరైనా నీతో మాట్లాడితే - నీవు జాగ్రత్త పడతావు. ప్రత్యేకంగా, అనుకునే దానికంటే - చెప్పేది భిన్నంగా ఉన్న సమాజంలో - ఎవరి మాటలు నమ్మలేవు. మనుష్యులు చెప్పదల్చుకున్నదే చెప్పేటట్లయితే - నీవు వారి మాటల్లో నమ్మకముంచవచ్చు. కానీ నీ అనుభవం భిన్నంగా ఉంది. అనేక సందర్భాలలో నీ వితరుల మాటలు నమ్మావు. ఫలితంగా మోసపోయ్యావు. ఒక్కసారి దెబ్బతింటే రెండుసార్లు భయం అన్న ఆంగ్లసామెత చెప్పినట్లు ఇక చిన్న చిన్న విషయాల్లో కూడా - ఇతరుల్ని నమ్మటం కష్టమైపోతుంది. అందుచేత వేరే ఎవరో నీ స్వరూపం గురించి - సత్యం చెప్పినప్పడు - నీవు కన్నులు చెవులు ఉపయోగించినపుడు- వాటి శక్తిమీద ఎటువంటి విశ్వాసముంటుందో అటువంటి విశ్వాసం వారి మాటల్లో ఉండదు. అటువంటి శ్రద్ధకలగాంటే - శబ్ద ప్రమాణం విలువను అనివార్యతను అర్థం చేసుకోవాలి. ఆత్మ బ్రహ్మమే నన్న సత్యాన్ని తెలుసుకోవటానికి శబ్ద ప్రమాణం తప్ప ఇతర ప్రమాణము లేవీ పనిచేయలేవన్న సత్యం - అర్థం చేసుకోవాలి. ఇది సదసత్‌ల నిర్ణయం చేసే ప్రమాణ

శాస్త్రానికి సంబంధించిన సమస్యేకాని - ఆత్మ బ్రహ్మముగా మారటమన్న సమస్యకాద ని - నీవర్థం చేసుకోవాలి. ఆత్మ ఎప్పడూ బ్రహ్మమే. ఆ విధంగా గుర్తించగలగాలి. అందుకై నీకు సరియైన ప్రమాణం కావాలి. ఆత్మ బ్రహ్మమని నీకు తెలియక పోవటా నికి కారణం - ఆత్మ బ్రహ్మ కాకపోవటం కాదు - సరియైన ప్రమాణం లేకపోవటం కారణం. ఆ ప్రమాణం నీ దగ్గర లేదు. శాస్త్రమే ప్రమాణము.

ఇక్కడొక ప్రశ్న ఉండవచ్చు - పదములు పరోక్షజ్ఞానము మాత్రమే కదా ఇచ్చునవి. అవి సాధారణంగా పదములు పరోక్షజ్ఞానమునే ఇచ్చునవి, కాని అవి సిద్ధవస్తువు గురించి చెప్తుంటే - అవి ప్రత్యక్ష జ్ఞానమునే కలిగించును. ఎలాగో చూద్దాం.

ఒకసారి నేను విమానంలో మద్రాసునుండి ఢిల్లీకి ప్రయాణిస్తున్నాను. నా ప్రక్కన కూర్చున్న వ్యక్తి నాతో సంభాషణ నారంభించి తాను ఋషీకేశ్ వెళుతున్నానని, అక్కడ స్వామి దయానందను చూడాలనుకుంటాన్నానని చెప్పాడు. అతడి దగ్గర వ్రాసి ఉం చిన చిరునామా కూడా ఉంది. స్వామి దయానంద ఆశ్రమం, పురానీ ఝాడీ, ఋ షీకేశ్. అతడు నన్నడిగాడు - "దైవవశాత్తూ" మీకేమైనా ఈ స్వామి తెలుసా ? అని". ఇప్పడు నేనేం చేయాలి ? నేనతడిని ఆటపట్టించవచ్చు. లేదా అతడికి నిజం చెప్పవ చ్చు. నేనతడితో అన్నాను - "నేనే ఆ దయానందను - సో హం దయానందః" ఈ వా క్యమతడికి ప్రత్యక్ష జ్ఞానమిస్తుందా ? పరోక్షజ్ఞానము నిస్తుందా ? ప్రత్యక్షజ్ఞానమునే. ఇక్కడ ప్రత్యక్షజ్ఞానము నమ్మవలసిన విషయము. నా మాటలనతడు విశ్వసించాలి. కానీ ఆత్మ జ్ఞానం విషయంలో విశ్వసించాల్సిన అవసరం లేదు - స్వతః వేద్యమైన ఆత్మ ఎల్లప్పడూ ఉన్నది కాబట్టి. నేనక్కడే ఉన్నాను; నేను లేని కాలమంటూ లేదు. ఆ నేను బ్రహ్మమై ఉన్నది. అందుచేత, వాక్యము చక్కగా పనిచేయటాని కవసరమైన సందర్భాన్నేర్పచినా 'నీవే బ్రహ్మము' అని నీవు బోధింపబడినప్పడు అవరోక్షజ్ఞానం కల గాలి. కాబట్టి పదములు ప్రత్యక్షజ్ఞానమును తప్పక ఇవ్వగలవు.

ఇక్కడ ప్రమాణము శాస్త్రవాక్యములు - ఆ ప్రమాణమును ఉపయోగించేవాడు

గురువు. అందుచేతనే నీకు శాస్త్రవాక్యములయందు, గురువాక్యములయందు శ్రద్ధ ఉండాలని చెప్పబడింది. అంటే గురువుతో "మీరే ప్రమాణము - నన్ను చూచేట్లు చే యడానికి మీరున్నార"ని - చెప్పినట్లవుతుంది. అందుచేత శ్రద్ధ అంటే చక్కగా అమర్చి న ఒక మానసికస్థితి. దానితో నీవు అప్రమత్తంగా - ఏది నీకు తెలియజేయబడుతు న్నదో - ఏ సందేశము నీ కందించబడుతున్నదో - దానిని చూస్తావు. అప్పడు అర్థం కాకపోతే - చెప్పినట్లుగా చూడలేకపోతే - బోధను తీసివేయవు. బదులుగా నీవర్థం చేసుకోవటాన్నే ప్రశ్నిస్తావు. చెప్పింది స్పష్టంగా చూచే వరకు - నీవర్థం జేసుకున్న దాన్నే - ప్రశ్నించుకుంటూనే సాగుతావు. కానీ దానిలో ఒక అపాయముంది. బోధసరిగా ఉంటే సమస్యలేదు. కానీ ఉపదేశం సరిగి లేకపోతే- ఆ బోధనా ప్రక్రియంతా తప్ప మార్గంలో ఉంటే - అప్పడు శ్రద్ధ బంధమవుతుంది. అది అంధ విశ్వాస మవుతుంది.

ఇక్కడ చెప్పబడ్డది - "యయా వస్తు ఉపలభ్యతే" దేని ద్వారా అయితే నీ తత్త్వము తెలియబడునో- అంటే శ్రద్ధకూడా జ్ఞానం పొందటానికి మరో సాధనమని - మరో ప్ర మాణమని - అన్వయించుకోవలెనా? కాదు. శ్రద్ధ ప్రమాణము కాదు. శ్రద్ధ ఉంటే, ఉన్నప్పడు మాత్రమే శాస్త్ర ప్రమాణము ఫలప్రదంగా పని చేస్తుంది.

శాస్త్రంలో మనకొక వాక్యముంది - 'ఆచార్యవాన్ పురుషో వేద' గురువు ఉన్న వ్యక్తి - తెలుసుకుంటాడు. ఆచార్యవాన్ అన్న పదం అంతర్గతంగా శ్రద్ధను సూచిస్తుంది. శ్రద్ధ మూలంగానే- నీవు గురువు నెన్నుకుంటావు. అందుచేత శ్రద్ధ, శాస్త్రము రెండు ప్రమాణములు కావు. కానీ శ్రద్ధలేకపోతే శాస్త్రప్రమాణం పనిచేయదు. అందుచేత నే - "యయా శ్రద్ధయా వస్తు ఉపలభ్యతే" దేని ద్వారా అయితే నీ సత్య స్వరూపం తెలియబడుతుందో - అని చెప్పబడింది. 'శ్రద్ధయా' అన్న పదం తృతీయావిభక్తిలో ఉన్నది. మనస్సు ఈ విధంగా ఉండాలని మనోఫలకం యొక్క ప్రాధాన్యతను తెలియ చేస్తుంది. ప్రమాణంపట్ల ఎటువంటి మనస్సుండాలో చూపుతున్నది. శాస్త్రప్రమాణం మాత్రమే జ్ఞానన్నిస్తుందని దృఢంగా చెప్పటం శ్రద్ధను తీసుకొస్తుంది. ఒకసారి ఒక

సత్యాన్ని తెలుసుకున్న తరువాత - నీకొక మనోవైఖరి కలుగుతుంది. ధనం కొనగల దని నీకు తెలుసు కాబట్టి - దానిపట్ల నీకొక భావముంది. పిల్లవానికి ధనం కొనగల దని తెలియదు. అతడి కదొక కాగితమే. కానీ ఒకసారి అతనికి ధనం విలువ - దాని కొనుగోలు శక్తి తెలిస్తే - అతడికి చక్కగా జీర్ణించిన జ్ఞానం కలుగుతుంది. అప్పడతడికి ధనంపట్ల సరైన మనోవైఖరి ఉంటుంది.

అదే విధంగా శాస్త్రము ప్రమాణమని - ఒక్కసారి అర్థమైతే - నీకొక భావన ఏర్పడు తుంది. అమర్చిన మానసిక స్థితి - అదే శ్రద్ధ అనబడుతుంది. ఈ సంస్కృతిలో వేద ము పూజ్యభావంతో చూడబడుతుంది. అది ఒక అంతర్లీనమైన శ్రద్ద - కానీ అది చాలదు. అందుచేతనే ప్రమాణనిశ్చయం కలిగితే - శాస్త్రమే ప్రమాణమని స్పష్టంగా అర్థమైతే- అప్పడొక మనోవైఖరి ఏర్పడుతుంది. - అదే శ్రద్ధ అంటే. కానీ శాస్త్రమును ప్రమాణంగా చూడలేకపోతే - అదికేవలమొక గ్రంథమవుతుంది. అది చెప్పేది ఒక బౌ ద్ధిక భావన అవుతుంది. అది తప్పకావచ్చు -ఒప్పకావచ్చు. పనిచేయటానికి నీవు వ ఎరో సాధనము ననుసరించాలి. దాని తప్పొలు నిర్ణయించటానికి మరో సాధన కా వాలి. ఈ విధంగా అనవస్థకు దారి తీస్తుంది.

వేదాంతమొక బోధనాసంప్రదాయం. సంప్రదాయం దాన్నొక ప్రమాణంగా చూస్తుంది. నీవు దాన్నంగీకరించనైనా అంగీకరించాలి - లేదా దాని జోలికి కూడా వెళ్లకుండా ఉండాలి. ఎందుకంటే - అది ప్రమాణము కాదని నిరూపించటానికి - నీకు మరో ప్రమాణం లేదు. ఒక ప్రమాణము యొక్క ప్రమాణత్వము మరోప్రమాణముద్వారా నిరూపించబడదు. కళ్ళు చూస్తాయి. చెవులు వింటాయి. చెవులు మాత్రమే ధృవప రచాలి - అవి వింటున్నాయో లేదోనని. చెవులు వింటున్నాయో లేదోనని కన్నులు చెప్పలేవు. వాటికి ప్రవేశమే లేదు. అదేవిధంగా వేదాంతం పనిచేస్తుందో లేదోనని వేదాంతమే నిరూపించాలి. మరోకటి ఆ పని చేయలేదు. కాబట్టి వేదాంతాన్ని ప్రమా ణంగా చూడమన్నది - నిన్నొక మానసిక అమరికలో ఉంచుతుంది. అది శ్రద్ధ అనబ

డుతుంది. ఈ శ్రద్ధతో ఆత్మే బ్రహ్మము, అనంతమనే జ్ఞానం పొందుతారు. అందుకనే భగవద్గీత చెప్తుంది -. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' - శ్రద్ధ కలవాడు జ్ఞానం పొందుతాడని. (భ. గీ. 4.39).

16వ శ్లోకము

సర్వదా స్థాపనం బుద్ధేః శుద్ధే బ్రహ్మణి సర్వథా ।
తత్ సమాధాన మిత్యుక్తం నతు చిత్తస్య లాలనమ్ ॥ 27 ॥

శుద్ధే బ్రహ్మణి - శుద్ధబ్రహ్మమునందు; సర్వథా - సర్వవిధములుగా; సర్వదా - ఎల్లప్పడు; బుద్ధేః - మనస్సుయొక్క; స్థాపనం - స్థిరంగా ఉంచటము; తత్ సమాధానం - అది సమాధానము; తు - కానీ; న చిత్తస్య లాలనమ్ - మనస్సుని లాలించటము కాదు.

"మనస్సు నెల్లప్పడూ అన్నివిధాలా శుద్ధస్వరూపమైన బ్రహ్మములో నుంచడం సమాధానము, అంతేకాని మనస్సుని లాలించటం కాదు."

శమ దమాది షడ్గుణములలో ఆరవదైన సమాధాన మిక్కడ చర్చించ బడుతుంది. శుద్ధము, అపరిచ్ఛిన్నము అయిన బ్రహ్మమునందు బుద్ధిని ఎల్లవేళలా, అన్నివిధాలుగా, నిలపటము సమాధానము. నీవు ఏ రకంగా చూచినా బ్రహ్మము శుద్ధమే, అది కారణము కాదు, కార్యముకాదు.రాగద్వేషాలకు లోనుగాదు. పుణ్యపాపాలకు తావివ్వదు, కర్తృత్వభోక్తృత్వాలసలేలేవు.

ఇక్కడ బుద్ధిని బ్రహ్మయందుంచటమన్నది ఔపచారికంగా చెప్పటమే. దాన్ని సరిగా అర్థం చేసుకోవాలి. అది ఒక పుస్తకాన్ని టేబిల్ మీద ఉంచడం లాంటిది కాదు. దానర్థము - విచారించే బుద్ధికి విషయము బ్రహ్మమని ఇతర వ్యాపకములు, చింతలు, సాధనములు నిష్ఠతో చేస్తున్న ఈ విచారంలో కలిసిపోతాయి. ఇతర మేదీ కూడా పట్టించుకుని ప్రయత్నించవలసిన విలువున్నది కాదు.

శాస్త్రమిక్కడ సమాధానము - మనస్సుకి ఆహ్లాదాన్ని కలిగించటానికి - ఆనందాన్ని వ్వటానికి కాదని - స్పష్టంగా చెప్తున్నది. చిత్తస్య లాలనమ్ అంటే మనస్సుని ఊపడవ ఎనిఅర్థం చెప్పకోవచ్చు. మనస్సు ఒక ఊయల లాంటిది - ఎప్పడూ ముందుకి వెన క్కి ఊగుతుంటుంది. ఇప్పడొక విసయం గురించి ఆలోచిస్తుంది. వెంటనే మరో విషయం గురించి, ఒకే విషయంలో నిలకడగా ఉండనీయదు. ఒకే ఆలోచనాపం థాలోనిమగ్నం కావటం నీకు కావాలి. అదే సమాధానమనబడుతుంది.

17వ శ్లోకము

అహంకారాది దేహాంతాన్ బంధా నజ్ఞానకల్పితాన్ ।

స్వస్వరూపావబోధేన మోక్తుమిచ్ఛా ముముక్షుతా ॥ 28 ॥

అహంకారాది దేహాంతాన్ - అహంకారము మొదలుకొని స్థూలదేహము వరకు; అజ్ఞాన కల్పితాన్ - అజ్ఞానముచే కల్పితములైన; బంధాన్ - బంధములను; స్వస్వరూప అవబోధేన - స్వ స్వరూప జ్ఞానము ద్వారా; మోక్తుమ్ - వదిలివేయాలనే; ఇచ్ఛా - కోరికయే; ముముక్షుతా - ముముక్షుత్వమంటే(ముముక్షువు కుండే మనోవైఖరి).

"అహంకారము మొదలు స్థూలదేహమువరకు అజ్ఞానముచే కల్పించిన బంధములను - స్వస్వరూపాన్ని గుర్తించటము ద్వారా - వదిలివేయాలనే కోరికయే ముముక్షుతా - ముముక్షువుకుండే మనోవైఖరి."

మానవుడు కోరే వాటినన్నిటిని నాలుగు వర్గములక్రింద విభజించవచ్చు - అర్థ, కామ, ధర్మ మోక్షములని. అవి పురుషార్థములని పిలుబడతాయి. అర్థమంటే భద్రత, క్షేమము. కామమంటే సకల విధములైన సుఖములు - విషయసుఖము లేక ఉదా రగుణముల - ద్వారా లభించే ఆనందం. ధర్మమంటే విలువలు కావచ్చు లేక పుణ్యం కోసం చేసే ప్రయత్నములు.

నాకు అర్థం యొక్క అవసరం ఉందంటే బాహ్యరక్షణ అది నేను భద్రత - క్షేమము లేని వాడినని ధృవపరుస్తుంది. రక్షణ కావాలనటం నిలబడటానికి కఱ్ఱల ఆధారం

అవసరమన్న వ్యక్తి పరిస్థితి లాంటిదే. తన కాళ్ళమీద క్షేమంగా లేననుకునే వ్యక్తికి కర్ర ఆధారం కావాలి. బాహ్య రక్షణలు ధనరూపంలోను, అధికారం పలుకుబడి, పేరు ప్రతిష్ఠల రూపంలో నున్నవి. ఈ రక్షణ లేకపోవటం - నేను అనే భావనమీదే కేంద్రీకృతమైనది కానీ - నీ శరీరం మీదో - మనసు మీదో కాదు - “నేను క్షేమంగా లేను” అని అనుకుంటున్నాడు కాబట్టి అందుచేత రక్షణ కూడా “నేను” మీదే కేంద్రీకృతం కావాలి. నాకై నేను క్షేమంగా ఉన్నానని భావిస్తే తప్ప - నేను క్షేమంగా లేననే భావన నుండి ముక్తుణ్ణి కాలేను. ఇక్కడే అందరు పొరబడుతుంటారు. బాహ్యంనుండి ఆధారాలు ఉంటేనే క్షేమంగా ఉన్నానని వారనుకుంటారు. అందుకోసమై వారు - ధనం, అధికారము, పదవులు మొ॥ చేర్చి పెంచటం ద్వారా ‘నేను’ ని రక్షణ ఉన్న వానినిగా చేద్దామని ప్రయత్నిస్తుంటారు. కానీ ఇది పనిచేయదు. ఎందుకంటే నీవేది కూర్చి కలిపినా కాలబద్ధం కాబట్టి - అదికూడా భద్రత లేనిదే. అందుచేత అది కూడ మానవునికి భద్రత నివ్వలేదు. కొంత ఆర్థిక స్వాతంత్ర్యాన్నీ అహంకారానికి పుష్టి నిచ్చినప్పటికీ, భద్రత లేనివాడు, భద్రత లేని వానిగానే కొనసాగుతాడు.

ఈ ఆలంబనములు లేకపోతే మానవుడు ఇంకా భద్రత లేని వాడవుతాడు. ఆ కారణంచేత సిరి సంపదల్ని అధికారాన్ని త్యజించటం ద్వారా నీవు భద్రత ఉన్న వాడివి కాలేవు. అది నిన్ను దివాలా తీసిన వానిగా చేస్తుంది. భద్రంగా ఉండటమిక్కడ సాధ్యం కాదు. స్వర్గం మొ॥ లోకాల కెళ్ళటం - భద్రత నిస్తుందని ఎవరైనా అనుకోవచ్చు కానీ - స్వర్గం కూడా భద్రత నివ్వలేదు. స్వర్గం గురించి నీకు చెప్పే ఆ శాస్త్రమే చెప్తుంది - స్వర్గంలో కూడా నీకు రక్షణ లేదని - అది కూడా ఒక ప్రదేశమే కాబట్టి. అది చెప్తుంది - “ ఏ విధంగా ఈ లోకంలో కర్మ ద్వారా సంపాదించింది క్షీణిస్తుందో, అదేవిధంగా పుణ్యంద్వారా సంపాదించిన మరో లోకం కూడా క్షీణిస్తుంది” అని. అది కూడా కాలబద్ధమైన ఒక ప్రదేశము అక్కడ నీకు ఆరంభముంది కాబట్టి - అంతంకూడా ఉంటుంది. దీర్ఘకాలం తరువాత అంతమొచ్చినప్పటికి, స్వర్గం కూడా అనిత్యమే.

కాబట్టి నా భద్రత లేదనే సమస్యను పరిష్కరించలేదు. మరియు కామము నా ఈ భద్రత లేదనే సమస్యను దుఃఖ సమస్యను పరిష్కరించలేదు. ఈ విషయమందరికీ తెలుసు. అందువలన ధర్మము, అర్థము, కామములు భద్రత లేదనే సమస్యను పరిష్కరించలేవనే నిర్ణయానికొస్తావు.

ఈ నిర్ణయాని కొచ్చినపుడు, ఎవరైనా నిస్సహాయుని గాను, దిక్కుతోచని వానిగాను తనని తాను భావించుకోవచ్చు. కానీ బయటపడే మార్గమున్నది. ఈ సమస్యను పరిష్కారాన్ని అన్వేషిస్తున్నప్పుడు సిద్ధంగానే ఉన్న పరిష్కారం నీ దృష్టికి నీ గుర్తింపునకు వస్తుంది. అది ఆశ్చర్యకరమైనది - కానీ సత్యము. నేను బెంగుళూరులో ఉంటున్నాను. మద్రాసులో నివశించే నా మిత్రుడొకడు జూదగాడుగా మారాడు. అతడు తనని తాను బాగుచేసుకోవాలనుకుంటున్నాడు. బెంగుళూరు వచ్చి నాతో నివసించటం మొదలుపెట్టాడు. అతనికి కొంత సాంకేతికపరిజ్ఞానమున్నది. అందుచేత అతడికో ఉద్యోగం సంపాదించగలిగాము. సాయంకాలం 6గం॥ కల్లా ఇంటికి తిరిగి వచ్చేయమని చెప్పాను. మొదటి రోజు సకాలంలో తిరిగి వచ్చాడు. మరుసటి రోజునుండి రాత్రి 11.30 గం॥ కు ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఎందుకంత ఆలస్యంగా వస్తున్నాడో కనుక్కోవాలనుకున్నాను. పొరుగువారి వంటవడి నడిగాను. “ఇతడెక్కడికి వెళుతున్నాడో నీకు తెలుసా ? ” అని. అతడు చెప్పాడు - “స్వామీజీ మీకు తెలుసు కోవాలనుందా ? ఇదే వీధిలో మూడిళ్ళు అవతల ఉన్న జూదగృహానికి వెళుతున్నాడ”ని. నేనక్కడ రెండు సంవత్సరాలనుండి నివసిస్తున్నాను. కానీ దాని గురించి నాకు తెలియదు. ఎందుకని ? దాని కోసం నేను చూడవలేదు కాబట్టి. ఈ వ్యక్తి నాతో ఉండటానికొచ్చాడు. మరుసటి రోజే జూదగృమమెక్కడ ఉందో కనుక్కున్నాడు - దానికోసం చూసాడు కాబట్టి.

ఆత్మ జ్ఞానం విషయంలో కూడా ఇది సత్యమే. ఈ జ్ఞానం - భద్రత లేదనే సమస్యకు పరిష్కారమైనది. దాని కోసం చూస్తే లభిస్తుంది. ఏదో ఒకటి చేస్తూనే ఉన్నావు.

సంతోషమే. నీవు జ్ఞానంకొరకే ప్రయత్నిస్తున్నా వన్నది గుర్తిస్తావు. ముముక్షుత్వమంటే అదే - మోక్షో మే భూయాత్ ఇతి ఇచ్ఛా - నాకు మోక్షము కలుగుగాక అనే కోరిక. మోక్షమంటే - "నేను" 'ఆత్మ' మీదే కేంద్రీకృతమైన 'నేను భద్రత లేని వాడిని, నేను అసంపూర్ణుడన'నే అపోహనుండి విముక్తి. అందుచేత ముముక్షుత్వమంటే విముక్తి కొరకే అంకితం కావటం. మరి ఆ విముక్తి - 'ఆత్మ' 'నేను' ముక్తస్వరూపమేనని తెలి యకపోతే సాధ్యం కాదు. 'ఆత్మ' 'నేను' నిత్య ముక్తమే, అందుకే నీవు ముక్తిని ఇష్టపడ తావు. అంతకన్నా తక్కువదేదైనా నీవు ఒప్పుకోవు. ఆత్మ ముక్తస్వరూపమే. ఆ సత్యాన్ని గుర్తించాలి. ఇతరములన్నీ - దేశకాలనిమిత్తముల సహాయం కావాలి. కానీ సహా యం చేసేవి వేరు - ఉపయోగించేవి వేరు - సాక్షాత్ ఫలాన్నిచ్చే జ్ఞానం వేరు. ఇక్క డ నీవీ విషయం స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

విముక్తి నేను కోరుతున్నది. ఆ విముక్తి ఆత్మజ్ఞానరూపంలో ఉన్నది. అందువలన నాకు ఆత్మజ్ఞానం కావాలి కాబట్టి - ముముక్షుత్వము - జిజ్ఞాసగా తెలుసుకోవాలనే కోరికగా మార్చబడాలి.

'నేను' అని ఎవరైతే వ్యవహరిస్తుంటారో, భద్రత లేనివానిగా, అల్పునిగా ఎవరికైతే తపనగురించి ఇతరులకున్న అభిప్రాయాలననుసరించి వ్యవహరిస్తాడో అతడిని అహంకారమంటారు. ఈ అహంకారం మొదలుకొని స్థూలదేహం వరకు ప్రతిదశలో నూ బంధముంది. అహంకారాన్ని ఆత్మ స్వరూపంగా తీసుకుంటే అదొక బంధము. మనస్సుని ఆత్మస్వరూపముగా తీసుకుంటే అదొక బంధము. అలాగే ప్రాణము ఆత్మ స్వరూపమనుకుంటే అదొక బంధము. శరీరము ఆత్మస్వరూపమనుకుంటే అదొక బంధము. ఈ బంధములన్నీ అజ్ఞానంనుండి మాత్రమే జనించినవి. వాటినుండి తనను విడిపించుకోవాలనే కోరిక ఎవరికున్నదో వారు ముముక్షువు.

బంధములను గుర్తించాము. వాటినుండి ఎలా తప్పించుకోవాలన్నది. తరువాత ప్రశ్న. మరణము పరిష్కారం కాదు. ఎందుకంటే మరణములో స్థూలశరీరము మర

ణిస్తుంది. అహంకారము మొ॥ కొనసాగుతూనే ఉంటాయి. ఇక్కడ బంధమేమిటో అర్థం చేసుకోవాలి. అహంకారము మొ॥ బంధములు కావు. కానీ అవి బంధములుగా అవుతాయి. సులభంగా అర్థం చేసుకోవటానికి శాస్త్రము దేహేంద్రియమనోబుద్ధుల సంఘాతమును అయిదుగా విభజిస్తుంది. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములని. ఈ విభాగపు ప్రతిదశలోనూ ఒక అనుభవమున్నది. ప్రతి అనుభవంలోనూ ఆత్మ ఉన్నది కాబట్టి అనుభవము, ఆత్మ ఒకటేనని భావించబడుతున్నాము. (తాదాత్మ్యం వలన)

అన్నమయ స్థాయిలో అనుభము - "నేను లావుగా ఉన్నాను" "నేను పొడుగు" "నేను తెలుపు" మొ॥ శరీర ధర్మములు ఆత్మకు ఆపాదింపబడుతాయి. అందువల్లనే " నేను స్థూలము" మొ॥ భ్రమలు 'నేను' మీద కేంద్రింపబడుతున్నాయి. స్థూలత్వము వె ు॥ గుణములు శరీరమునకు సంబంధించిన వైనప్పటికి. అదేవిధంగా 'నేను దప్పికగొని ఉన్నాను'. 'నేను ఆరోగ్యంగా లేను' మొ॥ ప్రాణధర్మములు ఆత్మమీద మోపబడుతున్నాయి. మనస్సు అశాంతిగా ఉన్నప్పడు 'నేను అశాంతిగా' ఉన్నానని చెప్తాను. కాబట్టి మనోధర్మములు ఆత్మనిగా భావింపబడుతున్నాయి. అదేవిధంగా కర్తృత్వము భోక్తృత్వము వరుసగా విజ్ఞానమయ కోశమునకు ఆనందమయ కోశమునకు సంబంధించిన వాటిని ఆత్మధర్మములుగా స్వీకరించబడుతున్నాయి. కాబట్టి ప్రతి దశలోనూ శరీరము మొ॥ వాటిధర్మములు ఆత్మమీద ఆరోపింప బడుతున్నాయి. అది బంధము కాని శరీరము మొ॥ కావు.

ఈ బంధములన్నీ ఆత్మ అజ్ఞానమువలననే, ఆత్మ కర్తకాదు. భోక్త కాదు. ఆకలిగొని లేదు. దప్పికగొని లేదు. పొడుగ్గా, లావుగా అసలే లేదు. కానీ ఆత్మస్వరూపము తెలియకపోతే దేహేంద్రియమనోబుద్ధుల సంఘాతధర్మములు ఆత్మగా తీసుకొనబడుతున్నాయి. ఉదాహరణకు, నీ కర్తృత్వము చేత ఆత్మ పరిచ్ఛిన్నము చేయబడుతున్నది. కర్తగా దోషినన్న భావన అనివార్యము. ఎందుచేతనంటే ఎవరుకూడ చేయవలసిన

పనులన్నీ చేయటం లేదు. చేయకూడనివి కొన్ని చేస్తూనే ఉన్నారు. అంతేకాక ఆత్మ భోక్తగా భావింపబడుతున్నది. కాబట్టి బాధింపబడిన వాడినన్న భావన కూడ తప్పనిస రిగా ఉంటుంది. లోకం నిన్ను వేధించటానికి పరిహసించటానికి ఉన్నది. బాల్యం నుండి బలిపశువులాగ చేయబడ్డా ననే భావనతో నిన్ను నీవు చూచుకుంటున్నావు. ఈ మోసపుచ్చబడ్డాననే మనస్తత్వం ప్రతివారిలోనూ కొంతవరకు ఉంది. కనుక ఆత్మ ఈ రెండుభావనలకు - దోషిననే భావన - బాధింపబడ్డాననే భావన - గురిచేయబ డు తున్నది. భావనలున్నవాడే కర్మలు చేస్తూపోతాడు. అటువంటి వాడెప్పటికీ ఆహ్లా దంగాఉండలేడు. మరి మనస్సుని ఆత్మగా తీసుకుంటాను కాబట్టి - మనస్సు యొక్క సమస్యలన్నీ నా సమస్యలవుతాయి. శరీరము మరణిస్తుంది. కాబట్టి నేను మరణిస్తా ను. ఇవే కాకుండా, సంశ్లిష్ట భావగ్రంథులకు దారితీసే అనేక కారణాలున్నాయి. అవ న్నీ నన్ను ఈ విశాలవిశ్వంలో అత్యంత అల్పునిగా, నిరర్థకునిగా చేస్తున్నాయి. ఈ అల్ప త్వాన్నుంచి విముక్తిని కోరుతున్నాను. మరో మాటల్లో చెప్పాలంటే నేను పూర్ణత్వాన్నే కోరుతున్నాను. వాస్తవానికి నేనే సమస్తమూ, ఏ పూర్ణత్వాన్ని నేను కోరుతున్నానో, కానీ దేహేంద్రియ మనోబుద్ధుల సంఘాత ధర్మములను ఆత్మమీద ఆరోపించంవలన, ఆ పూర్ణత్వాన్ని పూర్తిగా పోగొట్టుకున్నాను. ఇప్పడు పరిచ్ఛిన్నుడనయ్యాను.

బంధమన్నది కేవలం ఒక భావనమాత్రమే. ఉన్న పరిస్థితి నిష్టపడక పోతే, బంధిం పబడినట్లుగా భావిస్తాడు మానవుడు. చాలా సంవత్సరాల పూర్వం గోహత్య నిషేధాని కై పెద్ద ఆందోళన జరిగింది. రాజకీయ నాయకులు సాధువుల్ని కూడా ఆందోళనలో చేర్చుకున్నారు. వ్యతిరేకవాదులంతా పార్లమెంట్ హౌస్ ముందు వ్యతిరేకత ప్రకటిస్తూ కూర్చోవడం కూడా చేశారు. వారంతా అరెస్ట్ అయ్యారు. జైలుకి పంపబడ్డారు. తరు వాత వదిలివేయబడ్డారు. కొన్ని రోజుల తరువాత మరల సాధువులను అదే ప్రయోజ నం కోసం చేర్చుకొని తీసుకెళ్ళారు. ఈసారి ఎక్కువ మంది సాధువులు వెళ్లటానికి ఇష్టపడ్డారు. ఎందుకంటే ఇంతకుముందు జైలుకి వెళ్ళిన సాధువులు తమ అనుభవా

ల్నందరికి చెప్పారు. బయట ఉండేకంటే జైల్లోనే బాగుంది. మంచి ఆహారం అది నీ దగ్గరకే వస్తుంది. దాని కోసం నీవు క్యూలో నిల్చోవలసిన అవసరంలేదు. (అన్న క్షేత్రం లో భిక్షకి వరుస క్రమంలో వెళ్ళితీసుకొచ్చుకోవాలి) ఇంకా జైల్లో నిన్నెవరూ డిష్టర్బ్ చేయరు. జైలుగదిలో నిన్నొంటరిగా వదులుతారు. కాబట్టి ధ్యానానికా ప్రదేశం చాలా మంచిది. జైలు మనకి చాలా అనువైన స్థలం. మరిప్పుడు ఈ సాధువుల్ని ఎలా జైల్లో పెట్టగలవు? నాలుగు గోడలు కలిస్తే అది జైలు కాదు. ఎందుకంటే ఈ సాధువులక్కడకు వెళ్ళటానికిష్టపడుతున్నారు. కాబట్టి బంధనం కేవల మొక భావనయే.

బంధింపబడ్డానను కోవటానికి నీకో నిజమైన బంధన మక్కర లేదు; బంధనమన్న భావన మాత్రం చాలు. మరి ఈ భావన, దేహము మొ॥ వాటి దృష్ట్యా "నేనింత మాత్రమే" నన్న అపోహ నుండి పుడుతుంది. అసలీ అపోహే ఆత్మఅజ్ఞానమునుండి పుడుతుంది. అందువలన ఆత్మ అజ్ఞానము బంధాన్ని సృష్టిస్తుంది.

అజ్ఞానంవలన ఏర్పడింది కాబట్టి, అజ్ఞానాన్ని తొలగించటం చేత కాకుండా మరే ఇతరముచేత బంధనాశనం జరుగదు. నిర్వికల్పసమాధి మొ॥ వేవీ నిజంగా బంధనివారణకు సహాయపడవు. సమాధి అంటే మనస్సుని లయం చేయగలసామర్థ్యం - దేనిలోనైతే నిద్రలోలాగ ప్రతిదాన్ని వదిలివేస్తావో నిద్రలో అహంకారం లేదు. దేహధ్యాస లేదు. మనసు మొ॥ వాటి గురించి తెలియదు. ఈ బంధములన్నిటినీ వదిలివేశావు. కానీ నిద్రనుండి ముక్త పురుషుడుగా బయటకురావు. అదేవిధంగా సమాధిఅనుభవంలో కూడ కర్తృ - కర్మ విభాగము తాత్కాలకంగా లయిస్తుంది. కానీ అది ఏ విధంగానూ బంధానికి కారణమైన అజ్ఞానాన్ని తొలగించలేదు. కాబట్టి సమాధి బంధాన్ని నాశనం చేయలేదు.

ఇంకా నిర్వికల్ప సమాధి లక్ష్యమైతే మనసులో కలిగే ఏ ఆలోచనైనా ప్రతిబంధకమవుతుంది. దాన్ని నీవు తొలగించాలని చూస్తావు. ఆలోచన రూపంలో నున్న ప్రతిబంధాన్ని తొలగించాలంటే ఎలా తొలగించాలని ఆలోచిస్తుంటావు. అంటే ప్రతిబంధ

ము ఎక్కువ అవుతుంది. అందువలన ఆలోచనే ఒక భయంకరమైన కలలాగ అవు తుంది. మరి దానిగురించి నీవేమీ చేయలేవు. నిద్ర ఒక్కటే విముక్తి నిస్తుంది.

ఆత్మ నిర్వికల్పము - ద్వైతవర్జితము. ప్రపంచము నీకంటే - కర్తకంటే భిన్నమనే భావనే ప్రధానమైన ద్వైతము. ఈ కారణం చేత నిన్ను నీవు అల్పునిగా తీసుకుంటావు. నీవు కానిది చాలా పెద్దది. ఈ వ్యవస్థ చాలు నీవు సంసారివి కావటానికి. స్వప్నంలో లాగా కర్తృ- కర్మ ద్వైతము మిథ్య. ఆత్మేకర్త. కర్మ రెంటిగా భాసిస్తుంది. వాస్తవములో ద్వైతమేలేదు. ఆదెలాగంటే ఒకే బంగారము ఆనేక ఆభరణములున్నంతమాత్రాన ఆనేకము కాదుగాబట్టి. ఇప్పడుకూడా కర్త, కమ్ర రెండూ ఒకే వస్తువు - అద్వయము, నిర్వికల్పము.

ఈ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. 'నిర్వికల్పోహం' అన్నది వేరు - నిర్వికల్పసమాధి వేరు. సమాధి ఒక మానసిక స్థితి. ఒక అనుభవం. 'అహం నిర్వికల్పః'. నేను అద్వయము అన్నది జ్ఞానము. అది నేను ద్వైతంలో ఉన్నాననే తప్ప నిర్ణయాన్ని పటాపంచలు చేస్తుంది.

అజ్ఞానముద్వారా కల్పింపబడిన బంధమును ఆత్మ స్వరూపమేమిటో తెలుసుకోవటం ద్వారా తొలగించుకోవచ్చు. అందుచేతనే "ముముక్షుత్వమంటే ఆత్మస్వరూపాన్ని తెలుసుకోవటం ద్వారా అజ్ఞానాన్ని తొలగించు కోవాలనే కోరిక" అని చెప్పబడింది. విముక్తుడను కావాలనే కోరిక - తెలుసుకోవాలనే కోరికగా మార్పు చెందింది. ఈ మార్పు తప్పనిసరి. ఎందుకంటే - విముక్తి పొందాలనే కోరిక నీవన్వేషిస్తున్నదాని దరి దాపులకి మాత్రం తీసుకెళ్లకుండా ప్రపంచమంతటా నిన్ను త్రిప్పగలదు. కానీ తెలుసుకోవాలనే కోరిక - సద్గురువు దగ్గరకు చేరుస్తుంది. అప్పడు నీ విచారంలో ఒక నిర్దేశముంటుంది. నీవు శ్రద్ధా, శమ, దమ మొ॥ తో ప్రమాణము దగ్గరకు వెళతావు. విముక్తి కావాలనే కోరిక మీలో అర్థమేమిటంటే జ్ఞానంతో దేహం, మనస్సు మొ॥ వాటిని - చేయాలనే కోరిక కూడ. అందుచేత నీవు దేహముతో ప్రపంచముతో

ఉన్నా నీకేమి హాని జరుగదు. మనస్సులో ఆలోచన ఇక ఏ మాత్రము భయంకర స్వప్నం గాదు, మిథ్య కాబట్టి, ముముక్షుత్వం ముందుగా ఉన్నప్పటికీ గురు అనుగ్రహం దాన్ని తీక్ష్ణం చేస్తుంది. బోధరూపంలో ఉన్న గురు అనుగ్రహం శిష్యునిలోని లోపాల్ని సవరిస్తుంది.ఆపైముముక్షుత్వం స్పష్టము, తీవ్రము అవుతుంది.

ముముక్షుత్వం స్పష్టమైనకొలది వైరాగ్యం పెరుగుతుంది. వైరాగ్యం పెరిగిన కొద్దీ - ముముక్షుత్వమింకా స్పష్టమవుతుంది. ధార్మిక జీవనం గడిపితే - ఆ వ్యక్తికి శమ, దమాదులు కలుగవచ్చు. అవి అతడికి ఉపశమనము, ముక్తత్వాన్ని ఈయవచ్చు. కానీఅవే మోక్షాన్ని ప్రసాదించలేవు. మోక్షమునకు ముముక్షుత్వం చాలా ప్రధానమైన గుణం.

అధికారిని వర్ణించిన తరువాత గ్రంథకర్త అధికారి గురువు నేవిధంగా సమీ పించాలో చెప్తున్నారు.

# గురు సన్నిధిని చేరటం

18వ శ్లోకము

ఉక్తసాదనసంపన్నః తత్త్వజిజ్ఞాసురాత్మనః ।
ఉపసీదేద్గురుం ప్రాజ్ఞం యస్మాద్ బంధవిమోక్షణమ్ ॥ 33 ॥

ఉక్తసాధన సంపన్నః - ముందు చెప్పిన సాధనసంపత్తి గలిగిన;ఆత్మనః - తన యొక్క; తత్త్వజిజ్ఞాసుః - తత్త్వాన్ని తెలుసుకోవాలన్న కోరికగలిగిన జిజ్ఞాసువు; యస్మాత్ - ఎవరివల్లనైతే; బంధవిమోక్షణమ్ - బంధ విముక్తి కలుగుతుందో; ప్రాజ్ఞం - శాస్త్ర జ్ఞానమున్న; గురుం వ ఆ సద్గురువును; ఉపసీదేద్ వ సమీపించవలెను.

"ముందు చెప్పిన లక్షణములు గల - తన తత్త్వాన్ని తెలుసు
కోవాలనుకుంటున్న జిజ్ఞాసువు - శాస్త్రజ్ఞానమున్న సద్గురువును -
ఎవరివల్లనైతే బంధవిముక్తి కలుగుతుందో - వారిని సమీపించాలి."

ముందు చెప్పిన సాధనములుగల సాధకుడు గురువును సమీపించాలి. - గురుమ్ ఉపసీదేత్. ఎటువంటి గురువుని పాఠకుడు సమీపించాలి ? ప్రాజ్ఞం - శాస్త్రం బోధించిన జ్ఞానమున్న జ్ఞానిని - అంటే గురువు శాస్త్రములందు చక్కని పరిజ్ఞానమున్నవాడై ఉండాలి.

ఏ ప్రయోజనం కోసం గురువునతడు సమీపించాలి ? మోక్షం కోసం మోక్షం పొందటానికి ఆత్మజ్ఞానం కావాలి. ఆత్మజ్ఞానం శాస్త్రప్రమాణము ద్వారా కలుగుతుంది. అందుచేత అధికారి శాస్త్రమును సామర్థ్యమున్న గురువు సహాయంతో అధ్యయనం చేయాలి. తరువాత రెండు శ్లోకములు గురువు యొక్క లక్షణములను తెలుపుతున్నవి.

# గురువు లక్షణములు

19వ శ్లోకము

శ్రోత్రియో వృజినో కామహతో యో బహ్మవిత్తమః।

బ్రహ్మణ్యుపరతః శాంతః నిరింధన ఇవానలః

అహేతుకదయాసింధుః బంధురానమతాం సతామ్ ॥ 34. 35 ॥

యః - ఎవరైతే; శ్రోత్రియః - శాస్త్రజ్ఞానమున్నవాడో; అవృజినః - పాపరహితుడో; అకామ హతః - కోరికలచే భాదింపబడనివాడో; బ్రహ్మవిత్తమః - బహ్మవేత్తయో; బ్రహ్మణ్యుపరతః - ఎవరిమనస్సైతే బ్రహ్మజ్ఞానములో ఉపశమించిందో; నిరింధన - ఇంధనము తరిగిపో యిన; అనలః ఇవ - అగ్నిలాగా; శాంతః - శాంతుడో; అశేతుక - నిమిత్తములేకనే; దయా సింధుః - దయనుచూపే దయా సముద్రుడో; ఆనమతాంసతాం - ప్రణమిల్లే జిజ్ఞాసువుల కు; బంధు - ఆప్తుడో.

20శ శ్లోకము

తమారాధ్య గురుంభక్త్యా ప్రహ్వప్రశ్రయసేవనైః

ప్రసన్నం తమను ప్రాప్య పృచ్ఛేత్ జ్ఞాతవ్య మాత్మనః ॥ 36 ॥

తమ్ గురుమ్ - ఆ గురువును; భక్త్యా - భక్తితో; ఆరాధ్య - ఆరాధించి; ప్రహ్వప్రశ్రయసే వనైః - అర్పణ భావంతో చేసిన సేవలచే; ప్రసన్నం - ప్రసన్నుడైనట్టి (గురువును); అనుప్రా ప్య - సమీపించి; ఆత్మనః జ్ఞాతవ్యం - తనకొరకై తెలుసుకోవలసినదాని గురించి, పృచ్ఛేత్ ప్రశ్నించవలెను.

"శాస్త్రాధ్యయనము చేసినవానిని - పాపరహితుని - కోరికలచే బాధింపబడని వానిని - బ్రహ్మవేత్తని ఎవరి మనస్సైతే బ్రహ్మజ్ఞానము లోనే ఉపశమించిందో - ఇంధనము తరిగి పోయిన అగ్నిలాగా శాంతుడో - నిమిత్తము లేక దయనుకురిపించే దయాసముద్రుడో ప్రణమిల్లే జిజ్ఞాసువులకు అప్తుడో - అతనిని ఆశ్రయించి - అర్పణభావంతో చేసిన సేవలచేత - ప్రసన్నుడగు సద్గురువుని - భక్తితో ఆరాధించి - తెలుసుకోవలసిన ఆత్మ గురించి అడుగవలెను."

గురువు ఒక బంధువు. శిష్యులకు సహాయపడేవాడు. అతడు శ్రోత్రియుడు కూడ. సాధారణంగా శ్రోత్రియుడంటే, వేదాధ్యయనము చేసినవాడు. కాని ఇక్కడ వేదాంత శాస్త్రజ్ఞానము కలవాడని అర్థము. ఇంకను గురువు అవృజినుడు. వృజినమంటే పాప ము.అవృజినుడు - అంటే పాపము లేని వాడు.ఒక వ్యక్తి శ్రోత్రియుడా కాదా, అవృజినుడు కాదా అన్న విషయం సాధారణంగా తెలుస్తుంది. కాబట్టి శిష్యుడు కనుక్కోగలడు.

గురువు అకామహతుడు. ఎవరైతే కోరికలు ఆసక్తులు మొ॥ వాటిచే నాశనం చేయ బడలేదో - అతడు అకామహతుడు కాబట్టి. అకామహతుడంటే కోరికలచేత తృష్ణలచేత బాధింపబడనివాడు. ఇంకను గురువు బ్రహ్మవిత్తమః, బ్రహ్మమును చక్కగా తెలుసుకున్న వాడు. మరియు అతడు బ్రహ్మణి ఉపరతః, అతడి మనస్సు పూర్తిగా బ్రహ్మజ్ఞానమునందే నిమగ్నమై ఉంటుంది. మనస్సు బ్రహ్మజ్ఞానంలో శమించింది కాబట్టి అతడు శాంతుడు. ఇంధన మింకలేని అగ్నిలాంటివాడు.

పెనుమంట తరువాత ఇంధనము తరిగిపోతే నిప్ప కాంతివంతంగా ఉంటుంది. కానీ జ్వాలలుండవు. అదేవిధంగా గురువు కూడ శాంతుడే. అతడి మనస్సు ఉపశమించింది

కాబట్టి - అతడి మనస్సు పనిచేయదని కాదు - మనస్సు పనిచేస్తూనే ఉంటుంది. కానీ రాగద్వేషరహితముగా.

గురువు “అహేతుకదయాసింధు” అని పిలవబడుతున్నాడు. దయాసాగరుడని. కారణ ములేనిది అహేతుకము. అహేతుకదయాసింధు అంటే - ఆ దయాసముద్రుని దయకల గటానికి కారణమవసరము లేదు. సానుభూతి కలవారు చాలామంది ఉన్నారు. బాధలో ఉన్నవారిని చూచినపుడు తదనుభూతితో ఆ బాధను తనదిగా భావిస్తాడు. ఆ సానుభూ తివలన కలిగిన బాధను పోగొట్టుకొనుటకు వారికి సాయం చేస్తాడు. దానిని దయ అంటారు. కాని ఇక్కడ దయ వేరే రకమైనది. డాక్టరు యొక్క దయలాంటిది.ఇన్ఫెక్షన్ తనకి రానివ్వడు. కాని ఇతరుల బాధనర్థం చేసుకుని - సహాయం చేస్తాడు. సాయం చేసే విధానమలాగ ఉండాలి. బ్రహ్మవిద్యా గురువు - సాధకుని యొక్క భాసిస్తున్న సంసా రసమస్యనంగీకరించి - దాన్ని పరిష్కరించటానికి ముందుకు రావాలి. అతడుఅహేతుక దయాసింధువు కావాలి. అతడి ఆశ్రయాన్ని కోరిన వారికి ధర్మపరులకతడు ఉపకారి.

గురువు చెంతకు వెళ్ళిన తరువాత - శిష్యుడేం చేయాలో - ఇక్కడ చెప్పబడుతున్నది. భక్తితో గురువు నారాధించి - ఆత్మను గురించి ప్రశ్న వేయాలి. భక్తి అంటే - అర్హత ఉన్న వారి పట్ల గౌరవభావం. శ్రద్ధ వ్యక్తం కావటమే భక్తి అంటే, తమ్ గురుమ్ అంటే పూర్వ శ్లోకంలో వర్ణించబడిన గురువు. భక్తి ఉండి బాహ్యంలో పూజ నమస్కారము ఇత్యాదు లు ఒనరించేవాడు భక్తుడు. అటువంటి వ్యక్తి గురువును ప్రశ్న అడగాలి.

ప్రశ్న అడిగే ముందు, యుక్తమైన భావనతో గురువుకు వివిధరకములైన సేవలు చేయాలి. ప్రహ్వ ప్రశ్రయ సేవనైః, దీనిచేత శిష్యుడు తనకు జ్ఞానం గురించి గంభీరత,

పట్టుదల మొ॥ ఉన్నవని గురువుని తృప్తిపరచవచ్చు. సంతృప్తుడైన గురువే ఇక్కడ చెప్ప బడుతున్నాడు. అంతేకాని ఆహ్లాదంగా ఉన్నవాడని కాదు. అతడు అధ్యాపనము లేకున్నా ఆహ్లాదంగానే ఉన్నాడు. ఇప్పడు శిష్యుడు తెలుసుకోవలసిన దాని గురించి - ఆత్మ గురించి - ప్రశ్న అడగవచ్చు; పృచ్ఛేత్ ఆత్మనః జ్ఞాతవ్యం.

చెప్పబడిన విధానంలో గురువుని సమీపించిన తరువాత, శిష్యుడు తనకు తానే - తనకేం జరుగుతున్నదో వివరిస్తున్నాడు.తాను సమస్యనర్థం చేసుకున్నాడా లేదా - తానెం దుకు గురువుని సమీపించాడో- ఇవన్నీ చెప్పాలి.అందుకే అతడిప్పడు మాట్లడుతున్నాడు.

21వ శ్లోకము

దుర్వారసంసారదవాగ్నితప్తం దోధూయమానం దురదృష్టవాతైః

భీతం ప్రపన్నం పరిపాహి మృత్యోః శరణ్యమన్యం యదహం న జానే ॥ 38 ॥

దుర్వార సంసార దవాగ్ని తప్తం - ఆర్పశక్యముగాని సంసారదావానలములో పడి తపి స్తున్నవానిని; దురదృష్టవాతైః - పాపములనే గాలులచేత; దోధూయమానం - కంపించు చున్నవానిని; మృత్యోః భీతం - మృత్యు భయము గలిగిన వానిని; ప్రసన్నం - శరణువేడు తున్న వానిని; పరిపాహి - (హే గురో!) రక్షింపుము; యద్ - ఎందుచేతనంటె; అన్యంశ రణ్యం వ శరణుగోరదగిన ఇతరమేదీ; అహం న జానే వ నాకు గోచర మగుటలేదు.

హే గురో ! మృత్యుభీతి గొన్నవానిని - నిన్ను శరణు వేడుతున్న వానిని -
ఆర్పశక్యముగాని సంసారదావాగ్నిలో తప్తుడైన వానిని - పాపము
లనేగాలులచేత కంపించుచున్న వానిని - అటువంటి నన్ను - కరుణతో
రక్షింపుము - అన్యఃశరణ్యము నాకు గోచర మగుటలేదు."

శిష్యుడు ఇప్పడు తన కథను చెప్తున్నాడు. తన దీనస్థితిని వర్ణిస్తూ చెప్తున్నాడు. దుర్వా ర సంసార దవాగ్ని తప్తం - చల్లార్చశక్యముకాని దావాగ్నిచేతదహింపబడుతున్నాను.తప్త -

తపింపజేయబడిన. దేనిచేత? దావాగ్ని అరణ్యపుఅగ్ని. సాధారణ అగ్నిని నీరు మొ॥వాటిచే త సులభంగా అదుపుచేయవచ్చు. కానీ దావానలమును సులభంగా ఆర్పలేము. అంతే కాక ఇది సాధారణ దావాలనం కాదు. అది సంసారరూపంలో నున్న దావానలం అజ్ఞాన పుజీవితం పరిచ్ఛిన్నమైన జీవితం. ఏదోమారిపోయి ఇంకేదో అయిపోవాలనే జీవితం, అందుచేత అతడు చెప్తాడు. సంసారమనే దావాగ్ని చేత తపింపబడ్డాను, దయచేసిరక్షిం పుము. కానీ నీ వెందుకా అగ్నినార్పవు ? అతడు చెప్తాడు. ఆ అగ్ని దుర్వార - ఆర్పలేనిది.

ఎందుకంటే దురదృష్ట - అంటే పాపము లనేగాలులు వీచటం చేత ఆర్పలేము.సరికదా, వృద్ధి అవుతున్నది. ప్రతివారికి పాపములున్నవి. అనుకూలము కాని - అనిష్ట ములైన ప రిస్థితులు. ఈ పాప మనేగాలి ఆగిపోతే - అప్పడు విముక్తి కొంతైనా లభిస్తుందనే ఆశ - ఉంటుంది. కానీ ఒకదాని తరువాత ఒకటిగా పీడనములు వస్తూనే ఉన్నాయి. సంసార మనే దావాగ్నిని పెంచుతూనే ఉన్నాయి.

ఇంకను శిష్యభావంతో వచ్చి యతడు చెప్తున్నాడు, “నేను మొదలంటూ ఊపబడ్డాను. ఈ సంసారంనుండి బయటపడలేను. ఎందుకంటే ఈ పాపములు నన్నగ్నిలోనే ఉంచు తున్నాయి. నేను బయటపడ్డా తిరిగి అవి నన్ను అగ్నిలో వేస్తున్నాయి. మృత్యువునుండి భయపడుతున్నాను. జన్మమరణ చక్రమువలన, నేను వర్త్యుడను, మరణము దాపుల్లోనే ఉన్నది. ఏ సమయంలో నైనా అది వేటు వేయవచ్చు. హే గురో ! నిన్ను శరణువేడిన నన్ను రక్షింపుము, ఈ బాధలనుండి నన్నుద్ధరింపుము.”

అయినా అగ్ని నార్పటానికి వేరే మనుష్యులుండవచ్చు, లేక అర్థ, కామ, ధర్మములు అగ్ని నార్పవచ్చు. వారి దగ్గర కెందు కెళ్ళవు ? అతడు చెప్తున్నాడు - ‘మీ వద్దనుండి జ్ఞానంపొం దటం తప్ప వేరే తప్పించుకోవటానికి ఆశ్రయించ దగినదేదీ నాకు గోచరించటం లేదు. అగ్నిమాపకములైన వారందరి చెంతకు వెళ్ళాను. వారెవరూ ఈ అగ్ని నార్పలేకపోయారు.

ఆత్మ జ్ఞానముమాత్రమే ఈ అగ్నినార్పగలదు. అందుచేత జ్ఞానము ప్రసాదించి నన్ను అను గ్రహించండి.'

22వ శ్లోకము

శాంతా మహాంతో నివసంతి సంతః
వసన్తవల్లోకహితం చరంతః ।
తీర్ణాః స్వయం భీమభవార్ణవం జనా
నహేతునాన్యానపి తారయంతః ॥39॥

శాంతా - ప్రశాంతమైనవారు; మహాంతః - మహాత్ములు; సంతః - సత్పురుషులు; వసంతవత్ - వసంతమువలె; లోకహితంచరంతః - భయంకరమైన మేలు చేస్తూ; నివసంతి - నివసిస్తుంటారు; భీమభవార్ణవం - బయంకరమైన ఈ సంసారసాగర మును; స్వయంతీర్ణాః - తాము స్వయముగా దాటి; అన్యాన్ ఆపి జనాన్ - ఇతరుల ను కూడ; న హేతు నా - నిమిత్తమేమి లేకుండగనే (ప్రతిఫలమేమీ ఆశించకనే); తార యంతః - తరింపజేస్తుంటారు.

"అటువంటి శాంతులు, గొప్పవారు, సాధుపురుషులు వసంతమువలె - ఇతరులకు మేలుచేస్తూ - జీవిస్తుంటారు. భయంకరమైన ఈ సంసారసాగరమును తాము స్వయంగా దాటి - ఇతరజనులను కూడ - తిరిగి ఏమీ ఆశించకుండా తరింపజేస్తుంటారు."

ఇక్కడొక శ్లోకము, దీప్తివంతమైన పదముతో గురువును వర్ణించేది ఉన్నది. శాంతాః - ఎవరికైతే అంతరంగంలో ప్రశాంతత, యుక్తత్వము ఉన్నాయో వారు శాంతులు - వారు మహాంతః - గొప్పదైన బ్రహ్మమును తెలిసినవారు. అందుచేత వారు అనంతమైన

బ్రహ్మముతో సములైనవారు అటువంటి సాధుపురుషులు ఎవరైతే సత్యవస్తువుని తెలిసిన వారో - వారీలోకంలో నివసిస్తూనే ఉన్నారు.

వారు వసంతములాంటి వారు. వసంతఋతువు - చెట్లు చేమలను సస్యశ్యామలం చేస్తూ - రంగురంగులను నింపుతూ - తిరిగి ప్రతిఫలమేమీ ఆశించకుండా - మేలుచే స్తున్నారు. వసంతానికి పూర్వం శిశిరంలో చెట్లన్నీ ఆకులురాల్చి మొండిగా నిలబడతాయి - ప్రాణాలు లేనట్లుగా, వసంతమెప్పడైతే ప్రవేశిస్తుందో - తిరిగి అన్నీ జీవం పోసుకుంటా యిచెట్లు చిగిర్చి ఆకులు వస్తాయి. భూమి పచ్చదనాన్ని పొందుతుంది. అంతటా రంగు రంగుల పుష్పాలతో కళకళలాడుతుంటుంది. వసంతం అందమైన మార్పు తీసుకువస్తుం ది. అంతేకాకుండా, చలికాలపు చలిబారినుండి నిన్ను కాపాడుతుంది. వసంతం తరువా త గ్రీష్మము వస్తుంది కాబట్టి. అదేవిధంగా - ఈ లోకంలో కొంతమంది ఉన్నారు. వారు ఎటువంటి గుర్తింపుని ఆశంచకుండా జనుల కేది మేలో అదే చేస్తుంటారు.

వీరు స్వయం తీర్ణా - ఈ భయంకరమైన సంసారసాగరం - ఇంకా ఇంకా ఏదో అవా లనే జీవితంనుండి తరించారు. వారు మాత్రమే దాటటం కాకుండా - ఇతరులకుకూడా కారణంలేకుండానే దాటటానికి చేయందిస్తారు. అహేతునా అన్యాన్ జనాన్ ఆపి తార యంతః. వారు పేరు ప్రతిష్ఠలు, అధికారము మొ॥ వేవీ ఆశించకుండా సహజంగానే ప్ర జల కుపకారం చేస్తుంటారు. అటువంటి వారీ లోకంలో ఉన్నారు. శిష్యుడు గురువుతో అంటున్నాడు. - “మీరు వారిలో ఒకరని నాకు తెలుసు కాబట్టి మృత్యుభయాన్నుండి నన్ను రక్షించండి.”

శిష్యుని దీనావస్థను విని గురువు సమాధాన మిస్తున్నాడు.

23వ శ్లోకము

మా భైష్ట విద్వంస్తవ నాస్త్యపాయః

సంసార సింధోస్తరణేస్త్యుపాయః
యేనైవ యాతా యతయోస్య పారం
తమేవ మార్గం తవ నిర్దిశామి ॥ 45 ॥

విద్వన్ - ఓ విద్యావంతుడా!; మాబైష్ట - భయపడకుము!; తవ - నీకు; అపాయః నాస్తి - అపాయములేదు; సంసారసింధోః తరణే - సంసారసాగరమును దాటుటకు, ఉపాయః ఆస్తి - ఉపాయమున్నది. యేన ఏవ - ఏమార్గముద్వారా నైతే; యతయః - ప్రయత్నశీలురు (సాధుకులు); అస్యపారం - ఈ సంసారసాగరము యొక్క అవలితీరమును; యాతాః - చేరుకున్నారో; తమ్ ఏవ మార్గం - అదే మార్గమును; తవ నిర్దిశామి - నీ కై నేను చూపుతాను.

"ఓ విద్యావంతుడా ! భయపడకుము, నీకిక అపాయము లేదు. సంసార సాగరమును దాటుటకు ఉపాయమున్నది. ఏ మార్గము ద్వారా ప్రయత్నశీలురు - సంసారసాగరము యొక్క ఆవలితీరము చేరినారో - అదే మార్గము నేను నీకు చూపుతాను."

మా బైష్ట విద్వన్ - "ఓ విద్యావంతుడా భయపడకుము". గురువు శిష్యుడిని విద్యావంతుడా అని సంబోధిస్తున్నాడు. తెలిసినవాడా యని, శిష్యుడు నేర్చుకోవటానికప్పడే వచ్చాడు. నిజానికతడు విద్యావంతుడు కాదు - కానీ ఈ జ్ఞానం పొందటానికి అవసరమైన ఇతరసాధనములన్నీ అతడి కున్నవి. అందుకే గురువతడిని విద్యావంతుడు అని పిలుస్తున్నాడు. విద్వాన్ అంటే ఇక్కడ - ఉపదిష్టపదః - ఉపదేశింపబడిన పదముల, వాక్యముల, అర్థాన్ని - వాటిమధ్యనున్న సంగతితో సహా గ్రహించగల సామర్థ్యమున్నవాడని అర్థము.

గురువిక్కడ పూర్ణవస్తువును గురించి చెప్తున్నాడు. దానిని విడమరచి చెప్పటంలో సామాన్యమనస్తత్వం దగ్గరనుండి విభిన్నసత్తాల గురించిన చర్చ వస్తుంది. పూర్ణవస్తువుని బోధించటంలో, విలువలు, మనో వైఖరులు, ధార్మిక వర్తనములే కాక బాహ్యప్రవర్తన - మాట్లాడటం, నడవటం లాంటివి కూడ చర్చకు వస్తాయి. ఆరోగ్యవంతమైన జీవితం గడపటానికి అవసరమయే ఏ విషయాన్ని వదిలి పెట్టలేదు. వివిధరకములైన విషయాలను చర్చించినపుడు వాటిమధ్య ఉన్న సంబంధంకూడ గమనించగలగాలి.

అప్పడు మాత్రమే నీవు సమిష్టిదృష్టిలో వాటి వాటి స్థానములను చూడగలుగుతావు. విభిన్నవిషయాలను వాటి పాత్రలను, ఫలములను, పరిమితులను వాటిమధ్యసంబంధము మొ॥ సరియైన దృష్టితో చూడలేకపోవటంవలననే వేదాంతాధ్యయనం చేసే చాలా మందికవి తమజీవితంతో సంబంధంలేని జ్ఞానంలో ఒక విడిభాగంగానే మిగిలి పోతున్నవి. కాబట్టి అన్నివిషయాలను అర్థవంతమైన రీతిలో కలిపి ఉంచాలి.

గురువు చెప్తున్నాడు - “నీకు భయానికి కారణం లేదు - తవ నాస్తి అపాయః - ఎందుకంటే సంసారసాగరాన్ని దాటటానికి ఉపాయమున్నది. ‘సంసారసింధోః తరణే ఆస్తి ఉపాయః’ గురువిలా ఉండాలి. అతడు శిష్యుని సమస్యను గుర్తించాలి. తాను చూచుకుంటానని అభయమివ్వాలి. ఈ అభయం శిష్యుణ్ణి శాంతపరుస్తుంది. తగినంత శ్రద్ధకలగటానికి తోడ్పడుతుంది. అప్పడు సంసారమంత పెద్దదిగా గోచరించదు. అతడి మనస్సు ప్రశాంతతను పొందుతుంది. వినటానికి సిద్ధంగా ఉంటాడు.

శిష్యుడింకా దృఢంగా చెప్పబడుతున్నాడు. ఈ సంసార సాగరాన్ని దాటే మార్గము గతంలో అనేకమంది నడవటం ద్వారా నిరూపింపబడి ఉన్నది. గురువు చెప్తున్నాడు. తమేవ మార్గం తవ నిర్దిశామి యేనైవ యతయః అస్యపారమ్ యాతాః ఏమార్గము ద్వారా పూర్వం సరియైన ప్రయత్నం చేసిన సాధకులు సంసారసాగరపు ఆవలితీరం చేరుకున్నారో

అదే మార్గం నీకు నేను చూపుతాను అని. అనేకమంది, సంన్యాసులు, ఏ మార్గంలోనైతే సంసారాన్ని దాటారో - అదేమార్గంలో నిన్ను తీసుకెళతానని. కానీ అందరూ నడచిన మార్గమే ఎందుకు ? క్రొత్తమార్గంలో ఎందుకు పోకూడదు ? దగ్గర (అడ్డ) దారి మాటేమిటి? దీనికన్నా దగ్గరదారి మరోకటి లేదు. ఎందుకంటే శిష్యుడంతకు మునుపే అసంసారియైన బ్రహ్మము.ఇక ప్రయాణమేమీ లేదు కాబట్టి - దగ్గరదారనే ప్రశ్నే ఉదయించదు.

మార్గమంటే ఇక్కడ నిజమైన అర్థం విచారము అని. అందుచేత బాట అన్నది 'నేను బ్రహ్మము' అను సత్యాన్ని కనుగొనటానికి దారితీసే విచార రూపంలో ఉన్నది. ఆ విచారము పదములు వాడుతూ చేసే బోధరూపంలో ఉన్నది. బోధమౌనంగా కాదు. జ్ఞానము పదములవలననే కలుగుతుంది. కాబట్టి నిర్దిశామి అంటే "నీకు జ్ఞానం కలిగే వరకూ బోధిస్తానని." ఈ దృఢవిశ్వాసం గురువు శిష్యునికి కలిగిస్తాడు. నిర్దిశామి అంటే - మరో అర్థం కూడ ఉన్నది. "నీవేమిటో నిస్సందేహంగా నీకు చూపిస్తాన"ని.

విచారము శ్రవణము, మననము, నిదిధ్యాసనము రూపంలో ఉన్నది. శ్రవణమంటే గురు బోధను వినుట, వస్తుస్వరూపాన్ని విచారించటము. మననమంటే నీ బుద్ధిగానీ ఇతర దర్శనములు గానీ ఈ బోధకు ప్రతికూలంగా ఏవైనా సందేహాలను లేవనెత్తితే వాటిని యుక్తిని తర్కము నుపయోగించి నివారించటము. ఇక విపరీతభావన అంటే అలవాటు ప్రకారం చేసే తప్పు, భ్రమ. అందుకు కారణం పూర్వపు మనోవైఖరులు, నిర్దిష్టమైన అభిప్రాయాలు. ఆ భ్రమలు జ్ఞాననిష్ఠకు అడ్డుపడుతూ ఉంటాయి. పూర్వపునిర్దిష్ట అభిప్రాయములను వాటినేర్పరిచే పరిమితులను, అవధులను తీసివేయుటం ద్వారా తొలగించి పునః సమ్యక్‌దృష్టికై ప్రయత్నించటము నిధిధ్యాసనము అనబడుతుంది. ఇది గురువు శిష్యుణ్ణి తీసుకెళ్ళే మార్గము.

24వ శ్లోకము

అజ్ఞానయోత్ పరమాత్మనస్తవ

హ్యనాత్మబంధ స్తత ఏవ సంసృతిః

తయోర్వివేకోదితబోధవహ్నిః

అజ్ఞానకార్యం ప్రదహేత్ సమూలమ్. ॥ 49 ॥

పరమాత్మనః - తవ పరమాత్మవైన నీకు; అజ్ఞాన యోగాత్ హి - అజ్ఞానముతో సంబంధము వలన మాత్రమే; అనాత్మ బంధః - అనాత్మ బంధమేర్పడినది;తతః ఏవ సంసృతిః - ఆకారణంచేతనే జన్మమరణ కర్మఫలరూప సంసారమున్నది; తయోః - ఆ రెండింటి (ఆత్మానాత్మల); వివేక ఉదిత బోధ వహ్నిః - వివేకమువలన ఉత్పన్నమైన జ్ఞానాగ్ని; సమూలమ్ - మూలకారణముతో సహా;అజ్ఞానకార్యం - అజ్ఞాన కార్యాన్ని; ప్రదహేత్ - దహించివేస్తుంది.

"పరమాత్మవైన నీకు అనాత్మతో బంధమున్నది, అజ్ఞానముతో సంబంధం వలన, దాని వలననే జననమరణకర్మఫలరూపమైన సంసారము. ఆత్మానాత్మ వివేకమువలన కలిగిన జ్ఞానాగ్ని అజ్ఞానకార్యాన్ని మూలకారణంతో సహా దహించి వేస్తుంది".

సాధారణంగా ప్రతిఒక్కడు తనని తాను - ఆత్మను - ఒక వ్యక్తిగాను ఇతరములన్నిటి నుండి వేరు చేయబడినవానిగాను అనుకుని తానల్పుడననీ, నిరర్థకుడననీ భావిస్తాడు. కానీ శాస్త్రమిక్కడ చెప్తున్నది -. నీవు పరమాత్మవని. పరమాత్మ అంటే - అది పరమము అనంతము అదే ఆత్మఅని. పరము అంటే ఉన్నతమైనదని అర్థం కాదు. దేశము చేత గాని, కాలముచేతకాని, ఒక వస్తువుగా నుండటంచేత పరిచ్ఛిన్నమైనది. ఒక ప్రదేశము

లో ఉంటే, రెండవ ప్రదేశంలో లేదుకాబట్టి. ఇంకను కాలంచేత పరిచ్ఛిన్నము. ఎందుకంటే అది లేని కాలము ఉంది. అదే రూపంలో అది ఉండని కాలము ఉండబోతున్నది. ఇప్పడు కూడ అది నిరంతరము మారిపోతూనే ఉన్నది - మరియు అది గులాబిపుష్పంగా గులాబిపుష్పమే కాని మల్లెపూవు కాదు. ఆపిల్ పండు కాదు. టేబిల్ కాదు. కుర్చీ కాదు. దీన్నే వస్తుకృతపరిచ్ఛిన్నత్వమంటారు. ఇందుకు విరుద్ధంగా పరము - అనంతము -దేశంచేత, కాలంచేత, వస్తువుచేత పరిచ్ఛిన్నము కానిది. దేశముచేత పరిచ్ఛిన్నము కాదు కాబట్టి - ఆత్మ కాకారము లేదు. కాలముచేత పరిచ్ఛిన్నము కాదు కాబట్టి - అది మార్పు చెందదు. అంతేకాక - వస్తువుగా నుండటంచేత - పరిచ్ఛిన్నము కాదు. కాబట్టి ఇక్కడ ఉన్నదేదీ దానికంటె భిన్నము కాదు. అందుచేత పరము - అంటే బ్రహ్మము. ఆ బ్రహ్మమే ఆత్మ.

గురువు శిష్యునికి చెప్తున్నాడు. పరమాత్మవైన - అనంతమైన - నీకు బంధముండే అవకాశంలేదు. అయినప్పటికి బంధముందని, అజ్ఞానము మూలంగా అనాత్మ - నేను కాని దాని యందు 'నేను' 'నాది' అన్న భ్రమే బంధనము; దాని కారణంచేతనే అనంతము, అపరిచ్ఛిన్నము - పరిచ్ఛిన్నమైన మనస్సుగాను, పరిచ్ఛిన్నమైన దేహంగాను - భావింపబడుతున్నది. కానీ ఈ బంధము సత్యము కాదు కాబట్టి - మనం కోరే విముక్తి సత్యమైనది కావచ్చు - లేదా భ్రమాత్మకం కావచ్చు. చేతులకు సంకెళ్ళు వేసినపుడా వ్యక్తి -తాను బంధింప బడ్డాననుకుంటాడు. అతడికి నిజమైన బంధనముంది. కాని అతడి చేతులకు సంకెళ్ళు వేయనప్పడు కూడ అతడనుకుంటే “నేను సంకెళ్ళు వేయబడ్డాన”ని అప్పడు బంధమనే భావమున్నది. భావాత్మక బంధమున్నది. తాను బద్ధుడను కానని తనకు తాను చూచేట్లుగా నీవతడిని చేయాలి.

దేహేంద్రియ బుద్ధుల సంఘాతమే వాస్తవంగా ఆత్మస్వరూపమనే భావనే బంధకారణము. ఒకసారి ఈ అపోహ ఏర్పడితే నేను శరీరంతో ఏకమై పోతాను. శరీరమంత మంచిది కానే కాదు. శరీరం రంగులో గాని, ఎత్తులోగాని బరువులోగాని మొదలగువాటన్నిటిలో పరిమితమైనది. దాన్ని నేనంగీకరించలేను. ఎంతకాలమైతే చక్కగా ఉంటుందో అంతవరకు మంచిదే. కానీ నా స్వరూపము స్థితిగతులు శరీర మెంతో అంతే. అయితే నాకు సమస్య ఉంటుంది. అప్పడు నేను కాలబద్ధము, దేశబద్ధము, వ్యాధిబద్ధము. శరీరానికున్న ప్రతిపరిమితి, దోషము నన్ను బంధిస్తుంది. అదేవిధంగా మనస్సు నేనైతే నాకు సమస్యలు తప్ప మరేవీ ఉండవు. నా జ్ఞానము అల్పము, శక్తి అల్పము, స్మృతి అల్పము. నా స్మృతుల కూర్పు నాకేమాత్రము నచ్చదు. నా భావావేశము లెప్పడు అందంగానూ, ఉదారంగానూ ఉండవు. అవి నిరాశ, నిస్పృహ, బాధ, భంగపాటు, విసుగు కోపం మొ॥ రూపాలలో ఉంటాయి. కాబట్టి నేనే మనస్సైతే శాశ్వతంగా బంధింపబడినట్లే. ఈ దేహేంద్రియబుద్ధిసంఘాతము నేనేకాని నేను దేహేంద్రియాది సంఘాతము కాదు. ఏ విధంగానైతే ఘటము మృత్తిక ఏదైనా కావచ్చు. చొక్కా వస్త్రమే కాని, వస్త్రము చొక్కా కావలసిన అవసరం లేదు. అదేవిధంగా శరీరము ఆత్మే, కానీ ఆత్మ శరీరము కాదు. మనస్సు ఆత్మే కానీ, ఆత్మ మనస్సు కాదు. ఏ పాత్ర నీవు వేసినా - అది నీవే కానీ - నీవు పాత్ర కాదు. పాత్రను నీవుగా అనుకుంటే - ఫరవాలేదు. కానీ నిన్ను నీవు పాత్ర అనుకుంటే, నీవు పాత్ర ఒకటిగా చుట్టబడినట్లై నీవు విభ్రాంతి నొందుతావు.

ఇక్కడ అనాత్మయందు 'నేను' అన్నభావన అనాత్మబంధమన బడుతున్నది. అది ఆత్మ అజ్ఞానం వల్లనే, అది సహజమైది. నీవు దానిలో జన్మించావు. అజ్ఞానజనితమైనది. ఈ అసత్య భావనే కనుక కాదని కొట్టి వేయవచ్చు. జ్ఞానం కలిగేంతవరకే అది ఉంటుంది. జ్ఞానముదయించి నపుడు బంధనము పోవాలి.

సంసృతి: - జన్మమరణప్రణప్రవాహానికి - మార్పుచెందే జీవితానికి - కారణము బంధన మే. అనాత్మయందు 'నేను' అనే భావన మూలంగానే నీవు కర్తవవుతున్నావు. కర్తవు గనుక కర్మఫలములకు భోక్తవవుతున్నావు. కర్తగా పుణ్యపాపములను ప్రోగుచేసుకుంటు న్నావు. వాటిని అనుభవించటానికి తిరిగి జన్మిస్తున్నావు. తిరిగి అదేపని చేస్తున్నావు మర ల జన్మించటానికి. ఆ విధంగా జన్మమరణప్రవాహము సాగిపోతూంటుంది.

ఆత్మానాత్మ వివేకమునుండి జనించిన జ్ఞానాగ్ని ఆత్మ అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది. అధ్యానం వలన వివేక జ్ఞానముత్పన్నమవుతుంది. గురుబోధ మూలంగా ఆత్మకు అనాత్మ కు గల భేదాన్ని స్పష్టంగా అవగతం చేసుకుంటాడు. ఆత్మను ఆత్మగాను, అనాత్మ ననాత్మ గాను తెలుసుకుంటాడు. ఇంకను అనాత్మ ఆత్మయే కానీ ఆత్మ అనాత్మకాదని కూడ తెలు సుకుంటాడు. ఇది జ్ఞానము ఆత్మజ్ఞానము.

జ్ఞానము తరచుగా అగ్నితో పోల్చబడుతుంది. అగ్ని కొయ్యదూలమును బూడిదచేసిన ట్లుగానే జ్ఞానాగ్ని బంధనమును - అజ్ఞానకార్యాన్ని - దహించి బూడిదగా చేస్తుంది. ఇక్క డొక ప్రశ్న ఉదయించవచ్చు; బూడిదనుండి బంధనము తిరిగి రాదా ? అదెలాగంటే అర ణ్యంలో అగ్ని (దావాగ్ని) అనేక వృక్షములను దహించి వేస్తుంది. కానీ కొన్ని సమయాల్లో కాలిపోయిన చెట్టు మొదళ్లనుండి తిరిగి అదేవృక్షము మొలకెత్తటం నీవు చూస్తావు. అదే విధంగా బంధము దహింపబడినప్పటికీ దాని కారణమింకా ఉండి ఉండి ఉండవ చ్చు. శాస్త్రము చెప్తుంది అది సంభవము కాదని. ఎందుకంటే - జ్ఞానము బంధాన్ని మూలకారణము అజ్ఞానముతోసహా దహించివేస్తుంది.

జ్ఞానము బందనమును పారద్రోలదు. అజ్ఞానమునకు విరోధి కాబట్టి జ్ఞానము, అజ్ఞాన మును తొలగించటం మాత్రం చేస్తుంది. జ్ఞానం వస్తు తంత్రం - వస్తువుకి అనురూపం గా ఉంటుంది జ్ఞానముదయించినపుడు వస్తువుయొక్క నిజరూపాన్ని కప్పివేసిన అజ్ఞాన

ము వెళ్ళిపోతుంది. ఒకసారి అజ్ఞానము పోతే దాని కార్యమైన బంధమిక ఉండలేదు. ఒక వస్తువుని పాముగా చూడటానికి సరిపడ ప్రకాశముండి తాడుగా చూడటానికి తగినంతగా లేనపుడు, నీవు తాడుని సర్పంగా భ్రమిస్తావు. వణకటమారంబిస్తావు. అధికప్రకాశంలో తాడు జ్ఞానముదయించినప్పడు, సర్పముపోతుంది. అప్పడే వణకుపోతుంది. అందుచేతనే జ్ఞానాగ్ని బంధమును, కారణము, అజ్ఞానముతో సహాదహించి వేస్తుందని చెప్పబడినది.

ఆత్మ గురించి భ్రమపడటానికి మానవుని బుద్ధి చాలు. కానీ ఆత్మ ఏమిటో తెలుసుకోవటానికది చాలదు. భ్రమను గుర్తించటానికి నీకు అధికప్రకాశం కావాలి. ఏదైతే నీ గురించిన భ్రమదృష్టిని తొలగించి, ఆత్మ స్వరూపాన్ని ప్రకాశింప జేస్తుందో, అది ఆ ప్రకారము శాస్త్రప్రమాణముయొక్క ప్రకాశమే.

వివేకంలేకుండ జ్ఞానం కలుగదు. అది ఒక్కసారిగా మెరుపులాగా రాదు, నీవు ఒక చెట్టుక్రింద కూర్చుని ఉండగా, ఆత్మ నీవే కాబట్టి అది ఇప్పడు చేసే దానికంటే క్రొత్తగా మెరయలేదు. అంతేకాక ఆత్మ సర్వవ్యాపకము కాబట్టి - నీవు లోతుగా అంతరంగంలోకి చూడాల్సినవసరం లేదు - ఆత్మను చూడటానికి. ప్రతిచూపు ఆత్మే, ప్రతి ఆలోచన ఆత్మే. విషయము ఆత్మ, దాన్ని చూచే కర్త ఆత్మ, కర్మ సంబంధము కూడ ఆత్మే. ఈ సత్యాన్ని గుర్తించవలె. ఇక్కడ ప్రశ్న ఏది ఉన్నదో దానిని గుర్తించటం. ఆ గుర్తింపు ప్రమాణముయొక్క ప్రకాశాన్ని తెచ్చినప్పడు సంభవిస్తుంది. ఉపదేశమంతా దాని గురించే. ప్రమాణముయొక్క వెలుగులో ఆత్మ అజ్ఞానం తొలగిపోతుంది దాని కార్యమైన బంధముతో సహా చెప్పబడిందదే - బోధవహ్నిః అజ్ఞాన కార్యం ప్రదహేత్ సమూలమ్. జ్ఞానాగ్ని, అజ్ఞాన కార్యములను మూలకారణముతో సహా నాశనము చేస్తుంది.

# శిష్యుని ప్రశ్నలు

25వ శ్లోకము

కో నామ బంధః కథమేష ఆగతః

కథం ప్రతిష్ఠాస్య కథం విమోక్షః,

కో సావనాత్మా పరమః క ఆత్మా

తయోర్వివేకః కథమేత దుచ్యతే ॥ 51 ॥

కః నామబంధః - బంధమంటె ఏమిటి; ఏషః కథం ఆగతః - ఇది ఎలా వచ్చింది?; అస్య ప్రతిష్ఠా కథం - దీని యొక్క స్థితి (పోషణ) ఏ విధంగా జరుగుతున్నది ?; విమోక్షః కథం - (దీన్నుండి) విముక్తి ఎలా కలుగుతుంది. కః అసౌ అనాత్మా - ఈ అనాత్మ అంటే ఏది?; కః పరమః ఆత్మా - పరమాత్మ ఏది?; తయోః - ఆ రెండింటి యొక్క (మధ్య);వివేకః కథం - వివేకమెలా చేయబడుతుంది?; ఏతద్ ఉచ్యతామ్ - ఈ సమస్తము బోధింపబడును గాక !

"ఈ బంధమేమిటి ? ఇది ఎలా వచ్చింది ? దేనిద్వారా పోషింపబడుతున్నది ? విముక్తి ఎలా సంభవిస్తుంది ? ఏది అనాత్మ ? అపరిచ్ఛిన్న ఆత్మ ఏది ? ఆ రెంటి మధ్య వివేకమెలా చేయబడుతుంది ? ఇవన్నీ చెప్పబడును గాక".

ఉపదేశమంతా శిష్యుణ్ణి 'ఏది ఏమిటో' చూచేటట్లు చేయడానికే తత్పరతతో ఉన్నది. అధ్యాపనం జరుగుతున్నప్పుడే సత్యాన్ని గుర్తించగలగాలి. ఆ క్రమంలో సందేహాలొస్తే సహజంగానే ప్రశ్నలడగాలి. గురువు చెప్పాడు - బంధము అసత్యము, అజ్ఞానము కారణం కాబట్టి - అది జ్ఞానం ద్వారానశిస్తుంద"ని శిష్యుడు ముక్తుడయ్యే ఉన్నాడు. గురువుచే

బోధించబడినది శిష్యుడికి ప్రశ్నలడగటాని కాధారమవుతుంది. శిష్యుడు అడుగుతున్నాడు "మీరు చెప్పిందంతా వివరంగా బోధించండి".

శిష్యుడడుగుతున్నాడు - "బంధముయొక్క స్వరూపమేది; అదెలా వచ్చింది ?" గురువు చెప్పింది శిష్యుడింకా అర్థంచేసుకోవాలని - అతడి ప్రశ్న ద్వారా మనకు తెలుస్తుంది.గురువు చెప్తున్నాడు - 'నీవు అపరిచ్ఛిన్నుడవు. నీవు ముక్తుడవు'. శిష్యుడేమో ప్రశ్నిస్తున్నాడు. - "నేను బద్ధుడనెలా అయ్యాను" అని. ఒక వ్యక్తి తాను పిల్లిననుకున్నాడు. అతడింట్లో నుండి బయటకు రాడు. వీధికుక్కల భయంచేత, ఏదోవిధంగా నేనతడిని ఒప్పించాను - "ఏయ్ ! నీవు పిల్లివి కావు. నీవు మనుష్యుడవు' అని. అప్పడతడు తిరిగి ప్రశ్నిస్తాడు -. నేను 'మనుష్యుడినైతే పిల్లినెలా అయ్యాను' అని. నేనేంచెప్పాలి ? నాకు కొంచెం దయ ఉంటే సమాధానం చెప్తాను-. "నిన్ను నీవు అంగీకరించక పోవటంవలన - లేదా ఆత్మ అజ్ఞానమువలన" అని. అదే విధంగా , "నేనెలా బద్ధుడ నయ్యానని". అడిగితే నీవు సమాధాన మీయలేవు. ప్రశ్న సముచితమైనది కాదు గనక. అతడు బద్ధుడు కాకపోతే నేనెందుకు సమాధానమీయాలి ? అయినప్పటికి ప్రశ్నించాడు కాబట్టి - "అజ్ఞానముచేత అది ఏర్పడింద"న్నది కరుణతోకూడిన సమాధానం.

ఇంకను శిష్యుడడుగుతున్నాడు. "ఇది నాకు ఏర్పడటానికి క్రమమేమైనా ఉన్నదా ? ఈ బంధముయొక్క సంపూర్ణచరిత్ర ఏమిటి ? ఈ బంధము అనాది అని చెప్పబడినది. అది తనను తానెలా పోషించుకుంటున్నది.కొనసాగుతున్నది ? ఎలా విడిపించుకోవాలి ? ఏ విధానముద్వారా ఈ బంధమునుండి విముక్తి లభిస్తుంది ! ఏది ఆనాత్మ ? ఏది పరమాత్మ ? ఈ రెండింటిని వివేకంతో వేరు చేయుటమెలా ? వివేకం చేసే విధానమేది ? ఇదంతా కరుణతో వివరంగా బోధించవలసినది."

శిష్యుడు వేదాంతశాస్త్రమంతా అడిగాడు. అతడికి తెలుసుకోవాలని ఉంది. ఏమని తెలుసుకోవాలనుందో స్పష్టంగా చెప్పాడు. ఈ విన్నపమునుండి అతడికి ప్రశ్నడగటానికి కావలసినంతవరకు జ్ఞానముందని మనకు తెలుస్తున్నది. ఈ సమస్యను పరిష్కరించడానికి, ఖచ్చితంగా ఏంచేయాలనేది అతడికి తెలుసునన్నట్టుగా గోచరిస్తుంది.

26వ శ్లోకము

యద్బోద్ధవ్యం తవేదానీమాత్మానాత్మవివేచనమ్ ।

తదుచ్యతే మయా సమ్యక్ శ్రుత్వాత్మ న్యవధారయ ॥ 73 ॥

తవ - నీకు; యద్ బోద్ధవ్యం - తెలుసుకోవలసిన; యత్-ఏ; ఆత్మానాత్మ వివేచనమ్ - ఆత్మా నాత్మల వివేచనావిధానం; బోద్దష్యం - తెలుసుకోవలసిన అవసరమున్నదో; తత్ఇదానీమ్ అది ఇప్పడు మయా - నా చేత; ఉచ్యతే - బోధింపబడుతున్నది; సమ్యక్ శ్రుత్వా - చక్కగా శ్రవణంచేసి; ఆత్మని - నీ (బుద్ధి) లో; అవ ధారయ - దృఢంచేసుకో

"నీ ద్వారా తెలియబడ వలసిన ఆ ఆత్మానాత్మ వివేచనా విధానం ఇప్పడు చక్కగా బోధింపబడుతున్నది. ఈ ఉపదేశాన్ని చక్కగా శ్రవణం చేసి ఆ జ్ఞానమును దృఢం చేసుకో (జ్ఞానముగా చేసుకో)".

శిష్యుడు పూర్వశ్లోకంలో లేవనెత్తిన ప్రశ్నలకు గురువు సమాధానమిస్తున్నాడు - " ఆ వివేచనా విధానము - తద్వారా నీవు పొందవలసిన ఆత్మానాత్మ జ్ఞానము - నీకు వివరంగా బోధింపబడతాయి. అందుచేత జాగ్రత్తగా శ్రవణం చేసి - ఆ జ్ఞానాన్ని నీ స్వంతం చేసుకో.'

తరువాతి శ్లోకం నుండి ఉపదేశమారంభమవుతుంది. ఏది అనాత్మ ?

# ఏది అనాత్మ ?

27వ శ్లోకము

పఞ్చీకృతేభ్యో భూతేభ్యః స్థూలేభ్యో పూర్వకర్మణా !

సముత్పన్నమిదం స్థూలం భోగాయతన మాత్మనః ।

అవస్థా జాగరస్తస్య స్థూలార్థానుభవో యతః ॥ 90 ॥

ఇదమ్ స్థూలం - ఈ స్థూలం శరీరం; పఞ్చీకృతేభ్యం - పఞ్చీకృతములైన; స్థూలేభ్యవ స్థూల పఞ్చమహాభూతములనుండి; పూర్వకర్మణా - పూర్వ జన్మల కర్మల ఫల రూపము గా; సముత్పన్నం - ఉత్పన్నమైనది; ఆత్మనః - జీవునికి; భోగాయతనం - భోగముల నను భవించే స్థానము; యతః - దేన్నుండైతే; స్థూల అర్థ అనుభవః - స్థూలవిషయముల అ నుభవము కలుగుతుందో; తస్య - (అది) అతడికి (జీవునికి); జాగర అవస్థా - జాగ్రదవ స్థ (అవుతుంది).

"స్థూలశరీరము - పఞ్చీకృత స్థూలపఞ్చమహాభూతములనుండి - పూర్వ జన్మల కర్మఫలముగా - జన్మించినది. జీవునికి భోగములనుభవించే స్థానమది. జీవునికి స్థూల ప్రపంచంలో - విషయానుభవములు - జాగ్రదవస్థలో కలుగుతాయి."

ఏది అనాత్మ అన్న ప్రశ్నకు - మొదట సమాధానమీయబడుతున్నది. ఆత్మానాత్మ విచారం చేయాటానికువుగా - శాస్త్రము స్థూలశరీరముతో ఆరంభిస్తుంది.

శాస్త్రము మొదట పఞ్చభూతముల గురించి - ఆకాశము, వాయువు, అగ్ని, జలములు, పృథ్విల గురించి చెప్తున్నది. వాటినుండే ఈ స్థూల ప్రపంచం ఏర్పడినది. ఈ పంచభూ తముల ప్రక్రియ మన మనుభవిస్తున్న ఈ స్థూల ప్రపంచమును వివరించి చెప్పటానికి - అది పంచభూతముతప్ప మరేదీకాదని బోధించటానికి - చక్కని ప్రక్రియ. శ్రుతియొక్క

ఉద్దేశ్యము ఇక్కడ, నీవనుభవంతోనున్న ఈ జగత్తు గురించి వివరించటం కానేకాదని - నీవు స్పష్టంగా అర్థం చేసుకోవాలి. మరి శ్రుతి అభిప్రాయమేమిటి ? ఇక్కడ ఉన్నదంతా, ఈ జగత్తంతా నాకంటె ఆత్మ కంటె భిన్నం కాడని వివరించటమే శ్రుతితాత్పర్యము. "నేనే ఈ ఉన్నదంతా, ఈ జగత్తంతా నా కంటె వేరుగా, స్వతంత్రంగా లేదు" అని నిన్ను గుర్తించ మని శ్రుతి బోధిస్తున్నది. దానితో నిన్ను పరిచ్ఛిన్న భావాన్నుండి ముక్తుణ్ణి చేస్తుంది. ఇది శ్రుతిదృష్టి.

ఈ పంచమహాభూతములు మొదట వ్యక్తమైనపుడు సూక్ష్మదశలో నుండి, పంచీకరణ ప్రక్రియద్వారా పంచీకృతములైన స్థూలత్వాన్ని పొందాయి. ఈ పంచీకరణ ప్రక్రియలో ప్రతిసూక్ష్మమహాభూతము లోని తామసాంశ మొదట రెండు సమభాగములుగా విభజింపబడినది. ఒక సగము అలాగే ఉండగా, రెండవ సగము మరి నాలుగు సమభాగములుగా విభజింపబడినది. ఈ నాలుగు సమభాగములను మిగిలిన నాలుగు మహాభూతములు సమంగా పంచుకుంటాయి. ఆ విధంగా ఆకాశము 1/2 ఆకాశమును 1/8 వాయువును, 1/8 అగ్నిని, 1/8 పృథ్విని కలిగి ఉంటుంది. అదేవిధంగా స్థూల వాయువు 1/2 వాయువును 1/8 ఆకాశమును మొ॥ కలిగి ఉంటుంది. అందుచేత మనము దేనిని ఆకాశమంటున్నామో - అది మహాభూతములైదింటినీ కలిగి ఉంటున్నది. కానీ ఆకాశము అధికభాగము ఆ విధంగా - ప్రతి మహాభూతము పంచీకృతమవుతుంది. శ్రుతి పంచీకరణమును గురించి చెప్పదు. కానీ ఛాందోగ్యోపనిషత్తు త్రివృత్కరణం గురించి చెప్తుంది. అది మూడు భూతముల గురించి చెప్పి అవెలా త్రివృత్కరణాన్ని పొందుతాయో చెప్తుంది. అదే న్యాయాన్ని పొడిగించి ఇతరశ్రుతులు చర్చించిన పంచభూతములకు వర్తించేట్లుగా పంచీకరణము నిశ్చయింపబడినది.

పంచీకరణమునకు ఫలితంగా సూక్ష్మపంచమహాభూతములు, స్థూలమవుతాయి. మహాభూతములే జ్ఞానపూర్వకంగా - సంఘాతముగా ఏర్పడేటట్లుగా కలిపి ఉంచబడి నవి. స్థూలశరీరము స్థూలపంచమహాభూతములతో నిర్మితమైనది విదితమే. కొంత ఆకాశాన్ని వ్యాపించి ఉంటుంది. రక్తకణములలో ఆక్సిజన్ ఉన్నది. టెంపరేచర్‌రూపంలో అగ్ని ఉన్నది. శరీరాకారము జలముమూలంగానే స్పష్టముగా తెలిసే కాల్షియమ్, కార్బన్ మొ॥ ఉన్నాయి.

జీవుడు స్థూలవిషయముల ననుభవించే స్థానము స్థూలశరీరము. అందుకే శరీరము ను ఆత్మనః భోగాయతనము అన్నరు. స్థూలశరీరము లేకపోతే జీవుడు స్థూలప్రపంచాన్న నుభవించలేడు. ఈ శరీరము నిచ్చిందెవరు ? ఈశ్వరుడు. ఇక్కడొక ప్రశ్న ఉదయించ వచ్చు, ఈశ్వరుడు శరీరాన్నిస్తే భిన్న భిన్న జీవులలో భిన్న భిన్న శరీరాలు ఎలా ఏర్పడినవి? ఒకడు ఆరోగ్యంగా ఉంటాడు. మరొకడంత ఆరోగ్యంగా ఉండడు. మరోకడు ఏదో లోపంతోనే జన్మిస్తాడు. ఈ తారతమ్యమెందుకు ? ఈశ్వరుడు చపలచిత్తుడా ? అతడు సరదా కోసం చేసినట్లయితే - అతడి సరదా నాకు దుఃఖాన్నిస్తుంది. అపుడీశ్వరుడు పీడించే మనస్తత్త్వమున్నవాడై ఉండాలి. అతడికి మానసికసమస్య ఏదో ఉండిఉండాలి. కానీ ఈశ్వరు డీశ్వరుడే. అతడికి లేనిదంటూలేదు. నిన్ను మోసపుచ్చటంద్వారా అతడికి పొందవలసింది ఏదీ లేదు. నీచేత పూలతో పూజచేయించుకోవటానికి - లేదా స్తుతిం పబడటానికి - నిన్ను సృష్టించలేదు. పూర్ణుడు కాబట్టి అతడికి కావాలసింది అంటూ ఏ మీలేదు. అందువలన ఈ తారతమ్యంలో కూడ - ఒక నియతి అంటూ ఉండాలి. మరి ఆ నియతి - జీవుడియొక్క కర్మలే ఈ శరీరాన్ని నియమించినవి. ఈశ్వరుడు కర్మఫల దాతమాత్రమే. నీవు కొన్ని కర్మఫలములను సంపాదించుకున్నావు. ఈశ్వరుడు వాటిక నుగుణంగా ఈ శరీరమిచ్చాడు.

ఎవరైనా పూర్వజన్మలలో చేసిన కర్మలయొక్క ఫలరూపంగా శరీరమును పొందుతారు. ఈ కర్మలు ఒక పూర్వజన్మలో ప్రోగు చేసుకున్న కర్మలు మాత్రమే కాదు - అనేక పూర్వజన్మలలో చేసినవి. ఈ కర్మలు సంచితకర్మలనే మడుగులో నుంచబడుతాయి. దానిలో నుండి కొన్ని కర్మల సముదాయము ఫలీభూతమయే సమయం వస్తుంది. ఆ కర్మలు ఫలముల నివ్వడానికి నిర్ధిష్టమైన జనకులు మొ॥ కావాలి. నీవు గతశతాబ్దంలో జన్మించి ఉంటే - నీ అనుభవాలు భిన్నంగా ఉండేవి. అవి వర్తమానశరీరము నిచ్చిన కర్మలననుభవించటానికి తగినవి కావు. కాబట్టి ఈశ్వరుడు పుణ్యపాపమిశ్రమమైన పూర్వకర్మలకనుగుణంగా ఈ ప్రత్యేకశరీరము నిచ్చాడు.

మరియు ఈ శరీరము - సముత్పన్నం - చక్కగా ఏర్పర్చబడ్డది. ప్రతి విషయాన్ని పరిగణలోకి తీసుకుని విశ్వాన్ని చక్కగా అర్తం చేసుకుంటే - అప్పడు అంతా సవ్యంగా ఉన్నదని నీవు కనుగొంటావు. తల్లిదండ్రులు సరిఅయిన వారే, సమయము యుక్తమే, స్థలము యుక్తమే,శరీరము కూడా పురుషునిది కావచ్చు, లేదా స్త్రీది కావచ్చు, యుక్తమైనదే, దోషారోపణకవకాశం లేదు.

జీవుడు జాగ్రదవస్థలో స్థూలశరీరముతో యుక్తుడౌతాడు. జాగ్రత్ ప్రపంచంలోని విషయముల ననుభవిస్తాడు. స్థూలప్రపంచము శబ్ద స్పర్శ, రూప, రస, గంధములను కలిగి ఉన్నప్పటికి - ఆ విషయాలతో నీ అనుభవం సూక్ష్మమైనది. కాబట్టి స్థూల విషయముల నుండి నీ అనుభవాలు సూక్ష్మమైనవి. ఆ విధంగా ఈ స్థూలశరీరము నీవు స్థూలప్రపంచముతో వ్యవహారము చేయటానికే ఏర్పరిచిన స్థలము.

28వ శ్లోకము

వాగాదిపఞ్చ శ్రవణాదిపఞ్చ
ప్రాణాదిపంచాభ్రముఖాని పఞ్చ

బుద్ధ్యాద్యవిద్యాపి చ కామకర్మణీ

పుర్యష్టకం సూక్ష్మశరీరమాహుః ॥ 98 ॥

వాగాది పఞ్చ - వాగాది పంచ కర్మేంద్రియములు; శ్రవణాదిపఞ్చ - శ్రోత్రాది పంచ జ్ఞానేంద్రియములు; ప్రాణాదిపఞ్చ - పంచప్రాణములు; అభ్రముఖానపఞ్చ - ఆకాశాది పంచసూక్ష్మ మహాభూతములు; బుద్ధ్యాది - బుద్ధి మొ॥ (మనస్సు బుద్ధి, చిత్తము, అహంకారము); అవిద్యాఅపి- అవిద్య కూడ; చ కామకర్మణీ - మరియు కామము, కర్మ; పుర్యష్టకం - ఈ ఎనిమిది అంశములు కలిగిన పురమును; సూక్ష్మశరీరమ్ అహుః - సూక్ష్మ శరీరమని అందురు.

"వాగాది పంచ కర్మేంద్రియములు, శ్రోత్రాది పంచ జ్ఞానేంద్రియములు, పంచప్రాణములు ఆకాశము మొ॥ సూక్ష్మపంచమహా - భూతములు, బుద్ధ్యాది. (బుద్ధి, మనస్సు, చిత్తము అహంకారము) అవిద్యా, కామ, కర్మ ఈ ఎనిమిది స్థానములుగా కలిగిన పురమును సూక్ష్మశరీరమందురు."

పూర్వశ్లోకంలో వర్ణింపబడిన స్థూలశరీరమునకు జీవమున్నది. జీవమున్న స్థూలశరీరమునకు, మరణించినదానికి చాలా తేడా ఉన్నది. చైతన్యస్వరూపము, సర్వవ్యాపకము అయిన ఆత్మ మరణించిన స్థూల శరీరమునుకూడా వ్యాపించి ఉన్నది. చైతన్యము, ఆత్మ మరణించిన స్థూలశరీరములో కూడ ఉన్నప్పటికీ శరీరము చైతన్యవంతము కాదు. అందుచేత స్థూలశరీరమును చైతన్యవంతం చేయడానికి మరేదో అంశముండాలి. అదియే సూక్ష్మశరీరము ఘటపటాదులవలె స్పష్టంగా ఘనాకారమైనది కాదు గనుక - ఇంద్రియ గోచరము కాదు. అందుకే అది సూక్ష్మమని పిలవబడుతున్నది. ఈ సూక్ష్మ శరీరము పంచమహాభూతముల పంచీకరణముద్వారా - స్థూలత్వం పొందకముందు -

సూక్ష్మదశలో నుండగా - వాటినుండి ఉత్పన్నమైనది. దానిలో అనేకభాగములున్నవి. అవన్నీ ఇక్కడ వివరించబడుచున్నవి.

ప్రతిసూక్ష్మ భూతములోనూ మూడు గుణములున్నవి - సత్వ, రజస్; తమస్; సూక్ష్మపంచమహాభూతముల రాజసాంశమునుండి కర్మేంద్రియములుత్పన్నమైనవి. ఆకాశము యొక్క రాజసాంశమునుండి వాగింద్రియము జనించింది. వాయువుయొక్క రాజసాంశమునుండి హస్తేంద్రియము. అగ్నియొక్క రాజసాంశము నుండి పాదేంద్రియము - జలము యొక్క రాజసాంశము నుండి గుదేంద్రియము - పృథ్వియొక్క రాజసాంశము నుండి ఉపస్థేంద్రియము జనించినవి. అదేవిధంగా ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వుల యొక్క సత్వాంశమునుండి వరుసగా శ్రవణేంద్రియము, స్పర్శేంద్రియము చక్షురింద్రియము, రసనేంద్రియము, ఘ్రాణేంద్రియము లుత్పన్నములైనవి.

సూక్ష్మ పంచమహాభూతములసమిష్టి రాజసాంశము పంచప్రాణములకు సమగ్రంగా శారీరకక్రియాకలాపవ్యవస్థకు కారణము. సూక్ష్మపంచ మహాభూతముల సమిష్టిసత్వాంశమునుండి అంతకరణము - ఉత్పన్నమైనది. మనస్సు ఒకటేకానీ వృత్తిభేదముననుసరించి నాలుగు, సందేహము, కోరిక, భావోద్రేకము మొ॥ వానిని మనస్సంటారు. నిశ్చయాత్మక వృత్తి బుద్ధి, స్మృతిని చిత్తమంటారు. నేను కర్తను, భోక్తననేది అహంకారము. దేహేంద్రియబుద్ధిసంఘాతము దాని కార్య కలాపములలో అహంకారమునకు తాదాత్మ్యమున్నది. "ఇది నా శరీరము""ఇది నా కార్యము" "ఇది నా మనస్సు" మొదలైన విధంగా. సూక్ష్మశరీరంలో అవిద్యా, కామ, కర్మలు కూడ కలిసి ఉన్నాయి. అవిద్య అంటే ఇక్కడ అధ్యాస అవేగాని - అజ్ఞానమనికాదు. అజ్ఞానము గురించి తరువాత చెప్పబడుతుంది. తాదాత్మ్యమువలన అధ్యాస ఉన్నది. కామమంటే కర్మచేయాలనే కోరికగా భావించవచ్చు

ను. ధ్యానములాంటి మానసికకర్మ చేయటానికి సూక్ష్మశరీరమే స్థానము కాబట్టి -కర్మ సూక్ష్మశరీరములో అంతర్భాగం చేయబడ్డది.

ఆకాశము మొదలుగా సూక్ష్మపంచమహాభూతములన్నీ కలిసి సూక్ష్మశరీరములోని అన్ని అంశములను ఉత్పన్నం చేసినవి. ఈ సూక్ష్మశరీరము ఎనిమిది ముఖ్యప్రదేశములు కల పురముగా వర్ణింపబడినది. పుర్యష్టకము. ఆ ఎనిమిది ప్రదేశములు - పంచ కర్మేంద్రియములు - పంచ జ్ఞానేంద్రియములు - పంచ ప్రాణములు - పంచ సూక్ష్మ భూతములు - మనస్సు, అవిద్యా, కామ, కర్మలు, అవిద్యా కామ కర్మలు విడివిడిగా కాక - ఒకటి గానే గ్రహించవచ్చు. అలాంటప్పడు మనస్సంటే మనోబుద్ధ్యహంకారములు. ఏవిధంగా నైనా - సూక్ష్మ శరీరము ఎనిమిది ప్రదేశములు గలిగిన పురముగా చూడవచ్చును.

29వ శ్లోకము

ఇదం శరీరం శ్రుణు సూక్ష్మసంజ్ఞితం
లిఙ్గం త్వపంచీకృతభూతసంభవమ్ ।
సవాసనం కర్మఫలానుభావకం
స్వాజ్ఞానతో నాదిరుపాధిరాత్మనః ॥ 99 ॥
స్వప్నో భవత్యస్య విభక్త్యవస్థా
స్వమాత్ర శేషణ విభాతి యత్ర ॥ 100 ॥

శ్రుణు చక్కగా వినుము; 'సూక్ష్మసంజ్ఞితం సూక్ష్మ శరీరమని పిలువబడే; ఇదం ఇది, (శరీరము); లింఙ్గంశరీరమ్ లింగశరీరమని కూడ వ్యవహరించబడుతుంది; అపఞ్చీకృత భూత సంభవమ్ అపంచీకృత సూక్ష్మ భూతములనుండి జనించినది; సవాసనమ్ పూర్వానుభవముల సంస్కారములు కలిగి ఉన్నది; కర్మఫలానుభావకం పుణ్యపాప కర్మఫలములనను భవించు భోక్త ఇదే; స్వఅజ్ఞానతః స్వస్వరూపజ్ఞానము లేకపోవుట వలన; ఆ

త్మనః జీవునికిది; అనాదిః ఉపాధిః అనాదికాలంనుండి ఉన్న ఉపాధి; అస్య ఈ జీవునికి; స్వప్నః స్వప్నము; విభక్త్యవస్థా విభిన్న అవస్త అవుతుంది; యత్ర ఎక్కడైతే; స్వమాత్రశేషేణ స్థూల శరీరం లేకుండా తాను మాత్రమే; విభాతి ప్రకాశిస్తుంది.

"సూక్ష్మ శరీరమని పిలవబడే ఈ శరీరము లింగశరీరమని కూడ తెలియబడుతుంది. సూక్ష్మ దశలో నున్న పంచమహాభూతములనుండి జనించింది. మరియు పూర్వానుభవముల సంస్కారములు - వాసనలుగా కలిగిఉన్నది. పుణ్యపాప కర్మఫలములను అనుభవించు భోక్త ఇదే, జీవాత్మకిది అనాదిగా నున్న ఉపాధి, స్వప్నావస్థ దీనికి విభిన్న స్థానము.

అందులో స్థూల శరీరము లేకుండా ప్రకాశిస్తూంటుంది."

పూర్వశ్లోకంలో వర్ణించిన సూక్ష్మ శరీరమును లింగశరీరమని కూడ అంటారు. ఆత్మ దీనిద్వారా తెలియబడుతుంది. కాబట్టి, దాన్ని లింగశరీరమని అంటారు. దాన్ని లింగశరీరమని అనటానికి మరో కారణమున్నది. అది ఉంటే వ్యక్తి జీవించిఉంటాడు. లేకపోతే వ్యక్తి మరణిస్తాడు. అందుచేతనే దానిని లింగమంటారు. స్థూలశరీరములో జీవుడు ప్రస్తుతం ఉన్నాడా, లేదా తెలుసుకోవటానికది సూచకము.

సూక్ష్మ శరీరముయొక్క ప్రవర్తన - తనకి ఏ స్థూలశరీరముతో సంసరమ్ముగ్నదో - దానికనుగుణంగా ఉంటుంది. కాబట్టి ఒక ఢాల్ఫిన్ లో సూక్ష్మ శరీరము డాల్ఫిన్ సూక్ష్మ శరీరమెలా ఉండాలో అలా ఉంటుంది. అందుకనే డాల్ఫిన్ మానవునిలాగా మాట్లాడలేదు. స్థూలశరీరము జీవుడు తన అనుభవాన్ని పొందే ఒక స్థానము. భోగాయతనమని చెప్పినప్పటికీ, సూక్ష్మ శరీరము ఒక ప్రత్యేకశైలిలో పనిచేయటంలో, స్థూలశరీరానికి కూడ ఒక ప్రముఖపాత్ర ఉన్నది, అందుచేతనే స్థూలశరీరము చాలా ముఖ్యమైనది. సూక్ష్మశరీరము వ్యక్తమై పనిచేయటాన్ని స్థూలశరీరము నిరోధిస్తుంది. పరిమితం చేస్తుంది

భూతప్రేతాత్మలకు స్థూలశరీరము లేదు.కనుక వాటి సూక్ష్మశరీరములు నిరోధింపబడ టంలేదు.అందువలన అవి జీవులకంటె శక్తివంతమైనవి. ఆ కారణం చేతనే కొంతమంది, భూతప్రేతాత్మల అనుగ్రహం కోసం ప్రార్థిస్తుంటారు. అవి మానవులకుండే నిరోధములులే కుండ అధికంగా అనుగ్రహించ గలవు కావున.

మానవశరీరములోని సూక్ష్మ శరీరము బుద్ధిని కలిగి ఉంది. కనుక అది పరిశీలించ గలదు. దానికి ఇష్టానుసారం ఎంచుకునే ప్రత్యేక సామర్థ్యమున్నది. కాబట్టి అది కోరగల దు. ప్రణాళిక నేర్పరచగలదు. వాటి నమలు చేయగలదు. ఇవన్నీ మానవశరీరములో ఉంటున్న సూక్ష్మ శరీరానికి మాత్రమే సాధ్యము.

సూక్ష్మ శరీరము పూర్వఅనుభవముల వాసనలు కలిగి ఉంటుంది. సవాసనమ్ కొన్ని ఈ జన్మలోనే చేకూర్చుకుంటాడు. ఈ వాసనలన్నీ సూక్ష్మ శరీరములోనే ఉంటాయి గానీ - కారణశరీరంలో ఉండవు. సూక్ష్మ శరీరము పుణ్యపాపములరూపంలో కర్మఫలముల ను అనుభవిస్తుంది. అవి ఇష్ట, అనిష్ట అనుభవములరూపంలో వ్యక్తమవుతాయి. కర్మ ఫలములు పుణ్యపాపముల మిశ్రమము, కర్మ ఫలముల ననుభవించటం, వేయించిన వేరు శెనగపప్పలు తినటంలాంటిది. నీవు తినే పప్పలన్నీ బాగుంటాయని అనుకోవటాని కి వీల్లేదు. ఎందుకంటే కొన్ని చెడిపోయిన వెప్పడూ ఉంటాయి. ఒక చెడిపోయిన పప్ప చాలు, నోటినంతా పాడుచేయటానికి.

సూక్ష్మ శరీరము ఆత్మకు ఉపాధి. తనగుణములను దగ్గరగా ఉన్న మరో వస్తువు కు సంక్రమింపజేసేది ఉపాధి. ఆత్మ సూక్ష్మ శరీరముతో కలిసి జీవత్వాన్ని - కర్తా, భోక్తా,ద్రష్టా,జ్ఞాతా,మొ॥ పొందుతుంది. వాస్తవంలో స్వరూప మది కాకపోయినప్పటికి.

సూక్ష్మ శరీరము అనాది. అది ప్రళయంలో లయావస్థలో ఉండి సృష్ట్యాదిలో తిరిగి వ్యక్త మవుతుంది. సుషుప్తిలో కూడ అది అవ్యక్తమవుతుంది. ప్రాణము నిద్రలో పనిచేస్తున్నప్పటికీ మనస్సు లయిస్తుంది. జీవాత్మ - సూక్ష్మ శరీరంతో తాదాత్మ్యం చెందినవాడు - మరణంలో - స్థూలశరీరాన్ని వదిలి - మరో క్రొత్త శరీరాన్ని తీసుకుంటాడు. మరణానికి, పునర్జన్మకి మధ్య - జీవుడికి స్వాప్నిక శరీరములాంటి శరీరముండాలి. ఈ జీవుడే - ఇహలోక పరలోక గామి అవుతాడు. సూక్ష్మశరీరంతో మాత్రమే (స్థూలశరీరంతో తాదాత్మ్యం లేకుండా) - జాగ్రదవస్థకు పూర్తిభిన్నమయిన స్వప్నజగత్తునకు తావిస్తాడు జీవుడు.

30వ శ్లోకము

సర్వవ్యాపృతికరణం లింగమిదం స్యాచ్చిదాత్మనః పుంసః ।
వాస్యాదికమివ తక్ణస్తేనైవాత్మా భవత్యసంగోయమ్ ॥ 102 ॥

తకః - వడ్రంగి వానికి; వాస్యాదికమివ - ఉలిమొదలగు పనిముట్ల వలె; చిదాత్మన - చైతన్య స్వరూపుడైన; పుంసః - జీవునికి; ఇదం లింగమ్ - ఈ సూక్ష్మ శరీరము, సర్వవ్యాపృతికరణంస్యాత్ సర్వకార్యములు నిర్వహించటానికి సాధనము అవుతుంది; తేనైవ - ఆ కారణముచేతనే; అయమ్ ఆత్మా - ఈ ఆత్మ; అసంగః - అసంగము; భవతి - అవుతుంది;

"వడ్రంగి వానికి ఉలి మొ॥ ఏవిధంగా పనిముట్లో - అదేవిధంగా జీవునికి ఈ సూక్ష్మ శరీరము ఒక పనిముట్టు - సర్వకార్యములు చేయటానికి. ఆ జీవుని స్వరూపము చైతన్యము. ఇదిలా ఉన్నది కావున ఆత్మ ఎప్పడూ అసంగమే."

ఆత్మ సర్వవ్యాపకము కాబట్టి అంతటా ఎప్పడూ ఉన్నది. సర్వానికి అదే ఆధారము. మరియు ఆత్మ చైతన్యస్వరూపము కూడ కాబట్టి వాస్తవంగా జడ - చైతన్య విభాగమంటూ లేదు. ఈ విభాగము లింగశరీరముద్వారా తీసుకు రాబడ్డది. అది ఉన్నప్పడు చైతన్యము వ్యక్తమవుతున్నది. అది లేనప్పడు చైతన్యము వ్యక్తము కావటంలేదు. స్వప్నంలో

జడవస్తువులను చేతనా వస్తువులను రెండింటినీ చూస్తావు. కానీ అక్కడ ఉన్నదంతా ఒకే ఒక చైతన్యము, వాస్తవమైన విభాగం లేదు. సదాత్మకంటె భిన్నమైన దేదీ లేదు.

ఈ శ్లోకంలో లింగశరీరము గురించి ఇంకా కొంత వివరణ ఇవ్వబడినది. అది ఒక కరణము. దానిద్వారా సకలకార్యములు నిర్వహింపబడతాయి. సకలకార్యములు సూక్ష్మ శరీరముయొక్క మార్పులు చేర్పులే కానీ, ఆత్మలేకుండా అది ఏపని చేయలేదు. అందు చేత కర్తృత్వమాత్మకాపాదింపబడినది. కాబట్టి ఆత్మ కర్తవలె అవుతుంది. ఆత్మ కర్త కాదు - కానీ ఆత్మ లేకుండా కర్తలేడు. కారణం చేతనే కృష్ణ భగవానుడు భగవద్గీతలో "నేను కర్తను" (ఉపాధి దృష్ట్యా) నేను అకర్తను (నిరుపాధిక స్వరూపంగా) (భ.గీ. 4.13) కను క ఆత్మ కర్త, అకర్త రెండూను. అంటే ఆత్మ కర్తలాగా ప్రధానంగా అకర్త - అదీ సత్యము. లింగ శరీరము వడ్రంగి వాని పనిముట్లతో పోల్చబడ్డది. వడ్రంగివానికి ఉలి, రంపము, సుత్తి మొ॥ పనిముట్లు కావాలి తన పని చేయటానికి ఆ పనిముట్లు వాటికవి ఏ పను లు చేయలేవు. కానీ పనిముట్లు లేకుండ ఆ వడ్రండి వాడు ఎటువంటి వడ్రంగము చేయలేడు. అదీ ఇక్కడ ఉదాహరణ - కాబట్టి అనేకములు చేయటానికి సాధనమవు తుంది. కానీ చైతన్యము లేకుండ లింగశరీరమే పనిచేయలేదు. ఆత్మ సూక్ష్మశరీరముల కలయిక వలననే ఏదైనా చేయబడుతున్నది. సమగ్రంగా విషయాన్ని నీవర్థం చేసుకుం టే- ఆ కలయిక పవిత్రమైదవుతుంది. లేకపోతే అపవిత్రమైనదవుతుంది.

## 31వ శ్లోకము

శ్రుతి దృష్టికి తాత్పర్యానికి అనుగుణంగా బ్రహ్మమునకు జగత్తుకూ మద్య కార్యకారణ సంబంధము ప్రస్తావించబడుతుంది. చివరకు నీవే అది 'తత్వమసి' అని చూపుటకు

ఆరంభంలో మాయా బ్రహ్మయొక్క అనిర్వచనీయ శక్తి తరువాతి శ్లోకములలో ఉదహ రించబడి నిర్వచింపబడుతున్నది.

అవ్యక్తనామ్నీ పరమేశశక్తిః
అనాద్యవిద్యా త్రిగుణాత్మికా పరా ।
కార్యానుమేయా సుధియైవ మాయా
యయా జగత్సర్వమిదం ప్రసూయతే ॥ 110 ॥

యయా - దేని ద్వారానైతే; ఇదం సర్వం జగత్ - ఈ సమస్త ప్రపంచము; ప్రసూయతే - ఉత్పన్నమగుచున్నదో; మాయా - (ఆ) మాయాశక్తి; పరమేశశక్తిః - అనంతుడైన పర మేశ్వరునికి శక్తి; అవ్యక్త నామ్నీ - అవ్యక్తమని పిలువబడుతుంది; అనాది అవిద్యా - (ఆమె స్వరూపము) అనాదియైన అవిద్య; త్రిగుణాత్మికా - సత్త్వ రజస్ తమోగుణములే స్వరూప ముగా గలిగినది;పరా (కార్యముకంటె పరమైనది; సుధియా - సుస్పష్టమైన సూక్ష్మమైన బుద్ధిగలవారిచే; కార్యానుమేయా - (మాయా) కార్యమునుండి అనుమేయము.

"అనంతుడైన పరమేశ్వరుని మాయాశక్తిని, దేని ద్వారా నైతే ఈ సర్వ జగత్తు ఉత్పన్నమైనదో, దానిని అవ్యక్తమనే పేరుతోకూడ పిలుస్తారు. ఆమె స్వరూపము - అనాదియైన అవిద్యా, త్రిగుణాత్మికా (సత్త్వ రజస్, తమో గుణములు) కార్యముకంటె పరమైనది. సుస్పష్టము సూక్ష్మబుద్ధిగలవారిచే మాయాశక్తి అస్తిత్వము మాయాకార్యములనుండి అనుమేయము."

మాయ పరమేశ్వరుని శక్తి, ఆ శక్తి మూడు గుణములు కలిగి ఉన్నది. సత్త్వ, రజస్ తమస్. కాని ఇది - సాంఖ్యతత్వశాస్త్రజ్ఞులు ప్రతిపాదించే త్రిగుణాత్మకమైన ప్రధానము

కంటె - భిన్నము. సాంఖ్యులకు పురుష (ఆత్మ) ప్రధానములు రెండు స్వతంత్రసత్తా కలిగిన తత్త్వములు, కాని మాయ స్వతంత్రమైనది కాదు. అది వస్తువు, పరమేశ్వరుని మీద ఆధారపడినది. పరము అంటే దేశకాలవస్తుపరిచ్ఛేదరహితమైనది. అది సచ్చిదానంద బ్రహ్మము.

అదేసమయంలో మరోకోణంనుండి ఆ బ్రహ్మము, వస్తువు మాయా శక్తితో కూడినవాడుగా జగదుత్పత్తికారణమైన పరమేశ్వరుడుగా పిలవబడతాడు. వస్తువు - బ్రహ్మము మాయాశక్తివలనమాత్రమే ఈశ్వరుడని పిలవబడతాడు. పరమేశ్వరునియొక్క సృష్టి, స్థితి, లయములు చేయగల శక్తి మాయ. అది అజా - జన్మించనిది - అనాది. ఏకా విభక్తము కానిది. మాయ ఏమానవుని కపోలకల్పితము కాదు. శ్రుతి తనకు తానుగా మాయను గురించి చెప్తుంది. మాయాం తు ప్రకృతిం విద్యాత్, మాయినంతు మహేశ్వరమ్ - మాయను ప్రకృతిగా తెలుసుకో - మాయని - మాయ కలిగిన వానిని మహేశ్వరునిగా - తెలుసుకో.

మనము వస్తువును తెలుసుకోవటానికే శ్రద్ధాభక్తులతో ప్రయత్నిస్తున్నాము. కానీ జగత్తు పరిగణనంలోకి తీసుకొని దానిగురించి చర్చించకపోతే, వస్తువు పూర్తిగా మనకు తెలియదు. మన మనుభవిస్తున్న జగత్తుకి కారణమంటూ ఉండాలి. ఆ కారణము బ్రహ్మముకంటె భిన్నంగా మరొకటి ఉండలేదు. మనకిక్కడ సమస్య వస్తుంది. బ్రహ్మము కారణమైతే, జగత్తు కావటానికి బ్రహ్మము కొంత మార్పు చెందాలి. కాని బ్రహ్మము కాలతః గుణతః అనంతము కాబట్టి - ఏవిధమైన మార్పు చెందదు. కాబట్టి జగద్రూపంగా భాసిస్తున్న మార్పుకి - పరిణామానికి - మరొక అంశము - కారణమును బ్రహ్మముకంటె భిన్నముస్వతంత్రము కాని దానిని - గణనంలోకి తీసుకురావాలి. ఆ అంశము, కారణము, వక్తియే మాయ అని పిలవబడుతుంది. సత్తా శాస్త్ర ప్రకారం మాయ అంటే మిథ్య.

ఈ మాయ పరా - సృష్టికి కారణము. దానికి అవ్యక్తమని మరోపేరుకూడ ఉన్నది. సృష్టికి పూర్వం మాయ అవ్యక్తము. శ్రుతి చెప్తుంది. "సృష్టికి పూర్వం 'సత్' మాత్రమే ఉన్నది. ఆ సత్తే జగద్రూపంలో భాసిస్తున్నది." కాబట్టి ఈ జగత్ మాయతోకూడిన సత్.

జగత్ అన్నది సత్తునకు నామధేయము మాత్రమే. అది మిథ్యగనుక, మాయను దాని కార్యములనుండి మాత్రమే అర్థం చేసుకోగలము. మాయ మూడు రకముల కార్యములుగా వ్యక్తమవుతుంది. క్రియా - జ్ఞానము - జడము, ఈ మూడు వ్యక్తమైనజగత్తులో మనం చూస్తాము. దీనినుండి అనుమానముద్వారా "ఈ మూడు విధముల కార్యములు - వ్యక్త కావటానికి కావలసిన అంశములు - కారణమైన మాయలో ఉండి ఉండాలి" అని మనం తెలుసుకోవచ్చును. ఆమాయ మిథ్య కాబట్టి - సద్వస్తువు మీద ఆధారపడి ఉన్నది.

ఈ మాయ సుధియైన - సూక్ష్మ గ్రహణశక్తికల ధీమంతునిచేత అర్థం చేసుకోబడుతుంది. ధీ శక్తి అంటే - ఇక్కడ శ్రద్ధతో పాటుగా శ్రుతి తాత్పర్యాని కనుగుణంగా - యుక్తియుక్తంగా - ఆలోచించి గ్రహించగల శక్తి తర్కము - యుక్తి ఆయా విషయాల్ని వివేచన చేసి - విడమర్చి - పనికుపయోగపడటమేకాక - ఏ వస్తువునైనా అర్థం చేసుకోవటానికి - ఒక దశవరకు నిన్ను తీసుకెళుతుంది. కానీ ఆ తర్కము తనకు ముందుకు సాగే అవకాశములేని విషయాలలో అక్కడే ఎక్కువగా పరిశోధిస్తూ పరిశ్రమిస్తూంటే - అక్కడక్కడే వర్తులంగా తిరుగుతూ - అన్నిద్వారాలూ మూయబడినట్లుగా - కనుగొంటుంది. ఆ దశలో తన ప్రయత్నాన్ని వదిలేసి శాస్త్రమేంచెప్తున్నదో దాన్నంగీకరించాలి. శ్రుతిబోధించిన దానినర్థం చేసుకోవటానికి, ఆ జ్ఞానాన్ని తనలో అంతర్లీనమయేట్లుగా - నిరంతరం ప్రయత్నంచేసే మనస్సు ఎవరికైతే ఉంటుందో - ఆ వ్యక్తిచే కార్యలింగముద్వారా కారణమైనమాయ - అర్థం చేసుకోబడుతుంది. తర్కించే సామర్థ్యము శ్రుతి మాత పాదపీఠము

వద్ద పూర్తిగా అర్పణ చేయబడాలి. కాని తర్కసామర్థ్యాన్ని అర్పణ చేయబమంటే యుక్తిని పూర్తిగా వదిలివేసి - ఏం చెప్పినా దాన్ని మ్రింగివేయటము కాదని - నీవు స్పష్టంగా అర్థం చేసుకోవాలి. అలా చేసినట్లయితే నీవు దేనినీ అర్థం చేసుకోలేవు. అర్పణ అంటే - ఇక్క డ శ్రుతిసమ్మతతర్కము నుపయోగించి - సంశయములన్నిటినీ తొలగించటము. ఎం దుకంటే జ్ఞానము సంశయరహితంగా ఉండాలి.

వస్తువు, జ్ఞానరూపంగా, బుద్ధితోనే పొందబడుతుంది. కాబట్టి బుద్ధి కుంటుపడినా, మందంగా ఉన్నా, శ్రద్ధలేకపోయినా అప్పడది శాస్త్రము నర్థం చేసుకోవటానికి సిద్ధంగా లేదు. బుద్ధి అప్రమత్తంగా ఉన్నప్పటికీ అది శాస్త్రం చెప్పేదాన్నంగీకరించక పోవచ్చును. కొన్ని భావోద్రేకపు పూర్వ సంస్కారములవలన - మనస్సులో - ఒక బాలుడు కూర్చొని ఉన్నాడు. బాలుడు తనను పట్టించుకోవాలని కోరుకుంటాడు. అందుకని ఆ బాలుడు బుద్ధిని వెనుకకు లాగుతాడు. "వద్దు, వద్దు, నీకేమి తెలియదు. నీకేం తెలుసు? నీకర్థ మయిందని నేను అనుకోను" ఈ రకమైన ఆత్మనింద / విమర్శ ఒక సమస్య. అది నీ వర్థం చేసుకున్నదానిని - నీలో అంతర్లీనం చేసుకోనివ్వదు. వేరేవారెవరైనా నిన్ను విమ ర్శిస్తే - నిన్నర్థం చేసుకోవటంలో ఆ వ్యక్తి కేదో సమస్య ఉందని - నీవనుకుంటావు. ఆ వ్యక్తి తన ఇచ్ఛవచ్చిన రీతితో నీ గురించి ఆలోచించుకోనిస్తావు. ఆ వ్యక్తిని నీవు ఒప్పించ వలసిన అవసరం నీకు లేదు. కానీ నీవే నిన్ను విమర్శించుకుంటే - ఇక నీ పనంతే. ప్ర తివారిలోపల ఒక విమర్శకుడుంటాడు. ఈ జ్ఞానం పొందటంలో నిన్ను కలవరపెట్టే పెద్ద అవరోధం కావచ్చు.

భగవానుడి మాయను అవిద్య అనికూడ అంటారు. భగవానుడికి అవిద్య ఉన్నదని చెప్ప టం లేదు. భగవానుడికి అజ్ఞానము లేదు. అందుకే అతడు సర్వజ్ఞుడు. మాయ అతడి శక్తి.

ఈ శ్లోకంలో చెప్పినదాన్నిబట్టి ఆత్మఅనీ - మాయఅనీ - రెండు సత్యములున్నట్లుగా గోచ రిస్తున్నది. రెండు భిన్న స్వతంత్రసత్తాకములంటే ఇక అద్వైతము లేదు. అందుచేత ఈ మాయ వస్తువుకంటే భిన్నమా ? మాయయొక్క సత్తా స్థితి ఏమిటి ? తరువాతి శ్లోక ములోఇది వర్ణింపబడినది.

32వ శ్లోకము

సన్నాప్య సన్నాప్యుభయాత్మికా నో
భిన్నాప్యభిన్నాప్యుభయాత్మికా నో,
సాంగాప్యనంగాప్య భయాత్మికా నో
మహాద్భూతా నిర్వచనీయరూపా ॥ 111 ॥

సత్ న అపి - (మాయ) సత్తు కూడా కాదు; అసత్ న అపి - అసత్తు కూడా కాదు; సత్ న అపి - (మాయ) సత్తు కూడా కాదు; న ఉ ఉభయాత్మికా - సత్తు అసత్తు ఉభ యమూ కలిసిన స్వరూపంకాదు; భిన్నా అపి (న ఉ) - (బ్రహ్మము కంటె) భిన్నముకాదు; అభిన్నా అపి (న ఉ) - అభిన్నముకాదు; ఉబయాత్మికా న ఉ - భిన్నా భిన్న ఉభయ స్వరూపముగా కాదు; సాంగా అపి (న ఉ) - అవయవ సహితము కాదు; అనంగా (న ఉ) - నిరవయవముకాదు; హి ఉభయాత్మికా (న ఉ) - కచ్చితంగా సావయవ నిరవ యవ ఉభయ స్వరూపముకాదు; మహాద్భుతా - మహాద్భుతమైనది; అనిర్వచనీయరూ పా - ఇది అని స్పష్టంగా నిర్వచింపశక్యము కానిది.

"మాయ సత్తుకాదు, అసత్తుకాదు. సత్తుఅసత్తు కలిగిన స్వరూపమూ కాదు. బ్రహ్మకంటె భిన్నము కాదు. అభిన్నమూ కాదు, రెండూ కలసిన మిశ్రమము కాదు. అవయవములు కలదీ కాదు. అవయవములు లేనిదీ కాదు. లేక రెండూ కలసిన సావయవ నిరవయవ స్వరూపమూ

కాదు మహాద్భుతమైనది. ఇది అని ఖచ్చితంగా నిర్వచింపశక్యము కానిది."

ఈ మాయ సత్తు కాదు. సత్తా శాస్త్రప్రకారం సత్యమని చెప్పలేము. స్వతంత్రంగా ఉండ లేదు కాబట్టి - అసత్తు - లేనిది కూడ కాదు. అది లేనిదైనట్లైతే, దాన్నుండి ఏ కార్యము ఉండదు. కానీ పూర్వశ్లోకంలో - అది పరమేశ్వర శక్తియని - దాని కార్యములనుండి అనుమానంద్వారా - దాని అస్తిత్వాన్నర్థం చేసుకోవాలని చెప్పబడింది. కాబట్టి అసత్తని కొట్టివేయలేము. సత్తని అంగీకరించలేము. సత్తు - అసత్తు రెండూ అని చెప్పగలమా ? కొంత సత్ కొంత అసత్తని ? కాదు. అది రెండూ కాలేదు. సత్తు అసత్తు కలిసి ఉండలే వు కాబట్టి - ఆ రెండూ పరస్పర విరుద్ధములైనవి. కనుక ఒకే చోటు ఒకే సమయంలో కలిసి ఉండలేవు. ఉన్న వస్తువేదో లేనివస్తువుతో కలిసి ఉండలేదు. కాబట్టి మాయ సత్తు అసత్తు కలిసి ఉన్నది కాదు. అది రెండూ కాని మిథ్య.

ఏవిధంగా నైతే కుండ మృతికకంటె వేరుకాదో అదేవిధంగా మాయ బ్రహ్మము కంటె భిన్నము కాదు. అది బ్రహ్మలో ఒక అవయవము కాని, గుణముకాని కాదు, బ్రహ్మము గుణరహితము. కనుక కుండ లేకపోయిన మృత్తిక ఉన్నది కాబట్టి ఏవిధంగా కుండ మృత్తికకు గుణముకాదో అదేవిధంగా బ్రహ్మమునకు కూడ మాయ లేకపోయిన అస్తిత్వ మున్నది. కాబట్టి, మాయ బ్రహ్మమునకు గుణముకాదు. మరియు మాయ - బ్రహ్మము లో అవయవముగా ఉంటూ మరల దాని కంటె భిన్నంగా ఉండటము- రెండూ ఒకే సమయంలో సాధ్యము కాదు.

మాయకు అవయవములు లేవు. అవయవములున్నదేదైనా జన్మిస్తుంది. మాయ అనాది కాబట్టి అది అవయవములు కలిగి ఉండలేదు. మాయని నిరవయవమని చెప్ప

లేము. ఎందుకంటే అవయవములతో కూడి ఉన్న ప్రపంచము దానినుండి వ్యక్తమైనది. మరియు మాయ ఒకే సమయంలో సావయవము, నిరవయవము రెండూ కాదు.

మాయ లేదని చెప్పలేము, ఉన్నదనీ చెప్పలేము. బ్రహ్మమును విడిచి భిన్నంగా ఉందనీ చెప్పలేము. బ్రహ్మకవయవమనీ చెప్పలేము. మాయ కవయవములున్నవని చెప్పలేము. లేవని చెప్పలేము. అందుచేత అది అనిర్వచనీయము - ఖచ్చితంగా ఇది అని వివరించ లేనిది. అనిర్వచనీయమంటే నిర్వచించలేనిదనర్థం కాదు. స్పష్టంగా ఇది అని స్వరూప స్వభావములు వివరించబడనిదని అర్థం. ఈ అనిర్వచనీయత్వము సృష్టిలోని ప్రతివస్తు వులోనూ అనువర్తిస్తున్నది. కాబట్టి నీవు ఏ వస్తువును ఇది ఇంతవరకే అని నిర్ణయించి చెప్పలేవు. ఒకవేళ అలాచేస్తే అది సత్యము కాదు. అది ముద్రవేయడమే. అప్పడు నీవు ఒక అభిప్రాయాన్నేర్పరచుకునే వాడివవుతావు. అందుచేత సువర్ణాక్షరముల నియమమే మంటే ముందున్న దేదో దాన్ని చూడటమే !

33వ శ్లోకము

మాయని గురించి నీవు చెప్పగలిగినదల్లా మాయ ఉన్నదని మాత్రమే. అలాగని ఏవిధం గా చెప్పగలుగుతున్నావు ? తరువాతి శ్లోకములో ఇది వివరించబడుతుంది.

అవ్యక్త మేతత్ త్రిగుణైర్నిరుక్తం
తత్కారణం నామ శరీరమాత్మనః
సుషుప్తిరేతస్య విభక్త్యవస్థా
ప్రలీనసర్వేంద్రియబుద్ధివృత్తిః ॥ 122 ॥

ఏతత్ అవ్యక్తమ్ - అవ్యకము (మాయ); త్రిగుణైః - త్రిగుణ రూపముగా; నిరుక్తం - ని ర్వచింపబడినది; తత్ ఆత్మనః అది ఆత్మకు; కారణమ్ శరీరమ్ నామ వ కారణ శరీరమ న బడుతున్నది; ప్రలీనసర్వేంద్రియ బుద్ధివృత్తిః - సర్వ ఇంద్రియ వ్యాపారములు, బుద్ధి వృ

త్తులు లయం చెందిన; సుషుప్తిః - సుషుప్తి; ఏతస్య - దీనికి విభక్తి అవస్థా - ప్రత్యేకమైన అవస్థా;

"ఈ అవ్యక్త మాయ త్రిగుణాత్మకముగా వర్ణించబడినది. అది ఆత్మకు కారణ శరీరమని పిలువబడుతుంది. ఇంద్రియవ్యాపారములు, బుద్ధివృత్తులన్నీ లయం చెందిన ప్రత్యేకమైన సుషుప్తి ఈ కారణ శరీరానికి స్థానము."

ఈ మాయ అవ్యక్తము, అంటే కారణావస్థలో నామరూపములేవీ లేవు. ఇంతకు ముందు మాయకు త్రిగుణములున్నవని చెప్పబడింది - సత్వ, రజస్, తమో గుణములు, ఇవి మాయలో ప్రత్యక్షంగా చూడలేనివి. కానీ మాయాకార్యమైన జగత్తులో ఈ మూడుగుణములు జ్ఞాన, క్రియా, జడ వస్తువుల రూపంలో వ్యక్తమవటం చూస్తున్నాము. కాబట్టి మాయా కార్యములను బట్టి త్రిగుణాత్మకమైన మాయను- అనుమానము ద్వారా తెలుసుకోవచ్చును. అంతేకాకుండా నీ మనసులో కూడ ఈ మూడు గుణములు వ్యక్తమవుతూంటాయి.

అమానిత్వము, అదంభిత్వము మొ॥ వి సత్యగుణము యొక్క అభివ్యక్తమే. కామము, క్రోధము తృష్ణ మొ॥ రజోగుణము వ్యక్తం కావటము - సోమరి తనము, నిద్ర మొ॥ తమోగుణము వ్యక్తం కావటం - దీనినుండి, కారణమైన మాయ కూడ త్రిగుణాత్మికమని అర్థం చేసుకుంటాము.

ఈ మాయ ఆత్మకు ఉపాధి - కారణ శరీరమని కూడ తెలియబడుతుంది. శరీరమెందుకంటే నశిస్తుంది కాబట్టి - లేదా అసలు కనబడకుండా పోతుంది కాబట్టి జీవన్ముక్తుడు మరణించినపుడు అది విదేహముక్తి ఇక జీవుడంటూ శేషించడు. మూడు శరీర

ములు నశిస్తాయి. ఉండేది బ్రహ్మ వస్తువు మాత్రమే. అదే మిగిలిన జీవులకు ఈశ్వ రుడు.

మూడు అవస్థలలోనూ మాయ ఉన్నది. జాగ్రత్ స్వప్నావస్థలలో విషయ, విషయి అనుభవరూపంలో వ్యక్తమై ఉన్నది. కానీ సుషుప్తి అవస్థలో విషయ - విషయిరూపంలో వ్యక్తంకాకుండా- కారణరూపంలో మాత్రమున్నది. జాగ్రదవస్థలో మనస్సు, ఇంద్రియము లు చేతనావంతములై పనిచేస్తూనే ఉన్నవి. స్వప్నావస్థలో ఇంద్రియములు పనిచేయడం లేదు. కానీ మనసు మాత్రమున్నది. కానీ సుషుప్తిఅవస్థలో ఇంద్రియమనస్సులవ్యాపార ములన్నీ లయం చెందుతాయి.

# పరమాత్మ ఎవరు ?

34వ శ్లోకము

అథ త సంప్రవక్ష్యామి స్వరూపం పరమాత్మనః

యద్విజ్ఞాయ నరో బంధాత్ ముక్తః కైవల్యమశ్నుతే ॥ 126 ॥

అథ - ఇప్పుడు; యత్ విజ్ఞాయ - ఏది తెలుసుకొని; నరః - మానవుడు; బంధాత్ ముక్తః - బంధంనుండి విముక్తుడై; కైవల్యమ్ - పరమేశ్వరునితో ఏకత్వమును; అశ్నుతే - పొందుతాడో, పరమాత్మనః - స్వరూపం; తే సంప్రవక్ష్యామి - నీకు నేను బోధిస్తాను.

"దేనిని తెలుసుకుంటే బంధముక్తుడై పరమేశ్వరునితో ఏకత్వాన్ని పొందుతాడో - ఆ పరమాత్మస్వరూపాన్ని ఇప్పుడు నీకు బోధిస్తాను."

ఇంత వరకు శాస్త్రము స్థూల / సూక్ష్మ కారణ శరీరములను వివరించింది. అది అనాత్మ అని ధృడంగా చెప్పింది. దేహేంద్రియ బుద్ధి సంఘాతము సాధారణంగా ఆత్మగా గ్రహించబడుతుంది. అందుచేత శాస్త్రము అది అనాత్మ అని తెలిపింది. అది అనాత్మ అని స్పష్టంగా ధృవపరచటం ఆత్మజ్ఞానాన్నివ్వదు. కాబట్టి ఏది ఆత్మకాదో స్పష్టంగా బోధించి శాస్త్రమిప్పుడు ఆత్మను తెలుపుతున్నది.

శిష్యుడు పరమాత్మ ఎవరని ప్రశ్న అడిగాడు. సమాధానమిస్తూ గురువిక్కడ చెప్తున్నాడు - 'నీకు పరమాత్మస్వరూపాన్ని బోధిస్తాను - దేనిని తెలుసుకుంటే నరుడు బంధ విముక్తుడవుతాడో" అని. నరుడంటే - ఎవరైతే ఎప్పటికి మరణించడో కాబట్టి నరుడంటే - మరణము తరువాత కూడ ఉండే జీవుడు, అతడు నిత్యుడు. జీవుడు ఒక స్థూల

శరీరమునుండి మరో స్థూలశరీరమునకు ప్రయాణిస్తుంటాడు. కాబట్టి ఉపాధిదృష్ట్యా కూడ అతడు మరణించడు. ఇక స్వరూపదృష్ట్యా మరణమే లేదు. అతడు కాలాతీతుడుకాబట్టి.

పరమాత్మస్వరూపాన్ని తెలుసుకోవటంద్వారా జీవుడు బంధ విముక్తుడవుతాడని ఇంతకు ముందు చెప్పబడింది. కానీ ఆ విముక్తి నష్టాన్ని పూడ్చటం లాంటిదే కానీ - ప్రత్యేకంగా అధికంగా పొందట మంటూలేదని - గోచరిస్తుంది. అది చికిత్స పొందిన తరువాత హాస్పిటల్‌నుండి బయటికి రావటం లాంటిది. అది విముక్తియే కానీ - దానర్థం నేను ఆరోగ్యంగా ఉన్నానని కాదు. తరువాతి జాగ్రత్తలు పథ్యము వగైరా తీసుకోవలసిన అవసరముంది. అదేవిధంగా జీవుడు బంధవిముక్తుడవు తున్నాడు. కానీ దాన్నుండి అతడు పొందిందేమిటి ? శాస్త్రము అతడికి ఈ జ్ఞానముద్వారా లాభముందని చెప్తున్నది. జీవుడు తానీశ్వరునికంటె భిన్నము కాదని తెలుసుకుంటాడు. ఇది చాలా ఉత్తమమైన బేరము. ఇంతకన్న అధికమైనదేదీ నీవు పొందలేవు. ఎందుకంటె ఉన్నదంతా ఈశ్వరుడు మాత్రమే కాబట్టి. ఈశ్వరునితో ఏకత్వాన్ని పొందటమంటే ఆనందాన్ని పొందటమే. అదే జ్ఞానమునకు ప్రధానఫలము, అంతేకాక ఈ జ్ఞానం పొందిన తరువాత తిరిగి ఈ సంసారజీవితంలోకి రావటమంటూ ఉండదు.

35వ శ్లోకము

అస్తి కశ్చిత్ స్వయం నిత్యమ్ అహం ప్రత్యయలంబనః ।
అవస్థాత్రయసాక్షీ సన్ పంచకోశవిలక్షణః ॥ 127 ॥

స్వయం కశ్చిత్ అస్తి - స్వతః సిద్ధమైనది ఒకటి ఉన్నది; నిత్యమ్ - నిత్యమైనది; అహం ప్రత్యయలంబనః - అహం ప్రత్యయంలో ఎప్పడూ వ్యక్తమయే ఉన్నది; పఞ్చకోశ విలక్షణః సన్ - పంచకోశములకు విలక్షణముగా; అవస్థా త్రయ సాక్షి - మూడు అవస్థలకు సాక్షి గా ఉన్నది.

"స్వతఃసిద్ధమైనది ఒకటి ఉన్నది. అహం ప్రత్యయంలో ఎప్పడూ వ్యక్తమయే ఉన్నది. పంచకోశములకు విలక్షణము మూడు అవస్థలకు సాక్షి"

పరమాత్మస్వరూపము ఈ శ్లోకము వివరించబడ్డది. శాస్త్రము చెప్తున్నది. "ఒకటి ఉన్నది - అస్తి కశ్చిత్ "ఆత్మ" ఉన్నది" అంటే ఈ సమయంలో, ఈ ప్రదేశంలో, ఈ స్వరూపంలో ఉన్నదని. 'ఉన్నది' సత్ తాను మనుష్యులు, దేవతలు, మొ॥ వివిధరూపాలుగా వ్యక్తం కాని ఒక వస్తువు ఉన్నది. అంటే దానిని కాలంతో సంబద్ధమైనట్లుగా చూడటమే మన మనోవైఖరి. ఇప్పడది 'ఉన్నది' అని మనం సాధారణంగా ఆలోచిస్తాము. ఆ వస్తువు యొక్క ఉనికి దేశకాలములమీద ఆధారపడుతుంది - ఘటములాగ, ఘటము ఉన్నది' అని మనం చెపితే, ఈ సమయంలో, ఈ ప్రదేశంలో ఉన్నదని అది మృత్తికమీద ఆధారపడి ఉన్నదని అర్థం. కాని ఇక్కడ "ఉన్నది" అని చర్చించబడేది ఘటములాగ ఉన్నది కాదు. అది దేశ, కాల, విషయము, మొ॥ దేని మీద ఆధారపడదు. కానీ ఎల్లప్పడు లబ్దమయే ఉన్నది. అదెలా సాధ్యం ? శాస్త్రము చెప్తున్నది - స్వయం అస్తి - పరమాత్మ తన మహిమతో తాను ప్రకాశిస్తుంటాడు. తన ఉనికికి మరో వస్తువు దేనిమీద ఆధారపడదు. ఉనికి

ఉన్నది ? అని చెప్పినపుడు చైతన్యము ఉన్నది అని అర్థం. మరియు అది తనకు తాను ప్రకాశిస్తుంది. కాబట్టి ఆత్మ స్వతఃసిద్ధః - స్వతః భాతి అహంకారము ఈ స్వతః భాసమా నమైన ఆత్మమీద ఆధారపడుతున్నది. ఘటము మృత్తికమీద ఆధారపడినట్లుగా.

ఆత్మ అవస్థాత్రయ సాక్షి - జాగ్రత్ స్వప్న సుషుప్తులకు సాక్షి. నేను మెలకువగా ఉన్నప్ప డు శబ్దాలను వింటాను. గంధం పీలుస్తాను, రుచిని, స్పర్శను అనుభవిస్తాను, రూపాల ను చూస్తాను. అనుమితిజ్ఞానం పొందుతాను. స్మరిస్తాను. ఆలోచిస్తాను. వీటన్నిటిలో ఒకటి సాధారణంగా ఉన్నది. అహం “నేను” సాక్షి. అది ఎప్పుడూ లేకుండా పోదు. నేను చూచేటప్పడు, వింటున్నప్పడు, స్పృశిస్తున్నప్పడు, ఆలోచిస్తున్నప్పడు, ఊహల్లో విహరిస్తు న్నప్పడు కూడ ‘అది’ వర్తమానమై ఉన్నది. జాగ్రదవస్థలో ఎప్పడూ లేకుండా లేదు. అదే విధంగా ఈ సాక్షి స్వప్నావస్థలో కూడ సదా ఉన్నది. అది లేకుంటే స్వప్న అనుభవము సాధ్యపడదు కాబట్టి. సుషుప్తిలో కూడ ఇంద్రియములు మనస్సు లయం చెందినప్పడు కూడ - నేను సాక్షిగా ఉన్నాను. కానీ మేలుకున్న తరువాత నే నా అనుభవాన్ని స్మరిస్తు న్నాను. జాగ్రత్, స్వప్నములకు ఏది సాక్షిగాఉన్నదో సుషుప్తికికూడా అదే సాక్షి. అది ప్రయత్నం లేకుండా ప్రకాశిస్తుంటుంది. స్వయం భాతి, అది చైతన్యము. చైతన్యము మాత్రమే స్వతః భాతి, ఇతరములన్నీ ఈ చైతన్యము ననుసరించే భాసిస్తాయి.

ఇంకను ఈ ఆత్మ పంచకోశ విలక్షణము ఏకోశము ఆత్మను విడిచి లేదు కానీ - ఆత్మ కోశములకంటె విలక్షణము. కప్పివేసి తెలియకుండా చేసేదాన్ని కోశమంటాము. కానీ ఇక్కడ నిజంగా కప్పివేసేది - కోశము కాదు. కప్పివేసేలాంటిది. వివిధకోశములన్నీ, వివి ధదశలలో అనుభవములే స్థూలశరీరములో - “నేను మర్త్యుడను” “నేను స్థూలంగా

ఉన్నాను" మొ॥ అనుభవాలున్నవి. అది ఒక భ్రమ. అందుచేతనే శరీరము ఆత్మను కప్పివేస్తున్నట్లుగా ఉంటుంది. కాబట్టి దానిని కోశమంటారు. "నేను ఆకలిగా ఉన్నాను," "దప్పిగొని ఉన్నాను నేను ఆరోగ్యంగా లేను" అని మరో అనుభవదశ. దీనిలో నేను ప్రాణము, ఒకటిగ గ్రహింపబడుతున్నాము. ప్రాణము ఆత్మకానీ - ఆత్మ ప్రాణము కాదు. ప్రాణమునకది సాక్షి. అదేవిధంగా "నేను అశాంతిగా ఉన్నాను" "నేను కోపంగా ఉన్నాను" "నేను విచారంగా ఉన్నాను" మొ॥ మనసుతో తాదాత్మ్యము చెందిన దశలో ఉండే అనుభవాలు ఇక్కడ కూడ అశాంతి, క్రోధము, దుఃఖము విచారము మొ॥ అన్నీ మనస్సు యొక్క మార్పులే. అవి ఆత్మకాదు. ఆవిధంగానే "నేను కర్తను" "నేను భోక్తను" "అన్న అనుభవాలు కూడ విజ్ఞానమయ, ఆనందమయ కోశములదశలో ఉన్న అనుభవాలు, అక్కడకూడ మనమదే తప్ప చేస్తుంటాము. కాబట్టి అవి కోశములు- భ్రమ పడటానికి ఆధారములవుతున్నాయి.

కొంత మంది ఆత్మ ఈ అయిదుపొరలచేత ఆచ్ఛాదింపబడినట్లుగా బోధిస్తుంటారు. మానవునిశరీరం ఏవిధంగా బనియనుచేత, షర్ట్‌చేత, స్వెట్టర్ చేత, జాకెట్‌చేత ఆపై కోట్ చేత కప్పబడుతుందో అదేవిధంగా ఆత్మ సత్యముగా, భౌతికంగా, పంచకోశములద్వారా కప్పబడినట్లుగా భావిస్తారు. వారే తిరిగి ఆత్మ సర్వవ్యాపకమని చెప్తారు. సర్వవ్యాపకమైన ఆత్మ ఏవిధంగా కోశముద్వారా ఆచ్ఛాదింపబడుతుంది ? అంటే, కోశమన్న పదం అసలు అర్థం కాలేదు. ఆ కోశముకూడ ఆత్మ కంటె భిన్నము కాదు. స్థూలశరీరము అన్నమయ కోశము అది మిథ్య, మిథ్య సత్యమును విడిచి విడిగా ఉండలేదు. ఆత్మే సత్యము, వాస్తవానికి మిథ్యయే సత్యము. (కానీ సత్యము మిథ్య కాదు) వారే ఆత్మను చేరాలంటే కోశములను తొలగించాలని చెప్తుంటారు. సత్యాన్ని గుర్తించాలంటే మిథ్యను తొలగించా

ల్సిన అవసరం నీకు లేదు. మిథ్యను సత్యంగా గ్రహిస్తున్న భ్రమను తొలగించాలి. జలము
ను చూడాలంటే అలను తొలగించాల్సిన అవసరం లేదు, అలయే జలముతప్ప అన్యము
కాదని నీవు గుర్తించవలె.

ఆత్మ బ్రహ్మము, అది అద్వయము. ఈ సత్యము సర్వసాధారణంగా ఎవ్వరికీ తెలియ
దు, కనుక ఆత్మగురించి సర్వసాధారణమైన అజ్ఞానమున్నది. ప్రతివారికి, తనతో తాను
సుఖంగా స్వస్థతతో ఉండాలంటె, ఆత్మయొక్క నిజస్వరూపమేమిటో తెలుసుకోవాలి.

ఆత్మ అజ్ఞానము సర్వసాధారణము కనుక - భిన్నదశలలో భ్రమపడటం కూడ సర్వసా
ధారణమే. అందువలననే ఈ దశలను కోశములందురు. భ్రమలు కోశములవలె ఆచ్ఛా
దిస్తున్నవి కాబట్టి. ఉపనిషత్తు కోశమనే పదమును ఉపయోగించదు. అన్నమయము
ప్రాణమయము మొ॥ పదములు మాత్రమే ఉన్నవి. కానీ ఈ దశలలో భ్రమపడటం జరు
గుతున్నది కనుక - బోధనాసంప్రాదయము - కోశమన్నపదమును వాడుతున్నది.

శాస్త్రమిక్కడ ఆత్మ పంచకోశవిలక్షణము - ఈ ఐదు దశలకంటె భిన్నమని చెప్తున్నది.
కనుక ఆత్మను తెలుసుకొనటానికి కోశములను తొలగించవలసిన అవసరములేదని
స్పష్టమవుతున్నది. ఆత్మ 'ఉన్నది' అదే చైతన్యమని - అది అన్నమయ ప్రాణమయాది కోశ
ముల గుణ రహితమని గుర్తించవలెను.

ఆత్మస్వరూపమును శాస్త్రమింకను వివరిస్తున్నది -

36వ శ్లోకము

యో విజానాతి సకలం జాగ్రత్ స్వప్నసుషుప్తిషు ।
బుద్ధితద్వృత్తి సద్భావమ్ అభావమహమిత్యయమ్. ॥ 128 ॥

యః - ఏదైతే; జాగ్రత్స్వప్నసుషుప్తిషు - జాగ్రత్ స్వప్న నిద్రలందు; సకలమ్ - సమస్త మైన; బుద్ధి తద్వృత్తి సద్భావమ్ - మనస్సుని, మనోవృత్తుల అస్తిత్వమును, అభావమ్ - (వాటి) అభావమును; విజానాతి - తెలుసుకుంటున్నదో; అయమ్ అహమ్ ఇతి - ఇదే 'నేను', 'ఆత్మ'.

"ఏదైతే జాగ్రత్, స్వప్న సుషుప్తులలో మనస్సుని మనోవృత్తులనన్నింటి యొక్క అస్తిత్వ మును అభావమును కూడ తెలుసుకుంటున్నదో అదే ఆత్మ, 'నేను' రూపంగా ఉన్నది."

మూడు అవస్థలను వాటిలోని విభిన్న అనుభవములను ప్రకాశింప జేసేదేదో అదే ఆత్మ.

జాగ్రత్ స్వప్నావస్థలు రెండింటిలోనూ - మనస్సు చైతన్యవంతంగా పనిచేస్తూనే ఉం టుంది. జాగ్రదవస్థలో మనస్సు భావోద్రేకములు కలదిగాను - ఇంద్రియప్రత్యక్షజన్యఅను మితిజన్యవృత్తులు మరియు స్మృతిజన్యవృత్తులు మాత్రము గలిగినదిగా వర్ణింపబడుతుం డగా - స్వప్నావస్థలో స్మృతిజన్యవృత్తులుమాత్రము కలిగినదిగా వర్ణింపబడుతున్నది. ఈ రెండు అవస్థలలోనూ "ఇది చూస్తున్నాను - దీనిని వింటున్నాను"- అనే అనుభవమున్నది. 'అహం వృత్తి' 'ఇదంవృత్తి' (నేను - ఇది) రెండు మనస్సుకి సంబంధించినవే. తానెటు

వంటి మార్పు చెందకుండా ఈ వృత్తుల నన్నింటినీ ప్రకాశింపజేసేదే ఆత్మ. బుద్ధి తద్ వృత్తి సద్భావం విజానాతి. ఇంకను సుషుప్తిలో అన్ని వృత్తులు లయంచెంది నప్పడు ఈ అనుభవము నాకేమియు తెలియదనే రూపంగా చెప్పబడుతున్నది. కనుక ఆత్మ వృత్తుల అభావమును గూడ సాక్షిగా తెలుసుకుంటున్నది. బుద్ధి - తద్ వృత్తి - అభావం విజానాతి.

సుషుప్తి అనుభవముద్వారా - మనోవృత్తులు - ఆత్మకు సహజసిద్ధమైన ధర్మములు కావని - మనమర్థంచేసుకొనవచ్చును. సహజసిద్ధమైన ధర్మము వస్తువు యొక్క స్వరూపమవుతుంది. అది లేకపోతే ఆ వస్తువుకి అస్తిత్వముండదు. ఒక వస్తువు తనలో నున్న ఒక ధర్మాన్ని విడిచి ఇంకా కొనసాగుతూ ఉంటే - అప్పడాధర్మ మావస్తువుయొక్క స్వరూపముకాదు. ఆత్మకు మనస్సు - వృత్తులు ధర్మములుగా ఉన్నట్లైతే - అప్పడాత్మ - వృత్తులను వదిలి తానుండలేదు. కానీ సుషుప్తిలో వృత్తులు లేవు. ఐనా ఆత్మ ఉన్నది. కనుక అవి ఆత్మకు సహజసిద్ధధర్మములు కావు.

ఈ మూడు అవస్థలలోనూ ఆత్మ మార్పులేకుండా ఉన్నది. ఆ మారని ఆత్మయే ఇక్కడ సర్వమనోధర్మవర్జితమైనసాక్షిగా చెప్పబడినది.

జాగ్రత్ స్వప్నములలో ఇంద్రియప్రత్యక్షములు వివిధరకాలుగా సంభవిస్తుంటాయి. జాగ్రదవస్థలో ఇంద్రియములు పనిచేస్తుంటాయి. బుద్ధి వృత్తులు తరచుగా అధికభాగం ఇంద్రియప్రత్యక్షముల ననుసరించి ఉంటాయి. కానీ స్వప్నావస్థలో ఇంద్రియములు లయం చెందుతాయి. కనుక స్థూల విషయములను గ్రహించటముండదు. ఐనప్పటికి - స్వప్నములో మనసుద్వారా సృష్టింపబడిన - ఇతర ఇంద్రియసముదాయముంటుంది. అక్క

డ మనస్సే స్థూల సూక్ష్మ శరీరముల నేర్పరుచుకుంటుంది. కాబట్టి జగత్తులో ఈశ్వరుని చే సృష్టింపబడినట్లుగాక, స్వప్నంలో జీవుడే ఇంద్రియములను సృష్టించుకుంటాడు. ఇం ద్రియములు జీవునిచే సృష్టించబడినా, ఈశ్వరునిచే సృష్టించబడినా, ఈ రెండు జాగ్రత్ స్వప్నములలో బుద్ధివృత్తులు మాత్రమున్నవి. భేదమేమిటంటే - జాగ్రదవస్థలో ఇంద్రియ ములు ఈశ్వరునిచే సృష్టించబడుతుండగా, స్వప్నావస్థలో ఇంద్రియములు జీవునిచే సృ ష్టించబడుతుంటాయి.

37వ శ్లోకము

యః పశ్యతి స్వయం సర్వం యం న పశ్యతి కశ్చన ।
యశ్చేతయతి బుద్ధ్యాది న తు యం చేతయత్యయమ్ ॥ 129 ॥

యః - ఏదైతే; సర్వం స్వయం పశ్యతి - సర్వమును మరొక సహాయం లేకుండా తా నే చూస్తుందో; యం - దేన్నైతే; కశ్చన - ఎవరూ కూడ; న పశ్యతి - చూడలేదో, యః - ఏదైతే; బుద్ధ్యాది - మనస్సు మొదలగు వాని నన్నిటినీ; చేతయతి - ప్రకాశింపజేస్తున్నదో; యం తు - దేన్నైతే; మనస్సు మొ॥ న చేతయతి - ప్రకాశింపజేయలేదో; అయమ్ - అదే ఈ ఆత్మ

"స్వయంగా తానే మరొక సహాయం లేకుండా సర్వాన్ని చూస్తున్నదో - దేన్నైతే ఏదీ చూడలేదో - ఏదైతే మనస్సు మొ॥ వానినన్నిటినీ ప్రకాశింపజేస్తున్నదో - దేన్నైతే మనస్సు మొ॥ దేదీ ప్రకాశింపజేయలేదో అదే ఆత్మ."

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

ఆత్మ మరోదాని సహకారములేకనే అన్నిటినీ ప్రకాశింపజేస్తూ ఉంటుంది. యః పశ్యతి స్వయం సర్వమ్. ఇంద్రియజ్ఞానము మనస్సు, ఇంద్రియములు మొ॥ అంశముల ఉపస్థితిపై ఆధారపడుతుంది. మనస్సు ఇంద్రియములేకాక రంగును చూచుటకు బాహ్యప్రకాశముకూడ ఉండవలెను. మనస్సు కూడ 'అహంవృత్తి' మీద ఆధారపబుతున్నది. అదిలేనపుడు వస్తు గ్రహణం (Cognition) సాధ్యముకాదు. అహంవృత్తి చేతనావంతముగా నుండటకు ఆత్మ - సాక్షి స్వరూపమైన చైతన్యముపై ఆధారపడుతుంది. మనస్సు ఇంద్రియములు దేనిమీద ఆధారపడి పనిచేస్తుంటాయో ఆ తత్త్వమిదే. సాక్షికి చూచుటకు మరేదీ అవసరములేదు. తానే జ్ఞప్తి స్వరూపము - ప్రకాశరూపము కనుక. అందుకే చెప్పబడింది - యః పశ్యతి స్వయం సర్వమ్ - తనకు తానుగా సర్వాన్ని చూస్తుంటుందో.

మరియు ఆత్మ ఎవరూ చూడలేనిది. యం న పశ్యతి కశ్చన - తాను సర్వమును చూస్తున్నప్పటికి- ఆత్మ బురఖాఉన్న ముస్లిమ్ స్త్రీలాంటిది. బురఖా ముఖాన్నంతా కప్పివేస్తుంది, కానీ కళ్ళవద్ద చూడటానికి కిటికీ ఉన్నది. ఈ కిటికీద్వారా ఆమె అందరినీ చూస్తుంది, కానీ ఆమె నెవరూ చూడలేరు. ఆత్మనెవరూ చూడలేరు. ఎందుకంటె చూచేవాడు ఆత్మకాబట్టి. ఆత్మను చూచుటకు మరోద్రష్ట లభ్యంకాదు. మనస్సు ఇంద్రియములు ఆత్మను చూడలేవు. ఎందుకంటె మనస్సు ఇంద్రియములు తమ అస్తిత్వమునకు పనిచేయుటకు ఆ ఆత్మ మీదనే ఆధారపడుతున్నవి కనుక. ఆత్మయొక్క అస్తిత్వము ఏ అనుభవవిశేషముమీద - నియతకాలముమీద - నియతదేశము మీద - లేక నిమిత్తము మీద - ఆధారపడుటలేదు. ఆత్మ స్వతఃసిద్ధము - ప్రతి అనుభవములోను ఉన్నది - జాగ్రత్, స్వప్న, సుషుప్తులలో ఏ అనుభవమైనా కావచ్చును. స్వతః సిద్ధఆత్మ స్వయంప్రకాశముకూడ.

ఆత్మ ఒక్కటే సృష్టిలో స్వతః ప్రకాశము ఇతరములన్నీ, (Self_evident)అజ్ఞానముతో సహా ఆత్మకు వేద్యములు.

ఆత్మ బుద్ధి, మనస్సు ఇంద్రియములను ప్రకాశింపజేస్తూ ఉంటుంది. కాని బుద్ధి, మనస్సు ఇంద్రియములు స్వతఃవేద్యము - స్వయంప్రకాశమైన ఆత్మను ప్రకాశింపజేయలేవు.

38వ శ్లోకము

ప్రకృతివికృతిభిన్నః శుద్ధబోధస్వభావః
సదసదిదమశేషం భాసయన్నిర్విశేషః ।
విలసతి పరమాత్మా జాగ్రదాదిష్వవస్థాసు
అహమ్ అహమితి సాక్షాత్ సాక్షిరూపేణ బుద్ధేః ॥ 137 ॥

బుద్ధేః సాక్షి రూపేణ - బుద్ధికి సాక్షిరూపంగా; ప్రకృతి వికృతి భిన్నః - కార్య కారణములకు భిన్నంగా; సత్ అసత్ - సరూప, రూపరహితమైన, ఇదమ్ అశేషం భాసయన్ - ఈ సమస్తమునూ ప్రకాశింపజేస్తూ; శుద్ధబోధ స్వభావః - శుద్ధచైతన్య స్వరూపుడైన, నిర్విశేషః- నిర్విశేష స్వరూపుడైన; పరమాత్మా - పరమాత్మ; జాగ్రదాదిషు అవస్థాసు - జాగ్రదాది అవస్థలయందు; అహం అహం ఇతి - 'నేను' 'నేను' అని; సాక్షాత్ విలసతి - సాక్షాత్తుగా ప్రకాశిస్తుంటాడు.

"మనస్సుకు సాక్షిగా సరూప రూపరహిత అశేషభూత భౌతికముల
నన్నిటినీ ప్రకాశింపజేస్తూ తానెటువంటి మార్పుచెందకుండా పరమాత్మ

- జాగ్రదాది మూడు అవస్థలయందు 'నేను' 'నేను' అని ప్రకాశిస్తూ ఉంటాడు."

ఆత్మ ప్రకృతి - కారణముకంటె వికృతి - కార్యముకంటె భిన్నము. కార్యకారణములకతీతము - స్వతంత్రము. ప్రకృతి అంటే ఒక కార్యమునుత్పన్నం జేయటానికి లభ్యమయేది. అది కార్యము నుత్పన్నంజేయటానికి సార్థకమైన మార్పు జెందుతుంది. ఉదాహరణకు మృత్తికనుండి ఘటము నుత్పన్నంచేయగలవు. కనుక మృత్తిక ఘటమునకు ప్రకృతి. అరుచేత మృత్తికయందు కృతయోగ్యత్వమున్నది. వికృతి అంటే మార్పుజెందిన రూపము - కార్యము. జగత్తు వికృతి - మాయ ప్రకృతి. ఆత్మ - ప్రకృతి వికృతులు రెంటికన్న భిన్నము - కానీ ప్రకృతివికృతులాత్మకంటె భిన్నము కావు. ఈ విషయం గమనించలేక అందరూ పొరబడుతుంటారు. ఆత్మ ప్రకృతివికృతులరెంటికి కారణము. ఎందుకంటే అవి పూర్తిగా ఆత్మమీదనే ఆధారపడుతున్నవి గనుక.

అది ఎటువంటి మార్పుచెందదు, కానీ అదిలేకుండా ఏ మార్పు సంభవించదు. కాబట్టి అది అధిష్ఠానకారణము - వివర్తఉపాదానకారణము - తన స్వరూపంలో ఏ మార్పు చెందకుండ కార్యము నుత్పన్నం జేసే కారణము. కనుక ఆత్మ - ప్రకృతివికృతులకు రెంటికి కారణము, ఐనా రెండింటికంటె భిన్నము.

ఆత్మ శుద్ధస్వరూపము, బోధస్వరూపము - జ్ఞప్తిస్వరూపము. శాస్త్రదృష్టిలో ఆత్మకు అజ్ఞానము లేదు. మాలిన్యము లేదు. కనుక ఆత్మను శుద్ధిచేయవలసిన అవసరం లేదు. శుద్ధిచేయటం మనసుకు మాత్రమే.

ఆత్మ అజ్ఞానమునకు, అహంకారము మొదలు సమస్తజగత్తుకు అధిష్ఠానము, ఐనా, ఈ అధ్యారోపణల వలన ఆత్మ కేవిధమైన హాని జరుగదు. ఆరోపితసర్పము యొక్క నునుపుదనము వంకరలు మొ॥ వలన త్రాడుకేవిధమైన హాని కలుగదు. సర్పము తన నునుపుదనము, మృదుత్వము తాడు మీద వదలదు. అదేవిధంగా సంసారమునకధిష్ఠానమైన ఆత్మ సంసారముచేత కలుషితం కాదు. అది శుద్ధబోధస్వరూపము - శుద్ధచైతన్యము.

జగత్తు పంచభూతములవలన ఏర్పడినది. అందులో రూపముగలిగిన అగ్ని, జలము, పృథ్వులు 'సత్' అనబడును. రూపరహితములైన ఆకాశవాయువులు 'అసత్' లనబడును. పరమాత్మ ఈ భూతములన్నిటినీ ప్రకాశింపజేయును.

ఇక్కడొక సంశయముత్పన్నం కావచ్చును. పరమాత్మ సమస్త జగత్తునూ ప్రకాశింపజేస్తాడు. కాబట్టి ప్రకాశింపజేయటమనే క్రియనతడు చేస్తాడు. మరప్పుడు మార్పు చెందడా ? దానికి సమాధానము, లేదు - పరమాత్మలో ఏ మార్పుకీ అవకాశం లేదని శాస్త్రము చెప్తున్నది. నిర్విశేషము, శుద్ధజ్ఞాన స్వరూపము కాబట్టి, మనస్సనే రంగస్థలంమీద జగన్నాటకం సాగుతూ ఉంటుంది. పరమాత్మ కేవలం దాన్ని ప్రకాశింపజేస్తూ - తానెటువంటి మార్పులేకుండా ఉంటాడు. ఆత్మ ద్రష్ట శ్రోత మొ॥ గా అనేక పాత్రలు పోషిస్తున్నట్లు గోచరిస్తుంది. ఆ పాత్రపోషణలో ఒకరకమైన మార్పు - వికిృయ ఉంటుంది. ఐనప్పటికి ఆ మార్పు - వికి్రయ 'అహంకార' దృష్ట్యానే కాని - ఆత్మస్వరూపదృష్ట్యా కాదు. 'ఇదంప్రత్యయములను' ఇది ఇది అని విషయాకారవృత్తులను ప్రకాశింపచేసినట్లే అహంకారమును

గూడ ప్రకాశింపచేస్తుంది. ఆ కారణం చేతనే ఆ పరమాత్మను 'సాక్షి' అంటారు. జాగ్రత్ స్వప్నావస్తలలో అహం ప్రత్యయమును ఇదం ప్రత్యయములనన్నింటినీ ప్రకాశింపజేస్తుంది కనుక. జాగ్రత్ స్వప్నముల మధ్య మరో అవస్థ ఉంటే దానిని గూడ పరమాత్మ ప్రకాశింప జేస్తుంది.

అహం అనగానేమనకి సామాన్యంగా స్ఫురించే అహంకారము కాదు - మనమిక్కడ చర్చిస్తున్న అహం అంటే, అహంకారము కాలబద్ధము - చారిత్రక పురుషుడు తాను పొం దిన అనుభవాలపై ఏర్పడిన చరిత్రకలవ్యక్తి. ఈ చరిత్ర - గతం - అంత ఆహ్లాదాన్నిచ్చేది కాదు - కనుక దాని గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంతమంచిది. ఇంకను ఆ చరిత్రలో నిల్వచేసుకొన్న అన్ని అనుభవాల్లోను నీకు బాధ కలిగించిన అనుభవాన్నే నీవు గుర్తుకు తెచ్చుకొంటూ ఉంటావు. ఆ ఆనందము నీ సహజ స్వరూపము, కనుక సంతోషకరమైన అనుభవాలను తరచుగా స్మరించవు. కానీ బాధ నీకు సహజము కాదు. అందుచేతనే బాధాకరమైన అనుభవాలనే నీవు స్మరిస్తూ ఉంటావు. మార్పుకు గురయే ఈ అహంకారము ఫిర్యాదుచేసే అసంతృప్తిని ప్రకటించేస్వభావం కలది. కానీ ఇక్కడ మనం మార్పుచెందని - ఎప్పుడూ ఒకేలా ఉండే - 'నేను' గురించి చర్చిస్తు న్నాను.ఈ అహమే - 'నేనే' బుద్ధికి సాక్షిగా - సకల అనుభవావస్థలను ప్రకాశింపజేస్తూ ఉంటుంది.

# ఏది బంధము?

ఇంతవరకు శాస్త్రము అనాత్మ, మాయ, అజ్ఞానము,పరమాత్మల గురించి చర్చించినది.కానీ శిష్యుడు 'ఈ బంధ మేమిటి' అని కూడ ప్రశ్నించాడు. ఇంతవరకు ఆ ప్రశ్నకు సమాధాన మీయబడలేదు. కనుక తరువాత శ్లోకములో శాస్త్రము బంధమునుగూర్చి వివరిస్తున్నది.

39 వ శ్లోకము

అత్రానాత్మన్యహమితి మతిర్బంధ ఏ షోస్య పుంసః
ప్రాప్తోజ్ఞానాజ్జనన మరణక్లేశ సంపాతహేతుః।
యేనైవాయం వపురిదమసత్ సత్యమిత్యాత్మబుద్ధ్యా
పుష్యత్యుక్షత్యవతి విషయై స్తంతుభిః కోశకృద్వత్ ॥ 139 ॥

అత్ర - ఈ సందర్భంలో; అనాత్మని అహమ్ ఇతి మతిః - అనాత్మయందు ఆత్మబుద్ధి కలిగి ఉండటమే; అస్య పుంసః - ఈపురుషునికి (జీవునికి); బంధః ఏషః - బంధ మిదే. అజ్ఞానాత్ ప్రాప్తః - అజ్ఞానమువలన ప్రాప్తించినది; జనన మరణ క్లేశ సంపాత హేతుః - జననమరణ క్లేశములలో పడిపోవటానికిదే కారణము. కోశ కృత్వత్ - పట్టు పురుగు ఏ విధంగా; తంతుభిః (తనకు తానే చిక్కుకునేట్లుగా) దారపుపోగులతో (గూడు అల్లుకుంటుందో); యేన ఏవ - ఆ అజ్ఞానము చేతనే; అయమ్; - (అదే విధంగా) జీవుడు; ఇదమ్ అసత్ వపుః - ఈ అసత్యమైన శరీరమును; సత్యమ్ ఇతి ఆత్మబుద్ధ్యా - సత్యమైన 'నేను'గా భావించి; విషయైః - శబ్దాది విషయములచేత పుష్యతి - పోషిస్తూంటాడు; ఉక్షతి - సుగంధములు పూస్తూంటాడు; అవతి - రక్షిస్తూంటాడు.

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

“ఈ సందర్భంలో అనాత్మయందు ఆత్మబుద్ధికలిగి ఉండటమే పురుషునికి బంధము. ఇది అజ్ఞానమువలన ప్రాప్తించింది. జననమరణక్లేశములలో పడిపోవటానికిదే కారణము. ఏవిధంగా పట్టుపురుగు పట్టుదారపుపోగులతో తనే చిక్కుకునే విధంగా గూడు అల్లుకుంటుందో, అదేవిధంగా జీవుడు, అజ్ఞానముచేత, ఈ శరీరమే నిజమైన నేనుగా బావించి దాన్ని పోషిస్తూంటాడు. సుగంధములు పూస్తుంటాడు, రక్షిస్తూ ఉంటాడు.”

‘ఈ బంధమేమిటి’ అన్నప్రశ్నకు సమాధానమిస్తూ గురువు బోధిస్తున్నారు - అనాత్మ యందు - నేను కానిదానియందు నేననే భావనయే బంధము ప్రతివ్యక్తి అత్ర అన్నపద మునకు “మన మీబోధచేస్తున్నప్పుడు” అని గాని - లేక ‘అనాత్మయందు’ అని గాని - అర్థం చెప్పకొనవచ్చును. కనుక నేను కాని దానిని నేననుకొనే వ్యక్తి బంధభావము ననుభవిస్తాడు.

సర్వము ఆత్మయే ఐనపుడు, అనాత్మయందు నేననే భావన అన్న ప్రశ్నకు తావెక్కడిది ? సర్వము ఆత్మయే అన్నది వాస్తవమే కాని, ఆత్మ సర్వమునుండి ముక్తమైనది, అతీతమైన ది. ఆ విధంగా దాన్ని గుర్తించాలి. అప్పడే ప్రతివస్తువు ఆత్మకాగలదు. ఆత్మకుకూడ దా ని స్వలక్షణములుంటే, అప్పడాత్మకూడ ఘటములాగ, ఒక వస్తువవుతుంది. సత్యము, జ్ఞానము, అనంతము అన్నవి కూడ ఆత్మకు గుణములు కావు, అవి ఆత్మస్వరూపమును

లక్షణావృత్తి (by implication) ద్వారా బోధించే పదములు, అవే వస్తువును బోధించి లయం చెందుతాయి.

ఆత్మ, అనాత్మలు రెండు సమ సత్తాకములు కాదు. అనాత్మపూర్తిగా ఆత్మమీద ఆధారపడిన మిథ్యారూపము. అనాత్మయైన స్థూలసూక్ష్మకారణ శరీరములందు నేను అన్న భావన భ్రమ - అన్ని సమస్యలకు కారణభూతమైన భ్రమ. అనాత్మ - కాలబద్ధము, పరిచ్ఛిన్నము, వివిధక్లేశములకు లోనౌతుంటుంది. ఈ సమస్యలన్నీ ఆత్మపై ఆరోపింపబడుతున్నాయి. అప్పుడు అనంతమైన నీవు పరిచ్ఛిన్నుడవుగా అవుతావు. ఆ తరువాత రకరకాలకర్మలు చేస్తూ తిరిగి అనంతుడవు కావాలని ప్రయత్నిస్తావు. కాని అదేమీ ఉపయోగించదు. నీవేంచేసినా అది పరిమితమై అది నిన్ను అనంతుణ్ణి చేయలేదు.

జన్మమరణములు మొదలుగా అనేకక్లేశములరూపంలోనున్న సంసారములోపడి కొట్టుకుపోతూ మునిగిపోతూండటానికి కారణము స్వస్వరూపవిభ్రాంతి రూపంలోనున్న ఈ బంధమే. జన్మించటము తల్లికి బిడ్డకు ఇద్దరికీ బాధాకరము. శైశవావస్థ గాయాల పుట్ట. మరణముకూడ భయానకమైనది - మరణించకూడదని కోరుకుంటాడు కానీ మరణించక తప్పదు. జన్మమరణములు క్లేశాన్ని కలిగిస్తాయి. కనుక బంధము. రెండింటిమధ్య కూడ క్లేశము. మిథ్యారూపమైన దేహాన్ని సత్యముగా భావించటమే క్లేశానికి కారణము. శరీరము అసత్ - మిథ్యా - ఎందుకంటే నీవు చూస్తుండగానే మారిపోతుంటుంది. తన స్వరూపాన్ని సాక్షిగా బ్రహ్మముగా ఎవరైతే గుర్తించరో అతడు శరీరాన్ని తానుగా భావిస్తాడు. శరీరము తానని భావించటమే కాకుండా దానిని పుష్టివంతం చేస్తుంటాడు. ఆరోగ్యంగా ఉంచటంకోసం వ్యాయామము, మర్దనం మొ॥ చేస్తూంటాడు. అంతేగాక

దాన్ని రక్షించటంకోసం తగుజాగ్రత్తలు తీసుకుంటాడు. అదినేను గనుక, ఈ శరీరంకొన సాగాలని కోరుకుంటాడు. కానీ, దాన్ని రక్షించటానికేమేమి చేసినా అది వయసు మీరి వృద్ధావస్థను పొందుతుంది. వయసుమీరకుండా ఆపలేడు, కాబట్టి దుఃఖాన్ని పొందుతాడు. మరియు, విషయ భోగముల ననుభవించటంద్వారా - ఈ దేహాన్ని ఆరోగ్యవంతంగా ఉంచవచ్చని భావిస్తాడు. కానీ తరచుగా నీవనుభవిస్తున్నానను కుంటున్న వస్తువే నిన్ను నాశనం చేస్తుంది. నీవు ఆహారమును భుజించి పెరిగినంతకాలము నీవు పెరుగుతావు. కానీ నీవు క్షీణించటం మొదలైన క్షణంనుండి నీవు తిన్న ఆహారమే నిన్ను తింటున్నట్లు అనిపిస్తుంది.

విషయములద్వారా శరీరాన్ని రక్షిస్తున్నాననుకొనే వ్యక్తి - పట్టుపురుగులాగా కోశకృత్ వత్ తనకైతాను గూళ్ళు అల్లుకుంటున్నాడు. పట్టుపురుగు రక్షణకై తనచుట్టూ గూడు అల్లుకొంటుంది. కాని ఆ గూడే దాని మరణానికి కారణమవుతుంది. తరతరాలుగ ఆ పట్టుపురుగులదేపనిని చేస్తుంటాయి, వాటికి వివేకం లేదు గనుక. మానవులు, వివేకజ్ఞానమున్నప్పటికీ, అదే పనిచేస్తుంటారు. రక్షణకోసం విషయాలనే వలయాన్నల్లుకుంటారు. జన్మమరణముల వలయంలో చిక్కుకుంటారు. అనాత్మయందు ఆత్మబుద్ధి - నేననే భావనే బంధము - నిజానికి వేరే బంధమేదీలేదు.

ఇంతకుముందు ఈ బంధమెలావచ్చిందనే ప్రశ్న అడగబడ్డది. ఈ శ్లోకంలో దానికి సమాధానమీయబడ్డది.

# బంధమెలా ఏర్పడినది ?

40వ శ్లోకము

అఖండ నిత్యాద్వయ బోధ శక్త్యా

స్ఫురంతమాత్మానమనంత వైభవమ్ ।

సమావృణోత్యావృతి శక్తి రేషా

తమోమయీ రాహురివార్క బింబమ్ ॥ 141 ॥

ఏషా తమోమయీ - ఈ తమోమయమైన; ఆవృతి శక్తిః - (మాయ యొక్క) ఆవరణ శక్తి; అఖండ నిత్య అద్వయ బోధ శక్త్యా - అఖండము, నిత్యము అద్వయమైన చైతన్య శక్తితో; స్ఫురంతం - ప్రకాశించుచున్న; అనంతవైభవమ్ - అనంతము సర్వవ్యాపకము ఐన; ఆత్మానమ్ - ఆత్మను; రాహుః అర్క బింబమ్ ఇవ - రాహువు సూర్య బింబమును వలె; సమావృణోతి - కప్పుచున్నది.

"తమోమయమైన మాయయొక్క ఆవరణశక్తి అఖండము నిత్యము అద్వయ స్వరూప చైతన్యశక్తితో ప్రకాశిస్తున్న అనంతము వ్యాపకము ఐన ఆత్మను, సూర్య బింబమును రాహువు వలె, కప్పుచున్నది."

మాయ అనిర్వచనీయమని - సత్‌గా కాని అసత్తని గాని ఖచ్చితంగా నిర్వచింపలేనిదని చెప్పబడింది. ఈ మాయకు రెండు రకముల శక్తులున్నవి - ఆవరణశక్తి ఆచ్ఛాదించే శక్తి - విక్షేపశక్తి- సృష్టించేశక్తి. కార్యరూపముగా వ్యక్తమైనపుడు ఈ రెండుశక్తులు అనుమానముద్వారా తెలియబడుతున్నాయి. మాయ ఆద్యంతము మిథ్యారూపమే.

ఎందుకంటే అది ఉన్నది 'సత్' కాదు, లేనిది 'అసత్' కాదు. సృష్టిలో ప్రతిదీ అలాగే ఉంటుంది. ఉదాహరణంగా ఘటము తీసుకొనండి. అదిలేదని చెప్పలేవు. (మృత్తికను విడిచి) స్వతంత్రంగా ఉందని చెప్పలేవు మధ్యేమార్గంగా ఉన్నది. ఉపయోగించుకొనటానికి పనికి వస్తుంది. అదేవిధంగా మాయకు ఏదో అస్తిత్వమున్నది. ఈశ్వరదృష్ట్యా మాయా పదం వాడబడ్డది. జీవదృష్ట్యా అవిద్యా ఆ రెంటికి మధ్యనున్న ఒకే ఒక భేదము - మాయ యొక్క ఆవరణశక్తి ఈశ్వరుణ్ణి కప్పివేయలేదు - అతడు సర్వజ్ఞుడు కాబట్టి. ఈశ్వరునికి ఒక్క విక్షేపశక్తి మాత్రమే పనిచేస్తుంది. దానినతడు అదుపులో ఉంచి నడుపుతుంటాడు కనుక. కానీ జీవుడు ఈ రెండు శక్తులవశంలో ఉంటాడు.

ఆత్మ అఖండము. ఏవిధంగాను భాగింపబడదు, ఖండింపబడదు. ఆత్మ నిత్యము ఆద్యంతములు లేనివాడు. ఇంకను ఆత్మ అద్వయము - తనకంటె వేరుగా రెండవవస్తువు లేనివాడు. ఈ బోధ, ఎఱుక, జ్ఞప్తి స్వరూపము, అద్వయము, అఖండము, అవికారి స్వరూపము ఆత్మయొక్క శక్తి అనబడుతున్నది. ఇక్కడ మనం చక్కగ అర్థం చేసుకోవాలి. బోధశక్తి నిజంగా శక్తికాదు శక్తి లాంటిది, శక్తి 'వలె'. ఆత్మ తనకు తానుగా ప్రకాశిస్తుంది. అంతేకాక ఆత్మ అనంత వైభవముకలది. విభు అండే సర్వవ్యాపకము. అనంతమైనది - సర్వవ్యాపకమైనది ఒకటే ఒకటి ఉన్నది. అదే ఆత్మ. ఆకాశముకూడ సర్వవ్యాపకమని చెప్తారు. కానీ అది సాపేక్షికసర్వవ్యాపకము - ఆత్మ నది వ్యాపించదు కనుక, ఐనా ఆత్మ ఆకాశమును కూడ వ్యాపిస్తుంది. కనుక ఆత్మ అనంతము - పరిపూర్ణవ్యాపకము అనంతపదమిక్కడ ఆకాశదృష్ట్యామాత్రమే, కాలతః అనంతత్వము 'నిత్య' పదము ద్వారా సూచింపబడినది కనుక.

మరి ఆత్మ చిద్రూపముగా, ఎఱుకగా ప్రకాశిస్తున్నది. కాలమునకు లోనుగానందున జనన మరణములాత్మకులేవు. అది అద్వయము, పరిపూర్ణంగా సర్వవ్యాపకము. ఈ ఆత్మ ఆవృతిశక్తిచేత- మాయయొక్క ఆవరణశక్తి చేత కప్పబడి ఉన్నాడు. ఆవృత్తిశక్తి ఆత్మను కప్పివేస్తుంది అన్న విషయం లోకంలోను సుప్రసిద్ధము. "అనంతము ఆనందస్వ రూపము అయిన పరబ్రహ్మ నీకు తెలుసా అని అగిగినప్పడు" - దానిని గురించి తన కేమీ తెలియదని - ప్రతివారూ చెప్తారు. మానవుడలాచెపితే అది ఆత్మఅజ్ఞానము, ఆత్మ అంటే ఏమిటో స్పష్టముగా తెలియదు గనుక. అదే ఆచ్ఛాదనము.

ఆత్మను కప్పివేసే ఆవృతిశక్తి తమస్సును - అజ్ఞానమును ప్రధానంగా కలిగి ఉంటుంది. దానివలననే అఖండాత్మ కండితమైన దానివలె దృక్‌దృశ్యంగా జ్ఞాతృజ్ఞేయముగా విభజిం పబడిన దానివలె అవుతుంది. ప్రతి ఒక్కరు తనని తాను పరిచ్ఛిన్నమైన వానినిగా, ఒక వ్యక్తిగా ఇతరములన్నిటికంటె భిన్నముగా భావిస్తారు. ఈ ఆవరణశక్తివలన - 'నేను మర్త్యుడన' నే నిర్ణయానికొస్తాడు. అందుచేత నిత్యఆత్మ అనిత్యమైనదానివలె అవుతుంది. అద్వయాత్మ సద్వయమువలె అవుతుంది. సజాతీయ, విజాతీయ, స్వగత భేదములు ద్వైతభావములన్నీ - ఈ ఆవరణశక్తివలన అత్యంతసత్యములవలె గోచరిస్తాయి.

గ్రహణసమయంలో సూర్యబింబము నేవిధంగా రాహువు కప్పివేస్తాడో - అదేవిధంగా - ఆవరణశక్తి- ఆత్మను కప్పివేస్తుంది. రాహుకేతువులు జ్యోతిశ్శాస్త్రములో మాత్రమే ఉపక రించే ఛాయాగ్రహములు. వేదాంతశాస్త్రము కూడ కొన్ని విషయములను వివరించుట కు వాటిని ఉపయోగించుకుంటుంది. సూర్యగ్రహము వాస్తవంగా రాహువుచే ఆచ్ఛాదిం పబడలేదు. ఆచ్ఛాదింపబడినట్లుగా మాత్రమే. మరియు సూర్యుడు పూర్తిగా కూడ

ఆచ్ఛాదింపబడలేదు. ఛాయచేత సూర్యుడు కప్పబడటం చూస్తావు. అది కూడ సూర్యునిద్వారా ప్రకాశింపబడుతుంది. మేఘములు సూర్యుని కప్పివేసినవనుకుందాం. సూర్యుడు మేఘములచే కప్పబడటం చూస్తావు. మేఘములను కూడ చూస్తావు. సూర్యుణ్ణి కప్పివేసే మేఘములను నిజానికి సూర్యప్రకాశముచేతనే చూడగలవు. అదేవి ధంగా - ఆత్మవిచారణ చేస్తున్న వ్యక్తికి - ఆత్మ తిరోభూతమైనట్టుగా ఆచ్ఛాదింపబడినట్లు గా - ఉంటుంది. ఆ ఆచ్ఛాదన ఆవరణశక్తివలన ఏర్పడినది.

ఈ ఆవరణ మాత్రమైతే సమస్య కాదు. సుషుప్తిలో ఆవరణ ఉన్నది. కానీ నీకే సమస్య లేదు. ఇంకను నీవు ఆనందంగా ఉన్న సమయాల్లో కూడ ఆవరణ ఉన్నది - 'నేనానంద స్వరూపుడనని' నీవు గుర్తించలేదు కనుక, అందుచేత ఆవరణ తనవరకు ఎటువంటి సమస్యను కలిగించదు. సమస్యను కలిగించే దేమంటే - విక్షేపము.

ఆవరణమును వస్తుఅగ్రహణము - వస్తువుని గుర్తించకపోవటమని అంటారు - అంత వరకది సమస్యకాదు. కానీ జాగ్రత్ స్వప్నములురెంటిలోనూ అగ్రహమే కాకుండా అన్యథా గ్రహణము - ఆత్మ గురించిన భ్రమజ్ఞాన ముంటుంది. అదే సమస్య. అగ్రహణమునకు అన్యధాగ్రహమునకు - అంటే భ్రమకు కారణకార్యసంబంధమున్నది. ఐనప్పటికి భ్రమపడ టానికి గుర్తించని వస్తువంటూ ఒకటి సిద్ధమై ఉండాలి. ఒక వస్తువంటూ తెలియక పోతే విపరీతజ్ఞానమునకు - భ్రమకు అవకాశములేదు. లోకంలో నీకు తెలియని వస్తు వులు చాలఉన్నవి. వాటినిగురించి నీవు భ్రమపడవు. ఎందుకంటే 'ఏదో ఉన్నది' అనే సామాన్యజ్ఞానం వాటినిగురించి నీకు లేదుకనుక. కాబట్టి భ్రమపడటానికి భ్రమపడేవ స్తువు నీకు సిద్ధమై ఉండాలి - అంటే అది నీ జ్ఞాన పరిధిలో ఉండాలి. అదేసమయం

లోఅదేమిటో యథాతథంగా నీకు తెలియకూడదు. అజ్ఞానవస్తువు, అసిద్ధవస్తువు (not evident) తన గురించిన భ్రమను కలిగించదు. ఒక వస్తువు సిద్ధమై ఉంటూ, తెలిసిన వస్తువు అయితే- దాని గురించి కూడ నీవు భ్రమపడవు. మరియు, విషయములు రెండువిధములుగాతెలియబడతాయి. ఒకటి ప్రమాణముద్వారా - మరొకటి ప్రమాణము లేకుండగనే. సృష్టిలో ఒకే ఒక వస్తువున్నది. ప్రమాణము లేకనే సిద్ధమైనది - అది ఆత్మ - నీవే - కర్త; ఆత్మ స్వతఃసిద్ధముకనుక.

ప్రమాణముద్వారా పొందిన జ్ఞానము యథార్థము - వస్తువు ఎలాగ ఉంటె అలాగ కావచ్చును లేదా ఆ యథార్థము - ఉన్నవస్తువుకి విరుద్ధము కావచ్చును. యథార్థజ్ఞాన మునే జ్ఞానమంటారు. వస్తువును గుర్తించినపుడు, కానీ యథాతథంగా కానప్పడు విరుద్ధజ్ఞానము - భ్రమజ్ఞాన మేర్పడుతుంది. అటువంటప్పడు నీ ఇంద్రియ ప్రత్యక్షంలోను, అనుమానములోను దోషమున్నది. అందువలన అన్ని విభ్రాంతులు (Confusions) ప్రమాణమును ప్రయోగించటంలోనే ఉన్నవి.

స్వతఃసిద్ధము స్వయం ప్రకాశమైన ఆత్మ సులభంగా భ్రమపడటాని కవకాశమిస్తుంది. నీవాత్మను ఏ విధంగా నైనా భావించవచ్చు - “నేనుమర్త్యుడను” “అపూర్ణుడను” మొద లుగా అటువంటి నిర్ణయములు ఆవరణమూలంగానే. విచారణ లేకపోవటంవల్లనే అవి ఏర్పడినవి.

లోకంలో సాధారణంగా ప్రతివారు తమ జ్ఞానమును ప్రశ్నించుకుంటారు. తమకు తెలి సినది నిజమో కాదో కనుక్కోవాలని కోరుకుంటారు. సూర్యుడు తూర్పున ఉదయిస్తా

డన్న విషయం ప్రత్యక్షప్రమాణసిద్ధము. మరో ప్రత్యక్షజ్ఞానముకూడ ఉన్నది. ఉత్తరధృవ మువద్ద వేసవిలో సూర్యుడు ఉదయించడు. కేవలం అక్కడే వలయాకారంగా తిరుగు తుంటాడు. ఈ రెండుప్రత్యక్షజ్ఞానములు ఒకదానికొకటి భిన్నమైనా, రెంటూ ఒకే విషయ మునకు సంబంధించినవి. ఈ రెంటిని సమన్వయం చేయటానికి మనం విచారణ చేస్తాము. అప్పడు సూర్యుడు ఉదయించడు, అస్తమించడు, సూర్యునిచుట్టూ భూమి తిరుగుతున్నదనీ - అందువలననే సూర్యుడు ఉదయించి నట్టుగా అస్తమించినట్లుగా - గోచరిస్తాడనీ తెలుసుకుంటాము. కాబట్టి ప్రతివిషయాన్ని, ప్రమాణసిద్ధమైనదాన్ని కూడ నీవు ప్రశ్నిస్తావు, సందేహిస్తావు. ఎందుకంటే ఇంతకు ముందు నీవు భ్రమపడ్డావు కనుక. అందువలననే ఫిజిక్స్, ఇతర విజ్ఞానశాస్త్రములలో ఎప్పటికి పరిశోధన సాగుతూనే ఉం టుంది. న్యూటన్ద్వారా ఏదైతే చెప్పబడ్డదో - అది తరువాత భౌతికశాస్త్రజ్ఞులద్వారా ఖం డింపబడినది. న్యూటన్ఫిజిక్స్ ఇప్పడు ప్రాచీనఫిజిక్స్ అయినది. కనుక ప్రమాణసిద్ధవిష యమేదైనా ఇంకా విచారణ చేయటానికవకాశమున్నదే. ఇవి శాస్త్రపరిశోధనారంగంలో సాగే తీరుతెన్నులు. ప్రమాణసిద్ధమేదైనా భ్రమపడటానికాస్కారమున్నది. కనుక వాస్తవిక దృష్టితో దానిని తరచిచూడాలి. ఫలితంగా క్రొత్తనిర్ణయాలను పూర్ణనిర్ణయాల స్థానంలో కి తీసుకురావాలి.

ఆత్మ స్వతఃసిద్ధమని తెలుసుకోవాటాని కెక్కువసమయం పట్టదు. ఏ విచారణ చేయాలన్నా ప్రమాతచేత ఉపయోగింపబడటానికి నీ కొక ప్రమాణముడాలి. కనుక ప్రమాణాన్ని ఉపయోగించే ముందుగానే ప్రమాత ఉండాలి. కాబట్టి ప్రమాతయొక్క అస్తి త్వము స్వతఃవేద్యము.

ఇంకను, ఒక వస్తువుయొక్క అస్తిత్వాన్నీ నిరూపించే భావముకూడ జ్ఞానమే. స్వామీజీ నీ మందు కూర్చొని ఉన్నారన్న విషయం నీకు తెలుసు. ఎలా తెలుసు ? ఏ ప్రమాణాన్ని నీవు ఉప యోగిస్తావు? నీ చక్షురింద్రియదృష్టిని, దానికి అది గుర్తింపు జ్ఞానము. ఇంద్రి యప్రత్యక్షము ద్వారా - అనుమానము ద్వారా జ్ఞానము కలుగుతుంది. ఘటజ్ఞానము పటజ్ఞానము మొ॥ వన్నీ జ్ఞానములు. వీటన్నిటిలో సాధారణంగా ఉన్నది నిర్విశేషజ్ఞానము. అది అన్ని కాలముల్లోనూ ఉన్నది. అది నీవు దేన్ని తెలుసుకుంటున్నావో దానిచేత విశిష్ట మవుతుంది. ఘటజ్ఞానములో జ్ఞానము ఘటముచేత విశిష్టమవుతున్నది. పటజ్ఞానము లో పటముచేత విశిష్టమవుతున్నది. మిగిలిన విషయజ్ఞానములలో నిర్విశేషజ్ఞానము ఆయా విషయములచేత విశిష్టమవుతున్నది. సాధారణ (Common) జ్ఞానము సత్యజ్ఞాన ము మార్పుచెందనిది. ఈ సాధారణజ్ఞానము, మారని జ్ఞానమున్నదో లేదో తెలుసుకొనట ానికి నీకు ప్రమాణమక్కరలేదు. ఎందుకంటే నిరూపించే ప్రతిప్రమాణములోను ఈ మారని సాధారణజ్ఞానము చైతన్యము - ఎఱుక ఉన్నది. కాబట్టి చైతన్యము - జ్ఞప్తిస్వరూ పముయొక్క అస్తిత్వమొక్కటే ప్రమాణం అవపరము లేనిది. స్వయం ప్రకాశము - స్వతఃవేద్యము(Self- evident) కాబట్టి - ఆత్మ తెలిసినట్లుగా ఒప్పేసుకోబడుతుంది. ఆత్మను తప్పగా అర్థం చేసుకున్నామని ఎవరూ భావించరు.

జ్ఞానసాధనలో వస్తువుని అర్థము చేసుకోవటానికి ప్రయత్నిస్తావు. కానీ భ్రమను తొల గించటానికి ప్రయత్నించవు. ఎందుకంటే అదిభ్రమ జ్ఞానమని నీకు నిజంగా తెలియదు. తాడుని సర్పంగా భ్రమించినపుడు, తన దృష్టినే ప్రశ్నించుకొని తిరిగి చక్కగా చూడాలి. అలాగే ఇక్కడ కూడ, ఆత్మగురించి నేనేమనుకుంటున్నానో అది తప్పకావచ్చు. అది తప్ప

నిర్ణయము - భ్రమకావచ్చని తెలుపుటకు తగినన్ని కారణములున్నవి. అందువలన ఇక్కడ విచారము నేను - -'ఆత్మ' యొక్క నిజస్వరూపమేమిటని.

ప్రమాణసిద్ధవిషయముగురించి నీవు భ్రమపడితే నీవు పునః పరిశీలించవచ్చు. అదెలాగంటే తాడుని సర్పంగా భ్రమించినపుడు నీ చేతిలోనున్న టార్చ్‌లైట్ వేసి మరల దానిని చూడవచ్చు. కానీ ఆత్మ విషయంలో తిరిగి చూడటానికవకాశము లేదు. ఎందుకంటే ఎవరైతే చూస్తున్నారో అతడినే చూడాలి. ప్రమాతకు లభ్యమయే ప్రత్యక్షాదిప్రమాణములే మాత్రము ఉపకరించవు. అవి ప్రమాతకంటె భిన్నమైన వస్తువుల్ని తెలుసుకోవటానికి సాధనములు, అందుచేత ఆత్మను తెలుసుకోవటానికి నీకు బాహ్యంనుండి ప్రమాణము కావాలి. ఆ ప్రమాణము శబ్దప్రమాణము; అది ఆత్మ అజ్ఞానమును పటాపంచలుచేస్తూ ఆత్మ స్వరూపమును తెలుపుతుంది.

శాస్త్రము మాయనుగూర్చి చెప్పినపుడు - ఆవరణశక్తి ఒకటి ఉన్నదని నిరూపించే ఉద్దేశ్యముతో కాదు - కానీ ఈ బంధమెలావచ్చిందన్న ప్రశ్నకు వివరణ ఇవ్వటంకోసం మాత్రమే. ప్రశ్నకు సమాధానం మాత్రమే. అదొక బోధనాప్రక్రియ. ప్రక్రియ అన్నది అన్ని శంకలకు - అన్ని ప్రశ్నలకు వివరణ ఇవ్వగలగాలి. లేకపోతే అది సమగ్రమైనదికాదు. ఈ ఆవృతిశక్తి నీకు ఆత్మ యథాతథంగా తెలియకపోవటానికి కారణం చెప్తుంది. కనుక బంధము క్రొత్తగా వచ్చిందికాదు. అది ఉన్నదే. ఆవృతిశక్తి దానికి కారణమవుతున్నది.

ప్రమాణసిద్ధవిషయమైతే - అంటే ప్రత్యక్షాదులవలె నీకున్న ప్రమాణముల పరిధిలోని విష యమైతే అప్పుడు ప్రశ్నించి పరిశోధన సాగించవచ్చు. కానీ ఆత్మ ప్రమాణసిద్ధ విషయ ముకాదు. కావున 'ఆత్మ ఎవరని ప్రశ్నించినంత మాత్రమున నీవు ముందుకి సాగలేవు.

ఆత్మ గురువని - అదే నీకు బోధిస్తుందని - కొంతమంది చెప్తుంటారు. అది కూడ ఒక విపరీతమే. ఆత్మ అంతటా ఎప్పుడూ ఉన్నది. ఐనా అది నీకేమీ బోధించలేదు. మరి ప్పుడెలా బోధించ బోతున్నది ? ఇదొక సమస్య. గురువును, గురుబోధను అడ్డుకొనేది. అది ఎందువలనంటే అహంకారానికి విశ్వసించలేకపోవటమనే సమస్య ఉన్నది.

అవిద్య ఉన్నదా లేదా అనేదికాదు ప్రమాణం తెలిపేది. వస్తువు (తత్త్వము) ఏది అనేది తెలిపేందుకే ప్రమాణము నిర్దేశింపబడినదికాని మరో ప్రయోజనంకోసంకాదు.

41వ శ్లోకము

తిరోభూతే స్వాత్మన్యమలతరతేజోవతి పుమాన్
అనాత్మానం మోహాదహమితి శరీరం కలయతి ।
తతః కామక్రోధ ప్రభృతిభిరముం బంధనగుణైః
పరం విక్షేపాఖ్యా రజస ఉరుశక్తిర్వ్యథయతి ॥ 142 ॥

అమలతర తేజోవతి - అమలము శుద్ధ చైతన్య స్వరూపమయిన; స్వాత్మని తిరోభూతే - ఆత్మ తిరోభూతమైనపుడు; పుమాన్ - జీవుడు వ్యక్తి; మోహాత్ - మోహము చేత; అనా త్మానంశరీరం - అనాత్మయైన శరీరమును; అహం ఇతి కలయతి - 'నేను' గా భావి

స్తాడు; తతః విక్షేపాఖ్యా - అప్పడు విక్షేపమనబడే; రజసః ఉరుశక్తిః - రజో గుణము యొక్క గొప్పశక్తి; కామక్రోధ ప్రబృతిభి - కామ క్రోధాదులతో; బంధన గుణై బంధించే గుణములతో; అముం - ఇతడిని (జీవుని) పరం వ్యధయతి - మిక్కిలి బాధిస్తుంది.

"అమలము శుద్ధచైతన్యస్వరూపమైన ఆత్మ తిరోభూతమైనపుడు వ్యక్తి అనాత్మను - శరీరమును- ఆత్మగా భావిస్తాడు. అప్పడు విక్షేపమనమడే రజస్సుయొక్క గొప్పశక్తి గొప్ప కామము, క్రోధము మొ॥ బంధనగుణములచే ఇతడిని మిక్కిలి బాధిస్తుంది."

ఆత్మా అమలతరబోధస్వరూపః మలరహిత జ్ఞానస్వరూపమే. చైతన్యస్వరూపమే. ఆత్మలో ఆవరణములేదు. బంధములేదు. అటువంటి ఆత్మ తిరోభూతమవుతున్నది. ఆవరణశక్తిచే ఆచ్ఛాదింపబడుతున్నది. తిరోభూతమంటే యథాతథంగా తెలియదు. కానీ భ్రమపడటానికి తగినంతగా మాత్రం తెలుసు. ఆత్మ తన స్వరూపంలో దేనిని పోగొట్టుకోదు. కానీ, నీ దృష్టిలో - అది ఆచ్ఛాదింపబడింది. ఏ విధంగా మేఘము సూర్యుడిని ఆచ్ఛాదించక, నీదృష్టిని మాత్రమే కప్పతుందో - అదేవిధంగా ఆవరణశక్తి - ఆత్మను ఆచ్ఛాదించక నీ దృష్టిని మాత్రం కప్పివేస్తుంది.

అజ్ఞానముచేత వ్యక్తి అనాత్మయైన శరీరమును ఆత్మగా గ్రహిస్తాడు. ఇక్కడ శరీరమంటే స్థూలశరీరము మాత్రమేకాక సూక్ష్మకారణశరీరములు కూడ. శరీరమునెందులకు ఆత్మగా తానుగా భ్రమిస్తాడు ? మోహముచేత, వివేకశక్తిలేక పోవటంవలన, విక్షేపశక్తి

చేత - అజ్ఞానముయొక్క సృజనాత్మక శక్తివలన. అజ్ఞానమునకు ఒకవైపు ఆవరణశక్తి - మరోవైపు విక్షేపశక్తి పనిచేస్తుంటాయి. విక్షేపశక్తి ఆత్మ గురించిన భ్రమజ్ఞానమును సృష్టి స్తుంది. ఆత్మ స్వతఃవేద్యము స్వయంప్రకాశము కనుక - 'నేను ఇది' అని నిర్ణయానికి రావాలి. యథాతథంగా ఆత్మను గ్రహించాలి - లేదా - ఆత్మ కానిదానిని ఆత్మగా గ్రహిం చాలి. ఇక్కడ ఆవరణశక్తి వలన ఆత్మ ఉన్నదిఉన్నట్లుగా తెలియదు. విక్షేపశక్తి మూలంగా శరీరమును ఆత్మగా గ్రహిస్తాడు.

తదనంతరం విక్షేపశక్తి ఇంకా ఏం చేస్తుంది ? వ్యధను కలిగిస్తుంది. విక్షేపశక్తి రజస్సు నుండి జనిస్తుంది. భయాన్ని కలిగించి మానవుడు దుఃఖపడేట్లు చేస్తుంది. విక్షేపకశక్తి ఏ విధంగా మానవుని బాధ పెడుతుంది ? కొంత ఇక్కడ చెప్పబడినది. కామము, క్రోధ ము మొ॥ వాటి ద్వారా బాధిస్తుంది. మొదట కామక్రోధములచే బాధిస్తుంది. తరువాత లోభ, మోహ మొ॥ వాటి ద్వారా బాధిస్తుంది. ఒకసారి అనాత్మను ఆత్మగా తీసుకుంటే, ఇక బంధనములచే బద్ధుడవుతాడు. కామక్రోధములే బంధనములు. అవి మానవునిచే రకరకాల పనులు చేయిస్తవి. ధర్మవిరుద్ధంగా ప్రవర్తించేట్లు కూడ చేస్తాయి. నీకొక కో రికుంటే అవి తీర్చుకోవటం ధర్మంకంటె ప్రధానమవుతుంది. నీకు ధర్మమేదో తెలిసినప్పటి కి దాన్ననుసరించవు. ఈ కోరికమూలంగా కామంతో చేసేపనులు పుణ్యాన్నిగాని పా పాన్నిగాని కలిగిస్తాయి. కానీ క్రోధంతో చేసే పనులు పాపాన్నే కలిగిస్తాయి. కాబట్టి కామ క్రోధములు బందనములు. బంధనమంటే గ్రంథి అన్న అర్థం కూడ ఉన్నది. మానవుడు మనస్సుయొక్క బంధించే గుణములైన కామక్రోధాదులవలన బంధించబడతాడు.

అజ్ఞానమున కీ రెండు శక్తులున్నవి. అవి వాటి వాటి కార్యములద్వారా ఏదో సాధిం

చాలి, ఏదోగా అవాలి, అనే జీవితాన్నిస్తాయి. వాస్తవంగా సమస్యలేదని వివరించేందుకే అవి వర్ణించబడ్డాయి. నీవు ముక్తుడవయే ఉన్నాము కనుక - మరి నీవే తెలుసుకోవాలి - నీవు ముక్తుడవేనని. అదే సంపూర్ణశాస్త్రము (తాత్పర్యము).

42వ శ్లోకము

ఏతాభ్యామేవ శక్తిభ్యాం బంధః పుంసః సమాగతః ।

యాభ్యాం విమోహితో దేహం మత్వాత్మానం భ్రమత్యయమ్ ॥ 146 ॥

ఏతాభ్యామేవ శక్తిబ్యాం - ఈ రెండు శక్తుల వలననే; పుంసః - మానవునికి; బంధః సమాగతః - బంధమేర్పడినది; యభ్యాం విమోహితః - (వేటి చేతనైతే) వాటిచేతనే మోహితుడై; దేహం ఆత్మానం మత్వా - దేహమును ఆత్మగా (తానుగా) బావించి అయం పురుషుడు - జీవుడు; భ్రమతి - భ్రమిస్తున్నాడు.

"ఈ రెండుశక్తులవలననే మానవునికి బంధం ఏర్పడినది. వాటిచేతనే పురుషుడు మోహితుడై శరీరమును ఆత్మగాభావించి భ్రమిస్తున్నాడు."

ఇంతకు ముందు వివరించినట్లుగా అవిద్యకు రెండురకాల శక్తులున్నవి. ఆచ్ఛాదనశక్తి మరియు సృజనశక్తి. మానవుడికి ఈ రెండు శక్తులవలననే బంధమేర్పడినది. ఈరెండ ంశక్తులచేత మోహితుడై జీవుడు మరణించిన తరువాత ఒక లోకాన్నుండి మరో లోకానికి, తిరుగుతూ ఉంటాడు. ఈ జన్మలో కూడ ఆత్మ తృప్తి కొరకు, ఆత్మ సిద్ధికొరకు తిరుగుతూ ఉంటాడు.

మానవుడు స్వరూపతః పూర్ణుడు. అందుచేతనే అంతకన్న తక్కువైతే స్వీకరించలేడు. ఈ స్థూలశరీరములో నుండగానే - అప్పుడప్పుడతడికి తన స్వరూపమే ఐన పూర్ణత్వ - అనుభవం కలుగుతుంటుంది. నక్షత్రాల్ని చూస్తూండగా, అతడు పూర్ణుడు. సంగీతాన్ని వింటూ ఆనందాన్ననుభవిస్తాడు. ఈ ఆనందపుక్షణాలలో పూర్ణత - అనుభవమతడికుం టుంది. ఈ ఆనందపు క్షణాలతోనే సంసారము నీతో పరిహాసమాడుకుంటుంది. ఒక సారి పూర్ణత్వాన్ననుభవించిన తరువాత - ఇక దానికన్న తక్కువదానితో రాజీపడలేవు. అందువలననే నీవు ఈ పూర్ణత్వం కొరకు - ఈ సిద్ధికై సదా అన్వేషిస్తుంటావు. అదే కారణము జన్మజన్మలలో లోకలోకాలలో తిరుగులాడటానికి.

ఈ రెండు శక్తుల మూలంగానే శరీరము ఆత్మగా బావించబడుతున్నది. అప్పుడు ఆత్మ అనేకఅంశములలో కొంతలున్న శరీరమెంతో అంతవరకే పరిమితమవుతున్నది. శీర్యమా ణస్వభావత్వాత్ శరీరమ్ - శిథిలమయే స్వభావం కలిదికావున అది శరీరమనబడుతుం ది. దహనయోగ్యము కాబట్టి దేహమని కూడ పిలువబడుతుంది. మరణించిన శరీరా నికి రెండురకాలుగా ఉత్తరకర్మలు జరుపవచ్చు - ఒకటి భూమిలో ఖననంచేసి శిథిలమై పోనివ్వటం, రెండవది దహనంచేయటం. కొన్ని సంప్రదాయాలలో దహనంచేస్తారు, మరికొందరు ఖననం చేస్తారు. ఈ దేహము నాత్మగా భావించి మానవుడు సంసారార ణ్యంలో తిరుగుతూఉంటాడు. దేహంలోనే కొనసాగుతుంటాడు.

ఇక, తరువాతి శ్లోకములో ఈ బంధము ఎలా సుస్థిరమై కొనసాగుతుందన్న శిష్యుని ప్రశ్నకు సమాధానమీయబడుతున్నది. అందుకొక దృష్టాంత మీయబడినది. సంసార

ము వృక్షముతో పోల్చబడినది. వృక్షమేవిధంగా తనకు తాను సాగిపోతుంటుందో అదేవి ధంగా సంసారము కూడ సాగిపోతుంటుంది కఠోపనిషత్తు, భగవద్గీతలో కూడ ఈ సం సారమువృక్షముతో పోల్చబడ్డది. తరువాత శ్లోకంలో ఈ సంసారవృక్షము వర్ణించబడు తున్నది.

# బంధమెలా కొనసాగుతుంది ?

43వ శ్లోకము

బీజం సంసృతి భూమిజస్య తు తమో దేహాత్మధీరంకురః

రాగః పల్లవమమ్బు కర్మ తు వపుః స్కంధోసవః శాఖికాః ।

అగ్రాణీంద్రియసంహతిశ్చ విషయాః పుష్పాణి దుఃఖం ఫలం

నానాకర్మసముద్భవం బహువిధం భోక్తాత్రజీవః ఖగః ॥ 147 ॥

సంసృతి - ఈ సంసార; భూమిజన్య - వృక్షమునకు; తమః బీజం - అజ్ఞానము బీజము; దేహాత్మధీః - దేహాత్మ బుద్ధి; అంకురః - అంకురము; రాగః పల్లవమ్ - కోరికలే ఆకులు; కర్మ అమ్బు - కర్మలు నీరు; వపుః స్కంధః - శరీరము కాండము; శాఖికాః అసవః - ప్రాణములే కొమ్మలు; చ ఇంద్రియ సంహతిః - మరియుజ్ఞాన కర్మేంద్రియ సముదాయమే; అగ్రాణి - రెమ్మలు; విషయాః పుష్పాణి - విషయములే పుష్పములు; నానా కర్మ సముద్భవం - నానా కర్మలనుండి కలిగిన; బహువిధం దుఃఖం ఫలం - రకరకాలైన దుఃఖములే ఫలం; అత్ర - ఇక్కడ; భోక్తా జీవః ఖగః - భోగములననుభవించే జీవుడే పక్షి

"ఈ సంసారవృక్షమునకు అజ్ఞానము బీజము; దేహాత్మబుద్ధి అంకురము; కోరికలు ఆకులు; కర్మలు నీరు; దేహము కాండము; ప్రాణములు శాఖలు; కర్మేంద్రియజ్ఞానేంద్రియసముదాయము రెమ్మలు. ఇంద్రియవిషయములు పుష్పములు; నానారకములకర్మలనుండి కలిగిన రకరకములైన దుఃఖములే ఫలములు; జీవుడే ఇక్కడ ఫలములననుభవించు పక్షి"

సంస్కృతి అంటే సంసారము. భూమిజ - భూమినుండి ఉత్పన్నమైనది. వృక్షము. సంస్కృతిభూమిజ అంటే సంసారవృక్షము.

వృక్షము బీజమునుండి రావాలి. మరి సంసారమునకు బీజమేది ? తమస్సు - అజ్ఞానము మాత్రమే ఈ సంసారమునకు బీజము. ఆత్మను తెలుసుకుంటే సంసారము లేదు. ఆత్మస్వరూపము - తనస్వరూపము తెలియని వానికే సంసారము, కాబట్టి అజ్ఞానము ఈ సంసారమునకు బీజము. కానీ బీజములో నీవు వృక్షమును చూడవు. వృక్షము బీజములో అవ్యక్తావస్థలో ఉన్నది. బీజముయొక్క వ్యక్తరూపము అంకురము, ఈ సంసారవృక్షమునకు "దేహమే నేన"నే స్థూలదేహమునందు ఆత్మభావనయే అంకురము; ఇప్పడు వృక్షము బహిర్గతమైనది. వ్యక్తావస్థలో ఉన్నది ఈ వృక్షమునకు రాగము పల్లవములు. రాగమిక్కడ ద్వేషాన్ని కూడ సూచిస్తుంది. వృక్షమునకు జీవించటానికి, సంతతంగా కొనసాగటానికి నీరు కావాలి. కర్మ ఈ సంసారవృక్షమునకు నీరు. నీవు కర్మలు చేస్తూ పుణ్యపాపములరూపంలో కర్మఫలములను పొందుతావు. కర్మఫలములను - పుణ్యపాపముల ననుభవించటానికి నీవు ఒక శరీరమును పొంది మరల కర్మలు చేస్తుంటావు. ఆవిధంగా కర్మ వృక్షమును సంతతంగా కొనసాగేట్లు చేస్తుంది. కర్మల రూపంలో సంసారవృక్షమునకు నీరు లభిస్తుంది. ఈ వృక్షమునకు శరీరము కాండము; పంచప్రాణములు అనేకశాఖలు.

వృక్షశాఖలకు రెమ్మలుంటాయి; వాటి కొనలనుండి పుష్పములువస్తాయి. కర్మేంద్రియములు జ్ఞానేంద్రియములు రెమ్మలతో పోల్చబడ్డాయి. అవి ప్రాణములున్నపుడే పనిచేస్తుంటాయి. కావున అవి ప్రాణములనుండి ఏర్పడినట్లుగా చెప్పబడ్డాయి.

ఈ వృక్షానికి పుష్పములేవి ? ఇంద్రియ విషయములే పుష్పములు మరి ఈ చెట్టుపండు చేదుగా ఉంటుంది. అదే దుఃఖఫలము. నీవొక బత్తాయి మొక్క నాటావనుకుందాము. అది పెరిగి పెద్దదై ఫలములనివ్వటానికి సిద్ధంగా ఉన్నది. ఆ చెట్టుపై బత్తాయిలు కనపడతాయి. కానీ ఇంకా అవి ఆకుపచ్చగానే ఉన్నవి. నీవు వేచిఉంటావు. ఫలాలు పక్వమవుతవి. సంతోషిస్తావు. ఒక ఫలాన్ని తింటావు. పుల్లగా ఉంటుంది. నిమ్మపండులాగ. అది బత్తాయి ఫలమే కానీ ఊరగాయకిమాత్రమే పనికివస్తుంది. అదేవిధంగా ఈ సంసార వృక్షమునుండి ఫలము రావటానికి ఎంతోకాలం నీ వెదురుచూస్తావు. అవి వచ్చినపుడు దుఃఖమే కలుగుతుంది.

కానీ దుఃఖమే ఫలమని ఎలా చెప్పగలవు ? సంసారంలో సుఖం కూడ ఉంది కదా? అవును అందులో సుఖమున్న మాటనిజమే. కానీ దాని కోసం ఎంతో శ్రమపడాలి. కనుక ఆరంభంలో బాధ ఉంటుంది. ఏ ప్రయత్నమైనా బాధాకరమే కాబట్టి, మరల సుఖం నశించిపోయినపుడు మిగిలేది బాధ. సుఖాన్ననుభవిస్తున్నపుడు కూడ అది పోతుందేమోనన్న భయముంటుంది. కాబట్టి సుఖానుభవంలో కూడ దుఃఖపుపొర ఒకటి ఉన్నది.

పరమలోభియైన వ్యక్తి ఒకడున్నాడు. అతడివద్ద చాలా డబ్బున్నది. కానీ డబ్బులు ఖర్చు చేయటమిష్టం లేక హోటల్‌కి వెళ్ళడు. కొంతమందివ్యక్తులతడితో పాలతో తయారుచేసే ‘ఫాలోడా’ అనే పానీయం గురించి చెప్తారు. ఈతడికీ పానీయం తాగాలని ఉంది. కానీ అతడిభార్యకు దానిని తయారుచేసే విధానం తెలియదు. ధైర్యాన్ని కూడగట్టుకొని ఆ హోటల్‌కి వెళ్ళి ఈ పానీయానికి ఆర్డరిస్తాడు. పానీయం సర్వ్‌చేయబడ్డది. కొంచెం

కొంచెంగా తాగటమారంభిస్తాడు. త్రాగుతూ ఉంటే పానీయం తరిగిపోతూ ఉన్నది. అత డు తేరుకుంటాడు. తనలో తాననుకుంటాడు - "అయ్యో! ఎంతో డబ్బిచ్చాను, పానీయం తరిగిపోతున్నది. !" ఇక దాన్ని త్రాగలేడు, చూస్తూ కూర్చోలేడు, వెళ్ళి పోనూలేడు. ఎంత దురవస్థో !

ప్రతిసుఖము ఈ ఫాలోడా పానీయపు సుఖంలాంటిది. నీ వనుభవిస్తుంటే ఆ విష యం తరిగిపోతుంది. ఇంద్రియములు పటుత్వం కోల్పోతుంటాయి. మానసికభావాలు మారిపోతుంటాయి. ఈ మూడు తగురీతిలో అమరిఉంటేనే సుఖము సాధ్యపడుతుంది. విషయముండాలి కోరిన గుణగణాలతో, కావలసినంతగా; ఇంద్రియములు చక్కగా పని చేస్తుండాలి; మనస్సు కూడ సరియైనస్థితిలో ఉండాలి. ఈ మూటిని తగినరీతిలో ఎక్కు వకాలం అమర్చి ఉంచటం మానవసాధ్యం కాదు. కనుక ఆనందానికి ఆరంభము - అం తము ఉన్నవి. సర్వప్రయత్నాలు చేసినా ఆనందముంటుందన్న నమ్మకం - నిశ్చయం లేద ు.కొంతసుఖమున్నప్పటికి, అది దుఃఖానికే దారితీస్తుంది. అందుచేతనే భగవద్గీతలో కృష్ణ భగవానుడు చెప్తాడు -'దుఃఖయోనయ ఏవతే" అవి దుఃఖానికి కారణములు మాత్రమే". ఆకారణంగానే ఇక్కడ - దుఃఖమే సంసారానికి ఫలము అని చెప్పబడింది.

శరీరమేదైనప్పటికి బాధ ఉంటుంది. దేవశరీరంలో కూడ బాధ పూర్తిగా లేకుండాలేదు. స్వర్గాన్నిగురించి వర్ణించే అదే శాస్త్రము అక్కడ వివిధ దేవతలున్నారని చెప్తుంది. స్వర్గం లో సర్వసాధారణమైన అభ్యుదయము, సుఖశాంతులున్నప్పటికి, వివిధదేవతలు పొందే సుఖంలో తారతమ్యమున్నది. కాబట్టి దుఃఖము పూర్తిగా లేదనటానికిలేదు. కర్మలు నానారకములు. వాటి ఫలాలు నానారకములు. అవి భిన్నభిన్న శరీరములను జీవుడు

ధరించేటట్లు చేసి వాటిద్వారా బహువిధదుఃఖాలను అనుభవింపజేస్తాయి. నానాకర్మస ముద్భవమ్ - బహువిధం. ఇంతవరకు సంసారము వర్ణించబడ్డది. ఇక్కడ భోక్త ఎవరు ? జీవుడు భోక్త - చెట్టుమీద రకరకాల పండ్లనుతినే పక్షిలాంటివాడు. ఖగమంటే ఆకాశం లో చరించేది. సంసారవృక్షంమీద ఉంటూ జీవుడు ఫలముల ననుభవిస్తుంటాడు. ఆ ఫలములు జీవునియొక్క సవకర్మఫలములే.

నీవు చక్కగా పరిశీలిస్తే అవిద్యా కామ - కర్మలే సంసారానికి కారణంగా గోచరిస్తాయి. ఇక్కడ కర్మ అంటే కర్మఫలము. పరమాత్మస్వరూపమే ఐన జీవుడు - అవిద్యా కారణంగా - శరీరమును ఆత్మగా భావించి - తాను పరిచ్ఛిన్నుడ ననుకొంటాడు. ఈ పరిచ్ఛిన్నభావ నను౦డి విముక్తి పొందాలనే సహజమైన కోరిక ఉన్నది కనుక - జీవుడు కర్మ చేస్తాడు. కర్మవలన పుణ్య పాపాలను పొందుతాడు. ఇది మరోజన్మకు దారితీస్తుంది. ఎప్పుడెప్పుడై తే మానవశరీరమును గానీ దానితో సమానమైనదిగాని పొందుతాడో అప్పుడప్పుడల్లా మరల కర్మ చేస్తాడు. కనుక జన్మ - కర్మ - పుణ్యాపుణ్యాలు పునఃజన్మ. ఇదీ సంసార చక్ర ము. ఈ చక్రమునుండి విడివడాలంటే జీవునికి అనుగ్రహంకావాలి. నీరు ఎత్తు ప్రదేశం నుండి నిమ్నప్రదేశానికి రావటానికి శక్తి అవసరంలేదు. కానీ అది పైకి వెళ్ళాలంటే దానికి చాలా శక్తికావాలి. అదే విధంగా సంసారచక్రంలో భ్రమించటానికి ప్రయత్నమవసరం లేదు. అది సహజము సాగే చక్రమిది. కానీ దాన్నుండి విడివడటానికి నీకు చాలు శక్తి అవసరము. ఈశ్వరానుగ్రహమే ఈ అధికశక్తి, ఆ అనుగ్రహం ఎవరైనా సత్కర్మలద్వారా పొందుతారు.

జీవుడు సంసారములో ఉన్నాడు. ఎలాదాన్నుండి బయటపడగలడు ? కథం విమోక్షః ? తరువాత శ్లోకంలో అది వివరించబడింది.

# ముక్తిని పొందటమెలా ?

44వ శ్లోకము

శ్రుతిప్రమాణైకమతేః స్వధర్మ
నిష్ఠా తయైవాత్మవిశుద్ధిరస్య ।
విశుద్ధబుద్ధేః పరమాత్మ వేదనం
తేనైవ సంసారసమూలనాశః ॥ 151 ॥

శ్రుతి ప్రమాణైకమతేః - శ్రుతి ప్రమాణమునందు ఎవరికైతే నిష్ఠ ఉంటుందో; స్వధర్మ నిష్ఠా - స్వధర్మాచరణము నందు శ్రద్ధ కలుగును. తయా ఏవ - దాని వలన మాత్రమే; ఆత్మవిశుద్ధిః - అంతః కరణ శుద్ధి కలుగుతుంది; అస్య విశుద్ధ బుద్ధేః - ఈ శుద్ధ అంతః కరణమున్న వానికి, పరమాత్మ వేదనం - పరమాత్మ జ్ఞానం కలుగుతుంది; తేనైవ - దాని ద్వారానే; సంసార సమూల నాశః - కారణమైన అజ్ఞానముతో సహా సంసారము నశిస్తుంది.

“శ్రుతిప్రమాణమునందు ఎవరికైతే నిష్ఠ ఉంటుందో అతడికి స్వధర్మనిష్ఠ ఉంటుంది. ఆ నిష్ఠవలన అంతఃకరణశుద్ధి కలుగుతుంది. శుద్ధమైన అంతఃకరణమున్నవానికి పరమాత్మజ్ఞానం కలుగుతుంది. ఆ జ్ఞానము చేత సంసారము కారణమైన అజ్ఞానముతో సహా నశిస్తుంది.”

మానవుని చేతిలో ఉన్న ప్రత్యక్షము, దానిమీద ఆధారపడిన అనుమానాది ప్రమాణములచే తెలియబడని వస్తువుల జ్ఞానమును తెలుసుకొనటానికి వేదము - శ్రుతి ఒక్కటే

ప్రమాణము. అటువంటి వేదమేప్రమాణమనే నిష్ఠ ఎవరికైతే ఉంటుందో - అతడు శ్రుతి ప్రమాణైకమతిః. అతడు ఆత్మజ్ఞానమునకు వేదమే ప్రమాణమని అంగీకరించటమే కాక - శ్రుతి విధించిన కర్మలయందు - అతడికి శ్రద్ధ ఉంటుంది. కాబట్టి అతడు ఏకమతిః - నిష్ఠ కలిగిన పురుషుడు, శ్రుతి అనేక నిత్యనైమిత్తిక కర్మలను అంతఃకరణశుద్ధికి మరియు ఇతరఫలములకై విధిస్తుంది. కాని ఇక్కడ సాధకునికి మోక్షమందే ఇచ్ఛ ఉన్నది. కథం విమోక్షః - మోక్షమెలా కలుగుతుందని ప్రశ్నించాడు. అతడికి రాగద్వేషముల పట్టునుండి విడివడిన మనస్సు కావాలి. అటువంటి అంతఃకరణ పొందటానికి శ్రుతి విధించిన కర్మలు సాధనములవుతవి. అందువలననే అతడు శ్రుతివిధించిన వాటి యందు నిష్ఠకలిగి ఉంటాడు. స్వధర్మానుష్ఠానమున కంకితమవుతాడు.

మొదట్లో స్వధర్మమంటే వారి వారి వర్ణాశ్రమధర్మములని చెప్పబడినవి. వాటిని కర్మవ్య కర్మలుగా అనుష్ఠించటం స్వధర్మానుష్ఠానమని చెప్పబడింది. అధికసంఖ్యలో ప్రజలు అనుసరించినపుడు, మోక్షము వారికి లక్ష్యమైనపుడు వర్ణాశ్రమధర్మవ్యవస్థ చక్కగా పనిచేస్తుంది. వర్ణాశ్రమధర్మవ్యవస్థ పనిచేయనప్పటికీ ఏదో ఒకరూపంలో స్వధర్మము కొనసాగుతూనే ఉంటుంది. ఆయాపరిస్థితులలో నీవేమేమిచేయాలో అది నీ స్వధర్మమవుతుంది. అది మారదు, ఎందుకంటే అది సత్యముకనుక.

సమస్తజగత్తు ఒక సమగ్ర నియతి రూపిణి. ఆ నియతిలో నీవు ఒంటరి వాడవుకావు. ఇతర జీవరాసులున్నవి - పశుపక్ష్యాదులు, మానవులు, వృక్షములు మొ॥ అవ్యక్త వస్తువులున్నవి, నిధులు, సిరిసంపదలున్నవి. ఈ జగన్నియతిలోని ఒక వ్యక్తిగా నీవు భాగస్వామివే కాక, దానిలో చక్కగా పాత్రపోషిస్తున్నవాడివి. పాలుపంచుకోవటంలో ఇతరులతో సం

పర్కము - వ్యవహారము లుంటాయి. ఈ వ్యవహారములో నీ ప్రవర్తనను రాగద్వేషముల ఒత్తిడి నియమిస్తుంటుంది లేదా నీ స్వధర్మము - నీవు చేయవలసినపనులు, ఏమిచే యాలన్న స్వధర్మము ఆయా పరిస్థితులను బట్టి అవగతమవుతుంది. అదేవిధంగా ఏది చేయకూడదో తరచుగా అదే చేయాలని కోరుకునేదవుతుంది. మహాభారతంలో దుర్యో ధనుడు చెప్తాడు. నాకు ధర్మము తెలుసు కానీ అనుసరించలేను. అధర్మమేమిటో తెలుసు కానీ దాన్నుండి నివృత్తుడిని కాలేను. నా హృదయంలో ఉన్నవారెవరో ఎలా నియమిస్తే అలాచేస్తాను. ఆవిధంగా నీలో రాగద్వేషములకషాయమున్నది. అధర్మాన్ని చేయమని ప్రేరేపిస్తూ, అందుచేత పరిస్థితినర్థంచేసుకోవటానికి, చేయవలసినది చేయ టానికి ప్రయత్నపూర్వకంగా సంకల్పశక్తినుపయోగించాలి. ఆ యా పరిస్థితులలో ఏవి కర్తవ్యకర్మలో వాటిని ఆచరించటమును స్వధర్మనిష్ఠ అంటారు. స్వధర్మ నిష్ఠగురించి చర్చించినపుడు అమానిత్వాది విలువలన్ని అందులోకి వచ్చేస్తాయి.

ఈశ్వరసంబంధము ఉన్నప్పడే కర్మయోగ ముంటుంది. ఈశ్వరుణ్ణంగీకరించకుండా విలువలకు మాత్రం కట్టుబడి వ్యవహరిస్తుంటే నీవొక ఉత్తమమానవుడివవుతావు కాని - కర్మయోగివి కాలేవు. నీవు కర్మయోగివైనప్పడే - ఈశ్వరునిలో అహంకారము సాపేక్షికం గా లయిస్తుంది. జీవేశ్వరులమధ్య ఒకరకమైన సాన్నిధ్యభావముంటుంది. అప్పడే వేదాం తము ఫలిస్తుంది. సాపేక్షికంగా అహంకారమణిగినప్పడే - అహంకారము పూర్తిగా నివృ త్తిం కావటం సాధ్యమవుతుంది. కాని అది అంత సులభమైన విషయంకాదు. సాపేక్షి కంగా అహంకారమణగటానికి - లయంచెందటానికి యుక్తమైన మనస్సుతో నిష్ఠాపూర్వ కంగా కర్మ, అర్చన, పూజాదులనుష్ఠించాలి.

స్వధర్మనిష్ఠద్వారానే ఎవరికైనా ఆత్మవిశుద్ధి - అంటే అంతఃకరణశుద్ధి కలుగుతుంది. నీవు కర్మవ్యకర్మలనాచరించినపుడు ఈశ్వరనియతిలో విశ్వాసముంటుంది. ఆ విశ్వాసంలో నీవు ఉపశమనం పొందుతావు. ఈ ఉపశమమునే అంతఃకరణశుద్ధి అంటారు. అపుడు నీరాగద్వేషములు నిర్జీవము లవుతాయి; వాటివశంలో నీవుండవు. కనుక అంతఃకరణశుద్ధి అంటే - ఈశ్వరునితో లెక్కలు సరిచూసుకోవటం (settling accounts with Eswara) - లేని పక్షంలో నీవెప్పడు ప్రపంచంతో పోరాడుతూనే ఉంటావు. - ఈశ్వరనియతి బాహ్యాభ్యంతరములలో అంతటా ఉన్నది. ప్రపంచ మా నియతిలో అంతర్గతమైనది . కనుక నీవు ఈశ్వరునితో అన్నీ సరిజూసుకుంటే - ప్రపంచంతో పోరాడవలసిన అవసరంలేదు. ఆ నియతికి అర్పణచేసుకుంటే నీవు విశ్రాంతిపొందుతావు.
ఆ నియతిని నీవెంతగా గుర్తించి అవగతంచేసుకోగలవో అంతగా దానికి అర్పించుకోవటంసులభమవుతుంది. ఈ నియతికి అర్పణచేసుకోనంతవరకు అహంకారము తన సమస్యలను పరిష్కరించుకోలేదు. పరిష్కారంగనుక జరిగితే వేదాంతవాక్యములు పని చేయటమారంభిస్తాయి. బోధకేవలం శబ్దములుగా మిగిలిపోకుండా - ప్రకాశవంతమవుతుంది.

స్వచ్ఛహృదయం కలిగిన వ్యక్తికి - పరమాత్మను గుర్తించటముంటుంది. పరమాత్మ వేదనమంటే - ఆత్మ పరమన్న జ్ఞానము; ఇంకను అది ఏవిధమైన పరిచ్ఛిన్నము లేనిదని - సర్వకారణమని - సృష్టి దానికంటె భిన్నముకాదని జ్ఞానము. ఇదే పరాత్మజ్ఞానము. దీని నుండి మనకొక విషయం స్పష్టమవుతుంది. ఎప్పడైతే వివేకము, వైరాగ్యము, సాపేక్షికంగా అహంకారము ఈశ్వరునితో లయిస్తుందో అప్పడు జ్ఞానంపొందటానికి మనస్సు

సిద్ధంగా ఉంటుంది. అది విశుద్ధమవుతుంది. ఆత్మజ్ఞానం పొందటానికి మరేమీ ప్రతిబంధకముండదు.

ఆత్మయే పరమన్న జ్ఞానముచేత మాత్రమే సంసారకారణమైన అవిద్య నశిస్తుంది. విద్య అవిద్యకు విరోధికనుక - అంధకారమునకు ప్రకాశమువలె.

సంసారమునకు మూలము అవిద్య ఇంతకుముందు మనంచూచినట్లుగా అది సత్తు కాదు అసత్తుకాదు. ఏప్రమాణముచేత అవిద్యాసిద్ధిజరుగదు. కానీ "ఏది అవిద్య" అని నీవడుగుతున్నావు కాబట్టి అదంటూ ఒకటి ఉన్నదని స్పష్టమవుతున్నది. "అజ్ఞానమెవరికి చెందుతుంద"న్న ప్రశ్నకు సమాధానమిస్తూ శంకరులు మరోచోట "ప్రశ్నించేవారికే" నని చెప్తారు. ఏ ప్రమాణవిచారముద్వారా అది సిద్ధించదు. కాని విచారములేనపుడు అది ఉంటుంది. నీవు అనుభవిస్తున్నావు కనుక, నీకు అజ్ఞానమున్నది. కాబట్టి అజ్ఞానమున్నది.

అవిద్య ఇంద్రియగోచరము కాదు, కనుక ప్రత్యక్షప్రమాణమునకు లభించదు. ప్రత్యక్షమునకు లభించదుకనుక, లింగజ్ఞానముండదు. అగ్నిజ్ఞానమునకు ధూమమువలె కనుక అనుమానముద్వారా తెలియబడదు. అర్థాపత్తివలనకూడ ప్రయోజనం లేదు. అవిద్య లాంటిది మరోకటి లేదు కావున, ఉపమానమునకు అందదు. ఒక వస్తువు యొక్క అభావాన్ని తెలిపేది అనుపలబ్ధి ప్రమాణము. అవిద్య అనుపలబ్ధి ప్రమాణముద్వారా కూడ తెలియబడదు. ఎందుకంటే సమస్యలను కలిగిస్తున్నది కాబట్టి, అవిద్యకు ఒకరకమైన అస్తిత్వమున్నది.

శబ్దప్రమాణముచేత కూడ అవిద్య తెలియబడదు. చక్కగా పరీక్షించితే పురుషార్థము

లను చూపటమే శబ్దప్రమాణము యొక్క ఉద్దేశ్యమని తెలుస్తుంది. నీకు హితమైన దానినే శబ్దప్రమాణము చర్చిస్తుంది.

శబ్దములతో వ్యవహరించినపుడు తాత్పర్యమును నిర్ణయించగలగాలి. ఏది తాత్పర్యమో అదే ఆ శబ్దాలకర్థము. 'యత్పరః శబ్దః స తదర్థః' ఫలవంతమైన అనధిగతమైన విషయమును బోధించటంలోనే శబ్దమునకు తాత్పర్యము.

మీమాంసకుల అభిప్రాయాన్ననుసరించి వేదంలో సాక్షాత్ ఫలబోధకం కాని వాక్యమేదైనా, ప్రకరణంలోని ప్రధానవాక్యానికి అంగమవుతుంది. "అతడు రోదించెను" అనే వాక్యమున్నది. ఈ వాక్యము నాకేమి ఉపకరించదు. దానర్థము నాజీవితంలో ఏ మార్పు తీసుకురాదు. కానీ కర్మప్రకరణంలో అర్థం చేసుకున్నప్పుడు మార్పుఉంటుంది. వేదకథనానుసారం అగ్ని రోదించినపుడు ఆ కన్నీరు వెండిగా మారింది. అందువలన ఎవరైనా యజ్ఞంచేసినపుడు వెండిని దానమివ్వరాదని నిషేధింపబడినది. రజతమును యజ్ఞంలో దానం చేస్తే సంవత్సరంలోపల యజమాని కన్నీరు కార్చాల్సిన అవసరమేర్పడుతుంది. కనుక "సోరోదీత్" అన్న వాక్యము "బర్హిషి రజతం న దేయమ్" యజ్ఞకర్మలో రజతమివ్వరాదు అనే వాక్యానికి అంగమవుతుంది. అందుచేతనే ఒక న్యాయముంది "ఫలవత్ సన్నిధౌ అఫలమ్ తదంగమ్" అంటే ఫలబోధకమైన వాక్యసన్నిధిలో సాక్షాత్ ఫలోత్పత్తిని కలిగించని వాక్యములు కర్మను విధించే ప్రధానవాక్యమునకు అంగములుగా గ్రహించాలి. "సోరోదీత్" వాక్యము "బర్హిషి రజతం న దేయమ్" అన్న వాక్యానికి అంగము. ఆ విధంగా సమస్తశాస్త్రము ఫలవంతమవుతుంది.

అనధిగతము, అబాధితము ఐన జ్ఞానాన్ని కలిగించేది ప్రమాణము. శబ్దప్రమాణము

ఫలవత్ అర్ధబోధకత్వము కలిగిఉండాలి. శ్రుతి ప్రయోజనకారియైన అర్థాన్ని బోధించాలి. శ్రుతిజన్యజ్ఞానముతో నీవు దుఃఖాన్ని తొలగించబడటానికి దేన్నైనా తప్పించాలి లేదా సుఖాన్ని పొందటానికి దేన్నైనా సాధించాలి. ఇహంలోగాని లేదా పరంలోగాని. అప్పడే వాక్యానికి శాస్త్రములో స్థానముంటుంది. కాబట్టి ఏ విషయమైనా శాస్త్రవిషయం కావాలంటే అది ధర్మార్థ కామమోక్షములలో ఏదో ఒక పురుషార్థము గురించి చర్చించాలి.

కాబట్టి వేదము అవిద్యగురించి చర్చించదు. ఎందుకంటే అది అనధిగతము, అప్రసిద్ధము కాదు - నీ అనుభవంలో ఉన్నది కనుక నీకుతెలుసు, ప్రసిద్ధమే. మరి ఇంకను అది ఏ ఫలమును ఉత్పన్నంచేయబోవటంలేదు. వస్తువు (ఆత్మ) గురించిమటుకు శాస్త్రము బోధిస్తుంది. ఎందుకంటే వస్తుజ్ఞానముద్వారా సంసారము ఏదో సాధించాలి ఏదో అవాలి అనే జీవితం నుండి ముక్తి లభిస్తుంది. ఒకవేళ శాస్త్రము అవిద్యగురించి చర్చిస్తే అది అనువాదము - తెలిసినదానిని పునః చెప్పటము మాత్రమే.

పురుషార్థములను గురించి బోధించటానికే శాస్త్రమున్నదని భావింపబడుతుంది. కనుక శాస్త్రతాత్పర్యమును నిర్ణయించటం చాల ముఖ్యమవుతుంది. తాత్పర్యనిశ్చయానికై షడ్లింగములను ఉపయోగిస్తాము. ఆరులింగములు వరుసగా - ఉపక్రమ - ఉనసంహారములు, అర్థవాదము, అభ్యాసము, ఉపపత్తి, అపూర్వతా, మరియు ఫలము. శాస్త్రదృష్టినర్థంచేసుకోవటానికవి ఏవిధంగా ఉపయోగించబడ్డాయో తెలుసుకొందాము.

ఉపక్రమ ఉపసంహారములు, ఉద్దాలకుడు పండ్రెండు సంవత్సరములు గురుకులంలో

విద్యనభ్యసించి తిరిగివచ్చిన పుత్రునితో ఈ విధంగా ప్రశ్నిస్తాడు, "ఏ జ్ఞానము పొందితే సర్వము పొందినదవుతుందో అంటే అశ్రుతము శ్రుతమగునో, ఆలోచించనిది ఆలోచించినదగునో, విదితముకానిది విదితమగునో, ఆ జ్ఞానము కొరకు అడిగావా ? " ఈ వాక్యమునుండి ఏది తెలుసుకుంటే సర్వము తెలిసినట్లుగా అగునో, అటువంటి వస్తువొకటి ఉన్నదని మనకు అవగతమవుతుంది. అంటే ఉన్నది ఒకే వస్తువు. లేని పక్షంలో ఒక వస్తువు తెలిసినంతమాత్రాన సర్వము తెలియబడలేదు. ఇది అక్కడ ఉపక్రమము. ఉపసంహారము " ఐతదాత్మ్యమిదం సర్వమ్ తత్ సత్యమ్ స ఆత్మా తత్త్వమసి - ఇది (సత్) ఈ సర్వానికి ఆత్మ. అదే పరమసత్యము. అదే ఆత్మ. అది నీవే" (ఛాందోగ్యోపనిషద్ 6-16-3)శ్రుతి ఇక్కడ సద్వస్తు ఆత్మల ఏకత్వాన్ని తెలుపుతుంది. అంటే ఉన్నది ఒకే వస్తువని మరల ద్యోతకమవుతుంది. కనుక ఉపక్రమ - ఉపసంహారములు అద్వితీయవస్తువునే తెలుపుతవి; దేనిని తెలుసుకుంటే సర్వము తెలిసినట్లగునో ఇది తాత్పర్యము.

కానీ ఇదేదో ఒకచోటచెప్పిన వాక్యముకాదు. అభ్యాసము మరల మరల ఈ శాస్త్రతాత్పర్యము "తత్త్వమసి" వాక్యమును తొమ్మిదిసార్లు పునః పునః చెప్పటము ద్వారా అభ్యాసముచేయబడ్డది. కేవలం మరల మరల చెప్పటం కాదు. తొమ్మిది దృష్టికోణములనుండి తత్త్వమసివాక్యార్థనిర్ణయం జరిగింది. ఇక్కడ అభ్యాసము శాస్త్రము తాను బోధిస్తున్న దానికెంత బద్ధమై ఉన్నదో తెలుపుతుంది. ఏది బోధింపబడుతున్నదో అది అవగతం కావాలి.శిష్యుడుకూడ అర్థం చేసుకోవాలని ప్రయత్నంచేస్తున్నాడు. కనుకనే మళ్లీ మళ్లీ బోధించమని అడుగుతూనే ఉన్నాడు. పునః పునః బోధించబడడ్డది కూడ.

ఇంక అర్థవాదము " తస్య తావదేవ చిరమ్ యావన్న విమోక్ష్యే అథ సంపత్స్యే ఇతి -

శరీరమున్నంత వరకే మోక్షానికి, వ్యవధానము, అప్పుడు సత్‌తో ఐక్యమతుతాడు." (చా. ఉ. 6.14.2) శరీరము పతనమైనప్పుడు విదేహముక్తి ఉంటుంది. తిరిగి రావటమండదు. అతడికి మోక్షం కలుగుతుంది. ఇది అర్థవాదము. అంతేకాక "దేనిని తెలుసుకుంటే తెలియనిది తెలిసినట్లుగా అగునో" అన్నదికూడ ఒకరకమైన అర్థవాదమే. నీవాత్మను తెలుపుకున్నప్పుడు సర్వముతెలుస్తుందని కాదు - 'సర్వము తెలిసినదానివలె' అగును. ఈ మూడు లింగములు ఉపక్రమోపసంహారములు, అభ్యాసము అర్థవాదములు ప్రమాణనిష్ఠలు - అవి శాస్త్రతాత్పర్యమును తెలుపును.

ఆత్మ బ్రహ్మమన్నది అపూర్వత్వము మరే ఇతరప్రమాణవేద్యముకాని సత్యము, దాన్ని తెలుసుకోవటానికి మరోమార్గములేదు. అపూర్వము ఆ ప్రమేయమునకు సంబంధించినది.

తరువాత ఉపపత్తి, తర్కము - యుక్తి. " వాచారంభణం వికారో నామధేయమ్ మృత్తికా ఇత్యేవ సత్యమ్ - మృత్తిక (కారణము) సత్యము, కార్యము (మిథ్య) వాక్కులే ఆలంబనముగానున్న నామము మాత్రమే. "ఇక్కడ కారణము సత్యము కార్యము మిథ్యఅని చెప్పే యుక్తి ఉన్నది. ఏకమైన కారణమును తెలుసుకుంటే దానికంటె భిన్నముకాని కార్యము తెలిసినట్లుగా అవుతుంది. ఉపపత్తికూడ ప్రమేయమునకు సంబద్ధమైనదే. ప్రమేయము ఇతరప్రమాణములకు లభ్యముకాదు. మరియు శాస్త్రము బోధించిన ఇతర ప్రమాణములచే బాధితము కాదు. విరుద్ధముకాదు.

ఫలముకూడ ప్రమేయనిష్ఠము. జ్ఞేయమునకు ఫలమున్నదో లేదో నిర్ణయింపబడవలెను. అపూర్వతా, ఉపపత్తి, ఫలము ఈ మూడు లింగములలో ఫలము ప్రధానమైనది.

ఎందుకంటే ఫలప్రదము కాని ప్రమాణవిచారమున కెవెరూ ప్రయత్నించరు. జ్ఞానమున కు ఫలమున్నపుడే జిజ్ఞాసావిషయమవుతుంది. కనుక ఫలము ప్రమాణవిచారమునకు కారణమవుతుంది. అందుచేతనే శాస్త్రము ఆరంభంలోనే చెప్పింది. "సత్యము తెలిసినది గా అవుతుంది" అని. కనుక షడ్లింగములలో ఫలము ప్రధానమైన లింగము.

ఈ షడ్లింగములద్వారా శాస్త్రమునకు అవిద్యాసిద్ధిలో తాత్పర్యము లేదని మనం నిర్ణ యించవచ్చు. నాకు అజ్ఞానము ముందుగానే ఉన్నది. శాస్త్రము వస్తుప్రతిపాదనకే బద్ధమై ఉన్నది; దానిచే అజ్ఞానము తొలగిపోతుంది. సంసారము సమస్య, అది అజ్ఞాన జనితము. అజ్ఞానము జ్ఞానముచేతమాత్రమే తొలగింపబడుతుంది. అందుచేతనే శాస్త్ర ముద్వారా వస్తుజ్ఞానముమాత్రమే బోధింపబడుతున్నది. వస్తుజ్ఞానము పొందటమే జిజ్ఞాసువుకి ప్రధానలక్ష్యము. ఇక్కడ మోక్షము పురుషార్థము, సంసారమునుండి విముక్తి వస్తు జ్ఞానము లేక ముక్తి లభించదు. ఎందుకని ? ఎందుకంటే వస్తువు మాత్ర మే ముక్తము; సంసారములో ముక్తమైనది మరొకటి లేదు.

మనస్సు సిద్ధంగా ఉంటే జ్ఞానం కలుగుతుంది. కనుక మనస్సుయొక్క సంసిద్ధతను గురించే ఇక్కడ చర్చించబడ్డది. "శుద్ధమనస్సు పరమాత్మ జ్ఞానమును పొందగలదని" గురువిక్కడ చెప్తున్నాడు, కానీ మనస్సు శుద్ధమైనంత మాత్రాన పరమాత్మజ్ఞానం తనంత తానుగా కలగదని తెలుసుకోవటం చాల ముఖ్యము. ఆత్మ తనకుతానుగా ప్రకటించు కోదు, శాస్త్రప్రమాణము నుపయోగించినపుడు జ్ఞానం కలుగుతుంది. అందుచేతనే గురువుని సమీపించాలని ఇంతకుముందు చెప్పబడినది. ఒకసారి జ్ఞానంకలిగితే సంసా రము కారణమైన అజ్ఞానముతో సహా నశిస్తుంది.

శిష్యుడు ఇంతకు ముందు ప్రశ్నించాడు. ఆత్మానాత్మవివేకః కథం ? ఆత్మను అనాత్మ నుండివేరుగా ఏవిధంగా తెలుసుకోవటమని. భ్రాంతి, ఉన్నచోటనే వివేకమవసరము. భ్రాంతిలేనిచో వివేకమవసరములేదు. రెండువస్తువులు కలిసిపోయినపుడు ఒక వస్తువు ని మరొక వస్తువుగా పొరబడినపుడు విభ్రాంతి కలుగుతుంది. ఆ రెండిటిని విడిదీయ టానికి వివేకమవసరము.

జగత్తులో రెండు విషయములున్నవి ఒకటి నామరూపములు, రెండు సద్వస్తువు. ఆరెం టిలో తేడా ఉన్నది. నామరూపములు సద్వస్తువే కానీ సద్వస్తువు నామరూపములు కాదు, ఇది దేహము నామరూపము; కానీ భ్రమవలన ఆత్మగా భావింపబడుతున్నది. దేహమునకు సంబంధించి అవివేకమున్నది. కాబట్టి దేహమునుండి వివేకము ఆరంభ మవుతుంది. అవివేకమున్నచోటే వివేకమవసరమవుతుంది. దేహేంద్రియమనోబుద్ధుల ను కళ్ళు మూసుకొని దాటవేస్తే వివేకము కాదు. వాటిని తప్పించుకొంటే మోక్షం కలుగ దు. కానీ కొంతమంది ఆధునిక వేదాంతులు ఆవిధంగా నమ్ముతారు. మట్టికుండలో కుండ నామరూపములు, మన్ను వస్తువు. కుండ ఉన్నచోటే వస్తువైన మృత్తికనర్థంచేసు కోవాలి. కుండను గురించిన వివేకము, విచారము చేయాలి మరియు వస్తువుని - మృత్తిక నర్థంచేసుకోవాలి.

ఆత్మానాత్మవివేకమును శాస్త్రమిక్కడ పంచకోశవివేకముద్వారా వివరిస్తున్నది. ఆత్మను ఆచ్ఛాదించే కోశము లేదు. భ్రమవలననే ఏదైనా కోశములాగ భావింపబడుతుంది. అజ్ఞానము సర్వసాధారణము కనుక, ఆత్మ గురించిన భ్రమకూడ సర్వసాధారణము.

స్థూలసూక్ష్మకారణశరీరములు భ్రమపొందిన స్థానములు. కావున అవి కోశములనబడు తున్నవి.

ఆత్మను కోశములు అనుకొని, వాటి పరిమితులను తనవిగా భావించి వ్యథనొందు తాడు. ఆత్మవస్తువుని స్థూలదేహముగా గ్రహించినపుడు, స్థూలశరీరమునకు బాధకలిగి తే "నేను బాధపడుతున్నాను" అంటాడు. ఇది నేరుగా తానే అనుభవించేబాధ. సానుభూ తితో పొందేబాధమరొకటున్నది. నా పుత్రుడు బాధపడుతుంటే నేనే బాధపడతాను. సూక్ష్మశరీరము ఒక స్థూలశరీరానికే పరిమితం కనుక, మరొక స్థూలశరీరంతో తాదా త్మ్యం చెందదు. అందుచేత పుత్రుని 'నేను' గా తాదాత్మ్యం చెందదు. సూక్ష్మశరీరము కొంత ప్రారబ్ధమునను భవించటానికొస్తుంది, అందుకై ఒకస్థూలశరీరముతో తాదాత్మ్య ము చెందుతుంది.

ఆత్మస్వరూపమునర్థం చేసుకొననివారికి స్థూలశరీరము ఒక కోశమవుతుంది. అందుచేతనే వివేకమున కవకాశమున్నది. స్థూలశరీరము కోశమే. కోశం వాస్తవమైతే వివేకమేంచేయగలదు. ఆత్మ స్థూలశరీరాదులచేత ఆచ్ఛాదింప బడలేదు, బంధింపబడలే దు. అందుచేతనే ఆత్మానాత్మవివేకము సాధ్యమవుతుంది.

# ఆత్మానాత్మలను వేరు పరచటమేలా ?

45వ శ్లోకము

ముఞ్జాదిషీకామివ దృశ్యవర్గాత్

ప్రత్యఞ్చమాత్మాన మసఙ్గమక్రియమ్ ।

వివిచ్య తత్ర ప్రవిలాప్య సర్వం

తదాత్మనా తిష్ఠతి యః స ముక్తః ॥ 155 ॥

ముఞ్జాత్ ఇషీకామ్ - ముంజ గడ్డినుండి ఇషీకము (లోపలి సన్నని కాడను) వేరుపరచి నట్లుగా; అసంగమ్ అక్రియమ్ - అసంగము, నిష్క్రియ స్వరూపము ఐన; ప్రత్యఞ్చమ్ ఆత్మానమ్ - ప్రత్యగాత్మను; దృశ్యవర్గాత్ వివిచ్య - దృశ్య వర్గమునుండి వేరు పరచి; సర్వం తత్ర ప్రవిలాప్య - సర్వమును ఆత్మ స్వరూపంలో లయంచేసి; యః - ఎవరైతే; తదాత్మనా తిష్ఠతి - ఆత్మస్వరూపనిష్ఠలో నుంటాడో; సః ముక్తః - అతడు ముక్తుడు.

> "ఏవిధంగా నైతే ముంజగడ్డి నుండి లోపలి సన్ననికాడను వేరు పరచినట్లుగా ఎవరైతే అసంగ నిష్క్రియాత్మను దృశ్యవర్గమునుండి వేరుపరచి సర్వమును ఆత్మస్వరూపముగా లయంచేసి జ్ఞానముతో ఆత్మస్వరూపనిష్ఠతో నుంటాడో అతడు ముక్తుడు."

తరువాత చెప్పబడే ఆత్మానాత్మవివేకమునకు ఇది ఉపక్రమము. ముంజఅంటే పదునైన కొనలుగలిగిన ఒకరకమైన గడ్డి. దానిలోని మృదువైన సన్నని కాడును 'ఇషీకా' అంటారు. ముంజగడ్డినుండి ఈ మృదువైన కాడను విరిగిపోకుండా విడదీయటంచాల కష్టమైనపని. అంతేకాక ఆ గడ్డి అంచులు చాలా పదునైనవి. నీవు జాగ్రత్తగా ఉండకపోతే వ్రేళ్ళుకోసుకుపోవచ్చు. కాబట్టి వ్రేళ్ళుకోసుకుపోకుండా, కాడవిరిగిపోకుండా ఇషీకను

మంజగడ్డినుండి బయటకు తీయటానికి చాలా అప్రమత్తత నిపుణత కావాలి. అదేవి ధంగా ఆత్మను అనాత్మనుండి వేరు పరచటానికి జిజ్ఞాసువు చాలా అప్రమత్తుడై ఉండాలి. ఆత్మను అనాత్మనుండి వేరుపరచేటప్పడు గాయపడకపోవచ్చు కానీ, జిజ్ఞాసువు తప్పలు చేయవచ్చు. ఆత్మ స్థూలశరీరముకంటె భిన్నము కావున, మరణము తరువాత కొనసాగు తుంది. స్వర్గానికికూడ వెళ్ళవచ్చని నీవనవచ్చు. చాలావరకు మతములన్నీ ఇక్కడే ఆగి పోతవి; స్వర్గానికి వెళ్ళటమే లక్ష్యమని చెప్తుంటారు. ఆత్మను తెలుసుకోవాలంటే, ప్రమాణ ము శబ్దములరూపంలో ఉన్నది కనుక ఆత్మసంబంధితశబ్దములను వాక్యములను సూచిక్ష్మంగా జాగ్రత్తగా అర్థంచేసుకోవాలి. 'ఆత్మ' శబ్దార్థము దేహవిలక్షణమైన, మరణం తరువాత కూడ కొనసాగే ఆత్మవరకే పరిమితంకాదు. దానరము ఇంకాఎంతో ఉంది; అధికవ్యాపకత్వమున్నది. తత్త్వమసి మహావాక్యము అర్థమయేంతవరకు విచారము కొనసాగాలి.

వివేకస్వరూపమేమిటి ? ప్రత్యగాత్మను దృశ్యవర్గమునుండి విడదీయుటను వివేకమం టారు. దేహాదులు మొదలుకొని సమస్తవస్తువులు దృశ్యవర్గములోనికి వస్తాయి. ప్రత్యక్ష ము లేదా అనుమానము ద్వారాగాని, మరేవిధంగానైనా దేన్నైనా నీవు విషయీకరించగ లవో అది దృశ్యము. అంతేకానీ కేవలం చూడబడేదని కాదు. విషయీకరింపబడే దృశ్య ము బాహ్యంకావచ్చు లేదా అంతరంగికము కావచ్చును. వివిచ్య అంటే వేరుపరచి. ఈ వేరు పరచటంలో భౌతికమైనకర్మ ఏదీలేదు. స్ఫటికమునుండి రంగుని వేరు చేయటం లాంటిది. లోహితపుష్పముముందు స్ఫటికముంచితే అది ఎఱ్ఱగా గోచరిస్తుంది. ఎఱ్ఱపు ష్పంస్థానంలో పచ్చని ఆకునుంచితే స్ఫటికపురంగు మారుతుంది. ఈ మార్పునుండి స్ఫటి కము ఎరుపుకాదు పచ్చరంగుకూడా కాదని అర్థంచేసుకుంటాను. స్ఫటికమును లోహి

తముగా లేదా పచ్చగా చూచినప్పటికి, ఆ రంగులు స్ఫటికానికి చెందినవి కావు. ఇదీ పృ థక్ కరణమంటే.

దృశ్యవర్గాత్ ఆత్మానమ్ వివిచ్య పృథక్కృత్య - "ఆత్మను దృశ్యవర్గమునుండి అనాత్మనుండి వేరుపరచి" అని శాస్త్రమిక్కడ చెప్తున్నది. దేహేంద్రియాదులను అనాత్మను నీవు ఆత్మగా భావిస్తున్నావు కనుక, ఆత్మను అనాత్మనుండి వేరు పరచాలి. నేను దేహమని ఎవరూ అనరు. కానీ నేను స్థూలంగా లావుగా ఉన్నానంటారు. దేహగుణములను ఆత్మ మీద ఆరోపిస్తారు. అదేవిధంగా ఇంద్రియ, ప్రాణబుద్ధ్యాదులధర్మములను ఆత్మపై ఆరోపించి వ్యవహరిస్తుంటారు. అజ్ఞానము సర్వసాధారణంకనుక భ్రమలు కూడ సర్వసాధారణము లు. ఏఏదశలో ఆత్మగురించి భ్రముంటుందో అక్కడల్లా ఆత్మను పృథక్కరణం చేయాలి.

దృశ్యవర్గమునుండి నీవు వేరుపరచాలనుకుంటున్న ఆత్మస్వరూపమేమిటి ? అది ప్రత్య క్ అది అంతరతమము. లేదా విషయముకంటె విలక్షణమైనది. ప్రాతిలోమ్యేన అంచతి ఇతి ప్రత్యక్. విషయముకంటె విలక్షణమైనది విషయి. కనుక ప్రత్యంచమ్ అంటే విష య ద్రష్ట్యస్వరూపముగానున్నది. ద్రష్ట దృశ్యముగా లభించడు.

ప్రత్యగాత్మ అసంగుడు. సాధారణంగా రెండువస్తువులు పరస్పరము కలిసిఉంటే ఒకదా ని గుణములు మరొకదానిమీద పరస్పరము సంక్రమింప జేసుకుంటాయి. ఆ ముద్రలు రెండు వస్తువుల్ని వేరుపరచినతరువాత కూడ కొనసాగుతుంటాయి. ఇద్దరువ్యక్తులు కలి సిఉన్నా ఒకరి ప్రభావం మరొకరిమీద పడుతుంది. ప్రతిసంయోగంలోను ఒకటి మరో దాని గుణములను గ్రహిస్తుంది. కాని ఆత్మ అసంగము. అంటే ఆత్మ దేహముచుట్టు దీర్ఘకాలము ఉన్నప్పటికి అది ఏ సమయంలోను ఆత్మతో కలిసిపోలేదు. ఆత్మ తన సత్తా స్ఫూర్తులను శరీరానికిస్తుంది. ఐనా దేహముతో సంగములేకుండా ఉంటుంది. ఎందు

వలన ? ఆత్మ సత్యము, దేహము మిథ్యకనుక. మిథ్య సత్యము నేమీచేయలేదు. ఆత్మ ప్రతిదశలోను అసంగమే. అసంగమంటే శుద్ధము. ఆత్మ నిష్క్రియస్వరూపము. వ్యక్తి తాను కర్తనని భావించినప్పటికి ఆత్మ అకర్త.

అనాత్మనుండి ఆత్మను వేరుపరచటమన్నది అరటిపండునుండి తోలును విడదీసినట్లు కాదు. దానిలో రెండు వస్తువులుంటాయి. రెండూ సత్యవస్తువులే. ఇక్కడ వేరుపరచట మంటే "సర్వము ఆత్మకంటె భిన్నముకాదని లయం చేయటము. ఆత్మని ప్రవిలాపనమ్" శ్రుతి బోధిస్తుంది "సర్వం ఖల్విదం బ్రహ్మ ఇది అంతయు వాస్తవానికి బ్రహ్మమే" కనుక ఏదీ ఆత్మ - బ్రహ్మకంటె వేరుగా అస్తిత్వము కలిగిలేదు.

ఇక్కడ కూడ ఆధునిక వేదాంతులు తప్పు చేస్తుంటారు. బ్రహ్మమనే ద్రావకం (లాంటి పదార్థము) లో సర్వనామరూపాలను కలియబెట్టి కలిసిపోయేట్లు చేయాలని వారంటా రు. (వారిబోధ అలా అనిపిస్తుంది.) కాని ప్రవిలపనమంటే ఇక్కడ మృత్తికను గుర్తించ టానికై కుండ, మూకుడు మొ॥ నామరూపములను నాశనం చేయటం లాంటిది. అం టే దేనిని నాశనం చేయటమంటూలేదు. నాశనం చేయటానికి భిన్న వస్తువంటూలేదు.

ఉన్నది ఒకే ఒక సద్వస్తువు, అది నేనే ఆ జ్ఞానంలోనే అంతా లయంచెందుతుంది. సర్వ ము సదాత్మస్వరూపమని, సర్వము సదాత్మకంటె భిన్నముకాదని తెలుసుకున్నప్పడు మా త్రమే ప్రవిలాపనం సాధ్యపడుతుంది.

తదాత్మనా యః తిష్ఠతి సః ముక్తః - ఆ ఆత్మగానే ఎవరైతే ఉంటారో అతడు ముక్తుడు. ఆత్మ నేనే అయిఉన్నాను. అది దృశ్యమానవస్తువులలో ఒకటి కాదు. కనుక ఆత్మజ్ఞానం లోనే స్థిరంగా ఉంటాడు. అది జ్ఞాపకముంచుకోవాల్సిన విషయం కాదు. అదేమీ రసా యనశాస్త్రంలో సమీకరణం (chemical equation) లాంటిది కాదు ఎప్పడు గుర్తుంచుకోవటానికి, సదా గుర్తుంచుకోవలసిన విషయమే నీవు విస్మరించవచ్చు.

ఇంకను, నీకన్న భిన్నమైన విషయమైతే నీవు గుర్తుంచుకోవాలి. శస్త్రచికిత్సచేసే వైద్యుడు (surgeon) దీర్ఘకాలంనుండి వైద్యచికిత్సచేస్తున్నప్పటికి, క్రొత్తగా ఆపరేషన్ చేసేముందు తత్సంబంధిత గ్రంథాన్ని పరిశీలిస్తాడు. ఎందుకంటే తన స్మృతిని పూర్తిగా విశ్వసించడు, స్మృతి అలాగే ఉంటుంది. అది కాలంలో నష్టమవుతుంది.

'అహం బ్రహ్మ' అన్నది నీవు స్మరించవలసినది కాదు. గుర్తుంచుకున్నప్పటికి నీకేమీ మార్పు జరగదు. అదొక పరిజ్ఞానాంశముకాదు. "నీవు బ్రహ్మము" అన్నది సత్యము. అది నీవు తెలుసుకొన్నప్పడు ఆత్మగురించిన అజ్ఞానముండదు. అజ్ఞానములేనప్పడు నీవు బ్రహ్మమన్న సత్యాన్ని విస్మరించే ప్రశ్నే ఉండదు. కాబట్టి స్వామీజీ, నేనే బ్రహ్మమని జ్ఞాపక ముంచుకునేదెలాగ ? అనే ప్రశ్న బోధను సరిగా అర్థంచేసుకోకపోవటం మూలంగానే అడుగుతారు.

నిష్ఠ అంటే జ్ఞానము సంశయములు, భ్రమలు, అస్పష్టతలులేనిదని. గ్రంథకర్త ఇక్కడ చెప్తున్నారు. " బ్రహ్మములో ఎవరైతే స్థిరంగా ఉంటాడో అతడిని ముక్తపురుషుడంటారు. "కనుక జ్ఞానము ద్వారానే మోక్షమని సిద్ధాంతీకరించబడినది.

ఇది ఆత్మానాత్మవివేకమునకు సాధారణ ఉపోద్ఘాతము. ఇకనుండి శాస్త్రము భిన్నదశ లలో ఆత్మానాత్మ వివేకమును వివరించబోతున్నది.

46వ శ్లోకము

దేహోఽయ మన్న భవనోఽన్నమయస్తు కోశః
చాన్నేన జీవతి వినశ్యతి తద్విహీనః ।
త్వక్ చర్మమాంస రుధిరాస్థి పురీషరాశిః
నాయం స్వయం భవితుమర్హతి నిత్యశుద్ధః ॥ 156 ॥

అయమ్ దేహః - ఈ దేహము; అన్నభవనః - అన్నము వలన ఏర్పడుతున్నది; అన్నేన జీవతి - అన్నముచేతనే పోషింపబడుతున్నది; చ తద్విహీనః వినశ్యతి - మరియు అది లేకపోతే నశిస్తుంది; అన్నమయః - అన్నవికార రూపం; తు కోశః - ఇంకా అది ఆత్మకు ఆచ్ఛాదనలాగా ఉన్నది. అయమ్ త్వక్ చర్మ మాంస రుధిర అస్థి పురీష రాశిః - ఈ త్వక్, చర్మ మాంస, రక్త అస్థిపురీషముల సముదాయము; స్వయం - తనకుతానుగా; నిత్యశుద్ధః - నిత్య శుద్ధస్వరూపమైన ఆత్మ; భవితుం న అర్హతి - అవటానికవకాశమే లేదు.

> "ఈ స్థూలశరీరము అన్నమువలన ఏర్పడుతున్నది. అన్నము చేతనే పోషింపబడుతున్నది. అన్నం లేకపోతే మరణిస్తుంది. అది అన్నవికారమైన రూపం. అది ఆత్మకు ఆచ్ఛాదనలాగా ఉన్నది. ఈ త్వక్, చర్మ, మాంస, రక్త, అస్థి పురీషముల సముదాయము నిత్యశుద్ధమైన ఆత్మ అయే అవకాశమేలేదు."

ఈ శ్లోకంలో స్థూలశరీరాన్ని వర్ణించి అది ఆత్మ కాదని తెలుపుతున్నాడు. ప్రతిదశలోను ఈ విధంగా నిషేధించటం ఉంటుంది. ఈ స్థూలశరీరము అన్నమువలన ఏర్పడుతున్నది. అన్నమువలన అంటే తల్లిదండ్రులు భుజించి జీర్ణించుకున్న ఆహారమునుండి అని అర్థం. దాన్ని అన్నమయమని పిలుస్తారు. అంటే అన్నవికారమని అర్థం. ఈ అన్నమయము ఆత్మను ఆచ్ఛాదిస్తున్నట్లుగా ఉంటుంది. కనుక, దానిని ఓ కోశమంటారు. స్థూలశరీరదశలో భ్రమపడటం జరిగింది కనుక, ఆత్మజ్ఞానంలో అది ఒక ప్రతిబంధకము. ఆత్మ సర్వవ్యాపి. ఆత్మకు ప్రతిబంధకముండే అవకాశంలేదు. కనుక వాస్తవానికి స్థూలశరీరం ఆత్మకు ప్రతిబంధకం కాదు. కానీ ఆత్మను స్థూలశరీరంగా భావించినవారికి, ఆత్మను

తెలుసుకోవటంలో శరీరం ప్రతిబంధకమవుతుంది. ఘటముయొక్క సత్యమైన మృత్తిక ను తెలుసుకోవటంలో ఘటము ప్రతిబంధకము కానేరదు. కానీ ఘటమును మృత్తికగా కాక ఘటముగానే భావిస్తే, ఘటము ప్రతిబంధకములాగా అవుతుంది.

స్థూలశరీరాన్నెందుకు అన్నమయమని పిలుస్తారు ? అన్నముచేతనే పోషింపబడుతుం ది కనుక, అన్నము లేకపోతే నశిస్తుంది కనుక, అన్నము ఇవ్వకపోయినా లేక ఆహారము జీర్ణము కాకపోయినా శరీరం కాలంలో నశిస్తుంది. మయము అంటే వికారము, పరి ణామము అని అర్థం. భుజించిన ఆహారం శరీరంగా ఆ మార్పు చెందుతుంది. అనేక అంశాలతో కూడి ఉన్నది. త్వక్, చర్మ, మాంస, రుధిర, అస్థి, పురీషములు ఇవన్నీ కలిసి ఈ స్థూలశరీరమేర్పడుతుంది.

ఈ స్థూలశరీరము ఆత్మకానేరదు. ఎందుకంటే శ్రుతి ఆత్మ ‘నిత్యము’ ‘శుద్ధము’ అని బోధిస్తుంది. కానీ ఈ శరీరము అనిత్యము, అశుద్ధము, కనుక స్థూలశరీరము ఆత్మకానే రదు.

47వ శ్లోకము

పూర్వం జనేరపి మృతేరపి నాయమస్తి
జాతక్షణః క్షణగుణోనియత స్వభావః ।
నైకో జడశ్చ ఘటవత్ పరిదృశ్యమానః
స్వాత్మా కథం భవతి భావవికారవేత్తా ॥ 157 ॥

అయమ్ - ఇది (స్థూలశరీరము); జనేః పూర్వం అపి - జన్మించిన పూర్వం; న (అస్తి) లేదు; మృతేః అపి (న అస్తి) - మరణించిన తరువాత కూడ ఉండదు; జాత క్షణః క్షణ గుణః - ఉత్పన్నమయే ప్రతిక్షణము క్రొత్తగుణములు నంతరించుకుంటుంది; అనియత

స్వభావః - అనియతస్వభావము కలిగిఉన్నది. న ఏకః - ఒక్కటి కాదు (అనేక అంశము లతో కూడి ఉన్నది); జడః - జడము; ఘటవత్ పరిదృశ్యమానః - ఘటమువలె ప్రత్యక్ష విషయము; భావ వికార వేత్తా - (అది) భావవికారములను తెలుసుకునే; స్వాత్మా - ఆత్మ; కథం భవతి - ఎలాకాగలడు?

> "ఈ స్థూలశరీరము జన్మించకపూర్వము; మరణించిన తరువాత ఉండదు. క్షణక్షణము క్రొత్తగుణములను సంతరించు కొంటుంది. అనియతస్వభావము కలిగి ఉన్నది. ఒక్కటిగాకాక అనేక అంశముల కూర్పువలన ఏర్పడినది. జడము, ఘటమువలె ప్రత్యక్షవిషయము అది వికారములను తెలుసుకునే ఆత్మ ఎలా కాగలదు ?"

కోశముల ఆత్మానాత్మవివేకం చేసేటప్పడు ప్రతిదశలోను ఆయా కోశములు ఆత్మకాదని నిరాకరించాలి. శాస్త్రమీవిధంగా నిరాకరణచేస్తూ సాగుతుంది.

జన్మించక పూర్వం ఈ స్థూలశరీరం లేదు. ఈ రూపంలో ఇంతకు ముందులేదు. మర ణం తరువాత కూడ ఉండబోదు. ప్రతిక్షణము క్రొత్త రూపురేఖలను పొందుతుంటుంది. క్షణక్షణం మార్పుచెందుతుంటుంది. ఊపిరి పీల్చి కదిలేటప్పడు కూడ మారుతుంటుంది. జరిగిన మార్పును నీవు ఒక్కసారిగా గుర్తించవచ్చు కానీ, ఆ మార్పు ఒక్కసారిగా వచ్చిం దికాదు. శరీరమెప్పడూ మారుతూనే ఉంటుంది. అనియతస్వభావం కలిగి ఉంటుంది. కాదని బాధచేయటానికవకాశం లేనిది. ఎప్పటికీ ఖచ్చితంగా ఒకేవిధంగా ఉండేది నియ తస్వభావమవుతుంది. కానీ శరీరం గురించి ఖచ్చితంగా ఏమీ చెప్పలేము. కూర్చుంటుం ది. నిల్చుంటుంది.పడుకుంటుంది. వీపు నొప్పి పెడుతుంది. మరొకప్పడు తలనొప్పి పెడు తుంది. ఇంకా యవ్వనావస్థ, వృద్ధావస్థ కలిగిఉంటుంది. గనుక అనియతస్వభావం

కలిగి ఉంటుంది.

ఇంకను, శరీరము ఒక్కటిగా ఏర్పడింది కాదు. అదొక సంఘాతము, అనేకములు కలిసి ఏర్పడింది. ఏ ఒక్క అవయవము శరీరం కాదు. అన్నిటిని కలిపినపుడే శరీరమేర్ప డుతుంది. అంతేకాక శరీరం జడము. కనుక నేను స్థూలంగా ఉన్నానని నీవంటే వాస్త వానికి నేను జడమని నీ వంటున్నావు. ఘటములాగానే నీ శరీరం కూడ ఇంద్రియము లకు ప్రత్యక్షమయే విషయము.

ఆత్మ భావవికారములను అంటే శరీరంలో జరిగే మార్పులను తెలుసుకునేది. ఉండట ము, జన్మించటము, వృద్ధిచెందటము, పరిణతిని పొందటం, క్షీణించటం, నశించటమనే వికారములను శరీరం పొందుతుంది. ఈ మార్పులన్నిటినీ గమనించేది ఆత్మ. కనుక ఈ శరీరంలో ఉంటూ శరీరం పొందే మార్పులను, శరీరధర్మాలను గమనించేది ఆత్మ, కనుక శరీరం ఆత్మకాదు. ఘటములాగ అది ఒక దృశ్యము. దృశ్యము కనుక - ఒక వృ క్షము వలెనే - మార్పులను చెందుతుంటుంది. ఆత్మ ఈ మార్పులన్నీ గ్రహిస్తుంది - తాను అవిక్రియాస్వరూపము - మార్పుచెందనిది. కనుక స్థూలశరీరము నిర్వికారియగు ఆత్మ కానేరదు.

అంతేకాక ఆత్మ చూచేవానిస్వరూపమే కనుక - ఏకరూపము. కానీ శరీరము వివిధరక ములైన అంశములు కూర్చి ఏర్పరచబడినది కనుక - అనేకరూపము. అనేకాంశము లతో ఏర్పడిన సంఘాతము కనుక - అనేక అవయవములు కలిగి ఉన్నది. ఈ కారణ ముచేతకూడ శరీరము ఆత్మ కాజాలడు.

48వ శ్లోకము

కర్మేంద్రియైః పఞ్చభిరఞ్చితోయం

ప్రాణో భవేత్ ప్రాణమయస్తు కోశః ।

యేనాత్మవానన్నమయో నుపూర్ణః
ప్రవర్తతేసౌ సకలక్రియాసు ॥ 167 ॥

అయం ప్రాణంః - ఈ ప్రాణము; పఞ్చభిః కర్మేంద్రియైః అఞ్చితః - పంచ కర్మేంద్రియములు, కలిగి ఉండి; ప్రాణమయ కోశః - ప్రాణమయము కోశమువలె ఆత్మను ఆచ్ఛాదించుచున్నట్లుగా; తు భవేత్ - ఉంటుంది; యేన - దేనిచేతనైతే; అన్నమయః - అన్న పరిణామమైన ఈ స్థూల దేహము; ఆత్మవాన్ - జీవం కలిగి; సకల క్రియాసు - సకలక్రియల యందు; ఆసౌ - ఇది; ప్రవర్తతే - ప్రవర్తించును.

"పఞ్చకర్మేంద్రియములతో కూడి ఉన్న ప్రాణము ప్రాణమయ కోశమవుతున్నది. ఆత్మను ఆచ్ఛాదించుచున్నట్లుగా ఉంటుంది. దానితో వ్యాప్తమై ఈ శరీరము జీవం కలిగి, సకలక్రియలు నిర్వర్తిస్తూ ఉంటుంది."

పూర్వశ్లోకంలో అన్నమయకోశము ఆత్మకాదని తెలుపబడింది. ఈ శ్లోకంలో ప్రాణమయకోశాన్ని వర్ణించి, అది ఆత్మకాదని నిరాకరింప బడుతున్నది.

శాస్త్రము స్థూల - అరుంధతీ న్యాయము నుపయోగిస్తుంది. ఈ న్యాయంలో మొదట స్థూలవస్తువుని నీవు చూచేటట్లుగా చేస్తారు. అటునుండి క్రమంగా సూక్ష్మ విషయాన్ని చూచేట్లు చేస్తారు. ఈ విధానాన్ని వశిష్ఠనక్షత్రం ప్రక్కనున్న అతిచిన్నదైన అరుంధతీనక్షత్రాన్నీ చూపటాని కుపయోగిస్తారు. వశిష్ఠనక్షత్రం కూడ సప్తర్షినక్షత్రమండలంలోని ఒక నక్షత్రమే. అరుంధతి - వశిష్ఠనక్షత్రములెప్పడు కలిసే ఉంటాయి. అందుచేతనే వివాహ

సమయంలో అరుంధతి నక్షత్రాన్ని నూతనదంపతులకు చూపుతారు. అరుంధతి నక్షత్రం అతి సూక్ష్మమైనది. ఆకాశంలో దాన్ని కనుగొనటం చాలా కష్టం. మొదట సులభంగా చూడగలిగిన పెద్దదైన చంద్రుణ్ణి చూపుతారు. అక్కడినుండి సప్తర్షినక్షత్రమండలానికి చూచేవారి దృష్టిని మళ్లిస్తారు. అక్కడ వశిష్ఠ నక్షత్రంపై దృష్టి సారించేట్లు చేస్తారు. చూచేవారు అదే అరుంధతి నక్షత్రమనుకుంటారు. కాని అది అరుంధతి కాదని చెప్తారు. అరుంధతి వశిష్ఠ నక్షత్రానికి అత్యంతసమీపంగా ఉంటుంది. ఈ విధంగా అరుంధతి నక్షత్రాన్ని చూపుతారు.

తైత్తిరీయోపనిషత్తు ఆత్మను చూపటానికే స్థూల - అరుంధతీ న్యాయాన్ని ఉపయోగిస్తుంది. ఆరంభంలో ఈ స్థూలశరీరము బ్రహ్మత్వంనుండి ఉత్పన్నమైన కార్యమని బోధిస్తుంది. కార్యము కారణముకంటె భిన్నముకాదు కనుక ఈ దేహమే ఆత్మ - ఈ పురుషుడు - ఆత్మ - అన్నవికారమైన దేహమేనని ఉపనిషత్తు చెప్తుంది. అప్పుడు మరల బోధిస్తుంది - “ అన్యోంతరాత్మా ప్రాణమయః - ఈ దేహాత్మకంటె సూక్ష్మమైనది మరో ఆత్మ ఉన్నది. దాని చేతనే ఈ దేహము పూరింపబడిఉన్నది. అది ప్రాణమయ కోశమ”ని. కనుక ప్రాణము ఆత్మ అవుతుంది. ఈ ప్రాణమయము పఞ్చప్రాణములు కలిగి ఉంటుంది. ఒక కత్తిని ఒర ఆచ్ఛాదించినట్లుగా ఈ ప్రాణమయము ఆత్మను ఆచ్ఛాదిస్తున్నట్లుగా భ్రమిస్తారు. అందుచేతనే నేను ఆకలిగొని ఉన్నాను. నేను దప్పికగొని ఉన్నానని అంటారు. ప్రాణధర్మములను ఆత్మధర్మములుగా భ్రమిస్తారు. అందుచేతనే ప్రాణమయము కోశములాంటి కోశము. ఈ భ్రమకారణంగానే అది ఆత్మను తెలుసుకోవటంలో ప్రతిబంధకమవుతుంది. ప్రాణమయకోశము పంచకర్మేంద్రియములతో కలిసి ఉంటుంది. ప్రాణములు పంచమహాభూతముల సమష్టి రాజసాంశనుండి ఉత్పన్నమవుతాయి. కానీ కర్మేంద్రియములు విడివిడిగా ఆయా భూతముల రాజసాంశమునుండి ఉత్పన్నమవుతాయి.

ప్రాణము శరీరాన్ని జీవింపజేస్తుంది. ప్రాణంలేకపోతే శరీరం మరణిస్తుంది. అది శరీరం లోని ప్రతికణంలోనూ (cell) ఉన్నది. అందుచేతనే ప్రతికణము జీవకణమవుతున్నది. ప్రాణముండటంచేత శరీరం జీవించిఉంటుంది. కనుక అది దేహమునకు ఆత్మ అవుతున్నది. 'యేన ఆత్మవాన్ అన్నమయః' అన్నమయము ప్రాణమయము చేత పూరింపబడుతున్నది. ఈ పూరించడమంటే వ్యాపించిఉండటం. ప్రాణమయము చేత వ్యాపింపబడి దేహము ఆ సకలకర్మలలోనూ ప్రవర్తిస్తుంటుంది. శారీరకకార్యములన్నీ జరిగేటట్లు చేసేది ప్రాణమే. ప్రాణంలేకపోతే దేహంలో కదలిక ఉండదు. శారీరికం కావచ్చు లేక మానసికం కావచ్చు - ప్రాణమే సకలక్రియలకు శక్తినిస్తుంది.

ఈ ప్రాణమయంకూడ కోశమవుతుంది. అది ఆత్మ కూడ. కనుక వాస్తవంగా అది కోశముకాలేదు. కోశములాంటి కోశము. ఆచ్ఛాదనలాంటి ఆచ్ఛాదనము. ప్రాణమయంకూడ ఆత్మ అని అర్థంచేసుకున్నప్పుడు కోశములేదు. కానీ ఆత్మను ప్రాణమయంగా భావిస్తే అదిభ్రమే. అందుచేతనే అది కోశమవుతుంది.

49వ శ్లోకము

నైవాత్మాపి ప్రాణమయో వాయువికారః
గంతాగంతా వాయువదంతర్బహిరేషః ।
యస్మాత్ కిఞ్చిత్ క్వాపి న వేత్తీష్టమనిష్టం
స్వం వాన్యం వా కిఞ్చన నిత్యం పరతంత్రః ॥ 168 ॥

ఏషః ప్రాణమయః - అపి ఈ ప్రాణమయము కూడ; వాయువికారః - వాయు యొక్కపరిణామము; వాయువత్ - వాయువులాగా; అంతః గంతా బహిః ఆగంతా - లోపలికి వెళుతుంది,బయటకి వస్తుంది; యస్మాత్ - ఎందుచేతనైతే; కిఞ్చిత్ క్వాపి - ఏదీ ఎక్కడా; న వేత్తి - తెలియదు; స్వం వా అన్యం వా - తనది కానీ ఇతరులదికానీ; ఇష్టమ్ అనిష్టమ్

- ఇష్టము, అనిష్టము; కిఞ్చన (నవేత్తి) - ఏదీ (తెలియదు); నిత్యం పరతంత్రః - ఎప్పుడు పరతంత్రమే; (తస్మాత్) ఆత్మా న ఏవ - (కనుక) ఆత్మకానేకాదు ?

> "ఈ ప్రాణమయంకూడ, వాయువికారం కనుక మరియు వాయువులాగానే అంతర్బహిర్గమనాగమనములు చేస్తుంటుంది కనుక, ఆత్మ కాజాలదు. ఎక్కడా ఏదీ తెలుసుకోలేదు. తనవిగానీ ఇతరులవిగానీ ఇష్టాయిష్టములను గ్రహించలేదు. ఎప్పటికీ పరతంత్రమే."

వాయువికారమేకనుక ప్రాణమయంకూడ ఆత్మకాదు. వాయవువలెనే వస్తుంది పోతుంది. శ్వాసపీల్చినపుడు లోపలికి పోతుంది. శ్వాసవదిలినపుడు బహిర్గతమవుతుంది. కనుక ఈ శ్వాస చలనాత్మకము. శ్వాసయే జీవనాధారము వెలుపల ఉన్నప్పడది వాయువు. ఊపిరితిత్తులలోనికి వెళ్ళిపుడదే ప్రాణవాయువవుతుంది.

ప్రాణమయము ఆత్మకాకపోవటానికి మరొక కారణమున్నది. అది ఎక్కడా దేనిని తెలుసుకోలేదు. తనకేది వాంఛనీయమో వాంఛనీయంకాదో కూడ తెలుసుకోలేదు. అందుచే తనే కలుషితవాయువునుకూడ పీలుస్తుంది. వాయువు మంచిదా కాదా అన్న విచక్షణ చేయలేదు. లభించిన వాయువును మాత్రం పీలుస్తుంది. ఈశ్వరునిచే ఏర్పరుపబడి, స్వతః జరిగే క్రియ అది. ప్రాణానికి శరీరంనుండి బహిర్గతం కావటానికి కావలసిన ఏర్పాటు తనలోనే చేయబడిఉన్నది. దానిని ఉదానమంటారు. ఉదానమొక గడియారం లాంటిది. ఒకరోజు గడియారం ఆగిపోతుంది. అప్పడు శ్వాస వదలటమే జరుగుతుంది. లోపలికి పీల్చటముండదు.

ప్రాణము తెలుసు కోలేదు. కానీ ప్రాణము తెలుసుకోలేదని నాకు స్పష్టంగా తెలుసు. కనుక ప్రాణమును తెలుసుకునేవాడు (ఆత్మ) వేరేవాడు కావాలి. ప్రాణమయము తనని

తెలుసుకోలేదు; ఇతరమైన దేనినీ తెలుసుకోలేదు. అంతేకాక ప్రాణము ఎప్పటికీ మరోదా నిమీద ఆధారపడే ఉంటుంది. బయటలభించే ఆక్సిజన్ మీద, ఆధారపడి ఉంటుంది. అది పనిచేయటానికి ఆహారం కూడ అవసరమే. ఆహారం లేకపోతే అపానసమానవా యువులకి పనే ఉండదు. ఇంకను ప్రాణాయామంలో ప్రాణమును నియమించవచ్చు.

ఈ స్థూలశరీరాన్ని ఎప్పడు వదిలివేయాలో నిర్ణయించే స్వాతంత్ర్యం ప్రాణానికి లేదు. ప్రారబ్ధకర్మననుభవించటాని కెంతకాలమవసరమో అంత కాలం మానవజీవితకాలమని శాస్త్రం చెప్తుంది. జీవితకాలం మన క్యాలెండర్ ప్రకారం గణించబడదు. మన క్యాలెం డర్ నిత్య జీవితవ్యవహారాల్లో మాత్రమే ఉపయోగిస్తుంది. ఈ క్యాలెండర్లు సూర్యునిఉద యాస్తమయాలపై ఆధారపడిఉంటాయి. కానీ మనకి తెలుసు సూర్యుడు ఉదయించడ ని, అస్తమించడని. ఈశ్వరసృష్టిలో అటువంటి క్యాలెండర్లకు స్థానమే లేదు. అక్కడ శ్వాసలసంఖ్య నాధారంచేసికొని జీవితకాలం గణింపబడుతుంది. నీవు శ్వాసపీల్చి వదిలి నప్పడల్లా ఒక శ్వాసగా గణింపబడుతుంది. ప్రారబ్ధము, అటువంటి శ్వాసలయొక్క ఇం తసంఖ్య అని నిర్ణయింపబడుతుంది. ఉదానము, ఈ సంఖ్యకనుగుణంగా నిర్ణయించబ డింది. కనుక ఈ సంఖ్యను లెక్కపెడుతూ ఉంటుంది. శ్వాసపీల్చి వదిలిన ప్రతిసారి గడి యారం ఒకటి అని కొడుతుంది. సంఖ్య (countdown)తగ్గటం ఆరంబమవుతుంది. ఒకసారి ఉదానం శరీరాన్ని వదలివేస్తే మరణం సంభవిస్తుంది.

ఆత్మ స్వయంప్రకాశము. కానీ ప్రాణము పరప్రకాశ్యము, మరొకరి ద్వారా ప్రకాశింపబ డుతుంది. ఈ కారణంచేత కూడ ప్రాణము ఆత్మ కాజాలడు. నీవిది గ్రహిస్తే, ప్రాణము ప్రాణమయం మాత్రమే అవుతుంది. కానీ ప్రాణమనాత్మగా భావిస్తే, అప్పడది ప్రాణమయ కోశమవుతుంది.

50వ శ్లోకము

జ్ఞానేంద్రియాణి మనశ్చ మనోమయః స్యాత్

కోశో మమాహమితి వస్తువికల్ప హేతుః ।

సంజ్ఞాది భేదకలనా కలితో బలీయాన్

తత్పూర్వకోశమభిపూర్వ విజృమ్భతే యః ॥ 169 ॥

జ్ఞానేంద్రియాణి చ మనః చ జ్ఞానేంద్రియములు మరియు మనస్సు మనోమయః స్యాత్ మనోమయ కోశమవుతుంది; అహమ్ మమ ఇతి నేను నాది అన్న; వస్తు వికల్ప హేతుః వస్తువుల విభజనకు కారణమవుతుంది; సంజ్ఞాది భేదకలనా కలితః నామాదుల ను వేరు పరచే సామర్థ్యము కలిగిఉన్నది. బలీయాన్ బలమైనది; యః ఏదైతే; తత్పూర్వ కోశమ్ అభిపూర్వ పూర్వ కోశమును వ్యాపించి; విజృమ్భతే వ్యక్తమై స్వకార్యములు చేస్తూంటుంది.

జ్ఞానేంద్రియములు, మనస్సు కలిసి మనోమయకోశమవుతుంది. 'నేను' 'నాది' అన్న విభజనకు ఈ కోశము కారణమవుతుంది. నామములను, గుణములను వేరుపరచేసామర్థ్యము కలిగిఉన్నది. అతిశక్తివంతమైనది. తనకంటె పూర్వమైన ప్రాణమయకోశమును వ్యాపించి, వ్యక్తమై తన వ్యాపారాలు చేస్తూఉంటుంది."

పూర్వ శ్లోకంలో వర్ణించబడిన ప్రాణమయము మనోమయమనే మరో ఆత్మచే వ్యాపించ బడిఉంటుంది. ఈ మనోమయము ప్రాణమును శరీరమును కూడ వ్యాపించి ఉంటుంది. జ్ఞానేంద్రియములలోఒకటి - స్పర్శేంద్రియము - శరీరమంతా పైన లోపలకూడ - వ్యాపించి ఉంటుంది. అన్నమయము ప్రాణమయముచే వ్యాప్తమైఉన్నది. ప్రాణమయము మనస్సుచే అంటే మనోమయముచే వ్యాప్తమైఉన్నది.

మనోమయము జ్ఞానేంద్రియములను మనస్సును కలిగిఉంటుంది. జ్ఞానేంద్రియములు ప్రపంచంలోని విషయజ్ఞానం నీకందివ్వటానికి నిర్దేశింపబడినవి. సమిష్టి సూక్ష్మ పంచమహాభూతముల సత్త్వాంశంనుండి అంతఃకరణమేర్పడినది. జ్ఞానేంద్రియములు విడివిడిగా ఆయా భూతముల సత్త్వాంశం నుండి నిర్మితమైనది. సులభంగా అవగతమవటానికై అంతఃకరణమును విజ్ఞానమయకోశమని, మనోమయకోశమని రెండుగా విభజించారు. విజ్ఞానమయకోశమును 'కర్త' అనంటారు. అది నిశ్చయాత్మకవృత్తిరూపము. దానినే బుద్ధివృత్తి అనికూడ అంటారు. వృత్తి సంశయరూపంలో ఉంటే దానిని మనస్సంటారు. కనుక ఒకే అంతఃకరణను వృత్తిస్వభావాన్ననుసరించి, విజ్ఞానమయమని, మనోమయమని విభజించారు.

మనోమయమంటే మనోవికారము (పరిణామము). అదెల్లప్పడూ మారుతూనే ఉంటుంది. అది వికల్పమునకు అంటే - విభజనకు హేతువవుతుంది కనుక కోశమవుతుంది. ఏ రకమైన విభజన ? 'ఇది నాది', 'ఇది నేను' అన్న విభజన. వివిధరకములైన వస్తువుల్ని మనోమయము - "నాది" - "నాది కానిది" అని విభజిస్తుంది. ప్రపంచమంతా ఈశ్వరునికి సంబంధించినదే. కానీ ఒక శరీరంతోనే తాదాత్మ్యంచెందటంచేత మనస్సు ప్రపంచాన్ని "నాది" "నాది కానిది" అని విభజిస్తుంది. కాబట్టి ఈ శరీరంపట్ల 'అహంకారము' 'మమకారము'లు ఉన్నవి. అందుచేతనే "ఈ శరీరము నేను" "నా ఆరోగ్యం బాగుంది." "ఇది నా ఇల్లు" ఈ విధంగా చెప్తుంటావు. సకలప్రాణులు తమ ఉనికిని ఆత్మయందే కలిగిఉన్నవి. కానీ మనోమయంమూలంగా ఆ విషయం అర్థంకాదు. మనస్సు ఒక శరీరంతో మాత్రమే తాదాత్మ్యం చెందుతుంది.ఆ కారణంచేత దేహధర్మాలు ఆత్మపైన ఆరోపించబడతాయి. అందుచేత అది కోశమవుతుంది.

శరీరానికి కాని - ప్రాణానికి కాని - "అహం బుద్ధి" "నేను అన్నభావన" లేదు. కానీ మనోమయంలో "అహంబుద్ధి" ఇది నేను అన్నభావన" ఉన్నది.

సమస్తవిధములైన అధ్యాసలకు మనస్సేకారణం, మనోమయము అనేక ధర్మాలు కలిగి ఉన్నది. ఏమిటవి ? సంజ్ఞాదిభేదకలనాకలితః - నామరూపాల విషయంలో భేదబావం కలిగిఉన్నది. మనస్సు లేకపోతే ఒక విషయాన్నుండి మరోవిషయాన్ని వేరుగా గుర్తించటం సాధ్యంకాదు. మనస్సులో గుర్తింపుకలిగితేనే ఏవిషయమైనా తెలుస్తుంది. ఈ గుర్తింపు నిజానికి విజ్ఞానమయ కోశంలోనే కలుగుతుంది. కానీ గుర్తించటానికి (తెలుసుకోటానికి) కావలసినవిధానమంతా మనోమయకోశమే ఏర్పడుతుంది. ప్రపంచమంతా మనస్సుద్వారానే ప్రవేశిస్తుంది. మనస్సు వస్తువుల్ని విషయీకరిస్తూ పోతుంది. జ్ఞానేంద్రియాలు వస్తువులగురించిన సమాచారాన్నందిస్తాయి. మనస్సు విషయాలకనుగుణంగా మారుతుంది. మనస్సులో కలిగే ఆ మార్పునే వృత్తి, ఆలోచన లేక ప్రత్యయము అనంటారు. మనసు నీవు గుర్తిస్తున్న విషయాన్ని వ్యాపించి ఆ విషయాకారాన్ని పొందుతుంది. దీనిని 'వృత్తివ్యాప్తి' అనంటారు. ఈ వృత్తిలో ఉన్నవిషయాన్ని మాత్రమే నీవు చూడగలవు - గుర్తించగలవు. కనుక, విషయము తాడైనప్పడు నీవృత్తిలో కూడ తాడు ఆకారమే ఏర్పడితే అప్పడు బాహ్యంలో ఉన్న తాడునే చూస్తావు. అలాకాక నీ వృత్తిలో పాము విషయమైతే, బాహ్యంలో తాడుఉన్నప్పటికి, నీవు చూచేది పామునే గాని తాడుని కాదు. కాబట్టి నీవేమిచూచినా, ఎక్కడ చూచినా, నీవుచూచేది నీ మనసులో ఉన్నదానిని మాత్రమే. నీ మనసులో (వృత్తిలో) ఉన్నవస్తువు యథాతథంగా బాహ్యంలో ఉన్న వస్తువుకావచ్చు లేక తద్భిన్నం కావచ్చు. కనుక మనస్సే, "ఇది ఘటము" "ఇది వృక్షము" ఆదిగాగల ద్వైవదృష్టికి భేదదృష్టికి కారణము.

మనస్సు అతితీవ్రంగా కదుల్తుంది. అది ఒక సినిమా కెమెరా లాంటిది. ప్రతివృత్తి సిని మాప్రొజెక్టరులోని ఒకొక్కక్క ఫిల్మ్ దృశ్యములాంటిది. ప్రొజెక్టర్లోని ఫిల్మ్రీల్ లాగానే వృత్తులన్నీ ఎప్పడూ కదుల్తూనే ఉంటాయి. నీవు ఒకే సమయంలో ఒకేచోట మనోఫల కంమీద ఒక దృశ్యాన్నే చూస్తావుగాని దృశ్యచలనాన్ని పూర్తిగా చూడలేవు.

మనస్సు చాలా శక్తివంతమైనది. అది శరీరాన్ని కదిలిస్తుంది. పర్వతాల్ని కూడ కదిలిం చగలదు. నీ వేవిషయంగురించి ఆలోచించటం ఇష్టపడవో, అదేవిషయం గురించి మనస్సు ఆలోచిస్తుంది. కనుక మనస్సువిషయంలో నియమాలు పనిచేయవు. నీవు నియమాలు పెట్టుకుంటే కష్టాలపాలవుతావు. పాలించేది మనస్సేగాని, నియమాలు కావు. కాబట్టి మనస్సుని ఎలా ఉన్నదాన్ని అలా ఉండనియ్యి - కోరినప్పడు నీవద్దఉండి నీమాట విన్నంతకాలము ఫరవాలేదు. మనస్సుతో వ్యవహరించటమన్నది, ఈ రోజుల్లో ఉద్యోగస్థులతో నిర్వాహకవర్గంవారు వ్యవహరించటంలాంటిది. ఆధునికంలో నిర్వాహకు లు పనిచేసేవారివ్యక్తిగత విషయాలజోలికి వెళ్ళరు. వారిజీవితాలను నియమించే ప్రయ త్నం చేయరు. వారు కోరేదల్లా పనివేళల్లో ఉద్యోగస్థులు వారి వారి పనులు సక్రమంగా చేయాలి. అదేవిధంగా మనస్సుతో వ్యవహరించాలి. నీవు కోరినప్పడు మనస్సు నీవద్ద ఉంటె చాలు; అదే సరైన ఒప్పందం.

ప్రతి ఒక్కభావావేశము (emotion) ఒక వృత్తియేకనుక- అన్నిరకాలభావావేశములు మనోమయానికే చెందుతాయి. భావావేశములన్నీ శక్తివంతమైనవే. వివేకజ్ఞానంతో పరి శీలించి-భావావేశంలో ఉన్న దోషాన్ని గమనించినాకూడ- అది ఏర్పడుతూనే ఉంటుంది. విచారమటువంటి భావావేశం. బుద్ధిపూర్వకంగా విచారిస్తూ కూర్చోవాలని నీవు కోరుకో వు- కానీ విచారగ్రస్తుడవవుతావు. కోపంవల్ల సాధించేదేమీ ఉండదని నీకు తెలుసు.

అది నిష్ప్రయోజనము- హానికరము అని కూడ తెలుసు. ఐనా క్రోధం నిన్నావేశించటం చూస్తావు. కనుకనే భావావేశం ఇచ్ఛాసంకల్పంకంటె శక్తివంతమైనది.

విజ్ఞానమయము, మనోమయము రెండూ అంతఃకరణమే. కానీ మనోమయము కరణము - విజ్ఞానమయము కర్త, కర్తకనుక విజ్ఞానమయము అధికశక్తివంతమై ఉండాలి. కానీ మనస్సు - బుద్ధికంటె అంటే - ఇచ్ఛాసంకల్పంకంటె - బలవత్తరమైనదిగా ఉంటున్నది. మనస్సు కరణమైనప్పటికీ- అదే కర్తగా అయి- విజ్ఞానమయాన్ని ఆక్రమించి వ్యవహరిస్తుంది. అందుచేత అతిశక్తివంతమైనది.

51వ శ్లోకము

మనోమయో నాపి భవేత్ పరాత్మా
హ్యాద్యంతవత్త్వాత్ పరిణామిభావాత్ ।
దుఃఖాత్మకత్వాత్ విషయత్వహేతోః
ద్రష్టా హి దృశ్యాత్మతయా స దృష్టః ॥ 185 ॥

హి - ఎందు చేతనైతే; ఆద్యంతవత్వాత్ - ఆద్యంతములు కలదికనుక, దుఃఖాత్మకత్వాత్ - దుఃఖాత్మకముకనుక; విషయత్వహేతోః - జ్ఞేయ విషయమైనకారణముచేత; మనోమయః అపి - మనోమయముకూడ; పరాత్మా న భవేత్ - పరాత్మ కానేరదు; ద్రష్టా దృశ్యాత్మతయా - ద్రష్ట దృశ్యముగాకావటం; నహి దృష్టః - ఎప్పడూ చూడ బడలేదు.

"ఆద్యంతములు కలిగిఉన్నదికనుక - మారిపోతూంటుంది కనుక, - దుఃఖాత్మకంకనుక - జ్ఞేయవిషయముకనుక మనోమయమెన్నటికి పరమాత్మకాజాలదు, ద్రష్ట దృశ్యము కావటమెప్పడు చూడలేదు."

మనోమయమెప్పటికి నరాత్మకాలేదు, ఎందుచేత ? పరిణామంచెందుతుంటుంది కనుక- ఆమార్పులు నీకు తెలుస్తాయి కనుక - నీ మనస్సెప్పడు మారిపోతుంటుందని నీ కు తెలుసు. ప్రతివృత్తి క్షణికమే.

మనోమయము ఆత్మ అయితే వృత్తివెళ్ళిపోయినపుడు నీవుండవు ! కానీ నీకు తెలుసు వృత్తివెళ్ళిపోయినా నీవున్నావని, కాబట్టి మనోమయము నిజమైన ఆత్మ - ప్రత్యగాత్మకాదని చెప్పాల్సి వస్తుంది. ఈ ప్రత్యగాత్మనే ఈశ్వరునికంటె భిన్నంగాదని - ప్రత్యగాత్మయే బ్రహ్మ మని శాస్త్రం తరువాత బోధిస్తుంది. ప్రతి పరిణామానికి ఆది, అంతములుంటాయి. కాబట్టి పరిణామానికి లోనయే మనోమయము పరాత్మకాలేదు.

మనోమయానికి దుఃఖాత్మకత్వమున్నది. దుఃఖమే స్వరూపంగా కలిగిఉన్నది. కానీ అప్పడప్పడు మనస్సు నాకు ఆనందాన్ని కలుగజేస్తుంది ! మరి దుఃఖమే దాని స్వరూప ము ఎలా అనగలం ? ఆ సుఖము ఆనందమయానికి చెందినది. మనోమయానిది కా దు. అందుచేత మనోమయమును దుఃఖాత్మకమంటారు.

మనోమయము దృశ్యము - విషయము. నీ మనస్సులో ఏం జరుగుతుందో నీకు తెలుస్తుంది. నీవు చూస్తావు. చూచేవాడు ఎప్పటికి చూడబడేవిషయంకాదు. మనో మయము ఆత్మ అయితే, అది ద్రష్టకావాలి. ద్రష్టని విషయీకరించటం సాధ్యంకాదు. అది ద్రష్టఅయితే ప్రతిదాన్ని చూడగలగాలి. కానీ మనస్సులో జరిగేదంతా నేను చూస్తుం టాను, కనుక అది దృశ్యమే కాని ద్రష్టకాలేదు. ఆత్మయే ద్రష్టకావాలి. కాబట్టి మనోమ యము ఆత్మ కాజాలదు; అది అనాత్మమాత్రమే.

52వ శ్లోకము

బుద్ధిర్బుద్ధీంద్రియైః సార్ధం సవృత్తిః కర్తృలక్షణః
విజ్ఞానమయకోశః స్యాత్ పుంసః సంసారకారణమ్ ॥ 186 ॥

బుద్ధీంద్రియైః సార్థం జ్ఞానేంద్రియములతో కలిసి; సవృత్తిః వృత్తులతో సహా; కర్తృలక్షణః బుద్ధిః కర్తృ స్వభావము కలిగినటువంటి బుద్ధి; విజ్ఞానమయకోశః స్యాత్ విజ్ఞానమయ కోశమవుతుంది; పుంసః వ్యక్తికి (జీవునికి), సంసారకారణమ్ సంసార కారణమతున్నది.

> "బుద్ధి తనవృత్తులతోను, జ్ఞానేంద్రియములతో కూడి విజ్ఞానమయ కోశమవుతున్నది. కర్తృస్వభావము - పురుషునికి సంసార కారణమగుచున్నది."

శరీరము అన్ని అనుభవాలు పొందటానికి నిర్దేశింపబడిన స్థానము. కౌంటర్ లాంటి ది. జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు, ప్రాణము, మనస్సు - ఇవన్నీ వివిధఅనుభవాలు సంపాదించటానికివ్వబడిన సాధనములు. అనుభవములు పొందేస్థానముకరణములు కూడ విజ్ఞానమయకోశంకొరకు ఏర్పరుపబడినవి. శాస్త్రము సాధారణంగా విజ్ఞానమ యమన్నపదము కర్తను తెలుపుటకు, ఆనందమయమన్న పదము భోక్తను తెలుపుటకు ఉపయోగిస్తుంది. కానీ ఈ సందర్భంలో విజ్ఞానమయశబ్దము కర్త, భోక్త - రెంటిని తెలు పుటకు వాడబడింది. ఇక్కడ తాదాత్మ్యము 'అహంవృత్తి'తో కనుక - విజ్ఞానమయము అహంవృత్తి విషయము. అహంవృత్తివిషయంగనుక అది ప్రమాత, జ్ఞాతకూడా అవుతున్న ది. ఇతరమైనదంతా, నాకంటె భిన్నమైన, ఇదంవృత్తి విషయమవుతుంది. అందుచేత స మస్త ప్రపంచము ఇదంవృత్తి విషయమవుతుంది.

తైత్తిరీయోపనిషత్తు చెప్తుంది - 'విజ్ఞానం యజ్ఞం తనుతే, కర్మాణి తనుతే పి చ' - విజ్ఞా నమయమే వైదికకర్మలు, లౌకికకర్మలు నిర్వర్తిస్తుందని". అగ్ని హోత్రాదివైదికకర్మలు పూ ర్తిగా ధార్మికకర్మలు మాత్రమే, స్నానము, అన్నపానాదులన్నీ లౌకిక కర్మలు, విజ్ఞానమయ

మీ కర్మలన్నీ నిర్వర్తించి వాటిఫలముల ననుభవిస్తుంది. కాబట్టి సంకీర్ణమైన మానవజీవితం మొత్తం విజ్ఞానమయంపైనే కేంద్రీకృతమై ఉన్నది.

కానీ ఎవరీ విజ్ఞానమయము?అది జ్ఞానేంద్రియములతో కూడి ఉన్న బుద్ధి అని శాస్త్రం చెప్తుంది. నిశ్చయాత్మక అంతఃకరణవృత్తులను బుద్ధి అనంటారు. ప్రత్యక్షజ్ఞానాన్నందించే జ్ఞానేంద్రియములు మనోమయము, విజ్ఞానమయము రెండింటిలోనూ ఉన్నవి. మనస్సు సంశయాత్మకంగా ఉన్నా లేక నిశ్చయజ్ఞానం పొందినా - జ్ఞానేంద్రియములుపనిచేస్తాయి. విజ్ఞానమయము కర్త, మనోమయము కరణము, కర్త కరణము నుపయోగిస్తాడు. కనుక కర్త కరణము కంటె ఆంతరంగా ఉంటుంది. అంటే విజ్ఞానమయము మనోమయం కంటె ఆంతరంగా ఉంటుంది. ఒకదాని కంటె లోపలగా మరొకటి అన్న భౌతికదృష్టితో కాక, ఆయా సందర్భాన్ని బట్టి విజ్ఞానమయము ఆంతరమని చెప్తారు.

నిన్ను నీవు కర్తవని, దుఖివని అనుకుంటావు కాబట్టి, విజ్ఞానమయము కోశమవుతుంది. ఆత్మ కర్తగా భావించబడుతుంది కాబట్టి, విజ్ఞానమయము కోశమవుతుంది. వృత్తితోకూడి ఉన్నది విజ్ఞానమయము. అది వృత్తిరహితమైన ఆత్మ వంటిది కాదు. విజ్ఞానమయమంటే అహం వృత్తి ఉంటుంది. అంతేకాక అది కర్తృలక్షణంకూడ. కర్త అంటే చేసేవాడనే అర్థంమాత్రమే కాదు, ద్రష్ట, శ్రోతా, జ్ఞాతా మొ॥ వాటిని కూడ సూచిస్తుంది. ఇది విజ్ఞానమయము. అది కోశముకూడ. అదేం చేస్తుంది ? అది మానవుని సంసారానికి కారణమవుతుంది. విజ్ఞానమయము మానవుణ్ణి శాశ్వతంగా సంసారంలో ఉంచగలదు - లేదా విముక్తుణ్ణి చేయగలదు. సంసారం అవిచ్ఛినంగా కొనసాగటానికి, దాని నివృత్తికి కూడ కారణమవుతుంది.

విజ్ఞానమయము కర్తకనుక సంసారాన్ని కలిగించే దుష్టుడు. అతడికే తత్త్వమసి మహావాక్య ఉపదేశం జరుగుతుంది. మనోమయము కేవలం కరణమే కనుక, ఉపదేశం దా

నికి కాదు. ఉపదేశం, బాహ్యంనుండి రావాలి. విజ్ఞానమయం తనకుతానే "నేను బ్రహ్మము" అని తెలుసుకోలేదు. తనకు తాను గుర్తించాలని ప్రయత్నించినంతకాలము అది కోశంగానే కొనసాగుతుంది. తనకంటె బాహ్యనుండి ప్రమాణం వచ్చి ఈ కర్తను పరిష్కరించాలి.

53వ శ్లోకము

అనువ్రజచ్చిత్ప్రతిబింబశక్తిః
విజ్ఞానసంజ్ఞః ప్రకృతేర్వికారః ।
జ్ఞానక్రియావాన్ అహమిత్యజస్రం
దేహేంద్రియాదిష్వభిమన్యతే భృశమ్ ॥ 187 ॥

విజ్ఞాన సంజ్ఞః వ విజ్ఞానమయమనబడే ఈ కోశము; అను వ్రజత్ చిత్ ప్రతిబింబ శక్తిః వ చైతన్య ప్రతిబింబము ప్రవేశించటం వలన శక్తి కలదై ఉంటుంది; ప్రకృతేః వికారః వ ప్రకృతి యొక్క పరిణామము; జ్ఞాన క్రియావాన్ వ జ్ఞాన క్రియాశక్తులు కలిగి ఉంటుంది; అజస్రం వ ఎల్లప్పడు; దేహేంద్రియాదిషు వ దేహేంద్రియాదులతో; అహమ్ ఇతి వ 'నేను' అని; భృశమ్ అభిమన్యతే వ దృఢంగా తాదాత్మ్యం చెంది ఉంటుంది.

"విజ్ఞానమనబడే కోశము - చైతన్యము తనలో ప్రతిబింబించటంవలన - ప్రకాశింపజేసే శక్తినికల్గి ఉంటుంది. అది ప్రకృతియొక్క వికారము, జ్ఞానక్రియాశక్తి కలిగి ఉంటుంది. ఎల్లప్పడూ దేహము, జ్ఞానేంద్రియములతో 'నేను' అని తాదాత్మ్యం చెందియే ఉంటుంది."

విజ్ఞానమయమునకు ప్రతివిషయము తెలుసు, చైతన్యము ప్రతిబింబించటంవలన - లభించినశక్తివలన ప్రతిదానిని ప్రకాశింప జేయగలుగుతుంది. విజ్ఞానమయంలో చైత న్యము ప్రవేశించినట్లుగా ఉంటుంది. వాస్తవంగా ప్రవేశము లేదు. అదావిధంగా ఎందు కుందంటే విజ్ఞానమయము ఒక వృత్తి. ప్రతివృత్తి చైతన్యాన్ని ప్రతిబింబిస్తుంది. కాబట్టి అహంవృత్తి చైతన్యవంతమైనది. ఇదంవృత్తిలో కూడ చైతన్యముంటుంది.

అంతఃకరణమంతటిలో ఉంటుంది. ఈ విజ్ఞానమయము ఇదంవృత్తిలోని విషయాన్ని చూచి" ఇది నాకంటె భిన్నమ"ని అంటుంది. ఎందుచేతనంటే విజ్ఞానమయము ఒక దేహేంద్రియమనోబుద్ధుల సంఘాతముతో మాత్రమే తాదాత్మ్యం చెందుతుంది. కనుక మరొకచోటునుండి అరువు తెచ్చుకొన్నదే అయినా - దానికి కూడ చిత్‌శక్తి ఉన్నది. దాని కి విజ్ఞానమనే పేరు ఉన్నది.విజ్ఞానసంజ్ఞః ఇక్కడ విజ్ఞానము కర్తయేగాని కరణము గాదు. విజ్ఞానమయము ప్రకృతి లేక అవిద్యయొక్క వికారరూపమే. అంతఃకరణలోని అన్నివృత్తు లలోను విజ్ఞానమయవృత్తియే అత్యంత ప్రధానమైనది. ఇంకను జ్ఞానాన్ని పొందటమన్న క్రియను చేస్తుంది. అతడే అన్ని ప్రమాణములనుపయోగించి జ్ఞానాన్ని పొందే ప్రమాత. వివిధరకములైన పనులను నిర్వర్తించేదతడే. అంతేకాక దేహేంద్రియమనస్సులకంటె వే రుగా ఉండకుండా వాటితో తాదాత్మ్యంచెంది ఉంటాడు. దేహేంద్రియమనస్సులపట్ల అహం అన్నభావనతో ఉంటాడు. అందుచేతనే శరీరం వెళుతున్నప్పడు, "నేను వెళుతున్నా న"ని అంటాడు. ఆ "నేను వెళుతున్నాను" అనేది సత్యమవుతుందతడికి. కాబట్టి విజ్ఞాన మయము స్థూలశరీరధర్మాలన్నీ తనవిగా భావిస్తుంది. శరీరేంద్రియమనోధర్మములన్నిటి నీ ఆత్మమీద ఆరోపిస్తారు. సత్యఆత్మను తెలుసుకునేవరకు విజ్ఞానమయమునే ఆత్మగా ఆరోపించి చూస్తారు. ఈ తాదాత్మ్యంయొక్క తీవ్రత ఎటువంటిది ? అది పూర్తిగా ఉం టుంది. ఈ తాదాత్మ్యం ఎంతసమగ్రంగా ఉంటుందటే, "నేను భ్రమపడిఉండవచ్చ"న్న సం

శయానికే తావివ్వదు. అందుచేతనే ఎవరికైనా "ఆత్మ విజ్ఞానమయంకంటె భిన్నమైనది; ఆత్మ తెలుసుకోవలసిన సిద్ధవిషయమేకాని పొందవలసిన సాధ్యవిషయము కాద"న్న సత్యాన్ని గుర్తించేట్లుచేయటం చాలాకష్టం. ఈశ్వరానుగ్రహమే ఈ వాక్యాల్ని వినేట్లు చేస్తుంది. ఈశ్వరానుగ్రహం పొందనంతవరకు విజ్ఞానమయమును అతిక్రమించటం జరగదు.

ఈ విజ్ఞానమయమెప్పుడేర్పడినది ? ఏవిధంగా పనిచేస్తుంది ? ఈ విషయాన్ని తరువాత రెండు శ్లోకములు వివరిస్తాయి.

54వ శ్లోకము

అనాదికాలోఽయమహంస్వభావః
జీవస్సమస్తవ్యవహారవోఢా ।
కరోతి కర్మాణ్యపి పూర్వవాసనః
పుణ్యాన్యపుణ్యాని చ తత్ఫలాని ॥ 188 ॥

అయమ్ - ఈ విజ్ఞానమయము; అనాదికాలః - ఆదిలేనిది; అహంస్వభావః - నేను అన్న భావన కలిగిఉన్నది; సమస్త వ్యవహారవోఢా జీవః - అదే సమస్త వ్యవహారములు నడిపే జీవుడు; పూర్వవాసనః - పూర్వ కర్మార్జిత వాసనలు కలిగి ఉంటాడు. పుణ్యా పుణ్యాని - పుణ్యా పుణ్యమైన; కర్మాణి అపి కరోతి - కర్మలను చేస్తూనే ఉంటాడు; తత్ఫలాని చ - వాటి ఫలితాలను;

55వ శ్లోకము

భుఙ్క్తే విచిత్రాస్వపి యోనిషు వ్రజన్
ఆయాతి నిర్యాత్యధ ఊర్ధ్వమేషః ।
అస్యైవ విజ్ఞానమయస్య జాగ్రత్

స్వప్నాద్యవస్థా సుఖదుఃఖ భోగః ॥ 189 ॥

విచాత్రాసు అపి యోనిషు వ్రజన్ భుఙ్క్తే - వివిధ శరీరములలోకి వెళుతూ అను భవిస్తుంటాడు; ఏషః - ఈ విజ్ఞానమయుడే; అధః ఊర్ధ్వం - అధోలోకములకు, ఊర్ధ్వలోకములకు; ఆయాతి నిర్యాతి - వస్తూఉంటాడు, పోతూ ఉంటాడు; అస్య ఏవ విజ్ఞానమయస్య - ఈ విజ్ఞానమయునికే; జాగ్రత్ స్వప్నాది అవస్థాః - జాగ్రత్, స్వప్న మొ॥అవస్థలు; సుఖ దుఃఖభోగః - సుఖ దుఃఖ భోగములు కూడ.

"దేహములతో తాదాత్మ్యం చెందిన 'అహం' అన్న భావన ఉన్నది. ఈ విజ్ఞానమయముకు ఆదిలేదు; అదే సమస్తవ్యవహారములను నడిపే జీవుడు పూర్వకర్మార్జితవాసనలు కలిగిఉంటాడు. వాటి కనుగుణంగా పుణ్యాపుణ్యకర్మలనాచరిస్తూ, తత్ఫలితాలను వివిధశరీరాలలో అనుభవిస్తుంటాడు. వివిధ రకముల జన్మలనెత్తుతూ అధోలోకాలలోను ఊర్ధ్వలోకాలలోను, తిరుగుతుంటాడు. ఈ విజ్ఞానమయమునకే జాగ్రత్ స్వప్నసుషుప్తులనే అవస్థాత్రయము, సుఖదుఃఖముల అనుభవాలు ఉంటాయి.

ఈ విజ్ఞానమయాని కాది నిర్ణయించటం సాధ్యంకాదు. మరి విజ్ఞానమయమొక కార్యము - ఉత్పన్నమైనది; కార్యానికి ఆది అంటూ ఉండాలి ? అవును, విజ్ఞానమయము కార్యమన్నది నిజమే. శాస్త్రప్రకారము విజ్ఞానమయమొకశరీరాన్ని విడిచి మరొక శరీరాన్ని గ్రహిస్తుంది.

విజ్ఞానమయమునకు కారణమైన అజ్ఞానానికి ఆదిలేదు. కనుక విజ్ఞానమయానికి కూడ ఆదిలేదు. గతంలో అనేక యోనుల్లో జన్మిస్తూ ఉన్నాడు. మోక్షంపొందేవరకు అలాజన్మిస్తూనే ఉంటాడు.

సృష్టికి పూర్వం అన్నింటి లాగనే విజ్ఞానమయం కూడ అవ్యక్తంగా ఉంటుంది. నూతన సృష్టి ఆరంభమైనపుడు అతడుకూడ వ్యక్తమవుతాడు. అతడికి ఫలీభూతమై వ్యక్తంకావ టానికనేక కర్మలు సిద్ధంగా ఉంటాయి. అవి వ్యక్తంకావటానికి కర్మఫలములననుభవిం చటానికి ఈశ్వరుడు జగత్తును సృష్టించాలి. ఈ విజ్ఞానమయుడు సామాన్యుడుకాదు. భగవానుడికే పనిపెడతాడు! ఒకదేహంతో తాదాత్మ్యంచెందిఉన్న విజ్ఞానమయుని కర్మలు సుషుప్తిలో అవ్యక్తంగా ఉంటాయి. ఈ కర్మలు వ్యక్తంకావాలి, అందుకొరకే జీవుడు మేల్కొంటాడు. అలాకాకపోతే నిద్రనుండి మేల్కోవాలనే కోరికే ఉండదు. తన స్వీయక ర్మల ఫలాలనుభవించాలనే కోరికయే విజ్ఞానమయుణ్ణి మేలుకునేట్లుచేస్తుంది. విజ్ఞానమయము అహం స్వభావం కలిగి ఉంటుంది. స్వభావమంటే ఇక్కడ అభిమాన ము. ఆవిధంగా అతడు ఈ దేహాదులయందు అభిమానము అంటే తాదాత్మ్యమున్నవా డు. ఈ అహంస్వభావంలో మమత్వంకూడ ఇమిడి ఉంటుంది.

విజ్ఞానమయుడే భారము వహించేవాడు, అంతేకాక ఈ విజ్ఞానమయుడు సమస్తవ్యవ హారములను నడిపేవాడు. వివిధరకాలపనులు చేస్తూఉంటాడు. కనుక అతడికే అన్ని ముడుతలు ఉంటాయి. ఈ ముఖం భావించదు "నాకు ముడత లేర్పడినాయే !" అని. కానీ విజ్ఞానమయునికే అన్ని ముడతలు కూడ. అన్ని వ్యవహారాలు అతడే వహిస్తాడు కనుక, నిజానికతడు ముడుచుకుపోతాడు. అందుచేతనే అతడిని భారములను వహించేవాడు అంటారు. కర్మలనే భారాన్ని వహిస్తాడు.

భారాన్ని వహించే పోర్టర్ కనుక రకరకాల కర్మలు చేస్తుంటాడు. కొన్ని పుణ్యకర్మలు, కొన్ని అపుణ్య అంటే పాపకర్మలు చేస్తుంటాడు. శాస్త్రవిధులననుసరించి ఉండేవాటిని పు ణ్యకర్మలంటారు. శాస్త్రం నిషేధించిన కర్మలను పాపకర్మలంటారు. శాస్త్రము " ఈ కర్మ చేయవద్దు" అని శాసిస్తుంది. కానీ తనకున్న సమస్యల ఒత్తిడివలన ఆ కర్మ చేస్తాడు.

పాపాన్ని పొందుతాడు. కానీ ఈ కర్మలన్నీ అతడెందుకుచేయాలి ? అపి పూర్వవాసం నః - 'అపి' పదం 'అను' గా గ్రహించవచ్చు. అప్పడు 'అనుపూర్వవాసనః' - అంటే పూర్వపూర్వ కర్మలు ముద్రితమైనవాడు అని అర్థం. పూర్వకర్మలంటే ఈ జన్మలో పూర్వం ఆచరించిన కర్మలుకావచ్చు లేక పూర్వజన్మలలో చేసినవి కావచ్చు.

ఈ విజ్ఞానమయుడు వివిధకర్మలనాచరిస్తూ వాటిఫలములను సుఖదుఃఖరూపములలో అనుభవిస్తుంటాడు. ఆ ఫలముఉ ననుభివించటానికతడికి భోగాయతనము - స్థూలశరీరము, భోగసాధనము - సూక్ష్మశరీరం రెండూ కావాలి. అంతేకాక భోగభూమి - ఈ అనుభవాల నన్నింటిని పొందటానికవసరమైన ఏర్పాట్లతో స్థానముకూడ కావాలి. భోగభూములే స్వర్గాది లోకములు. జీవుడు తనకర్మల ఫలముల ననుభవించటానికి తగిన స్థూలసూక్ష్మ శరీరములతో ఆవిర్భవించే లోకములే భోగభూములు. జీవుడు కర్మ ఫలములనన్నింటినీ ఒకశరీరంలో అనుభవించలేడు. ఒక శరీరమునుండి మరొక దానికి వెడుతూ ఫలముల ననుభవిస్తాడు. ఒకవేళ కాలపరిస్థితులలో ఒక తల్లిదండ్రులద్వారా ఒక దేహాన్ని పొంది కొన్ని పాపపుణ్యకర్మఫలముల ననుభవిస్తాడు. కర్మ ఇచ్చే ఫలాన్ననుభవించటానికి కావలసినవన్నీ తగినవిధంగా కూర్చబడతాయి. ఒక శరీరాన్నిచ్చేముందు అసంఖ్యాకమైన అంశాలు పరిగణనలోకి తీసుకోబడతాయి. ఇదంతా భగవానుని సంకల్పమాత్రంచేత సునాయాసంగా నెరవేర్చబడుతుంది. తన సన్నిధిమాత్రంచేతనే - అతడంతటిని నడుపుతుంటాడు. పరమేశ్వరుడు తాను సృష్టించిన నియతి ద్వారానే - సమస్త జగత్తును నిర్వహిస్తుంటాడు. ఆ విధంగా విజ్ఞానమయుడు వివిధశరీరాలలో తన కర్మఫలముల ననుభవిస్తుంటాడు.

ఈ విజ్ఞానమయుడొక ప్రయాణీకుడు. వస్తూపోతూ ఉంటాడు - ఆయాతి నిర్యాతి. ఒక జన్మనుండి మరోజన్మకు - ఒక స్థానంనుండి మరోస్థానానికి తిరుగుతూనే ఉంటాడు. పుణ్యకర్మల ఫలముల ననుభవించటానికి స్వర్గాది ఊర్ధ్వలోకాలకు వెళతాడు, పాపకర్మల ఫలముల ననుభవించాటానికి నరకాది అధోలోకాలకు పోతుంటాడు.

వివిధ అనుభవాలు, అవస్థలు ఈవిజ్ఞానమయునికే, జాగ్రదవస్థల ననుభవించేదతడే. ఆ విజ్ఞానమయుడే స్వప్నావస్థలో అనేకానుభవాలను పొందుతాడు. తిరిగి అతడే సుషుప్తి ననుభవిస్తాడు. ఎందుకంటే అతడే నిద్రనుండి మేల్కాంచిన తరువాత నేను చక్కగా నిద్రపోయానని చెప్తాడు కనుక. ఈ మూడు అవస్థలు ఆత్మకు కావు. ఆత్మ అవస్థలన్నిటికి అధిష్టానము, సాక్షికూడ. ఆత్మకు ఈమూడు అవస్థలులేవు - కానీ ఆత్మలేకపోతే ఏ అనుభవము సాధ్యపడదు. విజ్ఞానమయుడే ఈ అవస్థలనన్నిటిని తనవిగా భావిస్తాడు. సుఖదుఃఖానుభవాలు కూడ ఈ విజ్ఞానమయునికే చెందుతాయి. సర్వకర్మలు ఆచరించే దతడే. అతడే కర్త, కనుక భోక్తకూడ అతడే - అస్య ఏవ సుఖదుఃఖభోగః, సుఖానుభవము ఆనందమయానికి చెందినదని వేరుగా గణించినప్పటికీ, విజ్ఞానమయుడే భోక్తకూడ.

## 56వ శ్లోకము

అతోనాయం పరాత్మా స్యాద్విజ్ఞానమయశబ్దతః ।
వికారిత్వా జ్జడత్వాచ్చ పరిచ్ఛిన్నత్వ హేతుతః ।
దృశ్యత్వాద్ వ్యభిచారిత్వాద్ నానిత్యో నిత్య ఇష్యతే ॥ 208

అతః - కాబట్టి; విజ్ఞానమయ శబ్దతః - విజ్ఞానమయశబ్దము చేత తెలియబడేవాడు; వి

కారి త్వాత్ - మారి పోతుంటాడు కనుక; జడత్వాత్ - జడము కనుక; పరిచ్ఛిన్నత్వ హేతు తః - పరిచ్ఛిన్నమైన కారణము చేత; దృశ్యత్వాత్ - దృశ్యము కనుక; వ్యభిచారిత్వాత్ - అస్థిరము కనుక; పరాత్మా న స్యాత్ - పరమాత్మ కాజాలడు; అనిత్యః నిత్యః న ఇష్యతే - అనిత్యము నిత్యముగా భావింపబడలేదు.

"ఈ విజ్ఞానమయమన్న పేరు గలిగినవాడు, పరిణామి కనుక -
స్వయంప్రకాశముకాడు (జడము) కనుక - పరిచ్ఛిన్నముకనుక-
దృశ్యము (తెలియబడుతుంది) కనుక - అస్థిరము కనుక -
పరమాత్మకాజాలడు. అనిత్యము నిత్యముగా భావింపబడలేదు."

తరువాత వివరించబోయే కారణమువలన విజ్ఞానమయుడని పిలువబడేవాడు పరాత్మకాజాలడు. ప్రతివారి 'అహంకారము' విజ్ఞానమయుడు - కానీ విజ్ఞానమయుడు పరాత్మకాదు. శాస్త్రమిక్కడ విజ్ఞానమయము పరాత్మ ఎందుకుకాడో అనేక కారణాలను విశదపరుస్తుంది.

విజ్ఞానమయుడెల్లప్పడు మార్పుజెందుతూనే ఉంటాడు. ఒకప్పడు ద్రష్ట, మరొకప్పడు శ్రోతా, మంతా, కర్తా, మరొకప్పడు భోక్త, కనుక వికారి, వికారిత్వమంటే జన్మనాశత్వము, ఆద్యంతములకు లోనుకావటము.

విజ్ఞానమయము జడము, అంటే స్వప్రకాశముకాదు తనకు తానుగా తెలియదు. ఇంతకుపూర్వం ప్రతిబింబించిన చైతన్యాన్ని కలిగిఉంటాడని తెలుపబడింది. కనుక వస్తువులను ప్రకాశింపజేసినప్పటికి - తెలుసుకున్నప్పటికి, ఆ ప్రకాశము ఆత్మనుండి సంక్రమించినదే, తానుగా స్వప్రకాశముకాదు.

విజ్ఞానమయము పరిచ్ఛిన్నము, సర్వవ్యాపికాదు. ఒక్క శరీరంలోకి తాదాత్మ్యం చెందిం దికనుక పరిమితమైన వ్యాపకత్వ ముంటుంది. దేశతః పరిచ్ఛిన్నుడు - ఇతరమైన ప్రతి దానికంటె భిన్నమైనవాడు. కానీ ఆత్మ - దేశతః- కాలతః- వస్తుతః పరిచ్ఛిన్నముకాదు. కా బట్టి పరిచ్ఛిన్నుడైన విజ్ఞానమయుడు ఆత్మ కాలేడు.

విజ్ఞానమయము సాక్షికి విషయముకనుక దృశ్యము. సాక్షిచే భాస్య మానముకనుక విజ్ఞానమయము సాక్షివేద్యము. స్వయంప్రకాశమైన వస్తువు ఒక్కటే ఉన్నది. అది ఆత్మ యే. సూర్యుడు అంతటినీ భాసింపజేస్తూన్నప్పటికి అతడు భాస్యమే, సాక్షివేద్యమే. సూర్యు డున్నాడని కన్నులుమాత్రమే చెప్పాలి. నీచక్షువులచే సూర్యుడు భాస్యం కావాలి, లేకపోతే తనకుతానుగా భాసించడు. కాబట్టి ఆత్మకంటె భిన్నమైనదంతా పరప్రకాశ్యమే; కనుక దృ శ్యము. విజ్ఞానమయము దృశ్యముకనుక పరాత్మ కాదు.

విజ్ఞానమయము వ్యభిచారి, అంటే విజ్ఞానమయము ఒకప్పడు ఉండి మరొకప్పడు లేకపోవటం జరుగుతుంది. సుషుప్తిలోకి వెళ్ళినపుడు, ఆనందము ననుభవించేటప్పడు కర్తృత్వములేదు, మమత్వము లేదు. కనుక ఆసమయంలో విజ్ఞానమయముండదు. వ్యభిచారికనుక - మారిపోతూఉంటుందికనుక- విజ్ఞానమయము పరాత్మకాజాలదు.

ఈ కారణాలన్నిటివలన విజ్ఞానమయము అనిత్యమైనది. కనుక అనాది అయినప్పటికి అనిత్యము, అంటే కాలబద్ధమైనది. ఇక్కడసూచించిన దావిషయమునే కాబట్టి దేశకాల వస్తుపరిచ్ఛిన్నమైన విజ్ఞానమయము - దేశకాల వస్తుపరిచ్ఛేదరహితమైన - నిత్యవస్తువు కాలేదు. కనుక విజ్ఞానమయము పరాత్మ కాదు.

57వ శ్లోకము

ఆనందప్రతిబింబ చుంబిత తనుర్వృత్తి స్తమోజృంభితా
స్వాదానందమయః ప్రియదిగుణకః స్వేష్టార్థలాభోదయః ।
పుణ్యస్యానుభవే విభాతి కృతినామానందరూపః స్వయం
సర్వో నందతి యత్ర సాధు తనుభృన్మాత్రః ప్రయత్నం వినా ॥ 209 ॥

తమో జృంభితా వృత్తిః - తమస్సునుండి జనించిన మనోవృత్తి రూపము; ఆనందమయః స్యాత్ - ఆనందమయమగును; ప్రియాదిగుణకః - ప్రియాది గుణములు కలిగినది; స్వఇష్టారథ లాభ ఉదయః - ఇష్టవిషయలబ్ధివలన జనించేది; కృతినామ్ - చేసిన కర్మల లో; పుణ్యస్య అనుభవే - పుణ్య ఫలములననుభవించేటప్పడు; విభాతి - ప్రకాశిస్తుంది; యత్ర - (ఏ) అసమయంలో; సర్వః తనుభృత్ మాత్రః - దేహధారియైన ప్రతి ఒక్కడు; స్వయం ఆనంద రూపః - తానే ఆనంద స్వరూపుడై; ప్రయత్నం వినా - ప్రయత్నం లేకుండానే; సాధు నందతి - ఆనందాన్నాస్వాదిస్తాడు."

"ఆనందమయకోశము తమస్సునుండి జనించిన మనోవికారరూపము; ప్రతిబింబించిన ఆనందముచే వ్యాప్తము; ప్రియాది గుణములుకలిగి ఉన్నది; ఇష్టవిషయలబ్ధివలన ఉదయిస్తుంది. పుణ్యకర్మలాచరించిన వారికి పుణ్యఫలములననుభవించేటప్పడు ప్రకాశిస్తుంది. ఆసమయంలో దేహ ధారియైన ప్రతిఒక్కడు - తానే ఆనందస్వరూపుడై, - ప్రయత్నంలేకుండానే ఆనం దాన్నాస్వాదిస్తాడు."

ఈ శ్లోకంలో ఆనందమయమును వర్ణిస్తున్నారు. ఆనందమయము తమస్సు - అవిద్య నుండి జనించే వృత్తివిశేషము. వృత్తులన్నీ అవిద్యనుండే ఉత్పన్నమవుతాయి. వృత్తికాబట్టి ఆనందమయము ఆనందస్వరూపము కాదు. సత్త్వము ప్రధానంగా ఉన్నప్పటికీ, ఆనంద

వృత్తి తమస్సుతో కలిసిఉంటుంది. ఈ వృత్తి విశేషము యొక్క స్వరూపమేమిటి ? ఆనందప్రతిబింబచుంబితతనుః - ఆనందప్రతిబింబముచే వ్యాప్తమైన (చుంబిత) వృత్తివిశేషము ఆనందమయము.

అనేకమంది 'ఆనంద' పదానికి అనుభవయోగ్యమైన వరన్ణాతీతమైన పరమసుఖమని అర్థం చెప్తుంటారు. కానీ అది సరికాదు. అనుభవయోగ్యమైన పరమసుఖం కూడా ఒక వృత్తి విశేషమే. కానీ ఆనందము ఆత్మస్వరూపమే, వృత్తికాదు. 'సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ' అన్న వాక్యంలో 'అనంత' పదము ఆనందానికి వర్తిస్తుంది. అనంతమంటేపరిచ్ఛిన్నరహితము. అది ఆత్మస్వరూపము కాబట్టి 'ఆనంద' పదానికర్థము - అనంతము, సంపూర్ణము, పరిపూర్ణము.

అనంతమంటే స్పష్టంగా అర్థమవుతుంది. ఆనందపదానికి అనంతమర్థమయితే, ఆనంద పదం వాడటమెందుకు ? విషయాన్ని తికమక చేయటమెందుకు ? ఎందుకంటె పురుషార్థానికి లక్షణం కనుక శాస్త్రము అనంత పదంబదులుగా ఆనందమని వాడుతుంది. అది పురుషార్థమును సూచిస్తుంది. ధర్మ, అర్థకామములు ద్వారా మనం సాధించదలచినది ఆనందమునే. కనుక ఆనందం పొందటంలో పురుషార్థలాభముంటుంది. సాధారణమైన అనుభవజన్యమైన ఆనందంకూడ అనంతమైన స్వరూపానందంలో ఒక మాత్ర - అత్యంత అల్పమైన అంశమే. అనుభవించే ఆనందము ఒక వృత్తి విశేషము - ఒక మానసిక స్థితి; కాలతః పరిమితమైనది. కనుక కాలబద్ధమైనది. అంతేగాక ఈ అనుభవజన్యఆనందంలో తారతమ్యముంటుంది. అందుకనే మనకు భిన్నభిన్నపదములున్నవి - సంతోషము, ఆనందము, సుఖము మొ॥ అవన్నీ వృత్తివిశేషములే. వాటి తీవ్రతలలో వ్యత్యాసముంటుంది. ఏ ఆనందఅనుభవంలోనైనా ఆత్మయొక్క పూర్వత్వం వ్యక్తమవుతుంది. అందరూ అన్వేషిస్తున్నదదే. కాబట్టి 'వస్తు' స్వరూపానికి ఆనందము లక్షణమవుతున్నది.

ఆనందము అనుభవంలో ఉన్న పదంకూడ. అందుచేతనే ఆపదం నీకొక స్ఫురణ కలిగిస్తుంది. అది పురుషార్థాన్ని కూడ చెప్తుంది. కాబట్టి శాస్త్రము 'ఆనంద'పదము నుపయోగిస్తుంది.

ఆనందమయము ప్రియాదిగుణములు కలిగిఉన్నది. ప్రియము, మోదము ప్రమోదము ఆనందమయముయొక్క ధర్మములు. ఇవి తారతమ్యమున్న ఆనందవృత్తివిశేషములె. ఇష్టదర్శనమువలన - నీ కిష్టమైనది దృష్టిగోచరమైనప్పడు ఒక వృత్తివిశేషమేర్పడుతుంది. అది ప్రియము. "లాభేమోదః" - నీ కిష్టమైనది లభించినపుడు లేదా దాదాపులభించినపుడు కలిగే వృత్తివిశేషము మోదము. తదనంతరం నీ కిష్టమైనదాని ననుభవించినపుడు నీ మనస్సులో ఉదయించే వృత్తిని ప్రమోదవృత్తి అంటారు. ఇష్ట వస్తువులవలన ఏర్పడుతున్నవి కనుక ఇవన్నీ వృత్తివిశేషములే.

వృత్తి ఉదయిస్తుంది కనుక నశిస్తుంది కోరిన వస్తువు లభించినప్పటికి, అదంతగా వాంఛనీయం కాదని నీవు కనుగొనవచ్చు; అపుడా వృత్తివిశేషం నశిస్తుంది. ఈ వివరణంతాకూడ ప్రియాదివృత్తులు మనం చర్చిస్తున్న స్వరూపానందముకాదని తెలుపుటకోరకే. ఇవన్నీ కేవలం వృత్తివిశేషములు మాత్రమే.

పుణ్యకర్మలాచరించినవారికి ఆనందమయము ప్రకాశిస్తుంది. ప్రతిమానవుడు పాపపుణ్యకర్మలు రెండింటినిచేస్తాడు. మానవజన్మయే పుణ్యపాపకర్మల మిశ్రఫలము. మానవునిగా జన్మించాడంటెనే పుణ్యకర్మలనాచరించాడని అర్థం. కనుక ఒక వ్యక్తి ఎంతదురదృష్టవంతుడైనా, ఏదోఒకప్పడతడిపుణ్యము ఉద్భూతమై ఆనందాన్నిస్తుంది. అందుచేతనే బిచ్చగాడుకూడ ఆనందంగా ఉండే సందర్భాలుంటాయి. అతడికి మరొక మంచి భిక్షాపాత్ర దొరికి ఉండవచ్చు. మరొకడు లాటరీలో జయంపొందాడు; ఆనందంగా ఉన్నాడు ! ఒకసాధువు భండారా (విందుభోజనం) టిక్కెట్లు లభించి ఆనందంగా ఉంటాడు. కను

క ఈ జన్మలోకాని పూర్వజన్మలలో కాని అనుష్ఠించిన ధార్మిక కర్మలవలన పుణ్యం ఉదయిస్తుంది. సుఖం కలుగుతుంది. ఆనందమయం ప్రకాశిస్తుంది. ఆనందమయం ప్రకాశించాలంటే తాత్కాలికంగా అహంకారము ఒకరకంగా చెప్పాలండే తప్పకోవాలి. ఇక్కడ వివరిస్తున్న విషయమదే. ఆసమయంలో జీవుడు తానే ఆనందమయమై చక్కగా రమిస్తాడు; ఇచ్ఛాసంకల్పముండదు. ఇచ్ఛాసంకల్పము (will) పూర్తిగా లయంచెందుతుంది. ఏరకమైన ప్రయత్నంకూడ ఉండదు. ప్రయత్నంవినా - అంటే ఆనందం అనుభవిస్తున్న సమయంలో ప్రయత్నం ఉండదు. ఆనందం పొందటానికి కావలసిన పరిస్థితుల నేర్పరచటానికి ఆ వ్యక్తి అత్యంత శ్రమపడి ఉండవచ్చు. కాని కోరిన పరిస్థితులేర్పడినప్పడు ఆనందం ప్రయత్నరహితంగానే కలుగుతుంది. ఒక వ్యక్తి సంగీతం వినటానికి రెండుమైళ్ళు నడిచి రావచ్చు. కానీ తానిష్టపడే సంగీతం విన్నప్పడు ఆనందంగా ఉండటంలో ప్రయత్నమేమీ ఉండదు.

58వ శ్లోకము

ఆనందమయకోశస్య సుషుప్తౌ స్ఫూర్తిరుత్కటా ।
స్వప్నజాగరయో రీషత్, ఇష్టసందర్శనాదినా ॥ 210 ॥

సుషుప్తౌ - సుషుప్తి యందు; ఆనందమయ కోశస్య - ఆనందమయ కోశము యొక్క; స్ఫూర్తిః - ప్రకాశము; ఉత్కటా - అధికము; ఇష్టసందర్శనాదినా - ఇష్ట వస్తువుల దర్శనాదుల వలన; స్వప్న జాగరయోః - స్వప్త జాగ్రదవస్థలలో, ఈషత్ - అది పాక్షికంగా (వ్యక్తమవుతుంది)

“సుషుప్తిలో ఆనందమయకోశము పూర్తిగా స్పష్టంగా వ్యక్తమవుతుంది. కానీ స్వప్నంలో అది పాక్షికము, జాగ్రత్తులో ఇష్టవస్తువుల దర్శనాదులవలన కలుగుతుంది.”

ఆనందమయము ఆత్మస్వరూపాన్ని ఆచ్ఛాదించుచున్నట్లుగా ఉంటుంది. కనుక అది కోశము లాంటిది. ఆనందమయ దశలోకూడ భ్రమపడటం జరుగుతుంది. “నేను ఆనందంగా ఉన్నానని” నేను చెప్పినప్పడదొక భ్రమ. అది ఎలా ఉంటుందంటే పటిక బెల్ల పుముక్క ఒకటి “నేనారోజు తియ్యగా ఉండి ఉన్నానని’ చెప్పినట్లుగా ఉంటుంది. పటికబెల్లపుముక్క ఎప్పడూ తియ్యగానే ఉంటుంది. అదేవిధంగా “నేను” యొక్క స్వరూపమే కనుక ఆనందము ‘నేను’ కంటె ఎప్పడూ దూరంగాలేదు. కాబట్టి, ‘నేను ఆనందంగా ఉండి ఉన్నాను.’ అన్న వాక్యము తప్ప. ఈ కారణంచేతనే ఆనందమయము కోశమవుతుంది. ఆనందమయకోశానుభవము సుషుప్తిలో పూర్తిగా ఉంటుంది. సుషుప్తిలో ఏ ఇతరవృత్తులు ఉండవుగనుక, ఆనందము ఇతరవృత్తుల ప్రభావానికి లోనుకాదు. సుషుప్తిలో అహంకారము లయం జెందుతుంది; అలాగే ఆత్మగురించిన అన్ని అపోహలు, భావనలు లయం చెందుతాయి. సుషుప్తిలో దేహాదులతో తాదాత్మ్యముండదు కాబట్టి దేహాదుల వలన వచ్చే సమస్యలుండవు. కాబట్టి సుషుప్తిలో ఆనందం ప్రధానంగా ఉంటుంది.

ఏ ఆనందమైనా స్వరూపానందమే. విషయానుభవములవలన కలిగే ఆనందం కూడ స్వరూపానందమే. పరిస్థితులనుండి ఏ ఆనందము లభించదు. ఆయా సందర్భాలలో అహంకారము తాత్కాలికంగా లయంచెందవచ్చు; ఫలితంగా ఆనందానుభవం కలుగవచ్చు. ఆయా పరిస్థితులపట్ల నీ రాగద్వేషాల ననుసరించి నీకు ఇష్టానిష్టబుద్ధి ఉంటుంది. ఈ రాగద్వేషాలకారణంగానే ఇచ్ఛాసంకల్పము (will) లేదా అహంకారము అధికారికంగా అడిగే (demand) విధంగా ఉంటుంది. అలాగా అధికారికంగా అడగటము అసంపూర్ణభావనవలన ఏర్పడుతుంది. ఆ అసంపూర్ణుడు ఇష్టవస్తుదర్శన, లాభ, అనుభవములవలన, తాత్కాలికంగా కొంత వ్యత్యాసములతో లయంచెందుతాడు.

లయాలలో వృత్త్యాసముంటుంది. అప్పడుదయించే ప్రియ, మోద, ప్రమోదములు లయించిన వృత్తిలో వ్యక్తమయే స్వరూపానందం తప్ప వేరేది కాదు. అలాగే సుషుప్తిలో లభించే ఆనందం కూడ స్వరూపానందమే. భేదమల్లా - సుషుప్తిలో ఆనందాన్ని భగ్నం చేసే ఇతరవృత్తులేవీ ఉండవు. కానీ జాగ్రత్ స్వప్నావస్థలలో వృత్తుల పరంపర, లయాలలో తేడాలు ఉంటాయి. అవి ఆనందానుభవ తీరుతెన్నులను, కాలాన్ని పరిమితం చేస్తుం టాయి.

జాగ్రత్ స్వప్నావస్థలలో క్రొత్త క్రొత్త వృత్తులేర్పడటానికి అనేక నిమిత్తాలుంటాయి. వాటిమూ లంగా ఆనందము పరిమితమవుతుంది. కానీ సుషుప్తిలో ఆవిధంగా ఉండదు. ఉదాహ రణకు నీవు సంగీతాన్ని ఎంతో ఆహ్లాదంగా వింటున్నావనుకుందాం. అప్పడు నీ ప్రక్కవా రొకరు తుమ్మారు. నీ సంగీతశ్రవణానందంలో భంగమేర్పడుతుంది. అంతేకాక జాగ్రత్ స్వప్నావస్థలలో నీగురించి నీకు కొన్ని స్థిరమైనఅభిప్రాయాలుంటాయి. అదికూడ నీ ఆనందాన్ని కుంటుపరుస్తుంది. కానీ సుషుప్తిలో దాన్ని కుంటుపరచేదే లేదు, కనుక అది నిరాటంకము.

సుషుప్తిలో ఆనందానుభవమున్నది. ఎందుకంటె మేలుకున్న తరువాత ప్రతిఒక్కడు నేను హాయిగా నిద్రపోయానని చెప్తాడు కాబట్టి. తార్కికంగాకూడ సుషుప్తిలో ఆనంద మున్నదని మనం తెలుసుకోవచ్చు. నిద్రపోటానికెంతో ఉత్సాహంచూపిస్తారు ప్రతివారు, కానీ మేల్కోవటానికెవరూ ఇష్టపడరు. దీనివలన మనం సుషుప్తి అనేది ప్రతివారు ఉత్సా హంతో ప్రవేశించాలనుకునేది బహిర్గతమవటానికెవరూ ఇష్టపడని ఆనందపు ద్వీపమని అర్థంచేసుకోవచ్చు. నిద్రలో అన్యథాగ్రహణము లేక భ్రమలేదు. కానీ జాగ్రత స్వప్నావస్థ లు రెండింటిలోను ఆనందము స్వరూపతః కాలతః కూడ పరిమితం చేయబడుతుంది.

జాగ్రత్ స్వప్నావస్థలలో ఇష్టదర్శనమువలన, ఇష్టలాభమువలన, ఇష్టఅనుభవమువలన ఆనందం కలుగుతుంది. అదంతా సందర్భము, నిమిత్తంమీద ఆధారపడుతుంది. ఆహారం లాంటి వస్తువుల విషయంలో దర్శన,లాభ, అనుభవములు మూడూ వర్తిస్తాయి.ధనం మొ॥ కొన్ని విషయాలలో కేవలం దర్శనం ఆనందాన్ని కలుగజేయదు, దాని లబ్ధి మాత్రమే ఆనందాన్నిస్తుంది. కనుక శాస్త్రం చెప్తుంది. "ఇష్టసందర్శనాదినా" ఇక్కడ 'ఆది' పదము ప్రముఖమైనది. అది లాభ, అనుభవాలనుకూడ సూచిస్తుంది.

59వ శ్లోకము

నైవాయమానందమయః పరాత్మా సోపాధికత్వాత్ ప్రకృతేర్వికారాత్ ।
కార్యత్వహేతోః సుకృతక్రియాయాః వికారసంఘాతసమాహితత్వాత్ ॥ 211 ॥

అయమ్ ఆనందమయః - ఈ ఆనందమయ కోశము; సోపాధికత్త్వాత్ - సోపాధికం కనుక; ప్రకృతేః వికారాత్ - ప్రకృతియొక్క వికారముకనుక; సుకృత క్రియాయాః - పుణ్యక ర్మలు; కార్యత్వఃహేతోః - ఫలరూపము కనుక; వికార సంఘాతనమాహితత్వాత్ - ప్రియ మోద ప్రమోదవికారవృత్తుల సంఘాతము వలన ఏర్పడినది కనుక; పరాత్మా న ఏవ - పరాత్మ కానే కాదు.

"ఈ ఆనందమయము సోపాధికంకనుక, ప్రకృతివికారంకనుక,
పుణ్యకర్మలఫలముకనుక, ప్రియమోద ప్రమోద వికారవృత్తుల
సంఘాతమువలన ఏర్పడినది కనుక, పరాత్మకాజాలదు."

శాస్త్ర మిక్కడ ఆనందమయము పరాత్మకాదని బోధిస్తున్నది (negate) ప్రతిదశ లోనూ ఈ బాధ ఉంటుంది. ఎందువలన అది పరాత్మకాదు ? సోపాధికము కనుక, ఇక్కడ మనస్సు ఉపాధి. మనస్సులోని ఒకవృత్తివిశేషము ఆనందమయానికి ఉపాధి.

మరియు ఆనందమయము ప్రకృతివికారము. మనస్సే మాయనుండి ఉత్పన్నమైనది. ఆ మనస్సులో ఆనందమయము ఒకవృత్తివిశేషంలో ఆనందం ప్రతిఫలిస్తుంది. కనుక ఆ నందమయము ప్రకృతివికారము (పరిణామము). పుణ్యకర్మలవలన ఉత్పన్నమవుతు న్నస్థితి కలిగి ఉన్నది. కనుక పుణ్యకర్మల ఫలమది. నీవు ఏ సుఖం పొందుతావో, అదల్లా పుణ్యఫలమే. దుఃఖము పాపఫలము. చిన్నదైనా పెద్దదైనా సుఖదుఃఖములిక్కడ వాటిని కలిగించే నిమిత్తాలను తెలుపుతాయి.

కానీ నీకు యోగ్యమైన మనోవైఖరి ఉంటే ఆనందాన్ననుభవించవచ్చు. దానికి నీ పూర్వ లేక వర్తమాన కర్మలతో సంబంధం లేదు. కర్మ పరిస్థితిని మాత్రం ఏర్పరుస్తుంది. కానీ నీకు వివేకజ్ఞానంతో జనించిన యోగ్యమైన మనోభావన ఉంటే అప్పుడు ఇష్టపడే అనుభవమేర్పడినప్పుడు పొంగిపోవటము, ప్రతికూలపరిస్థితి ఉంటే క్రుంగిపోవటము ఉం డదు. సరే ఇది వేరే విషయం.

కానీ ఈ శ్లోకంలో పూర్తిగా సందర్భాన్నిబట్టి కలిగే సుఖాన్ని వివరిస్తున్నారు. పరిస్థితుల మీద ఆధారపడి, వికారసంఘాతసమాహితత్వాత్ వికారరూపాలనుండి ఉత్పన్నమవు తుంది. కనుక - ఆనందమయము పరాత్మకాదు.

పరాత్మ తన అస్తిత్వం కోసం దేనిమీద ఆధారపడదు. తాను తానుగానే ఉంటాడు. స్వతఃసిద్ధుడు. పరాత్మ ప్రకృతివికారము కాదు. ప్రకృతికూడ పరాత్మమీద ఆధారపడు తుంది. అందుచేతనే చైతన్యానికవస్థలు లేవు. అభివృద్ధి చెందదు. అవస్థ అన్నదాన్ని మెరుగుపరచవచ్చు. నీవు మెలకువ అవస్థలో ఉండవచ్చు. ఇంకా అధికమైన మెలకువ లో ఉండవచ్చు. ఎక్కువ జాగ్రత్తగా ఉండవచ్చు. నిద్రనుకూడ గాఢం చేసుకోవచ్చు. మం దులు వేసికొని హాయిగా నిద్రించవచ్చు. ఆత్మ కార్యం కాదు; కానీ ఆనందమయము పు ణ్యకర్మలకార్యము. ఆత్మ సకలవృత్తులకు అధిష్ఠానము; కానీ వృత్తిరూపమైనఆనందమయ

ము ఆత్మపై ఆధారపడుతుంది. ఈ కారణాలన్నిటివలన ఆనందమయము పరాత్మ కాజా లదు.

60వ శ్లోకము

ప ఞ్చానామపి కోశానాం నిషేధే యుక్తితః శ్రుతేః ।

తన్నిషేధావధిః సాక్షీ బోధరూపో వశిష్యతే ॥ 212 ॥

శ్రుతేః వ శ్రుతి చేత; యుక్తితః వ శ్రుతిసమ్మత యుక్తి చేత; షఞ్చానామ్ కోశానాం నిషేధే అపి వ పఞ్చకోశములను నిషేధించినపుడు; నిషేధావధిః వ నిషేధావధి; సాక్షీ బోధరూపః వ సాక్షి చైతన్య స్వరూపము; అవశిష్యతే వ శేషిస్తుంది.

"శ్రుతి చేత, శ్రుతిసమ్మత యుక్తిచేత పఞ్చకోశములను బాధించినపుడు, నిఫేధావధిరూపంగా సాక్షి చైతన్యస్వరూపము శేషించును."

ప్రతిదశలోనూ వివేకముచేత ఆ పఞ్చకోశములు కాదని నిషేధించ బడినవి. కానీ భౌతికంగా ఎటువంటి తొలగింపులేదు. ఈ కోశములను తొలగించగానే ఆత్మ ప్రకాశించదు. ఇక్కడ నిషేధము తొలగించటమన్నది అట్టనడుగున ఉన్న మరకతము (emarald) ను చూడటంకోసం అనేక ఆచ్ఛాదనలు తొలగించటంలాంటిది కాదు.

సంవత్సరాలక్రితం ఒక నగలవర్తకుడు నాకొక మరకతాన్ని చూపించాడు. తన దుకాణాని కతడు నన్నాహ్వానించాడు. అక్కడొక ఇనుపకటకటాలు బిగించిన ప్రత్యేకమైన గదిలోనికి నన్ను తీసుకువెళ్ళాడు. అక్కడొక బలమైన ఇనుపపెట్టె (ironsafe) ఉన్నది. ప్రత్యేకమైన తాళమున్నది దానికి తాళం తీశాడు. లోపలొక అట్టపెట్టె ఉన్నది. దానిలోపల వెల్వెట్ (velvet) పెట్టెఉన్నది. దాన్నతడు బయటకు తీశాడు. ఆ బాక్స్‌లోపల సన్నటి మెత్తటికాగితపు పొట్లమున్నది. దాన్ని విప్పదీసి, 'స్వామీజీ ! మరకతాన్ని చూడండి' అని చూపించాడు. అక్కడుంది మెరుస్తున్న మరకతం. ఆమరకతాన్ని చూడటానికి అనేక

కోశాల్నితొలగించాల్సివచ్చింది. అది లోపల ఉన్నదికనుక. కానీ ఆత్మ అలాగా కనుపించేది కాదు.

ఆత్మ పంచకోశాల లోపల ఉన్నదికాదు. సర్వత్ర ఉన్నది. వివేకంతో దాన్ని ప్రతిదశలోను కనుగొనాలి. ఆవిధంగా ఎందుచేతనంటే శరీరం ఆత్మయే కానీ ఆత్మ శరీరంకాదు. ప్రాణము ఆత్మయే కానీ ఆత్మ ప్రాణముకాదు. అదేవిధంగా మనోమయము విజ్ఞానమయము ఆనందమయము ఇవన్నీ ఆత్మ తప్ప వేరుకాదు. కానీ ఆత్మ వీనిలో ఏదీకాదు. ఆత్మ సచ్చిదానందస్వరూపము. ఇదీ వివేకమంటె.

దేనిని వదలకుండా పంచకోశములను నిషేధించినపుడు ఏది శేషిస్తుందో అది సాక్షి. ఇది మనం చేరుకునే పొందే అవస్థకాదు; నాలుగవ అవస్థ అంతకన్నా కాదు. నాలుగవ అవస్థ - తురీయావస్థ ఈ మూడు అవస్థలలో మారకుండా అనుస్యూతంగా ఉన్ననీవే జిజ్ఞాసువు దీని నిషేధమును - బాధను సరియైన విచారంతో, యుక్తితో చేయాలి.

ప్రతిదశలోను నిషేధం చేయాలి, ఎందుకంటే ప్రతిదశలోనూ భ్రమేర్పడిందికాబట్టి. విచారముతో ఈ నిషేధంచేయాలి. ఒక దాని తరువాత ఒకటిగా అన్ని కోశములను నిషేధించిన తరువాత ఆ నిషేధావధి సాక్షి చైతన్యమే. బాధచెందనిది - నిషేధించలేనిది సాక్షి. ఇతరమైనదంతా కాదని నిషేధించవచ్చు. పూర్వం శరీరాన్ని ఆత్మగా గ్రహించాను, కానీ అది సత్యముకాదు. అది బాధితమైనది. ప్రాణాన్ని ఆత్మగా భావించాను. కానీ అది సత్యము గాదు. అదేవిధంగా మనోమయము, విజ్ఞానమయము ఆనందమయముకూడ బాధితములైనవి. ఇక మిగిలినది, నిషేధించలేనిది సాక్షి వాస్తవానికి సాక్షి దృష్ట్యా అన్నీ బాధితములే. ఆ సాక్షి నీవే. విచారముతో మాత్రమే ఈ నిషేధం జరుగుతుంది. ఆ సాక్షి కి రూపంలేదు. అది బోధరూపం - చైతన్యం శేషించేదది మాత్రమే.

# ఆత్మస్వరూపము - 'త్వం' పదార్థము

61వ శ్లోకము

యో ఽయమాత్మా స్వయం జ్యోతిః పంచకోశవిలక్షణః

అవస్థాత్రయసాక్షీ సన్నిర్వికారో నిరఞ్జనః,

సదానందః స విజ్ఞేయః స్వాత్మత్వేన విపశ్చితా ॥ 213 ॥

స్వయం జ్యోతిః - స్వయం ప్రకాశమైన; పఞ్చకోశవిలక్షణః - పంచకోశములకంటె విలక్షణము; అవస్థాత్రయసాక్షీ - మూడు అవస్థలకు సాక్షి; నిర్వికారః - మార్పు చెందనిది; నిరఞ్జనః - సంగవర్జితము; సదానందః - సదానందస్వరూపము అయిన; అయమ్ ఆత్మా -ఏ ఈ ఆత్మ ఉన్నదో సః - అది; విపశ్చితా - వివేకశీలునిచే; స్వాత్మత్వేన విజ్ఞేయః - తానుగానే (తన స్వరూపంగానే) తెలియ బడవలెను.

"వివేకశీలుడు స్వయంప్రకాశము, పంచకోశములకంటె విలక్షణము, అవస్థాత్రయమునకు సాక్షి, నిర్వికారము, సంగవర్జితము, సదానంద స్వరూపము ఐన ఈ ఆత్మను తానుగానే తెలుపుకోవాలి."

ఆత్మకు ఆపాదించిన పంచకోశములను వాటి ధర్మములను నిషేధించింది శాస్త్రము. ఆత్మపై ఆరోపింపబడిన ఈ ధర్మాలను నిషేధించటాన్ని అపవాదమని అంటారు. ఈ అపవాదం చేసినపుడు శేషించేది బోధ స్వరూపమైన సాక్షి, సాక్షిస్వరూపము శుద్ధమైనచైతన్యము - ఆత్మ. ఇదంతా ఇంతకుముందు చెప్పబడింది.

ఆ ఆత్మనే శాస్త్రము ఇంకనూ వర్ణిస్తున్నదీ శ్లోకంలో ఈ ఆత్మ జ్యోతిస్వరూపము. చైతన్యమే జ్యోతి. స్వయంజ్యోతి పదమును బృహదారణ్యకోపనిషత్తు ఆత్మను బోధించటానికి ఉపయోగిస్తుంది. అక్కడ ఆత్మ స్వయంప్రకాశస్వరూపమని తెలపటానికొక రూపకల్పన చేస్తుంది. కన్నులతో చూడటం కోసం సూర్యుడు సర్వవస్తువులను ప్రకాశింపజేస్తాడు. కానీ సూర్యుని తెలపటానికి చక్షువులు కావాలి. కాబట్టి కన్నులు ప్రకాశాన్ననుసరించి

సూర్యుడు ప్రకాశిస్తాడు. మనోప్రకాశాన్ననుసరించి కన్నులు ప్రకాశిస్తాయి. ఆత్మజ్యోతి ననుసరించి మనస్సు ప్రకాశిస్తుంది. ఆత్మ స్వయంజ్యోతిస్వరూపము.

ఆత్మపంచకోశములకంటె విలక్షణము. ఆపై జాగ్రత్ స్వప్నసుషుప్తి మూడు అవస్థలకు సాక్షి. ఈ మూడు అవస్థలను వ్యాపించి ఉంటుంది. కానీ, వాటికంటె విలక్షణంగా ఉం టుంది. ఆత్మ నిర్వికారము - ఏ రకమైన మార్పును చెందదు. అది నిరంజనము -ఏ రకమైన సంగదోషము లేదు. ఎల్లప్పుడు శుద్ధము. దేహాదులతో కలిసి ఉన్నప్పటికి ఆత్మకే దోషము అంటదు. ఆత్మకు దేనితోను సంయోగములేనట్లయితే ఆత్మ నిరంజనమని చెప్ప వలసిన అవసరం లేదు. ఆత్మ కర్మ - పుణ్యపాప - రహితము కూడ. ఈ కారణంచేత కూడ ఆత్మ నిరంజనము.

అంతేకాక ఆత్మ ఎల్లప్పుడు ఆనందస్వరూపము. అది ఆనందవికారముకాదు. ఆత్మ స్వరూపము పూర్ణము. ఆనందమును అనుభవించే దానిగాకాక స్వస్వరూపంగా అర్థం చేసుకోవాలి. ఆ ఆత్మయే స్వస్వరూపంగా గుర్తించబడాలి. ఎవరిచేత ? విపశ్చితా, పూర్వోక్త ఆత్మానాత్మ వివేకము చేయగల సమర్థునిచేత.

62వ శ్లోకము

మిథ్యాత్వేన నిషిద్ధేషు కోశేష్వేతేషు పంచసు ।
సర్వాభావం వినా కిఞ్చిత్ న పశ్యామ్యత్ర హే గురో ।
విజ్ఞేయం కిము వస్త్వస్తి స్వాత్మనాఽత్మ విపశ్చితా ॥ 214 ॥

హే గురో ! - హే గురో !; ఏతేషు పఞ్చను కోశేషు - ఈ పంచకోశములు; మిథ్యాత్వేన నిషిద్ధేషు - మిథ్య యని నిషేధించగా;సర్వం అభావం వినా - సర్వము అభావమనే తప్ప, అత్ర కిఞ్చిత్ న పశ్యామి - ఇక్కడ అన్య మేదీ నేను చూడటం లేదు; ఆత్మ విపశ్చితా - ఆత్మ విచారము చేయగల సమర్థునిచే; స్వాత్మనా - తన స్వరూపంగా; విజ్ఞేయం వస్తు - తెలు సుకోనే వస్తువంటూ; కిమ్ ఉ అస్తి - నిజంగా ఉన్నదా ?

"హే గురో ! ఈ పంచకోశములు మిథ్యయని నిషేధించిన అనంతరం సర్వము అభావమనే తప్ప నాకేమీ గోచరించటం లేదు. ఆత్మ విచారం చేయగల సమర్థునికి తన స్వరూపమని తెలుసుకోవటానికి నిజంగా 'వస్తు' వంటూ ఉన్నదా ?"

ఇప్పడు శిష్యుడు గురువును ప్రశ్నిస్తున్నాడు - "ఇంతకు ముందు వివరించిన పంచకోశములు సత్యము కాదని, మిథ్యయని బాధింపబడినవి. ఇక మిగిలినదంటూ ఏమీ గోచరించటం లేదు. సర్వము అభావమునే అనిపిస్తుంది !"

పంచకోశములు మిథ్య అని నిషేధించబడినవి. కానీ శిష్యునికి మిథ్య అంటే ఏమిటో అర్థంకాలేదు. 'మిథ్యా' పదమునకు రెండర్థములున్నవి - ఒకటి అసత్యము - రెండవ అర్థము - తనఅస్తిత్వానికి మరో దానిమీద ఆధారపడేదని.

మిథ్య అంటే ఏమిటో అర్థంకాక శిష్యుడిక్కడ ప్రశ్నిస్తున్నాడు. "పంచకోశములు నిషేధించినపుడు వాటిస్థలములో అభావం తప్ప నాకేమీ గోచరించటంలేదు. నాకున్నది, తెలిసినదల్లా ఇంతే. దేహము నేననుకొన్నాను. అది మిథ్య అని మీరు చెప్పారు. ప్రాణము నేననుకొన్నాను. అది కూడ భ్రమేనని చూపించారు. ఆ తరువాత మనస్సు నేనుకాదని నిషేధించారు. అప్పడు కర్త నేనని అనుకున్నాను. అదికూడ కాదన్నారు. చివరకు భోక్తను నేననుకున్నాను. దానిని కూడ మీరు కాదన్నారు. ఇకమిగిలినదేమి ?అభావమే. ఏదీ లేదు. అంటే సర్వఅభావమునే నేను చూస్తున్నాను!" ఈ విధంగా భావిస్తున్నాడు కనుకనే శిష్యుడడుగుతున్నాడు. 'తానేనని తెలుసుకోవటానికేమైనా ఉన్నదా ?' అని.

మిథ్య అంటే ఏమిటో అర్థంకాకపోతే సత్యవస్తువు - అధిష్ఠానము లేకుండా మిథ్య అనేది ఉండదని తెలుసుకోలేరు. మృత్తిక లేకుండా ఘటములేదు. కనుక మిథ్య ఆని నిశ్చయించటము సత్యవస్తు జ్ఞానాన్ని సూచిస్తుంది. కానీ అతడు మిథ్య అంటే అసత్యమని

అర్థంచేసుకొని, తరువాత సర్వాబావంతప్ప మరేమీలేదని కనుగొంటాడు. తైత్తిరీయోప నిషత్తు ప్రతికోశమును పక్షి రూపకల్పనతో పోల్చి వర్ణిస్తుంది. పక్షికి తల, శరీరం, రెండు రెక్కలు తోక ఉంటాయి. తోక శరీరానికి నిలకడ కలిగిస్తుంది. ఆనందమయమును వర్ణి స్తూ ఉపనిషత్తు. "ఈ ఆనందమయమునకు ప్రియమే తల, మోద, ప్రమోదములు కుడి ఎడమ రెక్కలు. ఆనందము శరీరం అని చెప్తుంది. ప్రియ, మోద, ప్రమోదములు ఆనం దవికారములు - ఆనందమును ప్రతిబింబించే వృత్తి వికారములు.ఈ ఆనందమయ పక్షి కి శరీరము ఆనందస్వరూపము,తల, రెక్కలు మొ॥ అవయవాలకు రక్తప్రసరణ శక్తి మొ॥ వాటిని సరఫరాచేసేది శరీరం. అదేవిధంగా ఆనందమయ విషయంలో ప్రియ, మోద, ప్రమోదములుగా అనుభవించే, ఆ ఆనందము, ఆనందస్వరూపమైన ఆత్మనుండి సంక్ర మిస్తుంది. ఆనందము బ్రహ్మములో పర్యవసిస్తుంది. బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా, కనుక ఆనం దమయము తన అస్తిత్వమునకై బ్రహ్మముపై ఆధారపడుతుంది. బ్రహ్మమే నిజమైన ఆనం దము.

తైత్తిరీయో పనిషత్తు, "బ్రహ్మవేత్త పరమును పొందుతాడ"ని ఆరంభించి బ్రహ్మమున కాత్మతో ఐక్యమును ప్రతిపాదించి; ఆ బ్రహ్మాత్మనుండి సమస్త సృష్టి ఉత్పన్నమైనదని చెప్పి, బ్రహ్మమే ఆత్మకధిష్ఠానమని బోధిస్తుంది. ఆ విధంగా ప్రత్యగాత్మయే బ్రహ్మమని సిద్ధాంతీ కరిస్తుంది. మరో విషయం కూడ చెప్తుంది. ఈ సత్యమునందు శ్రద్ధలేనివాడు తనను తానే నిషేధించుకుంటున్నవాడని, కనుక లేనివానితో సమానమని చెప్తుంది.

శిష్యుని ప్రశ్న విన్నమీదట - గురువు వస్తువును ప్రతిపాదించటానికిదే మంచి అవకాశ మని భావించి - ఆ ప్రకారంగా చెప్పటమారంభిస్తున్నాడు.

63వ శ్లోకము

సత్యముక్తం త్వయా విద్వ న్నిపుణోఽసి విచారణే ।

అహమాదివికారాస్తే తదభావో య మప్యను ॥ 215 ॥

హే విద్వన్ - ఓ విద్వాంసుడా ! త్వయా సత్యమ్ ఉక్తమ్ - నీచే సత్యము చెప్పబడింది; విచారణే - విచారం చేయటంలో; నిపుణః అసి - కుశలుడివి; తే - ఆ; అహమ్ ఆదివికారాః - అహంకారాది వికారములు; అను అయమ్ అపి - వాటిని అనుసరించే; తత్ అభావః - వాటి అభావము.

64వ శ్లోకము

సర్వే యేనానుభూయంతే యః స్వయం నానుభూయతే ।

తమాత్మానం వేదితారం విద్ధి బుద్ధ్యా సుసూక్ష్మయా ॥ 216 ॥

సర్వే - ఇవన్నీ; యేన అనుభూయంతే - ఎవరి ద్వారా అనుభవింపబడతో;యః స్వయ్ - ఎవరైతే స్వయముగా; న అనుభూయతే - అనుభవింపబడదో; తమ్ ఆత్మానం - ఆ ఆత్మను; వేదితారం జ్ఞాతను; సుసూక్ష్మయా బుద్ధ్యా సూక్ష్మబుద్ధితో; విద్ధి తెలుసుకో.

"హే విద్వన్ ! నీవు చెప్పింది సత్యమే. నీవు విచారకుశలుడవు. నీవు సూక్ష్మబుద్ధితో అహంకారవు మొదలుకొని సర్వవికారములు వాటి ననుసనించే వాటి అభావమును (సుషుప్తిలో) ఎవరిచే అనుభవింపబడునో, ఎవరైతే అనుభవింపబడడో అదే నీవు, జ్ఞాతవు తెలుసుకో".

ప్రశ్నకు సమాధానమిస్తూ - గురువు శిష్యుని విచారవిధానాన్ని చూచి సంతోషిస్తూ - నీవు చెప్పినది సరియైనదేనని శిష్యుణ్ణి 'విద్వన్' అని సంబోధిస్తున్నాడు. విచారంలో నిపుణుడవని మెచ్చుకుంటున్నాడు. ఈ మెచ్చుకోవటం శిష్యునిలో ఉత్సాహాన్ని కలిగించటంకోసం - నిపుణుడవంటే "నీవింతవలరకు వచ్చావు. పంచకోశములు మిథ్య అని తెలుసుకోగలిగావ"ని

అహంకారము మొదలుకొని వివిధవికారములు పంచకోశములవుతున్నాయి. అహంకారమే కర్తభోక్తరూపంగా ఉన్న వృత్తివికారము. సుషుప్తిలో ఈ వికారము లేవీలేవు, ఏ

విషయానుభవము లేదు - ఈ వృత్తులన్నిటి భావము, అభావము రెండూ కూడ. ఎప్పటి కీ అనుభవింపబడని వాడు సాక్షి. అంటె అనుభవంలో ఎప్పటికి విషయముకానివాడు. ఆ సాక్షియే ఆత్మ. కనుక ఆత్మ అంటే సర్వవికారములను భాసింపజేసేవాడు. విషయీక రించేవాడు కాని తానెన్నటికి దేనిచేతకూడ భాసింపబడడు - విషయీకరింపబడడు. ఆ స్వతఃసిద్ధ ఆత్మను నీవుగా తెలుసుకో.

సర్వ వికారములు అభావంతప్ప తనకేమీగొచరించటం లేదని శిష్యుడు ఇంతకు ముందు చెప్పాడు. అంటే అవన్ని వ్యావృత్తములని (మారిపోతూ ఉంటాయని) ఆత్మకాదని అర్థం. అవి ఆత్మధర్మములయితే అవెల్లప్పడూ గొచరిస్తూనే ఉండాలి. కానీ సుషుప్తిలో అవిలేకపోవటం చూస్తాము. కనుక అవి సత్యములు కావు. మిథ్యాస్వభావములు కనుక అవి ఆత్మకు సంబంధించినవికావు. అంతేకాక, వాటి అభావాన్ని చూచినప్పడు ఆ చూచేదెవరు ? ఆ చూచేదే ఆత్మ, అభావాన్ని గూడ భాసింపజేస్తుంది. ఆ వస్తువును కనుగొనగలిగే సూక్ష్మబుద్ధితో నీవు సాక్షిని, ఆత్మను తెలుసుకుందువు గాక.

గురువిక్కడ శిష్యుడు నిలబడిఉన్న ఆధారాన్ని లాగివేస్తున్నట్లుగా, అతడి జ్ఞానాన్ని పరిహసిస్తున్నట్లుగా ఉన్నది. మొదట్లో శిష్యుడి విచారకుశలతను పొగిడాడు. ఇప్పడేమో "సూక్ష్మగ్రాహిగా చేసుకున్నబుద్ధితో ఆత్మను తెలుసుకుందువు గాక" అని అంటున్నాడు. ఇదోరకమైన వ్యంగ్యభాషణం. అదెలాంటిదంటే శాస్త్రంతెలియని వ్యక్తిని పట్టుకొని "హే బృహస్పతేస అని సంబోధించటంలాంటిది.

65వ శ్లోకము

జాగ్రత్ స్వప్న సుషుప్తిషు స్ఫుటతరం యోఽసౌ సముజ్జృంభతే
ప్రత్యగ్రూపతయా సదాహమహ మిత్యంతః స్ఫురన్నేకధా ।
నానాకారవికారభాజిన ఇమాన్ పశ్యన్నహంధీముఖాన్
నిత్యానందచిదాత్మనా స్ఫురతి తం విద్ధి స్వమేతం హృది ॥ 219 ॥

జాగ్రత్ స్వప్న సుషుప్తి షు - జాగ్రత్ స్వప్నసుషుప్తులలో; స్ఫుటతరం - స్పష్టంగా; ఏకధా - ఒకే విధంగా; సదా అహమ్ ఇతి అంతః - ఎల్లప్పడూ అంతరంగంలో ప్రత్యగాత్మగా 'నేను' 'నేను' అని స్ఫురన్ - భాసిస్తూ; ఇమాన్ అహంధీముఖాన్ - ఈ అహంకారము మొ॥ నా నాకారవికారభాగిన వివిధకరాలైన వికారరూపాలు పొందినవాటిని; పశ్యన్ (చూస్తూ) ప్రకాశింపజేస్తూ; హృది - హృదయములో; నిత్యానంద - కాలబద్ధముకాని ఆనందస్వరూ పంగా , చిదాత్మనా - చైతన్య స్వరూపంగా; స్ఫురతి తం - ప్రకాశించే దానిని; ఏతం స్వం విద్ధి - ఈ నీవుగా తెలుసుకో.

> "జాగ్రత్ స్వప్న సుషుప్తులలో స్ఫుటంగా స్వయంగా ప్రకాశించే దానిని "అహం" "అహం"రూపంగా ఎల్లప్పడూ ప్రత్యగాత్మరూపంగా భాసించే దానిని అహంకారము మొదలుకొని వివిధనామరూపములను భాసింపజేసేదానిని, చిత్స్వరూపము ఆనందస్వరూపము ఐనదానిని, కాలబద్ధముకానిదానిని అటువంటి ఆత్మ నీవునని నీహృదయంలో తెలుసుకో."

ఈ శ్లోకంలో ఆత్మ ఇంకా వివరించబడింది. ఆత్మ నేను నేను అని హృదయంలో నిత్య ము ప్రకాశిస్తుంటుంది. 'ఇది' అని ఒక విషయముగాకాక 'నేను' అనిప్రకాశిస్తుంది. 'ఇ దం' ప్రత్యయమునకర్థంగా కాక, 'నేను' అన్న ప్రత్యయాని కర్థంగాభాసిస్తుంది ఇంకా, ఎప్ప డూ ఒకేవిధంగా భాసిస్తుంది. అంటే ఎప్పడూమార్పు జెందే అహంకారము ఆత్మకాదని అవగతమవుతుంది. శాస్త్రమిక్కడ మరోఆత్మను ప్రతిపాదించటంలేదు. "అహంకారము" లో 'కార' ప్రత్యయము విషయీకరించగలిగిన 'ఇదం' అంశను సూచిస్తుంది. శాస్త్రమి క్కడ ఆ 'ఇదం' అంశను - 'కార' ప్రత్యయాన్ని నిషేధిస్తున్నది. 'నేను ద్రష్టన"ని చెప్పినపు డు ఆత్మను ద్రష్టగా చేసేది అహంకారంలోని 'కార' ప్రత్యయమే. ధేహేంద్రియప్రాణమనో బుద్ధులాత్మచే వ్యాప్తములైనప్పటికీ, ఆత్మ - ప్రత్యగాత్మగా స్వయంగా భాసిస్తుంది. అహం

కారాదులను ప్రకాశింపజేస్తూ ఆత్మ తానుగా ప్రకాశిస్తుంది. 'అహంధీ' అంటే అహంకార ము. 'అహంధీముఖాన్' అంటే అహంకారము మొదలుకొని స్థూలదేహమువరకు. నిజా నికి నీవు ఇంద్రియమనస్సులద్వారా విషయీకరించే దంతా చెప్పినట్లే. విషయీకరింప బడే ప్రతిదాన్ని ఆత్మగా భాసింపజేస్తుంది.

విషయీకరింపబడేవి వివిధాకారములు కలిగిఉంటాయి. సాకారమయితే సావయ వమవుతుంది. ఉదాహరణకు ప్రాణమునకు ప్రాణము అపానము మొ॥ అవయవములు న్నవి. మనస్సుకు కూడ అవయవములున్నవి. అలాగే దేహము మనస్సు. వికారములకు లోనయ్యే ఈ నానా ఆకారములను ఆత్మ భాసింపజేస్తుంది. వివిధ ఆకారములంటే బాహ్య జగత్తును కూడ చెప్పినట్లే వీటన్నిటినీ భాసింపజేస్తూ ఆత్మ తాను భాసిస్తుంది.

ఆత్మా సముజ్జృంభతే - పరసహాయములేక ఆత్మ తానుగా భాసిస్తుంది. చక్షురా దులు పరప్రకాశ్యములై ప్రకాశిస్తున్నవి. వాటిలోని ప్రకాశక శక్తి ఆత్మనుండి సంక్రమించి నదే. ఇంకనూ, ఆత్మ జాగ్రత్, స్వప్న, సుషుప్తులలో ఎటువంటి మార్పుచెందక ప్రత్యగాత్మ గాభాసిస్తుంది, ప్రకాశిస్తుంది. ఆత్మ ఈ నీ బుద్ధిలో ప్రకాశిస్తుంది. ఏ విధంగా ప్రకాశి స్తుంది? నిత్యానందచిదాత్మనా - మరణముతో సహా ఎటువంటి వికారమలకు లోనుగా నిదినిత్యము. నిత్యముగా భాసించే ఆత్మ స్వరూపము ఆనందము - అనంతము. నీకు బోధించిన స్వరూపం గలిగిన ఆత్మ నీవేనని తెలుసుకో.

****

# బ్రహ్మస్వరూపము - 'తత్' పదార్థము

66వ శ్లోకము

బ్రమ్మభిన్నత్వవిజ్ఞానం భవమోక్షస్య కారణమ్ ।

యేనాద్వితీయమానందం బ్రహ్మ సమ్పద్యతే బుధైః ॥ 225 ॥

యేన - ఏజ్ఞానముచేత; బుధైః - జ్ఞానులచేత; అద్వితీయమ్ ఆనందం బ్రహ్మ - అద్వయ ఆనందస్వరూపమైన బ్రహ్మము; నమ్పద్యతే - పొందబడుతుందో; బ్రహ్మ అభిన్నత్వవిజ్ఞానం - ఆ బ్రహ్మ అభిన్న ఆత్మ జ్ఞానము; భవమోక్షన్య కారణమ్ - సంసారబంధం నుండి విముక్తికి కారణమవుతుంది.

"ఏ జ్ఞానముచే విజ్ఞానులు అద్వితీయానందస్వరూపమైన బ్రహ్మమును పొందుతారో - ఆ బ్రహ్మాభిన్న ఆత్మజ్ఞానము సంసారబంధమోచనానికి కారణమవుతుంది."

ఆత్మవిజ్ఞానము సంసారబంధ మోచనమునకు కారణము. కారణమంటే సాధనమని కూడ అర్థమున్నది. 'కారణము' అన్నపదం మోక్షానికి కారణమని గ్రహించవచ్చు లేదా మోక్షానికి సాధనమనికూడ తీసుకొనవచ్చు. కనుక జ్ఞానము మోక్షానికి కారణము లేదా సాధనమవుతుంది. ఆ జ్ఞానమేమిటి ? తన స్వరూపజ్ఞానం - ఆ జ్ఞానంలో బ్రహ్మమును తనకంటె భిన్నంగా చూడడు. బ్రహ్మాభిన్నత్వమంటే ఆత్మ బ్రహ్మముల అభేదం మాత్రమేకాక సమస్తజగత్తుకు బ్రహ్మముల అభేదముకూడ. శ్రుతి చెప్తుంది. "సర్వం ఖల్విదం బ్రహ్మ" ఇదంతా వాస్తవంలో బ్రహ్మమే "నేహ నానాస్తి కిఞ్చన" బ్రహ్మముకంటె భిన్నమైనదేదీలేదు.

ఈ బ్రహ్మాభిన్నజ్ఞానమువలన లాభమేమిటి ? ఈ జ్ఞానమువలన వివేకవంతుడు బ్రహ్మ స్వరూపమై అద్వయానందమును పొందుతాడు. ఈ జ్ఞానమున్నవాడు ఆనందాన్ని పొందుతాడు. మోక్షంలో ఆనందమున్నది. కాబట్టి మోక్షంపట్ల విలువ ఉంటుంది.

67వ శ్లోకము

సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ విశుద్ధం పరం స్వతఃసిద్ధమ్ ।

నిత్యానందైకరసం ప్రత్యగభిన్నం నిరంతరం జయతి ॥ 227 ॥

సత్యం జ్ఞానం అనంతం - సత్యము, జ్ఞానము, అనంతము; విశుద్ధం పరం - విశుద్ధము, పరము; స్వతః సిద్ధం - స్వతః సిద్ధమైన; నిత్యఆనందైకరసం - కాలబద్ధము కాని నిరతిశయానందస్వరూపము; నిరంతరమ్ - అంతరములేనటువంటి; ప్రత్యక్ అభిన్నము - ప్రత్యగాత్మ కంటె భిన్నము కాని, బ్రహ్మ - బ్రహ్మము; జయతి - ప్రకాశించును.

"సత్యము జ్ఞానము అనంతము మలరహితము, మాయాతీతము
స్వతః సిద్ధము, కాలబద్ధముకాని నిరతిశయానందస్వరూపము,
ప్రత్యగాత్మకంటె భిన్నముకాని బ్రహ్మము అపరోక్షంగా ప్రకాశించును."

గ్రంథకర్త ఇక్కడ బ్రహ్మము నిరంతరము జయించు నని చెప్తున్నారు. అంటే ప్రత్యగాత్మ స్వరూపంగా నిత్యసిద్ధము. బ్రహ్మము' అన్న పదము పెద్దది అనే అర్థమున్న 'బృహ'ధాతువు నుండి ఏర్పడినది. కాబట్టి బ్రహ్మము అంటే పెద్దది అని అర్థం. "బ్రహ్మము" న కర్థము శ్రుతి ఇంకా వివరంగా చెప్పాల్సిఉంది.

బహ్మము సత్యము జ్ఞానము అనంతమని తైత్తిరీయోపనిషత్తు బోధిస్తుంది. ఈ పదములు బహ్మము యొక్క స్వరూపాన్ని నిర్వచించే స్వరూపలక్షణములు. లక్షణము వస్తుస్వరూపాన్ని నిర్వచిస్తుంది. ఉదాహరణకు అవకాశ ప్రదాతృ ఆకాశమ్ - అవకాశాన్నిచ్చేది ఆకాశము. ఆకాశంలాగా అవకాశాన్నిచ్చేది ఈ జగత్తులో మరొకటి లేదు. ఆకాశము యొక్క నిర్వచనము యోగ్యమైనదే. మనస్సులో ఉన్న వస్తువును మాత్రమే తెలిపేటట్లుగా స్వరూపలక్షణముండాలి. నిర్వచించేపదముకానీ పదములుగానీ మరే ఇతరవస్తువుకి వర్తించకూడదు. లక్షణమునిర్వచింపబడే వస్తువును ఇతరవస్తువులన్నిటినుండి వేరుపరుస్తుంది.

సత్యము అన్న పదం వాడుకభాషలో సామాన్యంగా వాడుతుంటాము. సాధారణంగా వాడే పదాన్ని 'బహ్మము'ను నిర్వచించటానికెలా ప్రయోగిస్తాము. బహ్మము ఏ ఇతరవ

స్తువులాంటిది కాదని నీకు తెలుసు. కనుక బ్రహ్మమును నిర్వచించటానికి నీకు తెలిసిన పదములవంటివి కానిపదములను వాడాలి. బ్రహ్మమును శ్రుతిమాతయే నిర్వచించాలి కనుక ఏ ప్రత్యేక పదాన్ని నేనెంచుకోలేను. "ఎక్కడనుండైతే మనస్సుతో సహా పదములు వెనుకకు మరలునో అది బ్రహ్మమ"ని శ్రుతి చెప్తుంది. అంటే అది సర్వపదముల కతీతమని అర్థం.

అదే సమయంలో బ్రహ్మమును తెలుసుకోవాలి, తెలుసుకోవచ్చును కూడ. జ్ఞేయము కనుక చెప్పబడగలదు. బోధింపబడగలిగితే శబ్దములచే వర్ణించటానికందుబాటులో ఉండాలి. అలా కాదా? కాదు. తెలియబడగలిగేదేదైనా శబ్దములచే నిర్వచించటానికందాలి అన్ననియమమేమీలేదు. కొన్ని విషయాలు తెలుసుకోగలం కానీ శబ్దముల్లో చెప్పలేము. ఉదాహరణకు తీపి - తీపి అంటే ఏమిటో శబ్దాల్లో వ్యక్తం చేయలేము. సాక్షాత్తు సరస్వతీదేవికూడ తీపిఅంటే, ఏమిటో మాటల్లో చెప్పలేదు. కానీ ఇంద్రియానుభవం ద్వారా తీపిఅంటే ఏమిటో తెలుసుకోవచ్చు కాబట్టి. పటికబెల్లంముక్కను నాలుకపై ఉంచగా నీవేరుచిననుభవిస్తున్నావో 'అదే తీపి' అని చెప్పి నీకర్థమయేట్లు చేయవచ్చు. తియ్యదనమును నిర్వచించలేము. ఆ అవసరం కూడలేదు. నీవనుభవించి తెలుసుకోగలవు గనుక. ఆ అనుభవమే తీపిదనము అని చెప్పినపుడు ఆ తీపి పదము తీపంటే ఏమిటో తెలుపుతుంది. నిర్వచించలేకపోయినప్పటికి అదేమిటో నీకు తెలుసు. కాబట్టి అనిర్వచనీయవస్తువులను కూడ, అవి ఇంద్రియములచే గానీ లేక మరే ఇతర ప్రమాణముచే గాని విషయీకరింపబడగలిగితే తెలుసుకోవచ్చును.

కానీ బ్రహ్మము విషయీకిరించటానికి లభ్యంకాదు. ఇంద్రియములతో ప్రత్యక్షంగా చూడలేను, అనుమానంద్వారా తెలుసుకోలేను. శ్రుతి ఆ విధంగా బోధిస్తుంది. అందుచేత శాశ్వతము అన్నపదం వాడలేను. నీకు నాకుకూడ శాశ్వతముయొక్క సాధరణ అనుభవముంటే శాశ్వతం అన్న పదం వాడవచ్చు. ప్రతిఅనుభవము అనిత్యమే. అలాగే

అనుభవించే వస్తువుకూడ. నిత్యత్వము గుమ్మడికాయలాంటి వస్తువుకాదు. ఎదురు తెన్నులు చూచేటప్పుడు కలిగే విసుగుదలను వ్యక్తం చేయటానికి కూడ "శాశ్వత" మన్న పదం వాడతాము. కాబట్టి 'శాశ్వతము' నిత్యము అన్న పదము అందరూ అర్థంచేసుకున్న సాధారణపదం కాదు. అది మన అనుభవంలో ఉన్న ఒక వస్తువుకాదు కనుక. తీపి, పులుపు మొ॥ అందరూ అంగీకరించినపదములు, అనుభవపూర్వకంగా తెలుసుకనుక, అర్థమవుతాయి. ఈ కారణంచేతనే అవి వాటి అర్థాలను మనకు తెలుపగలుగుతున్నాయి. కానీ బ్రహ్మము నెవరూ ఒక వస్తువుగా అనుభవించలేదు. కనుక దానికై ఏ పదము ప్రయోగించవచ్చు ?

శాస్త్రమిక్కడ బ్రహ్మమునకు 'సత్య' మన్న పదం వాడుతుంది. అదే విధంగా అర్థాన్ని తెలుపుతుంది? 'సత్యము' అన్న పదం సాధారణంగా వాడే పదం, వాస్తవాన్ని, ఉన్నదానిని తెలుపటానికి వాడేపదం. 'పుష్పం సత్యం' అని నీ వంటే దానర్థం ఉన్నది పుష్పము, అది వాస్తవము అని అర్థం. అసత్యము కూడ ఉన్నది. కనుక 'ఇది సత్యము' 'ఇది అసత్యము' అని మనకి తెలుసు. జాగ్రత్ సత్యమని - స్వప్నము అసత్యమని మనకి తెలుసు. సత్య పదానికి కాలబద్ధమైన అస్తిత్వాన్ని అర్థంగా చెప్తుంటాము.

పదము అర్థాన్ని తెలిపే ప్రతీక - చిహ్నము. ఆ అర్థము ఏదైనా కావచ్చు - వస్తువు, వస్తు గుణము, సంబంధము, క్రియ, భావావేశము, లేదా సౌందర్యములాంటి రసాత్మకభావం కూడ - వీటిల్లో ఏదైనా కావచ్చు. ఇవన్నీ మన అనుభవపరిధిలోనే ఉన్నవి. సత్యపదం కూడ మన అనుభవపరిధిలోనే ఉన్నది. కనుక 'సత్యం బ్రహ్మ' అని విన్నప్పడు బ్రహ్మము ఒకటి ఉన్నది. అది పుష్పంలాగా ఒక వాస్తవమైన వస్తువై ఉండాలి అనే నిర్ణయాని కొస్తాను. నేను దాన్ని చూడటం లేదు. ఐనప్పటికి శ్రుతివాక్యాలపై శ్రద్ధ ఉన్నది కనుక - అది ఎక్కడో ఒకచోట ఉండి ఉండాలని విశ్వసిస్తాను. సత్యపదంనుండి నీకు లభించేదంతా అంతే.

సత్యపదాన్ని విడమరచి విపులీకరించటానికి సమగ్రమైన విధానమున్నది. దాన్నే సంప్ర దాయ మంటారు. అది అర్థాన్ని వివరిస్తుంది. "సంప్రదాయమంటే' అసలు సరైన అర్థమే మిటి? ఒకగ్రంథలో విశేషంగా వాడిన ప్రతీకలకు (abbreviations) వివరణ పట్టిక (key) ఆ గ్రంథంలోనే ఉంటుంది. అదేవిధంగా శ్రుతియే వివరణనిస్తుంది. బ్రహ్మమును తెలపటానికి శ్రుతి పదములను వాడుతుంది. శ్రుతివాక్యముల ద్వారా మాత్రమే బ్రహ్మ ము నర్థంచేసుకోగలం కనుక శ్రుతిసహాయంలేక ఈ పదముల నర్థం చేసుకోలేను. శ్రుతివాక్యముల మీమాంసచేయటం ద్వారా వాటినర్థం చేసుకోవటానికి పరిష్కార మార్గం దొరుకుతుంది. ఈ పరిష్కరించే విధానమే సంప్రదాయమంటె.బ్రహ్మము సత్య ము, జ్ఞానము, అనంతము అని చెప్తే - శ్రోత మామూలుగా అందరూ అడిగినట్లేఅడుగు తాడు. "స్వామీజీ! ఆ బ్రహ్మమును అనుభవంలో కెలా తీసుకురావాలి ? ఎలా ఆచరణలో పెట్టాలి ?" అని. "నిత్యమైనదాన్ని అనుభవించగలమా ? ఎంతకాలం ? కాబట్టి బోధింప బడేవస్తువు ఎంతముఖ్యమో బోధించే విధానము- ప్రక్రియ కూడ అంతముఖ్యమైనది. నిజానికి బోధనాప్రక్రియ నిర్దుష్టమైనదైతే బోధ నిలుస్తుంది. ప్రక్రియలో దోషముంటే చె ప్పింది నిలువలేదు.

ఈ బోధనావిధాన్నాన్ని అర్థం చేసుకుందాం. ఇక్కడొక ఎర్రగులాబి ఉన్నది. గులాబి ఒక పుష్పం ఒకజాతి. అది చెట్టుకాదు, ఆకు మొ॥ కాదు. గులాబి పుష్పం అన్నప్పడు గులాబి అన్నది పుష్పానికొక విశేషణమవుతున్నది. కాని గులాబిపుష్పం అన్నదే ఒక జాతి, ఎందుకంటే అనేకరకాల గులాబిపుష్పాలున్నవి. కాబట్టి మరొకవిశేషణం కావాలి. - ఎర్ర గులాబిపుష్పం. ప్రతిఎర్రగులాబి పుష్పం సువాసనకలిగి ఉన్నదైతే "సుగంధ ఎర్ర గులాబి పుష్పం" అని చెప్పనవసరంలేదు. కనుక సుగంధ ఎర్రగులాబి పుష్పమన్నప్పడు 'సుగంధ' 'ఎర్ర' అన్నవి విశేషణములు. ఒక వస్తువుని అదే జాతికి చెందిన ఇతర వస్తువులనుండి వేరుపరచటానికి విశేషణాన్ని వాడతారు. కానీ తియ్యనిచెక్కెర అని అనవలసిన అవస

రంలేదు. చక్కెరెప్పుడు తియ్యగానే ఉంటుంది కాబట్టి చేదుచక్కెర అనేదేదీ లేదు. చేదు చక్కెర అంటూ ఒకటుంటే అప్పుడు 'తియ్యటి చక్కెర' అని అనవలసివస్తుంది.

సత్యం, జ్ఞానం అనంతం బహ్మ అన్నవాక్యం భాషాపరంగా చూస్తే బహ్మము విశేష్యము (substantive) గాను, సామానాధికరణ్యంలోనున్న సత్యం, జ్ఞానం, అనంతములు బహ్మమును ఇతర బ్రహ్మలకంటె వేరుపరచటానికుపయోగించిన విశేషణములుగాను - అనిపిస్తాయి. ఆ పదములు విశేషణవిశేష్యసంబంధం కలిగిఉంటాయి. ఒక జాతికి చెం దిన ఇతర వస్తువులనుండి ఒక వస్తువును వేరు పరచి చెప్పటానికి విశేషణాన్ని వాడతా ము. కానీ ఇక్కడ మనకి తెలిసిన మరోబ్రహ్మము లేదు. కాబట్టి విశేషణవిశేష్యసంబంధ ము లక్షణలక్ష్యసంబంధముగా మారుతుంది. ఈ మూడు పదములు లక్షణములుగాను బ్రహ్మము లక్ష్యముగాను అవుతుంది. బ్రహ్మమంటే ఏమిటో తెలపాలని శ్రుతి పట్టుదలతో ఉన్నది. శ్రుతి "బ్రహ్మవిదాప్నోతి పరం - బ్రహ్మమును తెలుసుకున్నవాడు పరమును అంటే మోక్షమును పొందుతాడ"ని చెప్పి ఆ బ్రహ్మము 'సత్యం జ్ఞానం అనంతమ'ని నిర్వచిస్తుం ది. ఇది లక్షణలక్ష్యసంబంధం కలిగి ఉన్న స్పష్టమైన నిర్వచనము.

ఈ పదములు నిర్వచనం కాబట్టి - వాటిని వివరంగా బోధిస్తున్నప్పుడు - బ్రహ్మమును నీవు ప్రత్యక్షంగా గానీ - పరోక్షంగా గానీ తెలుసుకోగలగాలి. నిర్వచించేవస్తువు ప్రత్యక్షం గా లేకపోతే - ఆ నిర్వచనమువలన - నీకు పరోక్ష జ్ఞానంమాత్రం కలుగుతుంది. నీ వెప్ప డూ ఏనుగును చూచి ఉండకపోతే - నే నేనుగుయొక్క లక్షణాలు వర్ణిస్తూన్నప్పుడు - ఆ వర్ణనవలన ఏనుగిలా ఉంటుందని - నీకు పరోక్షజ్ఞానం కలుగుతుంది. కానీ నిర్వ చింపబడేవస్తువు ఏదోరకంగా నీకు తెలిసినదైతే - అప్పుడావర్ణన - నీకు ఆ వస్తువుయొ క్క ప్రత్యక్షజ్ఞానమునే ఇస్తుంది.

మరి ప్రస్తుతంలో శ్రోతయొక్క స్వరూపంగానే బ్రహ్మము ప్రసిద్ధము. శ్రోత వాస్తవంగా బ్రహ్మమే. ఆత్మను బ్రహ్మముగా గుర్తించనప్పటికి 'నేను ఉన్నాను' అని అది ప్రసిద్ధమై.

నిర్వచనంలో తరువాత అంశము జ్ఞానము. సాధారణంగా జ్ఞానము, అజ్ఞానము రెంటిని ఒక విషయం గురించి అని అర్థచేసుకుంటాము. పునః ఒక విషయజ్ఞానంగురించి చర్చించినపుడు తదనురూపమైన వృత్తి మనస్సులో ఉంటుంది కానీ జ్ఞేయవిషయము బాహ్యంలో ఉంటుంది. ఉదాహరణకు జలము అన్నాననుకోండి, అప్పడు జలానురూప మైన వృత్తి మనస్సులో ఉంటుంది. కానీ జలము - విషయము బాహ్యంలో ఉన్నది. జల జ్ఞానంలోనేను స్నానంచేయలేను. కాబట్టి విషయమైన జలమును - జ్ఞానమనలేము. కానీ ఇక్కడ బ్రహ్మమును నిర్వచిస్తూ శ్రుతి 'జ్ఞానం బ్రహ్మ' అని చెప్తుంది. నాక్కావల్సింది బ్రహ్మజ్ఞానము, కానీ శ్రుతిచెప్తున్నది జ్ఞానం బ్రహ్మమని. ఈ జ్ఞానము ఇతర సాధారణమైన విషయజ్ఞానంకంటె విలక్షణమైనది. ఏ జ్ఞానమైన - ప్రసిద్ధమైన అంటే ఎఱుకలో నున్న జ్ఞానం మీద కేంద్రీకృతమవుతుంది. ఇక్కడకూడ శ్రుతి నా గురించే - జ్ఞాత గురించే బోధిస్తున్నది. ఆ జ్ఞాతకు బ్రహ్మముతో ఐక్యమును బోధిస్తున్నది. జ్ఞానమంటే ప్రమాతా అనే అర్థంకూడ ఉన్నది. ఎందుకంటే తెలుసుకునేవాడిని కూడ బ్రహ్మమంటారు. ప్రమాత బ్రహ్మము.

ఒక వస్తువు ఉన్నదంటే అది సర్వసాధారణవిదితము. కాబట్టి జ్ఞానము సత్యమంటే జ్ఞాత ఉన్నాడు. ఇంకామరణించలేదని అర్థం. అదేమో నన్ను అధికవిజ్ఞానవంతుణ్ణి చేయ దు. కాబట్టి ఇక్కడ నిషేదాన్ని చెప్పే 'అనంత' పదము చాలా ముఖ్యమైనది. అనంతమం టే పరిచ్ఛిన్నత్వం లేనిదని అర్థం.

'అనంత' మన్న పదం 'సత్యము' 'జ్ఞానమ'న్న రెండు పదాలకు అర్థాన్ని నిర్ణయిస్తుంది. అనంతమంటే పరిచ్ఛేదరహితమని మనం చూశాం.ఆ పరిచ్ఛేదము లేవై ఉండవచ్చును? ఒకటి వస్తుపరిచ్ఛేదము. మానవుడవు కాబట్టి - భుజించటంలో పరిచ్ఛిన్నము - నడక లో పరిచ్ఛిన్నము - స్మృతిలో పరిచ్ఛిన్నము - ఇంకా అనేకములు ఇవన్నీ వస్తుపరిచ్ఛేదము లు. మరొకటి కాలపరిచ్ఛేదము. ఇప్పడిలాగా ఉన్నవస్తువు తరువాతక్షణంలో ఇదేవిధంగా

ఉండదు. ఆ ఉన్నవస్తువుకూడ ఇక్కడే ఉన్నదిగాని మరోచోటలేదు. దాన్ని దేశపరిచ్ఛే దమంటారు. ఏ వస్తువైనా త్రివిధపరిచ్ఛేదయుక్తమయే ఉంటుంది.

కానీ బ్రహ్మము అనంతము ఏవిధమైన పరిచ్ఛేదానికి లోనుగాదు. 'సత్యము' 'అనం తము' పదములు సామానాధికరణంలో ఉన్నాయి. కాబట్టి అనంతపదము సత్యపదాన్ని విశేషిస్తుంది. అంటే సత్యబ్రహ్మమే అనంతబ్రహ్మము. సత్యము 'ఉనికి' ఏరకమైన కాల పరిచ్ఛేదము లేనటువంటిది. అది ఉండెను, ఉన్నది, ఎప్పటికి ఉంటుంది కూడ. కాబట్టి మనం చర్చిస్తున్నది. శరీరము, మనస్సు మరే ఇతరవస్తువువలెగాక - ఏ రకంగానూ - కాలపరిధిలోనికి రాని వస్తువుగురించి. కనుక అనేకవస్తువు కాదు. సమస్తవస్తువులు అదేకావాలి లేదా అనేక వస్తువు కాకూడదు. అది శూన్యంకూడా కాదు - సత్యమన్నప దం ఉన్నది, ఎల్లప్పుడు ఉన్నది; అదే సకలవస్తువులు కూడ. ఆ వస్తువులోనే నా శరీరము, మనస్సు, కర్తృత్వము, భోక్తృత్వము, సర్వావస్థలు అన్నీ అంతర్గతమవుతాయి. అది ఎవరై తేఅనుభవిస్తున్నాడో అతడినికూడ కలుపుకుంటుంది - జ్ఞానమన్న పదమున్నదికనుక. జ్ఞానమంటే జ్ఞాతవైన నీవేకాక - జ్ఞానము జ్ఞేయముకూడ సూచితములవుతాయి. కాబట్టి అదే త్రిపుటి. అంటే త్రిపుటికంటె విలక్షణమైనది. ఎందుకంటే ఒకే సమయంలో మూడూకాలేదు కనుక. ప్రతిజ్ఞానంలో అవినాభావంగా అనువర్తించే సాక్షి అది. ఆ సాక్షి యే శుద్ధచైతన్యము - బ్రహ్మము - అదే నీవు.

ప్రమాత యొక్క - శ్రోతయొక్క స్వరూపమైన - అలుప్తశుద్ధచైతన్యమే బ్రహ్మమని - లక్షణము ప్రతిపాదిస్తుంది. కాబట్టి ఈ నిర్వచనము బోధజరుగుతుండగనే ప్రత్యక్ష జ్ఞాన మునీయాలి.

ఈ నిర్వచనాన్ని మరోవిధంగా ఎవరూ ప్రతిపాదించలేరు. సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ ఒక నిర్వచనము. "నీవా బ్రహ్మ ననుభవించాలి" అని చెప్తే అది సంప్రదాయం కాదు. సంప్రదాయానికి దూరమైతే ఏ ప్రయోజనమూ ఉండదు. పదముల్ని జాగ్రత్తగా

ప్రయోగించాలి. పదాల్ని సరిగా ప్రయోగించాలంటే - విశేషణమంటే ఏమిటి, ఏది విశేష్య ము, అవెలా పనిచేస్తాయి మొ॥ తెలిసిఉండాలి. అది పాండిత్యం. పాండిత్యము తనచేతి లో ఉన్న పరికరము. పండితుడు కావటానికి వేదాంతం అధ్యయనం చేయాల్సిన అవస రంలేదు. బోధఅంటే వస్తుస్వరూపాన్ని విడమరచి విశదీకరించటమే. వేదాంతంలో వస్తు విచారమే మనక్కావల్సింది. మరిదేనితోనూ మనకి పనిలేదు.

బ్రహ్మము విశుద్ధము. ఏ రకమైన అశుద్ధత్వానికిలోనుగాదు. 'వి' ఉపసర్గ నిత్యశుద్ధ మని బోధిస్తుంది. తానుతప్ప మరొకటి తనలో లేనిదనిఅర్థం. బ్రహ్మము సత్యము, తదిత రమైనదంతా దానిపై ఆరోపించబడినది. ఆరోపితము అధిష్ఠానములో ఎటువంటి మార్పును తీసుకురాలేదు. అధష్ఠానమును మలినం చేయలేదు. కనుక వస్తువెప్పడూ విశుద్ధమే. పుణ్యపాపవర్జితము. అది పరము అంటే మాయాతీతము. మాయకు అధి ష్ఠానము. బ్రహ్మదృష్ట్యా మాయ అంటూ ఏమీలేదు. అందుచేతనే అది పరము.

బ్రహ్మ తన అస్తిత్వానికి ప్రకాశమునకు దేనిమీద ఆధారపడదు. స్వతః సిద్ధము, స్వయం ప్రకాశముకూడ. కన్నులు చూడగలవు, కాని ప్రకాశమునకు మనస్సుపై ఆధార పడుతవి. మనస్సులేకపోతే ఇంద్రియములు పనిచేయలేవు. మనస్సుకూడ తన సత్తా స్ఫూర్తులకై చైతన్యముపై ఆధారపడుతుంది. కానీ చైతన్యము తాను ప్రకాశించాలంటే దేనిమీద ఆధారపడదు. స్వయంప్రకాశము. ఇతరమంతా చైతన్యమువలననే భాసి స్తుంది.

అంతేకాక బ్రహ్మము నిత్యానందము ఏకరసము, సదా ఏకరూపంలో ఉంటుంది. ఆనంద రూపంలో ఉంటుంది. ఈ ఆనందము ఏరకంగానూ మార్పుచెందదు. ఇక్కడ పరమానందంగురించి మనం చర్చించటం లేదు. ఎందుకంటే అనుభవవేద్యమైన సంతో షం ఎప్పడూ ఒకేవిధంగా ఉండదు. ఎవరైనా ఈ అతిశయానందం గురించి చెప్తుంటే

దానర్థం ఇంతకు ముందతడను భవించిన సుఖం దీనికన్న తక్కువస్థాయిలో ఉన్నదని, ఇప్పుడెక్కువ సంతోషంగా ఉన్నానని అనుకుంటాడు. కాబట్టి పరమానందంలో (bliss) తారతమ్యముంటుంది. విషయి, విషయములైక్యమైనపుడు అనుభవానందాన్ని పొందు తావు. ఈ ఆనందం ఒకేవిధంగా ఎప్పటికి ఉండదు; అనేకఅంశాలపై ఆధారపడుతుంది. అవి స్థిరంగా ఉండక మారిపోతుంటాయి. అనుభవించే విషయస్వభావం మారవచ్చు, దాని పరిమాణం తగ్గవచ్చు. ఇంద్రియ మనస్సులు మారవచ్చు, మనకి సంతోషము, సుఖము, ఆనందము, పరమానందము, పారవశ్యము మొ॥ అనేకపదములున్నవి. వాటి కి విశేషణములుకూడ ఉండవచ్చు. కాబట్టి ఆత్మస్వరూపాన్ని తెలపటానికి ఆనంద పదాన్ని వాడినప్పడు దాన్ని పరమానందంగా (bliss) లేక మరే రకంగానూ అనుభవగమ్య ఆనందంగా గ్రహించకూడదు.

ఆనందము అనంతంకంటె భిన్నము కాదు. కనుక నిత్యానందమంటే ఉత్పన్నంకాని, కాలబద్ధంకాని ఆనందమని అర్థం. ఉత్పన్నమైనానందము అనిత్యము. స్వరూపానం దము నిత్యము - కానీ అవివేకంవలన అది అనిత్యంగా చూస్తారు. 'అనిత్య ఆనంద' మని అనటం సందిగ్ధావస్థకు దారి తీస్తుంది. సాధారణంగా ప్రపంచంనుండి నీకు లభించే ఆనందమనిత్యమనీ, బ్రహ్మానందము నిత్యమని చెప్తుంటారు. ఈ రకమైనవైఖరి సమస్య లకి దారితీస్తుంది. నీవు లోకంలోనే జీవించాలి. దాన్నుండి తప్పించుకోలేవు. లోకం కొంత ఆనందాన్ని తప్పక అందిస్తుంది. అది అనిత్య ఆనందము కాబట్టి - దానిని వదిలివే యాల్సిన దానిగా చూస్తావు. వేదాంతాధ్యయనానికి ముందు నీవు సాధారణమైన అని త్యానందాన్ని అనుభవిస్తున్నావు. ఇకపై దాని ననుభవించలేవు. కనుక ఈ నిర్దిష్టత (orie ntation) తప్పు. అంతే కాక వేదాంతానికి రాకముందు నీవనుభవిస్తున్న సాధారణజీవితం కూడ నీకు లేకుండా పోతుంది. ఈ రకమైనకట్టడి (conditioning) నిత్యజీవితంలో నీ వనుభవించాలని ఆశించే ఆనందాన్ని నాశనం చేస్తుంది. అంతేకాక నీలో అపరాధిననే

భావనను (guilt) పెంచుతుంది. నీ కున్నదల్లా అనిత్య ఆనందం. ఆ పరిస్థితిలో 'నాకు వైరాగ్యంలేద'ని చెప్తుంటావు. కానీ వాస్తవంలో బోధఅంతా కూడ నీకున్న నిర్దిష్టతలను తొలగించటం కోసం చేసే ప్రయత్నమే.

కేవలం ఉన్న కట్టడులను, పరిధులను తొలగించటం (de-conditioning) నిన్ను శూన్యంలోకి నెట్టి వేస్తుంది. కాబట్టి సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మలాంటి విధేయ వాక్యాలు లక్షణావృత్తిద్వారా కోరినరీతిలో పనిచేస్తాయి. అనిత్య - ఆనందం కూడ ఆత్మను అనంతం బ్రహ్మగా ప్రతిపాదిస్తుంది. అనుభోక్త, భోజ్యము (విషయము) రెండుకూడ పూర్ణబ్రహ్మను విడిచి భిన్నంగా ఉండవు. కాబట్టి అనిత్య ఆనందము - క్షణిక ఆనందం కూడ నీస్వరూపంకంటే భిన్నంగా లేవు. అది విషయి విషయముల ఐక్యస్థితిని బోధిస్తుంది. నిన్ను నీవు చూచుకోవటానికదొక కిటికీలాంటిది. కనుక నిత్యా నందైకరసమంటే కాలబద్ధముకాని, తారతమ్యములేని ఆనందము. అంటే అది అపరిచ్ఛిన్న అనంతానందము. అదే ఆత్మస్వరూపము. ఈ ఆనందము ప్రత్యగభిన్నము. ఇంకను అది నిరంతరము - ద్వైత రహితము. అవిభక్త పూర్ణము. అటువంటి బ్రహ్మము జయించును. అంటే మోక్షరూపంలో లభిస్తుంది. చివరకు జయించేది బహ్మమేనని కూడ వాచ్యార్థాన్ని చెప్పకోవచ్చు. చిరునవ్వుచిందిస్తూ నిలిచేది బహ్మమే. మనం సాధారణంగా మృత్యువే విజయగర్వంతో చివరకు నిలుస్తుందనుకుంటాము. కానీ ఆత్మ మృత్యువును కూడ కబళిస్తుంది. అందుకే పరమేశ్వరుణ్ణి మృత్యుంజయుడని స్తుతిస్తాము.

68వ శ్లోకము

సద్బ్రహ్మకార్యం సకలం సదేవ, సన్మాత్రమేతద్ న తతో న్యదస్తి ।
అస్తీతి యో వక్తి న తస్య మోహః వినిర్గతో నిద్రితవత్ ప్రజల్పః ॥ 232 ॥

సద్ బ్రహ్మకార్యం - సత్ స్వరూప బ్రహ్మమునుండి ఉత్పన్నమైనది కనుక; ఏతత్ సకలం - ఈ సమస్త ప్రపంచము; సత్ ఏవ - సత్తే; సత్ మాత్రమ్ - సన్మాత్రమే. తతః తన్యత్ -

దాని కంటె బిన్నంగా వేరేదేదీ; న అస్తి - లేనే లేదు; అస్తి ఇతి - (బ్రహ్మకంటె భిన్నంగా) వస్తువు ఉన్నది అని; యః వక్తి - ఎవరైతే చెప్తారో; తస్య మోహః - అతడి మోహము (భ్రమ); న వినిర్గతః - విడిపోలేదు; నిద్రితవత్ ప్రజల్పః - అతడి మాటలు స్వప్నప్రలాపముల వంటివి.

> "సద్రూప బ్రహ్మమునుండి ఉత్పన్నమైనది కనుక సకలజగత్తు సన్మాత్రమే. సత్‌బ్రహ్మకంటె భిన్నమైనదేదీ లేదు. బ్రహ్మముకంటె వేరుగా ఒకటంటూ ఉన్నదని ఎవరైనా అంటే ఇంకా అతడి మోహము వీడలేదు. అతడి మాటలు స్వప్నప్రలాపముల వంటివి."

ఈ శ్లోకం ఈ మొత్తం అధ్యాయంలోని సారాంశాన్ని బోధిస్తుంది. సకల జగత్తు సత్‌బ్రహ్మమే. ఎందుచేత ? బ్రహ్మకార్యము కనుక సమస్తజగత్తుకు సద్‌బ్రహ్మము ఉపాదానకారణము. ప్రతివస్తువు కార్యమేకనుక ప్రతిదీ సత్ మీద ఆధారపడుతుంది. అందుచేతనే గురువు చెప్తున్నాడు - "ఉన్నదంతా సన్‌మాత్రమే. మృణ్మయజగత్తులో కుండ, బాన, మూకుడు మొ॥ వన్నీ మృత్తిక తప్పవేరేదీ లేదు. మృణ్మయజగత్తులో మృత్తుతప్ప మరొకటేదీ లేనేలేదు. ఘటాదులు కేవలం నామరూపములు మాత్రమే. ఉపాదానకారణంకంటె మరేదీ లేదు. అదేవిధంగా ఉపాదానకారణమైన సద్‌బ్రహ్మకంటె వేరుగా ఈ జగత్తులో స్వతంత్రసత్తా కలిగిన వస్తువంటూలేదు" అని.

బ్రహ్మకంటె బిన్నంగా జగత్తు ఒకటి ఉన్నదని ఎవరైనా అంటే దానర్థం అతడి మోహమింకా తొలగలేదని. అతడి దృష్టిలో బగవంతుడంటే స్వర్గంలోనో వైకుంఠంలోనో ఉన్న ఒకదైవం. అప్పుడు భూమి విశాలవిశ్వంలో అణుమాత్రాంశ అవుతుంది. అంతకంటే అల్పుడవుతాడు మానవుడు. అంటే-లేనివాడితో సమానం.

ఈ జగత్తు - ఆ బ్రహ్మముకంటె భిన్నమని - లేదా భగవానుడెక్కడో లోకంలో ఉన్నాడని ఎవరైనా చెప్తే - నిజానికతడు చెప్తున్నది ఉపాదానకారణము కార్యముకంటె దూరంగా

ఉన్నదని. అటువంటి మాటలు స్వప్నపురుషుని ప్రలాపాల్లాంటివి. ఎవరైనా స్వప్నంలో మాట్లాడటం మొదలుపెడితే ఒక క్రమంగానీ తీరుతెన్నుగానీ ఉండవు. అతడేంమాట్లాడు తున్నాడో అతడికే తెలియదు.

జల్పంతో వాదించే వ్యక్తి తాననుకున్నదే చెప్తాడు. సమర్థించుకుంటాడు. తన నిర్ణ యాన్ని సిద్ధాంతాన్ని ఎప్పటికీ విడిచిపెట్టడు. ఎదటివారు ఎంత సప్రమాణంగా నిరూపిం చినప్పటికీ తాననుకున్నదే తుదినిర్ణయమంటాడు. అటువంటి వ్యక్తినెవ్వరు ఒప్పించలేరు. ప్రమాణానికి గాని, యుక్తి యుక్తంగా మాట్లాడటానికతడు దొరకడు. తాను చెప్పేదా నిని గురించి అతడికి స్పష్టత ఉండదు. కొన్ని పరంపరలకు చెందిన వ్యక్తులీవిధంగా ప్రవ ర్తిస్తారు.

ఈశ్వరుడు జగత్తుకంటె భిన్నమని చెప్పేవారంతా ద్వైతులే. వారు మాట్లాడేదంతా జల్పమే. వారు ఘటపటాదులను చూస్తారు. ఘటము తనకు ఉపాదానకారణమైన మృత్తికకంటె భిన్నముకాదు. వస్త్రము తంతువులకంటె భిన్నముకాదు. అలాగే సువర్ణకం ఠాభరణము స్వర్ణముకంటె భిన్నముకాదు. ఏ కార్యము కారణముకంటె భిన్నముకాదు. ఇదంతా గమనిస్తున్నప్పటికీ ద్వైతులు కార్యము కారణంకంటె భిన్నమని చెప్తారు. అందు చేతనే వారు చెప్పేదంతా జల్పమే.

ఈశ్వరుడు జగత్తుకంటె భిన్నమయితే తాను కూడ ఒకసాధారణవ్యక్తి అవుతాడు. వీరంతా పరమేశ్వరునికి మాటసాయం మాత్రం చేస్తారు! ఈశ్వరుడు సర్వవ్యాప్తి అయితే ఒక చోట ఎలా కూర్చొని ఉంటాడు. దీనికి వారు ఈశ్వరుడు సూర్యకాంతిలాగసర్వవ్యాప్తి అని సమాధానమిస్తారు. సూర్యుడు ఒకచోట ఉంటూ సమస్తజగత్తుని బాసింపజేస్తుం టాడు. అదేవిధంగా భగవానుడు ఒక లోకంలో కూర్చొనిఉంటూ జగత్తునివ్యాపించి ఉంటాడు. జగత్తుకంటె భిన్నంగా ఉంటాడని చెప్తారు.

అది సత్యము కాదు. బ్రహ్మము అనంతము. అనంతత్వము బ్రహ్మము యొక్క స్వరూపము, బ్రహ్మము తప్పవేరేదీ లేదు. శ్రుతి "సదేవ సౌమ్య ఇదమగ్రే ఆసీత్ ఏకమేవ అద్వితీయమ్ - ఓ సౌమ్యుడా! ఈ జగత్తు పూర్వం ఏకము అద్వితీయమైనసత్ మాత్రముగానే ఉండెను" అని చెప్తుంది. సృష్టినంతరం కూడ సత్‌మాత్రమే ఉన్నది. నామరూపాత్మకమైన జగత్తు మిథ్య. కనుక ద్వైతము లేనేలేదు.

పునః, విషయవిషయి ద్వైతాన్ని నిరూపించటానికి శాస్త్రము, బోధ అవసరంలేదు. నీ కంతకుముందే తెలుసు. ఒకలోహాన్నుండి మరోలోహము భిన్నమని గుర్తించటానికి ఫిజిక్స్ అవసరంలేదు. అంధుడుకూడ బంగారపు ముక్కను వెండిముక్కను వేరుపరచగలడు. వాటి వాటి పరిమాణాన్ని, బరువులను బట్టి, కానీ పదార్థము (matter) శక్తి (energy) అని గుర్తించటానికి ఫిజిక్స్ కావాలి. అదే విధంగా అద్వైతాన్నర్థంచేసుకోవటానికి శ్రుతి కావాలి. ద్వైతాన్ని చూచేవాడింకా మోహంలోనే ఉన్నాడు.

69వ శ్లోకము

బ్రహ్మైవేదం విశ్వమి త్యేవ వాణీ శ్రౌతీ బ్రూతేథర్వనిష్ఠా వరిష్ఠా ।

తస్మాదేతత్ బ్రహ్మ మాత్రం హి విశ్వం నాధిష్ఠానాదః భిన్నతారోపితస్య ॥ 233 ॥

అధర్వ నిష్ఠా - అధర్వ వేదములోని; వరిష్ఠా శ్రౌతీవాణీ - శ్రుతి యొక్క మహావాక్యము; బ్రహ్మ ఏవ ఇదం విశ్వం ఇతి ఏవ - ఈ సమస్త విశ్వము బ్రహ్మమని బ్రూతే - ప్రకటిస్తుంది; తస్మాత్ - కాబట్టి; ఏతద్ విశ్వం బ్రహ్మమాత్రమ్ - ఈవిశ్వమంతా బ్రహ్మమే; హి - ఎందుచేతనంటె; ఆరోపితస్య - ఆరోపించబడినదానికి; అధిష్ఠానాత్ భిన్నతా (నాస్తి) - అధిష్ఠానంకంటె భిన్నత్వము లేదు.

"అధర్వవేదములోని మహావాక్యము ఈ సమస్తవిశ్వము బ్రహ్మమేనని
ప్రకటిస్తుంది. ఆరోపితానికి అధిష్టానంకంటె భిన్నత్వం లేదుకనుక-
ఈ సమస్తవిశ్వము బ్రహ్మము మాత్రమే."

గ్రంథకర్త ఇక్కడ అథర్వశ్రుతి ముండకోపనిషత్తు మంత్రంలోని ఒక భాగాన్ని ఉదహరిస్తున్నారు. "బ్రహ్మైవ ఇదం విశ్వం - ఈ సమస్తవిశ్వము బ్రహ్మమే." ఆశ్రుతి సారాంశం ఈ విధంగా ఉంటుంది - "నీ కెదురుగా నున్న ప్రపంచము బ్రహ్మము, వెనుక నున్నది బ్రహ్మము. నీకు కుడివైపు ఉన్నది బ్రహ్మము, నీకు ఎడమ వైపున ఉన్నది బ్రహ్మము. ఊర్ధ్వముఖంగా చూస్తే ఉన్నది బ్రహ్మము, అధోముఖంగా ఉన్నది బ్రహ్మము, అంతా బ్రహ్మము తప్పవేరేదీ లేదు" అని. శ్రుతి ఇదే విషయాన్ని మళ్ళీ మళ్ళీ చెప్తుంది. నీవీ విషయాన్ని దాటివెళ్ళటం శ్రుతికిష్టంలేదు; నీవీ విషయంలోనే దృష్టిని నిలపాలని కోరుతుంది.

ఈ జగత్తు బ్రహ్మము. ప్రతిక్షణము అది మారిపోతున్నప్పటికీ, అది బ్రహ్మముకంటె భిన్నము కాదు. అందుచేతనే అది అమృతము. జగత్తు దుఃఖాత్మకమని మనమనం, నీవీ జగత్తును లేదని నిషేధించటమే కోరుకోం; జగత్తును బ్రహ్మముగా గుర్తించాలని కోరుకుంటాము. నీ దేహేంద్రియమనో బుద్ధులసంఘాతము జగత్తులో అంతర్భాగము కనుక - బ్రహ్మమే. ఈ జగత్తు దుఃఖాత్మకమని చెప్తే - అదంతా అవివేకమువలననే - అజ్ఞానఆవరణం చేతనే. కనుక నీ వేదైనా వస్తువుగురించి ఫిర్యాదుచేస్తే లేక ప్రతికూలంగా చెస్తే, అది వస్తువుగురించి కాదు. అన్ని ఫిర్యాదులలో మూలవిషయము 'నీవే'.

'న అధిష్ఠానాతః భిన్నత్వం ఆరోపితస్య - ఆరోపితవస్తువు అధిష్ఠానం సత్యం కంటె భిన్నము కాదు. కారణ - కార్య సంబంధములో కార్యము మిథ్యకానీ కారణంకంటె భిన్నము కాదు. ఘటమని అన్నప్పడు - ఘటము మృత్తికకంటె వేరుకాదు. అంటే ఆరోపితము - మిథ్యాఘటము, అధిష్ఠానము - సత్యమైన మృత్తికకంటె వేరుకాదు. ఆరోపితము అధిష్ఠానముకంటె వేరుకాదు కనుక -తొలగించి వేరుపరచాల్సిన అవసరం లేదు. అది ఆరోపితమని అర్థంచేసుకోవాలంతే. ఉదాహరణకేదైనా ఒక ఆలోచనని తీసుకో. ఆలోచనకు నిన్ను - చైతన్యాన్ని - ఎరుకను విడిచి ఉనికిలేదు. ఆలోచన ఏదైనాకావచ్చు. అదెన్నటికి చైతన్యాన్ని ఎరుకను విడిచి ఉండదు. ఆ చైతన్యమే బ్రహ్మ.

వృత్తి ఎప్పడూ వ్యావృత్తమవుతూ - మారిపోతూ ఉంటుంది. తనసత్తాకై ఎప్పటికీ చైత న్యముపై ఆధారపడుతుంది. కనుక ఒక ఆలోచన స్థానంలో మరో ఆలోచనను తీసుకు రావచ్చు. దాన్నికూడ మార్చవచ్చు. అలాగే మారుస్తూ కొనసాగవచ్చు. ఈ మారుతున్న వృత్తులన్నిటిలోనూ అధిష్ఠానము మారకుండా స్థిరంగా తానుతానుగా ఉంటుంది. ఒక వేళ అధిష్ఠానంకూడ మారిపోతే నీవేమీ చూడలేవు. విషయి-విషయములుగా విభజింప బడినట్లుగా భాసిస్తుంది. సమగ్రమైన బోధ సారాంశమంతా ఆ చైతన్యమే. బోధ జరుగు చుండగానే ఆ చైతన్యాన్ని - నిన్ను నీవు గుర్తించాలి. అదేదో తరువాత ధ్యానంలో గుర్తిం చవలసింది కాదు. అది అన్నివేళల్లోనూ ఉన్నదే. అధిష్ఠానము సత్యం జ్ఞానం అనంతం- అదే నీవు, ఇదే ఉపదేశం.

అంతేకాక, ఆ అధిష్ఠానము జగత్ కారణము; కార్యము - ఈ సమస్త జగత్తు దానిపై ఆరోపితము. ఆ అధిష్ఠానాన్ని నీవు గుర్తించిన క్షణంలోనే ఆరోపితము నిషేధించబడు తుంది. బాధించబడుతుంది. కాబట్టి అధిష్ఠానాన్ని గుర్తించేప్రయత్నం చేస్తావుగాని అధ్యా సను, అధ్యస్తమును గురించి ఏమీచేయవు. రజ్జుస్థానంలో ఎవరైనా పామును చూస్తే సర్పము అధ్యాస అని అన్నంతమాత్రాన ప్రయోజనమేమీ ఉండదు. నీవేంచెప్పాలంటే “అరె! చూడు అదితాడు సర్పముకాదు” కాబట్టి మొదట చెప్పవలసినది. “అది త్రాడు”. అనంత రము “అది సర్పము కాద”ని చెప్ప. తరువాత నిషేధించటం - బాధచేయాలి మొదట సర్పాన్ని చూశాడు గనుక. వస్తునిశ్చయంచేసినప్పడే అధ్యాస తొలగుతుంది. అక్కడున్నది రజ్జువని తెలుసుకున్నప్పడే రజ్జుసర్పము తొలగిపోతుంది.

కానీ ఘటము మృత్తుకన్న వేరుగాలేదని, ఘటనామరూపాలు కేవలం అధ్యస్తము లేనని నీవర్థంచేసుకున్నప్పటికీ ఘటము ఈశ్వరసృష్టి గనుక, లేకుండా పోదు, అవసరంకూడా లేదు. ఘటము మృత్తికకంటే వేరుగా లేదని నీవర్థంచేసుకోవటానికి ఘటం నశించాల్సి నవసరంలేదు. అదేవిధంగా ప్రతివృత్తికి నీవే అధిష్ఠానము; ప్రతివృత్తి పూర్తిగా నీమీదే

ఆధారపడుతుందని నీవు గ్రహిస్తే - అప్పుడు వృత్తి తొలగిపోవల్సిన అవసరమేముంది? ఆరోపిత వృత్తి ఏవిధంగా అధిష్ఠానాన్ని బాధిస్తుంది ? వృత్తి గనక అధిష్ఠానానికి క్లేశం కలిగించేదైతే - అప్పుడది అధిష్ఠానంకంటె భిన్నమైన మరోవస్తువవుతుంది. కానీ శాస్త్రం చెప్తుంది - "నీవర్థం చేసుకోవాలనుకునేదానికంటె, పొందాలనుకునే దానికంటె భాసిస్తున్నది. ఇదే సమగ్రశాస్త్ర బోధ.

కానీ జగత్తు కూడ బ్రహ్మమేకనుక, సత్యమేనని ఎవరైనా భావించవచ్చు. కనుక సందేహం కలుగుతుంది. తరువాత శ్లోకంలో దాని ప్రస్తావనచేసి నిరాకరిస్తున్నారు.

70వ శ్లోకము

సత్యం యది స్యాత్ జగదేతదాత్మనో నంతత్వహానిర్నిగమాప్రమాణతా ।
అసత్యవాదిత్వమపీశితుః స్యాత్ నైతత్ త్రయం సాధుహితం మహాత్మనామ్ ॥ 234 ॥

ఏతత్ జగత్ - జగత్తు; యది సత్యం స్యాత్ - సత్యమే అయేట్లయితే; ఆత్మనః అనంతత్వ హానిః - ఆత్మ యొక్క అనంతత్వానికి హాని జరుగుతుంది; నిగమ అప్రమాణతా - వేదము అప్రమాణమవుతుంది; ఈశితుః - ఈశ్వరునికి; అసత్యవాదిత్వమ్ అపి స్యాత్ - ఈశ్వరునికి అసత్యవాదిత్వము ఉంటుంది; మహాత్మనామ్ - మహాత్ములవిషయాలలో;ఏతత్ త్రయం - ఈ మూడునూ; న సాధు - యోగ్యమైనవి కావు; (న) హితం - హితమైనవికావు.

> "జగత్తు సత్యమయేట్లయితే అప్పుడు ఆత్మయొక్క అనంతత్వానికి హాని జరుగుతుంది. వేదములు అప్రమాణములవుతాయి. ఈశ్వరుడు అసత్యవాది అవుతాడు. మహాత్ములవిషయాలలో ఇది యోగ్యమైనది కాదు; హితమైనది కూడా కాదు".

జగత్తు సత్యమనే తత్త్వశాస్త్రాలున్నాయి. సాంఖ్యులు జగత్తు ప్రధానము యొక్క వికారము కాబట్టి సత్యమని చెప్తారు. ద్వైతులందరూ అదేవిధంగా ప్రపంచమంతటా వ్యాప్తిలోనున్న మతాలవారును జగత్తు, ఈశ్వర సృష్టి గనుక సత్యమని బోధిస్తారు. వారిదృష్టిలో

ఈశ్వరుడు జగత్తుకంటె భిన్నమైన నిమిత్తకారణము. జగత్తు సత్యమనిచెప్పటానికి హేతువునుకూడ ఇస్తారు. "దృశ్యముకాబట్టి జగత్తు సత్యము, ఘటమువలె" నంటారు. 'జగత్తు మిథ్యా, దృశ్యముకాబట్టి' అని అద్వైతవేదాంతి కూడ చెప్తాడు. పరస్పరవిరుద్ధములైన ఈ రెండు సిద్ధాంతాలకు 'దృశ్యత్వమే' కారణము. ఈ జగత్తుని నేను కళ్ళతో చూస్తున్నాను. కనుక అది సత్యమని నీవంటే, అప్పడు చూడబడేదంతా సత్యమేననే నియమం చేయాల్సిఉంటుంది. అప్పడు మాత్రమే జగత్తుసత్యమని నీవు నిరూపించగలవు జగత్తుని చూస్తున్నావుగనుక. కానీ ఈ నియమము దోషయుక్తమైనది. నీవు ఆకాశం నీలంగా ఉండటం చూస్తావు. కానీ అది సత్యముకాదు. సూర్యుడుదయించటం చూస్తావు. కానీ సూర్యుడదయించడు. భూమి సమతలంగా ఉండటం చూస్తావు. కానీ భూమి అలాగా లేదు. కాబట్టి నీ నియమము దోషయుక్తమైనది, ఆ నియమంపై ఆధారపడిన సిద్ధాంతముకూడ సరియైనది కాదు. కాబట్టి మనం మరొక నియమం చేస్తాము "ఏది దృశ్యమో అది అనిత్యము - ఘటమువలె" అని. ఈ నియమం నిలుస్తుంది. నిరాకరింపబడదు. కనుక ఇది ప్రామాణికమైనదే.

"నేననుభవిస్తున్నాను కాబట్టి జగత్తు సత్యమ" న్నది ధార్మికులవాదన. కానీ శాస్త్రం చెప్తుంది - "జగత్తు సత్యమైతే ఆత్మయొక్క అనంతత్వానికి లోటు / హాని కలుగుతుంది." అని. జగత్తు సత్యమైతే బ్రహ్మమైన ఆత్మ కేవలం జగత్తుకంటె భిన్నమైన నిమిత్తకారణం వరకే పరిమితమవుతుంది. తాను నిర్మించిన కుర్చీకంటె భిన్నమైన వడ్రంగివానివలె. కనుక మనకు రెండు సత్యపదార్థములున్నవి, నిమిత్తకారణమైన ఈశ్వరుడు మరియు జగత్తు. జగత్తు ఈశ్వరునికి పరిచ్ఛేదకమవుతుంది. ఈశ్వరుణ్ణి పరిచ్ఛిన్నం చేస్తుంది. ఆ విధంగ ఈశ్వరుడు జగత్తులు పరస్పరం పరిచ్ఛేదకములవుతాయి. ఒకటున్నచోట మరొకటి ఉండదు. ఘటములో పటము (వస్త్రము) లేదు, పటములో ఘటములేదు. అదే

విధంగా జగత్తులో బ్రహ్మములేదు. సృష్టికర్త బ్రహ్మములో వివరించినట్లుగా బ్రహ్మము అనంతంకాదు. బ్రహ్మమునకు అనంతత్వము లేనట్లవుతుంది.

ఒకవేళ అదే సత్యమయితే అలాగే కానివ్వండి. బ్రహ్మము అనంతము కాకపోనివ్వండి! అయితే ఏమవుతుంది. అది అంగీకార్యము కాదు. దాన్ని నీ వంగీకరించినట్లయితే వేద ము ప్రామాణ్యమును కోల్పోతుంది. "ఏకం అద్వితీయం బ్రహ్మ ఇక్కడ బ్రహ్మముతప్ప వేరే అనేకములంటూ ఏవీ లేవు" అని వేదం చెప్తుంది. బ్రహ్మము అద్వితీయమని నిర్ధారించే అనేకానేక వేదవాక్యములున్నాయి. ఈ వాక్యములన్నీ అసత్యములవుతాయి. బ్రహ్మములో అనంతత్వము నిరాకరింపబడుతున్నది కనుక కాబట్టి శ్రుతి ప్రమాణముగా విలువను కోల్పోతుంది.

"శ్రుతి ప్రమాణం కాకపోతే పోనియమ్మ"ని నీవనేట్లయితే అప్పు డీశ్వరుడసత్యవాది అవు తాడు. వేదములీశ్వరప్రోక్తములని చెప్తారు. మానవమేధస్సు నుండి ఉద్భవించినవికావు. పురుషప్రమాణములు దోషయుక్తంగా ఉంటాయి. మానవునిదృష్టి దోషయుక్త సాధన ముల మూలంగా తప్పకావచ్చు. అతడి అనుమానము (inference) లో దోషాలవలన అ ది తప్పకావచ్చు, అజ్ఞానముతో ఆరంభిస్తాడు కనుక. అజ్ఞానపూర్వకంగానూ, వివిధ వస్తువులగురించిన తప్పడు నిర్ధారణలపూర్వకంగా అతడు ప్రమాణాల నుపయోగిం చట మారంభిస్తాడు. ఈ నిర్ధారణలతడిదృష్టిని, అనుమితిని కుంటుపరుస్తాయి. కనుక అతడి జ్ఞానము దోషయుక్తమైనదవుతుంది. పరమేశ్వరుడుకూడ అజ్ఞానంతో ఆరంభిస్తే అతడి జ్ఞానంకూడ దోషయుక్తమవుతుంది. దీన్ని మనం అంగీకరించం. వేదము ప్రత్య క్షానుమానాల కందని విషయాలను చెప్తుంది. ఆ విషయాలలో వేదమే ప్రమాణము వేదములు దోషరహితజ్ఞానంకల ఈశ్వరప్రోక్తములు. మరిప్పడు జగత్తు సత్యమని నీ వంటే బ్రహ్మము పరిచ్ఛిన్నుడవుతాడు. వేదము ప్రమాణత్వాన్ని కోల్పోతుంది. వేదాన్నందిం చిన పరమేశ్వరుడు అసత్యవాది అవుతాడు. ఇది అంగీకార్యం కాదు. "న ఏతత్ త్రయం

సాధు హితం మహాత్మనామ్ మహాత్ములకిది తగదు." ఇక్కడ మహాత్ముడంటే శాస్త్రమునం దు శ్రద్ధ ఉన్నవాడు. లేదా, మహద్వస్తు జ్ఞానమున్నబుద్ధికలిగినవాడు. అతడి మనస్సు పరబ్రహ్మముతో సమమైనది. అటువంటి పురుషునికి లేదా జిజ్ఞాసువుకి కూడ ఈ నిర్ణ యం హితవుకాదు.

శాస్త్రాధ్యయనానికి పూర్వం నీ నిర్ధారణలన్నీ ఈ విధంగా ఉండేవి. - ఈ జగత్తు నా కంటె భిన్నము, ఈశ్వరుడు నా కంటె భిన్నము. సర్వము నాకంటె భిన్నము. నేనల్పుడను "ఈ పరిచ్ఛిన్నత్వంనుండి ముక్తుడవు కావాలని శాస్త్రాధ్యయనం చేస్తావు. శాస్త్రాధ్యయనా నంతరం కూడ నీవు పరిచ్ఛిన్నుడవుగానే ఉంటావు. అల్పత్వంనుండి ముక్తిపొందే ఆశకూ డాలేకుండా చిన్నవానిగానే కొనసాగుతావు. శాస్త్రము మోక్షాన్నివ్వలేకపోతే శాస్త్రాధ్యయన మెందులకు ?

లోకంలో ప్రతివస్తువు నిన్ను పరిమితుణ్ణి చేస్తుంది. భయపెడుతుంది నీవు సంసారి గానే కొనసాగుతావు. నీతో నీవల్పుడవని చెప్పకుండా జగత్తు శాంతంగా "నీవు నేను కాదని" ప్రతిపాదిస్తుంది. అంటే నీ వల్పుడవని" చెప్పినట్లే కనుక, నీవెప్పటికీ అల్పుడవుగా నే ఉంటావు. నీకున్న ఒకే ఒక ఆశ శాస్త్రము; కానీ శాస్త్రముకూడ అప్రమాణమవుతున్నది. అది చాలా అపాయకరమైన విషయము. ఈ సంసారాన్నుండి బయటపడే వేరేమార్గ మే లేదు. శాశ్వతంగా బద్ధుడనయే ఉంటాను. జగత్తు సత్యమైతే ఉండేపరిస్థితి ఇది. కానీ జగత్తు సత్యముకాదు, మిథ్య.

ఇక్కడొకసందేహాని కవకాశమున్నది. వేదములు చెప్పేది సత్యము కాకపోవచ్చు. ఎందుకంటే వేదవాక్యములు మంత్ర ద్రష్టలైన ఋషిప్రోక్తములు. మరి ఋషులుకూడ మానవులే. వారి ఆలోచనల్లోకూడ దోషముండవచ్చు. ఇక్కడ సందేహము - వేదములీ శ్వరప్రోక్తములు కావని, కాబట్టి అవి దోషయుక్తములు కావచ్చని, కనుక జగత్తు సత్యమ నే వాదన నిలుస్తుందని వారి అభిప్రాయం.

తరువాత శ్లోకంలో భగవద్గీతావాక్యాన్నొకదానిని ఉదహరిస్తున్నారు. భగవద్గీత సాక్షాత్తు ఈశ్వరుడని భావించే శ్రీకృష్ణునినుండి వెలువడింది. ఆ గీతావాక్యము జగత్తు యొక్క మిథ్యాత్వాన్ని, బ్రహ్మసత్యత్వాన్ని స్పష్టంగా ధృవపరుస్తుంది.

71వ శ్లోకము

ఈశ్వరో వస్తుతత్త్వజ్ఞః న చాహం తేష్వవస్థితః ।

నచ మత్‌స్థాని భూతాని ఇత్యేవమేవ వ్యచీకపత్ ॥ 235 ॥

వస్తుతత్త్వజ్ఞః - వస్తు స్వరూపమెరిగినవాడు; ఈశ్వరః - ఈశ్వరుడు; తేషు - వాటిల్లో (భూతములలో) అహం న అవస్థితః - నేను లేను; భూతాని చ - భూతములు కూడ; మత్ స్థాని న - నాలో లేనివే; ఇతి ఏవమ్ ఏవ - అని ఈ విధంగానే; వ్యచీక్షపత్ - ప్రకటించెను.

"వస్తుతత్త్వజ్ఞుడైన ఈశ్వరుడు 'నేను భూతములలో లేను, నాలో భూతములు లేవని' ప్రకటించాడు."

ఈశ్వరుడు అజ్ఞానమున్న వాడుకాదు. సత్యస్వరూపమేమిటో తెలిసినవాడు పరమేశ్వరావతారమైన శ్రీకృష్ణుడు భగవద్గీతలో సర్వభూతములు నాలో ఉన్నాయని చెప్పాడు (భ.గీ. 9-4). అంటే సర్వభూతములు వాటి వాటి అస్తిత్వానికి నా మీదే ఆధారపడతాయని భగవానుడంటున్నాడు. కానీ భగవానుడు కూడ తన అస్తిత్వానికి వాటిపై ఆధారపడతాడా ? "నేను వాటిల్లో లేను. సృష్టింపబడిన దేనిలోనూ నా ఉనికి లేదని" భగవానుడంటున్నాడు. అంటే సృష్టికి ఈశ్వరునివిడిచి స్వతంత్రసత్తా లేదు. కానీ ఈశ్వరుడు స్వతంత్రుడు. అహం సత్యము, తద్భిన్నమంతా మిథ్య కనుక ఇది సంభవమే.

మృత్తుకూడ చెప్పవచ్చు, "మృత్తునుండి చేయబడినవన్నీ నాలోనే ఉనికి కలిగిఉన్నవి. కానీ నేను వాటిలో లేను" అని మృత్తు మృణ్మయజగత్తు పై ఆధారపడిలేదు. మనకిక్కడ

రెండువస్తువులు లభిస్తాయి - ఒకటి సత్యము- రెండవది మిథ్య. ఘటముల దృష్ట్యా మృత్తు - ఇవన్నీ నాలో ఉన్నాయని చెప్పవచ్చు. తన స్వరూపదృష్ట్యా "నాలో ఏదీలేదని" కూడ మృత్తు చెప్పవచ్చు. ఈ ఒక్క వాక్యములో రెండు విరుద్ధాంశాలు చెప్పబడినాయి. మృణ్మయజగత్తుకు మృత్తు సత్యము కనుక, మృణ్మయజగత్తు మిథ్యకనుక ఇది సంభవమవుతుంది. అందుచేతనే భగవానుడు చెప్తాడు- "నా యీ ఈశ్వరీయమాహాత్మ్యమును చూడు" అని (భ.గీ 9 - 5). ఈశ్వరమాహాత్మ్యము మాయయే. అసాధ్యాన్ని సుసాధ్యము చేయగల శక్తి కలదే మాయ.

విపరీతం (paradox) గోచరిస్తుంది. ఇక్కడొక సత్యవస్తువు బ్రహ్మము తానే మార్పు చెందకుండగ, జగత్తుగా భాసిస్తున్నది. ఇది భగవానుని సమర్థత కానీ ఆ విరుద్ధాంశమే సత్యాన్నీ బోధిస్తుంది. సృష్టిని గమనిస్తే ప్రతిదీ నీతో సహా విపరీతమే. "ఇది నేను - ఇది నేను" అని నీవు చెప్తే శరీరంలో ఏ కణము నీవు? లేదా అన్ని కణాలు ప్రోగుగా చేస్తే నీవవుతున్నావా? ప్రతికణానికి వివిధపేర్లుంటే, అప్పడవన్నీ కలిపితే మరొకటెలా అవుతున్నది? కాబట్టి ఈ "ఫలానా - ఫలానా" అనేదే విపరీతము.

సృష్టితో ప్రతివస్తువు అంతే. ఒక వృక్షమును చూద్దాం, వృక్షత్వమున్నదానిని వృక్షము అంటారు. కనుక వృక్షత్వానికి వృక్షము ఆశ్రయము. మరిప్పడావస్తువు, ఆ ఆశ్రయము వృక్షమా, తద్భిన్నమా ? అది వృక్షం కాలేదు. ఎందుకంటే ఆశ్రయము వృక్షమయేట్లయితే దానిలో వక్షత్వమున్నట్లే, వృక్షత్వములేకుండా వృక్షముండలేదు. అవృక్షమని చెప్పాల్సి వస్తుంది. అంటే వృక్షముకానిది వృక్షత్వం కలిగిఉన్నది. అది విపరీతం కాదా ? వృక్షత్వాన్ని వృక్షముకానిదానిమీద ఆరోపిస్తే కాని, ఇది సంభవంకాదు. ఈ రకమైన విపరీతాల్ని అంతటా చూస్తావు. కాబట్టి ప్రతివస్తువులోనూ, నిమిత్తంలోనూ ఒకఅంశము సత్యము, మరొకటి మిథ్య, ఆ విధంగా భగవానుడు "నేను వాటిలో లేను" "అవి నాలో లేవు" అన్న వాక్యముల ద్వారా బ్రహ్మసత్యత్వాన్ని జగన్మిథ్యాత్వాన్ని ప్రతిపాదిస్తున్నాడు.

జగత్తును సత్యంగా గ్రహిస్తే అనేకసమస్యలెదురవుతాయి. రెండు సత్యవస్తువులుంటాయి. జగత్తు ఈశ్వరుడు, మతప్రవక్తలు చెప్పేది ఇదే. ఒకటి రెండవదాన్ని పరిచ్ఛిన్నం చేస్తుంది. ఈశ్వరుడు పరిచ్ఛిన్నుడవుతాడు. పరిచ్ఛిన్నుడు గనుక ఈశ్వరుడు ఈశ్వరత్వాన్ని కోల్పోతాడు. అంతేకాకుండా మోక్షానికే విరుద్ధము. ఈశ్వరుడ పరిచ్ఛిన్నుడయితే మోక్షానికర్థం లేదు. నేను ఈశ్వరునికంటె భిన్నుడనయితే, ఈశ్వరుడు జగత్తుకంటే భిన్నుడయితే, అప్పుడు మోక్షానికి ముందేస్థితి ఉన్నదో అదే కొనసాగుతుంది. వాస్తవానికి మోక్షం తరువాత అని ఎవ్వరూ చెప్పలేరు. అన్వేషణ - సాధన సాగుతూనే ఉంటుంది. గనుక, తానల్పుడనని భావిస్తాడు పురుషుడు. ఈ భావననుండి విముక్తి పొందనిదే మానవునిఅన్వేషణ ఆగదు. అల్పత్వభావననుండి విముక్తి పొందే మార్గం లేదు గనుక, అన్వేషణ ఆగదు. కాబట్టి ఎవరూ అన్వేషణ ఆపలేరు. అన్వేషణకర్థమూ ఉండదు. ఎందుకంటే సత్యవస్తువును పరిచ్ఛిన్నరహితమైనదానిగా గ్రహించలేదు గనుక.

కానీ ఈశ్వరునికి తెలుసు వస్తుస్వరూపము - బ్రహ్మస్వరూపము. అందుచేతనే భగవానుడు చెప్తున్నాడు. "సర్వభూతములు నాయందే ఉనికి కలిగి ఉన్నాయి." "నిజానికి నాయందే వస్తువు ఉనికి కలిగిలేదు." విపరీతంగా - విరుద్ధంగా గోచరించినప్పటికీ ఈ రెండువాక్యములు సంగతములే. కారణ - కార్యసంబంధ దృష్ట్యా కార్యము తన అస్తిత్వమును కారణములోనే కలిగి ఉన్నదని చెప్పవచ్చును. అందుచేతనే భగవానుడు చెప్తాడు - "సర్వభూతములు నా యందే ఉనికి కలిగిఉన్నాయి. సర్వభూతములు కారణమైన నా కంటె భిన్నములు కావు. నా ద్వారానే సృజింపబడతాయి. నా మూలంగానే స్థితిగతులుగలిగిఉంటాయి. నా లోనే లయం చెందుతాయి. వాస్తవానికి నేనే సత్యము, అవి మిథ్య" అని. కానీ బ్రహ్మస్వరూపదృష్ట్యా జగత్తే లేదు. మృత్తికా దృష్ట్యా ఘటములేదు. సువర్ణం దృష్ట్యా గొలుసంటూ లేదు. గొలుసని వ్యవహరిస్తున్నాకూడ. కాబట్టి వస్తుదృష్ట్యా ఈశ్వరునియందు ఉనికి గలిగిన వస్తువంటూ లేదు.

72వ శ్లోకము

యది సత్యం భవే ద్విశ్వం సుషుప్తావుపలభ్యతామ్ ।

యనోన పలభ్యతే కించిత్ అతోసత్ స్వప్నవన్మృషా ॥ 236 ॥

విశ్వం - విశ్వము యది సత్యం భవేత్ - సత్యమయేట్లయితే; సుషుప్తౌ - సుషుప్తిలో; ఉపలభ్యతామ్ - గోచరించాలి; యత్ - ఎందుచేతనైతే; కించిత్ న ఉపలభ్యతే - ఏకొంచెంకూడ గోచరించదో, అతః - అందుచేతనే;అసత్ స్వప్నవత్ - అసత్యమైన స్వప్నంలాగా; మృషా - అసత్యము.

"జగత్తు సత్యమైతే సుషుప్తిలో గోచరించాలి. సుషుప్తిలో ఏమాత్రము అనుభవంలో లేదు గనుక, ఈ జగత్తు మిథ్యాస్వప్నమువలె అసత్యమే".

ఈ శ్లోకంలో జగత్తేవిధంగా సత్యము కాదో యుక్తియుక్తంగా బోధిస్తున్నారు. వివిధ ప్రత్యయములద్వారా గోచరిస్తుంది గనుక, ఈ లోకాన్ని విశ్వమంటారు. జగత్తుసత్యమైతే సుషుప్తిలో కూడ ఉపలభ్యంకావాలి. మూడుకాలాల్లోను ఉపలభ్యమయేదాన్నే సత్యమంటారు. కానీ సుషుప్తిలో జగత్తు ఉపలభ్యం కావటంలేదు. కనుక అది అసత్యము.

అన్వయవ్యతిరేకన్యాయముద్వారా - జగత్తుయొక్క అస్తిత్వంలో నీ అస్తిత్వము అన్వయిస్తుంటుందని - నీవే సత్యమని - నీకవగతమవుతుంది. అన్వయమంటే వేరేదున్నప్పడు ఇది ఉంటుంది. వ్యతిరేకమంటే వేరేది లేకపోయినా ఇది ఉంటుంది. ఉదాహరణకు మృద్ఘటమును తీసుకుందాం. ఘటము (వేరేది) ఉన్నప్పడు మృత్తు (ఇది) ఉన్నది. ఘటము (వేరేది) లేకున్నా మృత్తికా (ఇది) ఉన్నది. కాబట్టి మృత్‌సత్యము, ఘటము మిథ్య, అదేవిధంగా జగత్తున్నప్పడు నీవున్నావు; జగత్తులేనప్పడు, సుషుప్తిలో లాగా, కూడా నీవున్నావు. కనుక నీవు సత్యము; జగత్తు మిథ్య. అది స్వాప్నికజగత్తుకావచ్చు లేక జాగ్రదావస్థలో జగత్తుకావచ్చు. మనస్సులో వృత్తి ఉంటుంది. వృత్తి ఉన్నదంటే నేనుండి ఉండాలి. కనుక జగత్తు ఉన్నప్పడు నేనున్నాను. జగత్తు లేనప్పడు కూడ నేనున్నాను సుషుప్తిలోవలె.

కాబట్టి సుషుప్తి ఆత్మస్వరూప (నా స్వరూప) మేమిటో అర్థం చేసుకోవటానికి - కొంత అవగాహననిచ్చే కిటికీలాగ పనిచేస్తుంది. కానీ సుషుప్తిలో నీవున్నావని నీకెలా తెలుసు? అనుభవం ద్వారా. మేలుకున్నప్పడు నీ అనుభవాన్ని చెప్తావు, "నేను చక్కగా నిద్రపోయాను. అక్కడ నేను దేన్నీచూడలేదు" అని. ఈ అనుభవం నిరూపిస్తుంది. సుషుప్తిలో జగత్తు లేకుండా నేనున్నానని. కనుక సుషుప్తిలో జగత్తు లేదని కొట్టివేయబడుతున్నది గనుక, అది సత్యముకాజాలదు. జగత్తు మిథ్య.

క్షణిక విజ్ఞానవాది ఈ విధంగా వాదించవచ్చు - సదా మార్పుచెందుతూ ఉండేది సత్యమని మనమెందుకు నిర్వచించకూడదు ? ఇహలోకంలో ప్రతిదానికి ఉన్నది కాలబద్ధమైన అస్తిత్వమే. ఇది నా అనుభఒం. నేను చూస్తూండగానే ప్రపంచం మారుతున్నది. నేను చూచే ప్రతిదృశ్యము మారుతున్నది. అదేవిధంగా నేను, ద్రష్ట కూడ. ప్రతిదీ క్షణికమే. కాబట్టి పరిణామమే సత్యము. అవికారివస్తువంటూ లేకపోతే మనమీవాదమునంగీకరించవచ్చు. కానీ సర్వము ఉన్నప్పడు నీవుంటున్నావు అనీ - సర్వము లయంచెందినప్పడు కూడ సుషుప్తిలో లాగ - నీవుంటున్నావని - నీ అనుభవమే చెప్తున్నది. కనుక అవికారివస్తువు (నీవు) ఒకటి ఉన్నది. అదెన్నటికి మారదు. ఇతరమైనదంతా మార్పుజెందుతున్నది. ఇతరమైనదంతటిలో ఈ వస్తువుయొక్క అస్తిత్వమున్నది. కాబట్టి సత్యమిథ్యలు స్పష్టములే. నీవే వస్తువునైనా చూడు, ఏ అనుభవాన్నైనా, ఈ రెండూ (సత్యమిథ్యలు)ఉంటాయి. ప్రతివృత్తి నామరూపయుక్త చైతన్యం తప్ప వేరేదీకాదు. చైతన్యము పరిణమించదు. అది సత్యము. నామరూపములు మారుతవి కనుక అవి మిథ్య.

నేను స్వయంప్రకాశస్వరూపవస్తువును, నా అస్తిత్వాన్ని నిరూపించు కొవటాని కేప్రమాణము అవసరంలేదు. మిగిలినదంతా ఆత్మకు ప్రకాశిస్తుంది. ఆత్మమారదు. అది జ్ఞాతృజ్ఞేయజ్ఞానత్రిపుటిని భాసింపజేస్తుంది. ఆ సాక్షిచైతన్యమే సత్యము. జగత్తుమారిపోతున్నది నిజమే, కానీ జగత్తు మారిపోతున్నదని" చెప్తున్న నీవు మారటంలేదు. మారి

పోయేప్రపంచంతోపాటు నీవు కూడ మారిపోతే అప్పడామారుతున్న జగత్తును గమనిం చటానికి నీవంటూ ఉండవు. నీ జ్ఞానము క్షణికమై జ్ఞాతవైన నీవుకూడ క్షణికమయితే, ముందున్నది క్షణికమని చెప్పటానికి నీవప్పడుండాలి. ఆ నీవు మారిపోతే పూర్వాను భవాన్ని జ్ఞప్తికి తెచ్చుకొనిచెప్పటాని కెవరున్నారు ? ప్రతిసారి ఒకే ఫలకముంటుంది. ఫలకముంటే చైతన్యముండాలి. అదిమారిపోతుంది. క్రొత్తచైతన్యముత్పన్నమవుతుంది. అప్పడు నేను క్షణికమని చెప్పటానికి కూడ నీకవకాశముండదు. ఎటువంటి మార్పు నూ నీవు గుర్తించలేవు. "ప్రతిదీ మారిపోతుంద"న్న మాటలు చెప్పటానికైనా నీవు స్థిరం గా మారిపోకుండా ఉండాలి. మారిపోతున్న దాన్ని చూస్తూ, నీవు క్షణికమయితే స్మృతి అంటూ ఏమీ వుండదు. కానీ ప్రతివారు బాల్యావస్థమెదలుకొని, తమతమ అనుభవా ల్నన్నింటిని స్మరిస్తూనే ఉన్నారు. కనుక అనుభవాలు మారుతుంటాయి. కానీ ఆ అను భవించే వాని స్వరూపమైన సాక్షి ఏ రకమైన మార్పుకి లోనుగాదు.

విశ్వము అసత్తు, లేనిదని శాస్త్రమిక్కడ చెప్తున్నది. విశ్వము అభావమయితే లేని దానిగురించి మనమెందుకు చర్చించాలి ? మనుష్యశృంగముల గురించి కాని లేక వంధ్యా పుత్రునిగురించిగానీ ఎవరూ చర్చించరు, లేవు గనుక. కానీ జగత్తు నీవు గుర్తిం చేవిధంగా స్పష్టంగా గోచరిస్తున్నది. మరి జగత్తులేనిదని శాస్త్రమెలా చెప్పగలడు ? అసత్ అంటే ఇక్కడ మృషా - మిథ్య అని అర్థం. "స్వప్నవత్ మృషా - స్వప్నమువలె మిథ్య" అని ఇక్కడ చెప్పబడింది. ఈ స్వప్నదృష్టాంతాన్నికూడ మనం సరిగా అర్థంచేసుకోవాలి. ఆత్మ సర్వగుణవర్జితమని తెలపటానికి శాస్త్రం ఈ స్వప్నదృష్టాంతాన్ని ఉపయోగించుకుటుంది. ఈ దృష్టాంతంలోని ప్రయోజనమంతే. అదేవిధంగా మనం స్వప్నదృష్టాంతాన్ని ఉపయో గించవచ్చు, అంతేగాని స్వప్నం గురించి విచారించి నిర్ధారించటం కోసం కాదు. అది సైకాలజీ క్రిందకు వస్తుంది. స్వప్నంయొక్క సత్యత్వాన్నిగురించి విచారిస్తాము. ఈ భేదా న్ని గుర్తించాలి. సత్తాదృష్ట్యా స్వప్నము మిథ్య.

జగత్తుసత్యమని వాదించేవారు కొన్నివాదనలను ముందుంచుతారు. ప్రపంచంలో వస్తువులకు అర్థక్రియాకారిత్వముంటుంది. నీవు వస్తువుల్ని ఉపయోగించుకోవచ్చు. జగత్తులో వస్తువులు రజ్జు - సర్పముల్లాంటివి కావు. వేదాంతం యొక్క రజ్జుసర్పము నిరుపయోగమైనది. కానీ నిజమైన సర్పము ప్రయోజనకారి. పాములవాడు పామును పట్టుకుంటాడు. దానికోరల్లోనివిషాన్ని తీసివేస్తాడు. నాగస్వరం వాయిస్తూ పాముని ఆడిస్తూ దాన్ని తన జీవనాధారంగా చేసుకుంటాడు. (పాము ఆడటమనేది నిజంగా ఒక కథే. పాములగురించి అనేక కథలేర్పడ్డాయి. వాటిల్లో చాలాభాగం అసత్యములే. ఒక కథేమిటంటే పాము సంగీతాన్ని వింటుందని, కానీ పాముకి చెవుల్లేవని నీకు తెలుసా ? కనుక పాము సంగీతాన్ని వినదు. అందుకు అనుగుణంగా ఆడదు. మరి పాములవాడు దాన్నెలా ఆడిస్తాడు. నీవు జాగ్రత్తగా పరిశీలిస్తే పాముల్నాడించే ప్రతివానిదగ్గర ఒకేరకమైన వాయిద్యముంటుంది. అది ముంగిసను పోలి ఉంటుంది. ముంగిస పాముకు బద్ధశత్రువు. ముంగిసను ఏ సమయంలోనైనా కాటువేయటానికి సర్పం సిద్ధంగా ఉంటుంది. పాములవాడు తన వాయిద్యాన్ని అటు ఇటూ త్రిప్పుతుంటాడు. పాముకూడ దాన్ని కాటు వేయటానికి కదుల్తూ ఉంటుంది. పాము సంగీతాని కనుగుణంగా ఆడుతున్నట్లుగా అనిపిస్తుంది.) తద్వారా పాములవాడు డబ్బు సంపాదిస్తాడు. పామువిషం ఔషదంగా పనిచేస్తుంది. పాముచర్మాలను ఎగుమతి చేస్తుంటారు. ఆ విధంగా పాముఉపయోగకరమైనది కానీ రజ్జుసర్పం వల్ల నీకేమొస్తుంది ? ఏమీ రాదు ! కనుక జగత్తు ఉపయోగకారి కాబట్టి సత్యము. జగత్తు వ్యవహారానికందుబాటులో ఉంటుంది.

కానీ ఏదైనా దృష్టిగోచరమైనంతమాత్రాన - వ్యవహార యోగ్యమైనంతమాత్రాన - సత్యము కావాలన్న నియమం లేదు. కల గంటావు. నీవు దాన్ని అనుభవిస్తావు. స్వాప్నికవస్తువులు స్వప్నంలో ఉపకరిస్తాయి. కలలోని నీదప్పికను కలలో జలం తీరుస్తుంది. కలలో నీవు వ్యవహారం కూడ చేయగలవు. కానీ అవన్నీ కలని నిజంచేయలేవు. ఇవన్నీ స్వప్నా

న్ని సత్యం చేసే ప్రమాణాలుకావు. ఇంతకుముందు వివరించినట్లుగా దృశ్యత్వమే చాలు. ఒక వస్తువును మిథ్య అని ధృవపరచటానికి నా స్వప్న జగత్తు దృశ్యముకాబట్టి మిథ్య. దృశ్యముగా స్వప్న జగత్తు నా కంటె - స్వప్నపురుషునికంటె భిన్నముకాదు. స్వప్న జగత్తు నేనే. స్వప్నంలో ఉండగా అది సత్యంగా భాసిస్తుంది. మేలుకొన్న తరువాత "నేను స్వప్న పురుషుణ్ణి, స్వప్న జగత్తు నేనే" నని అవగతం చేసుకోగలను. స్వప్నంలో ఉన్నదేదీ నాకంటె భిన్నముకాదు. కనుక స్వప్నజగత్తు మిథ్య అనంటాము.

ఇక్కడ ఒకవిషయం స్పష్టంగా అర్థంచేసుకోవాలి. జగత్తుకున్న అర్థక్రియాకారిత్వమును వ్యవహారయోగ్యత్వాన్ని నిరాకరించటంలేదు. జ్ఞానాన్ని పొందటం - జ్ఞానసాధనములు కర్మసాధనములు - వీటన్నిటినీ అంగీకరిస్తుంది. శాస్త్రం ఉన్న సంబంధాలన్నిటినీ ఒప్ప కుంటుంది. నిజానికన్నిటినీ అంగీకరిస్తుంది. కానీ ఇవేవీ నీవనుభవించేవి సత్యమని ధృవపరచటానికి ప్రమాణాలుకావు. మరి జగత్ సత్యత్వాన్ని నిరూపించే ప్రమాణమేది? త్రికాల అబాధితమా కాదా అని చూడాలి. కాలబద్ధమైనది అదృశ్యమవుతుంది. స్వతః సిద్ధవస్తువు తన అస్తిత్వానికి లేక ప్రకాశించటానికి మరో వస్తువుపై ఆధారపడదు. దేశ, కాల, వస్తు పరిచ్ఛేదరహితమైన అదేవస్తువు సత్యము. అంటే అది అనంతమై ఉండాలి. అబాధిత వస్తువంటూ లేదని ఎవరైనా అనవచ్చు. వాస్తవమేమిటంటే అలా చెప్తున్నవ్యక్తి మిగిలి ఉంటాడు. బాధ చేస్తున్నతాను బాధింపబడలేడు.

ఈ ప్రపంచము, స్వప్నప్రపంచంలాగ కాక, అదేవిధంగా కొనసాగుతూనే ఉంటుంది; కనుక ఇది మిథ్య కాదు, సత్యమేననే ఒక వాదమున్నది. నిన్న చూచిన పర్వతమే, ఇప్పడు నేను చూస్తున్నది. కాబట్టి జాగ్రత్ ప్రపంచం స్వప్న ప్రపంచంలాంటిదికాదు. స్వప్నంలో ఒకే ప్రపంచాన్ని ప్రతిరోజూ చూడను? కానీ ఇలాగ అనేదెవరు ? నేను ప్రతి రోజూ ఒకే ప్రపంచాన్ని చూడటంలేదని స్వప్నపురుషుడంటాడా ? స్వప్నపురుషుడు ఎటు వంటి ఫిర్యాదు లేకుండా తన ప్రపంచాన్ని సహజంగానే స్వీకరిస్తాడు. జాగ్రత్ పురుషుని

దృష్ట్యా మాత్రమే స్వప్న ప్రపంచం మారిపోతూంది. అదేవిధంగా, జాగ్రత్ ప్రపంచంకూడ వ్యభిచరిస్తుంది. - మారిపోతుంటుంది. కనుకమిథ్య.

మిథ్యాత్వాన్ని స్పష్టంగా అర్థంచేసుకోవాలి. మిథ్య అంటే ప్రపంచానుభవాన్ని నిరాకరించ టంకాదు. వ్యవహారాన్ని నిరాకరించటం కాదు. వాస్తవానికి దేన్ని నిరాకరించటంలేదు. ఘటము, మిథ్య అని నేనంటే ఘటము నిరుపయోగమని అనటంలేదు. వస్తువు ఉప యోగకారియా కాదా - అన్నది ఆ వస్తువు మిథ్య కావటానికి ప్రమాణంకాదు. వ్యవహార యోగ్యత్వమున్నప్పటికీ జగత్తు మిథ్యామాత్రమే. నీవు సత్యము. నీవనుభవించే ప్రతిదీ మిథ్యలో అంతర్గతమవుతుంది.

మరప్పడు సత్యమేది ? విను.

73వ శ్లోకము

అతః పృథఙ్నాస్తి జగత్ పరాత్మనః

పృథక్ ప్రతీతిస్తు మృషా గుణాహివత్ ।

ఆరోపితస్యాస్తి కిమర్థవత్తా

అధిష్ఠానమాభాతి తథా భ్రమేణ ॥ 237 ॥

అతః - కాబట్టి; జగత్ జగత్తు; పరాత్మనః పృథక్ న అస్తి - పరమాత్మ కంటె వేరుగా లేదు; తు - అదలా ఉండగా; పృథక్ ప్రతీతిః - జగత్తు భిన్నంగా గోచరించటం; గుణఅహివత్ - రజ్జువుపై ఆరోపిత సర్పమువలె; మృషా - మిథ్యా; ఆరోపిస్య - ఆరోపింపబడినదానికి; అర్థ వత్తా కిమ్ అస్తి - సత్యత్వమేమి ఉంటుంది ? అధిష్ఠానమ్ - అధిష్ఠానమే; భ్రమేణ తథా అభాతి - భ్రమచేత ఆ విధంగా భాసిస్తుంది.

"కనుక ప్రపంచము బ్రహ్మముకంటె భిన్నముకాదు. అదలా ఉండగా బ్రహ్మముకంటె జగత్తును భిన్నముగా చూడటం రజ్జువుపై ఆరోపితసర్పములాగ అసత్యమే. ఆరోపితసర్పానికే సత్యత్వమున్నది ?

భ్రమకారణంచేత అధిష్ఠానమే ఆ విధంగా గోచరిస్తుంది."

జగత్తు తనకు కారణమైన పరాత్మకంటె భిన్నముకాదు. ఎవరైన ప్రశ్నవేయవచ్చిక్కడ. "జగత్తు వస్తువు - బ్రహ్మముకంటె భిన్నముకాదని మీరంటున్నారు. ఇది మీరు చెప్తున్నప్పుడు మీరు వక్త, నేను శ్రోతను. శ్రోత వక్తకంటె భిన్నంకాకపోతే, ఆమెగాని/అతడుగాని వినటం జరుగదు.అటువంటప్పుడు వక్త శ్రోతకంటె వేరుకాదని ఎలా చెప్పగలరు ?" సరే ! బాగుంది. ఇక్కడ చెప్పింది వక్త పరాత్మకంటె భిన్నము కాదని; అలాగే శ్రోత కూడ పరాత్మ కంటె భిన్నము కాదని. కాబట్టి భేదదృష్టిని మేము నిరాకరించటంలేదు. ఈ భేదము సత్యమన్న నిర్ధారణను మేమునిరాకరిస్తున్నాము. నీ నిర్ణయము సత్యముకాదు. నీకు మంచిదీకాదు. "నీవు బ్రహ్మము, అనంతము" అన్నవాక్యాలు నిన్నేదో గొప్ప చేసే వాదమూ కాదు. లేక (మానసిక) చికిత్సా విధానమూకాదు, అది సత్యము, నీకది మేలుచేస్తుంది. అసత్యంవిషయంలో నీవు భ్రమపడితే, అప్పడే నీగురించి నీవు పూర్ణుడవుకావని, అల్పుడ వని నిర్ణయించాల్సివస్తుంది. అదేమీ సంతోషదాయకమైన నిర్ణయంకాదు.

ప్రతివారు తాను అల్పమని భావించి గొప్పకావాలని కోరుకుంటారు. "నేను అల్పుడ" నన్నది సత్యమైతే దానితో జీవించగలగటం నేర్చుకోవాలి. ఆ విషయంలో నేను చేయగ లిగిందేమీ లేదు, వ్యధపడటంతప్ప. దానిగురించి మానసికంగా బాధపడటం అర్థంలేనిది. దాన్నుండి తప్పించుకోవటానికి చేసే ఏ ప్రయత్నమైనా అంతే, నిరర్థకమవుతుంది. దాన్నం గీకరంచటమే మంచిది. అంటే నేను నష్టజాతకుణ్ణి కానీ వ్యధచెందటం ఆత్మ స్వరూపం లో లేదు. అందుచేతనే అప్పడప్పడు నేనానందంగా ఉన్న సమయాలలో వ్యధలేకుండా ఉంటున్నాను. వ్యధచెందటమన్న సమస్యంతా భ్రమమూలంగానే వాస్తవస్థితి ఇలా ఉన్నన ప్పటికీ వ్యధకొనసాగేటట్లు చేసుకోవటం తెలివితక్కువతనం.

దృక్ దృశ్య భేదము మిథ్య, దృక్ దృశ్య భేదము ప్రత్యక్షగోచరమే కానీ దృక్ ఆత్మ, దృశ్య ము ఆత్మ, దర్శనంకూడ ఆత్మకంటె ఎప్పటికీ భిన్నముకాదు. కాబట్టి దృక్ దశ్యదర్శన

ములు రజ్జుసర్పములాగ మిథ్య. రజ్జుసర్పం భాసిస్తున్న సమయంలోకూడ సర్పములేదని ఈ దృష్టాంతం తెలుపుతుంది. తాడుమీద సర్పంలేదు. అదేవిధంగా ఈ ప్రపంచాన్నను భవించే దృక్ ఆత్మపై ఆరోపింపబడ్డాడు. కనుక ఆత్మలేకుండ విషయి అంటూ లేడు. వాస్తవానికి విషయి, విషయము, అనుభవములన్నీ ఆత్మపై ఆరోపితములే. స్వప్నము, స్వప్న జగత్తు స్వప్నపురుషులను ఒకే చైతన్యముపై ఆరోపింపబడినట్లుగానే. జగత్తు ఆత్మపై ఆరోపితం కనుక దానిప్రయోజనం గురించి వివరించాల్సిన అవసరంలేదు. జగత్తుకు ప్రయోజనం గాని, అర్థము గానీ లేవు. ఆరోపితానికి ప్రయోజనముండదు. కానీ జీవుడంటూ ఒకడున్నాడు కాబట్టి, సృష్టికొక ప్రయోజనముందని మనం చర్చిస్తుంటాము. జీవుడున్నాడు కనుక, కర్మఫలము పుణ్యపాపములు ఉన్నవి. పుణ్యపాపములు వ్యక్తం కావటానికి కర్మ ఫలముల ననుభవించటానికి స్థూలప్రపంచము స్థూలశరీరము కావాలి. కనుక ఈ జడప్రపంచము చేతనాయుక్తజీవునికొరకై ఉన్నది.

జీవుడు అతిదీర్ఘకాలంనుండి ఉంటూనే ఉన్నాడు. ప్రలయం సంభవించినప్పటికీ జీవుడవ్యక్తంగా ఉండి పునః క్రొత్తసృష్టిలో వ్యక్తమవుతున్నాడు. కనుక అదొకచక్రం. అప్పుడు జీవుడెందుకు వచ్చాడు. ఎలాగ వచ్చాడనే విషయాలు చర్చించాల్సినవసరంలేదు. జీవత్వమే ఆత్మపై ఆరోపితం సత్యంకాదు. కాబట్టి జీవుని గురించి సరియైన వివరం ఇవ్వలేవు.

జీవుడు ప్రశ్నిస్తుంటాడు. ఈ జగత్తెలా సృష్టించబడ్డది ? ఎందుకు సృష్టించబడ్డది ? నన్ను సృష్టించకపోయినట్టయితే నేనెలా ఇక్కడ ఉన్నాను ? అని ఈ ప్రశ్నలన్నింటికి దయతో ఊరటకలిగించే విధంగా సమాధానాలున్నాయి. నీ పూర్వకర్మవలన నీవు జన్మించావు. జన్మించావు గనుక కర్మ చేస్తావు. ఆ కర్మవలన మరల జన్మిస్తావు. దీనిలో ఏది మొదట ఏది తరువాత అనేదుండదు. అవిద్యలోనే మూలమున్నది. ప్రమాతా - జీవుడే అవిద్యాకార్యము.

ఎవరైనా అడగవచ్చు "అవిద్య ఎందుకున్నది ?" అని. ఆ ప్రశ్నయే అవిద్య ఉన్నదని

తెలుపుతుంది. ఐనా ఇక్కడ ప్రశ్న ఏమిటంటే, ఆ అవిద్యను కొనసాగించుకోదల్చుకున్నావా, లేకదాన్ని తొలగించు కోదల్చుకున్నావా ?" అని "నీవు బ్రహ్మ"మని చెప్పినప్పటికి ఇది నాకర్థ మైంది కానీ నేను బ్రహ్మమైతే జీవుణ్ణెలా అయ్యాన"ని వెంటనే ప్రశ్నిస్తాడు. నీవు బ్రహ్మము, అంతే. "నేను బ్రహ్మమునైతే" అనేది ఇకఉత్పన్నంకాదు. నీవు బ్రహ్మముకనుక జీవుడివికా లేవు. ఐనప్పటికి ప్రశ్న అలాగే ఉంటుంది. కాబట్టి దయతో సమాధానం చెప్తాడు. "జీవు డు అవిద్యా కారణంగా" అని, "ఈ అవిద్య నెవరిచ్చారు ? ఎప్పుడవిద్య మొదలైంది" మొ॥ ప్రశ్నలకు ఆధారంలేదు. ఎందుకంటే ఉన్నవస్తువు బ్రహ్మము, అదే జీవుని స్వరూపము అర్థంచేసుకోవాల్సిన విషయమిదే.

కానీ ఆరోపితజగత్తు మృషా - మిథ్య అయితే అదెలా భాసిస్తుంది ? "అధిష్ఠానమే మనం చూస్తున్నవిధంగా ప్రకాశిస్తుంద"ని శాస్త్రం చెప్తుంది. నీవు రజ్జుసర్పాన్ని చూచేటట్ల యితే రజ్జువే సర్పముగా భాసిస్తుంది. అదే విధంగా ఆత్మను కర్తగా నీవు భావిస్తున్నావు. కాబట్టి అది కర్తగా భాసిస్తుంది. కర్త అంటూ ఎవరూ లేరు; బ్రహ్మాత్మమాత్రమే కర్తగా భాసిస్తుంది. భ్రమ మూలంగా ఒకే అధిష్ఠానము జగద్రూపంగా విషయి, విషయ రూపం గానూ భాసిస్తుంది. జీవుడంటూ ఒకరు వాస్తవంగాలేడు. జీవుని స్వరూపం సచ్చిదా నంద ఆత్మ. శాస్త్రం జీవుడు అసత్యమనటంలేదు. జీవత్వము అసత్యమంటుంది. జీవత్వ ముఆత్మ ధర్మంకాదు. జీవుని సత్తాస్ఫూర్తులు ఆత్మనుండి సంక్రమించినవే.

'తత్త్వమసి' మహావాక్యం జీవేశ్వరుల ఐక్యాన్ని బోధిస్తుంది. తద్వారా మన మనుభ విస్తున్న ఏరకమైన భేదాన్నైనా సత్యంకాదని నిరాకరిస్తుంది. బాధచేస్తుంది. శాస్త్రంలో తత్ పదం జగత్కారణం బ్రహ్మను తెలుపుతుంది. 'తత్' ను వాచారంభణ శ్రుతిద్వారా జగ త్ కారణంగా ప్రతిపాదించి, జగత్తు మిథ్యయని నిరూపిస్తుంది. కార్యమైన జగత్తు మిథ్య కనుక బ్రహ్మములో కారణత్వాన్ని నిషేధించి, వస్తువును 'ఏక మేవాద్వితీయమ్ బ్రహ్మ' అని బోధిస్తుంది. బ్రహ్మము అద్వితీయము - రెండవది లేనటువంటిది, కనుక అనం

తము. కనుక బ్రహ్మము సత్యము అనంతము 'చిత్' కూడ. 'తత్' పదానికర్థమదే. 'త్వం' పదవాచ్యార్థము జీవుడు. శాస్త్రం త్వంపదాన్ని ముందే విచారణచేసింది.

'తత్త్వమసి' మహావాక్యంలో ప్రతిపదానికర్థం తెలియకుండా, వాక్యార్థాన్ని నీవు తెలుసుకోబోవటం లేదు. ఏ ఇతర విషయాలలోనైనాసరే, సంగతి సందర్భము స్పష్టంగా ఉన్నప్పుడు, ఒకటి రెండు పదాలకర్థం తెలియకపోయినా వాక్యార్థాన్ని నీవవగతంచేసుకోగలవు. కానీ ఇక్కడలా సంభవం కాదు. ఎందుకంటే ఇదొక శాస్త్రీయవాక్యం గనుక. 'తత్' లేక ' త్వం' పదాల అర్థం గురించి నీవు ఊహాగానాలు చేయలేవు.శాస్త్రం దాన్ననుమతించదు. ఇంతవరకు ఊహాగానాలు చాలానే చేసావు. అవి నీకేమాత్రం ఉపకరించలేదు. శాస్త్రం స్పష్టంగా తెలిపింది 'తత్' అంటే 'ఈశ్వరుడు'. అంటే జగత్ కారణమైన 'సత్' అని అర్థం చేసుకోవలసిన సత్యమది. అదేవిధంగా జీవుడుకూడ సత్యమే. కానీ శాస్త్రము "తత్త్వమసి" అని బోధిస్తున్నది. అంటే 'తత్' 'త్వం' అని "త్వం తత్" అని అర్థం. ఐక్యసమీకరణం లివితిబిశిరిఆటి రెండు వైపులా వర్తిస్తుంది. జీవుడే ఈశ్వరుడు; ఈశ్వరుడు జీవుడే తప్ప మరొకటికాదు. అది ఒకే మార్గంలో "నేనీశ్వరుడికి సంబంధించిన వాడిని; అంతేకాని అతడు నేనుకాద"నే అర్థాన్నివ్వదు.

'త్వం' పదవ్యాచ్యార్థము జీవుడు, తత్ పదవాచ్యార్థము ఈశ్వరుడు. ఇంతమాత్రం జ్ఞానంతో 'అసి' పదానికర్థంకోసం నీవు సాగినప్పడు, నీకు కలిగేజ్ఞానం "నేను ఈశ్వరుడన"ని జీవేశ్వరులైక్య విషయయంగురించే అజ్ఞానమన్నది. కనుకనే ఈ ఐక్యాన్నర్థం చేసుకోవాలి. ఐక్యముసిద్ధమయే ఉన్నది. కానీ అజ్ఞానముచే ఆచ్ఛాదితమై ఉన్నది. శాస్త్రవాక్యాలవలన కలిగినవృత్తివలన ఈ అజ్ఞానము నశిస్తుంది.

ప్రతిపదానికి తన అర్థాన్ని తెలిపేశక్తి ఉన్నది. ఆ శక్తి పదముయొక్క వాచ్యార్థాన్ని తెలుపవచ్చు, లేక లక్ష్యార్థాన్ని తెలుపవచ్చు. లక్ష్యార్థానికి శక్యసంబంధముంటుంది. అంటే పద వాక్యార్థంతో సంబంధము. కాబట్టి పద లక్ష్యార్థముల అలాపదవాచ్యార్థంతో సంబద్ధమై

ఉంటుంది. ఈ సంబంధం లేకపోతే లక్షణంగా ఒక విశేషణపదాన్నే వాడాల్సిన అవసరం లేదు;ఏపదమైనా సరిపోతుంది.

ఒక వాక్యంలోనున్న పదములవాచ్యార్థము అర్థరహితంగా ఉండేటట్లయితే వాచ్యార్థంతో సంబద్ధమై ఉన్న ఆపదముల లక్ష్యార్థాన్ని ఆ పదాల్నర్థంచేసుకోవటానికుపయోగిస్తాము. ఈ విషయాన్నర్థంచేసుకుందాం. ఒక వ్యక్తి ఒకరింటికి విందుకై వెళ్తున్నాడు. అతడావిష యాన్ని తనతండ్రికి చెప్పాడు. తండ్రి వెంటనే, "విషం భుజ్క్ష్వ - వెళ్ళి విషం తిను" అని అన్నాడు. అంటే తండ్రి అతడిని విషం తినమన్నాడని అర్థంకాదు. ఆ సందర్భంలో విషం తినటంతో సమానమని, తండ్రి అన్నాడంటే దానర్థం - ఆ యింట్లో భుజించటం విషం తినటంతో సమానమని, తండ్రి కేకారణమైనా ఉండవచ్చు. "ఆ యింట్లో బుజించవద్ద" ని అతడి అర్థం. ఇది ఆ వాక్యానికి లక్ష్యార్థం. కానీ వనం గచ్ఛ - వనానికి వెళ్లమని రాముడికి చెప్పినప్పడు రాముడడవికి వెళ్ళాల్సిందే. అది లక్షణావాక్యంగాదు. వాక్యార్థం సుస్పష్టమే; అది సంతోషకరంకానప్పటికి. కనుక వాచ్యార్థం యుక్తియుక్తం కానప్పడు మాత్రమే లక్ష్యార్థానికెళతాము.

'తత్త్వమసి' వాక్యంలో 'అసి' పదం 'తత్' 'త్వం'ల మధ్య జీవేశ్వరుల మధ్యనున్న ఐక్యాన్ని తెలుపుతుంది. 'త్వం' నీవు జీవుడు (కర్త, బోక్త) 'తత్' జగత్కారణము. ఐక్యము 'అసి' పదం ద్వారా తెలుస్తుంది.

కానీ 'తత్ పద వాచ్యార్థమైన ఈశ్వరుడు పరోక్షమనే తెలుస్తాడు. త్వం, పద వాచ్యార్థమైన నీకు అపరోక్షమనే తెలుస్తుంది. కనుక పరోక్ష, అపరోక్షాల మధ్య ఐక్య ముండే అవకాశం లేదు. ఐనప్పటికి శాస్త్రం చాల దృఢంగా "తత్త్వమసి" అని చెప్తుంది. కాబట్టి దానర్థమేమంటే ఉన్నది ఒక వస్తువనీ, నీవే ఆ వస్తువనీ, జగత్తు ఈశ్వరునికంటె భిన్నము కాదు. దేహేంద్రియమనోబుద్ధులసంఘాతము ఈశ్వరునికంటె వేరుకాదు; జీవు డు సృష్టించబడనే లేదు. ఉన్నది ఒకే సద్వస్తువు; సుషుప్తిలోకూడ అదే ఉన్నది. ఆ సద్వ స్తువే ఆత్మ - నీవు, కనుక ఇక్కడ 'అసి' పదం వాస్తవానికి "జీవజగత్తులకు జీవజీవులకు, జీవేశ్వరులకు, జగదీశ్వరులకు, జడచేతనము"ల కున్న భేదాన్ని కబళించివేస్తుంది. సమ స్తభేదాల్ని అసిపదం కబళించి వేస్తుంది. ఆవిధంగా అసిపదం ఐక్యాన్ని తెలుపుతుంది.

శాస్త్ర తాత్పర్యం కూడ అదే. శాస్త్రపదాలను వక్రగతిలో వివరించి విరుద్ధార్థాలు చెప్పే ఆచార్యులున్నారు. శాస్త్రము 'అతత్త్వమసి' అది నీవు కాద'ని చెప్తుందని వారంటారు. ఒకవేళ అదే సరైనదని నీవు నిరూపించావనుకుందాం. దానివల్ల నీవు పొందేదేముంది. నిజంగా ఏమీ లేదు. ఏ శాస్త్రాధ్యయనం లేకుండగనే లేకుండగనే తాను ఈశ్వరుని కంటె భిన్నమని ప్రతివారికి తెలుసు.

***

# ఐక్యము - 'అసి' పదార్థము

74వ శ్లోకము

తత్త్వంపదాభ్యా మభిధీయమానయోః
బ్రహ్మాత్మనోః శోధితయోర్యదీత్థమ్ ।
శ్రుత్యా తయోస్తత్త్వ మసీతి సమ్యగ్
ఏకత్వమేవ ప్రతిపాత్యతే ముహుః ॥ 243 ॥

తత్త్వమసి ఇతి శ్రుత్యా - తత్త్వ మసి అన్న శ్రుతి వాక్యముద్వారా; తత్త్వం పదాభ్యామ్ - తత్ త్వం పదముల ద్వారా, అభిధీయ మానయోః - తెలుపబడే; బ్రహ్మ ఆత్మనోః - బ్రహ్మము ఆత్మల స్వరూపమును; ఇత్థమ్ - ఇంతకు ముందు వివరించిన రీతిలో; యది శోధితయోః - పరిశోధించినట్లయితే; తయోః - ఆరెండింటి యొక్క; ఏకత్వమ్ ఏవ ఏకత్వము మాత్రమే; ముహుః - మరల మరల; సమ్యక్ ప్రతిపాద్యతే - చక్కగా ప్రతిపాదింపబడుతుంది.

"తత్ 'త్వం' పదముల ద్వారా తెలుపబడే 'బ్రహ్మము' 'ఆత్మ'ల స్వరూపాన్ని ఇంతకుముందు వివరించిన రీతిలో పరిశోధించినట్లయితే 'తత్త్వమసి' శ్రుతి ద్వారా ఆరెండింటియొక్క ఐక్యమే మరల మరల ప్రతిపాదింపబడుతుంది."

'తత్త్వమసి' మహావాక్యములో 'తత్' పదము జగత్ కారణం బ్రహ్మమును తెలుపు

తుంది. అంటే 'బ్రహ్మ' పదము ఈశ్వరుడనే అర్థంలో వాడబడింది. 'బ్రహ్మ' పదము కొన్ని సందర్భాల్లో నిర్గుణ బ్రహ్మమును తెలపటానికి కొన్ని సందర్భాల్లో సగుణ బ్రహ్మను తెలపటానికి వాడుతుంటారు. శంకరులు కూడ ఈ పదాన్ని ఈ రెండర్థాల్లో వాడతారు. దానిలో తప్పేంలేదు. ఆ విషయంలో శంకరులు స్పష్టంగానే ఉంటారు. ఈ విషయాన్నర్థంచేసుకోలేని మహామేధావులు చాల మంది ఉన్నారు.

జీవునికి ఆత్మపదం వాడతారు. శాస్త్రమిక్కడ, "వాటి నీవిధంగా ఇక్కడ చక్కగా పరిశోధించి నపుడు, ఆ రెండుపదముల అర్థంతో ఐక్యాన్ని చక్కగా అర్థంచేసుకుంటావు అని చెప్తుంది. ఈ ఐక్యాన్ని శ్రుతి ఎలా సిద్ధపరుస్తుంది ? శ్రుతి వివిధరకాలప్రక్రియల ద్వారా భ్రమ కేమాత్రం తావివ్వకుండా, ఆ పనిచేస్తుంది. ఛాందోగ్యోపనిషత్తులో శ్రుతి ఈ ఐక్యాన్ని మరల మరల తొమ్మిది సార్లు - వివిధదృక్కోణములనుండి సిద్ధపరుస్తుంది. ఛాందోగ్యోపనిషత్తులో మాత్రమే కాదు ఐక్యము ప్రతిపాదింపబడింది, అనేక ఇతరచోట్ల కూడ శాస్త్రము జీవేశ్వరుల ఐక్యాన్ని ప్రతిపాదిస్తుంది.

'తత్త్వమసి' వాక్యాన్ని ఉపాసనావాక్యంగా గ్రహించేవారు కొంతమంది ఉన్నారు. జీవుడు "నేను బ్రహ్మము" అని ధ్యానం చేయాలని చెప్తుంటారు. ఆ ధ్యానంచేత జీవుడు విశేష అపూర్వాన్ని పొందుతాడు. తద్వారా బ్రహ్మలోకానికెళతాడనంటారు. అలాగా కానిపక్షంలో తత్త్వమసి వాక్యం సంగతం కాదని నిరూపించటానిక్కూడ ప్రయత్నిస్తారు. వారి దృష్టిలో వేదం సాధ్యవస్తుప్రతిపాదకమే కాని సిద్దవస్తుపరం కాదు. వేదంలో రెండురకాల వాక్యాలు మనం కనుగొంటాం. ఒకటి సిద్ధవస్తువిషయవాక్యములు - ఉదా : "నీరు నూరుడిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద మరుగును" లాంటి, ఉన్నవిషయాలను బోధించే వాక్యాలు. రెండవ రకం - సాధ్యవస్తువిషయవాక్యాలు - ఉదా : "పుత్రకామేష్టిద్వారా నీవు పుత్రుణ్ణి

పొందగలవు" "నీవీ ఔషధం సేవిస్తే బాగవుతావు" లాంటి సాధించవలసిన వస్తువుల గురించి బోధించే వాక్యాలు.

పూర్వమీమంసకులపక్షంలో 'తత్త్వమసి' వాక్యంతో సహా వేదవాక్యములన్నీ సాధ్యవస్తు విషయవాక్యములే. అటువంటి ప్రతివాక్యము ఒక విధివాక్యమే కానీ అది సత్యంకాదు. నిజానికి సాధ్యవస్తువాక్యము కూడ వాస్తవాన్ని తెలిపే వాక్యమే. అది సాధన - సాధ్యముల మధ్యగల సంబంధాన్ని తెలుపుతుంది. కనుక "స్వర్గకామో యజేత - స్వర్గానికి వెళ్ళగోరు వాడు ఒక విశేషయజ్ఞం చేయాల"ని శ్రుతి చెప్పినపుడు, అది సాధనమైన యాగానికి సాధ్యమైనస్వర్గానికి మధ్యనున్న సంబంధం మాత్రమే తెలుపుతున్నది. 'తత్త్వమసి' వాక్యం లాగానే పైవాక్యంగూడ ఉన్నవాస్తవాన్ని బోధిస్తుంది. కానీ నేను పరిచ్ఛిన్నుడనైన జీవుణ్ణి, ఎలాగా జగత్కారణం కాగలను ? కనుకనే మీమాంసకుడు అది "ఉపాసనను విధించే వాక్యము" నంటాడు. మరో మతబోధకుడు ఆ వాక్యానికర్థం "తస్య త్వమసి అతడికి చెందిన వాడవు నీవు" అని చెప్తాడు. ఆ అతడు' ఎవరు ? అనంతకల్యాణగుణవిశిష్ట ఈశ్వరుడంటాడు.

'తత్త్వమసి' వాక్యం ఛాందోగ్యోపనిషత్తులో వస్తుంది. అక్కడ శ్రుతి ఉపోద్ఘాతంలో "ఏది తెలుసుకుంటే సర్వము తెలిసినట్లుగా అవుతుందో, ఆ వస్తువొకటి ఉన్నద"ని చెప్తుంది. అక్కడ "దేని ఉపాసనవలన నీవు సర్వమును పొందుతావో" అని చెప్పలేదు. సిద్ధవస్తువిషయకవాక్యాలు ప్రాప్తవస్తువునే తెలిపినప్పటికీ, ఆ వాక్యంలోని పదములు - వాటి అర్థములు అసంగతంగా అనిపిస్తే, అప్పుడు లక్ష్యార్థం కోసం వెళ్ళాలి. ఒక వాక్యము వాచ్యార్థముద్వారాగాని, లక్ష్యార్థముద్వారా గాని భావార్థాన్ని స్ఫురింపజేస్తుంది. ఇక్కడ

శాస్త్రానికే వస్తు బోధచేసేటప్పుడు వాచ్యార్థానికున్నలోటు దోషము తెలుసు. అందుచేతనే "యతో వాచో నివర్తంతే - ఎవరినుండైతే వాక్కులు వెనుకకు మరలునో" అని శాస్త్రమే చెప్తుంది. సత్యవస్తువు విషయీకరణకు లభ్యంకాదు. అందుచేతనే అది ప్రత్యక్షఅను మానాలకు విషయంగాదు.

జాతి, గుణ, క్రియ, సంబంధములలో ఒకటిగాని అంతకంటె ఎక్కువగాని లక్షణాలు గలిగిన వస్తువును మాత్రమే పదాలు వర్ణిస్తాయి. ఉదాహరణకు ఆవు ఒక జాతికనుక 'ఆవు' పదం నీవర్థంచేసుకోగలవు. తియ్యటి కమలాఫలమన్నప్పుడు తీపి కమలాఫలము యొక్క గుణము డ్రైవరు, వంటవాడు మొ॥ పదాలు క్రియద్వారా అర్థాలను స్ఫురింపజే స్తాయి. అదేవిధంగా తండ్రి, పుత్రుడు, పౌరుడు మొ॥ పదాలను సంబంధములద్వారా నీవర్థంచేసుకోగలవు. కనుక పదములు వీటిల్లో ఒకటి గానీ అంతకన్నఎక్కువగానీ లక్ష ణాలను కలిగి ఉన్నవస్తువులను మాత్రమే వర్ణించగలవు. కాని బ్రహ్మమునకు వీటిల్లో ఏదీ లేదు. రెండవబ్రహ్మము లేదు; కనుక జాతి లేదు, బ్రహ్మమున కేగుణములేదు. ఇంక ను బ్రహ్మము ఏవిక్రియను పొందదు కాబట్టి ఏ క్రియను చేయలేదు. బ్రహ్మము కంటె ఇతరమైన దేదీలేదు; కనుక ఇతరమైన దేనితోనూ సంబంధముండే అవకాశములేదు. కాబట్టి సంబంధముద్వారా బ్రహ్మమును తెలుపలేము. కాబట్టి వ్యవహారంలో మనంవాడే ఏపదముద్వారా నైనా బ్రహ్మమును తెలుపలేము. అందుచేతనే శ్రుతి, "యతో వాచో నివర్తంతే" అనంటుంది. బ్రహ్మము ఏపదానికి వాచ్యార్థము కాజాలదు. పదముల లక్ష్యా ర్థము మాత్రమేకాగలదు. ఇక్కడ "తత్త్వమసి" వాక్యములో "త్వం" పదమునకు సకల పరిచ్ఛిన్నతలుకలిగిన జీవుడు వాచ్యార్థము. 'తత్' పదానికి జగత్కారణమైన బ్రహ్మము అంటె సర్వజ్ఞుడు, సర్వశక్తిసంపన్నుడు, సర్వవ్యాపకుడు ఐన ఈశ్వరుడు వాచ్యార్థము.

కాని మహావాక్యముద్వారా జీవునికి ఈశ్వరునితో ఐక్యం బోధింపబడుతున్నది. వాచ్యార్థాన్ని తీసుకునేట్లయితే విరోధము సువిదితమే. కాని లక్ష్యార్థంలో ఈ విరోధము తొలగించబడినది. జీవుడెలాగా స్వయంప్రకాశస్వరూపుడో అదేవిధంగా ఈశ్వరుడుకూడ స్వయం ప్రకాశస్వరూపుడు. ఈ విషయమే తరువాతిశ్లోకంలో చెప్పబడింది.

75వ శ్లోకము

ఐక్యం తయోర్లక్షితయోర్న వాచ్యయోః

నిగద్యతేన్యోన్య విరుద్ధ ధర్మిణోః ।

ఖద్యోతభాన్వోరివ రాజభృత్యయోః

కూపాంబురాశ్యోః పరమాణుమేర్వోః ॥ 244 ॥

తయోః ఐక్యం - ఆ రెండింటి ఐక్యము; లక్షితయోః - లక్ష్యార్థముల మధ్యనే; నిగద్యతే - చెప్పబడిందిగాని; ఖద్యోతభాన్వోః ఇవ - మిణుగురు పురుగు సూర్యుల లాగ; రాజ భృత్యయోః - రాజ భృత్యుల (లాగ); కూప అంబు రాశ్యోః - కూపము సాగరముల (లాగ); పరమాణు మేర్వో - పరమాణువు మేరు పర్వతముల లాగ; అన్యోన్య విరుద్ధ ధర్మిణోః - పరస్పర విరుద్ధ ధర్మములు గలిగిన వాటి; వాచ్యయోః న - వాచ్యార్థములలోకాదు.

"వాటి లక్ష్యార్థములోనే ఐక్యముచెప్పబడింది. అంతేకాని ఖద్యోత (మిణుగురుపురుగు) - సూర్యులలాగా, రాజు - భృత్యులలాగా, అణువు - మేరు పర్వతములలాగా విరుద్ధ ధర్మములు గలిగిన "నీవు" "అది" పదముల వాచ్యార్థములో ఐక్యముచెప్పలేదు."

'తత్త్వమసి' వాక్యములో 'తత్' పద వాచ్యార్థము జగత్తుకి అభిన్న నిమిత్త ఉపాదాన

కారణమైన ఈశ్వరుడు. 'త్వం' అంటే నీవు, కర్త - భోక్త ఐన, సకలపరిచ్ఛిన్నతలు కలిగిన జీవుడు. కాబట్టి ఇక్కడ విరోధమున్నది. నీ పరిధిలో ఉన్న ప్రత్యక్షానుమానప్రమాణముల ద్వారానే ఈ విరోధమవగత మవుతుంది. అటువంటి విరోధమున్నపుడు వేదం చెప్పినప్ప టికి ఆ వాక్యాన్నంగీకరించలేము.

ఒక వాక్యము వ్యాకరణదృష్ట్యా దోషరహితం కావచ్చు. కానీ ఇతరదోషములు లేవని చెప్పటానికివీలులేదు. అటువంటప్పుడు దాన్నంగీకరించలేము. "నిన్న నా చెవిలోనికొక ఏనుగు ప్రవేశించింది" అన్న వాక్యం వ్యాకరణరీత్యా సరియైనదే, కానీ అది అర్థరహితమై నది. "స్వర్గమొకటి ఉన్నద"ని వేదం చెప్తుంది. ఆ విషయాన్ని నేను నమ్మకపోవచ్చు కానీ నేను దాన్ని కొట్టి పారవేయలేను. ఎందుకంటే ఆ విషయము నాకందుబాటులో ఉన్న ప్రమాణముల పరిధిలోకి రాదు.

కాని వేదంచెప్పినప్పటికీ 'తత్త్వమసి' వాక్యాన్నంగీకరించటం కష్టమవుతుంది. "నేను" అన్నది విదితమే. అంటే నేనున్నాను అన్నది సువిదితమే. కానీ ఈ "నేను" అన్నవ్యక్తిని, అతడిని గానీ ఆమెనుగానీ, పరిచ్ఛిన్నంచేసే ధర్మాలనేకములున్నాయి. ఈ పరిచ్ఛిన్నవ్యక్తిని వశంలో ఉంచుకునే నియమాల నేకములున్నవి. వాటిని నేను సృష్టించలేదు. వాటి విపరీతంగా నేను ప్రవర్తిస్తే అనేక విపరీతపరిస్థితుల నెదుర్కోవలసివస్తుందన్నసంగతి నాకు ఖచ్చితంగా తెలుసు. సర్వకాలసర్వావస్థలలోనూ నా అనుభవమిదే. నా అల్పశక్తి మత్త్వం, అల్పవ్యాపకత్వం నాకు బాగా తెలుసు. నాగురించిన విషయాలను తర్కించి కూడ తెలుసుకోగలను, ఇవన్నీ నా గతంతో కలిసి నేనొక పరిచ్ఛిన్న జీవుడననే సత్యాన్ని ధృవపరుస్తున్నవి. కానీ శ్రుతి "నీవు సమస్త జగత్తుకి కారణమైన ఈశ్వరుడు వ"ని

చెప్తుంది. ఈ సమస్త జగత్తుకి కారణము నేనేనని ఎలా అంగీకరించగలను ? నా తల్లి దండ్రుల స్థూల సూక్ష్మశరీరాలకే నేను కారణంకాదు; జగత్ కారణత్వం గురించి చెప్పేదే ముంది ? కాబట్టి ఇక్కడ విరోధమున్నది. శ్రుతిచెప్తున్నదానిని ప్రత్యక్షానుమానముల ద్వారా జనించిన జ్ఞానం ఖండిస్తున్నది.

'తత్' 'త్వం' పదముల వాచ్యార్థములు పరస్పరం విరోధిస్తున్నవి. 'తత్' 'త్వం' లు ధర్ము లు, ధర్మము కలిగిఉన్నవాడు ధర్మి. తత్ పదము ఒక ధర్మిని ఈశ్వరుణ్ణి సూచిస్తుంటె త్వంపదం మరొక ధర్మిని జీవుణ్ణి చెప్తున్నది. ఈ ఇద్దరు ధర్ములకు, వారి ధర్మములు పర స్పరం విరోధిస్తున్నవి కనుక, ఐక్యము సంగతంకాదు. కొన్ని సమయాల్లో, ఒక ధర్మములో సామ్యముండవచ్చును. ఇతడు సింహంలాంటివాడని నీవంటే సింహంలాగా అతడు పరాక్రమవంతుడని అర్థం. కనుక మనిషికి సింహానికి పరాక్రమగుణంలో ఏకత్వము న్నది. కానీ 'తత్త్వమసి' వాక్యంలో ఈరకమైన ఏకత్వానికికూడ అవకాశంలేదు. అందు చేతనే శాస్త్రం 'తత్' 'త్వం' పదముల వాచ్యార్థాలలో ఐక్యమున్నదని చెప్తున్నాము.

'తత్త్వమసి' మహావాక్యంలో 'తత్' 'త్వం' పదములు సామానాధికరణ్యంలో ఉన్నాయి. కాబట్టి 'త్త్వం' 'తత్' అయిఉండాలి. 'తత్' 'త్త్వం' అయితీరాలి.

కానీ 'త్వం' పదానికి వాచ్యార్థము ప్రత్యక్షంగా ఉన్న నీవు కాగా, 'తత్' పదవాచ్యార్థము పరోక్షమైన ఈశ్వరుడు. 'త్వం' 'ప్రత్యక్షము' 'తత్' పరోక్షము. ప్రత్యక్షపరోక్షములమధ్య ఏకత్వం సంభవం కాదు. కనుక ఈ సందర్భంలో ఈ రెండు పదములవాచ్యార్థములు ఏకత్వాన్ని బోధించే అర్థాన్నివ్వలేవు. వాచ్యార్థాలలో విరోధమున్నపుడు లక్ష్యార్థంకోసం

చూడాలి. ఒక వాక్యాన్నర్థంచేసుకోవాలంటే ఇదే విధానం 'గదంతా శబ్దంగా ఉన్నద'ంటె లక్ష్యార్థం "గదిలోని వారంతా శబ్దంచేస్తున్నారనర్థం". ఈ వాక్యంలో వాచ్యార్థం అర్థరహితంగా ఉంటుంది. కనుక లక్ష్యార్థానికెళతాము. లక్ష్యార్థానికి వాచ్యార్థానికి మధ్యగల సంబంధాన్ని "శక్య - సంబంధము" "లక్షణ" మనంటారు. దాని ద్వారా నీవు విషయాన్ని చూపగలవు.

కనుక 'తత్త్వమసి' శ్రుతివాక్యము 'తత్' 'త్వం' పదముల వాచ్యార్థము ద్వారాకాక లక్ష్యార్థముద్వారా ఏకత్వాన్ని బోధిస్తుంది. వాచ్యార్థములో భేదమున్నది. ఆ భేద మెటువంటిదో కొన్ని దృష్టాంతముల ద్వారా వివరిస్తున్నారు. ఖద్యోత - భానోరివ మిణుగురుపురుగు - సూర్యులమధ్యనున్న భేదములాంటిది. మిణుగురుపురుగు సూర్యుడు రెండూ ప్రకాశవంతములే, కానీ సూర్యుడున్నప్పుడు మిణుగురుపురుగు కనపడనే కనబడదు. అది ఉండికూడా సూర్యుడస్తమిస్తే గానీ కనపడదు. పగటిపూట అది ఉంటుంది కానీ సూర్యకాంతిచేత పూర్తిగా ఆవరింపబడి ఉంటుంది. మిణుగురు పురుగు అల్పప్రకాశమున్నది కాగా సూర్యప్రకాశము అపరిమితము. అదేవిధంగా జీవుడల్పజ్ఞుడు, ఈశ్వరుడు సర్వజ్ఞుడు కనుక అవి పరస్పరం విరుద్ధగుణములు కలిగిఉన్నవి.

రాజు బంటుల మధ్య ఏకత్వమనేది లేదు. రాజు పరిపాలకుడు, బంటు పాలింపబడేవాడు. అదేవిధంగా ఈశ్వరుడు నియామకుడు, జీవుడు నియమింపబడేవాడు. ఎవరి ఆజ్ఞననుసరించి సూర్యుడు ప్రకాశిస్తున్నాడో, వాయువు వీస్తున్నాడో, ఇంద్రుడు, అగ్ని మొ॥ దేవతలు వారివారి విధుల నిర్వర్తిస్తున్నారో అతడు ఈశ్వరుడు. అగ్ని వేడిగా ఉంటుంది. ఎప్పటికి చల్లబడదు. అది ఈశ్వరాజ్ఞవలన. అతడు సర్వశక్తిసంపన్నుడు, నేనేమో అల్ప శక్తిమంతుణ్ణి. ఈ ఇద్దరిమధ్య ఏకత్వమెలా సంభవిస్తుంది.

ఈశ్వరుడు సముద్రంలాంటివాడు. జీవుడు త్రవ్విన నీటి బావిలాంటివాడు. కొన్ని బకెట్లునీరుతోడగానే బావిలోని నీరు ఖాళీ అయిపోతుంది. మళ్ళీ నీరుకావాలంటే నీవు కొంతకాలం వేచి ఉండాలి. ఈశ్వరుడు ఆనందసాగరుడు కానీ నాకున్నది స్వల్పానందం. వాస్తవానికి నేనెప్పడూ దుఃఖితుడనే. అంతేగాక ఈశ్వరుడు హిమాలయంలాగా సర్వ శక్తి సంపన్నుడు. జీవుడు అణువులాంటివాడు. ఈశ్వరుడు హిమాలయంలాగా అచ లుడు. జీవుడు అణువులోని కణములాగా నిరంతరము తిరుగుతూనే ఉంటాడు. మేమె లా ఐక్యవస్తువు కాగలం ? ఐక్యం మాటలా ఉంచండి, అసలు పోలికకైనా తావెక్కడిది ? ఆ విధండా 'తత్' 'త్వం' పదముల వాచ్యార్థములు ఏ రకమైన ఏకత్వానికి దోహదం చేయలేవు; కానీ వాటి లక్ష్యార్థములు ఏకత్వాన్ని బోధిస్తాయి.

76వ శ్లోకము

తయోర్విరోధో యముపాధికల్పితః
న వాస్తవః కశ్చిదుపాధిరేషః ।
ఈశస్యమాయా మహదాదికారణం
జీవస్య కార్యం శ్రుణు పఞ్చకోశాః ॥ 245 ॥

తయోః - ఆరెండింటి మధ్య; అయమ్ విరోధః - ఈ విరోధము; ఉపాధికల్పితః - ఉపాధి కల్పితము; వాస్తవః కశ్చిత్ న - వాస్తవంగా ఏదీ లేదు; శ్రుణు - విను; మహత్ ఆది కార ణం - మహత్ మొ॥ వాటికారణమైన; మయా - మాయ; ఈశస్య - ఈశ్వరునికి; ఏషః ఉపాధిః - ఇది ఉపాధిః, కార్యం పఞ్చ కోశాః - కార్యమైన పంచకోశములు; జీవస్య ఉపాధిః - జీవునికి ఉపాధి.

"వాటి మధ్యనున్న విరోధము లేక భేదము ఉపాధి కల్పితము వాస్తవభేదమేదీలేదు. మహదాదులకు కారణమైన మాయ ఈశ్వరుని కుపాధి. కార్యమైన పఞ్చకోశములు జీవున కుపాధి."

జీవేశ్వరులమధ్య భాసమానమైన భేదము ఉపాధికల్పితమేనని శాస్త్రమిక్కడ బోధిస్తున్నది. ఇద్దరు వ్యక్తులు రంగస్థలంపై రెండు భిన్న పాత్రలు పోషించటం లాంటిది. ఒకడు రాజు వేషం వేసుకుంటాడు అతని దుస్తులు ధగధగమెరుస్తుంటాయి. కిరీటంధరిస్తాడు. రాచరకపుబాణీలో మాట్లాడుతుంటాడు. రెండవవాడు సేవకుని పాత్ర పోషిస్తుంటాడు. అతడు రాజును సేవిస్తుంటాడు. రాజుకొరకై రకరకాలపనులు నిర్వర్తిస్తుంటాడు. కానీ వారిరువురూ రంగస్థలం వెనుకవైపుకు వెళ్ళగానే ఇద్దరూ సమానమే. పాత్రపోషణకిచ్చే పారితోషికమూ సమానమే. కానీ ధరించే పాత్రలలో భేదమున్నది. రంగస్థలం మీద రాజు రాజే, సేవకుడు సేవకుడే. ఈ భేదము ఉపాధివలన ఏర్పడినది.

అదేవిధంగా జీవునికి వ్యక్తిదేహేంద్రియమనోబుద్ధిసంఘాతము ఉపాధికాగా ఈశ్వరునికి సమష్టి ఉపాధి. నిరుపాధికంగా ఇద్దరూఒకటే. స్వరూపతః వాస్తవమైన ద్వైతమనేది లేనే లేదు. ఉపాధికూడా ఈశ్వరునికంటె భిన్నంకాదు. వ్యష్టిదృష్ట్యా జీవత్వమున్నది, జీవత్వదృష్ట్యామాత్రమే ఈశ్వరత్వమున్నది.

జీవేశ్వరులమధ్య నున్న ఐక్యాన్నిగుర్తించాలంటే వస్తువేమిటో ముందు చూడాలి. వస్తువును గుర్తించాలంటే వస్తువుకానిదేదో - అవస్తువును నిర్ధారించాలి. అందుకై ఆత్మానాత్మవివేకం అనివార్యం. ఆత్మానాత్మవివేకము ద్వారా సమస్తభేదములు ఉపాధికల్పితములేనని చక్కగా అర్థం చేసుకోవాలి. సముద్రము, అల ఉపాధి దృష్ట్యా భిన్నములుకానీ, రెండూ జలముకంటె అన్యముకాదు. అదేవిధంగా జీవేశ్వరులనడుమ భేదము కేవలం

ఉపాధి కల్పితమేకాని సత్యమైనది కానేకాదు.

జీవేశ్వరులమధ్య భేదము ఉపాధికల్పితమేనంటే మరప్పడు ఉపాధి అంటే ఏమిటి ? శాస్త్రం చెప్తున్నది - ఈశ్వరునికుపాధి మాయ. మాయ అంటె ఒక అనిర్వచనీయశక్తి. దాని మూలంగానే బ్రహ్మవస్తువు సర్వజ్ఞుడు, సర్వ శక్తివంతుడు, సర్వవ్యాప్తి మొ॥ పిలవ బడే ఈశ్వరుడవుతున్నది మాయకారణంగానే మాత్రమే ఈ గుణములన్నీ ఈశ్వరునికు న్నాయి. మహత్తు మొ॥ వాటికి కారణమైన మాయ ఈశ్వరునికుపాధి మాయతోకూడిన బ్రహ్మవస్తువు నిమిత్తకారణంకాగా, తనకుతానుగా మాయ ఈ జగత్తుకు ఉపాదాన కార ణమవుతున్నది. కనుక ఈశ్వరుడు ఉభయకారణములుకూడ. మహత్తత్త్వమంటె సమష్టి బుద్ధి, ఆదిలో, హిరణ్యగర్భ ఉపాధి లేక మహత్తు సృష్టించబడ్డది. కనుక అదే పర మేశ్వరుడు హిరణ్యగర్భుడవుతున్నాడు. అనంతరం పంచభూతాదులసృష్టి. ఆ విధంగా సమస్తజగత్తు సృష్టించబడ్డది. మాయ కారణఉపాధి. మరి జీవుని కేది ఉపాధి ? "కార్యఉపాధి" అని గ్రంథకర్త చెప్తున్నారు. అంతఃకరణంవలననే కర్తృత్వభోక్తృత్వాదులేర్ప డుతున్నాయి. కనుక అది కూడా ఈ కార్యఉపాధిలో అంతర్భాగమే.

ఉపాధిదృష్ట్యా జీవేశ్వరుల మధ్య భేదమున్నది. కానీ బ్రహ్మవస్తుదృష్ట్యా ఎటువంటి భేదమూలేదు. "నేను ఈశ్వరుణ్ణి" అని ఈశ్వరుడు చెప్పినపుడు, "నేను జీవుణ్ణి" అని జీవుడు చెప్పినపుడు ఆ 'నేను'లో ఏ భేదమూ లేదు. ఉన్నది ఐక్యము మాత్రమే.

77వ శ్లోకము

ఏతావుపాధీ పరజీవయోస్తయోః

సమ్యఙ్నిరాసే న పరో న జీవః ।

రాజ్యం నరేంద్రస్య భటస్య ఖేటకః

తయోరపోహే న భటో న రాజా ॥ 246 ॥

ఏతౌ - ఈ రెండూ (మాయా, పంచకోశములు); పరజీవయోః - ఈశ్వరునికి, జీవునికి; ఉపాధీ - ఉపాధులు; తయోః - ఆ రెండింటిని; సమ్యక్ నిరాసే - నిషేధించినపుడు; న పరః న జీవః - ఈశ్వరుడులేడు, జీవుడులేడు; నరేంద్రస్య రాజ్యం - రాజుకి రాజ్యం (ఉపాధి); భటస్య ఖేటకః - భటునకు డాలు కవచములు, (ఉపాధి); తయోః అపోహే - ఆ రెంటినీ తొలగించినపుడు; న రాజా న భటః - రాజులేడు భటుడులేడు.

> "ఈ రెండూ (మాయా, పంచకోశములు) ఈశ్వరునికి, జీవునికి ఉపాధులు, వాటిని నిషేధించినపుడు (బాధచేసినపుడు ఈశ్వరుడు లేడు, జీవుడు లేడు. రాజుకి రాజ్యము ఉపాధి, భటునికి డాలు, కవచములు ఉపాధి. ఆ రెండింటిని తొలగించినపుడు రాజులేడు, భటుడు లేడు."

పూర్వశ్లోకంలో జీవేశ్వరులమధ్యనున్న భేదము సత్యముకాదని, ఉపాధికృతమేనని తెలుపబడింది. ఈ భేదాన్ని కల్పించే ఉపాధి సత్యవస్తువు కంటె భిన్నమైనది, స్వతంత్రమైనదికాదు. కొన్నిచోట్ల ఉపాధి వస్తువు వస్తువుకంటె స్వతంత్రంగా ఉంటుంది. స్ఫటికానికి ఎఱ్ఱని పుష్పము ఉపాధిగానున్నపుడు, దానిసన్నిధిలో స్ఫటికం ఎఱ్ఱగా కనపడుతుంది. ఇక్కడ ఎఱ్ఱని పుష్పము స్ఫటికం కంటె భిన్నమైనది; స్ఫటికంలో సమానసత్తా కలిగిఉన్నది. దృష్టాంతం ఇక్కడ ఎరుపు పుష్పము ఉపాధిగా ఉన్నపుడు స్ఫటికం ఎరుపురంగులో కనిపి

స్తుందని వివరిస్తుంది. స్ఫటికానికి రంగులేదని తెలుసుకోవటానికి ఎరుపు పుష్పాన్ని తొలగించాల్సిన అవసరంలేదు. కానీ ఈ విషయంలో కూడా ఆధునిక వేదాంతులు పొరపాటుపడుతుంటారు. నీవు ఆత్మకున్న ఉపాధులనన్నిటిని తొలగించినపుడు మాత్రమే నీకు ఆత్మ గోచరిస్తుందని వారు చెప్తుంటారు. అదే నిజమైతే, నీవు తొలగించినదికూడ సత్య వస్తువవుతుంది ! ఇక్కడ ఉపాధి - అనాత్మ, ఉపహితము - ఆత్మ. ఇవి సమసత్తాకములు కావు. ఒకటి సత్యము, మరొకటి మిథ్య. అజ్ఞానం మూలంగా అనాత్మ ధర్మములు ఆత్మమీద ఆరోపించబడుతున్నాయి. అందుచేతనే ఆత్మ అనాత్మలాగా అవుతున్నది.

జీవేశ్వరులమధ్య అనేక భేదములున్నాయి. జీవుడు అపరోక్షము, కానీ ఈశ్వరుడు నాకు గోచరుడుకాడు. అదే శాస్త్రము ఈశ్వరుని సర్వేశ్వరుడని, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు సమస్తసృష్టికి కారణమని చెప్తుంది. కాగా జీవుడు స్పష్టమైన ఒక శరీరంకల అల్పజ్ఞుడు, అల్పవక్తిమంతుడు. కాబట్టి ఈ ఏకత్వాన్ని చక్కగా స్పష్టంగా అర్థంచేసుకోవాలి. వాటి ఉపాధులు సత్యములుకావు. అంటే జీవత్వానికి కారణమైన అవిద్యాఉపాధి. ఈశ్వరత్వాన్ని కలిగించే మాయా ఉపాధులకు స్వతంత్రసత్తా లేదు. ఆత్మ అవిద్యలకలయిక మిథ్యయేకనుక ఆత్మ అవిద్యతోకూడిన సద్వితీయముకాలేదు. జీవేశ్వరులమధ్య ఈ ఉపాధులవలన కలిగిన భేదములుకూడ అవిద్యామాయలకున్న సత్తానే కలిగిఉంటుంది. కాబట్టి అవికూడ మిథ్యయే. కనుక బ్రహ్మవస్తువును ఉపాధులదృష్ట్యా కాకుండా చూచినప్పడవి, మిథ్యకనుక, నిషిద్ధములవుతాయి. అప్పడీశ్వరుడూలేడు, జీవుడూలేడు, కేవలం అద్వితీయబ్రహ్మవస్తువు మాత్రమే శేషిస్తుంది.

ఈ ఉపాధివలన ఏవిధంగా భేదములేర్పడుతున్నవి, వాటిని బాధించినపుడు ఏకత్వ

మెలా అవగతమవుతుందనే విషయాల్ని వివరిస్తూ శాస్త్రమిక్కడొక దృష్టాంతాన్నిస్తున్నది. రాజు తనరాజ్యాన్ని ఉపాధిగా కలిగి ఉంటాడు. సైనికుడు డాలు కవచములను ఉపాధిగా కలిగిఉంటాడు. దీనివలన అతడినొకసైనికునిగా గుర్తిస్తారు. సైనికునిగా గుర్తించటా నికి ప్రత్యేకమైన ఆయుధములు, పరికరములు కలిగిఉంటాడు. మరిప్పుడు, రాజ్యాన్ని తొలగించినపుడు అతడు రాజుకాడు కేవలమొక మానవుడు మాత్రమే. అలాగే సైనికుని కున్న పరికరములను (ఉపాధిని) తొలగిస్తే అతడిక సైనికుడు కాడు, అతడు కూడ ఒక మానవుడు మాత్రమే. కనుక వారి వారి ఉపాధులను తొలగిస్తే వారు మానవులుగానే మిగులుతారు. దృష్టాంతమంతవరకే. ఈ సత్యాన్ని గుర్తించిన తరువాతకూడ ఇద్దరు మానవులు మిగులుతారు. కానీ మానవులుగా వారిద్దరూ ఒకటే, అదేవిధంగా జీవేశ్వ రులు సత్యవస్తువుదృష్ట్యా ఏకమే. ఇరువురునున్నప్పటికి, బ్రహ్మ వస్తువు మాత్రమొకటే.

78వ శ్లోకము

తతస్తు తౌ లక్షణయా సులక్ష్యౌ
తయోరఖండైకరసత్వసిద్ధయే ।
నాలం జహత్యా న తథా౽జహత్యా
కిం తూభయార్థైకతయైవ భావ్యమ్ ॥ 249 ॥

తతః తు - కాబట్టి; తయోః - ఆ ఇరువురి (జీవేశ్వరుల) యొక్క; అఖండ ఏకరసత్వ సిద్ధయే - అఖండైకత్వాన్ని సిద్ధపరచుటకై; తౌ - ఆ ఇద్దరిని; లక్షణయా సులక్ష్యౌ - లక్షణా వృత్తి ద్వారా చక్కగా రక్షించాలి; జహత్యా - జహాలక్షణము ద్వారా; న అలం - చాలదు; తథా - అదే విధంగా; అజహత్యా న - అజహాలక్షణముద్వారా కూడ న అలం (చాలదు);

కింతు - కానీ; ఉభ యార్థ ఏకతయా ఏవ - ఆ రెండింటిని కలిపి ప్రయోగించుటము ద్వారా మాత్రమే; భావ్యమ్ - అవగతంచేసుకోవాలి.

"కాబట్టి వారిరువురి అఖండైకత్వాన్ని సిద్ధపరచటానికై లక్షణావృత్తిద్వారా వారిని లక్షించాలి. జహలక్షణముద్వారాగాని, అజహలక్షణముద్వారాగాని చూపటం సరిపోదు. కానీ ఆ రెండింటినికలిపి ప్రయోగించటముద్వారా అవగతంచేసుకోవాలి".

'తత్త్వమసి' మహావాక్యములోని 'తత్' 'త్వం' పదములు సామానాధికరణ్యంలో ఉన్నవి కాబట్టి వాస్తవానికి ఒకదాని అర్థమే మరొకదాని అర్థమవుతుంది. ఈ రెండుపదాలకి విషయము ఒకటే. పదములు సామానాధికరణ్యంలో ఉంటే వాటి అర్థములు పరస్పరం విశేషిస్తాయి. ఉదాహరణకు "నల్లనికుండ" అన్న వాక్యంలో 'నల్లని' 'కుండ' అన్న పదములు రెండు సామానాధికరణ్యంలో ఉన్నవి. కాబట్టి 'నల్లని' అన్న పదము యొక్క అర్థము, 'కుండ' అన్న పదముయొక్క అర్థము పరస్పరము విశేషించుకుంటాయి. 'కుండ' విశేషింపబడుతుంది, 'నల్లని' విశేషణమవుతుంది. అదేవిధంగా 'నల్లని' విశేష్యమయితే 'కుండ' విశేషణమవుతుంది. అదే విధంగా 'తత్' 'త్వం' పదములమధ్య కూడ విశేషణ విశేష్యసంబంధముండాలి. కనుక ఇక్కడ వ్యష్టికీశ్వరుడుగా ఉండే గుణమున్నది. కానీ పరిచ్ఛిన్నుడైన జీవుడేవిధంగా జగత్కారణమైన ఈశ్వరుడవుతాడు ? కనుక జీవుడికి ఈశ్వరుడు విశేషణం కాలేడు; అలాగే జీవుడుకూడ ఈశ్వరునికి విశేషణంకాలేడు. ఎందుకంటె ఈశ్వరుడికి జీవుని పరిచ్ఛిన్నతలన్నీ సంక్రమిస్తాయి. విశేషణ - విశేష్యభావ సంబంధంలో విరోధముంటె, అప్పుడు లక్ష్య - లక్షణ సంబంధముకొరకు చూడాలి.

అంతేగాక, 'తత్' 'త్వం' పదములు సామానాధికరణ్యంలో ఉన్నాయి కనుక, అవి ఒకే వస్తువును సూచించాలి. కాబట్టి 'తత్' పదలక్ష్యము, 'త్వం' పదలక్ష్యం ఒకటే. ఎటువంటి భేదముండరాదు.

పదవాచ్యానికి లక్ష్యానికి మధ్య ఒక సంబంధముంటుంది. సంబంధమే లేకపోతే ప్రత్యేక పదం వాడాల్సిన అవసరముండదు. 'నీవు' అని నేనన్నప్పడు 'నీవు' పదానికి, ఆపదముద్వారా లక్షింపబడేదానికి సంబంధమున్నది, లేకపోతే 'నీవు' అన్న పదం వాడాల్సిన అవసరమే లేదు. అటువంటి సంబంధమున్నపుడే ఒక పదము లక్షణమవుతుంది. ఇక్కడ 'తత్' 'త్వం' పదములు లక్షణములు. ఆ పదములు లక్ష్యములమధ్య ఐక్యముండాలి. 'త్వం' పదలక్ష్యమే 'తత్' పదలక్ష్యముకూడ అయిఉండాలి. ఆ వాక్యంలోని 'అసి' పదం లక్ష్యములమధ్యనున్న ఏకత్వాన్ని తెలుపుతుంది. కాబట్టి 'తత్' పదలక్ష్యార్థమేదో అదే 'త్వం' పదలక్ష్యార్థముకూడ.

'త్వం' పదలక్ష్యము 'త్వం' పదలక్ష్యము కానిదాన్ని నిషేధించటం ద్వారా తెలుపబడుతుంది. శ్రుతిదృష్టిలో వ్యక్తి మనస్సులో 'త్వం' పదలక్ష్యం గురించిన భ్రమ ఉన్నది. శాస్త్రము 'నీవు' అని సంబోధించినపుడు నీవుదాన్ని 'నేను' గా గ్రహించాలి. అప్పడు సహజంగానే ప్రశ్న ఉదయిస్తుంది. "ఎవరీ నేను ?" అని. నేను కాని దానిని నిషేధించటం ద్వారా 'నేను' ఏదో నిరూపించబడుతుంది. ఈ నిషేధము ప్రతివారికి తనకుతాను సహజంగానే జరుగుతుంది. 'నేను' అనగానే కర్త రంగంలోకి వస్తాడు. కర్త - నేను లేదా జ్ఞాత తాను విషయీకరించే సకల విషయాలనుండి తననుతాను వేరు పరచుకుంటాడు. ఘటమువలె, తాను విషయములద్వారాగానీ, సాక్షిద్వారాగానీ విషయీక

రింప బడేదేదైనా నాకంటె భిన్నమయే ఉండాలి.  ఈ స్థూల శరీరం, ప్రాణములు, ఇంద్రియములు, మనస్సు, కర్తృత్వము, భోక్తృత్వము అన్నీ ప్రమాతకు అంటే నాకు తెలుసు. 'అహంకారం' గూడ విషయీకరింప బడుతున్నది కాబట్టి, అదినేను కాదు.  ప్రమాత యొక్క స్వరూపం చైతన్యము.  అది సమస్త అనుభవాల్లోను అనువర్తిస్తూనే ఉన్నది. ఆ చైతన్యమే 'నేను' పదానికర్థం.  కనుక 'త్వం' పదానికిలక్ష్యముచైతన్యము .  ఈ చైతన్యాన్ని దాటి మనం పోగలమా ? అది దేశకాలాల్లోని ఒక వస్తువు కాదు.  అందుచేత చైతన్యాన్ని అతిక్రమించి పోవటమన్న ప్రశ్నే ఉదయించదు.  దేశకాలములు కూడ చైతన్యానికి విషయములే.  కాబట్టి 'త్వం' పదలక్ష్యము ఈ ప్రత్యక్ చైతన్యమే.  జగత్కారణమైన ఈశ్వరుడు 'తత్' పదవాచ్యము.  ఈశ్వరుని స్వరూపము చైతన్యమే. సమస్తజగత్తు చైతన్యంనుండి ఉద్భవించినప్పటికీ చైతన్యంలో మటుకు ఏరకమైన మార్పుచెందలేదు. కనుక 'తత్' పదలక్ష్యం కూడా అదే చైతన్యం.  అదే విధంగా అఖండైకత్వాన్ని ధృవీకరించటానికి ఆ పదముల లక్ష్యార్థానికై వెళ్ళాలి.

ఇక్కడ ఏకత్వమంటె రెండు ఖండఅవయవాలను కలపటం ద్వారావచ్చిన ఏకత్వమని అర్థంకాదు.  జీవాత్మ పరమాత్మలో కలిసిపోదు.  జీవాత్మయే పరమాత్మ, ఏకత్వము సిద్ధ విషయమే.  కనుక అఖండైకరసత్వాన్నర్థంచేసుకోవాలంటె జీవేశ్వరుల లక్ష్యార్థాల నర్థం చేసుకోవాలి.

జీవేశ్వరులమధ్య అఖండైకత్వాన్ని లక్షణావృత్తిద్వారా అర్థం చేసుకోవాలని నీవు చెప్తే, ఏ లక్షణమనే ప్రశ్న వెంటనే తలెత్తుతుంది.  జహద్, అజహద్, జహదజహద్ లేక భాగత్యాగ లక్షణములని లక్షణములు  మూడు విధములుగా ఉన్నవి.

జహద్ లక్షణంలో వాక్యాన్నర్థవంతంచేయటానికి వాడిన పదం పోయి దాని స్థానం

లోనే సందర్భానికనుగుణమైన పదం వస్తుంది. ఉదాహరణకు 'గదంతా శబ్దంగా ఉన్నది' అన్న వాక్యంలో దాన్నర్థవంతంచేయటానికి 'గది' పదంపోయి దానిస్థానంలో "అందులో ఉన్న జనులు" అన్నది వస్తుంది. కనుక గదిశబ్దంగా ఉన్నదంటె దానిలోని జనులు శబ్దం గా ఉన్నారని అర్థం. జహద్ లక్షణానికి పరంపరాగతంగా వస్తున్న ఉదాహరణ 'గంగలో జనపదం'. గంగానదిలో ఇళ్లసముదాయముండే అవకాశం లేదుగనుక గంగలో అన్న పదం వదిలివేసి 'గంగాతీరం' అన్నపదం తీసుకువస్తాము. కాబట్టి 'గంగలో పల్లె' అన్న వాక్యానికి లక్ష్యార్థం 'గంగాతీరంలో పల్లె' అని.

అజహద్ లక్షణంలో పదాన్ని తీసివేయకుండా, వాక్యాన్ని పూరించటానికి మరోపదాన్ని చేరుస్తాము, ఉదాహరణకు "ఎరుపు పరుగెడుతున్నద"నే వాక్యానికి లక్ష్యార్థము 'ఎరుపు గుఱ్ఱం పరుగిడుతున్నద'ని. 'ఎరుపు పరుగిడుతున్నది' అన్న వాక్యానికర్థం లేదు. కాబట్టి ఎరుపు పదాన్నలాగే ఉంచి గుఱ్ఱమన్న మరోపదం చేరుస్తాము. దానితో 'ఎరుపు గుఱ్ఱం పరుగిడుతున్నద'ని వాక్యం పూర్తవుతుంది.

మూడవ లక్షణం జహదజహద్ లక్షణము లేక భాగత్యాగలక్షణము. ఒక వాక్యంలో పద ములసామానాధికరణ్యంలో ఉండి కొంతభాగంలో విరోధమున్నట్లయితే, విరుద్ధాంశాన్ని వదిలివేయాలి కాబట్టి అది 'జహద్ లక్షణం', ఇంకను అవిరుద్ధాంశాన్ని గుర్తించాలి. కనుక అది అజహద్ లక్షణంకూడ. విరుద్ధాంశాన్ని మాత్రమే వదిలివేస్తాం కనుక దీనిని భాగత్యాగలక్షణమని కూడ అంటారు.

'తత్ త్వం అసి' వాక్యవిషయంలో జహద్ అజహద్ లక్షణాలలో ఏదీ పనిచేయదని

శాస్త్రమిక్కడ చెప్తున్నది. 'తత్' 'త్వం' ల ఐక్యాన్ని బోధించటానికవి చాలవు. ఏవిధంగా ?

తత్ ని వదిలి వేశామనుకుందాం. అప్పుడు మరోపదాన్ని తీసుకురావాలి. 'తత్' అంటే అనంతము, పూర్ణము. నీవు పూర్ణాన్ని వదిలివేస్తే అంశాన్ని అంటే పూర్ణంకానిదాన్ని తీసుకురావాలి. అలా చేస్తే "త్వం తత్ అసి" అన్నది అఖండైకత్వాన్నివ్వజాలదు. కానీ శాస్త్ర దృష్టిమాత్రం అఖండైకత్వమే. ఒకవేళ త్వం వదిలివేస్తే "అసి" కూడ పోతుంది. 'తత్' మాత్రం మిగులుతుంది. కేవలం తత్ పదంద్వారా నీవెవరికీ ఏమీ బోధ చేయజాలవు. కనుక ఈ వాక్యంలో జహద్ లక్షణం పనిచేయదు.

అజహద్ లక్షణాన్నెందుకు ప్రయత్నించకూడదు ? అజహద్ లక్షణంలో వాక్యాన్ని పూర్తి చేయటానికై మరో పదాన్ని తీసుకురావాలి. కానీ ఏవాక్యమైనా తనకు తానుగా ఏ అర్థాన్ని బోధపరచలేకపోతే, అధికంగా పదం లేక పదాలను తీసుకురావాలి. ఇక్కడేమి తెస్తావు ? తత్ పదం సమస్తనామరూపాలను వ్యాపించి ఉన్న ఈశ్వరుణ్ణి తెలుపుతుంది. ఈశ్వరుడు సమస్తజగత్తుకి కారణం కనుక, జగత్తు ఈశ్వరునికంటె అభిన్నముకనుక తత్ పదం ఏ ఒక్క వస్తువుని కూడ వదిలిపెట్టదు. కాబట్టి తత్ పదం, మరోపదాన్ని తీసుకునే అవకాశంలేదు. తత్పదంద్వారా వ్యాప్తంగాకుండా బాహ్యంగా మరోపదంగాని, గుణంగాని, క్రియగాని లేదు. శాస్త్రం చెప్తుంది. "ఈ సర్వము ఖచ్చితంగా బ్రహ్మమే" నని. కనుక వాక్యాన్నర్థవంతంచేయటానికై తత్ పదం మరోపదానికి అవకాశాన్నివ్వదు, అవసరములేదు. సరే ! కానీ మరోపదాన్ని చేర్చి 'త్వం' పదాన్ని పెంచవచ్చుకదా ! నీవు లేక జీవుడు అన్నప్పడది నీగురించిన అన్ని ఊహలను, భ్రమలను సమస్తక్రియలను, సర్వవిశేషణములను - తెలిసినవి, తెలియనివాటి నన్నిటినీ కలిపి వ్యక్తం చేస్తుంది. 'బ్రాహ్మణుడు' లాంటి మరో అధికపదం జీవుణ్ణి సర్వజ్ఞుడైన ఈశ్వరునిగా చేయలేదు. కనుక 'త్వం'

పదంకూడ సమగ్రమే. ఆవిధంగా 'తత్ త్వం అసి' వాక్యం పూర్ణంగా అర్థాన్నిస్తుంది. కనుక అజహద్ లక్షణం కూడ పనిచేయదు.

కాబట్టి భాగత్యాగలక్షణం కోసం వెళ్ళాలి. ఒక భాగం - విరుద్ధాంశాన్ని వదిలివేయాలి. జీవుడు ప్రత్యక్షము, అల్పజ్ఞుడు, అల్పశక్తిమంతుడుకాగా ఈశ్వరుడు పరోక్షము, సర్వజ్ఞుడు, సర్వశక్తిసపంన్నుడు. 'త్వం' పదము స్వయంప్రకాశమైన 'నేను' ని సూచిస్తుంది. ఈ అపరోక్ష నీవుకు పరోక్ష ఈశ్వరునితో ఐక్యం చెప్పబడుతున్నది. కనుక విరోధమున్నది. కానీ ఈ విరోధము ఉపాధిమూలంగానే. వ్యక్తిత్వము అంటే అహంకారము సత్యవస్తువు పై - అంటె శుద్ధచైతన్యముపై ఆరోపితము, దేహేంద్రియమనోధర్మములు శుద్ధచైతన్యము యొక్క స్వరూపధర్మములు కావు. అవి ఆగంతకములే. అవి ఉపాధి ధర్మములే. అల్ప వ్యాపకత్వము, అల్పజీవితము మొ॥ దేహానికి మాత్రమే. ఇంకను అల్పజ్ఞత్వము, సుఖిత్వ ము, దుఃఖిత్వము, భోక్తృత్వము, కర్తృత్వము - ఇవన్నీ ఉపాధిధర్మములు. ఇవన్నీ పంచ కోశములకే చెందుతాయి. కానీ సత్యవస్తువుకుకాదు. వస్తువు 'సత్' దాన్నుండే సర్వము త్పన్నమైనది. ఆ 'సత్తు' ఏకము, అద్వితీయము, అనంతము, అదే 'జీవుడు' 'త్వం' పదము యొక్క లక్ష్యార్థము. మరి తత్ పదలక్ష్యార్థము సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ - అదిశుద్ధ చైతన్యము మాత్రమే ఆగంతుకములైన పరోక్షత్వము సర్వజ్ఞత్వము, జగత్కారణత్వము మొ॥ ఈశ్వర ఉపాధి ధర్మములను వదిలివేస్తాము. ఆవిధంగా భాగత్యాగలక్షణం ద్వారా ఉపాధి కృతములైన విరుద్ధాంశములను నిరాకరించటం చేత ఏకము అద్వితీయ బ్రహ్మ ము ఐన ఉపహిత చైతన్యం బోధపడుతుంది. అందుచేతనే జహద్ - అజహద్ లక్షణం ద్వారా మాత్రమే సత్యవస్తువు బోధింపబడుతుందని శాస్త్రమిక్కడ చెప్తున్నది.

అఖండైకత్వాన్ని సిద్ధపరచటంలో 'తత్' 'త్వం' పదములు రెండు ఉన్నాయి. కనుక

ఏ పదముపోనక్కరలేదు. ఏ పదము రానక్కరలేదు. జహద్, అజహద్ రెండు లక్షణములు పనిచేయవు. రెండుపదముల అర్థములు కలిగి ఉన్న లక్షణానికై మనం చూడాలి. 'త్వం' పదలక్ష్యము చేతనాయుక్త పురుషుడు. చేతనాయుక్తపురుషుని ప్రత్యక్ చైతన్యం అది. అదిత్వ ప్రత్యగాత్మకు ఇతరమైన ఏ ఆగంతుధర్మమైనా నిరాకరింపబడింది. ఆగంతుక ధర్మములు మాత్రమే తత్ త్వం పదముల మధ్య భేదాన్ని కలిగిస్తాయి. తత్ పదలక్ష్యంకూడ అదే చైతన్యం కనుక ఇక్కడ 'తత్' 'త్వం' పదముల రెండింటిలక్ష్యములే ఉన్నాయి. అందుచేత మనం భాగత్యాగలక్షణమునే ప్రయోగించాలి. మిగిలిన రెండు ఇక్కడ వర్తించవు.

ఈ విషయం చక్కగా అవగతం కావటంకోసం దృష్టాంతాన్నిస్తున్నారు.

79వ, 80వ శ్లోకాలు

స దేవదత్తోయమితీహ చైకతా
విరుద్ధ ధర్మాంశమపాస్య కథ్యతే ।
యథా తథా తత్త్వమసీతి వాక్యే
విరుద్ధధర్మానుభయత్ర హిత్వా ॥ 250 ॥
సంలక్ష్య చిన్మాత్రతయా సదాత్మనోః
అఖండభావః పరిచీయతే బుధైః ।
ఏవం మహావాక్యశతేన కథ్యతే
బ్రహ్మాత్మనోరైక్యమఖండభావనః ॥ 251 ॥

చ యథా - ఏ విధంగానైతే; స దేవదత్తః అయమ్ - ఆదేవదుత్తుడితడే; ఇతి ఇహ - అన్న వాక్యంలో; విరుద్ధ ధర్మాంశమ్ అపాస్య - విరుద్ధ ధర్మములను వదిలివేసి; యథా - ఎట్లు; ఏకతా కథ్యతే - ఏకత్వము చెప్పబడ్డదో; తథా - అదేవిధంగా; తత్ త్వంఅసి ఇతి వాక్యే - 'నీవే అతడు' అన్న మహావాక్యంలో గూడ; ఉభయత్ర - ఇరువురిలోనూ; విరుద్ధధర్మాన్ హిత్వా - విరు ద్ధాంశములను వదిలివేసి;

బుధైః - వివేకవంతులచే; చిన్మాత్రతయా - చైతన్య రూపంగా; సత్ ఆత్మనోః - బ్రహ్మ ము జీవులు; చిన్మాత్రతయా - చిన్మాత్రస్వరూపులనుగా; సంలక్ష్య - పరిశీలించి (తెలిసి కొని) అఖండ ఏక భావః - అఖండైకత్వము; పరిచీయ తే - తెలుసుకోబడుతుంది; ఏవం - ఇదేవిధంగా; మహావాక్యశతేన - వందలకొలది మహావాక్యములద్వారా; బ్రహ్మాత్మ నోః - జీవబ్రహ్మల; అఖండ భావః - అఖండత్వము; ఐక్యమ్ - ఐక్యము; కథ్యతే - చెప్పబడు తుంది.

> "ఇతడే ఆ దేవదత్తుడన్న వాక్యంలో ఏవిధంగా విరుద్ధాంశాన్ని వదిలివేసి ఏకత్వం చెప్పబడ్డదో అదేవిధంగా "నీవే అతడు" అన్న వాక్యంలో గూడ ఆ రెండు పదములలోని విరుద్ధాంశాలను వదిలివేసి, అవిరుద్ధాంశమైన ఏకమైన చైతన్యదృష్ట్యా వివేకవంతులు జీవబ్రహ్మల అఖండైకత్వాన్ని తెలుసుకుంటారు. ఈ విధంగా వందలకొలది మహావాక్యములద్వారా శాస్త్రం జీవబ్రహ్మల ఐక్యాన్ని బోధిస్తుంది."

'తత్త్వమసి' వాక్యంలోని అఖండైకత్వాన్ని భాగత్యాగలక్షణంద్వారా శాస్త్రమే విధంగా

బోధిస్తుందో ఈ శ్లోకాల్లో వివరిస్తున్నారు. అందుకొరకై "సః దేవదత్తః అయమ్" ఆ దేవద త్తుడు ఇతడే" అని దృష్టాంతాన్నిస్తున్నారు. 'ఆ దేవదత్తుడు' అన్నది దేశతః కాలతః పరోక్షం గా ఉన్న దేవతత్తుడిని తెలుపుతుంది. అంటే ఆ ప్రదేశంలోని, ఆ కాలంలోని దేవదత్తుడు, "ఇతడే - ఈ దేవదత్తుడు "నీ ఎదురుగా ఇప్పుడు ఇక్కడ ఉన్న దేవదత్తుడిని తెలుపుతుం ది. "అయమ్ ఈ" అన్నది ఈ స్థలంలో ఈ సమయంలో ప్రత్యక్షంగా ఉన్నదానికి వాడతా ము. నీవు దేవదత్తుడిగురించి చెప్తున్నప్పుడు అతడు నీకెదురుగా నిలబడి ఉన్నవాడైతే " ఈ దేవదత్తుడు" అన్నది పూర్ణమైన వాక్యమే. లక్షణంతో పనిలేదు. వర్తమానంలో ఉపస్థి తుడుకాని దేవదత్తుడి గురించి చెప్తుంటే 'ఆ దేవదత్తుడు' అన్నది పూర్తిగా అర్థవంతమైన దే. కానీ "ఆ ఈ దేవదత్తుడు" అన్నవాక్యం విభ్రాంతిని కలుగజేస్తుంది. దేవదత్తుడు ప్రత్య క్షంగానైనా ఉండాలి లేక పరోక్షంగానైనా ఉండాలి. కనుక ఈ వాక్యంలో విరోధమున్నది.

దేవదత్తునితో పదిసంవత్సరాలపూర్వం నివసించిన ఇద్దరు వ్యక్తులిప్పుడతనిని చూచా రను కుందాం. ఇరువురిలో ఒకరు దేవదత్తుణ్ణి గుర్తిస్తాడు. రెండవాడు గుర్తించలేకపో తాడు. అప్పుడు గుర్తించని రెండవవానికి "ఇతడే ఆ దేవదత్తుడ" ని తెలపాల్సినవసరం తప్పనిసరి అవుతుంది. "అతడే ఈ దేవదత్తుడ"న్న వాక్యాన్ని రెండవవాడు విన్నప్పుడు, అం దులో ఒక వ్యక్తపరచటము - తెలుసుకోవటమున్నది. "సంవత్సరాల పూర్వం భిన్న ప్రదే శంలో ఉన్న దేవదత్తుడే ఇపుడు ఇక్కడ నాముందున్న వ్యక్తి" అని ప్రకటితమవుతుంది. అప్పడతడిని గుర్తిస్తాడు. కనుక 'ఆ' పదానికి విషయము దేవదత్తుడే. 'ఈ' పదానికి కూడ విషయము అదే దేవదత్తుడు. కనుక విరుద్ధాంశాలను సూచించే 'ఆ, ఈ' పద

ములు పోతాయి. 'ఆ దేశకాలములు' "ఈ దేశకాలములు" నిషిద్ధంచేసి, దేవదత్తవ్యక్తిని మాత్రం ఉంచివేస్తాం. విరుద్ధాంశాల్ని తొలగించి, అవిరుద్ధాంశాన్ని గుర్తించేట్లుచేసే వృత్తిని, ఆలోచనావిధానాన్ని, భాగత్యాగలక్షణమనంటారు.

అదేవిధంగా 'తత్త్వమసి' వాక్యంలో గూడ 'తత్' 'త్వం' పదములమధ్య విరుద్ధాంశాన్ని వదిలివేసి ఐక్యాన్ని గుర్తిస్తారు. జీవుడు ఒక స్థూలశరీరంతో తాదాత్మ్యం చెంది తాను సృష్టించబడిన వాడినను కుంటాడు. కాగా ఈశ్వరుడు సృష్టికర్త. ఇది ఒక విరుద్ధ ధర్మము. అలాగే ప్రత్యక్షత్వము పరోక్షత్వము అల్పజ్ఞత్వము, సర్వజ్ఞత్వము మొ॥ కూడ విరుద్ధ ధర్మములు.

భాగత్యాగలక్షణము ద్వారా, ఈ విరుద్ధాంశములను వదిలివేసి ఏకత్వము చూపబడుతుంది. ఈ విధంగా 'తత్త్వమసి' వాక్యం ఏకత్వాన్ని బోధించగలుగుతుంది. మరోవిధంగా పదములద్వారా ఏకత్వము తెలియరాదు. శాస్త్రము సత్యవస్తువును బోధించే విధానమదే.

"ఎక్కడనుండైతే పదములు మరలివచ్చునో" అని శ్రుతి అన్నప్పడు, దానర్థం సత్యవస్తువు - బ్రహ్మము పదముల వాచ్యార్థంకాదని. కానీ శాస్త్రపదములద్వారా మాత్రమే జీవేశ్వరుల ఐక్యం వివరింపబడుతుంది. పదముల వాచ్యార్థదృష్ట్యా అది పదములకందనిదని చెప్పబడింది. కానీ లక్షణముద్వారా తెలుపబడుతున్నది గనుక పదములచేత మాత్రమే సత్యవస్తు బోధకలుగుతుంది.

సద్వస్తువే సర్వకారణము. అది ఏకము, అద్వితీయము. రెండవది జీవుడు. అతడు ఇక్కడ ఆత్మ అని పిలువబడుతున్నాడు, అంటే జీవాత్మ అని అర్థం. వివేకవంతులకు

మాత్రమే జీవేశ్వరుల ఐక్యమవగతమతుతుందని శాస్త్రమిక్కడ తెలుపుతున్నది. కానీ జీవే శ్వరులు భిన్నులు. వివేకవంతుడు ఆ రెండింటిని ఒకటని ఎలా తెలుసుకుంటాడు ? చిన్మాత్రత్త్వాన్నిమాత్రమే దృష్టిలో ఉంచుకొని ఏకత్వాన్నర్థంచేసుకుంటాడు. అది ప్రత్యగా త్మతప్ప అన్యముకాజాలదు. ఈశ్వరస్వరూపమైన సత్యం జ్ఞానమనంతమే ప్రత్యగాత్మ అని అర్థంచేసేకోవాలి. అది ఈశ్వరుని ప్రత్యక్చైతన్యం. మరి జీవుని ప్రత్యగాత్మఐన ప్రత్యక్ చైతన్యంకూడ సత్యం జ్ఞానం అనంతం, మరియు రెండు బహ్మములు లేవు. జీవుని స్వరూపము, ఈశ్వరుని స్వరూపంకూడ ఒకేచైతన్యము. కనుక జీవేశ్వరులమధ్య ఐక్య మున్నది. ఐక్యమంటే ఇక్కడ అఖండైకత్వము. అది రెండు వస్తువులను కలపటంద్వారా తీసుకురాబడిన ఐక్యం కాదు. ఈ విషయమే ఉపనిషత్తులన్నిటిలోనూ అనేకచోట్ల చెప్పి న అనేకానేకవాక్యములద్వారా స్పష్టంగా వివరించబడింది.

81వ శ్లోకము

మృత్కార్యం సకలం ఘటాదిసతతం మృణ్మాత్రమేవాభితః
తద్వత్సజ్జనితం సదాత్మకమిదం సన్మాత్రమేవాఖిలమ్ ।
యస్మాన్నాస్తి సతః పరం కిమపి తత్ సత్యం స ఆత్మా స్వయం
తస్మాత్త్వమసి ప్రశాంతమమలం బ్రహ్మోద్వయం యత్పరమ్ ॥ 253 ॥

మృత్ కార్యం - మృత్తునుండి ఉత్పన్నమైన; సకలం సతతం - సమస్తము ఎప్పటికీ; అభి తః మృత్ మాత్రం - పూర్తిగా మృత్తు మాత్రమే, అన్యంకాదు; తద్వత్ - అదేవిధంగా; సజ్జని తం - సత్తునుండి ఉత్పన్నమైన; ఇదం సదాత్మకమ్ - సత్తులోనే స్థితమైన ఈ; అఖిలమ్ సన్మాత్రమ్ ఏవవ సమస్తము, సన్మాత్రమే; సతః పరం - సత్తు కంటె అన్యమైనది; కిమ్

అపిన అస్తి యస్మాత్ - ఏదీ లేని కారణంచేత; తత్ సత్యం - ఆసత్తే సత్యము; స ఆత్మా స్వయమ్ - అదే సాక్షాత్తుగా ఆత్మ; తస్మాత్ - కాబట్టి; ప్రశాంతం అమలం - సర్వవిక్రియారహితము; మలరహితము; అద్వయం బ్రహ్మ - అద్వయ బ్రహ్మము; యత్ పరమ్ - ఏదైతే పరమో; తత్ త్వం అసి - ఆ బ్రహ్మమే నీవు.

> "ఘటాదులవలె మృత్తునుండి ఉత్పన్నమైనదంతా ఎప్పటికి మృత్తుకంటె అన్యముకాదు. అదేవిధంగా సత్తునుండి ఉత్పన్నమైనదంతా సత్తులోనే స్థితమై ఉన్నది. సత్తుకంటె అన్యమేదీలేదుగనుక ఆ సత్తే సత్యము, అదే ఆత్మ, కాబట్టి సర్వవిక్రియారహితము మలరహితము, అనంతము, అద్వితీయము అయిన బ్రహ్మమే నీవు."

ఈ శ్లోకము ఛాందోగ్యోపనిషత్తులోని ఆరవఅధ్యాయముయొక్క సారాంశాన్నందిస్తుంది. మృత్తునుండి ఉత్పన్నమైన ఘటము, బాన మొ॥ వన్నీ మృత్తుకంటె భిన్నములు కావు. ఘటంలో నీవేభాగం చూచినా అది మృత్తే కాబట్టి నీవు కండఅనేది మృత్తిక మాత్రమే. ఘటం లోపల ఉన్న ఆకాశం మాటేమిటి ? అది మన్నుకాదు కదా అని ఎవరైనా అడగవచ్చు. మృత్తునుండి ఉత్పన్నమైనదంతా మన్నేనని శాస్త్రం చెబుతున్నది. ఆకాశమైతే ఖచ్చితంగా మృత్కార్యంకాదు, కనుక ఆప్రశ్నే ఉదయించదు.

ఘటాదులు వాటికుపాదానకారణమైన మృత్తుకంటె భిన్నముకావు. మృత్తికనుండి ఉత్పన్నమైనదేదీ మృత్తికకంటె భిన్నంకానివిధంగానే సత్తునుండి ఉత్పన్నమై సత్తు యందే అస్తిత్వం కలిగిఉన్న ఈ సమస్త జగత్తుకూడ సత్తేకాని అన్యంకాదు. సద్వస్తువులోనే దాని స్వరూపముంది. సమస్తజగత్తు సత్తునుండే జనించింది, సత్తుచేతనే స్థితిని పొందుతున్నది, సత్తుయందే లయం జెందుతుంది. నామ రూపాలుగానున్న సర్వవికారములు

సద్వస్తువుపై ఆరోపితములే. అవన్నీ మిథ్య. సద్వస్తువే సమస్త జగత్తుకుకారణము. ఈ సత్తుకుకూడ మరొకకారణం ఉన్నదా ? ఈసత్తుకు కారణం లేదని శాస్త్రం చెప్తున్నది. దేశకాలవస్తువులచే ఈ సత్తు పరిచ్ఛిన్నం కావటంలేదు. కనుక అది జన్మించలేదు, కనుక అది జన్మించలేదు, కనుక దానికి కారణం లేదు, పైగా సత్తుకంటె అన్యంగా మరేదీ లేదు. అది మాత్రమే సత్యము.

కారణముసత్యమని కార్యము మిథ్యయని తెలపటానికై శాస్త్రమిక్కడ కారణ - కార్య ప్రక్రియను తెలుపుతున్నది మృద్ఘటం విషయంలో మృత్తు సత్యము, ఘటము మిథ్య అదే విధంగా సత్ కార్యమైన జగత్తుమిథ్య, కారణమైన సద్వస్తువు సత్యము. సత్‌కంటె అన్యమైన కారణమంటూలేదు. ఇతరమైన దంతా సత్యమైన ఈ సద్వస్తువుపై ఆధారపడిఉన్నది.

ఈ సద్వస్తువు జీవుణ్ణికలుపుకుంటుందా లేక వదిలివేస్తుందా ? "ఆసత్తే ప్రమాత యొక్క స్వరూపము, స్వయముగా అదే ఆత్మ" అని శాస్త్రం బోధిస్తుంది. స్వయముగానే అంటే తన అస్తిత్వానికై మరోదానిపై ఆధారపడనిది. అంటే అది స్వయంప్రకాశము, సద్వస్తువు ఒక వస్తువుకాదు, కానీ ఏవస్తువు దానికంటె అన్యముగా లేదు. ఈ సత్యము స్వయంప్రకాశముకాదని ప్రమాతకు జ్ఞేయమని అనుకుందాం. అప్పుడది దృశ్యమవుతుంది. ఏది దృశ్యమో అది నశిస్తుంది. కానీ సత్యము నిషేధింపబడనిది, నశించనిది. కనుక స్వయంప్రకాశమైనదేదో అదే సత్యవస్తువు కావాలి. అది నిషేధింపబడదు. అది విచారించే జిజ్ఞాసువుయొక్క ఆత్మయే. తన అస్తిత్వానికి, ప్రకాశానికి మరోదానిపై అది ఆధారపడదు. స్వయంప్రకాశము స్వతః సిద్ధము.

సద్వస్తువు ఆత్మ కనుక 'నీవే అది' అని శాస్త్రం చెప్తుంది. 'తత్' అంటే ఏవిధంగానూ దేశ, కాల, వస్తువులచేత పరిచ్ఛిన్నంకానిది. అది ఒక వస్తువుకాదు, కానీ ఏ వస్తువు

దానికంటె వేరుగా లేదు. ఏ రకంగానూ భేదము లేనిది, సకల భేదములు మూడు తరగతులక్రిందకు వస్తువి. విజాతీయ భేదము ఒకజాతి మరోజాతికంటె భిన్నము; సజాతీయ భేదము - ఒకే జాతిలోఉన్నభేదము; స్వగతభేదము - ఒకే వస్తువులో ఉన్న భేదము. సద్వస్తువు సర్వభేదరహితము. మరో బ్రహ్మము లేదు గనుక సజాతీయభేదము లేదు, బ్రహ్మము కంటె వేరుగా మరోవస్తువంటూ ఉంటే అప్పడు విజాతీయ భేదముంటుంది. కానీ విదితము, అవిదితము సర్వము బ్రహ్మమే. కాబట్టి బ్రహ్మమునకు విజాతీయభేదము లేదు. బ్రహ్మమునకు పాదములు హస్తములు మొ॥ అవయవములు లేవు గనుక బ్రహ్మములో స్వగతభేదములు కూడ లేవు.

సత్యం జ్ఞానం అనంతములను బ్రహ్మమునకు విశేషణములుగా ఎందుకు గ్రహించకూడదు ? అటువంటి పక్షంలో స్వగతభేదముంటుంది. అది విశేషణములుకావాలంటే విశేష్యమైన బ్రహ్మము చైతన్యానికి విషయంకావాలి కనుక అది సంభవంకాదు. బ్రహ్మము ఉన్నది (సత్యము). చైతన్యానికి విషయములైన దేశకాలములచే సత్ పరిచ్ఛిన్నం కావటంలేదు. కనుక అది అనంతము.

బ్రహ్మము ప్రశాంతము, సర్వవిక్రియావర్జితము, అమలము, రాగద్వేషములచేగానీ, పుణ్య పాపములచేగానీ మరి దేనిచే గాని ప్రభావితం కాదు. బ్రహ్మము అధిష్ఠానము. సర్వముదానిపై ఆరోపితము, కనుకనే మిథ్యా వస్తువుయొక్క గుణదోషాలు సత్యవస్తువుకు సంక్రమించవు.

"నీవు జగత్కారణమైన సద్వస్తువేకానీ అన్యముకాదని" శాస్త్రం చెప్తున్నది. కనుక ఆత్మతప్ప వేరేదీ లేదు. అంటే 'నేను' తప్ప మరేదీలేదు. అందుచేతనే సద్వస్తువుతానేనని అర్థంచేసుకున్నవారు, "నేను మనువును, నేను సూర్యుణ్ణి, చంద్రుణ్ణి మొ॥ సర్వము

నా నుండే ఉత్పన్నమవుతుంది. నాచేతనే స్థితినిపొందుతున్నది. నాలోనే లయంచెందు తుంది" అని చెప్పవచ్చు.

82వ శ్లోకము

నిద్రా కల్పిత దేశకాలవిషయ జ్ఞాత్రాది సర్వం యథా
మిథ్యా తద్వదిహాపి జాగ్రతి జగత్స్వాజ్ఞానకార్యత్వతః ।
యస్మాదేవమిదం శరీర కరణప్రాణాహమాద్యప్యసత్
తస్మాత్తత్త్వమసి ప్రశాంత మమలం బ్రహ్మాద్వయం యత్ పరమ్ ॥ 254 ॥

యథా నిద్రా కల్పిత - ఏవిధంగా స్వప్నంలో సృష్టించబడిన; దేశకాల విషయ జ్ఞాత్రాది - దేశము, కాలము విషయములు, ప్రమాత మొ॥ సర్వం మిథ్యా - సర్వము మిథ్యయో; తద్వత్ - అదేవిధంగా; ఇహ జాగ్రతి అపి - ఇక్కడ జాగ్రత్తులో కూడ; స్వ అజ్ఞానకార్యత్వతః - ఆత్మ అజ్ఞాన కార్యం కనుక; జగత్ - జగత్తు (అసత్యము) యస్మాత్ ఏవం - అది అలాగా ఉన్నది కనుక; ఇదం శరీరం కరణ ప్రాణ అహమ్ ఆది అపి - ఈ శరీరము; ఇంద్రియ ములు, ప్రాణము, అహంకారాదులు కూడ; అసత్ వ అసత్యములే; తస్మాత్ వ కాబట్టి; ప్రశాంతమ్ - విక్రియారహితము; అమలమ్ - మల రహితము; అద్వయం - అద్వయము ఐన; యత్ పరం బ్రహ్మ - ఏపరబ్రహ్మ ఉన్నదో; తత్ - ఆ బ్రహ్మము; త్వం అసి - నీవే.

"స్వప్నంలో సృష్టించబడిన ఆకాశము, కాలము వస్తువులు ప్రమాత మొ॥ వన్నీ ఏవిధంగా అసత్యమో, అదేవిధంగా ఈ జాగ్రత్ ప్రపంచంలోకూడా అజ్ఞానకార్యంకనుక అన్నీ అసత్యమే. ఈ కారణంగానే ఈ దేహేంద్రియమనో సంఘాతము, ప్రాణము, అహంకారాదులన్నీ అసత్యము కాబట్టి అద్వితీయము,

సర్వవిక్రియారహితము, మలరహితము, పరిచ్ఛిన్నరహితమైన బ్రహ్మమే నీవు."

సర్వము నానుండిలేక సత్తునుండి ఉత్పన్నమైనదని ఇంతకుముందు తెలుపబడింది. అంటే సమస్త జగత్తుతో నేను బద్ధుడనై ఉన్నాను. సద్వస్తువు ఈజగత్తుగా పరిణమించ టానికి వికారాన్ని చెందిందని ఎవరైనా భావించవచ్చు. ఇక్కడ సద్వస్తువులో అటువంటి వికారాన్ని నిరాకరిస్తున్నారు. అందుకై దృష్టాంతాన్ని కూడ ఇస్తున్నారు.

సుషుప్తినుండి అర్ధఉన్మీలుతుడైనపుడు కలగనటమారంభమవుతుంది. స్వప్నజగత్తున నుభవించే స్వప్నపురుషుడుంటాడు. దేశ, కాల వస్తువులు, వాటి ననుభవించే వాడు - సమస్త జగత్తు స్వప్నంలో సృష్టించబడుతున్నవి. మేలుకొన్నప్పడు యావత్ స్వప్నప్రపం చము నిషేధించబడుతున్నది. కనుక అది మిథ్యా "స్వప్నంలో స్వప్నపురుషునితో సహా స్వప్నప్రపంచమంతా నాకంటె భిన్నంకాదు. స్వప్నంలో విషయి - విషయములు రెం డూనూ॥ - నేను మాత్రమే" నని జాగ్రత్ పురుషునికి చక్కగా తెలుసు. అంటె స్వప్నంలో ఉన్నది నేనే - చూచేది నేనే. కానీ ఒకే సమయంలో విషయి - విషయములు, రెండిం టిగా నేనుండలేను గనుక అది సంభవంకాదు. ఐనప్పటికి స్వప్నంలో విషయి - విషయ ములు రెండూ నేనేనన్నది సత్యము. కానీ ఏవిధంగా ? మాయకారణంగా ఇది సంభ వమే.

స్వప్నంలో లాగానే జాగ్రత్తులోకూడ ఈ ద్వైతప్రపంచం సమస్తము ఆత్మకంటె వేరు కాదు. స్వప్నంలో లాగానే జాగ్రత్తులోకూడ దేహేంద్రియసంఘాతము, ప్రమాత, ప్రపం చము, నే నాలోచించేది, అనుభవించేదేదైనా - సర్వము మిథ్య కాబట్టి - ఆత్మకు సత్య

మైన విక్రియ లేదు. స్వప్నంలో ఆత్మ ఏరకమైన వికారానికి లోను కాదు, కానీ అదే సమయంలో స్వప్న ప్రపంచంగా భాసిస్తుంది. స్వప్నంలో ఉన్నదంతా చైతన్యమే. ఆ చైతన్యము ఆత్మ. అదే అద్వితీయబ్రహ్మము. కాబట్టి సత్యమని, జగత్ కారణమని చెప్పబడింది. ఎటువంటి మార్పుకు లోను కాలేదు. ఆ బ్రహ్మము వస్తువు మాత్రమే. ఎటువంటి మార్పు చెందదు. ఇతరమంతా - సర్వము సర్వదా మారుతూనే ఉంటుంది. కనుకనే మిథ్య. మరి ఆ వస్తువు నీవే.

తరువాత శ్లోకములు జీవేశ్వరుల ఐక్యజ్ఞానఫలాన్ని తెలుపుతాయి.

సాధకునికి తాను దేన్నందుకోబోతున్నాడో చక్కగా అవగతం చేసుకోవటంలో, సహాయకారిగా ఉండే విధంగా ఈ పురుషార్థ ఫలాన్ని వివరంగా చెప్పాలి. ప్రతిఒక్కరు మోక్షాన్ని కోరుతున్నారు, తాను దేన్నుండి వ్యథచెందుతున్నాడో దాన్నుండి ముక్తినికోరుతున్నాడు. కానీ మోక్షం గురించి సరియైన అవగాహనలేదు. అంతే గాక ఆమోక్షానికై తనేంచెయ్యాలో కూడ స్పష్టంగా తెలియదు. మోక్షానికావశ్యకమైన వివేకాదిసాధనచతుష్టయాన్ని పరిశీలించినమీదట ఈ విషయం పరిష్కారమవుతుంది. ఆ విధమైనవిచారం బుద్ధిని సరియైనపంథాలో నడిపిస్తుంది. మరియు ఈ విచారణ మానవుని చతుర్విధపురుషార్థాలలో అందరూ కోరుకునేది మోక్షమేనన్న స్పష్టమైన అవగాహనకు దారి తీస్తుంది. ఆ మోక్షము ఆత్మజ్ఞానముద్వారానే లభిస్తుంది. మరి ఈ జ్ఞానస్వరూపమేమిటి ? ఇవన్నీ చర్చకు వస్తాయి.

ఈ ఆత్మజ్ఞానమున్న పురుషుణ్ణి శాస్త్రం జీవన్ముక్తునిగా ప్రకటిస్తుంది. అటువంటి వ్యక్తి ప్రతిరంగంలోనూ సిద్ధహస్తుడని, దోషరహితుడని చాలామంది అభివర్ణిస్తుంటారు. కానీ అది ప్రమాదభరితమైనది. ఈ సిద్ధహస్తత్వము ఒక మానసిక దౌర్బల్యం. సిద్ధహస్తుడికి

సరియైన నిర్వచనం లేదు. కానీ కొంతమంది వర్ణించటానికి ప్రయత్నిస్తూ జ్ఞానిని గూర్చి చెబుతుంటారు. సిద్ధహస్తత్వము అరువుతెచ్చుకున్న పదం. అది భిన్న భిన్నవ్యక్తులకి భిన్న భిన్నఅర్థాల నిస్తుంది. ఏకత్వ జ్ఞానఫలము - జీవన్ముక్తి.

# జీవన్ముక్తి

83వ శ్లోకము

బ్రహ్మాత్మనోః శోధితయోః ఏక భావావగాహినీ ।

నిర్వికల్పా చ చిన్మాత్రా వృత్తిః ప్రజ్ఞేతి కథ్యతే ॥

సుస్థితా సా భవేద్యస్య జీవన్ముక్తః స ఉచ్యతే ॥ 428 ॥

బ్రహ్మాత్మనోః - బ్రహ్మము ఆత్మలను; శోధితయోః - చక్కగా విచారించినపుడు; ఏక భావ అవగాహినీ - వారి ఏకత్వాన్ని గ్రహించే; నిర్వికల్పా - విషయ విషయి ద్వైత భావరహితమైన; చిన్మాత్రా వృత్తిః - చైతన్య స్వరూపమైన వృత్తియే; ప్రజ్ఞా ఇతి కథ్యతే - "ప్రజ్ఞ" అని పిలువబడుతుంది; సా - అది; యస్య సుస్థితా భవేత్ - అది ఎవరికైతే సుస్థిరంగా ఉంటుందో; సః జీవన్ముక్తః ఉచ్యతే - అతడిని జీవన్ముక్తుడంటారు.

" విషయ విషయిద్వైతభావరహితమైన చైతన్యరూపంలోనున్న జీవేశ్వరులమధ్య ఏకత్వమే విషముగాగలిగిన అంతఃకరణవృత్తిని 'ప్రజ్ఞా' అనంటారు. ఈదృఢమైన జ్ఞానం గలిగిన వానిని జీవన్ముక్తుంటారు."

జీవేశ్వరులైక్యమే విషయంగా గలిగిన అంతఃకరణ వృత్తిని జ్ఞానమంటారు. ఆత్మ బ్రహ్మలఐక్యాన్ని చర్చించటం లేదిక్కడ. వారి ఐక్యము పూర్వసిద్ధమే. శాస్త్రం చేసే ప్రయత్నమంతా జీవుడే ఈశ్వరుడని నిరూపించటానికే. ఈ ఏకత్వబోధ ఈశ్వరునితో సంబద్ధమై ఉన్న జీవునికొరకే. మహావాక్యంలోని 'త్వం' 'తత్' పదముల సమ్యక్ విచారంవలన జీవేశ్వరుల ఐక్యమవగతమవుతుంది. ఈ రెండింటి ఏకత్వాన్ని గుర్తించే వృత్తి ఏకభావావగాహినీ వృత్తి. ఈ వృత్తి విషయి విషయద్వైత భావవర్జితమని శాస్త్రం తెలుపుతుంది. సాంకేతిక పదాల్లో చెప్తే ఫలవ్యాప్తి ఉండదు. బ్రహ్మమును 'ఇది' అని గుర్తించవు. 'ఇది బ్రహ్మము' అని చెప్పవు. "నేను బ్రహ్మమ"ని గుర్తిస్తావు.

ఈ వృత్తి చిన్మాత్రస్వరూపంగానే ఉన్నది. ఇతర ఏ జ్ఞానంలోనైన జ్ఞేయవిషయము వృత్తి విషయంగా ఉంటుంది. నీవు విషయాన్ని గుర్తించి, అది వృక్షమైతే "ఇది వృక్షము" అనంటావు. కనుక 'ఘటము' 'వృక్షము' 'ఆవు' 'ఆకు' అని నేనన్నపుడు వీటన్నిటిలో ఆయావృత్తిలో ఉన్న విషయాన్ని గుర్తిస్తావు. కానీ 'చైతన్యం' అని నేనన్నప్పడు నీ మనో వృత్తిలో ఏవిషయాన్ని చూడవు, కానీ దాని అర్థాన్నిమాత్రం గుర్తిస్తావు. వృత్తి వ్యాప్తి - విష యమును వృత్తి వ్యాపిస్తుంది కనుక ఈ గుర్తింపు సంభవమే. కానీ ఫలవ్యాప్తి లేదు - "ఇది చైతన్యం" అని నీవు గుర్తించవు. ఈ చైతన్యం లేకుండా పోవటం ఎన్నటికి జర గదు. "మామిడివృక్షమని" నీవన్నపుడు మామిడి వృక్షము చైతన్యాన్ని తప్పించదు. కానీ "మామిడిపండు" అని నీవంటె "మామిడి వృక్ష" వృత్తి మారిపోతుంది కానీ చైతన్యం మారదు. కనుక ఏవృత్తి అయినా, ఆవృత్తిలో ఏవిషయమున్నప్పటికి, చైతన్యాన్ని తప్పిం చదు, మారిపోయేట్లు చేయదు. సత్యం, జ్ఞానం అనంతమైన చైతన్యమే ఆత్మస్వరూపం. వాస్తవంలో అది నీవే. చైతన్యవిషయకమైన, అజ్ఞానం వృత్తిచేత నివారితమవుతుంది. ఆ జ్ఞానవృత్తినే ప్రజ్ఞ అని అంటారు.

ఈ జ్ఞానముత్పన్నం కావాలి. చైతన్యం ఉత్పన్నంకాదు. కానీ జ్ఞానం మాత్రం ఉత్పన్న మయినట్లుగా ఉత్పన్నమవుతుంది. ఎందుచేత ? అజ్ఞానము, అధ్యాసలనివృత్తి ఉన్నది కనుక, సత్యం జ్ఞానం అనంతమైన బ్రహ్మము ఎల్లప్పడూ ఉన్నది కానీ అది సిద్ధమేనన్న జ్ఞానమే లేదు. అప్పడు సత్యం జ్ఞానం అనంతము అయిన బ్రహ్మము తానేనన్న సత్యాన్ని తెలిపే వృత్తిజ్ఞానం కలుగుతుంది. ఈ వృత్తి జ్ఞానం ఉత్పన్నం కావటానికి శాస్త్రమే సమ్యక్ ప్రమాణం కనుక, శాస్త్రవిచారం కావాలి.

కానీ ఒక విషయం ఇక్కడ స్పష్టంగావాలి. మన ప్రయత్నం అధ్యాసను తొలగించటం లో లేదు; అధ్యాసకు కారణమైన అజ్ఞానాన్ని మాత్రమే తొలగిస్తున్నాము. వృత్తిజ్ఞానఫలము

అజ్ఞాననివృత్తే గాని అధ్యాసనివృత్తి కాదు. నిజానికి ఏ ప్రమాణమైనా వస్తువును తెలుపు తుంది. తద్వారా అజ్ఞానం తొలగిస్తుంది. అజ్ఞానజనితమైన అధ్యాస ఉంటే అదికూడ తొలగిపోతుంది. ఒక ప్రమాణాన్నుపయోగిస్తూ విచారంచేసినప్పడల్లా నీవధ్యాసను తొలగించటంలేదు. వస్తువును మాత్రమే అర్థంచేసుకునే ప్రయత్నంచేస్తున్నావు.

విచారమెప్పడు అధ్యాసపురస్సరంగానే ఉండాలని నియమమేమీ లేదు. కొన్నివస్తువు లుంటాయి. వాటి గురించిన అధ్యాసలేకపోయినా వాటి గురించి తెలియదు. దాని పేరు, జాతి మొ॥ వాటి గురించి విచారించుతావు. ఇక్కడ అధ్యాసేమీ లేదు. ఐనా విచారణ ఉన్నది. ప్రమాణప్రవృత్తి వస్తువును తెలుసుకోవటం కొరకు మాత్రమే.వస్తువును మరొక వస్తువుగా భ్రమపడినప్పడుడూడ నీవు వస్తువునుగురించే తెలుసుకునే ప్రయ త్నంచేస్తున్నావు. తాడును సర్పంగా భ్రమపడి, అధికంగా వెలుగును తీసుకువచ్చి "ఇది సర్పం కాదని తెలుసుకుంటావు". అప్పడు 'ఇది సర్పంకాదు' అన్నదే జ్ఞానం కాదు 'ఇది తాడు' అన్నది కూడ జ్ఞానంలో అంతర్భాగమవుతుంది. ఇది మాత్రమే సమ్యక్ జ్ఞానమ వుతుంది. ప్రమాణాన్నుపయోగించే విధానమలాగే ఉంటుంది. శబ్దంకూడ ప్రమాణ మేకనుక అదికూడ వస్తుబోధకంగానే ఉంటుంది. దాన్ని చక్కగా పరిశీలిస్తే అది అజ్ఞానంగురించి కానీ, మరే ఇతరమైనదాన్ని గురించికానీ చర్చించటంలేదని నీకర్థ మవుతుంది.

అప్పడప్పడు అజ్ఞానాన్ని సంసారకారణంగా వర్ణించినప్పటికీ శాస్త్ర దృష్టిమాత్రం సత్య వస్తువుపైనే ఉంటుంది. "బ్రహ్మవిదాప్నోతి పరమ్" అని శాస్త్రంచెప్పినపుడు బ్రహ్మము గురించిన అజ్ఞానాన్నంగీ కరిస్తుంది. బ్రహ్మమును తెలుసుకోవాలంటే మనస్సులో వృత్తి కలగాలి. ఆ వృత్తి విషయం భిన్న స్వభావంకలది గాబట్టి వృత్తి కూడ భిన్నస్వభాంకలదై ఉండాలి. బోధ రూప ప్రమాణపరిధిలోకి వచ్చినపుడు - వృత్తిజ్ఞానం కలిగితే - ఆ వృత్తిని

- సాంకేతికంగా - 'అభేదజ్ఞానవృత్తి' అనంటారు. దాన్నే ఇక్కడ 'ఐక్య అవగాహినీ వృత్తి' అనంటారు. ఈ వృత్తి మాత్రమే అజ్ఞానాన్ని తొలగించి సద్వస్తువును గుర్తించేట్లుగా నిన్ను చేస్తుంది.

కొంతమంది ఆత్మను "అంతర్దృష్టి" తో తెలుసుకుంటారని చెప్తారు. కానీ అంతర్దృష్టి ప్రమాణంకాదు. అంతర్దృష్టితో ఆత్మను తెలుసుకునేట్లయితే శాస్త్రఅవశ్యకత లేనేలేదు. అంతర్దృష్టిని ప్రమాణంగా అంగీకరించలేం. సంస్కృతంలో దానికిసరైన పదంకూడలేదు. అంతర్దృష్టి ఏమిటి ? అది వృత్తి రూపమా లేక వృత్తికి అతీతమా ? అదివృత్తికతీతమయేట్లయితే అది అంతర్దృష్టి అని నీవెలా గుర్తిస్తావు. అది వృత్తిరూపమయితే దాన్ని నేను అఖండాకారవృత్తి అనంటాను. అది అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది. శాస్త్రమీవృత్తిగురించే చెప్తుంది. ఆ వృత్తినిక్కడ ప్రజ్ఞ అనంటారు. ఈ ప్రజ్ఞస్పష్టతను కలిగి ఉండకపోవచ్చు. అది ఇతరతత్త్వశాస్త్రసిద్ధాంతాలకు నిలువలేక అస్థిరంగా ఉండవచ్చు. కానీ మరే ఇతర ప్రమాణం గానీ, ఇతరప్రక్రియగానీ లేక నవీన తాత్త్విక సిద్ధాంతంకానీ ఇక్కడ వివరిస్తున్న జ్ఞానానికి ఆఘాతం కలిగించలేదు. "నీవు అనంతమన్న" దే ఆ జ్ఞానం. ఆ జ్ఞానాన్నెవరైనా వృద్ధిచేయటం మాట అటుంచి కనీసం కదిలించను గూడ కదిలించలేరు. కనుక వేదాంతానిదే ఆఖరిమాట. వేదాంతమే చివరిలో చిరునవ్వు చిందించేదికూడ. జ్ఞానాన్ని వృద్ధిచేయలేకపోవటమేకాకుండా ఆ జ్ఞానాన్నందించే ప్రక్రియను కూడ మెరుగు పరచలేరు. ఒకవేళ ప్రక్రియను మెరుగుపరచేట్లయితే అది పూర్వంనుంచి ఉన్న ప్రక్రియకంటె మెరుగైనదే కావాలికానీ ఆస్థాయికి తక్కువది కాకూడదు. సంపూర్ణ ప్రక్రియ అధ్యారోప అపవాదప్రక్రియ. అజ్ఞానం మూలంగా అధ్యాసము, అపవాదం జ్ఞానం వలన. బోధంతా సమగ్రంగా సమస్య ఒకటి ఉన్నదని భావించిన తరువాతనే. ఒక సమస్యలాంటిది ఉన్నట్లు అంగీకరిస్తే తప్ప పరిష్కారమంటూ ఉండదు.

సమస్యలాంటి దాన్నంగీకరించి, పరిష్కారాన్నిస్తుంది శాస్త్రం. అందుచేతనే ఈ సమస్య ను పరిష్కరించే విధానం విలక్షణంగా ఉంటుంది. ఈ విధానం ఒక చికిత్సావిధానం Technique లాంటిది. కానీ ఇదే ఆఖరి చికిత్స. ఈ చికిత్సావిధానంలో నీకంటె భిన్నమైన దానిని నీవేమీ పొందబోవటంలేదు. ఎట్లా ఉంటే అట్లాగా నీవేమిటో అర్థంచేసుకునే ప్రయత్నం చేస్తున్నావు. 'అవ్యక్తనీవు' ను పైకితీసుకువచ్చి, నీ స్వభావాన్ని నిర్ణయించటం (చేయటం) జరుగుతుంది. తద్వారా నీ మానసికస్థితిని గమనించి కావలసినరీతిలో మలచుకునేందుకు నీకు వ్యవధానం లభిస్తుంది. ఇక్కడ వేదాంతబోధలోకూడా క్రొత్తగా దేన్నీ తీసుకురావటంలేదు. నీవేమిటో గుర్తించేట్లు చేస్తారు. అధ్యారోపము ఒక విభ్రాంతి. దాన్ని పరిష్కరించే ప్రయత్నమే వేదాంతబోధ. కాబట్టి మోక్షమే పురుషార్థంకాని ఆత్మ జ్ఞానం కాదు. కానీ మోక్షము ఆత్మ జ్ఞానం వల్లనే లభిస్తుంది కనుకనే దీనంతటిలో మనం దిగుతాము. నాశిరస్సుపై నేను నిల్చోటం ద్వారా మోక్షమొస్తే నేనాపనిచేస్తాను.

ఏకత్వజ్ఞానం స్థిరంగా ఉండాలిగానీ చలించగూడదు. జ్ఞానం దృఢంగా ఉండాలి. కానీ జ్ఞానంవిషయంలో 'స్థిరజ్ఞానం', దృఢజ్ఞానం' లాంటి వాటికర్థంలేదు. 'ఇది ఆపిల్' అన్న జ్ఞానంలాంటి జ్ఞానంలో ఇక స్థిరత్వమేమిటి ? సరే ! ఆపిల్ జ్ఞానంలాంటి జ్ఞానంలో స్మృతి యొక్క పాత్ర ఉన్నది గనుక మరచిపోవటం జరగవచ్చు. కానీ ఆత్మజ్ఞానంలో అది నీవేగనుక స్మృతికి పాత్ర లేదు. జ్ఞానం 'నేను' మీద కేంద్రితమై ఉన్నది. నీవు దేన్నైనా బోధిస్తూ ఉంటే దాన్ని గుర్తుంచుకోవాల్సి ఉంటుంది. కానీ నీవెవరో తెలుసుకోవటానికి స్మృతి అవసరంలేదు. ఈ జ్ఞానం అర్థచేసుకోవటంమీద ఆధారపడి ఉంటుంది కనుక సుస్థిరము. దానిలో భ్రమగాని, సందేహంగానీ, అస్పష్టతగానీ లేదు.

ఈ జ్ఞానమున్నవానిని జీవన్ముక్తుడంటారు. జీవించి ఉండగానే అతడు 'నేను కర్తను' 'భోక్తను', 'సుఖిని' 'దుఃఖిని' లాంటి భ్రమలనుండి ముక్తుడయాడు. ఆత్మ గురించిన

అపోహలన్నీ తొలగిపోయినవి గనుక అతడు ముక్త పురుషుడు. అట్లాగాకాకుండా ముక్తుడైనప్పటికీ తాను బద్ధుడనని ఎవరైనా భావించేట్లయితే అతడు తాను ముక్తుడనని కనుక్కొనవలసిఉంటుంది.

జీవన్ముక్తుడు అదే శరీరంలో కొనసాగుతూనే ఉంటాడు. వ్యవహారంలో అతడి అజ్ఞానము, మనస్సు అదేవిధంగా ఉంటాయి. పూర్వం అతడికి ఫ్రెంచిభాష తెలియకపోతే ఇప్పుడుకూడ తెలియదు. అతడి స్మృతి, శరీర ధర్మాలు మొ॥ అన్నీ అట్లాగే ఉంటాయి. భేదమల్లా "నేను పూర్ణస్వరూపుడననే" జ్ఞానం కలిగింది. ఈ జ్ఞానం శరీరంలో మార్పు వలనగానీ, శరీరంలోని రసాయనాలమార్పిడివలనగానీ కలిగిందికాదు; మనస్సులో పరివర్తనం వలన అసలేకాదు. అది మార్పుమీద ఆధారపడేదైతే, అజ్ఞానం పోతుంది - నశిస్తుందికూడ. అది స్థిరప్రజ్ఞకాజాలదు. కానీ అది బ్రహ్మమైన ఆత్మ స్వరూపముపై ఆధారపడినది. నీకు తెలిసినా తెలియకపోయినా ఆత్మ సర్వదా ముక్తమే. ఆ విషయం నీకు తెలియకపోతే బద్ధుడనని భావిస్తావు. నీవు ముక్తుడవే నన్న సత్యం నీకు తెలిస్తే నీవు ముక్తుడవే. నీవు నిత్యముక్తుడవు కావటంచేతనే, అప్పుడప్పుడు, అంటే వాతావరణం, పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడల్లా, సుఖరూపంగా కొంత ముక్తాత్వాన్ననుభవిస్తావు. అప్పుడొక్కసారిగా నీవు బాగానే ఉన్నావని నీకు తోస్తుంది. ఆ తరువాత, "నేను బాగా ఉండేవాణ్ణి - సుఖంగా ఉండేవాడిన"ని చెప్తూ ఉంటావు. కానీ సర్వదా బాగా - సుఖంగా ఉండేవాడే జీవన్ముక్తుడంటే, అతడికి "నేను బాగా ఉండేవాడిని" అనే దుండదు.

84వ శ్లోకము

యస్య స్థితా భవేత్ ప్రజ్ఞా యస్యానందో నిరంతరః ।
ప్రపఞ్చో విస్మృతప్రాయః స జీవన్ముక్త ఇష్యతే ॥ 429 ॥

యస్య ప్రజ్ఞా - ఎవరి జ్ఞానము; స్థితా భవేత్ - స్పష్టముగను స్థిరముగనూ ఉండునో; యస్య ఆనందః నిరంతరః - ఎవరి ఆనందము అంతరాయము లేకుండ ఉండునో; ప్రపఞ్చః విస్మృతప్రాయః - ప్రపంచము ఎవరికి విస్మృతమైన దానితో సమమో; సః జీవన్ముక్తః ఇష్యతే - అతడిని జీవన్ముక్తుంటారు.

"స్పష్టమైన - సమ్యక్ జ్ఞానమున్నవానిని, నిరంతరానందమున్నవానిని,

ప్రపంచమంతా విస్మృతమైనదానితో సమానమైనవానిని జీవన్ముక్తుడంటారు."

జీవన్ముక్తులలో రకరకాల వారున్నారు. ఒకరు మాట్లాడుతూ ఉండవచ్చు, మరొకరు కేవలం కూర్చొని ఉండవచ్చు, వేరొకరెల్లప్పుడూ మౌనంగానే ఉండవచ్చు. జీవన్ముక్తునికి నియమాలంటూలేవు. మౌనంగా ఉన్నంతమాత్రాన ఎవరూ ముక్తులుకాలేరు. అదేవిధంగా ఒకరు మాట్లాడుతూ ఉన్నా జీవన్ముక్తుడుకావచ్చు, జీవన్ముక్తుడా కాడా అని ఎవరినైనా తెలుసుకోవాలంటే అందుకొ మార్గమంటూలేదు. కాబట్టి శాస్త్రం జీవన్ముక్తుణ్ణి వివిధరకాలుగా వర్ణిస్తుంది. ఐనప్పటికీ వారందరిలో కొన్ని అంశాలు సాధారణంగా ఉంటాయి. ఈ శ్లోకంలో వాటిని వివరిస్తున్నారు.

ముక్త పురుషునికి "నేను బ్రహ్మమ" న్న స్పష్టమైన జ్ఞానముంటుంది. అతడికి అంతరాయంలేని ఆనందముంటుంది. అతడికి ఆనందం తెరలు తెరలుగా పొరలుపొరలుగా రాదు. అతడి ఆనందానికొక నిమిత్తమవసరంలేదు గనుక ఎల్లప్పడు ఆనందంగానే ఉంటాడు. తనకుతానే ఆనందంగా ఉంటాడు. ఆత్మ దుఃఖవర్జితము. తానే ఆత్మ అని అతడికి తెలుసు. కాబట్టి దుఃఖనివారణకై ఒక విశేష నిమిత్తమతడికవసరంలేదు. కనుక అతడెల్లప్పడూ ఆనందంగానే ఉంటాడు. అంతేగాక ప్రపంచం విస్మరించిన దానితో సమమవుతుంది. అంటే ప్రపంచాన్ని స్మరించడని, గుర్తించడని అర్థంకాదు. ప్రపంచం అతడికింక అశాంతిని కలిగించలేదు. అతడికి ప్రపంచం కేవలం భాసమా

నమే - ఉన్నట్లుగా జగత్తుననుభవిస్తాడు. నిజమే ! కానీ ప్రపంచంలోని వెతలనుండి వెలి వడ్డాడు. ప్రపంచాన్నుద్ధరించాలనే భ్రమ అతడికుండదు. ప్రపంచం ఉద్ధరింపబడే ఉన్నద ని అతడికి బాగా తెలుసు. దాన్ని గురించి అతడికి చేయాల్సిందేమీ లేదు. జగత్తు మిథ్య అని అతడికి తెలుసు. మిథ్యా జగత్తుని రక్షించాల్సి నవసరంలేదు. ఒకవేళ ఆ మిథ్యా జగ త్తును రక్షించినప్పటికీ, ఆ రక్షింపబడిన మిథ్య అదే విధంగా కొనసాగదు.

తానెలాగా ఉన్నదో అట్లాగే ఉంటుంది గనుక, మిథ్య నీకెటువంటి సమస్యను కలిగిం చదు. సత్యవస్తువు నీవే గనుక, దాన్ని రక్షించాల్సిన అవసరంలేదు, రక్షించటానికి రెండవ సత్యవస్తువు లేదు.

ఈ జ్ఞానంతో నిన్ను నీవు రక్షించుకున్నావు. ప్రజలకు శ్రేయస్సును కలిగించే కొన్ని మంచి పనులుచేస్తూ కొంతమంది ముక్త పురుషులుండవచ్చు. వారు వారి ప్రారబ్ధాన్ననుస రించి ఆ పనులు చేస్తూ ఉండవచ్చు. 'రక్షకుడని' 'ఉద్ధారకుడని' కూడ అతడిననవచ్చు. అది సరే ! మంచిదే ! కానీ "నేను ప్రజల నుద్ధరించ బోతున్నాన"నే అనుకోవటంలో ఒక సమస్య ఉన్నది. అది "నేను నీకన్న పవిత్రుడన"నే భావననుండి వస్తుంది. అదొక మాన సిక దౌర్బల్యం - మానసిక సమస్య, జీవన్ముక్తుడికి ప్రపంచముంటుంది. కానీ ఆ ప్రపం చం తాను రక్షించవలసినదనే ఆత్రుత - ఆరాటమతడికుండవు.

### 85వ శ్లోకము

వర్తమానేపి దేహేస్మిన్ ఛాయావదనువర్తిని ।
అహంతా మమతా భావః జీవన్ముక్తస్య లక్షణమ్ ॥ 432 ॥

ఛాయావత్ అనువర్తిని - చాయలాగా అనుసరించే; అస్మిన్ దేహే - ఈ దేహంలో; వర్తమానే అపి - ఉంటుండగా కూడ; అహంతా మమతా అభావః - అమంకార మమకారములు లేకుండా ఉండటం; జీవన్ముక్తస్యక్షణమ్ - జీవన్ముక్తుని లక్షణము.

"ఛాయలాగా తననను సరిస్తున్న శరీరంలో ఉంటూండగా కూడ 'అహంకార'

'మమకార' ములు కేకుండా ఉండటం జీవన్ముక్తుని లక్షణం."

జీవన్ముక్తునికి శరీరమొక నీడతో పోల్చదగినదవుతుంది. ఒక వ్యక్తి అటూ ఇటూ తిరిగి నప్పడు అతడి నీడ ఏవిధంగా అనుసరిస్తుందో అదే విధంగా జీవన్ముక్తుణ్ణి అతడి శరీరం కూడ అనుసరిస్తుంది. ఛాయకేం జరిగినా పురుషునకేమీ కానట్లే, శరీరపరిమితులు జీవన్ముక్తు నేవిధంగానూ బాధించలేవు. ఇతః పూర్వం అతడి అవగాహన "శరీర మెంతో నేనంత" అని. ఆ అపోహ తొలగిపోతుంది. అతడు శరీరంతో తాదాత్మ్యంచెందే కొనసా గుతుంటాడు. ఐనప్పటికి దానిపట్ల అహంకారమమకారములుండవు. అతడికి అహం కార మమకారములున్నవి. కానీ అవి బాధితములైనవి. లోకంతో వ్యవహరించటానికి మాత్రం వాటి నుపయోగిస్తాడు. ఒక ఘటము తాను మృత్తికనని గుర్తించినపిమ్మట కూడ ఏవిధంగా ఘటముగా కొనసాగుతుందో అదేవిధంగా జీవన్ముక్తుడుకూడ పూర్వ మున్నట్లుగానే కొనసాగుతాడు (వ్యవహారదృష్ట్యా).

సర్వము ఆత్మయే నని, ఆ ఆత్మ తానేనని జీవన్ముక్తునికి తెలిసినప్పటికి, అతడు ఒకే శరీరంతో తాదాత్మ్యంచెందుతాడు, అన్నిశరీరాలతో కాదు. ఎందుచేత ? ఎందుకంటే ఒక సూక్ష్మ శరీరంతో పరిచ్ఛిన్నం కాబడిన ఆత్మ ఒక స్థూలశరీరంతో మాత్రమే తాదాత్మ్యం చెందుతుంది. ఆకాశం సర్వత్ర ఉన్నప్పటికి ఘటాకాశం ఘటమున్నచోటనే లభిస్తుంది. జీవన్ముక్తుడికి అజ్ఞానం లేదుగాబట్టి అతడి అహంకార మమకారములు బాధితములవు తాయి. అవికూడ ఆత్మేనని అతడికి తెలుసు అతడి అజ్ఞానం తొలగిపోయింది. అంత మాత్రమే. "నేను సచ్చిదానంద ఆత్మ" నని అతడెల్లప్పడు స్మరిస్తుంటాడని కాదు. జ్ఞానం స్మృతిపై ఆధారపడినది కాదు. అట్లాగా కాని పక్షంలో ఇతర వృత్తి వచ్చిన ప్రతిసారి,

ఆ వృత్తిని నిషేధించి "నేను ఆత్మను" అని స్మరించాల్సిన అవసరమేర్పడుతుంది. అప్పడు ఎప్పటికి ఉద్రిక్తత ఉంటుంది. వృత్తిని నిరోధించటానికై సదా ప్రయత్నిస్తూనే ఉంటాడు. "నీవు ఆలోచనలనన్నిటిని తొలగించుకోవాలి" "నీవీశ్వరునెల్లప్పడు గుర్తుంచుకోవాలి" "నీవు సచ్చిదానంద ఆత్మను గుర్తుంచుకోవాలి" మొదలైన వాక్యాలేవీ వేదాంత బోధకను గుణమైనవికావు. "యోగ - వేదాంతము" అన్నపేరుతో వారు సాగిపోతుంటారు. "నేను నిత్యము - అని ఎప్పడూ స్మరించినంతమాత్రాన నేను నిత్యుణ్ణి కాబోవటంలేదు. ఆ వృత్తి యో అనిత్యము, క్షణమాత్రస్థాయి. అందుచేతనే ఆత్మజ్ఞానం స్మృతివిషయంకాదు.

86వ శ్లోకము

అతీతాననుసంధానం భవిష్యదవిచారణమ్ ।
ఔదాసీన్యమపి ప్రాప్తే జీవన్ముక్తస్య లక్షణమ్ ॥ 433 ॥

అతీత అననుసందానం - గతంస్మరించి వ్యథ చెందకుండా ఉండటం; భవిష్యత్ అవిచారణం - భవిష్యత్తుగురించి ఆత్రుత పడకపోవటం; ప్రాప్తే అపి - ఉన్నవాని పట్ల; ఔదాసీస్యం - ఉదాసీనంగా ఉండటం; జీవన్ముక్తస్యలక్షణమ్ - జీవన్ముక్తునిలక్షణము;

"గతం స్మరించి వ్యథ చెందకుండా ఉండటం, భవిష్యత్తుగురించి
ఆత్రుతపడకపోవటం, వర్తమానం పట్ల ఉదాసీనంగా ఉండటం
జీవన్ముక్తుని లక్షణములు."

ఈ శ్లోకం జీవన్ముక్తుని లక్షణాలను చర్చిస్తున్నది. అనుసంధానమంటే స్మరించటం, వెతలతోను, తప్పచేశాననే భావనతోను, వ్యధలతోను ఆత్మనిందలతోను గతాన్ని స్మరించ టం జీవుని లక్షణం. అతీత అననుసంధానమంటే గతంలో జరిగిన దానిచేత వ్యధచెంద కుండా ఉండటం. అంటే గతాన్ని పూర్తిగా మరచిపోవటమని అర్థంకాదు. అది సంభ వంకాదు. జీవన్ముక్తుని కటువంటి వ్యధరహిత మనస్సుంటుంది.

జీవన్ముక్తుడు భవిష్యత్తులో ఏం జరగబోతుందోనని ఆత్రుతపడడు. చాలామందికి భవిష్యత్తు గురించి ఆందోళనచెందటం పెద్దసమస్య అవుతున్నది. జీవన్ముక్తుడు గతంగురించి వ్యధచెందడు, భవిష్యత్తుగురించి ఆందోళనపడడు.

వర్తమానంలో ఏవిధంగా జీవిస్తాడు ? ప్రాప్తే అపి ఔదాసీన్యం - వర్తమానం పట్ల అతడికి వాస్తవికత ఉంటుంది. తనముందున్న దానితో పాటే కొట్టుకుపోడు. వర్తమానమతడిని ఉత్తేజపరచదు.

జీవన్ముక్తుని లక్షణమిది అదే ముముక్షువుకు సాధనమవుతుంది. ముముక్షువు తన మనస్సుమీద కొంత పనిచేసి ఈ సమస్యల్ని పరిష్కరించుకున్నాడో లేడో చూచుకోవాలి. భగవద్గీత సర్వావస్థలయందు సమచిత్తత్వాన్ని బోధిస్తుంది - "నిత్యం చ సమచిత్తత్వం ఇష్టానిష్టోపపత్తిషు" (భ.గీ. 13 - 9) దాన్నే ఇక్కడ చెప్తున్నారు. గతంగాని భవిష్యత్తుగాని కలత పెట్టకుండా ఉంటేనే ఎవరైనా వర్తమానంలో ఉదాసీనంగా ఉండగలరు. గతం గురించిగానీ భవిష్యత్తు గురించిగానీ చింతిస్తూ ఉంటే వర్తమానాన్ని పోగొట్టుకుంటాడు. "వర్తమానంలో ఉండు" అని తరచుగా మనం సలహావింటుంటాము. అది ఎక్కువగా విధిలాగానే చెప్తారు. దాన్ని పాటించటం దాదాపు అసంభవం. వర్తమానంగురించి నీకు చేయాల్సింది పెద్దగా ఉండదు. కావలసినదల్లా గతంగురించి, భవిష్యత్తుగురించి జాగ్రత్త పడటమే. గతంగురించి, భవిష్యత్తుగురించి చింతించకుండా ఉంటే నీవుండేది వర్తమానంలోనే.

కానీ ఈ గతం గురించి చేయవలసిందేమిటి ? ఒకే ఒక మార్గముంది. అదే ఈశ్వరునితో తేల్చుకోవటం. ఈశ్వరునితో తేల్చుకోవటమంటే - నీకు జరిగిందేమైనాసరే అది ఈశ్వరనియతి ననుసరించే ఉన్నదని, ఆనియతి కూడ ఈశ్వరునికంటె భిన్నంగా లేదని గ్రహించటం. నీకు తీరని కోరికలు చాలా ఉన్నాయి. తిరిగి గతంలో జీవించి

ఆ కోరికలన్నీ తీర్చుకోవటం సాధ్యపడదు. కాబట్టి కోరికల్ని తీర్చుకోవటంద్వారా గతంలోని లెక్కలు తేల్చుకోబోవటం లేదు. ఉన్న ఒకే ఒక మార్గం ఈ కోరికల్నీ, లోకాన్నీ కలిపి మూట గట్టి, దాన్ని ఈశ్వరుడని పిలిచి, ఆ ఈశ్వరునితో లెక్కలు తేల్చుకోవటమే. అదృష్టమేమంటే ఈ లోకం ఈశ్వరునిలోనే ఉన్నది - అతడికంటె భిన్నంకాదు. కాబట్టి లోకంతో లెక్కలు తేల్చుకోవటంమంటే, ఈశ్వర నియతినిగుర్తించటం, మెల్లగా ఆనియతిలోకి జారుకోవటం, దానిలో కలిసిపోవటం. ఇది ఈశ్వరునితో ఒకరకమైన సంబంధం. అదే అన్ని సమస్యల్ని పరిష్కరిస్తుంది.

87వ శ్లోకము

గుణదోషవిశిష్టేస్మిన్ స్వభావేన విలక్షణే ।

సర్వత్ర సమదర్శిత్వం జీవన్ముక్తస్య లక్షణమ్ ॥ 434 ॥

అస్మిన్ - ఈ జగత్తులో; గుణదోషవిశిష్టే - ఇష్టానిష్టగుణదోషయుక్తమైన; స్వభావేన విలక్షణే - స్వభావతః పరస్పర విలక్షణమైన; సర్వత్ర - సర్వవిషయముల పట్ల, సర్వావస్థలలోనూ; సమదర్శిత్వం - సమదృష్టి కలిగిఉండటం; జీవన్ముక్తస్య లక్షణమ్ - జీవన్ముక్తుని లక్షణము.

"ఇష్టానిష్టగుణదోషయుక్తమైన - స్వభావతః పరస్పర భిన్నములైన - జగత్తులోని విషయములపట్ల సమదృష్టి కలిగిఉండటం జీవన్ముక్తుని లక్షణము."

లోకంలో జనులు అనేక సుగుణాలు కలిగి ఉన్నారు. అవాంఛనీయమైన గుణాలు గూడ కలిగి ఉన్నారు. వారు పరస్పరం విభిన్న స్వభావాలు కలిగిఉన్నారు. ఒకడు విచారశీలుడుగా ఉంటాడు. అతడిని సాత్వికుడని అంటాము. మరొకనికి గొప్ప గొప్పవి సాధించాలని ఉంటుంది. ఉత్సాహంతో క్రియాశీలునిగా ఉంటాడు. అతడిని తామసికుడం

టారు. సత్వరజస్ తమోగుణాల భిన్నస్థాయిల ననుసరించి జనులు విభిన్న స్వభావం కలిగి ఉంటారు. ఆ యా సమయాల్లో ఆయా స్వభావాల్ని కలిగిఉంటారు కాబట్టి విభిన్న స్వభావాల జనులతో కూడిఉన్న లోకంలో సర్వావస్థలలో ఒకే విధంగా సంపర్కం కలిగి ఉండటం సులభం గాదు. కానీ జీవన్ముక్తుడు సర్వకాల సర్వావస్థలలో సమదృష్టి కలిగి ఉంటాడు.

సమత్వం కలిగిఉన్నవానికే సమదృష్టి ఉంటుంది. కానీ ఈ సమత్వం కర్మయోగికుండే సమత్వంలాంటిదికాదు. సర్వవిక్రియారహితం కనుక సమము - అని నీకు తెలిసినా తెలియకపోయినా బ్రహ్మమెప్పడూ సమమే. జీవన్ముక్తునికి తానే బ్రహ్మమని తెలుసు. అంటే తద్విషయక అజ్ఞానం లేదు. అతడిలో ప్రతిక్రియ ఉండదు. మంచిగుణము కలిగి నవానిని చూచినప్పడు తదనుగుణమైనవికారం నీమనసులో కలుగుతుంది. కానీ సమదర్శి అటువంటి మార్పుకి లోనుగాడు. ఒకవేళ అతడిమనసులో వికారం కలిగినా అది నిలిచేది కాదు. కలుగుతుండగానే పోతుంది. ఇది జీవన్ముక్తుని లక్షణం.

88వ శ్లోకము

ఇష్టానిష్టార్థసంప్రాప్తౌ సమదరిశతయాత్మని ।
ఉభయత్రావికారిత్వం జీవన్ముక్తస్య లక్షణమ్ ॥ 435 ॥

ఇష్టానిష్టార్థ సంప్రాప్తౌ - ఇష్ట విషయములు, అనిష్ట విషయములు సంప్రాప్తించిన పుడు; ఉభయత్ర - రెండు సందర్భాలలోనూ; ఆత్మని - అంతఃకరణలో; సమదర్శితయా - సమత్వదృష్టితో; అవికారిత్వం - వికారములకు లోనుగాకుండటం; జీవన్ముక్తస్య లక్షణం వ జీన్ముక్తునిలక్షణం.

"ఇష్టానిష్టవస్తువులు సంప్రాప్తించినపుడు సమదర్శిత్వంతో
రెండుసందర్భాలలోనూ సహజంగానే వికారాలకు లోనుగాకుండా

ఉండటం జీవన్ముక్తుని లక్షణం”

జీవన్ముక్తుని మానసికస్థితి నీ శ్లోకం వర్ణిస్తున్నది. ఇష్టవస్తువు లభించినపుడు, అనిష్ట వస్తువు వచ్చినపుడు జీవన్ముక్తునితో పొంగిపోవటం క్రుంగిపోవటమనేదుండదు. పొంగి పోవటం క్రుంగిపోవటము మనస్సులో కలిగే వికారాలు. కానీ మనమిక్కడ మనస్స గు రించి విచారించటంలేదు. మనస్సుమాత్రమే అక్కడ ప్రతిస్పందించటంలేదు. మనస్సుతో తాదాత్మ్యం చెందిన వ్యక్తి ప్రతిస్పందిస్తున్నాడు. మనస్సొక సాధనము మాత్రమే. ఇక్కడ మోక్షం గురించి చర్చిస్తున్నాం. ఎవరైతే పొంగిపోవటం క్రుంగిపోవటమనే మానసిక వికారాలకు లోనుగాడో బ్రహ్మజ్ఞానం మూలంగా, అతడు సమదర్శి.

సమదర్శిత్వం బ్రహ్మ జ్ఞానికొక ఉపదేశం కాదు; అదతడి జ్ఞానఫలం. తాను బ్రహ్మమని అతడికి తెలుసు, తాను బ్రహ్మము గనుక. తన క్షేమం కోసంగాని, లేక ఆనందం కోసం గానీ, మరో దాని అవసరమతడికి లేదు. క్షేమం లేకపోవటం, ఆనందం లేకపోవటమనే వాటినుండి ముక్తుడయాడు. ఆ విముక్తి సమదర్శిత్వాన్ని కలిగిస్తుంది. ఈ దర్శన కార ణంగానే అతడు జనులను వారేవిధంగా ఉంటే ఆ విధంగా స్వీకరించగలదు, అదతడికి అతిసహజంగా ఉంటుంది. అందుచేతనే అతడు పొంగిపోడు, క్రుంగిపోడు, అది జీవన్ము క్తునిలో సహజంగానే వ్యక్తమవుతుంది.

89వ శ్లోకము

సాధుభిః పూజ్యమానేస్మిన్ పీడ్యమానేపి దుర్జనైః ।

సమభావో భవేద్యస్య స జీవన్ముక్త ఇష్యతే ॥ 441 ॥

సాధుభిః - సాత్త్వికపురుషులచే; అస్తిన్ పూజ్యమానే - ఇతడు పూజింపబడినప్పటికి; దుర్జనైవ దుర్జనులచే; (అస్మిన్) పీడ్యమానే అపి - (ఇతడు) పీడింపబడినప్పడు కూడ;

సమభావః - సమభావము; యస్య భవేత్ - ఎవరికైతే ఉంటుందో; సః జీవన్ముక్తః - అతడు జీవన్ముక్తుడని; ఇష్యతే - పిలువబడతాడు.

"సాత్త్వికులు పూజించినా, దుర్జనులు పీడించినా సమభావం కలిగిఉన్నవానిని జీవన్ముక్తుడంటారు."

శాస్త్రం జీవన్ముక్తుణ్ణి వర్ణించటం ఈ శ్లోకంలో కూడ కొనసాగిస్తున్నది. సాత్విక పురుషులుపూజించినప్పడు దుర్వర్తనం కలిగినవారు పీడించినప్పడు రెండు అవస్థలలోనూ జీవన్ముక్తుడు సమబుద్ధిని కలిగిఉంటాడు. నిందాస్తుతులు అతడికేమీ అనిపించవు. పొగడ్తలవల్ల పొంగిపోడు. నిందవల్ల క్రుంగిపోడు. అదీ సమభావమంటే. నీవు జీవించినంత కాలం నిందాస్తుతులుంటూనే ఉంటాయి. ఈ రెండింటిలో దేనిచేతనూ ప్రభావితం కానివానిని జీవన్ముక్తుడని భావిస్తారు.

90వ శ్లోకము

విజ్ఞాతబ్రహ్మతత్త్వస్య యథాపూర్వం న సంసృతిః ।
అస్తి చేన్న స విజ్ఞాతబ్రహ్మభావో బహిర్ముఖః ॥ 443 ॥

విజ్ఞాత బ్రహ్మతత్త్వస్య - ఆత్మయే బ్రహ్మమని తెలుసుకున్నవానికి; యథాపూర్వం - పూర్వంలాగా; సంసృతిః న - సంసారముండదు; అస్తిచేత్ - ఒకవేళ సంసారముంటే; సః విజ్ఞాతబ్రహ్మభావః న - అతడు బ్రహ్మతత్త్వము తెలిసుకున్నవాడు కాదు; బహిమ్ముఖః - బహిర్ముఖుడే!

"ఆత్మస్వరూపము బ్రహ్మమని తెలిసినవానికి సంసారముండదు. ఒకవేళ సంసారముంటే అతడు బహిర్ముఖుడే గాని బ్రహ్మస్వరూపము తెలిసినవాడు కాడు."

విజ్ఞాతబ్రహ్మతత్త్వస్య - అంటే ఆత్మ స్వరూపమే బ్రహ్మమని తెలిసినవాడు. అటువంటి పురుషునికి పూర్వంలాగా సంసారముండదు. సంసారమంటే జన్మమరణచక్రం. కానీ మనమిక్కడ జన్మమరణాలగురించి చర్చించటంలేదు. ఒకవ్యక్తి తిరిగి జన్మించాడో లేదో నిర్ధారించే మార్గంలేదు. కనుక జన్మమరణములు లేనివాడు జీవన్ముక్తుడని చెప్పలేము. సంసృతి అంటే ఇక్కడ సుఖదుఃఖయుక్తమైన సంసారమనే కాని జన్మమరణ చక్రమని కాదు. బ్రహ్మతత్వాన్ని తెలుసుకున్నవాడు ఈ సంసారానికి లోనుగాడు.

ఒక వ్యక్తి సంసారపరిధిలోనే ఉన్నాడనుకుందాం - ఒకప్పుడు సంతోషంగా ఉంటాడు, మరొకప్పుడు దుఃఖిస్తుంటాడు. అంటే దానర్థం - అతడు శాస్త్ర శ్రవణంచేశాడు గానీ ఇంకా స్పష్టత పొందలేదు. తన యోగక్షేమాలకు ఆనందానికి బాహ్యపరిస్థితులపై ఆధార పడతాడు. పరిస్థితులపై ఆధారపడిన వాడివైతే ఊగిసలాడుతూనే ఉంటావు. ఇప్పుడు సుఖి ఇప్పుడు దుఃఖి - ఇదీ సంసారియొక్క స్వభావం. సుఖదుఃఖాల ప్రభావానికి లోనై నంతకాలం బ్రహ్మతత్వం తెలిసినవాడు కాడు. అంటే శాస్త్రం అర్థంకాదని కాదు. ఆత్మ స్వరూపము బ్రహ్మమేనని తెలుసుకునే దిశలో సాగుతున్నాడని దానర్థం. యోగక్షేమాలకై, ఆనందం కోసము బాహ్యవస్తువులపైన, పరిస్థితులపైన ఆధారపడినంతకాలము సుఖ దుఃఖానుభవాలుతప్పవని అర్థంచేసుకోవాలి. తాను క్షేమంగానే ఉన్నానని, ఆనందం తన స్వరూపమేనని గుర్తించటంద్వారా ఈ ఆధారపడటంనుండి విముక్తుడు కావాలి. వేరే మార్గంలేదు.

91వ శ్లోకము

అహం బ్రహ్మేతి విజ్ఞానాత్ కల్పకోటి శతార్జితమ్ ।

సఞ్చితం విలయం యాతి ప్రబోదాత్ స్వప్నకర్మవత్ ॥ 448 ॥

ప్రబోధాత్ - మేల్కాంచిన మీదట; స్వప్న కర్మవత్ - స్వప్నంలో చేసిన కర్మల వలెనే;

'అహం బ్రహ్మ' ఇతి విజ్ఞానాత్ - 'నేను బ్రహ్మము' అన్న జ్ఞానంతో; కల్పకోటిశత ఆర్జితమ్ - శత కోటికల్పాలలో ఆర్జించిన; సఞ్చితమ్ - సంచిత కర్మ అంతా; విలయం యాతి - నశిస్తుంది.

"స్వప్నంలో చేసిన కర్మలన్నీ - ఏవిధంగా మేలుకొన్నమీదట లయం జెందుతున్నవో - అదేవిధంగా శతకోటి కల్పాలలో ఆర్జించిన సఞ్చితకర్మలన్నీ "నేను బ్రహ్మమ" న్న జ్ఞానముతో నశిస్తాయి."

ఈ జ్ఞానం యొక్క ఫలితమేమిటో ఈ శ్లోకంలో తెలుపుతున్నారు. నేను "బ్రహ్మము" అన్న జ్ఞానంతో కల్పకోటిశత - అనాది ప్రవృత్తిగణింపశక్యము గాని జన్మలలో ఆర్జించిన కర్మఫలములన్నీ నశిస్తాయి. కల్పకోటిపదం కాలపరం. కల్పమంటే ఊహకందని సంవత్స రాల కాలచక్రం. కల్పకోటి శతమంటే వందల కోట్ల కల్పములు. ఒక కల్పంలో ఎవరైనా ఎన్ని మానవజన్మలనైనా పొందవచ్చు, కల్పములు అనంతములు కనుక మానవజన్మలు కూడ లెక్కకందనివి. కాబట్టి కర్మలనంతములు ఈ సమస్తకర్మలు నశిస్తాయి. ఎలా ?" నేను బ్రహ్మమ"న్న జ్ఞానంచే మాత్రమే. స్వప్నంలో చేసిన కర్మలన్నీ మేలుకొన్న మీదట అస త్యములైనట్లుగా.

స్వప్నంలో పురుషుడు రకరకాల పనులు చేస్తాడు, మంచివి చెడువి కూడ. కానీ మేలుకొన్నప్పడు తానాపనులకు కర్త కాదని అతడికి తెలుసు; ఆ కర్మలనుండి పూర్తిగా విముక్తుడవుతాడు. నిజానికి కర్తృత్వమే అసత్యమైపోతుంది. చేసిన సర్వకర్మలు అసత్య ములవుతాయి. స్వప్నంలో నేను అసత్యము - మిథ్యా అని ఎవరూ భావించరు. తనని తాను కర్తగా గ్రహిస్తాడు. కానీ మేలుకొన్న పిదప స్వప్నంలోని కర్త అసత్యమవుతాడు. స్వప్నము తన సృష్టేనని జాగ్రత్ పురుషునికి తెలుసు. స్థూలశరీరం ఎటూపోకుండానే స్వప్నంలో తాను కాశీ వెళతాడు. మేలుకొన్న మీదట స్వప్నపురుషుడు అసత్యమవుతాడు.

అంటే స్వప్నంలో వాస్తవంగా కర్త ఒకడు లేడు. ఆ కర్త మిథ్యా కర్త. కానీ జాగ్రత్తులో కర్త వాస్తవం గానే కర్త. అంటే వ్యవహారికమిథ్యా. అతడీశ్వరసృష్టిలో అంతర్భాగం గనుక - అతడి దేహేంద్రియమనోబుద్ధుల సంఘాతము జగత్తుఅన్నీ అలాగే ఉంటాయి. ఐనప్పటికీ "నేను బ్రహ్మమ"న్న జ్ఞానంచేత కర్తృత్వభావనమాత్రం బాధింపబడుతుంది.

తాడుని సర్పంగా భ్రమించినపుడు "ఇది తాడు" అనితెలిసినవెంటనే సర్పం తొలగిపో తుంది. అదే విధంగా "నేను సచ్చిదానంద బ్రహ్మము" అని తెలియగానే అహంకారము, దేహేంద్రియమనోబుద్ధుల సంఘాతము తొలగిపోవాలని చాలామంది భావిస్తారు. అధ్యా సస్వభావమేమిటో తెలియక పోవటంవలన అటువంటి అపోహలున్నవి. రెండురకాల అధ్యాసలున్నవి. నిరుపాధిక అధ్యాస అని, సోపాధిక అధ్యాస అని. ఒక వస్తువును మరో వస్తువుగా భ్రమిస్తే అప్పడది నిరుపాధిక అధ్యాస తాడును సర్పంగా భ్రమించాడు. అది తాడని తెలిసినమీదట సర్పం తొలగిపోతుంది. కానీ రెండవఅధ్యాసలో ఒక సత్యము మరొకటిగా భ్రమించటం జరుగుతుంది. సూర్యోదయ విషయంలోలాగ. కానీ ఇక్కడ జ్ఞానం కలిగినతరువాత కూడ అధ్యాస కొనసాగుతుంది. సూర్యోదయాన్నిచూస్తావు కానీ అది సత్యముకాదు. విజ్ఞానశాస్త్రముద్వారా సూర్యుడుదయించడని నీకు తెలుసు. ఈ జ్ఞానం పొందిన తరువాత కూడ సూర్యుడుదయించటం నీవు చూస్తూనే ఉంటావు. సూర్యుడుదయించటం సత్యం కాకపోయినా, సూర్యుడుదయిస్తున్నట్లుగా ప్రత్యక్షమ వుతాడు. ఆ ప్రత్యక్షము వాస్తవమే, కానీ 'సూర్యుడుదయిస్తాడ'న్న నిశ్చయం సరికాదు. జ్ఞానం విభ్రమను, సందిగ్ధావస్థను తొలగిస్తుంది. కానీ ప్రత్యక్షదర్శనాన్ని కాదు. ఆ దర్శ నం ఈశ్వరసృష్టిలో అంతర్భాగం.

ఈ అధ్యాసలో సమస్యల్లా ప్రత్యక్షంగా గోచరించేదానివిషయంలోనే. జ్ఞానం దాన్ని మాత్రమే తొలగిస్తుంది. భ్రమాత్మక నిశ్చయం తొలగించినతరువాత కూడ విషయి - విష

యములు అట్లాగే కొనసాగుతాయి. ఈ విషయి - విషయములనుండి తప్పించుకునే మార్గంలేదు. విషయి - విషయవిభాగం సమస్యకాదు, కానీ ఆ విషయి - విషయవిభాగ దర్శనాన్ని సత్యంగా భావించటమే సమస్య. విషయి - విషయ భేదము ద్వైతాన్ని కలిగిస్తుందనే నిశ్చయమున్నది. అద్వైతం సిద్ధించాలంటే ఈ విభాగం అదృశ్యం కావాలని విశ్వసిస్తుంటారు. అది సత్యము కాదు. విషయి - విషయ విభాగం లేనప్పడుఅద్వైతం సిద్ధించదు. అవి బాధితములవుతవి, అంతే. అదెట్లాగా అంటే - నీవు నీలాకాశాన్ని చూచినప్పడు దర్శనం మాత్రమే ఉంటుంది. కానీ “అక్కడొక సత్యంగా ఆకాశం ఒక టుంది. అది నీలము” అనే నిశ్చయానికి రావు.

సృష్టిలో రెండు రకాలైన ప్రత్యక్షదర్శనాలుంటాయి దేహేంద్రియాదులు గోచరమవు తుంటాయి. అవి జ్ఞానం కలిగిన తరువాత కూడ గోచరిస్తూనే ఉంటాయి. ఇది ఒకటి. రెండవది రజ్జుసర్పదర్శనం లాంటిది. జ్ఞానం కలిగినపుడది ఉండదు. అందుకే మనకు మరొకసత్తా ఉన్నది. దానినే ప్రాతిభాసికసత్యనంటారు. దేహము రజ్జు - సర్పం లాగా ప్రాతిభాసికమైతే తొలగిపోతుంది. కానీ అది వ్యావహారికము. అందుచేత అదిపోదు. నీ భ్రాంతి మాత్రం తొలగిపోతుంది. విషయ - విషయిద్వైతాన్ని నీవు సత్యంగా గ్రహిస్తావు. ఆ రెండూ బ్రహ్మమేనన్న జ్ఞానంతో ఆ భ్రమ పోతుంది. ఈశ్వరసృష్టిలో అంతర్భాగం గనుక వ్యావహిరికమైన విషయి - విషయములు అదే విదంగా కొనసాగుతాయి. జ్ఞానం కలిగిన తరువాత కూడ దేహం కొనసాగుతుందిగనుకనే గురువు శిష్యుడు, శాస్త్రము, బోధ, జీవన్ముక్తుడు ఇత్యాదులు సంభవమవుతున్నాయి.

మేలుకొన్నప్పడు స్వప్నపురుషుడు బాదితమైనట్లుగానే ఆత్మజ్ఞానంతో కర్తృత్వము బాదితమవుతుంది. ఐనప్పటికి కర్తృత్వము వ్యవహారయోగ్యము. జగత్తు కర్త కేవిధంగానూ సమస్యకాజాలదు. ఈ బాధితకర్తృత్వము భర్జిత బీజములాంటిది. గింజల్ని వేయించిన

తరువాత అవి భుజించటానికి మాత్రమే పనికివస్తాయి గాని, మెలకెత్తటానికి పనికి రావు. జ్ఞానం కలిగిన తరువాత విషయి - విషయవిభాగం పుర్జన్మలకు - సంసారానికి కారణం కాజాలదు.

92వ శ్లోకము

యత్కృతం స్వప్నవేలాయాం పుణ్యం వా పాపముల్బణమ్ ।

సుప్తోత్థితస్య కిం తత్ స్యాత్ స్వర్గాయ నరకాయ వా ॥ 449 ॥

స్వప్నవేలాయాం - స్వప్నావస్తలో; పుణ్యం వా - పుణ్యమైనవి గానీ; ఉల్బణమ్ పాపం - ఘోరమైన పాపములు గానీ, యత్ కృతం - ఏదైతే చేయబడిందో; స్వప్నోత్థితస్య - స్వప్నంనుండి మేల్కొన్నవానికి; తత్ - ఆ కర్మ (లు); స్వర్గాయ నరకాయ - స్వర్గానికి గాని నరకానికి గానీ; కింస్యాత్ వ సాధనములు కాగలవా ?

"నిద్రనుండి మేలుకొన్నవానిని - స్వప్నంలో చేసిన పుణ్యకర్మలుగాని - పాపకర్మలుగాని - స్వర్గానికిగాని నరకానికిగానీ - తీసుకువెళ్ళగలవా?"

పూర్వశ్లోకంలో జీవన్ముక్తుని సంచిత కర్మలన్నీ నశిస్తాయని శాస్త్రం చెప్పింది. దాన్నే ఇక్కడ వివరిస్తున్నది. స్వప్నంలో సోమయాగంలాంటి పుణ్యకర్మలు చేసి ఉండవచ్చు. సోమయాగాన్ని అనేకమంది ఋత్విక్కులు కలసి నిర్వహిస్తారు. అందులో అనేకమందికి అన్నదానం చేస్తారు. లేదా బ్రహ్మహత్యలాంటి ఘోరమైన పాపకర్మ స్వప్నంలో చేసి ఉండ వచ్చు. బ్రాహ్మణుడు శాస్త్రవిధులను చక్కగా నిర్వర్తిస్తూ అతిసాధారణ జీవితం గడుపు తుంటాడు. అటువంటి బ్రాహ్మణునిచంపటం ఘోరమైన పాపం. మరిప్పుడు పుణ్యపా పము లతడినేమీ చేయబోవటంలేదు.

స్వప్నంలో కర్త లేడుగనుక స్వప్నంలో అనుష్టించిన పుణ్యకర్మలు స్వర్గప్రాప్తికి దోహద కారి కావటంలేదు. స్వప్నపురుషుడు కేవలం భోక్తమాత్రమే - అతడు కర్తకాదు. అక్కడ

ఏ కర్మచేసినా ఆ పుణ్యపాపాలకి అదృష్టఫలము లేదు. అంతేగాక, స్వప్నంలో ధనప్రాప్తి లాంటి దృష్టఫలాల్ని పొందవచ్చు. కానీ మేల్కొన్నతరువాత అవి అక్కరకు రావు. అందు చేతనే స్వప్నంలో చేసిన కర్మలు స్వర్గానికి తీసుకువెళ్ళవు లేదా నరకంలోకి త్రోసివేయవు.

93వ శ్లోకము

స్వమసఙ్గముదాసీనం పరిజ్ఞాయ నభో యథా ।

న శ్లిష్యతే యతిః కిఞ్చిత్ కదాచిత్ భావికర్మభిః ॥ 450 ॥

యథా నభః - ఆకాశము వలె; యతిః - సమ్యక్ ప్రయత్నశీలుడు; స్వం - తాను; అసఙ్గం - అసంగుడనని; ఉదాసీనం - ఉదాసీనుడనని; పరిజ్ఞాయ - తెలుసుకొని; భావికర్మభిః - భావి కర్మల చేత; కిఞ్చిత్ - కొంచెము కూడా; కదాచిత్ - ఎప్పుడు కూడా; న శ్లిష్యతే - సంశ్లిష్టుడు కాదు.

"యుక్తుడు సమ్యక్ ప్రయత్నశీలుడు అయిన యతి తనస్వరూపము అసంగము ఉదాసీనమని చక్కగా తెలుసుకొని ఆకాశంలాగా భావి కర్మలచే ఎప్పటికి ఏమాత్రమూ సంశ్లిష్టుడు కాడు."

జీవుని పేరు మీద ఫలీభూతం కావటానికి వేచి ఉన్నసంచిత కర్మలన్నీ జ్ఞానంచేత నశిస్తాయి. "నేనొక వ్యక్తిని" అన్న జీవత్వబావన జ్ఞానంవలన తొలగిపోయినా జీవుడు కొనసాగుతుంటాడు. అందుకనే అతనిని మనం జీవన్ముక్తుడనంటాము. "నేను బ్రహ్మ మ"న్న జ్ఞానంతో జీవుడు కొనసాగుతున్నట్లుగా కొనసాగుతాడు. ప్రమాతను నామరూప విశేషాలతో ఉన్న సచ్చిదానంద ఆత్మగా అర్థంచేసుకుంటారు. నీవొక చలనచిత్రాన్ని చూస్తున్నప్పుడు అది సత్యంగాదని తెలుసు, ఐనా దానిలో జరిగే సంఘటనలకి ప్రతిస్పం దిస్తుంటావు. నీవు ప్రతిస్పందిస్తున్నా నీ అంతరంగంలో - లోలోపల అది సత్యంకాదని - అదంతా బాధితమని నీకు తెలుసు. అటువంటి ఎరుక ఆత్మబ్రహ్మమని లెలుసుకున్న వ్యక్తి

కి అతిసహజం, స్వప్నపురుషునిచే - మిథ్యా వ్యక్తి చేత - చేయబడిన కర్మలు జాగ్రత్తులో దృష్టం కానీ అదృష్టవకానీ ఫలముల నివ్వనట్లే, ఆత్మయే బ్రహ్మమన్న జ్ఞానంతో జీవుని సర్వ సంచిత కర్మలు నశిస్తాయి. స్వప్నంలో లభించిన లాటరీధనం జాగ్రత్తులో లాభించదు.

జీవన్ముక్తుడు తన ప్రారబ్దకర్మక్షీణించేవరకు జీవనం సాగిస్తాడు. అంటే అతడు కర్మలు చేయాలి జ్ఞానం పొందినతరువాత జ్ఞానిచేసేకర్మలను ఆగామికర్మలంటారు. నడవటం, కూర్చోవటం మొ॥ పనులు చేసేటప్పడు సూక్ష్మజీవులను చంపటంలాంటి చిన్న చిన్న పాపాలను చేస్తూండవచ్చు. అంతేకాక అనేకపుణ్యకర్మలుకూడ చేస్తూండవచ్చు. అతడు అధ్యాత్మవిద్యను బోధించవచ్చు లేదా ఆధ్యాత్మిక జీవనం గడిపేట్లుగా ఇతరులను ఉత్తేజితు లను చేయవచ్చు. బ్రహ్మవిద్యను బోధించటం గొప్ప పుణ్య కర్మ. ఎందుకంటే బ్రహ్మవిద్యా దానాన్ని మించినదానం మరొకటిలేదు. కాబట్టి క్రొత్తకర్మలు పోగు అయి కూర్చుంటాయి. సంచితకర్మ నశించినప్పటికీ ఈ ఆగామికర్మలతడిని బంధించవా ? పుణ్యపాపాలు రెం డు కాలాంతరంలో మరో జన్మ నీయవా ? శాస్త్రమీ విషయాన్నిక్కడ పరిష్కరిస్తుంది.

తాను అసంగాత్మ - దేహేంద్రియమనోబుద్ధులసంఘాతముతో ఏ రకమైన సంబంధ ములేదని తెలుసుకోవటంచేత ముక్తపురుషునికే మాలిన్యము అంటుకోదు. అసంగము - సంగరహితము అంటే వాస్తవమైన సంబంధమేమీ లేదు. విక్రియాసవభావం గలిగిన మనసుకి - ఆత్మ - సత్తా స్ఫూర్తులనిస్తుంది కానీ - తానుగా ఏ విక్రియకు లోనుగాదు. ఆత్మ లేకుండా కర్త అంటూలేడు కానీ - ఆత్మ - కర్త గాదు. ఆత్మకు కర్తృత్వము లేదు. అందుచేతనే ఆత్మను సర్వాన్ని భాసింపజేసేది - 'ఉపద్రష్టా' అరంటాకె. వృత్తి ఏదైనప్పటికీ ఆత్మ అనుమతినిస్తుంది. అనుమంతా. ఆత్మ ఉదాసీనము కూడ - దేనికీ ఎదురుచె ప్పదు, ఎటువైపూ మొగ్గుచూపదు. ఇంతకాలమూ ఆత్మను సుఖి దుఃఖిగా భావిస్తున్నావు. ఆత్మ ఎదురు చెప్పలేదు. ఎందుచేత ? ఆత్మకు తన దృష్ట్యా ఉన్నది తానొక్కటే.

ఉదాసీనుడంటే ఎవరిపక్షము వహించనివాడు. వృత్తి మంచిది కావచ్చు లేక చెడ్డది కావచ్చు - ధార్మికమైనది కావచ్చు లేక అధార్మికం కావచ్చు. ఆత్మ దానితో కలియటంగా ని లేక దాన్నుండి విడిపోవటంగానీ చేయదు. ఆత్మ వృత్తి ని కేవలం భాసింపన జేస్తుంది. ఉదాసీనంగా ఉండటం ఆత్మస్వరూపం. ఆత్మ స్వరూపాన్నీవిధంగా తెలుసుకున్న యతి, భావికర్మలచేత ఏ సమయంలోనూ కించిత్తుకూడ సంశ్లిష్టుడుగాడు. అత డేకర్మలు చేస్తున్నప్పటికీ - అతడికి కర్తృత్వము లేదు. భోక్తృత్వంకూడ లేదు. కాబట్టి అతడు కర్మ కులోబడడు. అంటే కర్మ కర్మఫలంచే ప్రభావితుడుకాడు. ఆత్మ కర్తగా తాదాత్మ్యంచెంద దులేదా ఆత్మయందు కర్తృత్వబుద్ధిలేదు. అందుచేత ఆగామికర్మచేత మలినం కాదు. ఈ విషయంలో ఆకాశమువలె - అని దృష్టాంతాన్ని చెప్తున్నారు. ఈ దృష్టాంతాన్ని తరు వాత శ్లోకంలో వివరిస్తున్నారు.

94వ శ్లోకము

న నభో ఘటయోగేన సురాగంధేన లిప్యతే ।

తథాత్మోపాధియోగేన తద్ధర్మై వ లిప్యతే ॥ 451 ॥

నభః - ఆరాశము; ఘటయోగేన - ఘటము యొక్క సంయోగము చేత; సురాగంధే న - మద్యము యొక్క వాసనచేత; న లిప్యతే - ప్రభావితం కాదు; తథా - అదేవిధంగా; ఆత్మ - ఆత్మ; ఉపాధియోగేన - ఉపాధిసంబంధం చేత గాని; తద్ధర్మైః - వాటి ధర్మాల చేత గాని; నైవ తిప్యతే - ఎంతమాత్రం ప్రభావితం కాదు.

"ఆకాశము ఘటముయొక్క లేక సురాగంధముయొక్క సంయోగంచేత ప్రభావితం కాదు. అదేవిధంగా ఆత్మ ఉపాధులయొక్క లేక వాటి ధర్మములయొక్క సంయోగంచేత ప్రభావితం కాదు."

నభః అంటే ఆకాశం ఘటయోడేన అంటె ఘటముచే ఆవృతము కావటమేకాని ఘటముతో సంయోగమని అర్థంకాదు. ఘటానికి ఆకాశానికి సంయోగమేమీ లేదు.

కానీ ఆకాశము ఘటముచే ఆవృతమై ఉన్నది. ఆ ఆకాశానికి ఘటాకాశ మనేపేరు ఏర్ప డుతుంది. ఈ ఆకాశం ఘటంలో ఉంచిన సురాపానీయగంధంచేత గానీ, మరే ఇతర పదార్థంచేత గాని ప్రభావితం కాదు - మలినం కాదు. అదేవిధంగా - ఆత్మ - ఉపాధిసం పర్కంతో ప్రభావితంకాదు. దేహేంద్రియమనోబుద్ధ్యాదులసంఘాతము ఉపాధి. వాటిద్వా రా ఏర్పడిన తండ్రి, తల్లి మొదలైన విభిన్నపాత్రలుకూడ ఉపాధులే. ఈ ఉపాధిసంయోగ ము వలన ఆత్మ మలినం కాదు. ఉపాధిచేతనే కాక ఉపాధిధర్మములచేతకూడ ఆత్మ ఆత్మ ప్రభావితంకాదు. ఏవిధంగాను ఎన్నడూ ప్రభావితం కాదు. ఆత్మ అసంగము కనుక - దేహధర్మములు, దాని షడ్భావవికారములు, మనస్సు, మనోధర్మములు - ఇవేవి ఆత్మ ను ప్రభావితం చేయలేవు.

# జీవన్ముక్తుని ప్రారబ్ధము

## 95వ శ్లోకము

జ్ఞానోదయాత్ పురారబ్ధం కర్మ జ్ఞానాన్న నశ్యతి ।
అదాత్త్వా స్వఫలం లక్ష్యం ఉద్దిశ్యో త్సృష్టబాణవత్ ॥ 452 ॥

లక్ష్యం - లక్ష్యాన్ని; ఉద్దిశ్య - గురిపెట్టి; ఉత్సృష్ట బాణవత్ - వదలిన బాణం వలె; జ్ఞానోద యాత్ పురా - జ్ఞానముదయించక పూర్వం; ఆరబ్ధం కర్మ - ఫలించటం ఆరంభించిన కర్మ; స్వఫలం - తన ఫలాన్ని; అదత్త్వా - ఇవ్వకుండా; జ్ఞానాత్ - జ్ఞానంతో; న నశ్యతి - నశించదు.

"లక్ష్యాన్ని భేదించటానికై విడిచిన బాణమువలె, జ్ఞానోదయాత్పూర్వం ఫలీభూతమైన - ఆరబ్ధమైన కర్మఫలము తన ఫలాన్నివ్వకుండా జ్ఞానముచేత నశించదు."

ఇతఃపూర్వం రెండు శ్లోకములు జీవన్ముక్తుడి కేవిధంగా ఆగామి కర్మ ఉండదో వివరిం చినవి. జ్ఞానంకలిగిన తరువాత సంచితకర్మ ఏల నశిస్తుందన్నది కూడ పూర్వం శాస్త్రం తెలిపింది. మిగిలినది ప్రారబ్ధకర్మ. దాన్ని గురించి ఇప్పడీ శ్లోకం చెప్తున్నది. ఈ దేహం జన్మించటానికి కారణం ప్రారబ్ధకర్మ. అది శరీరం జీవించినంతకాలం తన ఫలాల నిస్తూ క్షయమవుతుంది. ఈశ్వరనియతి ననుసరించి ప్రారబ్ధకర్మ ఫలీభూతమవటం ఆరంభించింది. జ్ఞానప్రాప్త్యనంతరం కూడ అదలాగానే కొనసాగుతుంది.

ఉదాహరణకు పడవవానికథలో పదిమంది తీర్థయాత్రలో వెళ్ళారు. మధ్యలో నదిని దాటింతరువాత, వారినాయకుడు వారందరిలో పదవవాడు తప్పినాడని కనుగొన్నాడు. విచారగ్రస్తుడయ్యాడు. తనను తాను నిందించుకొనేవాడు కనుక చెట్టుకేసి తలను బాదుకున్నాడు. గాయమైంది. తలకు అతడికి జ్ఞానం కలిగింది. కానీ జ్ఞానం పొందిన

తరువాతకూడ తలకున్నకట్టు అదేవిధంగా ఉంటుంది. తల కట్టు కర్మఫలం గనుక తానే పదవవాడినని తెలిసికున్నతరువాతకూడ, అట్టాగే ఉంటుంది. అజ్ఞానదశలో ఈ దేహానికి ఆరంభకమైన కర్మ జ్ఞానం కలిగిన తరువాతకూడ కొనసాగుతుంది. అది సమాప్తమయే వరకు సాగాల్సిందే. "నేను బ్రహ్మమ"న్న జ్ఞానంతో ప్రారబ్ధకర్మ నశించదు. అనుభవించిన పుడే క్షయమవుతుంది.

ప్రారబ్ధకర్మ జీవసృష్టిలో భాగంకాదు. అది ఈశ్వరసృష్టి. ఈశ్వరనియతి ప్రారబ్ధకర్మను నీకిస్తుంది. నీవు దాని కోసమై అడిగావు. కర్మనియతిననుసరించి అది నీకు వస్తుంది. ఆ కర్మనియతి ఈశ్వరుడే. కనుక దేహము ఈశ్వరసృష్టి. అందుచే అది జ్ఞానప్రాప్తి వెంటనే పోదు. ఒకతను కల గంటున్నాడు. అతడు నిద్రలో నడుస్తుంటాడు. స్వప్నంలో ఉండగా నడవటం ఆరంభించాడు. క్రిందపడి కాలు విరగ్గొట్టుకున్నాడు. మేలుకున్నాడు. వెంటనే అతడి కల - జీవసృష్టిపోయింది. కానీ విరిగిన కాలుకి కట్టు వేయించు కోవాలి. కాలు ఈశ్వర సృష్టిలో అంతర్భాగం. అదేవిధంగా ప్రారబ్ధకర్మ ఫలాన్నివ్వకుండా నశించదు. అదెలాగ అంటే విడిచిన బాణం లక్ష్యాన్ని భేదించినతరువాతకూడ వేగ మున్నంత వరకు ముందుకుపోతుంది. దృష్టాంతంలోని విషయం ఏమిటంటే ఎక్కుపెట్టి విడిచిన బాణం తనవేగం పూర్తయి పోయేంతవరకు ముందుకు ఎలాసాగుతుందో - అదేవిధంగా ప్రారబ్ధకర్మ - పూర్తిఫలాన్నిచ్చేవరకు సాగుతుంది. ఈ దృష్టాంతాన్నింకా తరువాత శ్లోకంలో వివరిస్తున్నారు.

96వ శ్లోకము

వ్యాఘ్రబుద్ధ్యా వినిర్ముక్తః బాణః పశ్చాత్తు గోమతౌ ।

న తిష్ఠతి ఛ్ఛినత్త్యేవ లక్ష్యం వేగేన నిర్భరమ్ ॥ 453 ॥

వ్యాఘ్రబుద్ధ్యా - వ్యాఘ్రమనుకొని; వినిర్ముక్తః - విడిచిన; బాణః - బాణము; పశ్చాత్ - తర్వాత; గోమతౌ తు - అది గోవు అని కనుగొన్నాకూడా; న తిష్ఠతి - ఆగదు; లక్ష్యం - లక్ష్యాన్ని; వేగేన - వేగంతో; నిర్భరమ్ - తప్పకుండా; ఛినత్త్యేవ - ఛేదించనే ఛేదిస్తుంది.

"వ్యాఘ్ర మనుకొని విడిచిన బాణం, అదిగోవు అని కనుగొన్న తరువాత,

ఆ బాణం ఆగిపోదు. తన లక్ష్యాన్ని భేదిస్తుంది."

ఒక వ్యక్తి అరణ్యంలో ఉన్నాడు. తానొక పులిని చూచానని అతడనుకున్నాడు. బాణం ఎక్కుపెట్టి విడిచాడు. బాణం విడిచిన తరువాత కనుగొన్నాడు - అది పులి కాదు, గోవు అని. అది గోవనే గుర్తింపు - విడిచిన బాణాన్ని లక్ష్యంవైపు వెళ్లకుండా ఆపలేదు. అతడొక ఆస్తికుడు. గోహత్యాపాతకం చేసానే అని భయపడ్డాడు. కానీ బాణం గోవుపైపు పోకుండా ఆపలేడు. అదేవిధంగా నీ శరీరము ఈశ్వరుడనే వేటగాడు విడిచిన బాణం. నీ కర్మ అనే వింటినుండి బాణాన్ని విడిచాడు. అది తన వేగం పూర్తయేంతవరకు వెళ్ళాల్సిందే. "నేను బ్రహ్మము"న్న జ్ఞానం కలిగినప్పటికి - బాణం తనపని పూర్తిచేయాల్సిందే. ఒకసారి విడిచిన బాణం ఆగదు. తన వేగంతో అది లక్ష్యాన్ని భేదిస్తుంది. అదేవిధంగా "నేను బ్రహ్మమన్న" జ్ఞానం ప్రారబ్ధం తీరుతెన్నుల్ని మార్చబోదు. నియమానుసారంప్రారబ్ధం పనిచేస్తుంది.

97వ శ్లోకము

ఉపాధితాదాత్మ్య విహీనకేవల

బ్రహ్మాత్మనైవాత్మని తిష్ఠతో మునేః ।

ప్రారబ్ధ సద్భావ కథా న యుక్తా

స్వప్నార్థసంబంధకథేవ జాగ్రతః ॥ 455 ॥

జాగ్రత్త - మేల్కొన్నవాడికి; స్వప్నార్థ - సంబంధ - కథా ఇవ - స్వప్నపదార్థాలతో సంబంధం ఉన్నదని చెప్పటం వలెనే; ఉపాధితాదాత్మ్య - విహీన - కేవల - బ్రహ్మాత్మనా - ఉపాధితో తాదాత్మ్యం లేకుండా, కేవలం బ్రహ్మస్వరూపంగా; ఆత్మని తన ఆత్మలో;తిష్ఠతో మునేః - నిష్ఠపొందిన మునికి; ప్రారబ్ధ - సద్భావ - కథా - ప్రారబ్ధం ఉన్నదని చెప్పటం; న యుక్తా - యుక్తం కాదు.

> "ఉపాధితో తాదాత్మ్యం లేకుండా తనలో తాను అద్వితీయ
> బ్రహ్మనిష్ఠతో ఉన్న మునికి ప్రారబ్ధం ఉన్నదని చెప్పటం యుక్తంగాదు.
> అది జాగ్రత్ పురుషునికి స్వప్నవస్తువులతో సంబంధమున్నదని
> చెప్పటంలాంటిది."

ప్రారబ్ధకర్మను కొంత భిన్నంగాకూడ చూడవచ్చు. జ్ఞానం తరువాత కూడ దేహం కొనసాగుతుందనేది నిజమే. కానీ జ్ఞానికి 'తాను అసంగుడనని" తెలుసుగనుక ప్రారబ్ధ ముండే అవకాశంలేదు. ఆత్మదృష్ట్యా ప్రారబ్ధంలేదు. ఆవిషయాన్నే ఇక్కడ చెబుతున్నారు - తనఆత్మనిష్ఠలోనున్న వానికి ప్రారబ్ధంలేదు. ఆత్మస్వరూపాన్నికూడ ఇక్కడ చెప్పారు.

ఉపాధితో తాదాత్మ్యరహితమైన బ్రహ్మాత్వనిష్ఠలోనున్న వానిని దేహేంద్రియమనోబుద్ధ్యాది సంఘాతముతో కలపటం యుక్తంకాదు. అతడు తన స్వరూపజ్ఞానం పొందినపుడు మాత్రమే దేహేంద్రియాదిసంఘాతము ఉపాధి అని తెలుస్తుంది. అప్పుడతడికి ఉపాధితో తాదాత్మ్యముండదు. అంటే ఉపాధిని తానుగా భావించడు. సచ్చిదానంద ఆత్మస్వరూపానికి జాగృతమైన వానికి తానెప్పడూ జన్మించలేదని తెలుసు కాబట్టి ప్రారబ్ధ కర్మఏవిధంగా అతడికి శరీరాన్నారంభిస్తుంది. కనుక అతడికి ప్రారబ్ధకర్మలేదు.

కానీ, ఇది ఒక దృష్టి కోణము మాత్రమేనని అర్థంచేసుకోవాలి. ప్రారబ్ధకర్మ గురించి

మరోదృష్టికోణం కూడా ఉన్నది శ్రుతి చెప్తుంది. "శరీరం పతనమయేంతవరకే దానిలో జీవించి ఉంటాడు" అని (ఛాందోగ్యోపనిషత్తు 6-14-2). శాస్త్రం ప్రారబ్ధకర్మనంగీకరిస్తుంది. ఆత్మ ఏవిధంగా ఉంటుందో జ్ఞాని కూడ అంతే. ఆత్మకు జన్మలేదు. కాబట్టి అతనికి ప్రారబ్ధ కర్మలేదు. మరప్పడు శాస్త్రమే - జ్ఞానికి ప్రారబ్ధకర్మ ఉన్నట్లుగా ఎందుకు చర్చిస్తుంది? అది ఒక వ్యక్తి స్వప్నమునుండి మేలుకొన్న తరువాత స్వప్నంలో తానేమేమిచేశాడో కథలాగా వర్ణించటం లాంటిది. అతడి కథకి విలువేమీ లేదు. ప్రారబ్ధకర్మవిషయం కూడ సరిగ్గా అంతే. "నేను బ్రహ్మము" అన్న సత్యానికి మేలుకున్న వానికి ప్రారబ్ధకర్మపట్ల ఎటువంటి విలువ ఉండదు.

98వ శ్లోకము

అజోనిత్య ఇతి బ్రూతే శ్రుతి రేషా త్వమోఘవాక్ ।
తదాత్మనా తిష్ఠతోస్య కుతః ప్రారబ్ధకల్పనా ॥ 460 ॥

(ఆత్మ) అజ - జన్మించదు; నిత్యః - కాలపరిచ్ఛిన్నం కానిది; ఇతి - అని; శ్రుతిః బ్రూతే - శ్రుతి తెలుపుతున్నది; ఏషా తు - ఇది; అమోఘవాక్ - బాధితముకాని మాట; తదాత్మనా - దాని స్వరూపంగా; తిష్ఠతః అస్య - ప్రతిష్ఠితుడైన ఇతనికి; ప్రారబ్ధకల్పనా - ప్రారబ్ధాన్నంటగట్టటం; కుతః ఎలా ?

"ఆత్మ జన్మించదని - కాలబద్ధము కాదని - శ్రుతిప్రకటిస్తుంది. శ్రుతి పదములకు వ్యర్థమంటే ఏమిటో తెలియదు. నిరర్థకం కానేరవు. అజము, కాలాతీతము అయిన ఆత్మ గానున్న వానికి, ఈ ప్రారబ్ధాన్నంటగట్టడమెలాగా ?"

99వ శ్లోకము

శరీరస్యాపి ప్రారబ్ధకల్పనా భ్రాంతిరేవ హి ।

అధ్యస్తస్య కుతః సత్త్వమసత్త్వస్య కుతో జనిః ॥

అజాతస్య కుతో నాశః ప్రారబ్ధమసతఃకుత ॥ 461, 462 ॥

శరీరస్య అపి - శరీరానికి కూడా; ప్రారబ్ధకల్పనా - ప్రారబ్ధాన్నంటగట్టటం; భ్రాంతిః ఏవ - భ్రమే; హి - ఎందుకంటే; అధ్యస్తస్య - అధ్యస్తమైన దానికి; సత్త్వం - స్వతంత్ర సత్తా; కుతః - ఎక్కడిది ?; అసత్త్వస్య - స్వతంత్ర సత్తా లేనిదానికి;జనిః - జన్మ; కుతః - ఎక్కడిది?; అజాతస్యవ జన్మించని దానికి; నాశః - నాశం; కుతః - ఎక్కడిది? అసతః - అసత్యమైనదానికి; ప్రారబ్ధం - ప్రారబ్ధము; కుతః - ఎక్కడిది;

"శరీరానికి ప్రారబ్ధాన్నంటగట్టటంకూడ భ్రమే. ఎందుచేతనంటే అధ్యస్తమైనదానికి స్వతంత్ర సత్తా ఎక్కడిది? స్వతంత్ర సత్తాలేని దానికి జన్మ ఎక్కడుంటుంది.? జన్మించని దానికి నాశమెలాగ ఉంటుంది. ? అసత్యమైనదానికి ప్రారబ్ధమెక్కడిది."

100వ శ్లోకము

జ్ఞానేనాజ్ఞానకార్యస్య సమూలస్య లయో యది

తిష్ఠత్యయం కథం దేహః ఇతి శఙ్కావతో జడాన్ ।

సమాధాతుం బాహ్యదృష్ట్యా ప్రారబ్ధం వదతి శ్రుతిః ॥ 463 ॥

యది - ఒకవేళ, జ్ఞానేన - జ్ఞానంచేత; సమాలస్య - సమూలంగా; అజ్ఞానకార్యస్య - అజ్ఞానకార్యం; లయః - లయం పొందేటట్లైతే; అయం దేహః - ఈ దేహము; కథం - ఎలా; తిష్ఠతి - ఉంటున్నది; ఇతి - అని; శంకావతః - సందేహం కల; జడాన్ - మంద బుద్ధులను; సమాధాతుం - సమాధానపరచటానికి; బాహ్యదృష్ట్యా - వ్యావహారిక దృష్ట్యా; శ్రుతిః - శ్రుతి; ప్రారబ్ధం - ప్రారబ్ధం ఉంటుంది అని; వదతి - చెప్పతున్నది.

"ప్రశ్నించే మందబుద్ధులను తృప్తి పరచటానికై శ్రుతి ప్రారబ్ధం గురించి

వ్యవహారదృష్ట్యా చర్చిస్తుంది. వారీ విధంగా ప్రశ్నిస్తారు - జ్ఞానోదయమైనపుడు అజ్ఞానకార్యము కారణంతోసహ నివారితంకాగా ఈ దేహమెలాశేషించి ఉంటుంది."

ఆత్మే బ్రహ్మమన్న జ్ఞానం ఉదయించగానే జీవుని సంచితకర్మ నశిస్తుంది; కర్తృత్వం లేదు గనుక ఆగామికర్మ ఉండదు. మరింకను జ్ఞాని స్వరూపమే అయిన ఆత్మ దృష్ట్యా ప్రారబ్ధకర్మలేదు. జన్మించిన దానికే ప్రారబ్ధకర్మ ఉంటుంది. ఆత్మ ఎంతో - జ్ఞాని కూడ అంతే. ఆత్మకు జన్మలేదు - కనుక జ్ఞానికి కూడ జన్మలేదు. కాబట్టి జ్ఞానికి ప్రారబ్ధకర్మ ఉండే అవకాశంలేదు. శ్రుతివాక్యాలను ఏఇతర ప్రమాణముబాధించలేదు. ఆత్మకు జన్మ లేదని శ్రుతి చెప్తుంది. కానీ అవిద్యకు కూడ జన్మలేదు, దాన్ని నివారించటానికై ఆత్మ నిత్యమనికూడ శ్రుతి చెప్తుంది. అవిద్యలాగ అంతమయేది కాదు ఆత్మ. అవిద్య అనాది కాని సాంతము. పైగా అదెప్పుడూ ఆత్మపై పూర్తిగా ఆధారపడుతుంది. ఆత్మ నిత్యము, కాలబద్ధముకాదు. మరప్పుడు అజస్వరూపంగానూ, నిత్యాత్మస్వరూపంగానూ ఉండేవా నికి ప్రారబ్ధముంటుందని భావించటమెలాగ? ఈ పురుషునికి ఏ హేతువు ద్వారా ప్రారబ్ధ ముంటుందని చెప్పగలవు? కనుక జ్ఞానికి ప్రారబ్ధం లేదు.

ఆత్మకు ప్రారబ్ధంలేదని అంగీకరిస్తూ శరీరానికి ప్రారబ్ధముందని ఎవరైనా వాదిస్తే, దాన్ని కూడ శాస్త్రం నిరాకరిస్తుంది. "శరీరానికి ప్రారబ్ధముంటుందన్న వాదనకూడ భ్రమే"నని శాస్త్రం చెప్తుంది, రజ్జుసర్పంలాగా దేహము మిథ్య. ఏ రకమైన ప్రారబ్ధంతో శరీరానికి సం బంధమున్నదని చెప్తావు ? అధ్యస్తమైనదానికి ఏవిధంగా స్వతంత్రసత్తా ఉంటుంది ? దేహము ఆత్మపై ఆరోపితము. దానికి స్వతంత్రసత్తాలేదు. కనుక సత్యమైన ఉనికి లేదు. స్వతంత్రసత్తా ఉన్నవస్తువుంటే అప్పుడు దాని కారణానికై నేను వెదుకుతాను. అధ్యస్తవస్తు వుయొక్క సత్తా దాని అధిష్ఠాన సత్తాకంటె అన్యంకాదు. అధిష్ఠానమై న రజ్జుసత్తాయే

అధ్యస్తమైన రజ్జు - సర్పముయొక్క సత్తా. అధ్యస్తవస్తువుకి స్వతంత్రమైన ఉనికిలేదు. కనుక జన్మించటమెలాగ ఉంటుంది? అది జన్మించనే లేదు, ఉత్పత్తి లేనేలేనిదానికి నాశ మెలాగ ఉంటుంది? జన్మించని శరీరానికి నాశము కూడలేదు. అంతేగాక శరీరమే అధ్యస్తము; కనుక దానికి వాస్తవమైన నాశములేదు. కాబట్టి శరీరానికి ప్రారబ్ధముం టుందనే భావన భ్రమ మాత్రమే.

ఇది యిలాగా ఉంటే మరి జీవన్ముక్తుడికి ప్రారబ్ధముంటుందని శ్రుతి ఎందుకు చెప్తుంది ? ప్రతివారుచూచే ఈ శరీరదృష్ట్యా శ్రుతి ప్రారబ్ధం గురించి చర్చిస్తుంది. బాహ్యంలోనిజనులు ఈ శరీరాన్ని చూస్తారు. వారికీ సందేహం కలుగుతుంది. జ్ఞానోద యమైనపుడు అజ్ఞానకార్యములైన అహంకారము, జీవత్వము, సంసారము మొదలైన వన్నీ లయం చెందినపుడు, అజ్ఞానకార్యమైన, ఈ శరీరమెలాగ కొనసాగుతుంటుంది? అని. కారణమైన అజ్ఞానము నివృత్తమైనపుడు కార్యమైనశరీరం కొనసాగుతూ ఉండగ లదా? మృత్తికను తొలగిస్తే ఘటమెక్కడ? కారణం అభావమైనపుడు కార్యంకూడ అభావ మవుతుంది ఇది నియమం. అందుచేతనే ఈ ప్రశ్న తలెత్తుతుంది - కారణమైన అజ్ఞానం నశించినప్పడు కార్యమైన దేహమెలాగా ఉంటుంది? ఈ సందేహాన్ని నివారించటానికి మాత్రమే శ్రుతి చెప్తుంది - జ్ఞానికి ప్రారబ్ధముందని.

జీవత్వము అజ్ఞానకార్యము. జ్ఞానోదయమైనపుడది నశిస్తుంది. జీవత్వంతో పాటుగానే త్రివిధకర్మలు - సంచితము, ఆగామి, ప్రారబ్ధములు మూడూనశిస్తాయి. భగవద్గీత చెప్తుంది “జ్ఞానాగ్ని సర్వకర్మలను భస్మంచేస్తుంది” అని - కానీ ఇది సత్యవస్తు దృష్ట్యా మాత్రమే. అన్ని విషయాలు స్పష్టముగా అవగతమైనపుడది సరిపోతుంది. అంత వరకుశ్రుతికూడ అంగీకరిస్తుంది - ప్రారబ్ధముందని.

# ఉపదేశసారాంశము

101వ శ్లోకము

వేదాంతసిద్ధాంతనిరుక్తిరేషా

బ్రహ్మైవ జీవః సకలం జగచ్చ ।

అఖండరూపస్థితిరేవ మోక్షః

బ్రహ్మాఽద్వితీయే శ్రుతయః ప్రమాణమ్ ॥ 479 ॥

జీవః - జీవుడు; చ - మరియు; సకలం జగత్ - సమస్త జగత్తు; బ్రహ్మ ఏవ - బ్రహ్మమే; అఖండ - రూప - స్థితిః ఏవ - అఖండమైన బ్రహ్మజ్ఞానంలో స్థిరంగా ఉండటమే; మోక్షః - మోక్షము; బ్రహ్మాద్వితీయే - అద్వితీయ బ్రహ్మజ్ఞానమునకు; శ్రుతియః - శ్రుతులు; ప్రమాణం - ప్రమాణములు, (అను) ఏషా - ఇది; వేదాంతసిద్ధాన్తనిరుక్తిః - వేదాన్తము యొక్క సారభూత సిద్ధాంతము.

"సమస్త జగత్తు జీవుడు కూడ బ్రహ్మమే. అఖండమైన బ్రహ్మజ్ఞానములో స్థిరంగా ఉండటమే మోక్షమంటె. ఇదే వేదాంతముయొక్క సారభూతసిద్ధాంతము. అద్వితీయ బ్రహ్మజ్ఞానమునకు శ్రుతులే ప్రమాణము."

ఉపసంహారము చేస్తూ శాస్త్రము చెప్తున్నది - "ఇదే సకల వేదాంత సిద్ధాంత సారాం శము" అని. సమస్త శాస్త్రములో చెప్పవలసిన దేమున్నా అంతా కలిపి సారాంశాన్నొక్క వాక్యంలో ఇక్కడ చెప్తున్నది - "జీవుడు జగత్తు కూడ బ్రహ్మమే కానీ అన్యము కాదు." జగ త్తులో నా దేహేంద్రియాది సంఘాతము కూడ అంతర్గతమవుతుంది. కానీ ఈ దేహేంద్రి యాది సంఘాతంపట్ల 'నేను' అన్న అభిమానమున్నది. కాబట్టి నన్ను నేను జగత్తుకంటె భిన్నంగా ఒకవ్యక్తిగా భావిస్తాను. ఆ కారణంచేతనే శాస్త్రానికి "జీవుడు జగత్తుకూడ బ్రహ్మ మేకాని అన్యముకాద"ని చెప్పవలసి వస్తున్నది.

బ్రహ్మము, అనంతం కనుక, మోక్షమక్కరలేదు. జీవుడుకూడ బ్రహ్మమె కనుక అనంతము కాబట్టి జీవునికి బంధనము లేదు. నన్ను పరిచ్ఛిన్నం చేసేది - బంధించేదీ ఏదీ లేదు. సమస్త జగత్తు నేనే అయినప్పడు బంధనమన్న ప్రశ్న ఎక్కడ ? బంధము లేనప్పడు దేన్నుండి మోక్షము ? అందుచేతనే "జీవుని జీవుని మధ్య, జీవజగత్తులమధ్య, జీవేశ్వరులమధ్య భేదములేదని తెలుసుకోవటమే మోక్షమ"ని శాస్త్రం చెప్తున్నది. జీవుని స్వరూపం బ్రహ్మము. బ్రహ్మముకంటె అన్యంగా ఏదీలేదు. జ్ఞాతృ జ్ఞేయ, జ్ఞాన విభాగము లేదు. జీవుని కీజ్ఞానం కలగటాన్నే మోక్షమంటారు. అంటే ఆత్మ గురించిన అజ్ఞానమింక లేదని అర్థం.

బ్రహ్మము అద్వితీయ మన్న విషయంలో శ్రుతిమాత్రమే ఏకైక సమ్యక్ ప్రమాణం. బ్రహ్మము అద్వితీయము కనుక - ఉన్నదంతా బ్రహ్మమే. జీవుడు బ్రహ్మము, జగత్తు బ్రహ్మము, ఈశ్వరుడు బ్రహ్మము. ఇదీ శ్రుతిదృష్టి. శ్రుతులనేకములున్నవి. కానీ కలిగే జ్ఞానం మాత్రం ఒకేవిధంగా ఉంటుంది. శ్రుతులన్నీ కలిపి ఒకే ప్రమాణం. దీన్నే 'ఏకవాక్యత' అంటారు. "ఉపనిషత్తులలో వివరించిన పురుషస్వరూపాన్ని నాకు బోధించుము" అన్న ఉపనిషత్తువాక్యముద్వారా శ్రుతి తనకు తానుగా ఈ జ్ఞానానికి ప్రమాణమని చెప్పకుంటున్నది. అటువంటివాక్యములద్వారా పూర్ణపురుషఆత్మను తెలపటానికి శాస్త్రమే ఏకైక ప్రమాణమని శ్రుతి సూచిస్తున్నది.

# శిష్యుడు తన ధన్యతను వ్యక్తంచేయటం

102 వ శ్లోకము

ధన్యోహం కృతకృత్యోహం విముక్తోహం భవగ్రహాత్ ।

నిత్యానందస్వరూపోహం పూర్ణోహం త్వదనుగ్రహాత్ ॥ 489 ॥

త్వదనుగ్రహాత్ - మీ అనుగ్రహం వల్ల; ధన్యోహం - నేను ధన్యుడను; కృతకృత్యోహం - నేను కృత కృత్యుడను; భవగ్రహాత్ - సంసార తిమింగలము నుండి; అహం - నేను; మిముక్తః - విముక్తడనయాను; అహం - నేను; నిత్యానందస్వరూపః - నిత్యుడను, ఆనందస్వరూపుడను; అహం - నేను; పూర్ణః - పూర్ణుడను;

"మీ అనుగ్రహంతో నేను ధన్యుణ్ణయాను. కృతకృత్యుడనయాను. సంసారమునుండి ముక్తుడనయాను. ఆనందస్వరూపుడను. నిత్యుడను పూర్ణుడను."

బోధనంతాసమగ్రంగా అర్థంచేసుకున్న శిష్యుడు తన ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాడు - "నేను నిజంగా ధన్యుడను కృతకృత్యుడను". కృత్యమంటే చేయవలసినది, పొందవల సినది. అతడు ధున్యుడు అడగనవసరం లేకుండానే సమస్తపుణ్యము అతడికి లభిం చింది. ఇంకా శిష్యుడు చెప్తున్నాడు - "సంసార తిమింగలము యొక్క కోరలనుండి ముక్తుడినయాను" అని.

ముక్తి అంటే అర్థమేమిటి ? అతడు చెప్తున్నాడు, "ఎటువంటి కొరతలేని పరమానం దస్వరూపుణ్ణి నేనని ఇప్పడు నాకు తెలిసింది" అని. ఈ స్వరూపానందము అనుభవ గమ్య ఆనందంకంటె భిన్నము. అందుచేతనే అది నిత్యము. అనుభవగమ్య ఆనందం దేనికైనా - రాకపోకలుంటవి. అందుకనె అది సంసారాంతర్గతమైనది. చివరగా

శిష్యుడు చెప్తున్నాడు - "ఇప్పుడు నాలో లేమిఅనేదేదీలేదు. పూర్ణుడను, హే గురో ! ఇదంతా మీ అనుగ్రహంవలననే లభించింది."

103వ శ్లోకము

స్వారాజ్యసామ్రాజ్య విభూతిరేషా
భవత్కృపాశ్రీమహితప్రసాదాత్ ।
ప్రాప్తా మయా శ్రీగురవే మహాత్మనే
నమో నమస్తేస్తు పునర్నమోస్తు ॥ 518 ॥

భవత్కృపా - మీ అనుగ్రహం వల్ల; శ్రీ మహిత ప్రసాదాత్ - ఈశ్వర ప్రసాదం వల్ల; ఏషా - ఈ; స్వారాజ్య - సామ్రాజ్య విభూతిః - స్వాతంత్ర్య సామ్రాజ్య సంపద; మయా - నా చేత; ప్రాప్తా - పొందబడింది; మహాత్మనే - మహాత్ముడైన; శ్రీ గురవే - గురుదేవులకు, నమః - నమస్కారం; నమః - నమస్కారము; తే - నీకు; నమః - నమస్కారము; అస్తు - అగుగాక;

"స్వరాజ్యానికి చక్రవర్తి కాగలగటం మీ అనుగ్రహంవలన ఈశ్వరానుగ్రహంవలన లభించింది. బ్రహ్మములాగా - గొప్పవాడైన మహాత్ముడైన- గురువుకు ప్రణామములు. తమకు నా నమస్కారములు. పునః పునః మీకు నా ప్రణామములు."

శిష్యుడింకా చెప్తున్నాడు. - "నేను గొప్ప విభూతిని - మహిమను పొందాను' ఈశ్వరుని విశాలసామ్రాజ్యంలో నేనొక కుటీరంలో ఉంటున్నాను - స్థూలశరీరమనే కుటీరంలో నివసిస్తున్నాను. అది నన్నెప్పడు బాధపెడుతూనే ఉన్నది. కానీ ఇప్పుడు నాకు సామ్రాజ్యం లభించింది. ఇంక కుటీరనివాసిని కాను. నాస్వరాజ్యానికి చక్రవర్తినయాను. నేనిప్పడు స్వతంత్రుడను. ఏ స్థలమైనా ఇప్పడు నాస్థలమే. నాస్థలముకాని స్థలమే లేదు.

ఏ వస్తువైనా నావస్తువే, నా నుండి భిన్నంగా దూరంగా ఏదీ లేదు. కేవలయొక కుటీర నివాసినుండి సమస్తవిశ్వానికి సామ్రాట్టు నయ్యాను. సకలదేవతలు నా పాదాలవద్ద ఉంటారు. అంటే వారిని నేనే శక్తిమంతుల్ని చేస్తాను. ఈశ్వరానుగ్రహం వలననే ఇదంతా సంభవించింది.

ఎవరైనా ప్రశ్నించవచ్చు "సరే, కానీ ఈశ్వరానుగ్రహాన్నెలా సంపాదించావు ? జనులెప్పడూ ఈశ్వరుణ్ణి చిన్న చిన్నవాటినే ప్రార్థిస్తుంటారు, అయినా కోరినవి వారికి అదుదుగా లభిస్తుంటాయి. ఇంతటి అనుగ్రహాన్ని నీవెలా సంపాదించావు" - అని.

శిష్యుడు చెప్తున్నాడు, - "ఇదంతా గురుబోధవలన, గురువుకరుణ వలన లభించింది. కాబట్టి అటువంటి సద్గురువుకు, మహాత్మునికి - ఎవరి మనస్సైతే బ్రహ్మముతో సమమైనదో - వారికి నా ప్రణామములు". మూడు పర్యాయములు నమస్కారం చెప్పటం ఎల్లప్పడూ ప్రణమిల్లి ఉంటానని తెలపటానికి.

# గురువు యొక్క చరమ సందేశం

104 వ శ్లోకము

స్వమేవ సర్వతః పశ్యన్ మన్యమానః స్వమద్వయమ్ ।

స్వానందమనుభుంజానః కాలం నయ మహామతే ॥ 525 ॥

మహామతే ! - మహాత్మా !; స్వం ఏవ - తన ఆత్మనే; సర్వతః - అంతట; పశ్యన్ - చూస్తూ; స్వం - తనను; అద్వయం - అద్వయాత్మగా; మన్యమానః - గుర్తిస్తూ, స్వానందం - స్వాత్మానందాన్ని; అనుభుంజానః - అనుభవిస్తూ; కాలం నయ - కాలం గడుపు;

> "మహాత్మా ! సర్వకాలసర్వావస్థలయందు ఆత్మనే దర్శిస్తూ, అద్వితీయ ఆత్మగా నిన్ను నీవు గుర్తిస్తూ, స్వాత్మానందాన్ననుభవిస్తూ నీ కాలాన్ని గడుపు."

ఇప్పుడు గురువు చెప్తున్నాడు - "సర్వకాలములలో సర్వత్రా ఆత్మను గుర్తిస్తూ - ఆత్మానందాన్ననుభవిస్తూ - కాలమును గడుపుదువు గాక !", జ్ఞానముచేత జ్ఞాతృజ్ఞేయ జ్ఞానములన్నీ (త్రిపుటి) బాధితమైనవి. ఆ మూడు ఆత్మవస్తువే - అన్యముకాదు. జ్ఞాత సచ్చిదాత్మ. జ్ఞానము సచ్చిదాత్మకంటె వేరుగాలేదు. జ్ఞేయము కూడ సచ్చిదాత్మకంటె వేరుగా లేదు. కాబట్టి ద్వైతదర్శనమున్నప్పటికి - జ్ఞాతృజ్ఞేయ జ్ఞానవిభాగము బాధితమైనది. ఈ మూడింటినీ నా కంటె - అద్వితీయ ఆత్మకంటె భిన్నము కాదని, ఆత్మస్వరూపమేనని గుర్తించినపుడే ఇది సంభవమవుతుంది.

కొంతమంది అద్వైతము ఒక రకమైన అనుభవమని భావిస్తూ ఉంటారు. ఆ భావన తప్పు. అదొక విశిష్ట అనుభవమయేట్లయితే, ఇతర అనుభవాలన్నీ అద్వైతపరిధికి బాహ్యంగా ఉంటాయి. అది వేదాంతదృష్టికి అనుగుణమైనది కాదు. సర్వానుభవాలు అద్వి

తీయ ఆత్మస్వరూపమే. అద్వైతము పూర్తిగా జ్ఞాన కూపంలోనే ఉంటుంది. ఒకఘటము ఇతరఘటములను చూచినప్పడు, తన స్వనామరూపములతో సహా ఏ ఘటనామ రూపములైనా మృత్తికకంటె భిన్నంగా వేరుగాలేవని గుర్తిస్తుంది. ఆ గుర్తింపే అద్వితీ యము.

ఈ జ్ఞానమున్న వ్యక్తిని "స్వానందమ్ అనుభుంజానః - స్వ ఆనందాన్ననుభవిస్తున్నాడని" అంటారు. అతడికిప్పడు ఏ పరిచ్ఛిన్నభావములేదు. అనంతమూన ఆత్మలో అతడి మన స్సు లగ్నమైంది కనుక - అతడిని మహామతి అనంటారు. గురువు - "ఆ విధంగా సమ యాన్ని ధ్యానంలో గడపమ"ని చెప్తున్నాడు. గురుకులవాససమయంలో శ్రవణ మనన ములు జరిగాయి కనుక - ఇప్పడిది ఒక రకమైన సలహా అవుతుంది. ఇప్పడు నిదిధ్యా సలనను చక్కగా చేయాలి. అందుచేతనే- "ఈ విధంగా ధ్యానంలో కాలాన్ని గడపమ" ని ఉపదేశిస్తున్నారు.

ఎంతకాలం ధ్యానంచేయాలి" - అని ఎవరికైనా ప్రశ్న రావచ్చు. ఆత్మ ఆనందస్వరూ పము. కనుక నిదిధ్యాసనమంటే ఆనందాన్ననుభవించటమే. ఎంతకాలం ధ్యానం చేయాలన్న ప్రశ్న ఎంతకాలమీ ఆనందాన్ననుభావించాలన్నట్లుగా ఉంటుంది. ఎవరిలో నైనా ఈ ప్రశ్న అలాగే ఉంటే దానర్థం శ్రవణ మననములు చాలలేదని. అతడింకా శ్రవణ మననాలు సాగించాలి.

ఈ విధంగా కాలాన్ని గడపటం బ్రహ్మాభ్యాసమవుతుంది. జ్ఞానిష్ఠ కలిగేవకు బ్రహ్మా భ్యాసం కొనసాగించాలి. నిష్ఠ అంటే జ్ఞానంలో సంశయంగానీ, అస్పష్టత గానీ ఉండ గూడదు.

# ఉపసంహారము

105వ శ్లోకము

ఇతి శ్రుత్వా గురోర్వాక్యం ప్రశ్రయేణ కృతానతిః ।

సతేన సమనుజ్ఞాతః యయౌ నిర్ముక్తబంధనః ॥ 577 ॥

ఇతి ఇలా; గురోః వాక్యం గురువు యొక్క మాటలను; శ్రుత్వా విని; సః అతడు; ప్రశ్రయేణ వినయంతో; కృతానతిః ప్రణమిల్లి; తేన గురువుచేత; సమనుజ్ఞాతః అనుమతి ఇవ్వబడి; నిర్ముక్త బంధనః బంధముక్తుడుగా; యయౌ వెళ్ళిపోయాడు.

"గురువుయొక్క ఉపదేశవాక్యాలు విని వినమ్రతతో ప్రణమిల్లి,

గురువనుజ్ఞను పొంది శిష్యుడు వెళ్లిపోతాడు."

గురూపదేశవాక్యాలు విని, శిష్యుడు భక్తి, ప్రపత్తులతో గురువుకు నమస్కరిస్తాడు. అప్పడు గురువు శిష్యునికి అనుజ్ఞనిస్తాడు. - నీవిక వెళ్ళవచ్చు, నీ విప్పడు స్వతంత్రుడివి." - అని. శిష్యుడు వెళ్ళిపోయి ప్రారబ్ధాన్ననుసరించి జీవితాన్నిడగిపాడు. ప్రతివారు తమ తమ ప్రారబ్ధాన్ననుసరించి జీవిస్తారు.

106వ శ్లోకము

గురురేవం సదానందసింధౌ నిర్మగ్నమానసః ।

పావయన్ వసుధాం సర్వాం విచచార నిరంతరమ్ ॥ 578 ॥

ఏవం - ఈ విధంగా; గురుః - గురువు; సద్ - ఆనంద - సింధౌ - సద్రూప ఆనంద సారంగంలో; నిర్మగ్న మానసః - నిమగ్నమనస్కుడై; సర్వాం వసుధాం - సమస్త భూమండలాన్ని; పావయన్ - పావనం చేస్తూ; నిరంతరం - ఎల్లప్పడు; విచచార - సంచరించాడు.

"ఆ విధంగా గురువు సదాత్మ ఆనందంలో నిమగ్నమైన

మనస్సుకలవాడై, సమస్తభూమండలాన్ని పావనం చేస్తూ సర్వత్ర

సంచరించాడు."

ఇప్పుడిక శిష్యుడు వెళ్ళిపోయాడు కనుక - గురు వేంచేస్తాడు ? దుఃఖిస్తాడా లేక శిష్యుడికి వెళ్ళిపోయినందుకు పీడవదిలిందని సంతోషిస్తాడా ? రెండింటిలో ఏదీ చేయడు. సంతోషంగా నిట్టూరిస్తే అతడికి లభించిన శిష్యుడెటువంటివాడు? ఒకవేళ దుఃఖిస్తే ఎటువంటి గురువతడు ?

గురువు మనస్సు పూర్తిగా సదాత్మ ఆనందంలో మునిగిపోయింది. సమస్త ఆనందానికి మూలం ఒకటే ఒకటి-అది తన ఆత్మే.ఆ ఆనందంలో అతడు పూర్తిగా మునిగి పోయాడు.

మరతడు ఏంచేస్తాడు ? నిరంతరము సమస్త భూమండలం సంచరిస్తూ వసుధను పావనం చేస్తుంటాడు. నిరంతరమంటే ఎల్లప్పుడూ శెలవుదినం లేకుండా ఎక్కడికి వెళ్ళినా శిష్యులకి కొదవలేదు. అతడు గుహలోకి వెళ్ళినా ఎవరో ఒకరతణ్ణి చేరుకొని జ్ఞానాన్నర్థిస్తారు.

107వ శ్లోకము

ఇత్యాచార్యస్య శిష్యస్య సంవాదేనాత్మలక్షణమ్ ।

నిరూపితం ముముక్షూణాం సుఖబోధోపపత్త యే ॥ 579 ॥

ముముక్షూణాం - ముముక్షువులకు; సుఖబోధో పపత్తయే - సులువుగా ఆవగతమవటం కోసం; ఇతి - ఈ విధంగా; ఆచార్యస్య శిష్యస్య - శిష్యాచార్యులయొక్క; సంవాదేన - సంవాదరూపంగా; ఆత్మలక్షణమ్ - ఆత్మ స్వరూపం; నిరూపితం వివరించబడింది

"ముముక్షువులకు సులభంగా అవగతమవటం కోసమై

ఆత్మ స్వరూపాన్ని గురుశిష్యసంవాదరూపంలో వివరించబడింది."

ఇక గురుశిష్యులసంవాదం పరిసమాప్తమైనది గనుక శాస్త్రము ఉపసంహారం చేస్తు న్నది. మోక్షమే నిజమైన పురుషార్థమని నిశ్చయించిన ముముక్షువులకు - సుఖంగా అర్థంకావటం కోసం - గురుశిష్యుల - సంవాదరూపంలో - ఈ జ్ఞానాన్ని వివరించింది శాస్త్రం. సులభంగా అవగతమవటంకోసమని శాస్త్రం - యుక్తిని గూడ సహాయంగా ఉపయోగించుకొంటుంది.

ఈ గ్రంథం ప్రకరణగ్రంథం కనుక - శ్రుతి బోధించిన దానినే చెప్తుంది. సంప్రదా యం అనుసరించిన తర్కాన్నే ఈ గ్రంథం కూడ అనుసరిస్తుంది. గ్రంథం ప్రయోగిం చిన ఏ యుక్తి అయినా - అది శాస్త్రాన్నర్థంచేసుకొవటానికుపకరిస్తుంది. తర్కం శ్రుత్య నుసారి కాకపోయినా - శ్రుతి సమ్మతంకాకపోయినా- నీవు విచారానికి పూర్వమున్న దానికంటె - అధిక విభ్రాంతస్థితిలోకి వెళ్ళిపోతావు. లేదా ఆ విభ్రాంతస్థితిలో దృఢంగా ఉండిపోతావు. శాస్త్రాధ్యయనానికి పూర్వం జీవుడు జీవుడేనని, ఈశ్వరుడు ఈశ్వరుడే నని - జగత్తు జగత్తేనని - ఈ మూడు - ఒకదానికంటె మరొకటి భిన్నమని నీకు తెలుసు. గురుకులంలో ఈ నిశ్చయాన్ని బలపరచి దృఢపరిచేటట్లయితే - శాస్త్రం దగ్గ రకు, గురువుదగ్గరకు నీవు రానవసరం లేదు.

సంప్రదాయంలో అద్వితీయ ఆత్మస్వరూపాన్ని గురుశిష్య సంవాదరూపంలో వివరిం చారు. సంభాషణలు - చర్చలు రకరకాలుగా ఉంటాయి. సమస్థాయిలో ఉన్నవారి మధ్యచర్చను వాదమంటారు. దాని ప్రయోజనం ఒక విషయాన్ని అర్థంచేసుకోవటం, మరొక రకం - విభిన్నదృక్పథాలున్న వ్యక్తులమధ్య చర్చ. ఈ రకంచర్చలో ఎదటివారిని తన మార్గంలోకి తీసుకురావాలని ప్రధానాశయంగా ఉంటుంది. దీన్ని జల్పమంటారు. తరువాత వితండము. దీనిలో ఎదుటివారు చెప్పేది తప్పు అని నిరూపించటమే ఆశ యం. కానీ - ఇక్కడ జరిగినది సంవాదము - దీనిలో నీకేం కావాలో దాన్నే తెలుసు

కుంటావు. నీవొక గురువు చెంతకు వెళతావు. సంవాదరూపంలో నీక్కావల్సింది అడిగి స్పష్టంగా తెలుసుకుంటావు. ఈ రకమైన సంభాషణనే ఇక్కడ ఆత్మస్వరూపాన్ని వివరించటానికి ఉపయోగించారు.

ఇక్కడొక సందేహముండవచ్చు. శాస్త్రము ఉపనిషత్తులు భాష్యములు, వ్యాఖ్యానములతో సహా ముందే సిద్ధంగానే ఉన్నవి. అటువంటప్పుడు ఈ వివేకచూడామణి గ్రంథము యొక్క ఆవశ్యకత ఏమున్నది ? అందుచేతనే గ్రంథకర్త చెప్తున్నారు - "సుఖ బోధ ఉపపత్తయే - శాస్త్రం సులభంగా అర్థంకావటం కొరకు" - అని.

108వ శ్లోకము

సంసారాధ్వని తాపభానుకిరణ ప్రోద్భూతదాహవ్యథా -
ఖిన్నానాం జలకాంక్షయా మరుభువి భ్రాంత్యా పరిభ్రామ్యతామ్ ॥
అత్యాసన్న సుధాంబుధిం సుఖకరం బ్రహ్మాద్వయం దర్శయ
న్త్యే షా శంకరబారతీ విజయతే నిర్వాణసంధాయినీ ॥ 581 ॥

సంసారాధ్వని - సంసారమార్గంలో; తాప - బాను - కిరణ - ప్రోద్భూత - దాహ - వ్యథా - ఖిన్నానాం - ప్రపండ సూర్యకిరణజన్య వేడిచే పీడితులై బాధపడుతూ; జల - కాంక్షయా - దాహంతో నీటికై; మరు - భువి - ఎడారి భూమిలో; భ్రాంత్యా - ఎండ మావినే నీరని పొరపడి; పరిభ్రామ్యతాం - తిరిగే వారికి; సుఖకరం - ఆనందాన్నిచ్చే; అత్యాసన్న - సుధాంబుధిం - అతి సమీప అమృత సాగరరూపమైన; బ్రహ్మాద్వయం - అద్వితీయ బ్రహ్మను; దర్శయంతీ - తెలుపుతూ; నిర్వాణ - సంధాయినీ - మోక్షాన్ని ప్రసాదించే; ఏషా - ఈ శంకరబారతీ - శ్రీ శంకరుల పలుకు; విజయతే - జయము పొందుగాక;

"ఎడారి భూములలో దప్పికతో నీటికై వెదుకుతూ తిరిగేవానికి, -

ఈ సంసారమార్గంలో చండసూర్య కిరణముల వేడిచే దహింపబడేవానికి - అత్యంత సమీపంలోనే ఉంటూ పరమానందాన్నందించే అమృతసాగరాన్ని - అద్వితీయబ్రహ్మమును తెలుపుతూ - మోక్షాన్ని ప్రసాదించే - శ్రీ శంకరులపలుకులు జయము పొందుగాక."

ఈ చరమ శ్లోకంలో శాస్త్రాన్ని వివేకచూడామణిని స్తుతిస్తున్నారు.

సంసారదుఃఖాన్ననుభవిస్తున్నవారి విషయంలో శంకరుల పలుకులు జయించును గాక - శంకరభారతీ విజయతే. పీడింపబడే వారెవరు ? యాత్రికులు. వారు సంసారమార్గంలో సాగుతుంటారు. ఆధిభౌతిక - ఆధిదైవిక - ఆధ్యాత్మికతాపములచే పీడింపబడుతుంటారు. భావోద్రేకమువలన కలిగిన బాధకూడ ఒక తాపమే. ఈ తాపములు చండసూర్యుని కిరణముల్లాంటివి. ఈ కిరణములచేతనే బాధలు కలుగుచున్నవి. అ సంసారమార్గంలో నడవటంవలన అమితంగా దాహం కలుగుతున్నది; దానివలన నోరెండిపోతుంది, మలమలమాడిపోతున్నారు. జలంకోసం అన్వేషిస్తున్నారు. జలం లభిస్తుందన్న ఆశతో ఎడారులలో తిరుగుతున్నారు. తీరా అక్కడికి చేరుకుంటే నీరు లేక భంగపడుతున్నారు. దప్పికతో, భ్రమలో వారు ఒక చోటినుండి మరోచోటికి, ఒక జన్మనుండి మరోజన్మకి వెలుతూనే ఉన్నారు. స్వర్గానికి వెళతారు, తిరిగి వస్తారు. అటువంటివారికి శంకరభారతులు మార్గంచూపుతున్నారు.

భారతి అంటే వాక్కులు. భారతి అంటే శృంగేరి మఠానికి అధిష్ఠాన దేవత అయిన శారదామాత అని కూడ అర్థం. శంకరభారతి వారికేం చూపుతారు ? సుధాసాగరాన్ని చూపుతున్నారు. నీవా అమృతాన్నిగ్రహిస్తే ఆకలి దప్పులు తీరటమేకాక, సకలబాధలు తొలగిపోతాయి. బ్రహ్మవిద్యయే - ఆ సుధ - అమృతము. పైగా ఈ సుధాసాగరం ఎక్కడో

దూరంలో లేదు. అత్యంతసమీపంలోనే ఉన్నదని శంకరభారతులు చూపుతున్నారు.

అత్యంత సమీపమంటే అది తన ఆత్మయే. ఆత్మే సుధాసాగరము.

హరిః ఓమ్

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/